# వానకారు కోయిల

నవల

- మన్నెం శారద



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 246

కౌముది మాసపత్రికలో

జనవరి 2020 సంచిక నుంచి జనవరి 2023 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# నా మాటః

దాదాపు మూడేళ్లు కౌముది వెబ్ మాగజయిన్ లో పునర్ముద్రితమైన నా ఈ నవల 'వానకారు కోయిల' ను ఆదరించిన పాఠకులకు ధన్యవాదములు 🙏
నిజానికి ఇది నేను రాసిన రెండవ నవల. కానీ నవలా రూపం లో బయటకొచ్చింది మూడవ నవలగా. ఈ నవలని 'ఆదివారం'లో ప్రచురించింది శ్రీ మారేమండ సీతారామయ్య గారు. అందుకు దోహదపడింది ప్రముఖ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి గారు. "కొత్తగా వచ్చింది ఈ అమ్మాయి. బాగా రాస్తున్నది" అంటూ నన్ను సీతారామయ్య గారికి ఆమె పరిచయం చేశారు..
ఇరువురికి నా కృతజ్ఞతలు.. ఇకపోతే ఈ నవలకి ఆధారం ఇండియాటుడే (english )లో వచ్చిన ఒక చిన్న వార్త . రవి అనే పేద తెలివైన అబ్బాయి పల్లవి అనే డబ్బున్న అమ్మాయి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామను కున్నారు. రవి ఐఏఎస్ కు ప్రిపేర్ అవుతున్నాడు. కానీ ఆ అమ్మాయి తండ్రి చెప్పినట్లు దుబాయ్ లో ఉన్న ఒక ప్రముఖ వ్యాపారస్తుడ్ని పెళ్లి చేసుకుని వెళ్లిపోతుంది. రవి చాలా అప్సెట్ అయి కొన్నాళ్ళు బెంగపడి తిరిగి కోలుకుని చదువులో పడతాడు. కానీ ఒకరోజు ఆ అమ్మాయి సడెన్గా సూట్కేస్ తో తిన్నగా అతని రూమ్ కొస్తుంది. ఆమె తన ప్రేమని వదులుకోలేక వచ్చేసిందని అనుకుని ఆమెతో కలిసి ఉంటాడు రవి. ఆమె కన్సీవ్ అవుతుంది. పెళ్లి చేసుకుందామని ప్రపోజ్ చేస్తాడు రవి. కానీ ఒక రోజు ఆమె భర్త వచ్చి డబ్బున్న ఒక బ్రీఫ్ కేసు అక్కడ పెట్టి భార్యని తీసుకుని వెళ్ళిపోతాడు. చాలా డబ్బుండి భార్య, పిల్లలు ఉండటం ఒక స్టేటస్ సింబల్ గా భావించిన ఒక impotent ఆడిన నాటకంలో అమాయికం గా ఇరుక్కున్న రవి షాక్ కి గురయి ఆత్మ హత్య చేసుకుంటాడు.
ఇదీ ఆ వార్త!కలకత్తా అనుకుంటా.. జరిగింది. . ఆ వార్త నన్ను ఎంతగానో కదిలించి వేసింది . ఆ వార్తే 350 పేజీల నవలయ్యింది. అయితే యదాతథం గా రాయడానికి నాకు ధైర్యం లేకనో లేక స్త్రీ పాత్రని వేంప్ చేయలేకనో ఇందులో లవర్, హస్బెండ్ ని విలన్స్ గా చేసి ఆమెను అమాయకురాలిగా చిత్రికరించాను. ఈ నవల కన్నడంలో చదివి ప్రముఖ నటుడు అనంతనాగ్ ఇక్కడ షూటింగ్ కి వచ్చి మా అబ్బాయితో కలిసి అకస్మాత్తుగా మా ఇంటికి వచ్చి అభినందించారు. దాదాపు నా నవలలన్నీ కన్నడం లోకి అనువదించిన 'వంశీ 'వారి స్నేహితులట! ప్రముఖ నిర్మాత కాట్రగడ్డ మురారిగారు నా నవల చదివి " గట్స్ ఉన్న రచయిత్రి వి "అన్నారు నవ్వుతూ.
2014 సంవత్సరాంతంలో నేను ముఖపుస్తకంలోకి రావడం జరిగింది. ఒకరోజు నాకు ఒక ఫోన్ వచ్చింది. ఆ ఫోన్ చేసింది సాక్షాత్తు కౌముది సంపాదకులు కిరణ్ ప్రభ గారు. నన్ను వారి పత్రికకు ఏమయినా రాయమని అడిగారు. అప్పటికి దాదాపు పదిహేనేళ్లు రచనా వ్యాసంగానికి దూరంగా జరిగి పోయిన నేను రాయలేనని చెప్పాను. ఆయన నవ్వి మర్నాడు మళ్ళీ ఫోన్ చేశారు. నేను మళ్ళీ అదే పాట పాడేను. "శారదగారూ, నాకు మీరు తెలుసు. మీరు పల్లకి వారపత్రికలో రాసేటప్పుడు నేనూ అక్కడ రాస్తుండే వాడిని. మీరు మంచి రచయిత్రి. రాయాలి తిరిగి మీరు!"అని చాలాసేపు ధైర్యం చెప్పారు. ఆలా మొదలయ్యింది కౌముదిలో నా సెకండ్ ఇన్నింగ్స్! "నిదురించే తోటలోకి "సాదా సీదాగా మొదలయి కిరణ్ ప్రభ , కాంతి కిరణ్ ల అభిమానాన్నే కాకుండా పాఠకుల అభిమానాన్ని చూరగొంది. అందులోని సరోజినీ పాత్రని కిరణ్ ప్రభ గారు ఆపుడప్పుడూ గుర్తు చేసుకుంటుంటారని తెలిసినప్పుడు నా కళ్ళు చెమరుస్తాయి. తర్వాత కాంతి కిరణ్ గారి పట్టుదలవల్లే "మనకథ నిజం కాదా?"రాసాను. ఇప్పుడు మూడేళ్లగా ప్రచురితమవుతున్న "వానకారు కోయిల" ఈ నెలతో ముగుస్తుంది. ఇప్పుడు కౌముది సంపాదకులు కిరణ్ ప్రభగారు, కాంతి కిరణ్గారు దాదాపు 28సంవత్సరాల తర్వాత తిరిగి వారి పత్రిక లో ప్రచురించడం ఆనంద దాయకం. వారికి నా కృతజ్ఞతలు. కాంతి మరో సీరియల్ రాయమన్నారు కానీ ప్రస్తుతం ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతున్న నేను రాసే స్థితిలో లేను. రచయితల్ని ఎంతగానో గౌరవించి ఆదరించే ఆ సాహితీ దంపతుల్ని నేను ఎన్నడూ మరువలేను. వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు, నమస్సులు.

## (ప్రారంభం)

**సాయంత్రం ఆరుగంటల వేళ**

వేడి తగ్గినా వెలుగు తగ్గని మే నెల మధ్య భాగం.

పగలంతా తన ప్రతాపం చూపించి చివరికి ఓటమిని అంగీకరించటం వలన రగిలిన అవమానంతో ముఖం ఎర్ర చేసుకుని పడమటి దిశగా పారిపోతున్నాడు సూర్యుడు.

పడమటి కొండల్లోకి కృంగిపోతూ అతను విసిరిన ఆఖరి కిరణానికే జగన్నాధరావుగారి ముఖం ఎర్రబడిందేమో తెలియదుకానీ ఆయన మాత్రం చాలా గంభీరంగా వాలు కుర్చీలో వెనక్కి జేరబడకుండా బిగుసుకున్నట్లు కూర్చున్నారు.

అతనికి ఎదురుగా మరో కుర్చీలో మౌనంగా అరచేతిలో గీతలు గీసుకుంటూ కూర్చున్న అతని కూతురు వాసవి ముఖంలో మాత్రం ఏ రకమైన ఉద్విగ్నత గోచరించటంలేదు.

ఆ అమ్మాయి కట్టుకున్న లేత గోధుమరంగు షిఫాన్ చీర, నుదుటిమీద అందంగా ముసురుకున్న ముంగురులు, చెవులకు పెట్టుకున్న జూకాలు దక్షిణం దిశగా వీస్తున్న చల్లగాలికి సుతారంగా ఊగుతున్నాయి.

ఆ బంగ్లా బంజారా హిల్స్‌లో ఉన్న అందమైన కట్టడాల్లో ఒకటి. కేవలం శ్రీమంతులకే నివాసయోగ్యమైన ఆ ఏరియాలో తప్పిపోయిన దేవ కన్యల్లా అక్కడొకటి అక్కడొకటిగా దూరం దూరంగా వున్న మేడలు.

ఆ ప్రదేశం సిటీకి చాలా ఎలివేషన్‌లో ఉండటాన్న ఊరంతా ఫ్రేమ్‌లో బిగించిన సీన్‌లా కనిపిస్తోంది.

ఊరంటుకున్నట్లు సిటీలో అక్కడక్కడా విరగబూసిన గుల్‌మొహార్ చెట్ల ఎరుపుదనాన్ని చూస్తున్నారు జగన్నాథరావుగారు.

ఫ్లడ్‌లైట్ల కాంతిలో మరింత తెలుపుదనాన్ని నింపుకున్న బిర్లా మందిర్ వేపు కన్నార్పకుండా చూస్తోంది వాసవి.

జగన్నాధరావుగారి చూపులు అటూ యిటూ తిరిగి చివరికి కూతురు మీద కేంద్రీకృతమయ్యాయి.

ఆయన అసహనంగా కుర్చీలో కదిలి గట్టిగా నిట్టూర్చారు.

ఆయన నిట్టూర్పుకి ఎటో చూస్తున్న వాసవి చూపులు కూడా తండ్రి మీదకు మళ్ళాయి.

''పెళ్ళి గురించి నీకు సరయిన అవగాహన లేదు బేబీ'' ఆయన మాటకి వాసవి అదోలా చూసి నవ్వింది.

''అవగాహన వుండబట్టే వ్యాపారంలాంటి పెళ్ళి వద్దంటున్నాను డాడీ'' అంది వాసవి.

జగన్నాధరావుగారు బిగ్గరగా నవ్వారు.

వాసవి ఆశ్చర్యంగా చూసింది. తండ్రిని అంతగా నవ్వించిన విషయం ఏమిటో ఆమెకు అంతుబట్టలేదు.

''పెళ్ళంటేనే వ్యాపారం బేబీ. అది పెద్దలు చేసిన పెళ్ళయినా ప్రేమ వివాహమైనా చివరికి దారితీసేది వ్యాపారంలోకే. పెద్దలు కట్నకానుకలు యిచ్చి, ఆస్తిపాస్తులు చూసి కుదిరిస్తే దాన్ని వ్యాపారం అంటారు మీలాంటి పిల్లలు. ఏవో కనిపించని ఆదర్శాలతో కళ్ళను కప్పేసిన ప్రేమతో కట్టుకుంటే అది నిజమైన వివాహబంధం అనుకుంటారు కాని ఆ మూడు ముళ్ళూ పడ్డాక రెండూ ఒకవేపే దారితీయటం నాకు తెలుసు. డబ్బు ప్రసక్తి లేనంత మాత్రాన ఒకరి అవసరాలు మరొకరి నుండి తీర్చుకోవడం వ్యాపారం కాదా?'' అన్నారు ప్రశ్నిస్తున్నట్లు.

తండ్రి ఆలోచనా ధోరణికి విస్తుపోయింది వాసవి.

''నేనలా అనుకోవడంలేదు డాడీ! మనకిష్టమయిన వ్యక్తికోసం ఏదైనా చేయటంలో ఆనందం వుంది. ఆ తృప్తికి ఆ ఆనందానికి మీరు వ్యాపారం అని పేరు పెడితే నేనేం చెప్పలేను. నా దృష్టిలో వివాహ బంధం మహత్తరమైనది. అది కోరుకున్న వ్యక్తితోనే జరగాలి. అందుకే....అందుకే నాకిష్టమయిన వ్యక్తిని చేసుకునే అవకాశం నాకిమ్మంటున్నాను'' అంది వాసవి చాలా నెమ్మదిగా.

''ఒకవేళ నేనీ అవకాశం నీకు యివ్వకపోతే?'' ఆయన అర్థోక్తిగా ఆగి కూతురి ముఖంలోకి సాలోచనగా చూసారు.

వాసవి ఆయనవేపు దెబ్బతిన్నట్లు చూసింది.

సామోపాయానికి చిక్కని మనిషిని దండించయినా తన పని నెరవేర్చుకునే మనస్థత్వం ఆమెకు కొద్దిగానే తెలుసు.

కానీ ఆ ప్రయోగం చివరికి ఆయన కన్నకూతురిమీద కూడా ప్రయోగిస్తాడా అన్నదే అనుమానం.

''ఆ అవకాశం మీరు యిచ్చే తీరుతారని నాకు తెలుసు డాడీ. ఇది వ్యాపారం కాదు మీరనుకున్న రీతిలో మనుషుల్ని పదివేలు విసిరి మీవేపు తిప్పుకోటానికి. కనీసం నేను చిన్నపిల్లనయినా కాదు, బెదిరించి మీపని నెరవేర్చుకోవడానికి. ఏదికావాలో సరిగ్గా ఎంచుకోగలగటం ఎంచుకున్నది పొందగలగటం నాకు మీనుండే అలవడింది'' అంది బింకంగా.

జగన్నాధరావుగారు మాట్లాడలేనట్లు కూతురివేపు చూసారు. పోయిన సంవత్సరమే మేజరయిన తన కూతురు పోస్టుగ్రాడ్యుయేషన్ ఆఖరి సంవత్సరం చేస్తోందని తెలిసిన ఆయనకు వాసవికేర్పడిన హక్కులగురించికూడా బాగా తెలుసు.

మనిషి చెయ్యిజారిపోతున్నాడు అని అనిపించినప్పుడు పౌరుషానికి పోయి పని చెడగొట్టుకోటం అతనికిష్టంలేని విషయాల్లో మొదటిది.

ఆ తర్వాత ఆయన కొంచెం మెత్తబడ్డట్లు ''పెళ్ళికొడుకుని చూస్తే నీ అభిప్రాయం మారుతుంది బేబీ'' అన్నారు.

వాసవి నిరసనగా నవ్వింది.

''అప్రస్తుతమైనా ఒక విషయం చెబుతాను వింటారా డాడీ?'' అంది కాస్త నవ్వుతూ.

జగన్నాధరావుగారు కనుబొమ్మలెత్తి ఏవిటన్నట్లు చూసారు.

''అప్పటికి నాకు చాలా చిన్నవయసే. కానీ ప్రతివిషయాన్ని చిన్నతనంనుండీ జ్ఞాపకాల అట్టడుగు పొరల్లో నిక్షిప్తం చేయడం నాకు అలవాటు. అమ్మతో షాపింగ్‌కి వెళ్ళేదాన్ని. అమ్మ షాపులో బట్టలు కుప్పగా పోయించి తనకు నచ్చిన చీరలు ఏరేది. అందుకు పట్టిన టైం గురించి వేరే చెప్పనక్కరలేదనుకుంటా. అవన్నీ పేక్ చేసి బిల్లు చేయమని చెప్పి మరో షాపులోకి వెళ్ళేది. అక్కడా మళ్ళీ ఇదే బిజినెస్. అలా ఎన్నో షాపులు. బయట ఎండలో డ్రైవర్. చమటలు కక్కుతూ మమ్మీకూడా నేను నీరసంగా వ్రేళ్ళాడిపోతూ. అలా తిరిగి తిరిగి ఎక్కడో ఏదో షాపులో తనకి నచ్చినవి తీసుకుని మిగతావారిని వదిలేసి నిర్లక్ష్యంగా యింటికి వచ్చేసే మమ్మీని చూస్తే ఆమె ధైర్యానికి నాలో ఆశ్చర్యం. మరో ప్రక్క బయట పెట్టలేని అయిష్టత. ఆ తర్వాత ఆ చీరలు అక్కర్లేదంటూ మీరా షాపులకి ఫోన్ చేసి చెప్పటం మీ పలుకుబడికి వాళ్ళంతా నోర్లు మూయటం. మీకు తెలుసు. ఏ చిన్న వస్తువైనా ఎన్నుకున్నాక మార్చటం నాకు నచ్చనిపని'' అంటూ నవ్వింది వాసవి.

''అంటే అనంత్‌నే పెళ్ళి చేసుకుంటానని చెప్పటమా?'' జగన్నాధరావుగారు రెట్టించారు.

ఆయన గొంతులో అదుపు తప్పుతున్న కోపాన్ని పసిగట్టగల్గింది వాసవి.

కోపతాపాలకి వెనక్కి తగ్గిపోవాల్సిన విషయం కాదది. వాసవికి తండ్రిని ఎదిరించాల్సిన పరిస్థితి ఏర్పడినందుకు కాస్త బాధ కలిగి దాన్ని దిగమింగింది.

''అనంత్‌లో మీకు నచ్చనిదేవిటి?'' అంది వాసవి ఎదురు ప్రశ్న.

''డబ్బు లేకపోవటం'' ఆయన గొంతు ఖంగున మ్రోగింది.

"అదంత పెద్ద సమస్య కాదనుకుంటా డాడీ. ఈరోజు పుట్టు దరిద్రుడు రేపు కోటీశ్వరుడు కావొచ్చు. కానీ ఈ రోజు మనసు లేనివాడు రేపు మనసున్న మనిషి కాలేడు."

"అనంత్ నీ దృష్టిలో అంత గొప్పవాడా?" జగన్నాధరావుగారి కంఠంలో వెటకారం.

"ప్రేమించినవాడు గొప్పవాడుగా కనిపించడం సహజంకదా డాడీ. కానీ నేను అలా చెప్పను. అతనికీ కొన్ని బలహీనతలుండొచ్చు. ఆ మాటకొస్తే నాకు మాత్రం వుండవా? కాని యివి భయంకరమైనవి మటుకు కాదు. వాటివల్ల మా బ్రతుకులు చిన్నాభిన్నం కావు. అనంతంటే నాకు చాలా యిష్టం. దాన్ని చంపే ప్రయత్నం దయచేసి చేయకండి" అంది అర్థింపుగా.

జగన్నాధరావుగారి ముఖంలో ఒకలాంటి ఎర్రదనం. "నీ అంచనాలని అతను తారుమారు చేస్తే?" ఓటమిని ఒప్పుకోలేని అతని మనసులోంచి వచ్చిన ఆఖరి ప్రశ్నది.

"అప్పుడు మీమాటే వింటాను డాడీ" అంటూ వాసవి అందమైన పలువరస మెరిసేటట్లుగా నవ్వింది.

ఆ నవ్వులో తనే గెలుస్తాననే ధీమా చూసి జగన్నాధరావుగారు తల పంకించారు.

ఆయన లేచి నిలబడి కూతురి ముఖంలోకి దీక్షగా చూసి "కానీ బేబీ ఈ పెళ్ళి నా చేతులమీదుగా మాత్రం జరగదు." అన్నారు స్థిరంగా.

వాసవి కూడా లేచి నిలబడింది.

ఆ తర్వాత తను కూర్చున్న కుర్చీ వెనకగా వచ్చి దానిమీద చేతులుంచి ఊగుతూ "ఈ పెళ్ళి జరిగిన క్షణం నుంచి నేనీగడప త్రొక్కను. ఒకే డాడీ" అంది చిరునవ్వుతో.

ఈసారి జగన్నాధరావుగారు సీరియస్‌గా చూడలేదు. ఆయన కూడా నవ్వి "సరే బేబీ" అన్నారు.

కానీ ఆ క్షణం ఆయన మస్తిష్కంలో మెరిసిన మెరుపు వాసవికి తెలియదు.

ఆయన వెనుతిరిగి మెల్లగా అడుగులు వేస్తూ మేడ దిగుతోంటే ఆయన్ని బాధపెట్టానేమోనన్న దిగులు వాసవిని ఆవరించింది. కానీ అనంత్‌ని చేసుకోవటానికి అంగీకరించవచ్చుగా. ఆయనకంత పట్టుదల దేనికి? తాడు రెండువేపులా బిగించి లాగినప్పుడే తెగుతుంది. ఇందులో కేవలం తన బాధ్యతేలేదు. తండ్రిమీద ప్రేమకోసం తను అనంత్‌ని వదులుకోలేదు. అలా వదులుకోటానికి తను అనంత్‌ని ప్రేమించలేదు. అనంత్ కోసం తాను ఏదయినా వదులుకోటానికి సిద్ధమే..! వాసవి నిట్టూర్చింది.

అకస్మాత్తుగా వచ్చిన వాసవిని చూసి అనంత్ కంగారుగా లేచి గబగబా చొక్కా తొడుక్కున్నాడు.

వాసవి యిబ్బందిగా గుమ్మంలో నిలబడింది.

కంగారుగా సిగరెట్ యాష్‌ని, ఖాళీ సిగరెట్టు పెట్టెల్ని ఓ పక్కకి కాలితో త్రోసి, కుర్చీలోవున్న బట్టల్ని మంచమ్మీద పడేసి "కూర్చో" అన్నాడు.

వాసవి మెల్లిగావచ్చి కుర్చీలో కూర్చుంది.

"నువ్వొచ్చావేమిటి? కబురుచేస్తే నేనే వచ్చేవాణ్ణిగా" అన్నాడు మంచం మీద కూర్చుంటూ.

"అంత టైమ్ లేక" అంది చుట్టూ చూస్తూ వాసవి.

"ఏమిటంత అర్జంటు?" అంటూ సిగరెట్ వెలిగించబోయాడు అనంత్.

"ప్లీజ్, కనీసం నేను వున్నంతసేపు సిగరెట్ కాల్చకు. ఐ హేట్ దిస్ ఎట్మాస్ఫియర్" అంది వాసవి చిరాకునణుచుకుంటూ.

"నీలాంటి ధనికురాలు యిలాంటి వాతావరణాన్ని అసహ్యించుకోటంలో ఆశ్చర్యంలేదు. బట్, ఈ వాతావరణంలో పెరిగిన వ్యక్తినే కోరుకుంటున్నావన్న సంగతి నువ్వు మరచిపోకూడదు" అంటూ సిగరెట్‌ని తిరిగి పాకెట్‌లో పెట్టేసాడు అనంత్.

వాసవి అనంత్ వైపొకసారి చూసింది. అతను కట్టుకున్న లుంగీ నల్లగా మాసింది. వేసుకున్న బనీనుకి సన్నటి చిరుగులు.

ఆమె మనసదోలా అయ్యింది.

అదికూడా ఒక్క క్షణమే.

ఆ వెంటనే అనంత్ తెలివితేటలు మాటల్లో గాంభీర్యం నడకలో ఠీవి కళ్ళలో చురుకుదనం పెదవి వంపులో చిలిపిదనం గుర్తొచ్చి అంతకు ముందు ఆమెలో ముసిరిన నిర్లిప్తతని సుడిగాలిలా అవతలికి నెట్టేసి ఆమెని మురిపింపచేసాయి.

"నేను అసహ్యించుకుంటున్నది ఈ అపరిశుభ్రమైన వాతావరణాన్ని కానీ నీ బీదరికాన్ని కాదని ఆమెకు చెప్పాలనిపించినా తనొచ్చిన పని అది కాదని విరమించుకుంది.

"డాడీ నా పెళ్ళి నిశ్చయించారు" అంది వాసవి కళ్ళు దించుకుని.

"ఎప్పుడు?" అనంత్ ఆశ్చర్యంగా కళ్ళెగరేసాడు.

"ఎప్పుడు కాదు ఎవరితోనని అడుగు జగదీష్ అనే కోటీశ్వరుడితో. పెద్ద బిజినెస్ మాగ్నట్. డాడీలాంటి వాళ్ళని డజన్లకొద్దీ కొనేయగలడట"

"ఐసీ! మీ డాడీకి బిజినెస్‌లో నష్టం వచ్చిందని వినికిడి. ఇంత గొప్ప అల్లుణ్ణి ఎట్లా కొంటున్నాడబ్బా" అంటూ నవ్వాడు అనంత్.

వాసవి చిరుకోపంగా చూసిందతనివైపు.

"మా డాడీ కట్నం ఎలా యిస్తున్నాడన్నది నిన్ను కనుక్కోమనడానికి నేను ఇక్కడికి రాలేదు" అంది వాసవి.

ఆమె గొంతులో ఒలికిన కోపాన్ని గమనించాడు అనంత్. వెంటనే లేచి నిలబడి వాసవి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "సారీ వాసవి నీకు కోపం తెప్పించేనా? ఎండలో వచ్చావు. నీకు ప్రస్తుతం మంచినీళ్ళు తప్ప మరేం ఇవ్వలేను" అంటూ గ్లాసుకడిగి కూజాలో నీళ్ళువంపి అందించాడు.

వాసవి కాదనకుండా ఆ నీళ్ళు త్రాగింది.

"ఇప్పుడు చెప్పు నన్నేం చేయమంటావో?" అనంత్ బుద్ధిమంతుడిలా చేతులు కట్టుకుని అడిగాడు.

వాసవి అతనివేపు విచిత్రంగా చూసింది.

యూనివర్సిటీ కాంపస్‌లో అతనెంత బ్రైట్‌గా కనిపిస్తాడో ఆ గోడలు దాటి బయటకొస్తే అతనంత చవటగా అనిపిస్తాడు వాసవికి.

"నువ్వొత్త ఇడియట్‌వి" అంది వాసవి కోపంగా.

"అయ్ ఎడ్మిట్" అన్నాడతను నవ్వుతూ.

"పెళ్ళి శుభలేఖలు పంచడానికి డాడీ నిన్ను తీసుకు రమ్మంటే వచ్చాను" అంది వాసవి.

అనంత్ బదులుగా నవ్వి "మరీ అంత సీరియస్ అయితే ఎలా? పెళ్ళి యిష్టంలేదని మీ డాడీకి చెప్పలేకపోయావా?" అన్నాడు.

"చెప్పాను. అంత మాత్రాన కథ యింతటితో ఆగదు. ఈ జగదీష్‌ని కాకపోతే మరో లోకేష్‌ని తెస్తాడు మా డాడీ. అందుకని అనంత్‌ని తప్ప మరొకర్ని చేసుకునే ప్రసక్తిలేదని. ఈ విషయంలో ఎలాంటి మార్పూ ఆశించవద్దని తెగేసి చెప్పాను" అంది వాసవి ప్రతిపదం నొక్కి పలుకుతూ.

"మై గుడ్‌నెస్. చాలా తొందరపడ్డావు వసూ" అన్నాడు అనంత్ గాభరాగా.

వాసవి దెబ్బతిన్నట్లు చూసింది.

"ఏం, మన పెళ్ళి విషయంలో నీకేమైనా అభ్యంతరాలున్నాయా?" వాసవి కోపంగా అడిగింది.

అనంత్ అనునయంగా "అదేం కాదు. మన పెళ్ళి జరుగుతుంది. కానీ ఇప్పుడే కాదు" అన్నాడు.

"ఎందుకని?" వాసవి సీరియస్‌గా అడిగింది.

"ఎందుకని అంటే ఏం చెప్పాలి? నాకింతవరకూ ఉద్యోగం లేదని నీకు తెలుసు. చదువు పూర్తికావడానికి మరో సంవత్సరం టైముంది. ఇప్పుడు పెళ్ళి చేసుకుని నిన్నెలా పోషించాలి?" అన్నాడు. అనంత్ దీనంగా.

"అదా నీ భయం ఫర్వాలేదు. నేను నా చదువు డిస్ కంటిన్యూ చేసి ఏదైనా ఉద్యోగం చేసి నీ చదువు పూర్తి చేయిస్తాను. నీ భవిష్యత్తు పాడు చేయను. కానీ మన పెళ్ళి వెంటనే జరిగిపోవాలి" అంది వాసవి ధైర్యం చెబుతున్నట్లు.

"అదంత తేలికకాదు వసూ. మీడాడీ దయాదాక్షిణ్యాల మీద యింతవరకూ నా చదువు కొనసాగింది. నిన్ను పెళ్ళిచేసుకుంటే ఆయన భగ్గున మండిపోతారు. ఆయన్ని నొప్పించటం మనకు క్షేమంకాదు"

వాసవి నిరసనగా నవ్వింది.

"మాటిమాటికి ఆయన దయాదాక్షిణ్యాలంటూ నిన్ను నువ్వు న్యూనత పరచుకోకు. నువ్వు డైమండ్‌వి. దానికి సానపట్టటం మాత్రమే ఆయన చేసిన పని నువ్వు ఆయన ప్రాణాన్ని కాపాడావు బదులుగా ఆయన నీకు ఆర్థిక సహాయం చేసారు. దానికోసం మరీ వెన్నెముకలేని వాడిలా మాట్లాడకు" అంది వాసవి విసుగ్గా.

"ఎప్పుడో ఏదో జరగబోతుందని కూర్చున్న కొమ్మని నరుక్కోటం ఆయన చేసిన సహాయాన్ని తేలిగ్గా తీసెయ్యటం మంచిపనికాదు వాసూ"

వాసవికి అనంత్ ధోరణి అర్థంకాలేదు.

"అనంత్ ఈ డొంక తిరుగుడంతా దేనికి? డాడీ నీతో నా పెళ్ళి అసంభవం అన్నారు. నేను నీతో తప్ప నా పెళ్ళి జరగదని చెప్పి అడుగు బయటపెట్టాను. ఏది సంభవమో నువ్వు ఎంత త్వరగా చెబితే అంత త్వరగా వెళ్ళిపోతాను" వాసవి లేచి నిలబడింది.

ఆమె ముఖం కందిపోయింది. ఆమె పెదవులు వస్తున్న దుఃఖాన్ని ఆపటాన్ని అదురుతున్నాయి. అనంత్ ఖంగారుగా లేచి వాసవి చేతులు పట్టుకున్నాడు.

"అరె నువ్వెప్పుడూ తొందరపాటు మనిషివే. మన ప్రేమ అబద్ధమని మన పెళ్ళి జరగదని నేను అనలేదే. ఇన్నాళ్ళ మన సాంగత్యంలో ఈ రోజు మన పెళ్ళి జరుగుతుందా లేదా అని మాట్లాడుకోవడమంటే నాలుగేళ్ళు వెనక్కి వెళ్ళటమే కానీ నేను కోరేది కొంత గడువు మాత్రమే. ఈ లోపున నేను మీ డాడీని కన్విన్స్ చేసి ఆయన చేతులమీదుగా మన పెళ్ళి జరిపించే ఏర్పాటు చేస్తాను" అన్నాడు బతిమాలుతున్నట్లు.

"అది అసంభవం. మా డాడీ గురించి నాకు బాగా తెలుసు. ఆయన నిన్ను చూసి జాలిపడగలరేకానీ అభిమానం పెంచుకుని బంధుత్వం కలుపుకుంటారని ఆశించకు" అంది వాసవి.

"అందుకోసం  ఉన్నపాటున ఆయన్ని హర్ట్ చేసి నిన్ను పెళ్ళిచేసుకోగల తెగింపు నాలో లేదు."

వాసవి విస్ఫారిత నేత్రాలకి అనంత్ సరికొత్తగా కనిపించాడు. ఈ అనంత్ తను ప్రేమించి, ఆరాధించిన అనంతేనా? వాసవి దిగ్భ్రాంతిగా చూసింది. అనంత్ కళ్ళు దించుకున్నాడు.

"ప్లీజ్ అలా కోపం తెచ్చుకోకు నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నా ప్రేమను శంకించకు. నీకు కానీ నా జీవితాన్ని కలలో కూడా ఊహించలేను కానీ గాలివాటుగా తిరుగుతోన్న నన్ను చేరదీసి, యింత చదువు చెప్పించి మనిషిగా నిలబెట్టిన వ్యక్తి గుండెల్లో

ఉన్నపాటుగా బాకు దించగల ధైర్యం నాకులేదు. ఆయన అంగీకారంతోనే నిన్ను పెళ్ళిచేసుకుంటాను'' అనంత్ దీనంగా ఆమె చేతులు పట్టుకున్నాడు.

వాసవి విసురుగా అతని చేతులు విదిలించి కొట్టింది. ఆమె కళ్ళు మొదట తీక్షణంగా ఎర్రబడి, ఆ వేడికి తట్టుకోలేనట్లు వర్షించసాగాయి.

ఆమె కంపిస్తోన్న పెదవులతో ''అనంత్ నిన్నెంతో అర్థం చేసుకున్నానని మన ప్రేమ అపూర్వం అనుకున్నాను. నీ తెలివి తేటలతోనే నీ హృదయాన్ని కొలిచాను. అదే నేను చేసిన పొరపాటు. నువ్వెదగని ఎత్తులో నిన్ను ఊహించి నీకు ప్రేమ నివాళులు అర్పించాను. ఈరోజు నువ్వు భూమిలోకి కృంగిపోతుంటే నేను చూడలేకపోతున్నాను. ప్రేమించిన వ్యక్తిని పెళ్ళిచేసుకోమని అడగాల్సి రావటమే ఆడదానికి ఒక దౌర్భాగ్యం. అతను తిరస్కరించడం ఆ ప్రేమకు సజీవ దహనం. నీలోని అసలు స్వరూపం నాకిప్పుడు బాగా అర్థమయింది వస్తాను'' అంటూ బుసలు కొడ్తున్న త్రాచులా వెనుతిరిగింది వాసవి.

''ప్లీజ్ వసూ''

వాసవి గడపదాటుతూ ఛీత్కారంగా వెనుదిరిగి చూసింది. ''నిన్ను చాలా అనాలని వుంది కానీ అనంత్ నువ్వేమిటో తెలిసిపోయాక నీతో మాటలు పెంచడం అంత నికృష్టమైన పని మరొకటి వుందా?''

''నా మాట విను వాసవీ తొందరపడకు'' అనంత్ మరో అడుగు ముందుకు వేసి వాసవికి దగ్గరగా వచ్చాడు.

**వాసవి** తుఫానులో చిక్కి ఊగిపోతున్న లతలా గబగబా నాలుగడుగులు వెనక్కి జరిగింది.

ఆమె కోపంతోను, బాధతోనూ నిలువెల్లా వణికిపోతోంది. ఇతన్ని నమ్మి ఇతన్ని చాలా గొప్పగా ఊహించుకుని తండ్రితో పందెం వేసినట్లు మాట్లాడింది.

పందెం కాయటం కాదు పందెం గెలిచినట్లే మాట్లాడింది. తన ప్రేమ మీద తను ప్రేమించిన వ్యక్తిమీద తను కల్పించుకున్న నమ్మకం అలాంటిది.

తన ఆత్మస్థయిర్యాన్ని వమ్ముచేస్తూ తనని ఎంతో ఎత్తుకు ఎక్కించి అక్కడినుండి త్రోసేసాడతను.

వాసవి చెంపలమీద ఎడతెగని అశ్రుధార జీవనదిలా జారిపోతుంది.

''ఏడవకు వాసూ'' అనంత్ వాసవికి దగ్గరగా వచ్చాడు. వాసవి అవమానాగ్నితో దహించుకుపోతూ దూరంగా జరిగి కన్నీళ్ళు తుడుచుకుంది.

ఆమె చుట్టూ చూసింది.

దరిదాపు యిద్దరూ గుమ్మం దాటి బయటకొచ్చేసారు.

మధ్యాహ్నపు ఎండకావటాన రోడ్డుమీద జనసంచారం పూర్తిగా లేదనే చెప్పాలి.

''మిస్టర్ అనంత్! ఈ రోజుతో మన అనుబంధం తెగిపోయింది. కానీ ఒక్కటి గుర్తుంచుకో. ఒకవేళ నా మీద ప్రేమతో నా తండ్రి మెత్తబడి నన్ను నీకు యిచ్చిచేస్తానంటే'' వాసవి ఆయాసంగా ఆగి అతనివైపు చూసింది.

అనంత్ ఆశగా చూసాడు వాసవివైపు.

''అటు చూడు, రోడ్డుమీద అడుక్కుంటూ పోతున్న ఆ గుడ్డివాడినయినా చేసుకుంటాను కానీ నీలాంటి పిరికివాణ్ణి మాత్రం కట్టుకుని యింకో పొరబాటు చెయ్యను.'' వాసవి విసురుగా బయటకి నడిచింది.

అనంత్ ముఖం వివర్ణమయింది.

ఒక క్షణం వాసవి వెళ్తోన్న తదేకంగా చూసి, తలుపేసుకుని మంచమ్మీద కూర్చున్నాడు.

అప్రయత్నంగా అతని చేతులు తలమీదకి వెళ్ళాయి.

2

వాసవి వడదెబ్బ కొట్టిన మనిషిలా వాడిపోయినట్లు రోడ్డుమీదకొచ్చి నిలబడింది.

కాని వాసవికి అంతకుమునుపు తెలియదు. వడదెబ్బకన్నా భయంకరమైంది, బాధాకరమైంది ప్రేమ వైఫల్యం అని.

ప్రేమతో మోసపోయిన ఆడవాళ్ళు ఎందుకు తెగించి ఆత్మహత్య చేసుకుంటారో కూడా ఆమె గ్రహింపుకొచ్చింది.

మగవాడికి ప్రేమ, జీవితంలో ఒక భాగం.

సిగరెట్‌ల్లా, విస్కీబాటిల్లా, పేకముక్కల్లా, అతనికి ప్రేమింపబడటం కూడా ఒక థ్రిల్.

ఆడది అతని జీవితంలో ఓ భాగమేగాని పూర్తి జీవితం కాదు.

అతని ప్రేమకి కామాలేగానీ ఫుల్‌స్టాప్‌లు లేవు.

అందుకే తరతరాలుగా ఆడది మగవాడి ఆటలో పావులో అతని వలలో పావురంలా చిక్కిపోతోంది.

అతని కపటనాటకం బయటపడ్డాక, అతని వంచనని గ్రహించాక తట్టుకోలేక తనువుని వదిలేస్తోంది.

వాసవికి ఒక క్షణం బ్రతుకంటేనే విరక్తి కలిగింది. తను చచ్చిపోతే ఏం జరుగుతుంది?

ప్రళయాలు రావు. ప్రపంచం స్థంభించి పోదు.

తన ఫోటో పేపర్లో ఒక మూల తన తండ్రి అశ్రుతర్పణంతో. తన శరీరం పోలీసుల చేతులకి తర్వాత డాక్టర్ల కత్తులకి. తన గురించి రకరకాల మాటలు.

ఉన్న నిజాలు కప్పబడిపోయిలేని అపవాదులు ఊకలా పైకి లేస్తాయి. వాసవి ఆపైన ఊహించలేకపోయింది. ఆమె మనస్సు అర్థంలేని ఆలోచనలు చేసి బరువెక్కిపోయింది.

"అమ్మా! యిక్కడున్నావా?"

వాసవి పరిచయమైన ఆ కంఠస్వరానికి ఉలిక్కిపడ్డట్లుగా చూసింది.

జగన్నాధరావుగారు కారుదిగి వాసవివైపుగా వచ్చారు. తోటకూరకాడలా సోలిపోయిన కూతురివైపు ఆందోళనగా చూస్తూ ఇంత ఎండలో కారులేకుండా బయటకి ఎందుకొచ్చావు తల్లీ" అన్నారు ఆప్యాయంగా.

వాసవి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"అనంత్ తనతో పెళ్ళికి ఒప్పుకుంటాడని తండ్రికి తనకూ రుణం తీరిందని కారుముట్టుకోవడానికి తనకికా హక్కులేదని వచ్చాను డాడీ" అని ఎలా చెప్పగలదు.

"నీ కోసం యిల్లంతా గాలించాను. నాకేదో గుండె గుభేలుమంది. కొంపదీసి నువ్వు యింటిలోంచి వెళ్ళిపోయేవేమోనని. నువ్వు కారు తీసి కెళ్ళకపోవడంతో నా అనుమానం మరీ బలపడింది. ఎంత గాభరా పడ్డానో తెలుసా? నిన్న సాయంత్రం ఏదో పిశాచం ఆవహించి నీ పెళ్ళి గురించి పెడసరంగా మాట్లాడాను. ఒక్కగానొక్క కూతుర్ని నీ పెళ్ళి నీకిష్టమైన వ్యక్తితో జరిపించడంలోనే ఆనందం ఉంది. అది నా కర్తవ్యంకూడ, నా పిచ్చిగాని రేపు ఆ కాస్త తతంగం జరిగిపోతే ఈ ఆస్తి నీతోపాటుగా అనంత్‌ది కూడా కాదూ. రాత్రంతా నేను చాలా ఆలోచించాను. అనంత్ నీకు అన్ని విధాల తగిన జోడు. నీ ఎన్నిక చాలా బాగుంది బేబీ. ఇంతకీ నేనే ఓడిపోయాను కదూ" అన్నారు జగన్నాధరావుగారు నవ్వుతూ.

వాసవి శిలా విగ్రహంలా అలాగే చూసింది తండ్రివేపు.

మాటాపలుకులేకుండా బిగుసుకున్నట్లు నిలబడ్డ కూతురివైపు ఆశ్చర్యంగా చూసారు జగన్నాధరావుగారు.

"అదేవిటి బేబీ, అలాగే నిలబడ్డావు. మీ డాడీలో యింత మార్పేమిటనా? ఎంతపేరు, పలుకుబడి వుందో అంత పౌరుషం పట్టింపూ వున్న రావుబహదూర్ ధనుంజయరావు మనుమడినయినా కడుపుతీపి ముందు అవన్నీ వదులుకోవాల్సిందేగా. అద్సరే ఈ ఎండలో మాటలెందుకు, ఇంతకీ అనంత్ వున్నాడా అతన్ని కంగ్రాచ్యులేట్ చెయ్యాలిగా పద" అంటూ వాసవి భుజం మీద చెయ్యి అనిపించాయన.

ఒక అడుగు ముందుకేసిన తండ్రి వేపు మాటలు రానట్లు చూసింది వాసవి.

ఆ మరుక్షణం "డాడీ" అంటూ కెవ్వున అరిచింది.

జగన్నాధరావు కూతురివైపు ఆశ్చర్యంగా చూసారు.

ఆ వెంటనే గాభరాగా "ఏం జరిగిందమ్మా? ఎందుకలా వణికిపోతున్నావు?" అన్నారు అనునయంగా వాసవిని దగ్గరగా తీసుకుంటూ.

"వద్దు డాడీ, నువ్వటు వెళ్ళొద్దు. అక్కడ అనంత్ లేడు." అంది వాసవి కంపిస్తోన్న పెదవులతో.

అలా అంటున్నప్పుడు అంతవరకూ దాచుకున్న దుఃఖం వెల్లువై బయట కురిసింది.

జగన్నాధరావుగారు అయోమయంగా కూతురివైపు చూసారు.

చీటికి మాటికి అకారణంగా ఏడ్చే మామూలు ఆడపిల్లకాదు వాసవి.

తనకి బాగా తెలిసి తల్లి చచ్చిపోయినప్పుడే వాసవి భోరున ఏడ్చింది.

తిరిగి యిప్పుడు.

ఆమె మనస్తాపానికి వెనుక ఏదో బలమైన కారణం వుంటుందని తెలిసినా దాన్ని కప్పిపుచ్చుతూ "నీకు వంట్లో బాగోలేదా బేబీ" అన్నారు అనునయంగా.

"అవును డాడీ ఇంకాస్సేపు యిక్కడేవుంటే నేను పిచ్చిదాన్నవుతాను" అంటూ తండ్రి చేతిని పట్టుకుని కారువేపులాగింది.

జగన్నాధరావుగారు మారు మాటాడకుండా ఆమెని అనుసరించారు.

"నువ్వు డ్రైవ్ చేస్తావామ్మా?" అన్నారాయన.

"లేదు డాడీ మీరే చెయ్యండి" అంటూ వాసవి బేక్ డోర్ తీసుకుని వెనక సీట్లో సొమ్మసిల్లినట్లు కూర్చుని కళ్ళు మూసుకుంది.

జగన్నాధరావుగారు డ్రయివింగ్ సీట్లో కూర్చుని కారు స్టార్టు చేసారు.

ఆయన కారు నెమ్మదిగా డ్రైవ్ చేస్తూనే వ్యూ మిర్రర్లోంచి వెనుక సీట్లో వున్న వాసవిని గమనిస్తున్నారు.

ఏదో జరగరానిది జరిగిందనే విషయాన్ని వాసవి పరిస్థితే చెబుతోంది. లేకపోతే వాసవేమిటి? అలా నిస్సత్తువుగా, నిస్పృహగా కూర్చోవడమేమిటి?

ఇదే మరోసారయితే తండ్రి అతి మెల్లగా ట్రాఫిక్ని తప్పించుకుంటూ సీరియస్గా కారు నడపడం గురించి జోకులేసి నవ్వేదే

"కారు నడపటంలో యింత టెన్షన్ వుందంటే కార్లు సేల్ కావు డాడీ. మిమ్మల్ని చూస్తే కార్లు కంపెనీవాడు లబోదిబోమంటాడు." అంటూ నవ్వేది.

అందుకే జగన్నాధరావుగారు కూతురితో ఎక్కడికయినా వెళ్ళాల్సి వస్తే డ్రైవింగ్ బాధ్యత వాసవికే అప్పగిస్తారు.

వాసవి డ్రైవింగ్ చాలా స్టెడీగా ఉంటుంది సడన్ బ్రేక్స్ ఉండవు. వాసవితో కార్లో వెళ్ళడం ఒక సరదా ఐన అనుభవం.

కారు యింటి పోర్టికోలో చిన్న జెర్క్‌తో ఆగింది. వాసవి కళ్ళు విప్పి చూసింది.

''బేబీ కారుదిగు'' జగన్నాధరావుగారు డోర్ తీసి పట్టుకుని వాసవిని పిలిచాడు.

వాసవి తండ్రివైపు చూసింది.

ఆమె కళ్ళు నిండుకున్నాయి. ''డాడీ, లోనికి రావచ్చా?'' అంది.

''అదేం ప్రశ్నమ్మా?'' అన్నారాయన నవ్వుతూ.

''లేదు డాడీ నేను నేను ఓడిపోయాను'' అంది వాసవి ముఖాన్ని మోచేతితో దాచుకుంటూ.

జగన్నాధరావుగారు చుట్టూ చూసారు. గేటు దగ్గర గూర్ఖా, హాల్లో పనివాడు, తమవేపే చూస్తున్నట్లనిపించిందాయనకు.

''ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్ బేబీ! పైకి వెళ్ళి మాట్లాడుకుందాం కళ్ళు తుడుచుకో'' ఆయన కూతురికి చేయి అందించారు.

వాసవి ఆయన చెయ్యి అందుకుంది.

ఎన్నాళ్ళుగానో జబ్బుపడి నీరసించిన మనిషిలా తండ్రి భుజమ్మీద తల ఆనించి ఆయన ఆసరాతో లోనికి నడిచింది.

జగన్నాధరావుగారు వాసవిని తన గదిలోకి తీసుకెళ్ళి మంచమ్మీద పడుకోబెట్టి ఏ.సి. ఆన్ చేశారు.

ఎండలో వేగిపోయిన ఆమె శరీరం ఆ గాలికి చల్లబడి సేదదీరినా, అనంత్ చేసిన అన్యాయానికి ఆమె గుండెలు కుంపటిలోపెట్టి కాల్చినట్లు మాడిపోతోంది.

జగన్నాధరావుగారు ఫ్రిజ్ తెరిచి ఏపిల్ జ్యూస్ గ్లాసులో వంచి కూతురి దగ్గరకు వచ్చారు.

వాసవి కళ్ళు మూసుకుని పడుకుంది.

''బేబీ''

ఆమె మగతగా ఊఁ అంది.

జగన్నాధరావుగారు తన ఎడం చేతిని వాసవి తలమీదుగా వేసి ఆప్యాయంగా నిమిరారు. వాసవి కళ్ళు తెరవకుండానే తండ్రి చేతిని అందుకుని తన కళ్ళకి అడ్డం పెట్టుకుంది.

తన చేతికి తగులుతున్న తడికి ఆయన ఉలిక్కిపడ్డారు. కూతురి తప్త హృదయ భాష్పస్పర్శకి ఆయన విపరీతంగా చలించిపోతూ ''బేబీ ఏడుస్తున్నావా?'' అన్నారు ఆందోళనగా.

వాసవి మాట్లాడలేదు. ఆమె దుఃఖానికి గండిపడింది. ఆమె గుండె ఎగిసెగిసిపడింది. హృదయాన్ని తినేస్తున్న బాధకి ఆమె శరీరమంత కంపించింది. జగన్నాధరావుగారు వాసవిని ఊరడించలేదు. ఏ దుఃఖం ఎంత సేపువుంటుందో ఆయనికి బాగా తెలుసు. అందుకే మౌనంగా ఆమె తలవేపుగా వున్న సోఫాలో జేరబడి కూర్చున్నారు.

అరగంట గడిచింది.

వాసవిలో దుఃఖం తగ్గు మొహం పట్టింది.

ఆమె కాస్సేపటికి లేచి కూర్చుని చుట్టూ చూసింది. తలవేపుగా కూర్చుని తననే గమనిస్తోన్న తండ్రిని చూసి సిగ్గుతో తలదించుకుంది. ఆమె జుట్టు కన్నీళ్ళకి తడిసి చెంపలకి అంటుకుపోయింది. బాధవల్ల, ఎండలో తిరగటంవల్ల ఎర్రబడ్డముఖం నల్లగా కమిలిపోయింది.

ఆమెకళ్ళూ, పెదవులు అదురుతున్నాయి.

''ముందు ముఖం కడుక్కుని రా బేబీ'' అన్నారాయన చాలా నిదానంగా.

వాసవి లేచి నిలబడి నలిగిన చీర కుచ్చెళ్ళు సర్దుకుని ఎటాచ్‌డ్ బాత్రూమ్‌లోకి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది.

వాసవి రాగానే ముందు "యిది త్రాగు" అంటూ గ్లాసు అందించారు. వాసవి కాదనకుండా జ్యూస్ తాగి గ్లాసు టీపాయ్ మీద పెట్టింది.

"ఇలా వచ్చి కూర్చో బేబీ" తండ్రి పిలుపుకు వాసవి నాగస్వరం విన్న పాములా నడిచి అతని ప్రక్క సోఫాలో కూర్చుంది.

ఆ క్షణం ఈ ప్రపంచంలో తనకి తండ్రి తప్ప మరేమీ లేనట్లనిపించింది వాసవికి.

కాస్సేపు యిద్దరిమధ్యా నిశ్శబ్దం.

జగన్నాధరావుగారు కళ్ళద్దాలు తీసి బల్లమీద పెట్టి కళ్ళు తుడుచుకున్నారు.

ఆ తర్వాత "అనంత్ మీ పెళ్ళికి నిరాకరించాడా?" అన్నారు.

ఆ ప్రశ్నకి వాసవి ముఖం ఎర్రబడింది. ఇంతసేపూ ఆమెని తల్లడిల్లచేసిన బాధ స్థానంలో, అవమానం, కోపం పెనవేసుకుని బుసలు కొడుతూ ఆక్రమించుకున్నాయి.

ఆమె జవాబు చెప్పకుండా తలదించుకుంది.

కూతురి మానసిక పరిస్థితి గ్రహించిన జగన్నాధరావుగారు ఆమె మౌనాన్ని అంగీకారంగా గ్రహించి "ఎందుకని?" అన్నారు మరో ప్రశ్నగా.

"నీ అంగీకారంలేనిదే నన్ను కట్టుకోడట" ఆ మాట చెబుతున్నప్పుడు కంఠంలో కోపం ధ్వనించింది.

ఆయన గుబురు మీసాల చాటున గుంభనంగా నవ్వి.

"కారణం?" అన్నారు.

"నువ్వతని జీవితాన్ని నిలబెట్టేవట. అందుకని నిన్ను నొప్పించలేడట."

"బాగుంది కన్న కూతురు తండ్రి పెత్తనం వద్దంటుంటే కాబోయే అల్లుడు మామగారికి మర్యాద యిస్తున్నాడన్నమాట."

అతని మాటలకి వాసవి చురుగ్గా చూసి "ప్లీజ్ డాడీ అలా అనొద్దు" అంది కోపంగా.

"ఎందుకమ్మా అంత కోపం? ఇప్పుడు నేను ఒప్పుకుంటున్నానుగా" అన్నారు కూతురి భుజమ్మీద చెయ్యేసి అనునయంగా.

వాసవి పగబట్టిన పాములా చివాల్న వెనుదిరిగి చూసింది.

"కానీ డాడీ మీరు ఒప్పుకున్నా ఈ వాసవి అతన్ని చేసుకునేందుకు సిద్ధంగా లేదు" అంది కఠినంగా.

జగన్నాధరావుగారు కూతురువైపు ఆశ్చర్యంగా చూసారు. "ఇప్పటిదాకా అతన్ని తప్ప మరొకర్ని కట్టుకోవడం కుదరదన్నావు. ఇరవై నాలుగ్గంటల్లో అతనంటే భగ్గున మండిపడుతున్నావు. ఇంత త్వరగ నిర్ణయాలు మార్చుకోవడం అంత మంచిదికాదు బేబీ" అన్నారాయన చాలా నిదానంగా నవ్వుతూ.

వాసవి ముఖం తండ్రి మాటలకి సిగ్గుతో మరికాస్త ఎర్రబడింది.

"నిజమే డాడీ నువ్వు హేళన చేయడంలో తప్పేమీలేదు. నేను అతన్ని సిన్సియర్‌గానే కోరుకున్నాను. నా అంత గట్టిగా అతనూ నిలబడతాడని అనుకోవడమే నేను చేసిన పొరబాటు. కానీ అతనేమిటో నాకు కొన్ని గంటల క్రితమే తెలిసింది. అతనికి కావల్సింది నేనుకాదు. నీ ఆస్తి. నీ ఆస్తినుండి విడదీసే నేను అతనికి పూచిక పుల్లలా కనిపించాను. అందుకే అతనొట్టి స్వార్థపరుడు డాడీ" అంది.

"కాదమ్మా నువ్వతన్ని అర్థం చేసుకోవడంలో తొందరపాటు చూపిస్తున్నావు. అతనికి నేనంటే ఎనలేని గౌరవం. నీ పట్ల ఎంత ప్రేమో నా పట్ల అంత విశ్వాసం. అందుకే అతనెటూ తూగలేక పోతున్నాడు" అన్నారు జగన్నాధరావుగారు. వాసవికి జగన్నాధరావుగారి సమర్థన నచ్చలేదు.

"నీ పట్ల అతను చూపిస్తున్న గౌరవం, కృతజ్ఞత నీకు బాగానే ఉండొచ్చు. కానీ నిన్ను కాదని గడపదాటి వచ్చిన నన్ను అవమానించి వెనక్కి పంపడం అయ్ కాంట్ ఫర్‌గెట్ డాడీ" అంది వాసవి కసిగా.

నిప్పులు కురిపిస్తున్న వాసవి కళ్ళని అప్రతిభుడయినట్లు చూసారు జగన్నాధరావుగారు.

ఆ వెంటనే తేలిగ్గా నవ్వేస్తూ "సరేనమ్మా, రేపు అనంత్‌ని పిలిచి నీకు క్షమాపణ చెప్పిస్తానుగా, ఇంక ఆ సంగతి వదిలేయి ఆ పెళ్ళి జరిపించే వరకూ మీరిలా దెబ్బలాడుకుంటూనే వుంటారా? బి హాపీ మై చెయిల్డ్" అన్నారు తల నిమురుతూ.

వాసవి దిగ్గున లేచి నిలబడింది.

"డాడీ! మీరీ విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటున్నారనుకుంటాను కానీ నేను చాలా సీరియస్‌గా ఎప్పుడో ఒక నిర్ణయానికి వచ్చేసాను. అతనితో నా మారేజ్ హైలీ "ఇంపాజిబుల్" అంటూ ఆవేశపడింది వాసవి.

జగన్నాధరావుగారు వాసవి వైపు చాలా ఆశ్చర్యంగా చూసారు.

"వెరీగుడ్ బేబీ పౌరుషంలో మన వంశం పేరు నిలబెట్టావు. కానీ ఈ నిర్ణయం తిరిగి నీ జీవితంలో ఎలాంటి తుఫానులూ రేపకూడదు."

వాసవి తలదించుకుంది.

తండ్రి అనంత్‌ని సమర్ధిస్తుంటే కోపంతో తను ఎగిరిపడింది. కానీ నిజానికి ఈ కొన్ని గంటల వ్యవధిలోనే తను పెంచుకున్న ప్రేమలత వాడిపోయిందా? అనంత్‌లో ఎన్నెన్ని తీయని సాయంత్రాలు. ఎన్నెన్ని తీయని కబుర్లు ఎన్నెన్ని ఊహాసౌధాలు తన హృదయంలో ప్రతిష్టించిన అతని రూపాన్ని చెరిపేసుకోవడం అంత సామాన్యమైన విషయమా? తన గుండెలో లోతుకంటూ నాటుకుని నాలుగువేపులా అల్లుకున్న అనుబంధపు వ్రేళ్ళని పెకిలించి, తన ప్రేమవృక్షాన్ని కూల్రద్రోయటానికి ఎంత కాలం కావాలి?

ఏదో ఆలోచనలోపడ్డ కూతురివైపు దీక్షగా చూసి గాఢంగా నిట్టూర్చారు జగన్నాధరావుగారు.

వాసవి ఆయనవైపు చూసింది.

"చూడమ్మా వాసవీ" అన్నారాయన.

ఆయన సహజంగా వాసవిని పేరు పెట్టి పిలవరు.

ఎప్పుడో చాలా సీరియస్‌గా వున్నప్పుడు మాత్రమే ఆయన కూతుర్ని పేరుతో పిలుస్తారు.

"నువ్వతన్ని అంతగా అసహ్యించుకున్నావంటే బాగా బలమైన కారణమే వుండి ఉంటుంది. అందువల్ల నేను నీ మీద ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేయను. అయితే నాకు నచ్చని విషయం ఒక్కటే" అంటూ వాసవి వైపు చూసి ఆగారు.

వాసవి ఆయన వైపు అదోలా చూసింది. ఆయన నవ్వుతూ "నువ్వారికే గుండెపగిలేటట్లు ఏడవడం ఒక మోసగాడికోసం, ఒక దగాకోరు కోసం నువ్వెందుకు నీ కన్నీళ్ళని వెచ్చించాలి? నువ్వు నా కూతురివి" సంగతి గుర్తుంచుకో అన్నారు గంభీరంగా.

వాసవి తలదించుకుంది. ఆయన లేచి నిలబడ్డారు.

"జరిగిపోయిన దాని గురించి ఆలోచించడం నా డిక్షనరీలో లేదు. పోతే జరగాల్సింది నీ పెళ్ళి మరి.. మరి నిన్ను చూసుకునేందుకు జగదీష్‌ని రమ్మని కబురు చెయ్యనా?"

వాసవి తల్లడిల్లినట్లు చూసింది తండ్రివైపు.

"పిచ్చితల్లీ ఈ రోజు కాకపోయినా రేపయినా నీ పెళ్ళి జరగాల్సిందే జగదీష్ నిన్ను చేసుకోవడానికి అంగీకరించాడు. మంచి సంబంధం ఏమీ జరగనట్లు బాధపడుతూ బంగారంలాంటి సంబంధాన్ని వదులుకోవటం దేనికి?" అన్నారు అనునయంగా.

వాసవి కాస్సేపు మాట్లాడలేదు. జగన్నాధరావుగారు వాసవి జవాబుకోసం ఎదురుచూస్తూ అలాగే నిలబడ్డారు.

"ఆ తర్వాత పెళ్ళిచూపులు అవసరమా డాడీ" అంది.

"అంటే అతను నిన్ను రాజామణిగారింట్లో; పార్టీలో చూసాడట. ప్రస్తుతానికి అతనిక్కడ ఉండటంలేదు. అతని బిజినెస్ అంతా మద్రాసులోనే. ఎక్కడో సంవత్సరంలో కొన్నిరోజులు మాత్రమే బిజినెస్ వ్యవహారాలకై యిక్కడ కొస్తుంటాడు. ఈ సంబంధం గురించి రాజామణిగారే చెప్పారు. కుర్రాడు బాగుంటాడు కాని నువ్వుకుడా ఒకసారి చూస్తే బాగుంటుందని."

వాసవి నిర్లిప్తంగా చూసింది.

"వద్దు డాడీ. మనిషిని చూసినందువల్ల తెలుసుకోగలిగేది ఏమీ వుండదు. ఎన్నాళ్ళగానో కలిసిన వ్యక్తులే మన అంచనాలని తారుమారు చేస్తున్నప్పుడు కొన్ని క్షణాలు ఒకరినొకరం చూసుకోవటంతో నాకు నమ్మకంలేదు." అంది.

"అయితే ముహూర్తాలు పెట్టించేస్తాను."

జగన్నాధరావుగారి ముఖంలోకి ఉలిక్కిపడ్డట్లు చూసింది వాసవి.

ఆయన కూతురు భుజం తట్టి "ధైర్యంగా వుండాలి బేబీ" అంటూ బయటికి నడిచారు.

వాసవి ఆయన వెళ్ళినవేపే చూస్తూ కూర్చుండిపోయింది. అనంత్‌కీ తనకీ మధ్య బంగాళాఖాతమంత అఘాతం ఏర్పడుతుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు.

"అనంత్" ఆమె హృదయం బాధగా మూలిగింది. ఆమె కంటి కొసలనుండి జారిపడుతోన్న వేడివేడి కన్నీటి బొట్లు ఆమె గుండెల్లో మంటని ఆర్పడానికి నిర్విరామంగా ప్రయత్నిస్తున్నాయి.

అతనితో ఆమె ఊహించుకున్న అందమైన జీవితమంతా చెరిగిపోయిన చిత్రంలా కనిపిస్తుంటే వాసవి చూడలేనట్లు కళ్ళు మూసుకుంది.

3

**మద్రాసు ఫ్లయిట్ గాలిలోకి లేచింది.** వాసవి లాంజ్‌వైపు చూసింది. అక్కడ అస్పష్టంగా చెయ్యిగాలిలో ఊపుతూ నిల్చుని ఉన్న తండ్రిని చూడగానే వాసవి గుండె బరువుగా మారిపోయింది. ఆమె కళ్ళల్లో ఉబుకుతోన్న నీటిని కనిపించనీయకుండా చేతి రుమాలుతో వత్తుకుంది. ఆమె తండ్రిని ఎప్పుడూ వదిలి వుండలేదు.

తన పదమూడవ యేట తల్లి శాంతిమతి చనిపోయాక ఆమెకు తల్లీ తండ్రీ జగన్నాధరావుగారే అయ్యారు.

జగన్నాధరావుగారు వ్యాపారం గొడవల్లో పడి అటూ యిటూ వెళ్ళొల్సొచ్చినా ఎక్కడి నుండయినా సరే రోజుకి కనీసం రెండుసార్లు ఫోన్‌లో కూతురితో మాట్లాడకుండా ఉండేవారు కాదు.

ఆమె హైదరాబాదుని వదిలేయటం కూడా అదే మొదటిసారి. ఆమె పుట్టిందికూడా హైదరాబాదులోనే. చదువు సంధ్యలు నేర్చింది కూడా అక్కడే ఆమె తాతగారి టైములోనే వారి మకాం హైదరాబాదుకి మార్చబడింది.

ఆయనకి విలాసాలమీద మోజని వాటి కోసమే ఆయన తన జమీవున్న రాజులపాలెం వదిలి హైదరాబాదు చేరుకున్నారని ఆయన గుర్రప్పందాలని, వేశ్యలకి, ఆస్తిని చాలావరకు తగలబెట్టేసారని అలాంటి స్థితిలో జగన్నాధరావుగారు ఎదిగివచ్చి తిరిగి ఆస్తిని నిలబెట్టారని బంధువుల్లో చెప్పుకోగా వాసవి చాలాసార్లు విన్నది.

వాసవికి తండ్రి తెలివితేటల మీద అపారమైన నమ్మకం ఉంది. డబ్బు విషయంలో ఆయనకి పిసినారి అనే పేరుంది. ఆయన తండ్రితరంలో చేసిన మితిమీరిన ఖర్చుని పూర్తిగా బంద్ చేశారనే చెప్పాలి. పనీపాటలేకపోయినా బడాయికోసం పదిమంది పనివాళ్ళని చేర్చి ఊరికే మేపడం డాబుసరికిపోయి ధానధర్మాలు చేయటం విలాసాల కోసం డబ్బుని తగలెట్టడం – ఆయనకి సుతరామూ గిట్టదు.

ఆ విషయంలో ఆయన స్నేహితులు జోక్ చేస్తున్నట్లుగానే హేళన చేసేవారు.

"నీ తాత పరువు తీస్తున్నావు కదోయ్ జగన్నాథం, రావు బహదూర్ వంశంలో పుట్టి పదివేలు డొనేషన్ యివ్వడానికి ప్రాణం పోయినట్లు ముఖం పెడ్తావ్?" అనేవారు.

ఆ మాటలకి జగన్నాథరావుగారు సీరియస్ అయ్యేవారు కాదు.

పైగా నవ్వుతూ "ఆయన ఆస్థికి వారసుణ్ణి కానప్పుడు ఆయన దానధర్మాలకి నేనెలా బాధ్యుణ్ణి అవుతాను. ఇదంతా నా స్వార్జితం. దీన్ని ఆయనలా ఎలా తగలబెట్టగలను" అనేవారు.

ఆయన జాగ్రత్త ఒక్కొక్కసారి వాసవికి కూడా చిరాకు తెప్పించేది. "నువ్వు చాలా గొప్పవాడివే డాడీ. ఒప్పుకుంటాను కానీ మరీ అంత పిసినారిగా పేరు తెచ్చుకోవడం దేనికి? ఇంత ఆస్తి ఎవరికోసం? నువ్వూ నేనేగా. కొంచెం డొనేట్ చేస్తే నీ సొమ్మేం పోతుంది?" అంటూ ముద్దుగా విసుక్కునేది.

"నీకు తెలియదు బేబీ. డబ్బు సంపాదించడం కూడా ఒక జూదంలాంటిది బిజినెస్ పైకి ఎక్కిస్తున్నట్లే ఎక్కించి మనకి తెలియకుండానే క్రింద పడేస్తుంది. ఆ రోజు ఈ రోజు నవ్విన వాళ్ళెవరూ ఒక్క పైసా సహాయం చెయ్యరు. ఇలాంటి వాళ్ళ మాటలు నమ్మే మా నాన్న ఉన్నదంతా నాశనం చేసారు. ఒక జమిందారు కొడుకుగా విలాసంగా పెరిగిన నాకు యుక్తవయసొచ్చేటప్పటికి తెలిసిన నిజం ఏమిటో తెలుసా? మా ఆస్తి మొత్తం దావాలో ఉందని మేము ఓడిపోవడం ఖాయమని. ఆ మాటవిని మా నాన్న హార్ట్ ఎటాక్ వచ్చి మంచి మెక్కారు. అప్పటికే నా వివాహమయ్యింది మీ అమ్మ గర్భిణీ నువ్వింకా పుట్టలేదు. తప్పించుకు పారిపోదామన్నా వీలుకాచి ఇరకాటంలో నేను చివరకు మీ అమ్మే ధైర్యం చెప్పి తనే వంటిమీద నగలు నాకిచ్చేసి ఏదైనా బిజినెస్ చేయమంది. మీ అమ్మనగలంటే సామాన్యమైనవి కావు. వాటిని అమ్మి ఒక ముస్లింతో కలిసి బిజినెస్ చేసాను. ఇద్దరం కలిసి మలేషియా, హాంకాంగ్ మొదలైన ఐలాండ్సు చాలా తిరిగాం. పాప అతను ఒకసారి సముద్రంలోనే చనిపోయాడు. సరే ఆ సంగతి వదిలేయ్. ఇంతకూ యిదంతా ఎందుకు చెబుతున్నానంటే డబ్బుని నీళ్ళలా ఖర్చు పెట్టడం తేలిక. కానీ సంపాదించడం."

"సో డిఫ్‌కల్ట్" అంటూ అతని మాటను పూర్తిచేసి నవ్వేది వాసవి.

అలా.. అలా ఏవేవో జ్ఞాపకాలు. నిమిష నిమిషానికీ తనకీ తండ్రికీ మధ్య పెరిగిపోతున్న దూరం. ఆయన కోసం యింటి దగ్గర ఆత్రంగా ఎదురు చూసేవాళ్ళెవరింక?

అనంత్..!! అనంత్ అంటే డాడీకి చాలా యిష్టం. ఆ యిష్టం కూడా వ్యాపారంలాంటిదే ఏది ఏమైనా అనంత్ అతన్ని కాస్త కనిపెట్టి చూస్తే ఏమో మరి? అతను తన పెళ్ళికి కూడా రాలేదు. ఎలా వస్తాడు? అతని నీడ కూడా యింటిమీద పడడానికి వీల్లేదని తను శాసించిందిగా. అందుకే తండ్రి అతన్ని పెళ్ళికి కూడా పిలవలేదు. తన పిచ్చిగాని అతను తన కళ్ళెదుట తిరుగుతుంటే తను నిలవరించుకోగలదా? అతనంటే తనకున్న ప్రేమ అంత త్వరగా తుడిచిపెట్టుకుపోయేదేనా?

వాసవి తల విదిలించుకుంది. అనంత్ ఎందుకిలా తన ఆలోచనల్లో చొరబడటం. ఆమెకు అయిష్టంగానే ఉంది. తన జీవితం మరో మలుపు తిరిగిపోయింది. అతని ప్రస్తక్తి ఇక అనవసరం.

"ఏం దిగులుగా ఉందా?"

వాసవి తల తిప్పి భర్తవేపు చూసింది. అతని కళ్ళు నవ్వుతున్నాయి. పెళ్ళయ్యాక భర్తనంత పరిశీలనగా చూడటం వాసవికి అదే మొదటిసారి. చూడగానే తెల్లగా బాగుంటాడనిపించినా ఆ అందంలో ఏదో తెలీని వెలితి. ఆ కళ్ళు ఆలిచిప్పల్లా ఆ చూపుల్లో ఆకర్షణకన్నా తనకు కావాల్సిన దానికోసం వెదుకులాటే ఎక్కువ. తనకు కావాల్సిన దాన్ని నిర్భయంగా చూడటం అలవాటులేని వాటిల్లా పక్కచూపులు.

మనిషి కదలకుండా తలతిప్పకుండా కేవలం కంటిలోని నల్లగుడ్డుని మాత్రమే తిప్పటం విచిత్రంగా ఉంది వాసవికి.

అతని జుట్టు అనంత్ జుట్టులా వత్తుగా ఉంగరాలు తిరిగిలేదు. చాలా సాఫీగా అంటించినట్లు వెడల్పయిన పుర్రెకి వేసిన రంగులా ఉంది. అతన్ని చూస్తే తయారు విషయంలో చాలా జాగ్రత్త తీసుకుంటాడనిపిస్తోంది. గ్రే కలర్ సూటులో కదిలితే ఎక్కడ బట్టలు నలిగిపోతాయో అన్నట్లు బిగుసుకు కూర్చున్నాడతను. కొంచెం మోటుగా వున్న ఆడమనిషికి మగవేషం వేసినట్లు. తన ఊహకు తనే నవ్వుకుంది వాసవి. ఇదేమిటి? తను తన భర్తని యిలా ఊహిస్తోంది. పెళ్ళి పందిట్లో తన ఫ్రెండ్స్ అందరూ యితన్ని నవమన్మధుడన్నారే. ఇంతటి అందగాడిని పొందినందుకు తనకి కంగ్రాట్స్ చెప్పారే. మరి ఇతనొక సున్నపు ముద్దని మలిచినట్లు, మగాడికుండాల్సిన కట్స్ కళ్ళలో చురుకుదనం లేనట్లు కనిపిస్తాడేమిటి? అనంత్‌ని ప్రేమించటంవల్ల ఇతనంటే యింకా అభిమానం పెరగకపోవడంవల్ల తనకలా కనిపిస్తున్నాడేమో? ఏ భార్య అయినా తన భర్త చాలా అందగాడనే చెప్పుకుంటుంది. చెప్పుకోవటమే కాదు. ఆమె కళ్ళకు అతనలాగే కనిపిస్తాడు. లేకపోతే ఏ సంసారమూ నిలవదు. ఏ అందం పెళ్ళికి ముందు ప్రాధాన్యంగా నిలబడుతుందో పెళ్ళయ్యి యిద్దరి మధ్యా అనురాగం వెల్లివిరిసాక అదంత మసకబారుతుంది. మానసిక సౌందర్యానికున్న గొప్పతనం అదన్నమాట.

"ఏమిటిలా చూస్తున్నావ్?" అతని ప్రశ్నకి ఉలిక్కిపడి అతనివేపు చూసింది.

"అహ ఏంలేదు" అంది తొట్రుపాటుగా.

"నన్నింత పరిశీలనగా చూడ్డం యిదే మొదటిసారనుకుంటాను." అన్నాడతను.

వాసవి జవాబు చెప్పలేదు.

చేతిలోని కర్చీఫుని మడతలు పెడుతూ తలదించుక్కూర్చుంది.

"పెళ్ళికి ముందు నన్ను చూడటానికి ఒప్పుకోలేదట" తిరిగి అతనే ప్రశ్నించాడు.

వాసవి ఈసారికూడా మాట్లాడలేదు.

"పోనీ నేను చెప్పనా?" అతని ప్రశ్నకి వాసవి కళ్ళెత్తి అతనివైపు చూసింది.

"ఆడవాళ్ళకి అంత ఉదాసీనత ఎప్పుడు కలుగుతుందో తెలుసా?"

అతను కదలకుండా ఆమెను కళ్ళ చివర్లనుండి గమనిస్తూ అడిగాడు.

ఆమెలో ఉద్వేగం హెచ్చవుతోంది.

అతనేం చెప్పబోతున్నాడోనని భయం.

సరిగ్గా అప్పుడే అన్నాడతను "ఇష్టం ఒకచోట ఉండి తప్పని పరిస్థితుల్లో పెళ్ళి చేసుకోవాల్సి వచ్చినప్పుడు"

వాసవి గుండె గబుక్కున జారినట్లయింది.

గుండె లోపలి పొరల్లో జాగ్రత్తగా దాచిన రహస్యం ఇంద్రజాలం చేసి గుప్పెట్లోకి తెప్పించిన భావన.

వాసవి అతని ముఖం చూడలేనట్లు సీట్లో కుంచించుకుపోయింది.

ఇతను తన గురించి తెలిసే యిలా మాట్లాడుతున్నాడా? అనంత్‌కీ తనకీ మధ్యన నడచిన ప్రేమకథ యితనికెవరైనా చెప్పేసారా?

ఒకవేళ డాడీ.

ఛీ! డాడీ అంత తెలివి తక్కువగా ప్రవర్తించరు.

ఒకవేళ అనంతే?

వాసవి గుండె దడదడలాడింది. వాసవి అతనివేపు తలయెత్తి చూసే సాహసం చేయలేకపోయింది. ఎన్నో తీయని అనుభూతులతో నడచిన తన ప్రేమకథ మరొకరి ముందు తప్పు చేసినట్లు తలవంచుకుని సంజాయిషీ యిచ్చే స్థితి తెస్తే ఏ ఆడది జీవితంలో ప్రేమించే పొరపాటు చేయదు.

"నాకు మీ డాడీ అంతా చెప్పారు."

వాసవి గుండె దడదడలాడింది.

"ఏమని?" అంది చాలా నీరసంగా.

ఆమె ప్రశ్న ఆమె గొంతులోంచి బయటికి వచ్చి అతనికి వినిపించిందో లేదో తెలియదు.

"మీ డాడీ అంటే నీకు చాలా నమ్మకమా ప్రేమా అట కదూ నీ కళ్ళమీద మనసు మీద కూడా లేనంత. అందుకే నన్ను ప్రత్యేకించి చూడాల్సిన అవసరం లేదని ఆయన చూస్తే చాలని అన్నావట కదూ"

వాసవి హృదయపు రెక్కలపై కొన్ని టన్నుల బరువుని ఒక్క సారిగా తొలగించిన అనుభూతి. ఆమె తేలికపడ్డ హృదయంతో అతనివెపు చూసి నవ్వింది.

"మీ డాడీ మీద నీకంత విపరీతమైన ప్రేమ వుంటే నీ హృదయంలో నాకు మిగిలే స్థలం ఎంత?" అతను గుసగుసలాడుతున్నట్లు నవ్వుతూ అడిగాడు.

వాసవి కళ్ళు వాల్చుకుంది. అతను ఆమె చేతిని అందుకని మెత్తగా స్పృశించాడు. ఆమె వళ్ళు అదోలా జలదరించింది. ఆ జలదరింపునే పులకింతగా భావించి అతని ఛాతీ గర్వంతో వెడల్పయింది. సరిగ్గా అప్పుడే విమానం రన్‌వే మీద పరుగులు దీసి మీనంబాకం విమానాశ్రయంలో ఆగిపోయింది.

అడయారులో చాలా పెద్ద బంగళా అది. కొన్ని ఎకరాల స్థలంలో గుబురుగా పెరిగిన వృక్షాలు చాలావరకు ఆ మేడ సౌందర్యాన్ని ముసుగేసి దాచి దిష్టి తగలకుండా చేస్తున్నాయనిపిస్తోంది. కారు కాంపౌండులోని తోటని చాలావరకు దాటుకుని వెళ్ళి పోర్టికోలో ఆగింది.

జగదీష్ కారు దిగగానే ఒక పదహారేళ్ళ కుర్రవాడు "అయ్యగారొచ్చేసారు" అంటూ హుషారుగా పరిగెత్తుకుని కారు దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

వాసవి ఆ అబ్బాయివైపు చూసింది. విశాలమైన కళ్ళతో ఆ కుర్రాడు కూడా సరిగ్గా వాసవివైపు పరిశీలనగా చూసాడు.

"ఏవిట్రా అలా చూస్తావ్ మీ అమ్మగారు" అని నవ్వి "డిక్కీలో సూట్‌కేసులు తియ్యి" అన్నాడు జగదీష్.

వాడు వాసవి మీదనుండి చూపు తిప్పుకుని "అమ్మగారా? మరి సంగతి చెప్పరేంటండి?" అని నవ్వి కారు వెనక్కి పరుగెత్తాడు.

జగదీష్ వాసవిని కారు దిగమన్నట్లుగా చెయ్యి అందించాడు. వాసవి ఆ చెయ్యి అందుకోకుండానే కారుదిగి నిలబడింది.

"రండమ్మగారూ" సూట్‌కేసులు నెత్తిమీద పెట్టుకుని ఆ కుర్రాడి ముందు పరుగెత్తినట్లు నడిచి "ఒసే ముత్తూ ఎక్కడ చచ్చావే అమ్మగారొచ్చారు" అంటూ అరిచాడూ.

వాసవి, జగదీష్‌ని అనుసరిస్తూలోనికి అడుగుపెట్టింది. దూరంగా తోటలో మొక్కలకి మడులు చేస్తున్న మాలి ఒకసారివాళ్ళవేపు అదోలా చూసి తిరిగి తనపనిలో నిమగ్నమయిపోయాడు.

"ఓహో నీకు తెలుగొచ్చి చావుదుగా ఏం చేస్తాం?" అంటూ కుర్రాడులోని కెళ్తుంటే "శంకర్ ముత్తుని కాఫీ తెమ్మని చెప్పు" అన్నాడు జగదీష్.

శంకర్ సరేనంటూ లోనికెళ్ళాడు.

వాసవి అలసటగా అక్కడే హాల్లో వున్న సోఫాలో కూర్చుని కళ్ళు మూసుకుంది.

జగదీష్ ఆమెవైపు చుసి "అదేం, విమానంలో వచ్చినా అలసిపోయావ్? పైకి మన గదిలోకి వెళ్దాం రా!" అన్నాడు.

మనగది అన్నమాట ఆమెకు భయాన్ని కలిగించింది.

అతనితో ఒంటరితనానికి ఆమె మనసు ఉవ్విళ్ళూరటంలేదు.

అందుకే "కాస్సేపు యిక్కడే కూర్చుందాం" అంది నెమ్మదిగా.

"ఆల్‌రైట్" అంటూ అతను ఎదురుసీట్లో కూర్చుని షూలేసులు విప్పుకోసాగాడు. పదినిమిషాల్లో ట్రేలో కాఫీపాట్ కప్పులూ పెట్టుకుని ఓ ముసలమ్మ లోపలికొచ్చింది. ట్రే ఎదురుగావున్న టీపాయ్ మీద పెట్టి కాఫీకప్పు అందిస్తుంటే అప్పుడు చూసింది వాసవి ఆమెని పరిశీలనగా. చూసిన మరుక్షణం ఆమె ఒకలాంటి భయంతో మంచుముక్కల్లా బిగుసుకుపోయింది.

తారుపూసినట్లున్న నల్లని ముడతలుపడ్డ చర్మం. గారబట్టి ముందుకు పొడుచుకొచ్చిన రెండేరెండు పళ్ళు, పేలవంగా ఏ భావనని చాటిచెప్పలేని గుంటకళ్ళు, నెరసి బుట్టలాపైకి లేచిన తల వంగిపోయిన నడుం. వాసవి కప్పు అందుకోకుండా తనని అలాగే చూడ్డం ముత్తు గ్రహించినట్లుగా అదోలా చూసింది.

ఆ చూపు అర్ధరాత్రి స్మశానంలో గుడ్లగూబ చూపులా.

"ఆవిడ మన వంటమనిషి పేరు ముత్తు. వంట బ్రహ్మాండంగా చేస్తుంది తెలుగురాదు" అన్నాడు జగదీష్ కాఫీ సిప్ చేస్తూ వాసవి మనసు గ్రహించినవాడిలా.

వాసవి ఆ సమర్ధింపు నచ్చనిదానిలా ముఖం వెగటుగా పెట్టి కాఫీ త్రాగడానికి ప్రయత్నించింది. ఆమెకు గుటకపడలేదు. కాఫీ కాలకూట విషంలా తోచింది. ముత్తు వంటని మెచ్చుకుంటున్న భర్తపట్ల కోపంకూడా వచ్చింది. ఒకరిమీద అకారణంగా ద్వేషం పెంచుకోకూడదని రూపంచూసి గుణం అంచనా వేయడానికి ప్రయత్నించడం పొరబాటని వాసవికి కూడా తెలుసు. కానీ తెలిసిన నిజాన్ని జీవితం పొడవునా తనకి తారసపడ్డ అపార్ధాలూ అసూయలు యుద్ధాలు రగిలి ఉండేవికావు. అందుకే వాసవి కూడా పొరబడింది.

జగదీష్‌కి అమృతంలా అద్భుతంగా అనిపించిన కాఫీ వాసవి పాలిట విషతుల్యమైంది.

వాసవి తక్కున కప్పు టీపాయ్ మీద పెట్టేసింది. ఆ రోజునుండి ఆమె పెట్టే భోజనం తినాలనే తలంపురాగానే ఆమె వళ్ళు వంటిమీద జరజరా నల్లత్రాచు పాకినట్లుగా జలదరించింది.

జగదీష్ భార్య ముఖంలోకి చూసి "కాఫీ నచ్చలేదా?" అన్నాడు.

వాసవి తలయెత్తి అతనివైపు చూసి ఊరుకుంది.

"పద మేడమీద నీగది చూపిస్తాను" జగదీష్ ఎర్రటి కార్పెట్ పరచిన మెట్లమీదుగా పైకి వెళుతుంటే అతన్ని నిరుత్సాహంగా అనుసరించింది వాసవి.

వాసవికి ఆశ్చర్యంగానీ, భయంగానూ వుంది మేడ చూస్తూంటే. ఆమెకు మేడలు, ఐశ్వర్యం క్రొత్తవికావు. కాని దరిదాపు తన మెడకి నాలుగురెట్లు పెద్దగా ఉంది. అందులో ఇంకెవ్వరూ లేకపోవడం మరీ బాధగా ఉందామెకు. అతనికి తల్లీ తండ్రీ ఎవ్వరూ లేరా? వాసవికి అడగాలనిపించినా అడగలేక పోయింది. అతను తన తండికి అన్నీ చెప్పేవుంటాడు. తనే ఒకలాంటి నిర్లిప్తతో పెళ్ళికొడుకు విషయాలేవీ పట్టించుకోలేదు. అందుకే తనకి కొత్త పెళ్ళికూతురికి లభించే స్వాగతం దొరకలేదు. ఈ పనివాళ్ళతో ఇంత పెద్దింట్లో తను ఉండాలంటేనే భయంగా వుంది వాసవికి. ముఖ్యంగా ఆ ముత్తు. దాన్ని మాన్పించి క్రొత్త వంటమనిషిని చూడమని చెప్పాలి.

"ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు? మీ డాడీ గుర్తొస్తున్నారా?" జగదీష్ మాటకి ఈ లోకంలోకి వచ్చింది వాసవి.

అతను ఆమెకు గది చూపించాడు. విశాలమైన ఆ గదిలో అడుగుపెట్టి జైల్లోకి వెళ్ళినట్లుగా నిలబడింది వాసవి.

"రెస్టు తీసుకో. నేను కొన్ని అవసరమైన బిజినెస్ వ్యవహారాలు చూసుకోవాలి. బహుశా సాయంత్రానికి కానీ రాను. నీకేం కావాలన్నా శంకర్‌ని పిలు. భోంచెయ్యటం మానెయ్యకు" అంటూ అతను వెళ్ళి పోతుంటే తేలిగ్గా గాలి పీల్చుకొంది వాసవి. ఆమె మెల్లిగా వెళ్ళి మంచం మీద పడుకుని కళ్ళు మూసుకుంది.

4

**చీకటి పడుతోందంటే** వాసవిలో ఏదో చెప్పలేని ఉద్వేగం. ప్రొద్దుటనుండి ఆ మేడ దక్షిణభాగం బాల్కనీలో నిలబడి చిరుగాలికి ఊగుతున్న ప్రతి ఆకునూ పరిశీలనగా చూసి, చూసి విసుగు పుట్టింది వాసవికి.

మేడకి రేర్ ఎండ్ అది. కొబ్బరి చెట్లతోనూ, సపోటా, మామిడి, పనస వృక్షాలతో సూర్యున్ని లోనికి రానీయనంత దట్టంగా అలుముకుని ఉన్నాయి. ఆకు ఆకు మధ్యనుండి లోనికి దూరాలని శతవిధాల ప్రయత్నిస్తున్న సూర్యకిరణాల్ని వెనక్కి తిప్పికొడ్తున్న వీరుల్లాంటి చెట్లు అది ఉదయమో సాయంత్రమో తెలీని గుడ్డికాంతి. వాసవికి ఆ వాతావరణం మతిపోగొడ్తుంది? వాసవి అలా ఎన్నిగంటలు నిలబడిందో. భోజనానికి రమ్మని ఎన్నిసార్లు ముత్తు పిలిచినా కసురుకుని పంపేసింది.

ఆమెకు చెప్పలేనంత నీరసంగా ఉంది. అయినా ముత్తుచేతి వంట తినాలనిలేదు. వాసవి అలా ఒంటరిగా నిలబడి ఆ చెట్ల ఆకులోంచి కనబడని ప్రపంచాన్ని చూడాలని ప్రయత్నించి విఫలురాలయి నిస్సత్తువగా కళ్ళుమూసుకుంది.

కొద్దిగా కాళ్ళీడుస్తూ నడుస్తోన్న సవ్వడి.

వాసవి ఉలిక్కిపడ్డట్లు కళ్ళు తెరిచింది. ఎదురుగా ముత్తు. నవ్వుతుంటే నల్లని ముఖంలో ఎర్రనినోరు వికృతంగా తన మింగడానికొస్తూన్న కొండచిలువలా. వాసవి కెవ్వున అరిచింది.

"బయమిల్లేమ్మా" అంటూ ఆ ప్రక్కనే వున్న పొడగాటి కర్రనందుకుంది ముత్తు.

ముత్తు కర్రతో దగ్గరకొస్తుంటే నాలిక పిడచగట్టుకుపోయింది వాసవికి. భయంతో కళ్ళు గట్టిగా మూసుకుంది వాసవి.

ముత్తు చెయ్యి వాసవి భుజాన్ని గట్టిగా పట్టుకుంది. ఆమె స్పర్శకి వాసవి తనని బలమైన పాము పెనవేసినట్లుగా నిలువెల్లా వణికిపోయింది. ఆమె పెట్టిన కేక ఆమె గొంతులోనే నిశ్శబ్దంగా నిబిడీకృతమైపోయింది. ముత్తు త్రోసిన తోపుకి వాసవి విసిరేసినట్లు ఒక ప్రక్కకు ఒరిగిపోయింది. వెంటనే కర్ర చప్పుడు. వాసవి అప్రయత్నంగా తలకి రెండు చేతులు అడ్డంగా పెట్టుకుంది.

"ఎన్నమ్మా అదు? బయమిల్లేమ్మా" (ఏమిటమ్మా అది. భయంలేదు) అంటూ ఆమె వాసవి చేతులు పట్టుకుంది.

వాసవి భయంగా కళ్ళు తెరిచింది.

ఆమె గుండెలింకా ఎగసిపడుతూనే ఉన్నాయి. ముత్తు వాసవికి చాలా దగ్గరగా నిలబడి నవ్వుతోంది. వాసవి చీదరించుకుంది.

ముత్తు అదేం గమనించకుండా తను చంపిన పాముని కర్రతో పక్కకినెట్టుతూ ఇంగేచెడియ లింద్ పాంబుంగోవరుం భద్రమా ఇరుంగోమ్మా (ఇక్కడ చెట్లనుండి పాములు వస్తాయి జాగ్రత్తగా ఉండాలమ్మా) అంది.

వాసవికి ముత్తు మాట్లాడింది అర్థంకాలేదు.

ఆమెకు కొద్దిగా తమిళం తెలుసు. అదికూడా రాజామణి కూతురు రాధిక దగ్గర నేర్చుకుంది సరదాగా. చాలా నెమ్మదిగా విడదీసి మాట్లాడితేనే అర్థం అవుతుంది.

కానీ అక్కడ నేలమీద చచ్చిపడివున్న పసరిక పాముని చూసాక ముత్తు కర్ర తీసుకున్నది దేనికో ఆమెకు తెలిసొచ్చింది.

ఆమె గుండె కాస్త తేలికపడింది.

ముత్తు తనని హత్యచెయ్యడానికి ప్రయత్నించలేదన్న విషయం బోధపడేసరికి ఆమెకి అంతక్రితం ముత్తుమీద పేరుకున్న అసహ్యం కొద్దిపాటగా కరిగినట్లనిపించింది.

క్ర మూలకి పడేసి "సాపాటికి రామ్మా! " అంది ముత్తు.

వాసవికి అర్ధమయింది.

"నాకేం వద్దు నువ్వుపో" అంది చిరాగ్గా.

ముత్తుకి వాసవి మాటలు అర్థంకాకపోయినా పో అన్న చివరిమాటకి అర్థం తెలుగులోనూ తమిళంలోనూ ఒకటేకాబట్టి మెల్లిగా అక్కణ్ణించి కదిలింది. కొద్దిగా గూనితో వంగి నడుస్తోన్న ముత్తుని అలాగే చూస్తూ నిలబడింది వాసవి.

ఆమెలోని కంపరం యింకా పోలేదు.

మరో పదినిమిషాల్లో శంకర్ పరిగెత్తుకొచ్చి "మీరు భోంచేయలేదంటగా అమ్మగారూ.. ముత్తు చెప్పింది" అన్నాడు వగరుస్తూ.

వాసవి వాణ్ణి పరిశీలనగా చూసింది. వాడి వయసు పదహారూ పదిహేడు మధ్య ఆ వయసులో మగపిల్లలు తమాషాగా ఉంటారు. అంతవరకూ సన్నగా ఆడపిల్ల గొంతులా వుండే కంఠం గరగరలాడుతుంది. లేతగా వుండే పెదవులపై పురుషత్వాన్ని చాటి చెప్పడంకోసం అప్పుడే మొలకెత్తటానికి ప్రయత్నించే నూనూగు మీసం. పొడవుకు తగ్గ వెడల్పు పెరగని ఛాతీ. కళ్ళలో యింకా వీడని అమాయకత్వంతో కూడుకున్న మెరుపు.

"నాకు ఆకలిలేదులే" అంది వాసవి నవ్వుతూ. వాణ్ణి చూడగానే ఎందుకో చాలా ఆత్మీయంగా అనిపించింది వాసవికి.

"అదేంటమ్మగారూ నేనప్పుడే మూడుసార్లు తినేసాను. ముత్తు ములక్కాడ పులుసు బ్రహ్మాండంగా పెట్టింది" అన్నాడు.

ముత్తుపేరు వినగానే వాసవి ముఖం అప్రసన్నంగా మారిపోయింది.

"అవునూ! ఆ ముత్తుతో మాట్లాడాలంటే నీకు భయం వేయదూ" అంది వాసవి ఆశ్చర్యంగా.

శంకర్ వాసవి ముఖంలోకి వింతగా చూసి ఆ వెంటనే పకపకా నవ్వుతూ క్రింద చతికిలపడ్డాడు.

"ఎందుకురా అంత నవ్వొస్తోంది?" వాసవి కోపంగా అడిగింది.

"మీరు పొద్దున్నుండి ఎందుకు అన్నం తినలేదో నాకిప్పుడు తెలిసిందండి మీరా ముత్తుని చూసి జడుసుకుంటున్నారన్నమాట" అన్నాడు మళ్ళీ నవ్వుతూ.

వాసవికి తనలా వాడికి పట్టుబడిపోవటం చిన్నతనంగా అనిపించింది.

దాన్ని కప్పి పుచ్చుకునేందుకు "భయంకాదు అసహ్యం" అంది గంభీరంగా.

శంకర్ తక్కున నవ్వడం ఆపుచేసి సీరియస్‌గా ముఖం పెట్టి "కానీ అది చిన్నతనంలో చాలా అందంగా ఉండేదండి" అన్నాడు.

ఈసారి నవ్వడం వాసంతి వంతయింది. విపరీతంగా నవ్వటంవల్ల వాసవి బుగ్గలు ఎర్రబడి కళ్ళలోంచి నీళ్ళొచ్చాయి.

కిలకిలా వాసవి నవ్వుతోంటే శంకర్ కూడా ఆమె నవ్వుతో శ్రుతి కలిపి "ఎందుకమ్మగారూ మీరుకూడా అలా నవ్వుతున్నారు."

"నీ దొంగ మాటలకి నవ్వకేం చేయమంటావురా" అంటూ మళ్ళీ నవ్వింది.

"నావి దొంగమాటలా?" అంటూ ఆశ్చర్యపోయాడు శంకర్.

"కావా మరి? ముత్తు చిన్నతనంలో నీకెంత వయసురా" అంది వాసవి.

"నేను దాన్ని చిన్నప్పుడు చూసానని చెప్పానేంటండి? దాని చిన్నప్పుడు ఫోటో పెట్లోంచి తీసి చూపించింది" అన్నాడు శంకర్ బుంగమూతి పెట్టి.

వాసవికి వాడి ముఖం చూస్తుంటే నవ్వొచ్చింది.

వాణ్ణి యింకా ఏడిపించాలన్నట్లుగా "అది దాని ఫోటోయేనని నమ్మకమేంటి? గొప్పకోసం అదలా చెబుతుందేమో?" అంది లాయర్‌లా.

శంకర్ కూడా అనుమానంగా ఆలోచించాడొక క్షణం. కానీ ఆ వెంటనే దాని ముక్కుమీద వుండే పురుపుడుకాయ ఆ ఫోటోలో కూడా ఉండడం గుర్తొచ్చింది వాడికి.

"లేదండి ఆ ఫోటో దానిదే" అంటూ ఆ సంగతి చెప్పాడు శంకర్.

వాసవికి ముత్తు ఒకప్పుడు అందంగా ఉండేదన్న విషయం అంగీకరించడానికి మనసు ఒప్పలేదు.

"ఆ సంగతి సరేకానీ నీకెవ్వరూ లేరా?" అంది వాసవి మాట మారుస్తూ.

"ఎందుకులేరండీ? అమ్మా నాన్నా, ఒక తమ్ముడు, ఒక అక్క ఉండేది. కానీ ఇప్పుడు లేదు." శంకర్ గొంతు అలా చెబుతున్నప్పుడు భారంగా మారింది. కన్నీళ్ళు ఆపుకోవటాన ఎర్రబారిన వాడి పెద్ద పెద్ద కళ్ళని కలవరంగా చూసింది వాసవి.

"మీ అక్క చచ్చిపోయిందా పాపం" అంది

శంకర్ మాట్లాడలేదు. తలదించుకుని నేలమీద గీతలు గీస్తూ కూర్చున్నాడు.

అంతసేపూ తుళ్ళుతూ హుషారుగావున్న వాడల్లా అలా ఒక్కసారిగా అదోలా అయిపోవటం బాధ కలిగించింది వాసవికి.

వాడికి అక్కగారి మీదవున్న ప్రేమకి సంతోషంకూడా వేసింది. తనకు తనకుకూడా అలా ప్రేమించే తమ్ముడుంటే ఎంత బాగుండేదో అనుకుంది.

"మీదేవూరు" అంది వాసవి.

నిజానికి వాళ్ళ అక్క ఏ విధంగా చచ్చిపోయిందో కనుక్కోవాలని ఆత్రుతగా ఉంది వాసవికి. కానీ ఈ విషయాలు కదిపితే ఏడ్చేటట్లున్నాడు శంకర్.

"నెల్లూరు దగ్గర పల్లెటూరు" అన్నాడు శంకర్.

"వాళ్ళందరికీ దూరంగా ఉన్నందుకు బాధగాలేదూ?" అడిగింది.

శంకర్ పెద్ద పెద్ద కళ్ళతో వాసవికేసి చూస్తూ "ఒక్కోసారి కాస్త దిగులుగానే ఉంటుందండి. కానీ అక్కడున్నప్పుడు తిండి గురించి తాపత్రయమే కానీ ఒకళ్ళ గురించి ఆలోచించే తీరికెక్కడదండీ. ఎప్పుడూ అమ్మా నాన్నా తన్నుకోవటాలు. ఆ కోపంతో మళ్ళీ మా వీపు సాపుచెయ్యడం, చీకటితోనే పొలానికెళ్ళి రాత్రివరకూ ఎద్దులా చాకిరీ చెయ్యడం ఏం సుఖం లేదండి చూడండి నా చేతులు ఎలా కాయలు కాచాయో" అంటూ అరిచేతులు చూపించాడు శంకర్.

వాడి అరచేతుల్లో బొబ్బల్లావున్న కాయల్ని చూసి వాసవి మనసు విలవిలవాడింది.

"అసలు సంగతి మరచిపొయ్యాను. మీకు హోటల్ కెళ్ళి ఏదయినా టిఫిన్ తెస్తాను డబ్బులివ్వండి" అన్నాడు.

"నాకు ఆకలిగా లేదంటున్నాగా" అంది వాసవి.

"మీరట్లనే చెబుతారు. మీరు ముత్తుని చూసి అదిరిపడుతున్నారు నాకు తెలుసు" అన్నాడు శంకర్.

వాసవికి నిజంగానే ఆకలిగా ఉంది. వాడంతగా అడుగుతున్నప్పుడు కాదనడం దేనికని లేచి పర్సులోంచి తీసి పదిరూపాయల నోటందించింది.

శంకర్ నోటు తీసుకుని విమానంలా రివ్వున మేడదిగి వెళుతున్న వాడివంకే చూస్తూ నిలబడింది వాసవి.

"ఈ రోజు నువ్వు భోంచేయలేదట" జగదీష్ వాసవి పడుకున్న గదిలోకొస్తూనే అడిగాడు.

వాసవి గబుక్కున లేచి కూర్చుంది.

"ఎందుకు లేస్తావు? పడుకో" అంటూ అతను ఎదురు సోఫాలో కూర్చున్నాడు.

శంకర్ గబగబా వచ్చి జగదీష్ కాళ్ళదగ్గర కూర్చుని బూట్ విప్పి సాక్సులాగి వాసవివైపు చూసాడు.

వాసవి వాడివైపు కోపంగా చూసింది.

వాడు భయపడకపోగా వస్తూన్న నవ్వు ఆపుకుంటున్నట్లు ముఖం పెట్టి "ఏం చెయ్యమంటారండి? మీరు ఎంత చెప్పినా భోంచెయ్యడంలేదు. అందుకని అయ్యగారికి నేనే చెప్పేసాను" అన్నాడు సంజాయిషీగా.

"గొప్ప పని చేసావ్" అంది వాసవి కోపంగా.

జగదీష్ వాసవి వైపు చూసి నవ్వుతూ "పర్వాలేదు. సమయం వస్తే నువ్వూ గట్టిగానే మాట్లాడతావన్నమాట" అన్నాడు.

వాసవి అతని మాటలకి సిగ్గుపడ్డట్లుగా తలదించుకుంది.

"ఇంతకీ నువ్వెందుకు భోంచెయ్యలేదో చెప్పనేలేదు" అడిగాడు జగదీష్.

వాసవి జవాబు చెప్పలేదు.

"నే చెప్పనాండీ?" అన్నాడు శంకర్ వాసవివైపు బెదురు చూపులు చూస్తూ.

వాసవి వాడివైపు సీరియస్‌గా చూసింది.

"ఎందుకు వాణ్ణలా చూపులతో బెదరగొడ్తావ్? వాడు చెప్పకపోతే నువ్వు భోంచేసావని నేను అనుకునేవాణ్ణి అన్నాడు" జగదీష్ బట్టలు మార్చుకుంటూ.

అయ్యగారిచ్చిన భరోసాతో ధైర్యం వచ్చేసింది శంకర్‌కి.

"మరేమో...మరేమో... అమ్మగారండీ ముత్తు లేదండీ ముత్తు దాని వాలకం చూసి జడుసుకుని అన్నం తినటం లేదండి" అంటూ కిసుక్కున నవ్వేశాడు శంకర్.

వాడి మాటలకి జగదీష్ కూడా ఫకాల్న నవ్వి వాసవివైపు చూసాడు. వాసవికి వాళ్ళిద్దరూ అలా నవ్వుతుంటే అవమానంగా అనిపించింది. ఆమె కళ్ళు రోషంతో ఎర్రబడ్డాయి.

పరిస్థితి గ్రహించినవాడిల జగదీష్ శంకర్ వైపు చూసి "నువ్వెళ్ళి అమ్మగారికి ఫ్రిజ్‌లో పళ్ళు తీసుకురా" అన్నాడు.

శంకర్ రివ్వున బయటకి పరిగెత్తాడు.

తల దించుకుని దుప్పటికొసల్ని నలుపుతూ నిలబడ్డ వాసవికి దగ్గరగా నడిచాడు జగదీష్.

అతను తనకి దగ్గరగా వస్తుంటే వళ్ళు ఝల్లుమంది వాసవికి. వంట్లో నరాలన్నీ బిగుసుకుపోయినట్లు నిలబడింది. అతను ఆమె రెండు భుజాలమీద చేతులేసి తన వేపు తిప్పుకున్నాడు. వాసవి చలించిపోతూ అతని వేపు తిరిగింది.

"నిన్ను మీ డాడీ ఎంత అపురూపంగా పెంచారో కొంతవరకు చెప్పారు. మిగతాది నేను ఊహించుకోగలను. నిన్ను అంత బాగా చూసుకోడానికి ప్రయత్నించడం నా బాధ్యత. ఈ యింట్లో అడుగుపెట్టిన మొదటిరోజే నువ్వు ఉపవాసం ఉన్నావంటే ఆ తప్పునాది. క్రొత్త పెళ్ళికూతురిని నిన్ను ఒంటరిగా వదిలేసి నేను నా బిజినెస్ వ్యవహారాలు చూసుకోటానికి వెళ్ళిపోవాల్సి వచ్చింది. కానీ తప్పదు. కొంచెం బద్ధకించి మరొకరికి అప్పగిస్తే లక్షల నష్టం చూపిస్తారు. అందుకే నిన్ను బాధపెట్టాను కదూ వెరీ సారీ వసూ" అన్నాడతను మెత్తగా.

వాసవి త్రుళ్ళిపడ్డట్లు చూసింది.

"వసూ! వసూ!"

ఆ పిలుపు అనంత్‌ది.

ఇంకెవ్వరూ ఎప్పుడూ తన పేరుని విడగొట్టి పిలవడానికి సాహసించలేదు.

ప్రేమంటే ఏమిటో తెలియని తొలి యౌవన ప్రాంగణంలో ధైర్యంచేసి అడుగేసి తన గుండె తలుపుల్ని సున్నితంగా తట్టి తన మనసూ తనువూ పులకించిన తరుణంలో చెవిలో గుసగుసగా అనంత్ పిలిచిన మొదటి పిలుపు.

"వసూ!"

అతన్ని కాదన్నా అతన్ని అసహ్యించుకున్నా ఆ క్షణాల్ని తన జీవితంలో ఏనాటికీ మరువలేదు. కొన్ని సంఘటనలూ, సమయాలు అంతే. మళ్ళీ జీవితంలో తిరిగి పొందలేని అనుభూతులవి. ఎండకు ఎండి బీటలు వారిన బీడే తొలకరి జల్లుకి పులకరిస్తుంది. మరో ప్రాణికి జన్మనిస్తూ చావు బ్రతుకులతో పోరాడిన తల్లే తన కడుపున పుట్టిన బిడ్డని చూసి పరవశిస్తుంది. తను కన్న పూబాలల బరువుకి వంగిపోయిన మొక్కతల్లే ఆ భారాన్ని ఆనందంగా స్వీకరించి వాటిని పూసి ఆనందిస్తుంది. అంతే తొలి ప్రేమకూడా.

"ఏమిటో ఆలోచిస్తున్నావు? నీ మనసిక్కడ ఉండటంలేదు కదూ"

అతని ప్రశ్నకి "లేదు లేదు" అంది వాసవి కంగారుగా.

"ఎందుకలా కంగారుపడతావు? " అంటూ శంకర్ రావడం గమనించి దూరంగా జరిగాడు జగదీష్,

శంకర్ పళ్ళెం వాసవి ముందుంచి "తినండమ్మా" అన్నాడు ఆప్యాయంగా.

జగదీష్ ఏపిల్ ముక్కలు కోస్తుంటే వాసవి మెల్లిగా తింటోంది.

"నీకు ముత్తు చేతివంట తినటానికి యిష్టంలేకపోతే శంకర్ చేసి పెడతాడు. వాడిక్కూడా వంటొచ్చు" అన్నాడు జగదీష్.

శంకర్ జగదీష్ వైపు చూసాడు.

"మొన్న ముత్తుకి జ్వరమొస్తే రెండు రోజులు నువ్వు చేసావుగా. ఎంత బాగ చేసాడనుకున్నావ్ వసూ నువ్వు చాలాబాగా యిష్టపడతావ్" అన్నాడు జగదీష్ నవ్వుతూ.

శంకర్ కూడా నవ్వేసి "అవునండమ్మగారు నాకూ వచ్చు. కానీ మీకు నచ్చుతుందో లేదో మరి" అన్నాడు.

"తప్పకుండా నచ్చుతుంది ముత్తులా లేవుగా నువ్వు" అన్నాడు జగదీష్.

"ముత్తుని మానిపించెయ్యొచ్చుగా" అడిగింది వాసవి.

"మానిపించెయ్యొచ్చు కానీ దానిదొక జాలికథ. దానికి నా అన్నవాళ్ళెవ్వరూ లేరు."

"అంత జాలిగా అనిపిస్తే దాన్ని ఊరికే ఉంచుకుని వేరే వంట మనిషిని పెట్టుకోవచ్చుగా" అంది వాసవి మళ్ళీ.

"నువ్వు తెలివిగానే ఆలోచిస్తావ్. కానీ ముత్తుకి చాలా అభిమానం. తన చేత ఏ పనీ చేయించుకోపోతే మర్నాడే మూటా ముల్లె సర్దేస్తుంది పైగా దానివంట బాగుంటుంది అందుకే" అన్నాడు జగదీష్.

వాసవి మరింక మాట్లాడలేదు.

## 5

శంకర్ గదిలోకి రాగానే మల్లెపూల పరిమళం గుప్పుమంది. వాసవి అటుకేసి చూసింది.

"అయ్యగారివి కార్లో మర్చిపోయానంటే తీసుకొచ్చానండి" అంటూ పూలపొట్లం బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు శంకర్.

చల్లని ఏ.సి గదిలో మెల్లగా వ్యాపిస్తోన్న మల్లెల సువాసన వాసవి మంచు ముక్కలా బిగుసుకుపోయింది. జగదీష్ ఈ పూలు ఎందుకు తెచ్చివుంటాడు వాసవి ఆలోచనల్లో ఏదో చెప్పరాని భయం. అంత చల్లదనంలోనూ ఆమె నుదుటిమీద మంచిముత్యాలు

పేర్చినట్లుగా అలుముకున్న స్వేద బిందువులు. ఆమెకి మల్లెపూలంటే చెప్పలేని యిష్టం. మల్లెపూలని, వెన్నెలవేళని ఇష్టపడని వ్యక్తులు అరుదు. వాసవిది రసహృదయం. ఆమె గుండెనిండా ఎన్నో ఆశలు ఆశయాలు. ప్రక్కవాడి సుఖాన్ని దోచుకోనంతవరకూ ఎవరికివారు హాయిగా కాలక్షేపం చెయ్యాలన్న సిద్ధాంతం ఆమెది. ఆమె మంచి ఆర్టిస్టు. అందుకే ఆమెకి వసంతమన్నా కోయిల పాటన్నా ఉషోదయమన్నా పున్నమిరేయైనా, మల్లెపూలన్నా, మొక్కలన్నా చెప్పలేని యిష్టం. కాలేజీనుండి రాగానే తోటపని చేసేది.

"మాలివుండగా నీకెందుకమ్మా ఆ మోటుపనులు" అంటూ జగన్నాధరావుగారు కూతుర్ని మందలించేవారు.

వాసవి నవ్వేది.

అలా నవ్విందంటే నాకిష్టమైన పనిచెయ్యటం నేను మాననని చెప్పటమే. దానితో జగన్నాధరావుగారు మరింక మాట్లాడేవారు కాదు.

ప్రత్యూషోదయంలో తుషార శీతల పవనాల్లో మంచు బిందువులతో తడిసి తలలూగించే పుష్పగుచ్ఛాల్ని చూడటం కోసమే అన్నట్లు సూర్యోదయానికి ముందే నిద్రలేచి తోటలోని చప్టామీద కూర్చునేది.

అప్పుడప్పుడూ సుతారంగా వీచే చిరుగాలికి రాలిపడి పరిమళాలు వెదజల్లే పారిజాతాలన్నా పొగడపూలన్నా వాసవికి ప్రాణం. పూలచుట్టు ఝుంకారం చేసే తుమ్మెదల్ని, తమ మేని రంగులతో గారడీ చేసే సీతాకోకచిలుకల్ని తమాషాగా చూసేది. తూరుపు వేపునుండి పొడుచుకొస్తోన్న తొలి సూర్యకిరణపు వెలుగులో పూబాలల వంటిపై ముత్యాల్లా మెరిసే మంచు బిందువుల్ని పులకించినట్లు ఊగే చిగురాకు రెమ్మల్నీ చూడటం ఆమెకెంతో సరదా! సృష్టిలోని ప్రతి అణువుకీ అందం ఉంది. కానీ చూడడానికి కన్నులే కావాలి. ఆ కన్నులు గుండెలోనుండి తన్నుకొచ్చే రసజ్ఞతతో నిండాలి. ఆమె జీవితంలో అనంత్ ప్రవేశించే క్షణం వరకు వాసవి దినచర్య అలాగే ఉండేది. ప్రకృతి పరిశీలన, పుస్తకపఠనం, స్నేహితులే ఆమెలోకం.

ఆరోజు.. ఆరోజు..

అమ్మా మీకోసం ఎవరో వచ్చారు అన్నాడు నౌఖరు. వాసవి బెడ్ రూంలోంచి హాల్లోకి వచ్చింది. అక్కడ అతను నిలబడి ఉన్నాడు.

వాసవి అతనివంక ఎవరన్నట్లుగా చూసింది.

"మీరు అర్జెంటుగా నాతో రాగలరా?" అన్నాడతను ఏ ఉపోద్ఘాతమూ లేకుండానే.

వాసవి అతనివంక తేరపారా చూసింది.

అతని వంటిమీద బట్టలు మాసి ఉన్నాయి జుత్తురేగి ఉంది.

"మీరు..? అంది వాసవి అనుమానంగా చూస్తూ.

"నా పేరు అనంత్. అలా నా పేరు తెలుసుకున్నందువల్ల మీకంత ప్రయోజనం ఉండదు మీ డాడీ తీసుకురమ్మన్నారు." అన్నాడతను.

వాసవికి మరింత అనుమానం కలిగింది.

"డాడీ ఊళ్ళో లేరు. ఆ సంగతి తెలుసునా?" అంది వాసవి వ్యంగ్యంగా.

"తెలుసు" అన్నాడతను.

"మా డాడీ అనంత్ అనే వ్యక్తి తెలిసినట్లు ఎప్పుడూ చెప్పగా వినలేదు మిస్టర్. మీరే ఉద్దేశ్యంతో వచ్చారో నాకర్ధం కావడంలేదు. మీకు డబ్బు అవసరమయితే ఆ విషయం చెప్పండి" అంది వాసవి నిర్లక్ష్యంగా.

వాసవి మాటలకి అనంత్ ముఖం కొద్దిగా ఎర్రబడింది.

"మీ డాడీకి హార్ట్ ఎటాక్ వచ్చింది. మిమ్మల్ని చూడాలని కలవరిస్తున్నారు. ఇష్టమైతే రండి" అన్నాడతను కోపంగా.

"వ్వాట్?" అంటూ అరిచింది వాసవి కంగారుగా.

''అవును. మీ ఫాదర్‌కి ట్రెయిన్‌లో అకస్మాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చింది. సమయానికి నేనొక్కన్నే అతనితో ప్రయాణం చేస్తున్నాను వెంటనే చెయిన్‌లాగి ఏలూరు రైల్వే హాస్పిటల్లో ఎడ్మిట్ చేసాను. ఆయనకింకా స్పృహ సరిగ్గా రాలేదు. దైవికంగా స్ట్రోక్ తగ్గిపోయింది. పదే పదే ఆయన వాసవీ, వాసవీ అని కలవరించడంతో ధైర్యంచేసి ఆయన బ్రీఫ్ కేసు తెరిచి మీ ఎడ్రస్ సంపాదించాను. ఇంకా ఆయన ప్రమాద పరిస్థితి దాటలేదంటున్నారు. అందుకే ఎందుకన్నా మంచిదని మీకోసం బయలుదేరి వచ్చాను'' అన్నాడు.

వాసవి గుండె గబుక్కున జారినట్లయింది. కళ్ళల్లోకి నీళ్ళొచ్చేసాయి. నిలబడలేనట్లు వెంటనే సోఫాలో కూలబడింది.

ఆమె మనసులో ఒక ప్రక్క తండ్రి గురించి భయం. ఆందోళన. మరోపక్క అతను చెబుతున్న విషయాలు నిజం కావేమోనన్న అనుమానం.

వాసవి దృష్టి అకస్మాత్తుగా అతని చెప్పులమీద పడింది. అవి అరిగిపోయి, తెగిపోటానికి సిద్ధంగా ఉన్నాయి.

బట్టలు మాసి, తలరేగి వాసవి బుర్రలో తళుక్కున ఓ ఆలోచన మెరిసింది. వెంటనే నవ్వుతూ ''కథ బాగానే అల్లావ్. కానీ నీకో విషయం తెలియదనుకుంటా. రావు బహదూర్ జగన్నాధరావుగారు విమానంలోనే ప్రయాణం చేస్తారని, అలా వీలుకాని ప్రదేశాలకి కనీసం ఫస్టుక్లాసులో వెళ్తారని'' అంది వెటకారంగా.

అతను అర్థంకానట్లు చూసాడు.

''అతను నీ పక్క రిజర్వేషన్ లేకుండా ఆర్డినరీ సెకండ్ క్లాసులో పాపం నిలబడి ప్రయాణం చేసారా?'' అంది ప్రతిపదం విడదీసి నొక్కి పలుకుతూ.

అనంత్ ముఖం కోపంతో బిగుసుకుంది.

''డబ్బున్నవాళ్ళకి పొగరుంటుందని అనగా విన్నాను. కానీ తండ్రి చావుబ్రతుకుల్లో ఉన్నప్పుడు కూడా మీరిలా తర్కించి మీ అతి తెలివితేటలు చూపిస్తారనుకోలేదు. నేను నా స్వంత డబ్బులతో ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో ప్రయాణం చేయగలస్థితిలో లేను. ఒప్పుకుంటాను. కాకినాడ ఎరువుల ఫ్యాక్టరీలో ఇంటర్వ్యూకి ఆ కంపెనీ ఖర్చులతో హైదరాబాదునుండి బయల్దేరినమాట అబద్ధంకాదు. పైగా మీ ఫాదర్ వల్ల నేనా ఉద్యోగాన్ని పోగొట్టుకున్న విషయం మాత్రం మీరు బ్రతికున్నంత నిజం'' అతను విసురుగా తన జేబులో నలిగిన కాగితాల మడతని ఆమె మీదకి విసిరాడు.

వాసవి అప్రతిభురాలయి అతనివేపు చూసింది. అతనికళ్ళు నిప్పుకణికల్లా నిజాయితీగా మెరుస్తున్నాయి. వాసవి గబుక్కున క్రిందబడ్డ కాగితాలని అందుకుని గబగబా తిప్పింది.

వెంటనే లేచి నిలబడి ''సారీ వెరీ వెరీ సారీ. అంటూ ముందుకొక అడుగేసి జస్ట్ ఎ మినిట్'' అంటూ లోనికెళ్ళి పర్సు తీసుకుని ముందుకొచ్చింది.

''పదండి'' అంటూ  ముందుకురికినట్లు గారేజ్ వైపు పరుగుతీసి ''గెటిన్'' అంది డోర్ తీస్తూ.

అనంత్ ఆమె వైపు ఆశ్చర్యంగా చూసి ''ఏలూరు వరకు వెళ్ళాలి'' అన్నాడు అనుమానంగా.

వాసవి చిరాగ్గా చూసిందతనివైపు.

''యూ ప్లీజ్ గెటిన్ సైడ్'' అంది కోపంగా.

అనంత్ గబుక్కున కారెక్కి కూర్చున్నాడు.

ఆమె డోర్ లాక్ చేసి ఏక్సిలేటర్ నొక్కింది.

రివ్వున ట్రాఫిక్ తప్పించుకుని బాణంలా దూసుకుపోతున్న కార్లో ఓ పక్క భయంగా, మరోపక్క విచిత్రంగా తననే గమనిస్తూన్న ఆ వ్యక్తిని చూసే తీరిక, మనశ్శాంతి ఆమెకు లేవు.

ఓ పక్క తండ్రి ఏమయ్యాడోనన్న ఆందోళన ఆమెని కుదిపేస్తోంది.

కారు శరవేగంగా పరుగెత్తుతోంది. అనంత్‌కి చాలా విచిత్రంగా ఉంది. స్టీరింగ్, సీట్లు తప్ప కారుకి ఏవేం పార్టులుంటాయోకూడా అతనికి సరిగ్గా తెలియదు. అతనికి కారు లేకపోవడమేకాదు. సైకిల్ కూడా లేదు. కనీసం ఓ జత రంగుండి చిరుగులేని బట్టల్లేవు. అందుకే అనంత్ కళ్ళకి వాసవి సత్యభామలా ఎంతో ధైర్యంగా, రథాన్ని తోలుతున్నట్లు కనిపిస్తోంది. అతని కళ్ళలోని ఆరాధనని గమనించగల సమయం కాదది.

కేవలం ఆరుగంటల వ్యవధిలో కారు ఏలూరు రైల్వేస్టేషన్ చేరింది. అనంత్ చెప్పిన గుర్తులప్రకారం కారు రైల్వే హాస్పిటల్లోకి దూసుకుపోయింది. అనంత్ ముందు కారు దిగాడు. అతని వెనుక ఒకలాంటి ఉద్వేగంతో వాసవి. వార్డులోకి అడుగుపెట్టాలంటే అదోలాంటి దడ. వాసవి ఒక్క క్షణం గుమ్మం ముందే నిలబడిపోయింది. అనంత్ వెనుతిరిగి ఆమె వైపు చూసాడు. కళ్ళల్లో ఉబుకుతున్న నీళ్ళ క్రిందకి జారనీయకుండా జాగ్రత్తపడుతుందామె.

"రండి" అన్నాడు అనంత్ అనునయంగా.

వాసవి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని లోపలికి అడుగుపెట్టింది.

"నువ్వొచ్చేసావా తల్లీ" నీరసంగా తలగళ్ళకి ఆనుకుని హార్లిక్సు తాగుతున్న జగన్నాధరావుగారు కూతుర్ని చూసి సంభ్రమంగా అన్నారు.

"డాడీ" అంటూ గబుక్కున పరిగెత్తినట్లు అతని బెడ్ దగ్గర కొచ్చేసింది వాసవి.

చిన్నపిల్లలా తల తండ్రి వడిలో పెట్టి ఏడుస్తున్న వాసవిని ఊరడిస్తున్నట్లుగా వెన్ను నిమురుతూ "నాకేం ఫర్వాలేదమ్మా. నౌ అయామ్ అవుటాఫ్ డేంజర్" అన్నారు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

అనంత్ ఇబ్బందిగా నిలబడి చూస్తున్నాడు.

వాసవి కళ్ళు తుడుచుకుంది.

"నేను వెళ్ళొస్తానండి" అన్నాడు అనంత్.

జగన్నాధరావుగారు అతనికేసి చూసి ఇతను అన్నారు. వాసవి తండ్రికి జవాబు చెప్పలేదు. స్టూలుమీంచి తటాలున లేచి వెళ్ళి అతని చేతులు పట్టుకుంది. ఈ ఆకస్మిక చర్యకి అతను నివ్వెరపోయినట్లు చూసాడు.

"నన్ను క్షమించండి. నేను తొందరపాటుగా మాట్లాడి మిమ్మల్ని నొప్పించాను. మీరు సమయానికి సరైన సహాయం చేయకపోతే.. మా డాడీ మా డాడీ అయ్ కాంట్ ఈవెన్ యిమేజిన్. ద టెర్రిబుల్ ఇన్సిడెంట్ మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడంలేదు" అంది ఉద్వేగంగా.

జగన్నాధరావుగారు కూతురివైపు ఆశ్చర్యంగా చూసి "ఏమిటమ్మా యిదంతా, ఎవరతను?" అన్నారు.

అనంత్ మెల్లిగా వాసవి చేతులు విడిపించుకుని దూరంగా నిలబడ్డాడు.

డాడీ. "ఇతనే మిమ్మల్ని కాపాడి హాస్పిటల్లో జాయిన్ చేసింది. ఇతనే లేకపోతే" అంది దుఃఖాన్ని ఆపుకుంటూ.

జగన్నాధరావుగారు అనంత్ వైపు సాభిప్రాయంతో చూసి "నువ్వు నాతో నాంపల్లి స్టేషన్‌లోనే ఎక్కావు కదూ" అన్నారు నవ్వుతూ.

అనంత్ "అవును" అన్నట్లు తల పంకించాడు.

"పాపం మనమూలాన ఇతనొక ఇంటర్వ్యూ కూడా పోగొట్టుకున్నాడు డాడీ" అంది వాసవి సానుభూతిగా.

"ఫర్వాలేదు ఇంటర్వ్యూకి వెళ్ళినంత మాత్రాన ఉద్యోగం గారంటీ కాదులెండి" అన్నాడు అనంత్.

"ఏం చదువుకున్నావు బాబూ?"

"బి.కాం."

"ఈపాటి ఉద్యోగానికి కాకినాడ ఎందుకు? మన ఫ్యాక్టరీలో చేరుదువుగాని" అన్నారాయన.

వాసవి సంతోషంగా అనంత్ వైపు చూసింది. అనంత్ తలదించుకున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్? " జగదీష్ గదిలోకి రాగానే వాసవి ఆలోచనల దారం పుటుక్కున తెగిపోయింది.

గాలిపటంలాంటి గతం.. ఎగిరిపోతో.. ఎటో.

"అబ్బే ఏం లేదు" వాసవి తడబాటుగా లేచి నిలబడింది.

జగదీష్ చనువుగా వచ్చి మంచమ్మీద కూర్చున్నాడు.

"ప్రతిసారీ నువ్వలా లేచినిలబడటం నాకు బాగోలేదు. నువ్వలా అతి మర్యాదగా ప్రవర్తిస్తే నేనీగదిలోకే రావటం మానెయ్యాల్సొస్తుంది" అన్నాడతను నవ్వుతూ.

వాసవి మంచం చివరగా కూర్చుంది.

"నన్ను చూస్తే భయంగా ఉందా?"

అతని ప్రశ్నకు జవాబు చెప్పలేదు.

నిజంగానే ఆమెకు భయంగా ఉంది. అతనికీ తనకి వివాహమయ్యింది. ప్రక్కప్రక్కనే కూర్చుని హైదరాబాదునుండి మద్రాసు వచ్చారు. అంతా గంట ప్రయాణం. అంతకు మించి ఇద్దరి మధ్య ఎలాంటి చనువూ పెరగలేదు.

వివాహమయిన మర్నాడే జగదీష్ కోరిక ప్రకారం మద్రాసు ప్రయాణమవుతూంటే చుట్టుపక్కవాళ్ళు చెవులు కొరుక్కోవడం తనకు వినబడింది.

"ఇదేం విడ్డూరం. శోభనం వద్దన్నాడంట. నయం పెళ్ళికూడా దండగనలేదు. డబ్బున్నవాళ్ళు ఏం చేసినా చెల్లిపోతుంది. పెద్దవాళ్ళు పిచ్చెక్కి పెట్టలేదు. ప్రతిదానికీ మంచి ఘడియంటూ ఒకటి ఉంది. మంచీ చెడూ చూసుకోక పోవడం గొప్పతనం ఏమీకాదు. కొంపదీసి ఏమైనా కథ ఉందేమో?"

వాసవి అన్నీ వినీ విననట్లు ఉంది. ఆమెకు ఆ మాటలు ఎలాంటి బాధని, ఆందోళనని కలిగించలేదు. ఆమె మనసు లంగరులేని పడవలా ఊగుతోంది. తనకంటూ వున్న తీరం చేరదని తెలిసినపుడు ఎక్కడికి చేరినా ఒకటే అనుకునే నావికుడి మనసులా నిర్లిప్తంగా ఉందామె మనసు. అనంత్ మీద కోపాన్నయితే పెంచుకోగలిగిందే కానీ ప్రేమను యింకా చంపుకోలేకపోతున్నానని ఆమె అంతరంగానికి తెలుసు. అందుకే కారణం ఏదైనా జగదీష్‌కి అప్పుడే తను అన్ని విధాల దగ్గర కాలేదు.

తనకి తగినంత టైం కావాలి. అనంత్ తన ఆలోచనలనుండి పూర్తిగా మసకబారి పోవాలి. ఇదీ ఒకందుకు మంచిదే అని నిట్టూర్చింది వాసవి.

జగన్నాధరావుగారు గదిలోకొచ్చి వాసవివైపు చూసారు.

వాసవి ఏదో ఆలోచిస్తున్నదానిలా కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చుంది.

"అమ్మా!" తండ్రి పిలుపుకి తలతిప్పి చూసింది వాసవి.

జగన్నాధరావుగారు మెల్లిగా దగ్గరకొచ్చి పక్కనే కూర్చున్నారు. "రేపే మీ ప్రయాణం అంటున్నాడు అల్లుడు.

వాసవి తండ్రికేసి చూసింది.

అతను చెప్పాలని వచ్చిన విషయం అదికాదని వాసవికి తెలిసిపోయింది.

తనకి తల్లిలేకపోవటం పెద్ద లోపం. తల్లినోటినుండి వినాల్సిన విషయాలు కూడా తనకి తండ్రే వివరించాలి. తప్పదు.

"అల్లుడు రేపటి కార్యక్రమానికి ఒప్పుకోవటంలేదు. వ్యక్తిత్వం వచ్చిన వాళ్ళం. నాకీ తతంగం యిష్టంలేదు మీ అమ్మాయిని కూడా అడిగి చూడండి. ఆమెకూడా నన్నే సమర్ధిస్తుంది" అంటున్నాడమ్మా అన్నారు జగన్నాధరావుగారు కూతురివైపు చూడకుండా.

వాసవి తలదించుకుంది. ఆమె అతనికి మనసులోనే నివాళులర్పించింది.

నిజమే ఇద్దరు అపరిచితులు ఒకటి కావడానికి కొంత వ్యవది కావాలి. పెళ్ళి పేరుతో మూడుముళ్ళూ వేయించి ఒక గదిలో బంధించి తప్పనిసరిగా తలుపులేసి జరిపించే ఆ తతంగం సరిగ్గా ఆలోచిస్తే లైసెన్స్‌డ్ వ్యభిచారం లాంటిదే

స్త్రీ పురుషుల మధ్య సంబంధం ముందు మానసికంగా పరిణితి చెంది తర్వాత శారీరక అనుబంధంగా మారాలి. అప్పుడే ఆ సంసారంలో ఆకర్షణ. ఆనందం.

వాసవికి భర్తపై సదభిప్రాయం కలిగింది. ఆమెకు జగదీష్ అభిప్రాయం నచ్చినట్లు ముఖం చూసి జగన్నాధరావుగారు కూడా గ్రహించారు, ఆయనకి తెలుసు ఆమె అంతరంగపు పొరల్లో అనంత్ పట్ల నిజమైన ప్రేమవాహిని ఎండిపోవటానికి టైమ్ పడుతుందని. కానీ ఈ రోజు జగదీష్ చనువుగా తన ప్రక్కనే కూర్చుంటే వాసవికి చాలా భయంగా ఉంది. ఆ రోజు ఈ రోజవుతుందేమోనని. ఆమె అనుమానం నిజం చేస్తున్నట్టుగా జగదీష్ ఆమె చేతిని చేతిలోకి తీసుకుంటూ "అదేం పూలు పెట్టుకోలేదూ?" అన్నాడు.

వాసవి అతని స్పర్శకి చలించిపోయింది.

మొదటిసారిగా గండిపేట దగ్గర అనంత్ తన చేతిని స్పర్శించటం గుర్తొచ్చింది. తను బలంగా అదిమిపెట్టిన గతస్మృతులే క్షణక్షణం ఉబికి పైకొచ్చి తనని కలచి వేయటం వాసవికి ప్రాణాంతకంగా ఉంది. ఎక్కడ భర్తకి దొరికిపోతానో అనే భయం.

"ఓహో అర్ధమయ్యింది" అతను ఆమె చేతిని వదిలేసారు.

పూలదండ చేతిలోకి తీసుకుని అతను వాసవి ముఖంలోకి చూసాడు ఆమె దండవేపే అదోలా చూస్తోంది. ఆమె ముఖంలో తొలి సమాగంలో కలిగే సిగ్గుతో కూడిన భయం కనపడలేదతనికి. అతను దండవేపు చూసాడు. పూలమీద ప్రాకుతున్న పచ్చని పురుగు. అతను తటాలున దండను వదిలేసాడు.

"పురుగుని చూసా అంత భయం. చెప్పొచ్చు కదా" అంటూ నవ్వాడు.

6

**"అమ్మా మీకు ఫోన్"** అన్నాడు శంకర్ పరుగెత్తుకొచ్చి వాసవి గబగబా ఫోన్ దగ్గరికి పరుగెత్తింది.

రిసీవర్ చెవిదగ్గర పెట్టుకుని "హలో" అంది ఆత్రుతగా.

"నేనమ్మా బేబీ బాగున్నావా?" అన్నారు జగన్నాధరావుగారు. వాసవి కళ్ళు తండ్రి కంఠం విని చెమర్చాయి.

"బాగున్నాను డాడీ మీరు" అంది.

"బాగున్నానమ్మా. అల్లుడుగారు బాగున్నారా?"

"ఆఁ బాగున్నారు డాడీ" అంది వాసవి.

ఇద్దరిమధ్యా కొన్ని క్షణాల మౌనం! ఇద్దరి గుండెల్లోనూ చెప్పలేని ఆరాటం.

"బేబీ"

"డాడీ"

అవతలినుండి చిన్నగా నవ్వు.

"ఏం లేదమ్మా నువ్వు బోంచేశావా తల్లీ?"

వాసవి "లేదు డాడీ" అంది.

"ఏమిటే, నువ్వు భోంచెయ్యలేదా అదేమిటి?" అన్నారు ఆశ్చర్యంగా.

వాసవి తనతప్పు తెలుసుకుంది.

వెంటనే శంకర్ వేపు చూసింది.

"అంటే ఈ రోజు భోంచెయ్యలేదు డాడీ. నిన్న భోంచేసాను" అంది చిన్నపిల్లలా

"బాగుంది నీకక్కడా అంతా బాగానే ఉందిగా మళ్ళీ ఫోన్ చేస్తాను" అన్నారు జగన్నాధరావుగారు.

"డాడీ"

"ఏంటో చెప్పమ్మా?"

"నువ్వు భోంచేసావా?" అంది వాసవి.

"ఇంకా లేదమ్మా"

"నువ్వు టైంకి భోంచెయ్యాలి డాడీ నీకసలే ఆరోగ్యం మంచిదికాదు"

"అలాగేనమ్మా నా గురించి నువ్వేం కంగారు పడకు."

"సరే డాడీ"

"ఉంటాను బేబీ"

వాసవి రిసీవర్ హుక్‌మీద పెట్టేసి అలాగే నిలబడిపోయింది.

"అమ్మగారూ"

వాసవి ఈ లోకంలోకి వచ్చి శంకర్ వేపు చూసింది.

"భోజనం రెడీ" అన్నాడు వాడు ఒక చెయ్యి నడుం మీద ఉంచి గరిట తిప్పుతూ.

"నీ వంటా" వాసవి ఆశ్చర్యంగా అడిగింది.

"ఈ రోజు ఎవరిముఖం చూసానో?"

"నా ముఖమేనండి. నేనేగా మిమ్మల్ని నిద్రలేపింది"

"అయితే ప్రమాదం లేదనుకుంటాను" అంటూ నవ్వింది.

"ఏంటనుకుంటున్నారు నా వంటంటే? చేతులు కడుక్కుని రండి చల్లారిపోతాయి" అన్నాడు శంకర్ హడావుడి పెడుతూ.

వాసవి నవ్వుతూ వాష్ బేసిన్‌లో చెయ్యి కడుక్కుని వచ్చింది.

వాసవి టేబుల్ ముందు కూర్చుని వంటకాల కేసి చూసింది. అన్నీ ఘుమఘుమలాడుతూ చవులూరిస్తున్నాయి.

"రుచి ఏమో కాని వాసనలు బ్రహ్మాండంగా తెప్పించావురా" అంది.

"తినబోతూ రుచి అడగడం దేనికండి?" అన్నాడు వాడు గర్వంగా ప్లేట్లో వడ్డిస్తూ.

వాసవి గబగబా వాడు వడ్డించిన కూరలు రుచి చూసి కళ్ళు పెద్దవి చేసింది.

"వంట నీకింత బాగా ఎవరు నేర్పారురా?" అంది మెచ్చుకుంటూ.

"నిజంగా బాగున్నాయండీ" శంకర్ వాసవి ముఖంలోకి అనుమానంగా చూస్తూ అడిగాడు.

"బ్రహ్మాండం నేనెప్పుడూ యింత చక్కటి భోజనం రుచి చూడలేదంటే నమ్ము" అంది వాసవి భోంచేస్తూ.

"ఏదో నాకు చాతయినట్లు చేసానండి. మీకు నచ్చినందుకు థాంక్స్" అన్నాడు శంకర్.

"నీకు మర్యాదలు బాగా తెలుసురా" అంటూ వాడి యింగ్లీషుకి నవ్వి చెయ్యి కడుక్కుంది వాసవి.

ఇద్దరూ మేడమీదికి నడుస్తుండగా శంకర్ అడిగాడు.

"ఇందాక ఫోన్ చేసింది. ఎవరండి?"

"మా డాడీ" అంది వాసవి.

"అక్కణ్ణుంచి భోజనం సంగతి అడగటానికాండీ ఫోన్ చేసారు."

వాడు అమాయకంగా అడుగుతుంటే నవ్వొచ్చింది వాసవికి.

"నేను ఆయన్ని వదిలి ఎప్పుడూ ఉండలేదుగా మరి సరిగ్గా భోంచేసానో లేదోనని కంగారు పడుతూ ఫోన్ చేసారు" అంది నవ్వుతూ బాల్కనీలోని కుర్చీలో జేరబడి కూర్చుంటూ.

శంకర్ బుర్ర గోక్కుంటూ అక్కడే పక్కనే క్రిందకూలబడ్డాడు.

"రోజంతా యిలా గడపాలంటే చాలా బోరుగా ఉందిరా శంకర్" అంది విసుగ్గా.

శంకర్ అర్థంకానట్లు చూసాడు.

"తినడం పడుకోవడం తీరిగ్గా కూర్చోవటం. ఏం బ్రతుకురా యిది" అంది చిరాగ్గా.

వాడికి ఈ మాటల అర్థంకూడా బోధపడలేదు. తిండి నిద్రకి మించినవి జీవితంలో యింకేం కావాలో వాడికి అర్థంకాలేదు.

"మరేం చెయ్యాలండీ" అన్నాడు అమాయకంగా.

"ఏదైనా వ్యాపకం ఉండాలిరా నాకు ఈ ఊళ్ళో ఎవరూ తెలియదు. బయటికి వెళదామంటే భాష సరిగ్గా రాదు. వెళ్ళినా ఏం చెయ్యాలి" అంది వాసవి దూరంగా ఆకాశంలో విలీనమైన సముద్రాన్ని చూస్తూ.

శంకర్ మాట్లాడకుండా ఆమె వంకే చుస్తూ కూర్చున్నాడు.

"పోనీ తోట పనిచేద్దామా?" అంది వాసవి ఆసక్తిగా.

"మాలివున్నాడు కదమ్మా!"

"ఉంటే వుండనివ్వు మనం ఒకమూల పూలమొక్కలు పెంచుదాం బోలెడు స్థలం ఉందిగా" అంది వాసవి.

అందులో ఆనందం వాడికి అర్థంకాక పోయినా అమ్మకిష్టమైన పనిచేయటమే తన బాధ్యతగా ఒప్పుకున్నాడు శంకర్.

ఇద్దరూ మేడ దిగి క్రిందకొచ్చారు.

తోటలోని మోటుబావి పక్కగా వున్న మామిడిచెట్టు క్రింద చప్టామీద కూర్చుని ఆకులు నములుతోన్న ముత్తు వాసవిని చూసి లేచి నిలబడింది.

వాసవి ముత్తుని చూడగానే అప్రసన్నంగా మారిపోయి వడివడిగా ముందుకి అడుగులేసింది.

శంకర్ ముందుకి నడిచినట్లు నడిచి వెనక్కు తిరిగి "ముత్తూ ఈ రోజు అమ్మగారు భోంచేసారు. వంట బ్రహ్మాండంగా ఉందన్నారు. బ్రహ్మాండంగా" అంటూ నవ్వాడు.

ముత్తు గారపళ్ళు బయటపెట్టి నవ్వింది.

వాసవి చివ్వున వెనక్కు తిరిగి శంకర్ వేపు కోపంగా చూసింది.

"వంట ఎవరు చేసారు?" అంది కోపంగా.

"నేనేనండీ" అన్నాడు శంకర్ భయంగా.

"మరేం కాదు ముసలిదానికి చెప్పటం" అంది.

"దానివంట అయ్యగారు మెచ్చుకుంటారని దానికి బడాయండి. అందుకే మీరు దాన్ని అసహ్యించుకున్నారని నా వంటే బాగుంటుందని చెప్పి ఏడిపించటానికి" అన్నాడు.

"దానికి తెలుగురాదు కదరా" అంది వాసవి కాస్త శాంతించి.

"మీకులాగే కాస్త అర్థమవ్వుద్ది" అన్నాడు శంకర్.

వాసవి మాట్లాడకుండా ముందుకి నడిచింది. అక్కడ ఎడం వైపుగా చెట్లనీడ అట్టేలేని స్థలం వాసవి దృష్టినాకర్షించింది. "ఇక్కడయితే బాగుంటుంది కదూ" అంది వాసవి.

వాడు అవునన్నట్లుగా తలపంకించాడు. వాడు యిక్కడికి రాకమునుపు నెల్లూరు దగ్గర పొలం పనులు చేయటాన ఎలాంటి స్థలం మొక్కల పెంపకానికి అనువో ఎంపికచేయడం తెలుసు.

"ఏం మొక్కలు పెంచుదామండీ" అన్నాడు శంకర్ ఆశక్తిగా.

"పూలమొక్కలు, ముఖ్యంగా గులాబీలు. అవంటే ప్రాణం నాకు. మీ అయ్యగారు తోటని గురించి పట్టించుకున్నట్టు లేదు. అందుకే ఏనాటివో పళ్ళవృక్షాలేగాని సరైన పూలతోటలేదు" అంది వాసవి.

శంకర్‌కి కూడా ఆ ఆలోచన నచ్చింది.

వాసవి స్థలాన్ని నాలుగువేపులా పరీక్షగా చూసింది. ఆ స్థలం సమతలంగా, చదరంగా బాగుంది. అంతకు ముందురోజు వర్షం పడటాన నేల మెత్తగా కాలితో నొక్కితే గుంటలు పడుతోంది. స్థలానికి మధ్యగా బలహీనంగా ఎదగలేనట్లున్న మామిడిచెట్టుపై పడిందామె దృష్టి. ఆ చెట్టు వయసు ముదిరిన పొట్టిమనిషిలా గిడసబారి కళావిహీనంగా ఉంది. అది పెరగదు సరికదా మధ్యలో వుంటే మిగతా మొక్కలకి కూడా దాని చీడ వ్యాపించడం ఖాయం అనుకుంది వాసవి.

ఆ వెంటనే "శంకర్, ఈ చెట్టు నరికేద్దాం గొడ్డలి తీసుకురా" అంది.

"అలాగేనమ్మా" అంటూ శంకర్ మేడవైపు దౌడు తీసాడు.

వాసవి చుట్టూ చూస్తూ నిలబడింది.

సరిగ్గా అప్పుడే చెట్ల ఆకులు కదలటం వలన చొచ్చుకు వచ్చిన సూర్యకిరణపు కాంతిలో తళుక్కుమంటూ మెరిసిందొక రాయి.

వాసవి అనాసక్తంగా చూసిందటు . మళ్ళీ సన్నటిమెరుపు అందులోంచి విశ్లేషణ పొందుతున్న సప్తవర్ణాలు. వాసవికి తన రవ్వల నెక్లెస్ గుర్తొచ్చి నవ్వొచ్చింది.

పనికిమాలిన రాళ్ళుకూడా వెలుగు కిరణం సోకినపుడు ధగధగలాడటం ఆమెకి నవ్వుగా ఉంటుంది.

ఆమెకి చిన్నప్పటి సంఘటన గుర్తొచ్చింది. ఒకసారి జగన్నాధరావుగారు కారులో విజయవాడ పెళ్ళికి వెళుతున్నారు. రాత్రి సమయం. దారిలో ఒక చోట బ్రిడ్జి ఒకటి నిర్మాణంలో ఉంది. బ్రిడ్జి యూజ్ అండర్ కన్స్ట్రక్షన్ టేక్ డైవర్షన్ అని బోర్డు పెట్టివుంది. డేంజర్ లైట్లని చూసి కారు మట్టిరోడ్డుమీదకి మళ్ళించారు జగన్నాధరావుగారు కారు చతికిలపడి దేకుతున్నట్లు అటూ యిటూ ఊగుతూ వెళ్తుంటే బయటకి చూసింది వాసవి.

వెన్నెల పాలధారలా కురుస్తోంది. వాసవి దృష్టి అక్కడ కుప్పగా పోసిన గ్రానైట్ చిప్స్ మీదపడింది.

"డాడీ. డైమండ్స్" అంది వాసవి గట్టిగా.

జగన్నాధరావుగారు కారుని డైవర్షన్ రోడ్డునుండి మెయిన్ రోడ్ ఎక్కిస్తూ "ఎక్కడా?" అంటూ నవ్వారు.

వాసవి గ్రానైట్ మెటల్‌వైపు వ్రేలు పెట్టి చూపించింది. వెన్నెల కాంతిలో రకరకాల కాంతులీనుతున్న ఆ రాళ్ళని చూసి ఓ క్షణం నిజమేననిపించింది జగన్నాధరావుక్కూడ.

ఆ రోజు ప్రొద్దుటే డైమండ్ నెక్లెస్ వాసవి చేతికిస్తూ "జాగ్రత్త బేబీ చాలా ఖరీదు" అన్నారు.

వాసవి ఒక్కసారి తన మెడలోకి చూసుకుంది. ఆ మెరుపుకి ఈ కాంతికి వున్న తేడా ఏమిటో ఆమెకి ఆనాటికి ఈనాటికీ కూడా అర్ధంకానిది. రెండూ వెలుగు సోకితేనే మెరిసేటప్పుడు వీటికింత ప్రాధాన్యత యిచ్చి పైన కూర్చో బెట్టడం ఎందుకో అనుకున్నది చిన్నపిల్లలా. ఆ సంఘటన గుర్తురాగానే వాసవి నవ్వేసింది పైకే. ఆమె హుషారుగా అడుగులు వేసి ఆ మెరుస్తోన్న రాయిని చేతిలోకి తీసుకుని విసరబోయి ఏదో గుర్తొచ్చిన దానిలా దాన్ని పరీక్షగా చూసింది.

అది అయిదురాళ్ళ ముక్కుపుడుక. వాసవి ముక్కుపుడకని పరీక్షగా చూసింది. మధ్యలో నీల రాయి. ఎవ్వరోకాని అలా రవ్వల మధ్య నీలాన్ని యిమిడ్చి పెట్టుకోరు. ఎవరిదయి ఉంటుందో వాసవి దాన్ని తిప్పి తిప్పి చూసింది.

ఇంతలో శంకర్ గొడ్డలితీసుకుని రివ్వున పరుగెత్తుకొచ్చాడు.

"చూడరా ఇక్కడ ముక్కుపుడుక దొరికింది" అంటూ వాడికి చూపించింది వాసవి.

శంకర్ దాన్ని గబుక్కున అందుకుని చూసి ఆలోచనలో పడ్డాడు. వాడి ముఖం అదోలా అయిపోయింది.

కళ్ళు అరుణిమ దాల్చేయి.

"నీకు తెలుసా? ఇది ఎవరిదో?" వాసవి ప్రశ్నకు శంకర్ తడబడ్డాడు.

"నాకు..నాకు తెలియదండీ" అన్నాడు. వాసవి వాడివేపు ఆశ్చర్యంగా చూసింది.

"ఎందుకురా ఏడుస్తున్నావు?" వాసవి వాడి భుజాలు పట్టుకుని అడిగింది.

"లేదండీ ఏడవటంలేదు. కళ్ళలో నలుసు పడింది" అంటూ కళ్ళు తుడుచుకుని "ముత్తూ ఇదెవరిదో తెలుసా?" అన్నాడు గబగబా ముత్తు దగ్గరికి పరిగెత్తి సైగచేసి అడుగుతూ వాడి ప్రవర్తనలో ఏదో మార్పు గమనించింది వాసవి.

ముత్తు ఆ ముక్కుపుడకను దీక్షగా చూసింది.

భావరహితమైన చూపులతో కాస్సేపు వాసవివైపు, శంకర్‌వైపు చూసింది.

"ఇంద ముక్కుత్తి అయ్యవడియ మొదల్ పొండాట్‌ది" అర్ధంకాక వాసవివైపు చూసాడు.

వాసవి ఆ మాటకి అర్ధం ఆలోచిస్తూ "సరే నువ్వొచ్చి చెట్టు నరుకు" అంది శంకర్‌తో.

శంకర్ చెట్టుమీద గొడ్డలితో దెబ్బకొట్టాడు.

ముత్తు రివ్వున పరిగెత్తుకొచ్చి శంకర్ చేతిలో గొడ్డల్ని లాక్కుంది.

వాసవి, శంకర్ ఆమె వేపు ఖంగుతిన్నట్లు చూసారు.

"చెడియ అడికాదింగో అంగాయిరుంగు నందడుంగో" వగరుస్తూ.

ఆమె ఆకారం చూసి యిద్దరికీ భయం వేసింది. ముత్తు ఏదో పూనినట్లు వణికిపోతోంది.

వాసవికి ముత్తు తమిళం అర్ధంకాక నివ్వెరపోతున్నట్లు "ఏమిట్రా అంటోంది?" అంది వాసవి కోపంగా.

"చెట్టు నరకొద్దంటుందమ్మా" అన్నాడు శంకర్.

శంకర్‌కి కూడా సరిగ్గా తమిళంరాదు. వాడు ఈ ఊరొచ్చి ఆరునెలలలోపే. వాడి పనికూడా ఆ ప్రహరీ గోడలమధ్యే కావడంతో వాడు నేర్చుకున్నదంతా ముత్తు, మాలి దగ్గర మాత్రమే. ఆ మాటలన్నీ చాలావరకు పనులకి సంబంధించినవే.

ముత్తు అలా తమ పనికి అడ్డుపడటం శంకర్‌కి ఏమాత్రం నచ్చలేదు.

వాడు దాన్ని పక్కకుతోసి "ఎందుకు కొట్టకూడదు."

"నీకెందుకుపో పైత్యకారిపాటి" అని వచ్చీరాని తమిళంలో ముత్తుని పక్కకి తోసి మళ్ళీ చెట్టుని నరకసాగాడు

ముత్తు మళ్ళీ శంకర్‌కి అడ్డంపడింది. "అయ్యా వడియా మొదల్ పొందాటియే సావడిచ్చిటాంగన్ అవళ చెడి అడియల్ పొదచ్చి వెచ్చాంగో" అంటూ మళ్ళీ శంకర్ చేతిలో గొడ్డలి లాక్కోబోయింది.

వాసవికి ముత్తు వింత ప్రవర్తనకి అర్థం తెలియటంలేదు. ఆమెకి అసలే ముత్తుమీద అకారణ ద్వేషం. ఇప్పుడది రెట్టింపయింది. చేస్తోన్న పని చెడగొడుతున్న కోపంతో ఆమె ముత్తుని పక్కకి త్రోసేసింది. ముత్తు ప్రక్కనవున్న రాళ్ళగట్టుమీద పడిపోయింది. చర్మం గీరుకుని రక్తం స్రవిస్తుంటే ముత్తు వాసవి వైపు అదోలా చూసింది.

వాసవి తప్పుచేసినదానిలా తల తిప్పుకుంది. శంకర్ తిరిగి చెట్టుకొట్టే ప్రయత్నం చేసాడు. బలహీనంగా వున్న మామిడిచెట్టు ఫెళ్ళున విరిగి నేలకూలింది. వాడు విజయగర్వంతో ముత్తువేపు తిరిగి చూసాడు. వాసవిలో మాత్రం అదివరకున్న ఉత్సాహం పూర్తిగా జారి పోయింది.

సరిగ్గా అప్పుడే జగదీష్ కారు పోర్టికోలోకి వచ్చి ఆగింది. అతను కారు దిగుతూనే పడిపోయిన చెట్టుని, వాసవిని, శంకర్‌ని చూసాడు.

"అయ్యగారొచ్చేసారు" అన్నాడు శంకర్ భయంగా.

"అక్కడేం చేస్తున్నారు?" అడిగాడు జగదీష్ మెట్లమీద నిలబడి ఇక్కడ పూలమొక్కలు వేద్దామని అంటూ నవ్వింది.

"అందుకుమాలివున్నాడుగా" జగదీష్ గొంతులోని గాంభీర్యానికి జంకినట్లయింది వాసవి.

శంకర్ గొడ్డలి క్రిందపడేసాడు.

వాసవి మెల్లిగా లోనికి నడిచింది.

"కొన్ని పనులు కొందరే చెయ్యాలి తోచటంలేదని మనకు కాని పనులు చెయ్యటం మంచిదికాదు" అన్నాడు జగదీష్ వాసవిని చూడగానే.

"నాకిక్కడ తోచటంలేదు" అంది వాసవి తలదించుకుని.

"ఇక్కడ నీకు అంతా క్రొత్త, అందువల్ల అలా అనిపిస్తోంది. కొన్నాళ్ళు అలవాటయితే యిక్కడ తప్ప మరోచోట ఉండలేనంటావు" అన్నాడు నవ్వుతూ.

వాసవికి అతని సమర్థింపు నచ్చలేదు.

జగదీష్ ఈ యింటి వాతావరణానికి అలవాడుపడతానని చెబుతున్నాడు. కానీ అదెలా సంభవం? నడి సముద్రంలో లంకలాంటిమేడ చుట్టూ నాలుగెకరాల దట్టమైన తోట మనుష్య సంచారమే కనిపించదు. గేటు దగ్గరనుండి చూస్తే లోపలి మేడే సరిగ్గా కనిపించనివ్వనంత పెద్ద పెద్ద వృక్షాలు. పై టెర్రస్ మీద కెళితే దూరముగా హోరెత్తుతూ నగరాన్ని తన గుప్పెట్లో యిముడ్చుకున్నట్లు ఎగసిపడే సముద్రం. ఇందులో తను జీవితాంతం కాపురం చెయ్యాలన్న నిజం గుండెను కోసేస్తుంది.

వాసవి ఈతరాని మనిషి నీళ్ళలో పడ్డట్లు గిలగిలలాడింది.

"నా మాటలకి కోపం తెచ్చుకోకు నీకెలాంటి తోటకావాలో మాలికి చెప్పి ఆ విధంగా చేయించు" అంటూ భుజం తట్టి బాత్‌రూంలోనికి వెళుతున్న భర్తవేపు నిర్లిప్తంగా చూసింది వాసవి.

**రాత్రి తొమ్మిది గంటలవేళ.** వాసవి కిటికి తలుపులు బార్లా తెరచి మంచమ్మీద పడుకుంది. ఆమెకి మనసంతా చిరాగ్గా ఉంది.

క్రితం సాయంత్రం జరిగిన సంఘటన ఆమె మనసుని పట్టి యింకా వదలటం లేదు. తను మొక్కలు నాటడం మహాపరాధంగా మాట్లాడాడు జగదీష్. మాలి చేతనే చేయించాలట. ఏం, మట్టిలో చేతులు పెడితే వంశ ప్రతిష్ఠ మంటగలుస్తుందా? ఫాల్స్ ప్రిస్టేజ్. అసలు మొదట్నుండీ అన్నీ ఉన్నవాళ్ళకి ఉండదు.

వాసవి కసిగా పమిటచెంగు కొస నోట్లో వుంచి గట్టిగా బిగించి లాగింది.జగదీష్ మీద ఆమెకి అమిత కోపంగా ఉంది. అతని కసలు ఏ టేస్టూలేదు. డబ్బు సంపాదించాలనే తపన తప్ప. గార్డెనింగ్ ఎంత మంచి హాబీనో చెప్పినా అతనికర్థం అవుతుందా?

పెళ్ళి ఒక దుస్వప్నంలా తోచింది వాసవికి. ఇందుకోసమేనా ఆడపిల్లలు తియ్యని కలలు కనేది? దీనికోసమేనా ఆడపిల్లలు అయినవాటిని, అలవాటయిన వాటిని వదులుకుని ఒక క్రొత్త వ్యక్తితో దూరదూర తీరాలకి తరలివెళ్ళేది. నిజంగా ఆడపిల్లల్ని పిరికి వాళ్ళంటారు కాని వాళ్ళంత ధైర్యస్థులు మరొకరుండరు. కాబట్టే అంత తెగించి క్రొత్తవ్యక్తుల మధ్యకి వాళ్ళగురించి ఏం తెలియకుండానే వెళ్ళి బ్రతగ్గలుగుతారు.

వాసవి భారంగా నిట్టూర్చింది.

కిటికీ ప్రక్కగా గాలికి ఊగుతోన్న మాలతీలత నీడ గోడమీద కదలటం చూసి ఉలిక్కిపడింది వాసవి. పూలగుత్తెల గిన్నెల్లో పరిమళాన్ని మోసుకొస్తున్న పేరంటాల్లా వుంది మాలతీలత. చల్లగాలి తెరలు తెరలుగా లోనికి దూసుకొస్తోంది. వాసవి మనసు ఆ గాలికి తేలికయ్యింది. చిన్న పిల్లలా కిటికీ దగ్గరకి పరిగెత్తుకెళ్ళి బయటికి చూసింది.

దట్టమైన రగ్గు కప్పుకుని నిద్రపోతున్నట్లుంది ఆకాశం. ఈశాన్య మూలగా దాడిచేస్తోన్న మెరుపు తీగలు. యుద్ధానికి సన్నిద్ధమవుతున్నట్లుగా అలజడి చేస్తున్న ఉరుములు. బందిపోటు దొంగలా దూసుకొస్తున్న గాలికి కిటికీలకి, గుమ్మాలకి కట్టిన తెరలు ఆకాశంలో నాట్యం చేస్తున్నాయి. టీపాయ్ మీద పెట్టిన లెటర్ పాడ్ గాలికి రెపరెపలాడుతోంది. తోటలోని చెట్లన్నీ పూనకం పూనిన మనుష్యుల్లా కాబరే డాన్సర్లలా ఊగిపోతున్నాయి. భళ్ళున ఏదో పగిలిన శబ్దం. వాసవి ఉలిక్కిపడి వెనక్కు తిరిగింది. కిటికీలో అందంగా అమర్చిన ఫ్లవర్ వాజ్ క్రిందపడిముక్కలయింది.

"శంకర్! శంకర్" వాసవి పిలుపుకి బదులు లేదు.

వాసవి చిరాగ్గా ముక్కల్నెత్తి హాల్లోకి వెళ్ళింది. గాలిలో సహవాసం చేసి ముందుకి దూకుతున్న వర్షపుజల్లు మొహాన్ని తడిపేసింది.

వాసవి శరీరం ఒక్కసారి జలదరించింది.

దీర్ఘమయిన వేసవి తాపం తర్వాత కురుస్తున్న మొదటి వర్షం. ఆమెకి అలా తడవటం హుషారు కలిగించింది. కావాలనే మరికాస్త ముందుకెళ్ళి ఫ్లవర్ వాజు ముక్కల్ని విసిరేసింది. మరో జల్లు వాసవిని నిలువెల్లా కౌగలించుకుంది.

ఆమె తనువంతా పులకరించింది.

అప్పుడే లోనికొస్తున్న జగదీష్ "ఏవిటది చిన్నపిల్లలా?" అన్నాడు నవ్వుతూ.

వాసవి వెను తిరిగి చూసింది. అతన్ని చూడగానే ఆమె గాలితీసిన బెలూన్‌లా చప్పబడిపోయింది. ఆమెలోని ఉత్సాహమంతా చల్లబడిపోయింది. మెల్లగా అడుగులు వేసుకుంటూ అతన్ని అనుసరించింది.

జగదీష్ గదిలోకొచ్చిన భార్యవేపు చూస్తూ "ఎలా తడిసిపోయావో చూడు. జలుబు చేస్తేనో?" అన్నాడు మందలింపుగా.

వాసవి ఎదురుగా గోడకున్న ఓవెల్ షేప్ అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుంది. తెల్లటి ఆర్గండీ చీర తడిసి వంటికి అంటుకుపోయింది. చెంపలనుండి నీళ్ళు కారి చుక్కలుగా గుండెలమీద భుజాల మీద పడుతున్నాయి.

"పల్చని జాకెట్లోంచి శరీరం.." ఆమె గబుక్కున జగదీష్‌ని చూసింది.

అతని చూపులు ఆమెనే దీక్షగా తడుముతున్నాయి. ఆ కళ్ళు విశాలంగా ఆశ్చర్యంగా ఏదో క్రొత్త అందాన్ని చూస్తున్నట్లుగా. వాసవి హిమపాతంలో చిక్కిన మనిషిలా వణికిపోయింది. ఆమెకేదోలా ఉంది. అతనలా తనని శల్యపరీక్షగా చూడ్డం భరించలేనట్లుగా కుంచించుకుపోయింది.

అక్కణ్నుంచి వెంటనే పారిపోవాలనిపించిందామెకు. కానీ ఆమెకాళ్ళు పాతాళంలోకి కూరుకుపోయినట్లుగా ఆమెలోని ప్రతి అణువూ ఆమెకు ఎదురు తిరిగి ఆమెను అపహాస్యం చేస్తున్నట్లుగా సిగ్గుతో తలదించుకుంది.

జగదీష్ లేచి ఆమె దగ్గరగా వస్తుంటే ఆమె చిగురాకులా కంపించింది.

''ఏమిటలాగే నిలబడ్డావు?'' అతను ఆమె చుబుకాన్ని పట్టుకుని తలెత్తి ఆమె కళ్ళలోకి చూసాడు.

వాసవి అతని వంక చూడలేనట్లుగా కళ్ళు వాల్చేసింది. అతని బలమైన చేయి నడుం చుట్టూ తిరిగింది. ఆమెలో చెప్పలేని ఉద్వేగం. ఒక్కసారి టెంపరేచర్ డౌనయి పోయినట్లు వళ్ళంతా చెమట్లు. అతని ముఖం ఆమె ముఖానికి దగ్గరగా వచ్చింది. అతను ఊపిరి తియ్యటం ఆమె చెవుల్లో హోరుమని వినిపిస్తోంది. ఆమెకు తిరగబడాలని అతన్ని దూరంగా త్రోసెయ్యాలని ఉంది. తనలోని భావాల్ని అదిమి పెట్టి నిలబడింది వాసవి.

అతను తన భర్త. తను అతని సహధర్మచారిణి. మనోవాక్కాయలా అతనితో కలిసి బ్రతుకుతానని పెళ్ళిపీటలమీద ప్రమాణం చేసి అతనిచేత మూడు ముళ్ళూ వేయించుకుంది. అతన్ని కాదని ప్రతిఘటించటానికి తనకేం హక్కుంది? అతనింకా చాలా ఆలస్యంగా చాలా ఆశ్చర్యంగా తనని ఇన్నాళ్ళకి కోరుకుంటున్నాడు.

వాసవి మనసు సంఘర్షణ పడుతుంటే ప్రాణం పోయి బిగుసుకు నిలబడి పోయింది. ఎక్కడో ఉజ్జ్వలమైన మెరపు సృష్టినంతా తడివి చూస్తోన్న త్రినేత్రపు కాంతిలా. ఆ వెంటనే ప్రళయ రుద్రుడి గజ్జెల మోతలా, ఆకాశం రెండు ముక్కలై కూలిపోతున్నట్లు ఉరుము.

ఆ శబ్దానికి కరెంటు పోయింది.

భయంతో వాసవి అతనికి హత్తుకుపోయింది.

సరిగ్గా అప్పుడే అతని పెదవులు ఆర్తిగా ఆమె పెదవుల్నీ బుగ్గల్నీ, నుదుటిని గాఢంగా స్పర్శించాయి.

మరో అయిదు నిముషాల్లో కరెంట్ వచ్చింది.

తనని గట్టిగా అల్లుకుపోయిన భార్యని కుదిపాడు జగదీష్.

''భయం వేసిందా?''

వాసవి స్పృహలో కొచ్చినట్లు చుట్టూ చూసింది. తన చేతులు జగదీష్ నడుంని బిగించి ఉన్నాయి. తన తల అతని గుండెల మీద.

వాసవి ఉలిక్కిపడ్డట్లు అతన్ని వదిలి దూరంగా నిలబడింది.

జగదీష్ సన్నగా నవ్వుతూ ''బట్టలు మార్చుకో'' అన్నాడామెని వదిలి దూరంగా జరుగుతూ.

వాసవి అతని ముఖం చూడలేనట్లు గబగబా వార్డ్‌రోబ్ తెరిచి అందులో తలదూర్చింది.

కానీ జగదీష్ కూడ అక్కడ కొచ్చి ఆమె భుజాల మీదుగా పై అరలో వున్న మాక్సీ తీసి ''ఇది వేసుకో'' అన్నాడు.

వాసవి అతని కళ్ళలోకి చూసింది.

అతని కళ్ళలో కనిపిస్తోన్న చిలిపితనానికి ఆమె కళ్ళు దించుకుంది.

''వద్దు'' అంది నీరసంగా.

వాసవి తల దించుకుంది.

"పోనీ నేను తొడగనా?"

వాసవి కంగారు పడ్డట్లు చూసింది. ఆ వెంటనే గబుక్కున అతని చేతిలోని మాక్సీ లాక్కుని బ్రాత్రూమ్‌లో కెళ్ళి బోల్టు వేసుకుంది.

వాసవి గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. కాస్సేపు ఏమీ తోచనిదానిలా బ్రాత్రూమ్‌లో నిలబడిపోయింది. ఎదురుగా వున్న అద్దంలో ఆమె ముఖం ఆమెకే వింతగా కనిపిస్తోంది. తడిసి చెంపల కతుక్కున్న జుట్టు, వర్షపు నీటికి కరిగి నొసటిమీదనుండి కారిన సింధూరం, భయపడుతోన్న చూపులు, సన్నగా అదురుతున్న పెదవులు.

వాసవికి దడదడగా ఉంది. ఈ రోజు ఏదో జరగబోతోందన్న నిజం తెలిసి ఆమె అదోలా వణికి పోతోంది. అతన్ని తప్పించుకుని తిరగటం, తిరగాలనుకోవటం – తనకిక అసంభవం. ఈ రోజు తన రూపం ఈ వాతావరణం అతన్ని మతి తప్పి ప్రవర్తించేలా చేస్తున్నాయి.

అందులోనూ తను కావాలని వివాహమాడిన వ్యక్తిని దూరంగా ఉంచడం ఎంతో అరుదు. ఇన్ని రోజులూ అతను తననొక స్నేహితురాలిగా చూడటాన తను అతనంటే భయంలేకుండా మసలగలుగుతోంది. కాని కాని ఈ రోజు అతనొక ఆకలిగొన్న మగాడిలా భర్తగా తనమీదకి విజృంభిస్తుంటే ఈ లంకంత మేడలో ఈ నీరవనిశీధిలో, ఈ ఏకాంతంలో అతని భార్యగా తనెలా అతన్నుండి తప్పించుకుని బయటపడగలదు.

వాసవి కళ్ళనుండి రెండు కన్నీటి బిందువులు చెంపలమీదకి జారిపడ్డాయి. పెదవులపై నిస్పృహతో కూడిన పేలవమైన నవ్వు వాడిన పువ్వులా జారిపోయింది. అయినా తనెందుకు తప్పించుకోవటం. తప్పించుకుని తనని పవిత్రంగా కాపాడుకుని తనేం చేస్తుంది. ఇష్టమైనా అయిష్టమైనా తన పెళ్ళి జగదీష్‌తో జరిగి పోయింది.

అతను తన భర్త.

ఎవరికోసం తను అతనికి దూరంగా ఉండాలి? అలా తను పవిత్రంగా ఉన్నదన్న సంగతి ఎవరికి కావాలి?

వాసవి మనసు గజిబిజిగా ఆలోచిస్తోంది.

ఆమె హృదయం రెండు ముక్కలై విభిన్న అభిప్రాయాలతో ద్వంద్వ యుద్ధం చేస్తోంది.

"నువ్వు యింకా అనంత్‌ని ప్రేమిస్తున్నావు. అందుకే నిన్ను నువ్వు జగదీష్‌ని దూరంగా ఉంచుకోవటానికి ప్రయత్నిస్తున్నావు" అంటూ ఆమె అంతరంగం పరిహసిస్తుంటే వాసవి తట్టుకోలేకపోయింది.

"నో! నెవ్వర్" అంటూ ఆమె తలుపు మీద పిడికిలితో గట్టిగా కొట్టింది.

ఆ సంగతి నిజం కాకపోతే నువ్వు జగదీష్‌ని దూరంగా ఉంచడం ఎందుకు? అతని స్పర్శకి వణికిపోవడం దేనికి? ఎంతోమంది కన్నె పిల్లలు కలలు కనే తొలి సమాగమాన్ని అంత భయంకరంగా ఊహించుకోవటం దేనికి?

వాసవి జవాబు చెప్పలేనట్లు నీరసంగా తలుపుకి జేరబడింది.

నిజమే.

ఇష్టమో అయిష్టమో, జలదరింపో, పులకరింపో, భయమో, అసహ్యమో ఈ రాత్రి అతని యిష్టప్రకారం అతనికి లొంగిపోతే, తనలో యీ ఉద్వేగం, ఆందోళనా వాటంతటవే సద్దుమణిగిపోతాయి. అతను తన భర్తనే మమకారం ఏర్పడుతుంది. తనకు తెలియకుండానే తన గుండె లోపలి పొరల్లో యింకా తిష్టవేసుకుని కూర్చున్న అనంత్ రూపం చెరిగి పోతుంది.

వాసవి మెల్లిగా వాష్ బేసిన్ దగ్గర కెళ్ళి ముఖం కడుక్కుంది. బట్టలు మార్చుకుంది. మాక్సీ వేసుకుని అద్దంలో చూసుకుంటే ఆమెకు అదోలా అనిపించింది. మాక్సీలు వేసుకోవటం ఆమెకి క్రొత్తకాదు. కాని.. అతని ఎదుట వేసుకోవడం మొదటిసారే.

ఆమె శరీరం ఆమెకే వింతగా కనిపించింది. పల్చగా, మెత్తగా, మెరుస్తున్న మాక్సీ ఆమె శరీరాన్ని సున్నితంగా కౌగలించుకుని ఆమె అందాల్ని కనీ కనిపించనట్లు బయట పెడుతోంటే వాసవి అడుగు వెయ్యలేనట్లు నిలబడిపోయింది. తలుపు తియ్యాలంటే భయం.

తలుపుల్ని చీల్చుకుని తననే తడిమి చూస్తున్నట్లున్న జగదీష్ చూపుల్ని తలచుకుని వాసవి జంకుతూ నిలబడింది.

కాలం చాలా నెమ్మదిగా నిశ్చింతగా "ఎంతసేపు తప్పించుకుంటావ్?" అని పరిహసిస్తోన్నట్లుగా మెల్లిగా కదలిపోతోంది.

వాసవి ఊపిరి బిగబెట్టి బోల్టు తీసింది.

తలుపు తీసి తియ్యగానే జగదీష్ సుడిగాలిలా లోపలికి జొరబడి తనని ఊపిరి అందనంత ఆర్తిగా హత్తుకుంటాడని ఊహించిన వాసవి ఆశ్చర్యపోయింది.

పదినిముషాలు గడిచాయి.

జగదీష్ లోపలికి అడుగుపెట్టలేదు. తనే బయటికి రావాలన్నమాట.

అతనికెంత పట్టుదలో ! మగవాడనే ధీమా. వాసవి గత్యంతరంలేనట్లు బాత్రూమ్‌లోంచి, బెడ్ రూమ్‌లోకి అడుగు పెట్టింది. తల దించుకుని మెల్లిగా అతి మెల్లిగ్గా అడుగులు వేసి మంచాన్ని అనుకుని నిలబడింది వాసవి.

మరో పదినిముషాలు.

కాలం ముందుకి నడుస్తుంటే ఏ మూలనుంచో తనని చూపులతో తినేస్తున్న జగదీష్‌ని ఊహించుకుని వాసవి కుంచించుకుపోతూ నిలబడింది నిస్సహాయంగా.

కాస్సేపుంటే తనకి స్పృహ తప్పుతుందేమోనన్నంత ఉద్వేగం.

తలుపు చప్పుడు.

వాసవి గుండె వేగంగా కొట్టుకుంది.

అడుగుల చప్పుడు.

లయ తప్పుతున్న వాసవి హృదయం.

"అమ్మగారూ"

వాసవి చప్పున తలయెత్తి చూసింది.

శంకర్.

"అమ్మగారూ, అయ్యగారు అర్జంటుగా ఏదో ఫోనొచ్చి బయటకెళ్ళారు. వచ్చేటప్పటికి ఆలస్యమవుతుందట. మిమ్మల్ని పడుకోమన్నారు. తలుపు గడియ పెట్టొద్దన్నారు."

వాసవి శంకర్ వేపు ఆశ్చర్యంగా చూసింది.

అదే క్షణం వాడుకూడా మాక్సీలో తమాషాగా కనిపిస్తున్న వాసవిని విచిత్రంగా చూసాడు.

విశాలమైన కళ్ళతో తనని వింతగా చూస్తున్న శంకర్‌ని వాసవి యిబ్బందిగా ఫీలయింది.

"సర్లే పో" అంది.

వాడు వెళ్ళిపోగానే తలుపు దగ్గరకేసి గడియ పెట్టపోయింది.

మళ్ళీ ఆమెలో టెన్షన్ ప్రారంభమయ్యింది.

## 8

తనని దేవుడు క్షణక్షణం కాపాడుతున్నాడా? అర్థం కావడం లేదు వాసవికి.

ఈ పులి మేక ఆట ఎన్నాళ్ళు ఆడాలి? వాసవి నిట్టూర్చింది. వచ్చి మంచమ్మీద కూర్చుంది. వర్షం ఎడతెగకుండా కురుస్తోంది.

ఆకాశమంతా అల్లుకుపోతున్న మెరుపులతో నిండిపోయింది వాటినుండి ఉద్భవించిన కాంతి కిటికీలోంచి జొరబడి గదిలో వెయ్యివాల్టుబల్బు వెలిగీ ఆరుతోనట్లుగా ఉంది.

ఆ వెలుగు వెంట ఉలిక్కిపడే ఉరుములు. వాటి శబ్దానికి వాసవికి చెవులు చిల్లులుపడి పోతాయనిపించింది. వీటన్నిటికీ అతీతంగా ఆమె హృదయం మాత్రం జగదీష్ గురించి ఆలోచిస్తోంది.

అతను చాలా తమాషా మనిషి. అతని ప్రవర్తన విచిత్రంగా ఉంటోంది. ఉప్పెనలా వచ్చి చప్పున చల్లారి వెనక్కి తిరిగిపోయే కెరటంలా ఉంటుంది అతని మనస్తత్వం. ఏది ఏమైనా తనకు దొరికిన రక్షణ కొన్ని నిముషాలు కావచ్చు కొన్ని గంటలు కావచ్చు.

తలుపు గడియపెట్టొద్దనడంలో అతని ఉద్దేశ్యం అర్థం అవుతుంది.

ఏదో అనివార్య పరిస్థితుల్లో తప్పనిసరిగా బయటకి వెళ్ళివుంటాడు.

ఈ ఉరుముల్లో, ఇంత ఉధృతమైన వర్షంలో ఎంత ముఖ్యమైన పని లేనిదీ ఎవరూ బయటికి వెళ్ళరు.

తిరిగి అతను రాగానే మళ్ళీ దాగుడు మూతలు. వాసవి గబుక్కున ఏదో ఉపాయం తోచినట్లు గబగబా వెళ్ళి తలుపు గడియ పెట్టింది.

ఆ వెంటనే ఏదో ఆలోచన వచ్చినదానిలా ఉసూరుమంటూ అక్కడే నిలబడిపోయింది.

తనొచ్చి తలుపు బాదుతాడు తను నిద్రపోయినట్లు నటిస్తుంది.

ఫలితం?

ఈ రోజుకి అతని బారినుండి తప్పించుకుంటుంది. రేపు?

అతనూ తనూ కలిసి ఒకే యింట్లో తిరుగుతు తప్పించుకోవడం అసంభవం.

ఒకవేళ తీవ్రంగా ప్రతిఘటిస్తే అతనికి అనుమానం రావచ్చు.

**ఆరా తీస్తే** తన ప్రేమకథ అతనికి తెలిసిపోవచ్చు. దానితో ఇద్దరి మధ్యా అపార్థాలు.

ఈ వివాహబంధం పుటుక్కున తెగిపోతుంది.

అతను మరో దారి వెతుక్కుంటాడు. తన తండ్రికి పదిమందిలో పరువుపోతుంది. వాసవి వెంటనే నిస్సత్తువుగా తలుపు గడియ తీసేసింది.

ఎదురుగా అద్దంలో అజంతా శిల్పం.

కాదు తన ప్రతిబింబం.

తననే కవ్విస్తోన్న తన ప్రతిరూపం మగవాడయిన జగదీష్‌ని కదిలించి రెచ్చగొట్టడంలో ఆశ్చర్యంలేదు.

ఈ నీలిరంగు పల్చని దీపకాంతిలో, అంతకంటే పల్చని దుస్తుల్లో దోబూచులాడుతోన్న తన అనాఘ్రాణిత పుష్ప సౌకుమార్యం పక్కనున్నవాణ్ణి స్థిమితంగా పడుకోనిస్తుందా?

వాసవికి అనిపించింది సంపూర్ణ నగ్నత్వంకన్నా కనీకనిపించని స్నిగ్ధ సౌందర్యమే పురుషుణ్ణి ఎక్కువగా రెచ్చగొడుతుందని.

ఆ ఊహ రాగానే వాసవి హడావిడిగా మాక్సీ తీసేసి చీర కట్టుకుంది.

మెల్లిగా వరండాలో కొచ్చింది.

వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తోంది.

చాలా స్థిరంగా, భూమికి లంభకోణంలో చల్లటి గాలితెర ముఖానికి తగిలి జివ్వుమనిపించింది. వాసవి వరండా చివరికెళ్ళి నిలబడి అటూ యిటూ చూసింది.

పొడవైన వరండా జీవంలేని వస్తువులతో బిక్కుబిక్కుమంటోంది.

ఆమె వెంటనే చూపులు తిప్పి స్విచ్ బోర్డుకు తగిలించి వున్న తాళం కప్పని చూడగానే ఆమె ప్రాణం ఉసూరుమంది.

ఆమె ప్లాను తల్లక్రిందులయినట్లు తల్లడిల్లి నిలబడి పోయిందొక క్షణం.

నిరుత్సాహంగా వెనక్కు మళ్ళింది.

మళ్ళీ అదే ఆలోచన.

సుడిగుండంలో చిక్కిన మనిషి పూచిక పుల్ల ఆధారంతో బయటపడాలనే వెర్రి తాపత్రయం.

ఆమె ఈసారి మరీ ముందుకొచ్చి తాళం కప్పకేసి దీక్షగా చూసి పట్టుకుని బలంగా లాగింది.

తాళం విడిపోయింది.

ఆ ఊపుకి ఆమె పిట్టగోడమీదకి పడిపోయి నిగ్రహించుకుంది.

వాసవికి చీకట్లో బోర్డులోని ఫ్యూజులన్నీ గందరగోళంగా కనిపించాయి.

ఏం చేయాలో తోచనట్లు ఒక క్షణం నిలబడిపోయింది. మెయిన్ స్విచ్ ఆపితే మొత్తం మేడంతా అంధకారమయిపోతుంది. దానివల్ల తను ఆశించిన ప్రయోజనం ఉండకపోగా శంకర్‌గాని, జగదీష్ కానీ వెంటనే చెక్ చేసే ప్రమాదముంది.

తనకి కావల్సింది కేవలం తనగదిలో మాత్రం దీపం లేకపోవడం.

బ్యాటరీ లైటు వుంటే బాగుణ్ణనిపించింది వాసవికి. సరిగ్గా అప్పుడే ఉజ్వలమైన కాంతి.

పెద్దగా మెరిసిన మెరుపులో ఆమెకి ఎడం వేపునుండి కుడివేపుకు 1,2 అంకెలు కనిపించాయి. అంటే.. అంటే హాల్లో తన బెడ్ రూమ్ మూడవది. ఆమె బోర్డుని చేత్తో తడుముతూ ఎసెండింగ్ ఆర్డర్‌లో తనకు మూడవది అనిపించిన ఫ్యూజ్‌ని పీకేసింది.

తన గదిలోంచి కిటికీగుండా సన్నగా ప్రసరింపబడుతోన్న కాంతి మాయమయ్యింది.

వాసవి తేలిగ్గా నిట్టూర్చింది.

ఆమె గబగబా అడుగులేసుకుంటూ తనగదిలోకొచ్చి తలుపు దగ్గరకేసింది.

గదంతా గాఢ సాంద్రతతో ప్రవహిస్తున్న తారులాంటి చీకటి.

బయట హోరెత్తే వర్షం.

వర్షపు నీటిలో చేరి సంతోషంతో కేరింతలు కొడ్తున్న కప్పల బెకబెకలు.

మెరుపు మెరిసినప్పుడల్లా వర్షానికి తడిసి బరువుగా ఊగుతోన్న చెట్లు.

మరొకప్పుడయితే వాసవికి ఆ వాతావరణం భయోత్పాతం కలిగించి నిలువెల్లా వణికించేదే కానీ ఆమె ఆలోచన వేరు.

ఆ రాత్రి తను జగదీష్‌కి దొరకకూడదు. వాసవి మంచమ్మీద పడుకుని ఆసరాగా దిండుని కౌగిలించుకుంది.

ఆమె మనోస్థితికూడా చాలా విచిత్రంగా ఉంది.

ఆ వర్షాన్ని చూస్తుంటే ఆమె ఆలోచనలు రెండేళ్ళ క్రితం కాకినాడ సముద్రపు వొడ్డున నిలిచాయి.

ఆ రోజు జగన్నాధరవుగారు, అనంత్‌తో కలిసి కాకినాడ బయల్దేరుతున్నారు.

హార్ట్ ఎటాక్ వచ్చినప్పటినుండీ జగన్నాధరావుగారు వ్యాపారపరంగా ఊళ్ళమీదకెళ్ళడం తగ్గించేసారనే చెప్పాలి. తప్పనిసరిగా వెళ్ళాల్సివచ్చినప్పుడు అనంత్ అతని వెంబడి ఉండేవాడు.

జగన్నాధరావుగారికీ మధ్య షిప్పింగ్ బోట్సు కొనమని ఎవరో సలహా యిచ్చారు. ఆ వ్యాపారం లాభసాటిగా ఉంటుందని, కాకినాడ రొయ్యల వ్యాపారానికి కేంద్రంగా ఉందని చెప్పడంతో ఆయన ఆ విషయం గురించి కాకినాడ ప్రయాణం పెట్టుకున్నారు.

"మనకున్నది చాలదా? ఇంకా ఈ క్రొత్త వ్యాపారాలెందుకు?" వాసవి ఎంత చెప్పినా ఆయనకి రుచించలేదు.

ఆయన వాసవికేసి చూసి నవ్వి "మనకెంత వుందో తెలుసామ్మా?" అన్నారు.

వాసవి బుంగమూతి పెట్టింది.

"అదంతా నాకు తెలియదు. చాలామందితో పోలిస్తే మనం వున్న వాళ్ళమేనని నాకనిపిస్తోంది. గుండె నొప్పితో నువ్వింకా పడాల్సిన అవసరం ఉందని నేననుకోవడంలేదు. అంది కోపంగా.

"అందుకే నీకేం తెలియదంటాను ఆ బిజినెస్ గొడవలన్నీ చెప్పి నీ బుర్రపాడు చెయ్యటంకూడా నాకిష్టంలేదు. సున్నితంగా, సుఖంగా బ్రతకాల్సిన ఆడపిల్లవి. బిజినెస్‌లో ఎంత ఉన్నదీ, ఎంతపోయిందీ యిప్పుడేకాదు చచ్చేవరకూ తెలియదు" అన్నారు వాసవిని చిన్నపిల్లలా తీసేస్తూ.

అనంత్ గోడకి చేరబడి చేతులు కట్టుకునే నిలబడి తండ్రీ కూతుళ్ళని చిరునవ్వుతో పరికిస్తున్నాడు.

వాసవి అతనివైపు చూసి "డాడీకి నువ్వయినా చెప్పకూడదా అనంత్" అంది.

అనంత్ జగన్నాధరావుగారి వేపు చూసాడు.

"మంచం మీద పడుకుంటే మనస్సు చెడిపోతుందని, మనసే శరీరాన్ని శాసించే మహారాజని బేబీకి చెప్పవయ్యా అనంత్" అన్నారు జగన్నాధరావుగరు పరిహాసంగా.

అనంత్ ఇద్దరికీ ఏమీ చెప్పలేనట్లు చిరునవ్వు నవ్వాడు.

వాసవి అతనివైపు కోపంగా చూసి "నీకు నవ్వుగానే ఉంటుంది" అంది.

"ఏం చెయ్యమంటారో చెప్పండి మరి. ఆయనకి మంచమ్మీద బోరుకొడుతోంది. ఇంకొక నాలుగురోజులుంటే కార్డియాలజీకాదుగాని మెంటల్ హాస్పిటల్‌కి వెళ్ళాల్సొస్తుందంటారు. మీరు రెస్ట్, రెస్ట్ అంటూ ఆయన్ని హడలగొట్టేస్తారు. ఈసారికి డాడీని వెళ్ళనివ్వనియ్యండి. నేను జాగ్రత్తగ చూసుకుంటానుగా" అన్నాడు మెత్తగా.

వాసవి వస్తున్న నవ్వుని మునిపంటితో నొక్కిపెట్టింది.

జగన్నాధరావుగారి సన్నిధిలో అతను తనని మన్నించి మాట్లాడడమే ఆ నవ్వుకి కారణం.

ఒంటరిగా తనని "వసూ, వసూ" అంటూ చిలిపిగా వెంబడించే అనంత్ ఆయన ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా, ఎక్కడ పొరపాటు దొర్లుతుందోనని నిదానంగా మాట్లాడటం వాసవికి తమాషాగా ఉంటుంది.

వాసవి ముఖాన్ని చూసి అనంత్ కోపంగా నొసలు చిట్లించాడు.

జగన్నాధరావుగారి దగ్గర బయటపడిపోవడం అతనికిష్టం ఉండదు.

అనంత్‌కి కోపం వచ్చిందని గ్రహించింది వాసవి.

"పోనీ నేనూ వస్తాను డాడీ" అంది గారంగా.

"నువ్వా ఎందుకమ్మా ఏముంది కాకినాడలో" అన్నారు.

"సముద్రం" అంది ఉత్సాహంగా.

"ఛెయిల్డిష్" అంటూ నవ్వారు జగన్నాధరావుగారు.

ఆయనకి తెలుసు వాసవికి సముద్రతీరమంటే చెప్పలేని యిష్టం.

ఆమె హైద్రాబాద్‌లోనే పుట్టింది. పెరిగింది. ఆమె జీవితం చాలావరకు అక్కడే గడిచింది.

ఎప్పుడైనా తండ్రితో ఏవైనా సముద్రమున్న ఊళ్ళు వెళ్ళినప్పుడు ఆమెను సాయంత్రాలు తప్పనిసరిగా బీచ్ ఒడ్డున తిప్పాల్సిందే.

వాసవి ఆ అలల్లో చిన్నపిల్లలా కేరింతలు కొట్టి ఆడుతుంటే జగన్నాధరావుగారు దూరంగా ఇసుకలో కూర్చుని నవ్వుతూ చూసేవారు.

చీకటిపడింది. మరింక వెళ్ళుదాం అంటూ ఎన్నిసార్లు పిలిచినా వినిపించినట్లు నటించేది.

"ఆ హోటల్ రూములో ఏం చేస్తాం డాడీ ఎంజాయ్ ద బ్యూటీ ఆఫ్ ద బ్లూయిష్ వేవ్స్" అనేది నవ్వుతూ.

ఆ ఉప్పునీటిలో ఉన్న అందమేమిటో జగన్నాధరావుగారికి అర్ధం అయ్యేది కాదు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కొచ్చినా యింకా ఆ పిచ్చి వదలని కూతురుని చూసి ఆయన నవ్వుకుని "సరే" రామ్మా అన్నారు.

ముగ్గురూ గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో కాకినాడ చేరుకున్నారు. జగన్నాధరావుగారి స్నేహితుడొకడు స్టేషన్‌కి కారు తీసుకొచ్చాడు.

హోటల్ వ్యవహారాలన్నీ ముగించుకునేసరికి రెండురోజులు పట్టింది.

ఆ సాయంత్రం వాసవి మెల్లిగా అడిగింది. బీచ్‌కి వెళ్దాం డాడీ అంటూ.

"సరేనమ్మా" అన్నారు జగన్నాధరావుగారు.

"మీరెక్కడికి? ఇసుకలో నడవలేరు. పైగా అక్కడేం షెల్టర్లు కూడా లేవు. ఊరికి దూరంగా ఉండడంతో మా సముద్రం వ్యాపారానికేగానీ వాహ్యాళ్ళకి పనికిరాకుండా పోయిందిరా" అన్నాడు జగన్నాధరావుగారి స్నేహితుడు.

వాసవి తండ్రి వంక దిగులుగా చూసింది.

ఆమె చూపుల భావాలు అర్ధం చేసుకున్న ఆయన "అమ్మాయికి సముద్రమంటే యిష్టం. షి యాజ్ మేడ్ ఆఫ్ ద సీ" అన్నారు నవ్వుతూ.

"పోనీ అమ్మాయిని పంపించండి. ఆ అబ్బాయి ఉన్నాడుగా" అన్నాడతను.

"తొందరగా వచ్చేయండి అనంత్. వాసవికి సముద్రమంటే చాలా పిచ్చి. లోపలికి పోనివ్వకు" అన్నారు జగన్నాధరావుగారు అనంత్ వైపు తిరిగి.

అనంత్ సరేనన్నట్లు తల పంకించాడు.

"అనంత్ ఎందుకులే డాడీ మీకవసరమయితేనో" అంది వాసవి అనంత్ వేపు చూస్తూ.

అనంత్ ముఖం చిన్నబోవడం ఆమెకు నవ్వు తెప్పించింది.

"ఇంకా నయం ఒంటరిగా వెళ్ళడం మంచిదికాదు. అసలే జనసంచారంలేని సముద్రతీరం మాది. చూడండి కారు తీసుకెళ్ళండి. వెంకటేశ్వరా థియేటర్‌కి స్ట్రెయిట్ రోడ్డు. తిన్నగా వెళ్ళడమే" అంటూ కారు తాళాలు అనంత్‌కి అందించబోయాడాయన.

వాసవి తాళాలు అందుకుంటూ "ఆయనికిస్తే మేమింక తిరిగి రాము" అంది నవ్వుతూ.

అతను తెల్లబోతున్నట్లు చూస్తుంటే వాసవి నవ్వుతూ తలుపు తీసుకుని బయటకి నడిచింది.

"నేను రాను నువ్వెళ్ళు" అన్నాడు అనంత్ బయటికి రాగానే.

వాసవి నవ్వుతూ అతనివంక చూసి "నువ్వొస్తావ్ ఆ సంగతి నాకు తెలుసు" అంది.

"ఎందుకంత ధీమా?" అన్నాడు అనంత్ కోపంగా.

"ఒక వేసవి సాయంత్రం ఒంటరిగా సముద్రతీరంలో, యిష్టమైన అమ్మాయితో ప్రేమ విహారం వద్దన్నవాడు ఫూల్ కదూ" అంది వాసవి కవ్వింపుగా కారెక్కి స్టార్ట్ చేస్తూ.

అనంత్ కూడా డోర్ తీసుకుని కారెక్కి "అదిగో మళ్ళీ ఫూల్ అంటున్నావు" అన్నాడు ఎర్రబడ్డ ముఖంతో.

"నువ్వు నాతో వస్తున్నావు. ఆ మాట నీకు వర్తించదు. వెళ్ళబోయేది సీ షోర్‌కి. కోపతాపాలు వద్దు బి హేపీ" అంది వాసవి స్టీరింగ్ తిప్పుతూ.

కారు శరవేగంగా వేంకటేశ్వరా థియేటర్ ఎదురు రోడ్డులోకి ప్రవేశించింది.

సముద్రపు గాలి ఉప్పగా, చల్లగా శరీరాల్ని తాకుతుంటే వాసవి ఉత్సాహంగా స్పీడు పెంచింది.

కారు సరుగుడు తోటలకి పక్కగా పార్క్ చేసి జోళ్ళు కార్లోపెట్టి కారు లాక్ చేసి తాళాలు అనంత్ చేతిలో పెట్టి "జాగ్రత్త" అంటూ ఇసుకలో పరుగెట్టింది వాసవి.

చిన్నపిల్లలా కలుగులోంచి బయటకొచ్చి తొంగిచూస్తోన్న పీతల్ని చెదరగొడుతూ సముద్రం వేపు పరిగెత్తుతున్న వాసవిని చిరునవ్వుతో వీక్షిస్తూ బరువుగా అడుగులేస్తూ అనుసరిస్తున్నాడు అనంత్.

వాసవి అలలతో ఆడి ఆడి అలసిపోయి "అలా దూరంగా కూర్చుంటావేం కమాన్ ప్లీజ్" అంటూ అరిచింది.

నాకా ఉప్పునీళ్ళలో తడవడం యిష్టం ఉండదు. వళ్ళంతా జిగురయిపోతుంది అన్నాడు అనంత్ ఇసుకలో చేరబడి.

"నువ్వూ డాడీలాగానే టేస్ట్‌లెస్ మాన్‌వి. ప్లీజ్ కమాన్" అంది.

ఆమె చీర నడుం పైదాకా తడిసిపోయింది. కాళ్ళకి తడిసిన చీర అడ్డం పడుతున్నా లెక్కలేనట్లు సముద్రపు అలల్లో పరుగులెత్తుతూనే వుంది వాసవి.

అనంత్ ఆమెనే తదేకంగా చూస్తున్నాడు. వాసవి అదేం గమనించడం లేదు. అబ్బా అంటూ అరిచింది వాసవి. అనంత్ ఉలిక్కిపడ్డట్లు లేచి నిలబడ్డాడు.

"అనంత్ హెల్ప్‌మీ" వాసవి గావు కేక పెట్టింది.

అనంత్ సముద్రం వేపు పరిగెత్తాడు "ఏం జరిగింది" అంటూ

"ఏదో కాలుకి పట్టుకుంది అనంత్. అబ్బా నొప్పి" వాసవి ఏడుపు గొంతుతో అంది.

అనంత్ వాసవి దగ్గరకెళ్ళి "అంత లోతు కెళ్ళొద్దంటే వినవు" అంటూ చెయ్యిపట్టి గుంజాడు.

సరిగ్గా అప్పుడే వాసవి అంతకంటే బలంగా అతన్ని సముద్రం లాగింది. అనంత్ అదిరిపాటుగా ఆమె మీదికి పడబోయి నిగ్రహించుకున్నాడు.

వాసవి కిలికిలా నవ్వింది.

"మామూలుగా రమ్మని పిలిస్తేరావుగా" అంది కొంటెగా. అనంత్ కోపంగా "ఏవిటిది చిన్నపిల్లలా" అన్నాడు విసుక్కుంటున్నట్లు.

"ప్లీజ్ అనంత్. నీకు స్విమ్మింగ్ వచ్చుగా. సముద్రాన్ని చూస్తే నీకు ఈత కొట్టాలనిపించదూ" అంది వాసవి అర్థింపుగా.

అనంత్ ఒడ్డుకెళుతోంటే వాసవి నిరాశగా చూసింది.

కానీ అతని బట్టల్ని ఒడ్డున విప్పి డ్రాయర్‌తో సముద్రంలోకి దూకుతుంటే సిగ్గుతో చూపులు తిప్పుకుంది వాసవి. అతను సముద్రంలో చాలా లోతుకెళ్ళి మళ్ళీ అలలమీద తేలివస్తోంటే తమాషాగా చూస్తోంది వాసవి. అలా ఎంతసేపో. చూస్తుండగానే ఆకాశం నిండా మబ్బులు కమ్మి కుండపోతగా వర్షం ప్రారంభించింది. వాసవి భయంగా కేకలు పెట్టింది. సముద్రం పొంగినట్టు ఆకాశంతో ఏకం అయినట్లు పెద్ద పెద్ద అలలు.

9

వాసవి ఉక్కిరి బిక్కిరయిపోతోంది. ఆమె కళ్ళు గట్టిగా మూసుకునే ఉంది. ఆమె గాలి అందనట్లుగా కొట్టుకుంది.

"ప్లీజ్ నన్ను వదిలేయ్ అనంత్. డాడీ చూస్తారు"

వాసవి మాటలు పైకి రాకుండానే మరో రెండు పెదవులు ఆమె నోటిని గట్టిగా మూసేస్తున్నాయి.

వాసవి తనకు తెలియకుండానే పెనుగులాడుతోంది.

మరి కాస్సేపటికి ఆమె శరీరం మనసు బాహ్యస్మృతి పొందాయి. తనెక్కడ ఉన్నదీ అర్థమవుతోంది. తను విశాఖలో సముద్రపుటొడ్డున అనంత్ చేతుల్లో లేని విషయం గుర్తొచ్చి ఆమె ఉలిక్కిపడింది. రాత్రి పెద్ద వర్షం. తను ఫ్యూజ్ తీసెయ్యటం ఆమెకు చప్పున గుర్తొచ్చింది. అయితే జగదీష్

"ప్లీజ్ నన్ను వదలండి" వాసవి తనని సుడిగాలిలా చుట్టేసిన వ్యక్తిని బ్రతిమిలాడింది.

అవతల్నుండి జవాబు లేదు. చుట్టూ కారుచీకటి. వాసవి వళ్ళంతా అంత చల్లదనంలోనూ చెమటలు పోసాయి. అతను వాసవి ప్రార్థన వినిపించుకోలేదు. ఆమె కట్టిన చీర అతని చేతులు లాగేస్తున్నట్లు గ్రహించింది వాసవి.

"నాకు భయంగా ఉంది. నన్నొదిలేయండి" అంది వాసవి ఏడుపు గొంతుతో.

"ఉష్" అతని కంఠం గుసగుసలాడింది. అతని బలానికి నీరసపడిపోతోంది వాసవి.

ఆమె నిస్సహాయంగా ఆ చీకట్లో కళ్ళనీళ్ళు పెట్టుకోవడం అతనికి కనిపించలేదు.

వాసవి ఆఖరి అస్త్రంగా ఆ చీకట్లో తన చేతికి దొరికిన అతని చేతిని శక్తికొద్దీ కొరికేసింది.

"అబ్బా!" అతను ఒక్క గంతులో మంచమ్మీదనుండి దూకిన శబ్దం. వాసవి గబుక్కున లేచి కూర్చుంది.

చీకట్లో ఆమెకేం చెయ్యాలో తోచలేదు. ఫ్యూజ్ తీసేసి తనెంత పొరపాటు చేసిందో తెలిసి బాధకలిగింది వాసవికి.

అయినా జగదీష్ కి యిదేం పని మృగంలా.

అర్థరత్రి చీకట్లో దొంగలా యితనికిదేం బుద్ధి వాసవి విసుక్కుంది.

"ఫ్యూజ్ తీసేశావా?" ఆ నీరవ నిశీధిలో జగదీష్ గొంతు వింతగా ధ్వనించింది.

వాసవి ఉలిక్కిపడి నిగ్రహించుకుంది.

ఆమె మాట్లాడలేదు.

"నీ ప్రవర్తన నాకు వింతగా ఉంటోంది, పెళ్ళి చేసుకున్న భర్త పక్కకి వస్తే అలా గోలచేస్తావెందుకు?" వాసవికి ఏం చెప్పాలో తెలియలేదు.

ఆమెకు అమితమైన దుఃఖం ముంచుకొచ్చింది.

"నేనేమైనా ప్రపంచానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నానా?" మళ్ళీ అతని ప్రశ్న.

వాసవి బదులుగా ఏడుస్తున్నట్లు ఆమె వెక్కిళ్ళు ఆ నిశ్శబ్ద వాతవరణంలో చాలా మెల్లిగా వినిపిస్తోంది.

"అరె ఏడుస్తున్నావా? అయాం వెరీ సారీ" అన్నాడతను బదులుగా.

వాసవి అప్పుడు కూడా మాట్లాడలేదు.

"సమయానికి ఈ బ్యాటరీ లైటుకూడా కనిపించడంలేదు. నేను దయ్యాన్ని కాదు. నీకు తాళి కట్టిన భర్తని. ఇంక నీ పర్మిషన్ లేకుండా ముట్టుకోనులే" అన్నాడతను.

బాధను నొక్కిపట్టినట్లుగా అతని కంఠస్వరం వింతగా ధ్వనించింది.

"ఈ చీకట్లో నాకు... చాలా.. భయమేసింది" అంది వాసవి ఏడుపుగొంతుతో.

బదులుగా అతని నవ్వు.

"సిల్లీ! చీకటంటే భయమా చిన్నపిల్లలా. నీకు చీకటంటే యిష్టమనుకున్నాను. అందుకే ఫ్యూజ్ తీసేశావని" అతను చెప్పడం ఆపాడు. వాసవి ఆ చీకట్లో అతని గొంతు ధ్వనిస్తున్న వేపు చూసింది.

నాకు చీకటి, వర్షం అంటే చెప్పలేని థ్రిల్. అందుకే ఎక్సయిట్ అయ్యాను. సారీ బయంలేదు పడుకో" అతడు మంచమ్మీద పడుకున్నట్లుగా శబ్దం.

వాసవి చాలాసేపు అలాగే కూర్చుంది. ఆమెలో దడ చాలా సేపు తగ్గలేదు.

**ఆమెకు కాస్త భయం తీరి** నిద్ర పట్టేటప్పటికి తూర్పు వెలిసిన వస్త్రంలా తెల్లబడుతోంది.

వాసవి మేడమెట్లు దిగుతూ క్రింద హాల్లో భర్తతో ఎవరో కూర్చుని మాట్లాడటం గమనించి ఆగిపోయింది.

జగదీష్ ఎదుట వ్యక్తికి ఏదో ఫైలు అందిస్తూ మెట్లమీద నిలబడ్డ భార్యవైపు అదోలా చూసి వెంటనే సర్దుకున్నట్లుగా కర్చీఫుతో ముఖాన్ని తుడుచుకుని పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు.

వాసవి కూడా బదులుగా నవ్వుదామని ప్రయత్నించి విఫలురాలయినట్లు తల దించుకుంది.

"అక్కడే నిలబడ్డావేం. రా" అన్నాడతను సాదరంగా. వాసవి బరువుగా రెండు మెట్లు దిగింది.

రాత్రి జరిగిన సంఘటన ఆమె మస్తిష్కం మీద యింకా పనిచేస్తోంది.

జగదీష్ మాత్రం ఏమీ జరగనట్లు మాములుగా పలకరిస్తుంటే ఆమెకు విచిత్రంగా ఉంది.

అతనిమీద ఆమెకి విపరీతమైన గౌరవం కలగటంతోపాటు తన ప్రవర్తనమీద ఆమెకి అసహ్యం కూడా కలుగుతోంది. కట్టుకున్న మగవాణ్ణి ఈ రకంగా ఏడిపించే ఆడవాళ్ళు ఉంటారో లేదో కూడా ఆమెకి అంతుపట్టలేదు.

సాంఘిక పరంగానూ, శారీరకంగానూ బలవంతుడైన మగవాడికి ఒక ఆడదాన్ని లొంగదీసుకోడానికి ఎంత టైము కావాలి.

అందులోనూ తాళి కట్టిన భార్యని.

అతనికి తనగురించి ఏమీ తెలియదు. మనసావాచ తననే కోరుకున్న భార్యగా భావించి తనెలా ప్రవర్తించినా ఓర్పుగా చూస్తున్నాడు.

అతని సహనానికీ ఓ హద్దుంటుంది. అది దాటితే తాను అతని కోపానికి సమిధగా మారి మాడిపోవొచ్చు.

అతను దగ్గరగా వచ్చినప్పుడల్లా పిచ్చిపిచ్చి ఆలోచనలతో అతన్ని గాయపర్చటం యింక మానుకుని గతాన్ని సమాధి చేసి అతనికి అన్ని విధాలా సహకరించాలి.

అతనికి అనువైన అర్ధాంగిగా జీవితాన్ని చరితార్థం చేసుకోవాలి.

"రా వాసవీ!" జగదీష్ మళ్ళీ పిలిచాడు మెత్తగా.

వాసవి ఈసారి అతనికేసి చూసి చిరునవ్వు నవ్వింది.

దీప్తివంతంగా మెరుస్తున్న భార్య కళ్ళలోకి తదేకంగా చూసాడు జగదీష్.

వాసవి మెల్లిగా మెట్లన్నీ దిగి వెనక్కి తిరిగి కూర్చున్న ఆ వ్యక్తి వెనుక నుంచి తిరిగి భర్త కూర్చున్న సోఫా వైపుగా వచ్చి నిలబడింది.

ఆమె చూపులు ఎదుటి వ్యక్తి మీద పడ్డాయి. వెంటనే ఆమె గుండె అమితమైన వేగంతో కొట్టుకోవడం ప్రారంభించింది. కనుపాపలు భయంతో, ఆశ్చర్యంతో విశాలమయ్యాయి. శరీరం తూలినట్లయింది. ఆమె గట్టిగా భర్త కూర్చున్న సోఫాని అదిమిపెట్టి దాని ఆసరాతో నిలబడింది. గొంతు ఎండిపోయినట్లుగానూ, నాలుక పిడచ కట్టుకుపోయినట్లుగా ఎలాగో ఉంది ఆమెకి.

''ఇతను మన క్రొత్త సెక్రటరీ వాసవి. పేరు అనంతలక్ష్మీ ప్రభాకర్. షి యీజ్ మై వైఫ్ వాసవి'' అన్నాడు జగదీష్ పరిచయం చేస్తున్నట్లుగా.

అనంత్ ఆమెవైపు చిరునవ్వుతో చూసి 'నమస్కారం' అన్నాడు లేచి నిలబడి.

వాసవి చేతులు యాంత్రికంగా నమస్కరించాయి.

''ప్లీజ్ కూర్చో వసూ'' అన్నాడు జగదీష్ ఆమెకి చెయ్యి అందిస్తూ.

అతని పిలుపుకి వాసవి ఉలిక్కిపడినట్లుగా అనంత్ వేపు చూసింది.

అతను కూడా అదోలా చూసి చూపులు తిప్పుకున్నాడు.

''నేను రోజులు రోజులు టూర్ మీద వెళ్ళినప్పుడు వ్యాపార విషయాలే కాకుండా మన పర్సనల్ మేటర్స్ పట్టించుకోటానికి ఒక మంచి పి.ఎస్ కావాలని ఎడ్వటయిజు చేసాను వసూ. బదులుగా ఎన్ని అప్లికేషన్స్ వచ్చాయనుకున్నావు. అబ్బా ఎంత కాంపిటేషన్ అంతా హైలీ ఎడ్యుకేటెడ్ కేండిడేట్స్. వాళ్ళనుంచి యితన్ని సెలక్టు చేసాను. మన ఇండియాలో ఎంత ప్రబలంగా వుందో నిరుద్యోగ సమస్య. దాన్ని ఆధారం చేసుకుని నేను యితన్ని ఎక్స్ప్లాయిట్ చెయ్యడంలేదు. బ్యూటిఫుల్ సేలరీతో మన అవుట్ హౌవుస్లో యితనికి ఎకామిడేషన్ యిస్తున్నాను. ఆర్ యూ హేపీ'' అన్నాడతను అనంత్ వేపు చిరునవ్వుతో చూస్తూ.

అనంత్ బదులుగా 'థాంక్యూ సర్' అన్నాడు

వాసవి తలదించుకుని కూర్చుంది.

ఇంతలో శంకర్ కాఫీ కప్పులున్న టీ తెచ్చి టీపాయ్ మీద పెట్టి అనంత్ కొకటి, జగదీష్ కొకటి అందించాడు.

మరో కప్పు తనకోసం తెస్తుంటే వాసవి ''వద్దురా'' అంది నీరసంగా.

''నేనే చేసానమ్మా'' అన్నాడు శంకర్ నవ్వుతూ.

''వద్దంటుంటే'' వాసవి కోపంగా రెట్టించినట్లు అంది.

''మా ఆవిడ కోపం వచ్చినప్పుడే మాట్లాడుతుంది. పెళ్ళయి నెల రోజులయినా ఆవిడ పలుకులన్నీ జాగ్రత్తగా ఏరినా నా గుప్పిట నిండలేదు'' అన్నాడు జగదీష్ చమత్కారంగా నవ్వుతూ.

వాసవి విశాలమైన కళ్ళతో భర్తవేపు చూసింది.

ఆ కళ్ళలో ఎర్రజీరలు చూసి జగదీష్ ''సారీ వసూ'' అన్నాడు మెల్లిగా.

వాతావరణం గంభీరంగా ఉండటంతో శంకర్ కప్పులు తీసుకుని మెల్లిగా జారుకున్నాడు.

''పదండి మీకు మీ ఎకామిడేషన్ చూపిస్తాను'' జగదీష్ లేచి నిలబడ్డాడు అనంత్ వైపు చూస్తూ.

అనంత్ కూడా లేచి తన సూట్కేస్ అందుకున్నాడు.

జగదీష్ని అనుసరిస్తున్న అనంత్ అడుగులు దూరమయ్యాక వాసవి వారు వెళ్ళిన వైపు మెల్లిగా చూసింది.

ఆమె లేచి లోనికి వెళ్దామనుకుంది. కానీ కాళ్ళు మొద్దుబారిపోయినట్లు, వంట్లో నరాలన్నీ చచ్చిపోయినట్లుగా ఆమె అక్కణ్ణించి కదలలేకపోయింది.

సాయంకాలపు నీరెండ బాల్కనీలోకి రావాలని వృథా ప్రయత్నం చేస్తోంది.

మొన్న పడిన వర్షానికి కడిగినట్లున్న చెట్ల ఆకులు సూర్యకాంతిలో పచ్చలు పొదిగినట్లు మెరుస్తున్నాయి.

చురుకుదనం కోల్పోయినట్లున్న వాసవి కళ్ళు ఎటో కనిపించని దూరాల్ని కొలుస్తున్నాయి. ఆమె అర్థంలేని ఆలోచనలు చేసి చేసి విసిగిపోయినట్లు తల విదిలించుకుంది. అనంత్ ఆగమనం ఆమెని విభ్రాంతురాల్ని చేస్తోంది. తిరిగి అతన్ని చూడబోనని అతనికి తనకి మధ్య నీడకూడా కనిపించని తెరపడిందని ఆమె ఊహించింది.

కానీ.. ఇదేమిటిలా విచిత్రాతి విచిత్రంగా అతను తిరిగి తన జీవితంలోనికి ప్రవేశించడం. అతను తనిక్కడ ఉందని తెలిసే వచ్చాడా? లేక ఈ సంఘటన కేవలం యాదృచ్చికమేనా? వాసవికి ఎంత ఆలోచించినా అంతుబట్టటంలేదు.

అతని రాకవల్ల తన జీవితంలో ఏదైనా ఒడుదుడుకులు అవుతాయేమోనని కూడా ఆమెకు భయంగా ఉంది.

కేవలం అనంత్ తన హృదయంలో తిష్ట వేసిన కారణంగానే తనింకా జగదీష్‌తో సరిగ్గా కలిసి మసలలేక పోతోంది.

ఇక ఎదుట కనిపిస్తూవుంటే తను నిగ్రహించుకుని తిరగ్గలదా? అతను తనకు తెలియనట్లు అతన్నొక సెక్రటరీగా చుస్తూ సినిమాలోలా నిజ జీవితంలో నటించడం తనకు సంభవం కాదు.

తన్ని తనెంత గాఢంగా ప్రేమించింది. అతనితో ఎన్నెన్ని మధురస్వప్నాలు కన్నదో. అతనే తన జీవితకాలం సహచరుడిగా భావించి ఎన్నెన్ని చిలిపి పనులు చేసి గిల్లికజ్జాలు పెట్టుకున్నది. ఇప్పుడతను తన సెక్రటరీ

వాసవి కళ్ళలోకి నీళ్ళూరాయి.`"అమ్మగారూ"

శంకర్ రావడంతో వాసవి ఆలోచనలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

వాసవి వెనక్కి తిరిగి `ఏంరా?` అంది.

"మీ దగ్గర దెబ్బలకి రాసే ఆయింటుమెంటుందాండీ" అన్నాడు.

"ఎందుకు?" అంది

"మరేమో ఆ కొత్తయ్యగారికి దెబ్బ తగిలింది."

"ఎలా తగిలింది?" వాసవి ఆదుర్దాగా అడిగింది.

"రాత్రి కుక్క కరిచిందంటండి"

"రాత్రా?" వాసవి ఆశ్చర్యంగా అడిగింది.

"అవునండి ఆయన మధ్యరాత్రి వచ్చి గేటు తియ్యబోతే మన బ్రౌనీ లేదండీ అదేమో చెయ్యిపట్టుకుని అమాంతం కరిసేసిందంటండి పళ్ళు బలే లోతుకి దిగాయండి" అన్నాడు శంకర్ నవ్వుతూ.

"ఎందుకురా అలా నవ్వుతావు? ఎవరికైనా బాధ కలిగితే నవ్వడం అనారోగ్య లక్షణం. పోయి ఇదిచ్చిరా" అంటూ రేక్‌లో వున్న ఆయింట్‌మెంట్ ట్యూబు అందించింది.

శంకర్ ట్యూబ్ అందుకుని రివ్వున పరిగెత్తాడు. వాసవి అడుగుల చప్పుడికి వెనక్కి తిరిగి చూసింది.

జగదీష్

వాసవి చూపు దించుకుంది. అతను వచ్చి ఎదురు కుర్చీలో కూర్చుని "మన క్రొత్త సెక్రటరీకి అప్పుడే మన బ్రౌనీ మంచి మర్యాద చేసేసింది" అన్నాడు నవ్వుతూ.

వాసవి మాట్లాడలేదు. ఆమె చూపులు కుర్చీ మీద చిటికెలు వేస్తోన్న జగదీష్ ముంజేతిమీద పడ్డాయి.

క్రాస్ మోడల్‌లో తెల్లటి పట్టి అతని చేతిమీద చూసి "కుక్క కరిచింది అతన్నేనా?" అంది మెల్లిగా.

"అవును" అన్నాడు జగదీష్ అర్థంకానట్లు చూస్తూ.

"మరి మరి" అంటూ చేతివైపు చూస్తూ ఆగిపోయింది వాసవి.

జగదీష్ చేతివేపు చూసుకున్నాడు. ఆ వెంటనే పకపకా నవ్వేసి భార్య ముఖంలోకి చూసాడు కొంటెగా.

వాసవి అర్థకానట్లు చూసింది.

"ఇది ...ఇది రాత్రి నువ్విచ్చిన తొలిప్రేమ కానుక" అన్నాడు మళ్ళీ నవ్వుతు.

వాసవి ముఖం సిగ్గుతో ఎర్రబడిపోయింది.

రాత్రి అతన్ని బలంగా కొరికిన సంఘటన గుర్తొచ్చి ఆమె అతని వంక చూడలేనట్లే అపరాధిలా తల దించుకుంది.

జగదీష్ నవ్వడం ఆపి "ఎందుకంతగా సిగ్గు పడిపోతావ్. ఇన్నాళ్ళకి కనీసం నన్ను కొరకాలని అనిపించినందుకే నేను చాలా సంతోషపడి పోతున్నాను. మా ఆవిడిచ్చిన ప్రజంటేషన్ అని అందరికీ గర్వంగా చెప్పుకుంటాను" అన్నాడు చిలిపిగా.

వాసవి తలయెత్తి "ప్లీజ్" అంది కంగారుగా.

"ఏం బాగుండదా?" అన్నాడు ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ.

వాసవి మాట్లాడలేనట్లు చూసింది.

"ఆ భయంలో తెలియలేదు. క్షమించండి" అంది.

జగదీష్ లేచి నిలబడి ఆమె దగ్గరగా వచ్చి "నీ మనస్తత్వం నాకు చాలా విచిత్రంగా ఉంటోంది. నిన్నెలా ట్రీట్ చెయ్యాలో ఒకసారి మీ డాడీని పిలిపించి ట్రయినింగ్ ఇవ్వాలి. నన్నో విలన్‌లా ఎన్నాళ్ళు చూస్తావో తెలియడంలేదు" అన్నాడు.

వాసవి అడుగు పెదవి మునిపంటితో కొరుకుతూ నిలబడింది.

"సరే ఆ సంగతి వదిలేయ్. నేను బహుశా రాత్రి ఫ్లయిట్‌లో ఢిల్లీ వెళ్ళాల్సిరావొచ్చు. రావడానికి పదిరోజులు పడుతుందేమో. నీకేమైనా కావాలంటే మన సెక్రటరీ ఉంటాడు. శంకర్ సరేసరి" అన్నాడు.

వాసవి కంగారుపడ్డదానిలా గబుక్కున అతని చెయ్యి పట్టుకుని "నేనూ వస్తాను" అంది.

జగదీష్ వాసవి వైపు వింతగా చూసాడు.

వాసవి బాహ్యస్మృతి కలిగినదానిలా అతని చేతిని వదిలేయబోయింది.

"నీ కోరికని కాదంటున్నందుకు క్షమించు, నా కక్కడ బిజినెస్ పర్మిట్ దొరికింది అక్కడ నువ్వొక్కతివీ హోటల్లో ఏం చేస్తావు తిరిగొచ్చాక మనం మనకోసం ఎట్లైనా వెళ్దాం ఏం?" అన్నాడు అనునయంగా.

వాసవి మాట్లాడలేనట్లు చూసింది.

"సారీ ఫర్ ద డిసప్పాయింట్ మెంట్" జగదీష్ ఆమె చేతిని నొక్కి వెళుతుంటే వాసవి నిరుత్సాహంగా నిలబడిపోయింది.

## 10

"అమ్మగారూ"

ఫోను డయల్ చేస్తున్న వాసవి వెను తిరిగి చూసింది.

శంకర్ లోనికొచ్చి దగ్గరగా నిలబడ్డాడు.

"అమ్మా ఆ కొత్త సెక్రటరీగారు మిమ్మల్ని పిలుస్తున్నార"ని చెప్పాడు వాడు.

వాసవి కోపంగా భ్రుకుటి ముడిచింది.

"ఎందుకట?" అంది చిరాగ్గా మరో చేతితో డయిల్ చేస్తూనే.

"తెలీదండి ఆయనేవో చాలా పూల మొక్కలు బండిలో ఏసుకొచ్చారు" అన్నాడు శంకర్.

"నేను పనిలో ఉన్నాను రానన్నాని చెప్పు" అంది వాసవి.

వాసవి కోపంగా వున్న విషయం గ్రహించి శంకర్ మెల్లిగా బయటికి కదిలాడు.

వాసవి అప్పటికి పావుగంటనుండి ట్రై చేస్తోంది హైదరాబాదు తండ్రితో మాట్లాడాలని.

లైను దొరకటంలేదు. ఆమెకు అనంత్ వచ్చిన దగ్గరినుండి మనశ్శాంతిగాలేదు. అతను తిరిగి తన జీవితంలో ఈ విధంగా ప్రవేశించిన సంగతి చెప్పి ఆయన్నుండి ఊరట పొందాలని అతన్ని తమ యింటినుండి పంపేసే విధానం కూడా ఆయన చెబుతాడని ఆమె నమ్మకం. కనెక్షన్ దొరక్క విసుగెత్తి వాసవి అర్జెంటు కాల్ బుక్ చేసి కూర్చుంది అలసటగా.

మరో అయిదు నిముషాల్లో కాల్ వచ్చింది.

వాసవి రిసీవర్ పట్టుకుని "డాడీ డాడీ" అంటూ పిలిచింది ఆత్రుతగా.

"నేనమ్మా రంగయ్యని"

వాసవి నౌకరు గొంతు విని ఉసూరుమంది.

"డాడీని పిలువు అర్జెంటు"

"అయ్యగారు నిద్రపోతున్నారమ్మా"

వాసవికి కోపం ముంచుకొచ్చింది. "డాడీకి బెడ్ రూమ్‌లోకి కనెక్షన్ యివ్వు" అంది అసహనంగా.

అవతల్నుండి నాలుగు సెకన్లు సరయిన జవాబు లేదు.

"అయ్యగారు బాగా నిద్రపోతున్నారమ్మా" వాసవి పళ్ళుబిగపట్టి బల్లమీద గుద్దింది కోపంగా.

"నువ్వు పిచ్చివాగుడు మానేసి వెంటనే డాడీని నిద్రలేపుతావా లేదా?"

అటునుండి మౌనం. వాసవి స్థిమితం లేనట్లు చేతిగోళ్ళవంక చూసుకుంటూ కూర్చుంది.

"హల్లో వాసవీ" జగన్నాధరావుగారి గొంతు చాలా మెల్లిగా వినిపించింది.

వాసవి ఉత్సాహంతో ఎగిరినట్లు కుర్చీలోంచి ముందుకు వంగి "డాడీ! నేను" అంది.

"బేబీ బాగున్నావా?"

వాసవి ధైర్యం చిక్కిన మనిషిలా "బాగున్నాను డాడీ! మీరు?" అంది.

"బాగానే ఉన్నాను తల్లీ. పెద్ద వయసు కదూ మా బాగుదేముంది?" అన్నారు చిన్నగా నవ్వుతూ.

"డాడీ నీకో విషయం చెప్పాలి" అంది వాసవి.

"చెప్పమ్మా" అన్నారాయన అనునయంగా.

"డాడీ మరి.. మరి"

అవతల ఫోన్లో జగన్నాధరావుగారు సన్నగా నవ్విన "చెప్పుతల్లి సందేహం ఎందుకు?"

వాసవికి ఎలా చెప్పాలో అర్థం కాలేదు.

ప్రతి చిన్న విషయానికి భయపడి తండ్రిని కంగారు పెట్టడం ఆమెకు మొదట్నుంచీ గిట్టదు. చిన్నతనం నుండి తన విషయాల్లో ఎవ్వరూ జోక్యం చేసుకోకూడదనేది ఆమె అభిమతం. తన విషయాలు తనే ఆలోచించి నిర్ణయం తీసుకుని ఆచరణలో పెట్టడం ఆమెకు అలవాటు.

అలా తనంతట తానుగా తీసుకున్న నిర్ణయాలు ఎప్పుడైనా ఎదురు దెబ్బ కొట్టినా అందుకామె పెద్దగా బాధపడేదికాదు. పెద్దవాళ్ళజోక్యం వుంటే యిలా జరిగివుండేది కాదుకదా! అని దిగజారిపోయేదికాదు ఎవరి సమస్యల్ని వారే పరిష్కరించుకోవాలన్న సిద్ధాంతం ఆమెది.

కానీ ఈ రోజు తన మనస్తత్వానికి విరుద్ధంగా డీలా పడి తండ్రికి చెప్పుకోవాల్సి రావడం ఆమెకు చిన్నతనంగానే వుంది.

అందుకే ఎలా మొదలు పెట్టాలో తెలియనట్లు రిసీవర్ పట్టుకుని అలాగే నిలబడి పోయింది.

''హలో బేబీ.. బేబీ'' అంటూ పిలుస్తున్నారు జగన్నాథరావుగారు.

టైమ్ అయిపోయిందంటూ హెచ్చరించింది టెలిఫోన్ ఆపరేటర్.

మరో మూడు నిమిషాలు ఎక్స్‌టెండ్ చెయ్యమని కోరింది వాసవి కంగారుగా.

''బేబీ అక్కడంతా బాగున్నారుగా'' అన్నారు జగన్నాథరావుగారు సందేహంగా.

''బాగున్నారు డాడీ ఇక్కడ... ఇక్కడ అనంత్...''

''ప్లీజ్ మీ డాడీకి నేనిక్కడకి వచ్చిన విషయం చెప్పకండి''

వాసవి ఆశ్చర్యపోయినట్లు గుమ్మం వైపు చూసింది.

గుమ్మానికి చేతులటూ యిటూ వుంచి నిలబడ్డ అనంత్‌ని చూసి నివ్వెరపోయింది వాసవి.

తెల్లబోయి విశాలమైన ఆమెకళ్ళు మరో క్షణంలో కోపంతో తీవ్రంగా ఎర్రబడ్డాయి.

ఏదో అనాలని ఆమె పెదవుల చిన్నగా కదిలాయి.

''ప్లీజ్ మీరు నన్ను ఎన్నయినా తిట్టండి, కానీ మీ ఫాదర్‌కి ఇప్పుడేం చెప్పొద్దు. ఆయన కండిషన్ బాగుండలేదు. ఆయన్ని ఎగ్జయిట్ చెయ్యొద్దు''

వాసవి షాక్ తిన్నట్లు చూసింది.

''కంగారు పడకండి ఆయనకేం భయంలేదు. ముందాయనకి ఏదో ఒకటి చెప్పి ఫోన్ పెట్టేయండి'' అన్నాడు అనంత్ అర్థింపుగా.

''బేబీ! బేబీ'' అంటూ పిలుస్తూనే వున్నారు జగన్నాథంగారు.

''వాసవి స్పృహ వచ్చినట్లు ఎస్ డాడీ'' అంది నీరసంగా.

''అనంత్ అంటున్నావేమిటమ్మా?''

వాసవి దొరికిపోయినట్లు నిలబడిపోయింది.

ఏం చెప్పాలో తోచనట్లు అనంత్ వేపు చూసింది.

''అనంత్ కనిపించాడా? అదే నీ దగ్గరకి వస్తున్నాడా?'' అంది తడబాటుగా.

గుమ్మం దగ్గర నిలబడ్డ అనంత్ కళ్ళు మెరవటం వాసవి గమనించలేదు.

''వచ్చాడమ్మా నాలుగురోజుల క్రితం అనుకుంటా నేనే రావద్దని గట్టిగా చెప్పి పంపాను. నేను అతన్ని యింకా ఎందుకు రానిస్తానమ్మా? నీ శత్రువు  నా శత్రువు కాదా?'' అన్నారు నవ్వుతూ.

''ఓ.కే డాడీ ఉంటాను'' వాసవి నీరసంగా అని రిసీవర్ హుక్ మీద పెట్టేసింది.

''థాంక్యూ!'' అనంత్ మాటలకి సర్రున తలెత్తి చూసింది వాసవి.

**అతను అక్కడే** గుమ్మం పట్టుకుని చిరునవ్వు చిలికిస్తూ నిలబడ్డాడు.

వాసవికి ఎంతో నిస్సహాయంగా ఉంది. డాడీకి తెలియదు. నా శత్రువు నా యింట్లోనే తిష్టవేసాడని అనుకుంది మనసులో.

అతన్ని వెళ్ళిపొమ్మని గట్టిగా చెప్పాలనుందామెకు. కానీ నోరు పెగలటంలేదు. అతను తనకి శత్రువో, మిత్రుడో అర్ధంకావడంలేదామెకు. అయినవాళ్ళందరికీ చాలా దూరంలో వున్నప్పుడు ఉన్న ఊళ్ళో శత్రువు తారసపడినా మాట్లాడాలనిపించే ఆరాటం ఆమెకు కూడా కలుగుతోంది.

ముఖ్యంగా తన తండ్రి ఆరోగ్యం గురించి అడగాలని ఉంది. కానీ ఎలా అడగాలో తెలియని స్థితి.

"మీరు డాడీ గురించి కంగారు పడొద్దు. ఆయనిప్పుడు బాగున్నారు. కానీ ఎలాంటి ఎక్సయిట్‌మెంట్ కలిగించే విషయాలూ చెప్పొద్దన్నారు డాక్టరు. మీరు సడెన్‌గా నా గురించి చెపితే ఆయన మరోలా ఫీల్ కావొచ్చు" అన్నాడు అనంత్.

"డాడీని..డాడీని నీవు చూసావా?" అంది వాసవి నీరసంగా.

"చూడాలనే వెళ్ళాను. ఆయనకి నా మీద బాగా కోపంగా ఉంది. రావడానికి వీలులేదని అన్నారు. ఆయనకి కోపం తెప్పించడం మంచికాదని వెళ్ళడం మానేసాను. కానీ ఆయన యోగక్షేమాలు వేరుగా కనుక్కుంటూనే ఉన్నాను. ఆయనకేం ఫరవాలేదు. మీరు కంగారు పడకండి అన్నాడు అనంత్.

"నేను.. నేను డాడీని చూడాలి" అంది వాసవి ఆందోళనగా "మీరలా కంగారు పడొద్దు. ఆయన బాగానే ఉన్నారు" అన్నాడు అనంత్ అనునయంగా.

"నో! నేను వెళ్ళి తీరాలి. నాకు ఫ్లయిట్ టిక్కెట్ బుక్ చేయండి" అంది వాసవి.

వాసవి మనస్తత్వం తెలిసిన అనంత్ ఒక్క క్షణం మాట్లాడలేదు.

"మీ యిష్టం. కానీ సార్ లేనప్పుడు మీరు వెళ్ళడం బాగుండదేమో ఒక క్షణం ఆలోచించండి" అన్నాడు అనంత్.

వాసవి అతనికేసి తీవ్రంగా చూసింది.

"ఏది బాగుంటుందో బాగుండదో మీరు చెప్పనక్కరలేదు. టిక్కెట్ తెప్పించడమే మీ పని" అంది విసురుగా.

"సారీ మేడమ్" అన్నాడు అనంత్ జంకుగా.

అతను వెనక్కి తిరిగాడు.

రెండడుగులు వేసి ఆగి "మీరొకసారి బయటకి రాగలరా?" అన్నాడు చాలా వినయంగా.

"ఎందుకు?"

"గార్డెనింగ్ అంటే మీకు చాలా యిష్టమని, మంచి మంచి పూల మొక్కలు తెచ్చి గార్డెన్ రీమోడల్ చెయ్యమని సార్ చెప్పారు. మొక్కలు వచ్చాయి. ఒకసారి వాటినెలా అమర్చాలో మీరు చెబితే" అంటూ అతను సంశయంగా వాసవి ముఖంలోకి చూస్తూ నిలబడ్డాడు.

"ఇప్పుడు నేనేం చెప్పను. చెప్పలేను. మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి" అంటూ హిస్టీరికల్‌గా అరిచింది వాసవి.

అనంత్ మరేం మాట్లాడలేనట్లు వెను తిరిగాడు.

"మిస్టర్ అనంత్" ఆమె కంఠస్వరానికి అతను ఉలిక్కిపడ్డట్లుగా ఆగిపోయాడు.

"నువ్వు నువ్వు నేనిక్కడ ఉన్నానని తెలుసుకునే వచ్చావు కదూ" ఎంత గంభీరంగా అడుగుదామని అనుకున్నా ఆమె గొంతు సన్నగా వణికింది.

అనంత్ విస్మయంగా చూసాడు.

"నాకు తెలుసు నువ్వు నన్ను, మా డాడీని సాధించాలని ఈ రకంగా నా జీవితంలో ప్రవేశించావు" అంది వాసవి తిరిగి ఆవేశంగా.

అనంత్ కళ్ళు పెద్దవి చేసాడు.

"నీ పురోభివృద్ధికి డాడీ ఎంతగానో సహాయపడ్డారు. నేను సరేసరి. నిన్ను ఎంతగానో అభిమానించాను. దానికి ఫలితంగా ఋణం తీర్చుకోవాలని యిలా నా వెంటపడ్డావ్ అవునా?" వాసవి హేళనగా నవ్వింది.

అనంత్ పెద్ద రాయితో నెత్తిమీద కొట్టినట్లు దిమ్మెరపోయి చూసాడు.

"నువ్వు యింత దుర్మార్గుడవని, తిన్న యింటి వాసాలు లెక్కపెట్టేవాడివని"

"ప్లీజ్ స్టాపిట్ వాసవీ" అనంత్ ఆవేశంగా అరిచాడు.

వాసవి హేళనగా చూసింది.

"నువ్వు నమ్మినా నమ్మకపోయినా నేను నిజం చెబుతున్నాను. నాకు నువ్విక్కడ వున్న సంగతి నిన్న నిన్ను చూసేవరకూ తెలియదు. నీ పెళ్ళి మరొకరితో కాబోతున్నదన్న సంగతి తెలియగానే నేను హైదరాబాదు వదిలేసి ఎటెటో తిరిగాను. తిరిగి నా మనసు స్థిమితపడ్డాక హైదరాబాదు వెళ్ళాను. వెళ్ళగానే మీ డాడీకి బాగోలేదని తెలిసింది. చూడాలని ప్రయత్నించాను. ఆయన నా ముఖం చూడ్డానికి అంగీకరించలేదు. అదంతా నా దురదృష్టం. నిన్ను పెళ్ళి చేసుకుంటే ఎవరికయితే కోపం వస్తుందని భయపడ్డానో ఆయనకి నిన్ను పెళ్ళి చేసుకోనందుకు కోపం రావడం నా బేడ్‌లక్ కాకపోతే మరేమిటి? చివరకు ప్రైవేట్ సెక్రటరీ కావాలని మీ వారు చేసిన ప్రకటన చూసి దూరంగా వెళ్ళిపోవచ్చని అప్లయ్ చేసాను కానీ యింత విచిత్రంగా తిరిగి నీ దగ్గరకే వస్తున్నట్లు నాకు తెలియదు. నా ఉనికి నీకు కోపం తెప్పిస్తే చెప్పు సార్ వచ్చాక రిజైన్ చేసి వెళ్ళిపోతాను. కానీ నన్ను నయవంచకుడిగా దుర్మార్గుడిగా మాత్రం జమకట్టకు. అది నేను భరించలేను. నేను బలహీనుణ్ణి కాబట్టి చేతికి అందిన వజ్రాన్ని వదులుకున్నాను. అందుకు నా జీవితమంతా విచారిస్తాను. కానీ నా ప్రాణంలో ప్రాణంగా ప్రేమించిన వ్యక్తికి హాని తలపెట్టే నీచుణ్ణి మాత్రం కాదు. అనంత్ ఆ మాటలు చెప్పి వేగంగా అక్కణ్ణుంచి కదిలిపోయాడు.

వాసవి అతను వెళ్ళిన వేపు నిరుత్తరాలయి చూసింది.

జగదీష్‌కి ఎలాగయినా సమర్ధించి చెప్పి అతన్ని ఉద్యోగంలోంచి తీసెయ్యాలన్న ఆమె నిర్ణయం అనంత్ మాటలకి గాలికి చెల్లా చెదురయి మబ్బుల సమూహంలా తేలిపోయింది.

గుండెలో ఏ మూలో అతని పట్ల వున్న ప్రేమ అతన్ని క్షమించేటట్లు చేసింది.

అతనివల్ల తన జీవితానికే భయంలేదన్న నిశ్చింత దొరికాక ఆమె తేలిగ్గా గాలి పీల్చుకుంది.

వాసవి జగదీష్ గదిలోకి వెళ్ళింది.

ఆ గదిలో వున్నవన్నీ ఖరీదైన వస్తువులే కానీ ఏమీ వాటి వాటి స్థానాల్లో లేక చిందర వందరగా ఉన్నాయి.

పనివాళ్ళు ఎంతమంది వున్నా ఇల్లాలు లేని యిల్లు ఎలా పొందికగా ఉండదో ఆ గది చూస్తే అర్ధం అవుతుంది.

వాసవి మంచమ్మీద బట్టలన్నీ తీసి క్రింద పడేసింది.

వార్డు రోబ్‌లోంచి కొత్త కర్టెన్స్ తీసి గుమ్మాలకి కిటికీలకి అమర్చింది. బ్రష్‌తో షో కేసులోని బొమ్మలమీద మట్టిని మెల్లిగా దులిపింది.

ఎక్కడెక్కడి కలక్షన్సోగానీ అవి ప్రాణం పోసుకున్న మనుషుల్లా జీవం ఉట్టిపడుతున్నాయి.

వాసవికి జగదీష్‌ని ఆశ్చర్యపరచాలని ఆ గదిని చూసి అతను సంతోషపడాలని తనే ప్రత్యేకంగా ఆ గదిని సర్దిందన్న విషయం అతనికి తెలియాలని ఆరాటంగా ఉంది.

అతనంటే తనకి భయంలేదని అతను పులి తను లేడి కాదనికూడా అతనికి చెప్పాలని ఆమెకు కోరికగా ఉంది.

తన మనసులో ఏ అయిష్టతా లేదని అతనితో అన్ని విధాలా జీవితాన్ని పంచుకోవటానికి తను సిద్ధమేనని ఆ గది చూడగానే అతనికి తెలియాలన్నది ఆమె ఉద్దేశం.

అందుకే వాసవి చాలా కష్టపడి పనివాళ్ళ సహాయం లేకుండా ఆ గదిని అందంగా సర్దసాగింది.

ఎక్కడి వస్తువులు అక్కడ పెట్టినందుకే ఆ గది ఇంద్రభవనంలా మెరిసిపోతోంది.

వాసవి శంకర్‌ని పిలిచి కార్పెట్ దులిపి వేయమని చెప్పి గదిని అన్ని కోణాల్లో చూడసాగింది.

ఫ్లవర్ వాజుల్లో వున్న ప్లాస్టిక్ పూలని చూడగానే ఆమెకి అసహ్యం వేసింది. వాటిని తీసి వేస్ట్ బాస్కెట్‌లో వేసేసింది చిరాగ్గా "శంకర్, తోటలోని పూలు తీసుకురా" అంది వాసవి.

శంకర్ వెళ్ళబోతుంటే ఏదో గుర్తొచ్చినదానిలా వాసవి "నీకు తెలియదులే నేనే తెస్తాను" అంటూ మెట్లుదిగి హాల్లోంచి బయటకొచ్చింది. ఆమె కళ్ళు అక్కడి మార్పులు చూడగానే ఆశ్చర్యంతో విశాలమయ్యాయి. వరండా పొడవునా కుండీలలో పలకరిస్తోన్న రకరకాల గులాబీలు.

ఎదురుగా వున్న మర్రిచెట్టుకి అందంగా ఊగుతున్న రెండు ఉయ్యాలలు.

గుబురుగా పెరిగిన చాలా వృక్షాలు నరికేసినట్లు తెలియకుండా చేసి నీట్‌గా ఉన్నాయి.

పెరిగిన గడ్డి కటింగ్ వల్ల పచ్చిక తివాసీలా మెరుస్తోంది.

చెట్లమధ్యనుంచి ఆకాశం అందంగా కనిపిస్తోంది. తనకిష్టమైన గులాబీలని చూసి వాసవి మనసు ఆనందంతో నర్తించింది.

ఒక్కరోజులో యిన్ని మార్పులా? తను గమనించలేదు. వాసవి దానికి కారకులెవ్వరో ఊహించింది. ఆమె అవుట్ హౌవుస్ వేపు చూసింది.

అక్కడ వరండాలో తననే నవ్వుతూ గమనిస్తోన్న అనంత్‌ని చూసి ఆమె మెల్లిగా తల తిప్పింది.

అతను మెల్లగా తనవేపే రావడం గమనించి ఆమె అడుగు వెయ్యలేనట్లు నిలబడిపోయింది.

అనంత్ ఆమెకు దగ్గరగా వచ్చాడు.

"నాకు తోచినట్లు చేసాను మీకు నచ్చిందా?" అన్నాడు.

వాసవి మాట్లాడలేదు.

"ఇదిగోనండి మీ ఫ్లయిట్ టిక్కెట్" అతను అందిస్తుంటే వాసవి మెల్లిగా చెయ్యిచాచి అందుకుంటూ "థాంక్యూ" అంటూ గొణిగినట్లు అంది.

అనంత్ బదులుగా "ఇటీజ్ ఏ ప్లీజింగ్ డ్యూటీ టు సర్వ్ యూ" అన్నాడు మెల్లిగా.

వాసవి తలతిప్పి చూసి వడివడిగా లోపలికి నడిచింది.

అతని చూపులు తనని వెంబడిస్తున్నాయనే ఊహతో ఆమె అడుగులు తడబడ్డాయి.

## 11

"మేడమ్"

నిలువుటద్దంలో చీర సరిచేసుకుంటున్న వాసవి వెనుతిరిగి చూసింది.

అక్కడ అనంత్.

"మీకు ఫ్లయిట్‌కి టైమవుతోంది" అన్నాడతను.

"జస్ట్ ఎ మినిట్" అంది వాసవి పమిటకి బ్రోచ్ తగిలిస్తూ.

"ఓ.కె మేడమ్" అనంత్ చిరునవ్వు నవ్వి వెనుతిరిగాడు.

అతను మెట్లు దిగతుంటే అతని వేపు కన్నార్పకుండా చూసింది వాసవి.

అతను స్నఫ్ కలర్ సూట్ వేసి టై కట్టుకున్నాడు. ఎగదువ్విన ఉంగరాల క్రాఫ్ సముద్రపుటలల్లా గాలికి కదులుతోంది. ఆ నవ్వు ఆ నడక వాసవికి ఏవేవో తీపి జ్ఞాపకాలు.

సూట్ చాలామంది వేస్తారు. ఎవరో ఎందుకు జగదీష్ ఎప్పుడూ సూట్‌లోనే ఉంటాడు. ఆ డ్రస్ అతనికి అందం తేకపోగా సూట్ అందమే చెడిందేమోననిపిస్తుంది వాసవికి.

అనంత్‌లోని గొప్ప ఆకర్షణ అతని శరీర నిర్మాణం, కంఠస్వరం, చూపులు.

సూట్‌లో ఆడవాళ్ళ గుండెల్ని అల్లరి పెట్టేంత సమ్మోహనంగా వున్న అనంత్‌ని చూడగానే క్షణకాలం ఆమె మనసు నిశ్చలత్వాన్ని కోల్పోయింది.

వాసవి వివేకం తెచ్చుకుని తల విదిలించుకుంది. పర్స్ చేతిలోకి తీసుకుని "శంకర్" అంటూ కేకపెట్టింది. శంకర్ రాకపోగా క్రిందనుండి ఏదో ఘర్షణ వినబడుతోంది.

అనంత్ గొంతు తీవ్రస్థాయిలో వుంది. అవతల గొంతు ఎవరిదో అంతుబట్టడంలేదు వాసవికి.

"యూ స్కౌండ్రల్! గెటవుట్" అనంత్ గట్టిగా అరుస్తున్నాడు.

వాసవి గబగబా నాలుగుమెట్లు దిగింది.

ఎదురుగా ముత్తు.

వాసవి ఎదురొచ్చిన ముత్తువేపు చిరాగ్గా చూసింది.

ముత్తు వాసవి కోపాన్ని పట్టించుకోలేదు.

రెండు చేతులూ మెట్లకి అడ్డంగా చాపింది.

అలా చాపిన చేతులు చలిజ్వరం వచ్చినట్లు వణుకుతున్నాయి. ముఖంలో స్పష్టంగా కనిపిస్తోన్న ఆందోళన.

వాసవి ముత్తు విపరీత చేష్టలకి నివ్వెరపోయినట్లు చూసింది. ముత్తు తమిళంలో ఏదో అంటోంది. వాసవికి అర్థం కావడంలేదు. వాసవి ముతుత్ని లక్ష్యపెట్టకుండా ముందుకి దిగబోయింది.

ముత్తు స్టెయిర్ కేస్ రెయిలింగ్‌ని చేతులతో ధృఢంగా పట్టుకుంది. "దయవువణ్ణి (సెయిదు) కీళెవరాదె అందరవుడీ ఇరకాయిన్."

వాసవికి అర్థమైపోయింది. తను క్రిందకి రావటాన్ని ముత్తు అభ్యంతరపెడుతోంది.

గుంటకళ్ళు, కోరపళ్ళు, కాలినట్లుండే వళ్ళు. ముత్తుని ఎన్నిసార్లు చూసినా కంపరమే వాసవికి.

"ముందా చెయ్యి తియ్యి" అంది వాసవి అసహనంగా. ముత్తు వినిపించుకోనట్లు మరో మెట్టు పైకెక్కింది.

దానిదగ్గర అదోలాంటి మురికి వాసన గుప్పుమంది.

వాసవి ఖర్చీపు ముక్కుకి అడ్డంగా పెట్టుకుంది. అవతల ఫ్లయిట్ టైమయిపోతోంది. ముత్తుకేమన్నా పిచ్చెక్కిందా?

వాసవికి ఒకపక్క భయంగా మరో పక్క దాన్ని కప్పేసేంత కోపంగానూ ఉంది.

"శంకర్" వాసవి మరోసారి కేక పెట్టింది.

ఉహూ! అవతల ఘర్షణ గట్టిగా వినబడుతోంది.

వాసవి ఇక సహించలేనట్లు ముత్తు చెంపమీద లాగికొట్టింది. ఈ హఠాత్పరిమాణానికి ఉలిక్కిపడ్డట్లు రెయిలింగ్ మీద చేతులు తీసేసి చెంప నిమురుకుంది ముత్తు.

ఆ దెబ్బదాటికి దాని కళ్ళనిండా నీళ్ళు సుళ్ళు తిరిగాయి. దాన్ని ముట్టుకున్నందుకు ఓ విధమైన జుగుప్సతో వళ్ళు జలదరించింది వాసవికి.

అలా కొట్టాల్సివచ్చినందుకు ఆమె గుండెలోపల ఎక్కడో తప్పు చేసానన్న భావన.

వాసవి గబుక్కున ముందుకు ఉరికినట్లు దిగబోయింది.

ముత్తు వాసవివైపు ఆందోళనగా చూసింది.

ఆ వెంటనే వాసవి కాళ్ళకి తన కాలు అడ్డం పెట్టింది. వాసవి పడబోయి నిగ్రహించుకుని దిమ్మెరపోయినట్లు చూసింది ముత్తువైపు.

అదుపులేని కోపంతో ఆమె శరీరం ప్రకంపించింది.

ఆమె చెయ్యి పడగలా లేచింది ముత్తుపైకి.

ముత్తు ఈసారి జాగ్రత్తగానే ఉంది.

విపరీతమైన వేగంతో తనపై దాడి చేయబోతున్న వాసవి చేతిని బలంగా పట్టుకుంది.

వాసవి ముత్తుని విసిరికొట్టాలని ప్రయత్నించే కొలది ఆ చెయ్యి వాసవి చేతిమీద బిగిసిపోతోంది.

పిచ్చి బలం అది.

ముత్తు ఏదో శక్తి పూనినట్లు వాసవి చేతిని గుంజుతూ మెట్లన్నీ ఎక్కేసింది.

వాసవి పెనుగులాడినా ముత్తు చేతినుండి తప్పించుకోలేకపోయింది.

కలుగులోని పాములా ముత్తు తనని మహా బలంతో పైకిలాగేస్తుంటే వాసవి భయభ్రాంతురాలయి వణికిపోసాగింది.

ముత్తు వాసవిని గదిలోకి త్రోసి గది గడియపెట్టేసింది. తలుపుకవతల వాసవి దిగ్భ్రాంతితో

ఇవతల ముత్తు నిలువెల్లా ఆయాసంతో వణికిపోతూ.

సరిగ్గా అప్పుడే అనంత్ మేడమీద కొచ్చి తలుపుకి జేరబడి వణుకుతూన్న ముత్తుని చూసాడు.

"మేడమ్ ఏరి?" అన్నాడు ముత్తువేపు చూస్తూ.

ముత్తు నిర్జీవంగా అనంత్ కేసి చూసింది.

ఏదో చెప్పాలనుకుంది కానీ విపరీతమైన ఆయాసం ఆమె మాటల్ని కప్పేసింది.

అనంత్ అర్థంకానట్లు చూసాడు.

"అంద దుర్మార్గన్ పోయింటనా?" ముత్తు ఆయాసంగా.

అనంత్‌కి ముత్తు మాట్లాడేదేమిటో అర్థంకాలేదు.

వాసవి అక్కడ లేదని అతడు క్రిందికి దిగబోయాడు. వాసవికి ఫ్లైట్ టైము దాటిపోయింది. ఆమెకిష్టమైతే మరో ఫ్లైయిట్‌కి బుక్ చేద్దామని ఆ విషయం చెప్పాలని వచ్చాడతను.

అతను రెండు మెట్లు దిగగానే "అనంత్" అంటూ వాసవి గొంతు కంగారుగా వినిపించింది.

అనంత్ తలయెత్తి చూసాడు.

ఎదురుగా వున్న గది కిటికీ ఊచలు పట్టుకుని వాసవి ఎర్రగా కందిపోయిన ఆమె ముఖం చూడగానే తప్పుచేసినట్లు తలదించుకున్నాడు అనంత్.

"సారీ మేడమ్ ఫ్లైట్ టైం దాటిపోయింది" అన్నాడు క్షమాపణ చెబుతున్నట్లు గొంతు తగ్గించి.

"ఆ సంగతి నాకు తెలుసు. ముందా డెవిల్‌ని పక్కకి తోసి గుమ్మం తలుపు తియ్యండి" అంది వాసవి ఆవేశంగా.

అనంత్ అర్థంకానట్లు చూసాడొక క్షణం. తిరిగి మెట్లెక్కి ఆ గది గుమ్మం వైపు చూసాడు.

ముత్తు తలుపుకి జేరబడి ఉంది.

అతనికి విషయం కొద్దిగా అర్థమయ్యింది.

ముత్తుని అతడు మెల్లిగా తప్పించబోయాడు.

ఉహూ కదలలేదు. తలుపుకి జేరబడి చేతులు విరిచికట్టినట్లుగా వెనక్కి పెట్టుకుని గడియని గట్టిగా పట్టుకున్న ముత్తుని చూసి అనంత్ ఆశ్చర్యపోయాడు.

ఆమె రొప్పుతూ అతనికేసి పేలవంగా చూసింది.

అనంత్‌కి ముత్తు ప్రవర్తన విస్మయాన్ని కలిగించింది. అతను ముత్తుకి పిచ్చిగాని ఎక్కిందేమో అనుకున్నాడు.

వాసవి అటునుంచి తలుపుల్ని బాదుతూంది. అనంత్ ముత్తుని బలంగా పక్కకి నెట్టాడు. ఆ ఊపుకి ముత్తు తూలి కిందపడింది.

అనంత్ వెంటనే గడియతీసి ముత్తుని లేవనెత్తటానికి ఒక అడుగువేసి ముందుకి వంగాడు.

"ఆగు అనంత్" వాసవి పులిలా ఘర్జించింది. అనంత్ అదిరిపడ్డట్లుగా వాసవి వేపు చూసాడు.

వాసవి సుడిగాలిలా ముత్తువేపు ఉరికింది.

ఆమె చేతిలో పగబట్టిన కోడెత్రాచులా ఊగుతోన్న హంటర్‌ని చూసి ఉలిక్కిపడ్డాడు అనంత్.

ఏం జరగబోతోందో ఊహించేలోపునే వాసవి చేతిలోని హంటర్ ముత్తు వంటిమీద నాట్యం చేసింది.

నాట్యం కాదది ప్రపంచాన్ని ముంచెత్తేముందు పరమశివుడు చేసే విలయతాండవం అది.

బుసలు కొడుతున్న ఆడనాగులా రెచ్చిపోతున్న వాసవికి అవాక్కయి చూసాడు అనంత్.

ఆ వెంటనే అతను "మేడమ్ ఆగండి" అన్నాడు.

వాసవి అతని పిలుపు వినిపించుకోలేదు. ఎంత కొట్టినా కసితీరని మనిషిలా ఊగిపోతూ ముత్తుని చావబాదుతోంది.

**ముత్తుకి** అప్పటికే స్పృహ తప్పింది.

నేలమీద జావలా జారిపోయింది. తెలుపు నలుపు కలనేతలా వున్న జుట్టు ఊడిపోయి ముఖమంతా పరుచుకుంది.

ఎముకల్ని అంటుకునివున్న నల్లని ముడతలుపడ్డ చర్మం పగిలి రక్తం స్రవిస్తోంది. వంటిమీద చీర హంటర్ దెబ్బలకి చిరిగిపోయింది. నోట్లోనుంచి కొద్దిగా రక్తం. వాసవి అప్పటికి జాలి కలగని దానిలా హంటర్ పైకెత్తింది. మరో దెబ్బపడితే ముత్తు చావడం ఖాయమని అర్థమయిపోయింది అనంత్‌కి. "మేడమ్. ప్లీజ్ యింక చాలు అది చస్తుంది" అన్నాడు కంగారుగా.

"అనంత్ నీకు తెలీదు ఈ డెవిల్ ఈ రోజు నన్నేం చేసిందో తెలుసా? దీన్ని చంపినా పాపంలేదు. నేను వచ్చినదగ్గర్నుండి చూస్తున్నాను నేనంటే ఏదో కోపం" వాసవి ఆయాసపడుతూ మళ్ళీ హంటర్‌ని దాని వంటిమీద ఆడించబోయింది.

"నీకు మతిపోయింది వసూ ఈ రోజు దాన్ని చంపేస్తావా? ముందుకురికి వాసవిని బలంగా పట్టుకుని వాసవి చేతిలోని హంటర్‌ని దూరంగా విసిరేసాడు.

వాసవిలో ఆవేశం యింకా చల్లారలేదు. ఉద్రేకంతో ఆమె గుండెలు ఎగసిపడుతున్నాయి. పమిట జారి క్రింద వ్రేళ్ళాడుతోంది.

ఆమె పునకం పూనిన మనిషిలా ముత్తువేపు మిర్రిమిర్రి చూస్తుంది.

అనంత్ చేతుల్ని విదిలించి ముత్తుని ఇంక కొట్టాలన్నట్లు లంఘిస్తోంది.

అనంత్ ఆమెని గట్టిగా తన రెండు చేతుల్లో బంధించి "వసూ ఏమిటిది? కంట్రోల్ యువర్ సెల్ఫ్. నిన్నెప్పుడూ ఇలా చూడలేదు. నీకింత పిచ్చికోపం ఉందనికూడా నాకు తెలియదు" అన్నాడు అనునయంగా.

సరిగ్గా అప్పుడే పైకొచ్చి ఆఖరి మెట్టుమీద నిలబడ్డ శంకర్ కళ్ళు పెద్దవి చేసి చూసాడు. ఆ కళ్ళనిండా ఏదో చెప్పలేని విస్మయం.

అనంత్ శంకర్‌ని చూడగానే చటుక్కున వాసవిని వదిలేసాడు.

"సిగరెట్లు తెచ్చావా?" అన్నాడు శంకర్ కేసి చూస్తూ.

"ఊ!" అనగలిగాడు శంకర్.

యాంత్రికంగా అతని చేతులు పాకెట్టుని అనంత్‌కి అందివ్వబోయాయి.

అనంత్ దాన్ని అందుకోకుండా ముత్తుని రెండు చేతులతోనూ ఎత్తి భుజాన వేసుకుని శంకర్ డాక్టర్‌కి ఫోన్ చెయ్యి అంటూ గబగబా క్రిందికి దిగాడు.

ముత్తు కళ్ళు విప్పి చూసింది.

వళ్ళంతా కాలిపోయినట్లు మంట. వెంటిలేటర్ లోంచి ఏటవాలుగా పడుతున్న వెలుగు కిరణాలవైపు చూసింది ముత్తు.

తనెక్కడున్నదీ ఒక క్షణం అర్ధం కాలేదామెకు.

ఆ గదంతా వెలుతురుకీ గాలికీ నోచుకోనట్లు ముక్కువాసన కొడుతోంది.

ముత్తు సన్నగా మూలుగుతూ లేపడానికి ప్రయత్నించింది. ఆమె శరీరం ముద్దలా లోపలి ఎముకలు సున్నం అయినట్లు కదలలేకపోయింది. ఆమె చీకట్లో శరీరాన్ని తడిమి చూసుకుంది.

దెబ్బ ఎక్కడో తెలియటంలేదు. వళ్ళంతా కొలిమిలో పెట్టి కాల్చినట్లుగా ఒకటే మంట.

తలుపు మెల్లిగా తెరుచుకున్న శబ్దం. ముత్తు వులిక్కిపడినట్లు చూసింది.

మళ్ళీ వాసవి ఎటునుంచి తనమీదకు ఆడపులిలా లంఘిస్తుందోనని భయం.

"ముత్తూ" అంది శంకర్ గొంతు.

శంకర్ గోడపక్క తడుముకుంటూ స్విచ్ ఆన్ చేసాడు. గదంతా వెలుగు పరుచుకుంది.

ముత్తు గదిని పరికించి చూసింది. అవుట్ హౌస్‌ని ఆనుకుని ఉన్న స్టోర్ రూమ్‌లో తనున్న సంగతి ఆమెకి అర్ధమవ్వడానికి అయిదునిమిషాలు పట్టింది.

శంకర్ మోకాళ్ళమీద ముత్తు పడుకున్న మంచం దగ్గర కూర్చున్నాడు. వాడి చేతిలో కంచం. అన్నం తిను. వాడు కంచం మంచం పక్కగా పెట్టాడు. శంకర్ వేపు అదోలా చూసింది. ఆ చూపులనిండా ఏదో చెప్పుకోలేని భావాలు ముసురుకున్నాయి.

కళ్ళల్లోంచి ఆపాటి ఆప్యాయతనే భరించలేనట్లు కన్నీళ్ళు చెంపలమీదుగా జారి దాని తలక్రిందవున్న దుప్పట్లోకి యింకిపోతున్నాయి.

శంకర్ ముత్తుని లేవదీయబోయాడు.

"అబ్బా" అంటూ మూలిగింది ముత్తు.

"అయ్యో జ్వరం వచ్చినట్లుంది" శంకర్ గొణుగుతున్నట్లు అని ముత్తుని మళ్ళీ పడుకోబెట్టేసాడు.

ముత్తు వళ్ళు పొయ్యిమీద పెనంలా సెగలు కక్కుతోంది. వళ్ళంతా ప్లాస్టర్‌తో వికృతంగా ఉంది.

శంకర్‌కి ముత్తునలా చూడగానే కళ్ళలో నీళ్ళూరాయి. అదెవరో? తనెవరో ఇద్దరూ పొట్టకూటికోసం అక్కడ పని చేస్తున్న వాళ్ళమే. తను పనిలోకొచ్చి ఆరునెలలే అయ్యింది. ముత్తు ఎన్నాళ్ళనుంచీ వుందో? తన భాష దాని భాష వేరు. అదెక్కడ పుట్టిందో తెలియదు. దానికి ఎవరైనా బంధువులున్నట్టు కూడా అనిపించదు. ఎవరికీ ఏమీ చెప్పుకోడానికి నోరుండి కూడా వీల్లేక తనపని తానుగా నిర్వర్తించుకుంటూ పోయేదానికి దాని అందవికారం దేవుడిచ్చిన గొప్ప శాపం. ముత్తు పుట్టుక నుండి కురూపి కాదన్న విషయం తనకు దాని ఫోటో చూడటంవలన తెలిసింది. మొదట ముత్తుని చూసినప్పుడు తనకూ అదోలా గుండె ఝల్లుమంది. రాత్రిళ్ళు అది ఎదురుపడితే తనకు దయ్యాన్ని చూసానేమో నన్నంత భయం కలిగింది.

కానీ ముత్తు తనని చాలా ఆప్యాయంగా ఆదరించింది తనకోసం ప్రత్యేకంగా వండిన పదార్థాలు పక్కకి తీసిపెట్టి తనని ఒంటరిగా పిలిచి తినమని ప్రేమతో అందిస్తున్నప్పుడు తన గుండె ఏదో చెప్పలేని అద్వితీయమైన ప్రేమ భావనతో పొంగులు వారింది. తనకు తల్లిలేదు. పుట్టగానే తల్లిని పోగొట్టుకున్న తనకి మాతృత్వంలో లభించే మహత్తరమైన ప్రేమ రుచి తెలియదు.

తన అక్క దగ్గరే తనకి కొంతలో కొంత తల్లి ప్రేమ లభించింది. తల్లి ఒడి ఎరుగని తను సోదరి గుండెలమీదే సేదదీర్చుకున్నాడు. వయసులో తమిద్దరికి ఎక్కువ అంతరం లేకపోయినా ఆమె తనని తల్లిగానే లాలించింది. ప్చ్! భగవంతుడు కఠినాత్ముడు బంగారు బొమ్మలాంటి తన అక్కని చాలా క్రూరంగా అర్థాంతరంగా తనదగ్గరికి లాక్కున్నాడు.

ముత్తుమీద అమ్మగారికి మొదటినుంచి సదభిప్రాయం లేదు. తనని ఎంతో ప్రేమతో ఆదరించే అమ్మగారు ముత్తుని చూడగానే శిలలామారి పోతుంది.

ముత్తు అందంగా లేకపోవడమే దానిక్కారణమా? హృదయానికి, బాహ్యసౌందర్యానికి సంబంధంలేదని శారీరక సౌందర్యం శాశ్వతం కాదని చదువుకున్న అమ్మగారికి ఎవరు చెప్పాలి?

శంకర్ ముత్తువేపు చూసాడు. ముత్తు శంకర్ వేపే చూస్తోంది. ఆమె చేతులు ఆర్తిగా శంకర్ వైపు చాపి 'నా కణ్ణా ' అంటోంది.

శంకర్ ఆమె పిలుపుకి చలించిపోయాడు.

అతనికి ముత్తులో తనెరుగని తల్లి మూర్తీభవించినట్లయింది, అతను లేచి ముత్తుని కౌగిలించుకున్నాడు.

"అమ్మా"

ముత్తు కళ్ళలో ఏదో చెప్పలేని కాంతి.

ఆమె చేతులు శంకర్‌ని బలంగా పెనవేసుకున్నాయి. ఆమె అస్పష్టంగా ఏదో గొణుగుతోంది.

పదే పదే శంకర్ బుగ్గల్ని నుదుటిని ఆవేశంతో ముద్దు పెట్టుకుంటోంది.

ఆమె గుండెలోంచి పొంగుతోన్న మాతృత్వపు జాలులో శరీరాన్ని విపరీతంగా బాధిస్తోన్న దెబ్బల మంటని మరచిపోయింది ముత్తు.

తన పదిహేడేళ్ళ జీవితంలోనూ తల్లి ఒడిలోని ఆప్యాయతానురాగాలు చవిచూడని శంకర్ హృదయం తీవ్రంగా స్పందించింది.

వాడి చెంపలు కన్నీళ్ళతో తడుస్తున్నాయి. వాడి పెదవులు స్పష్టం చేయలేని భావాలతో కదులుతున్నాయి. భాష వేరైనా భావమొక్కటే.

ఏ ప్రేమలోనైనా తేడా ఉండొచ్చు. స్వార్థముండొచ్చు. కానీ కడుపు చీల్చుకుని చావుతో పోట్లాడి మరో ప్రాణికి సృష్టినిచ్చే మాతృప్రేమలో తేడాలేదు.

వాళ్ళిద్దరూ వాళ్ళకు లభించని అనురాగాన్ని ఒకరిలో మరొకరు పొందుతూ అలా ఎంతసేపుండిపోయారో.

"మే అయి కమిన్ మేడమ్"

వాసవి తలతిప్పి చూసింది.

అనంత్.

ఆ వెంటనే రమ్మన్నట్లుగా తల ఊపింది. అనంత్ మెల్లిగా వచ్చి ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు. ఇద్దరి మధ్యా క్షణాల మౌనం నిన్న జరిగిన సంఘటన యిద్దరిమధ్యా ఒకరకమైన సిగ్గును కలగచేస్తోంది.

వాసవి అతనివేపు చూడలేనట్లుగా తల దించుకుని చేతి ఉంగరాన్ని తిప్పుతూ కూర్చుంది.

అనంత్‌కి కూడా అలాగే వుంది.

అతను మగవాడయినా, ఒకప్పుడు ఆమె ప్రేమ స్వామాజ్యాన్ని ఏలిన రారాజయినా ఇప్పుడు అతనాయింట్లో వాళ్ళ అవసరాలు చూసే సెక్రటరీ మాత్రమే. ఆమె భర్త దయాదాక్షిణ్యాలమీద బ్రతికే చిరుద్యోగి.

ఈ భోగం యిక్కడ దొరుకుతున్నా సుఖాలు తాత్కాలికం.

ఎప్పుడు వాళ్ళకి అయిష్టమైతే అప్పుడు తప్పుకోవాలి.

"నిన్న.. నిన్న సార్ నుండి ట్రంకాల్ వచ్చింది."

వాసవి నిరాసక్తంగా విన్నది.

అనంతే తిరిగి చెప్పాడు. "సార్ తిన్నగా ఢిల్లీనుండి హైదరాబాద్ వెళ్ళారట డాడీకి బాగానే వుందని వీలయితే ఆయన్ను తీసుకొచ్చి మద్రాసులో ట్రీట్‌మెంట్ యిప్పించాలనుకుంటున్నట్లుగా చెప్పారు. అందుకే మిమ్మల్ని కంగారు పడొద్దని కూడా చెప్పమన్నారు."

"డాడీ వస్తున్నారా?" వాసవి సంతోషాన్ని అదిమిపడుతూ విస్మయంగా అడిగింది.

"అవును ఆ విషయం చెబుదామనే నిన్న నేను మేడమీదకివచ్చాను తీరా అక్కడ సంఘటన చూడగానే" అంటూ అనంత్ ఆగిపోయాడు.

వాసవి ముఖం మ్లానమయ్యింది.

"నీకు.... సారీ.. మీకు అంత కోపంరాగా నేను ఎన్నడూ చూడలేదు. సగటు ఆడపిల్లలా కంగారుపడటం, ఏడ్వటం, వెర్రికోపం తెచ్చుకోవడం మీకు అలవాటు లేని విషయాలు. ఎందుకని మీరు నిన్నంతగా ఇరిటేట్ అయ్యారు? నిన్న నేను కాస్సేపు ఉపేక్షిస్తే ఆ ముత్తు మీ చేతుల్లో చచ్చివుండేది" అన్నాడు అనంత్.

వాసవి అతనివంక కంగారుగా చూసింది.

"ఒక అనామకురాలు మన యింట్లో ఊడిగం చేసి బ్రతికే మనిషి చచ్చిపోవడం చాలా ఘాతుకం అని నేను చెప్పడంలేదు. మీరు ఆ పని చేసాక ఎలా ఫీలవుతారో నాకు తెలుసు. జీవితమంతా హత్య చేసేనన్న బాధతో మీ బ్రతుకుని నరకం చేసుకుంటారు నాకు ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే మీలో క్రొత్తగా హైపర్ టెన్షన్ చోటుచేసుకుంది. దానికి కారణాలు నాకు తెలియవు. మీరు దాన్ని అదపులో పెట్టుకోకపోతే మీ ఆరోగ్యం దెబ్బ తినడమేకాక క్రొత్త సమస్యలు రావొచ్చు."

వాసవి అతని వేపు చురుగ్గా చూసింది.

"ఎక్కువ మాట్లాడితే నన్ను క్షమించండి. నేను మీ సెక్రటరీగా మాత్రమే ఈ విషయాలు చెబుతున్నాను. సర్ ఇంట్లో లేనప్పుడు యింటి విషయాల్లో నాకు బాధ్యత వుందని నేను అనుకుంటున్నాను."

"అందుకుకాదు...ఆ ముత్తు.. మొదట్నుండీ నా పట్ల అదోలా బిహేవ్ చేస్తోంది. దాన్ని చూస్తే నాకు అసహ్యం" అంది వాసవి నీరసంగా.

అనంత్ బదులుగా వాసవిని చిన్నపిల్లను చూసినట్లు చూసి నవ్వి "నిజమే ముత్తు ప్రవర్తన విచిత్రంగానే ఉంది. అందుకు ఏదో కారణం ఉండొచ్చు. మనకు భాష రాకపోవటాన అది ఏమి చెబుతున్నదీ తెలియటం లేదు. పోతే అదంటే మీకు అసహ్యమైతే మానిపించడం చాలా తేలిక. అందుకింత సీరియస్ కానవసరం లేదు. చాలా ఇండివిడ్యుయల్‌గా ఫీలయ్యే మీకు ఇంతగా కంగారుపడిపోవడం బాగోలేదు. బి హోపీ" అన్నాడు.

వాసవి మాట్లాడలేదు.

అనంత్ లేచి నిలబడ్డాడు.

"వస్తాను మేడమ్, రేపు ప్రొద్దుట ఫ్లయిట్‌కి డాడీ రావొచ్చు. కార్డియాలజీ స్పెషలిస్టు రామస్వామి అయ్యంగారుతో డాడీ గురించి మాట్లాడి అవసరమయితే ఆయనొక స్పెషల్ రూమ్ బుక్ చేయమన్నారు. ఆ విషయం చూడాలి. ఎగ్మూరులో వున్న ఆయన హాస్పటల్‌కు వెళ్ళి పర్సనల్‌గా మాట్లాడాలి. ఇకపోతే ఫ్యాక్టరీ విషయాలు కూడా కొన్ని వున్నాయి. అవన్నీ చూసుకుని నేను వచ్చేసరికి చాలా ప్రొద్దుపోవచ్చు. మీరు లేనిపోనివన్నీ ఆలోచిస్తూ మనస్సు పాడు చేసుకోకండి. శంకర్ వంటచేసాడు భోం చెయ్యండి. మరో క్రొత్త వంటమనిషి గురించి వాకబు చేస్తున్నాను" అనంత్ నాలుగడుగులు వేసి ఆగాడు. వాసవి ప్రశ్నార్థకంగా చూసింది.

"అసలు సంగతి చెప్పనేలేదు. నేను నిన్న మీ పట్ల కొంచెం అతిగా ప్రవర్తించాల్సి వచ్చింది. అందుకు క్షంతవ్యుణ్ణి. నిన్నటి పరిస్థితి అలాంటిది. ముత్తు ఛస్తుందన్న భయంకన్నా మీరు హంతకి అవుతారనే ఆందోళతోనే పరిస్థితులు మరచి నేను మిమ్మల్ని ఆపాలనే ప్రత్యత్నంలో అతిగా ప్రవర్తించాను. మీరు నన్ను అపార్థం చేసుకోరని భావిస్తున్నాను.

నిన్న డాక్టర్ వచ్చి మీకు యింజక్షన్ చేసేవరకు ఏం జరుగుతోందో మీకు తెలుసా? మైగుడ్ నెస్ అయ్ నెవ్వర్ సాయూ లైక్ దట్" అన్నాడు అనంత్ ఆ సంఘటన తలచుకుని యింకా భయపడుతున్నట్లుగా కళ్ళు పెద్దవి చేసి.

వాసవి తల మళ్ళా భూమిలోకి కృంగిపోయింది.

అనంత్ తనని గట్టిగా తన చేతుల్లో బంధించి పెనవేయడం తను పూనకం వచ్చిన మనిషిలా అతని చేతుల్లోంచి బయటపడాలని ముత్తుని చంపేయాలని ఆవేశపడటం అన్నీ గుర్తొచ్చి ఆమెకు చచ్చిపోవాలన్నంత సిగ్గేసింది.

వాసవి కుంచించుకుపోవడం అనంత్ గమనిస్తూనే ఉన్నాడు.

ఒకప్పుడు వాసవిని తాకాలంటే అనంత్‌కే భయంగా ఉండేది. ఆమె చనువిచ్చినా పుచ్చుకునే ధైర్యం అతనికి కలిగేవి కావు.

ఆమె గొప్పింటి బిడ్డ. మూడేళ్ళుగా వాళ్ళ అండతో చదువు సాగిస్తున్నాడు. వాళ్ళ ఆధారంతో బ్రతుకుతున్నాడు. వాళ్ళు తనని అలాహీనంగా చూడకపోయినా తన హద్దులు తనకి తెలుసనే ఉద్దేశ్యంతో ఆమెని ప్రేమిస్తున్నా దూరంగానే వుండేవాడు. వాసవే అతన్ని తన చేతలతో రెచ్చగొట్టేది. చేతులు పట్టుకుని చిలిపిగా ఊపేది. తన కొంటె చేష్టలతో ఉడికించేది. ఒక్కొక్కసారి ఆమెని తన కౌగిట్లో బంధించాలని, ఆమె పెదవుల్ని తన పెదవులతో స్పర్శించాలనే వెర్రికోరిక ఉవ్వెత్తున తనలో చంద్రోదయాన్ని చూసి పరవశించే సాగరకెరటంలా ఉప్పొంగినా దాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసేవాడు.

కారణం జగన్నాథరావుగారు. అతనిపట్ల తనకున్న భయమే కావొచ్చు. వాటిలో ఏదో ఒకటిగాని తనని అడుగు ముందుకెయ్యనిచ్చేవి కావు. అందుకు వాసవికి తనమీద ఒక్కోసారి చాలా కోపం వచ్చేది.

"నువ్వొట్టి ఇడియట్‌వి" అంటూ ఆమె తనని ముద్దుగా విసుక్కునేది. అలాంటి వాసవిని ఈరోజు నిన్న తను అవాంతర పరిస్థితుల్లో ఆమెని స్పర్శించినందుకు తప్పుచేసినట్లుగా సిగ్గుపడి తల దించుకుంటోంది.

వాసవిలో ఈ కొద్దిరోజులకే చాలా మార్పొచ్చేసింది అనుకున్నాడు అనంత్.

మరో విషయం కూడా మీకు చెప్పి వెళ్ళిపోతాను

అనంత్ మాటలకి తలెత్తి చూసింది వాసవి.

"నేను.. మీకుగానీ.. మీడాడీకి గానీ హాని తలపెట్టేందుకు రాలేదన్న విషయం మీరు నమ్ముతున్నారో లేదో నాకు తెలియదు. నేనే సార్ రాగానే ఈ ఉద్యోగానికి రాజీనామా యిచ్చి మీకు చెప్పినట్లుగా వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను. వెళ్ళిపోయేవాడు.

ఇంత కష్టపడి యింకా బాధ్యతలు తీసుకోవాల్సిన అవసరం ఏమిటని మీకు అనుమానం రావొచ్చు. సార్ నాకు ముందే ఒక జీతం ఎడ్వాన్సుగా యిచ్చారు. డబ్బు తీసుకుంటూ పని ఎగ్గొట్టడం నా అభిమతానికి విరుద్ధం. డాడీకి నేను కనపడకుండా జాగ్రత్త పడతాను మీరు కూడా నా గురించి చెప్పకండి" అనంత్ గబగబా ఆ మాటలు చెప్పి హాల్లోకొచ్చి మెట్లు దిగాడు.

వాసవి దిగ్భ్రాంతిగా అతడు వెళ్ళిన దిశ చూసింది.

అతన్ని ఆపాలని అతనితో మాట్లాడాలని ఆమెకు అనిపించింది. కానీ ఏం మాట్లాడాలి తను?

"నువ్వెళ్ళిపోకు అనంత్ ఇక్కడ ఒంటరితనాన్ని నేను భరించలేనని చెప్పాలా? అలా చెపితే అతనేమనుకుంటాడు? తనను చులకనగా అంచనా వేయడూ. తనకు జగదీష్‌కి మధ్యన వున్న దూరం పసికట్టేయడు. తమ దాంపత్య జీవితంలో వున్న గుట్టు తెలిసి హేళన చేయడూ. పైగా అతను ఒకప్పటి తన ప్రియుడు.

తన గురించి ఎవరికి తెలిసినా సహించి భరిస్తుంది కానీ తన బాధలూ గాధలూ అతని దృష్టికి రావడం తను యిష్టపడలేదు.

వాసవి భయాలపై ఆమె అంతరంగం తీవ్రంగా దాడి తీసింది.

"అతను ఎంతకాదన్నా నీకు కావల్సినవాడు. పంతాలవల్లో పరిస్థితులవలనో అతను నీవాడు కాలేకపోవచ్చు. అంతమాత్రాన అంతరంగపు పొరలలో నిక్షిప్తం చేసిన ప్రేమవాహిని ఎండిపోతుందా? ఒకరిపట్ల ఒకరు ఏర్పరచుకున్న సదాభిప్రాయాలు అనురాగాలు చెల్లాచెదరైపోతాయా? అతను నీ జీవిత భాగస్వామికానంత మాత్రన ఒక స్నేహితుడిగా ఆదరించడంలో తప్పేముంది?

ఈ లంకంత మేడలో ఎప్పుడూ బిజినెస్ వ్యవహారాల్లో క్షణం ఊపిరాడకుండా ఊళ్ళు పట్టుకు తిరిగే భర్తతో ముత్తులాంటి రాక్షసితో నువ్విక్కడ అతని తోడుకూడా పోగొట్టుకుని ఎలా బ్రతుకుతావ్?

అంతకన్నా తెలివితక్కువ మరొకటి ఉందా? దొరికిన ఆలంబనని ఎందుకు వదులుకొంటావ్?

ఎక్కి కూర్చున్న కొమ్మని ఎందుకు నరుక్కుంటావ్? ఆ ఎదురు దాడికి వాసవి మనసు మెత్తబడింది.

తటాలున సోఫాలోంచి లేచి గబగబా బాల్కనీలోకొచ్చింది.

నువ్వు రిజైన్ చేసే ప్రయత్నం మాను. ఈ రోజునుండి మనం స్నేహితులుగా మిగిలిపోదాం అని చెప్పాలని ఆమె ఆత్రుతపడుతోంది.

సరిగ్గా అప్పుడే పోర్టికోలోంచి ఎంబాసిడర్ గేటువేపు దూసుకుపోవటం కనిపించింది వాసవికి.

స్టీరింగ్ ముందు కూచునివున్న వ్యక్తి అనంత్ అని తెలియగానే ఆమె మనసు ఉసూరుమంటూ నిట్టూర్చింది.

అమ్మగారూ, భోజనానికి రండి శంకర్ పిలుపుతో వాసవి ఈ లోకంలోకి వచ్చినట్లుగా శంకర్ వేపు చూసి అతన్ని అనుసరించింది.

సాయంత్రం అయిదుగంటలకే ఆ మేడలో చీకట్లు దట్టంగా అలుముకుంటున్నాయి.

మేడచుట్టూ గాలికూడా లోనికి చొరబడనియనంతటి చెట్లు పై అంతస్తుదాకా కొమ్మలు సారించి గుబురుగా పెరిగిపోవటాన సంధ్య అక్కడ ముందే తిష్ట వేస్తుంది.

**వాసవి మేడంతా** లైట్లు వెలిగించి క్రిందకు వచ్చింది.

మాలి చెట్లకు నీళ్ళు పెడుతున్నాడు.

పోర్టికోముందు అనంత్ ప్రత్యేకమైన శ్రద్ధతో అమర్చిన గులాబీలు నీటి తుంపరలకి తడిసి మొదటిసారిగా ప్రియస్పర్శకి పులకించే కన్నెపిల్లల్లా త్రుళ్ళు తున్నట్లు ఊగుతున్నాయి.

వాసవికి పరమ బోర్‌గా ఉంది.

ఆమెకి ఆ ఇంట్లో కాస్త కాలక్షేపాన్నిచ్చేది శంకర్. వాడు ప్రస్తుతం ముత్తుకి బాగోకపోవటంవల్ల వంట గదిలో వంటపనితో సతమతమవుతున్నాడు.

ఆ యింట్లో వున్న అతి కొద్దిమందిలో కొందర్ని చూస్తే వాసవికి జంకు. మరికొందర్ని చూస్తే భయం, అసహ్యం.

వాసవి బుక్‌రాక్ దగ్గరకెళ్ళి నిలబడింది.

అందులో ఇంగ్లీషు తెలుగు సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు ఎన్నో ఉన్నాయి.

దరిదాపు ఆ పుస్తకాలన్నీ వాసవి చదువుకునే రోజుల్లో చదివేసినవే. ఆమె అప్పట్లో వొరాషియస్ రీడర్.

ఒక్క మాటలో చెప్పాలంటే షి యీజ్ మాడ్ ఆఫ్ బుక్స్. కానీ ఆమెకు తెలియకుండానే రీడింగ్ మీద ఆమెకు వ్యామోహం తగ్గిపోయింది.

అనంత్ పరిచయంతోనే ఆమె బుక్స్ చదవడం కొద్దిగా తగ్గించేసిందని చెప్పాలి.

ప్రేమ అనే జబ్బు మనిషికి స్వానుభవం. అంతకుముందు ఒక పద్ధతిగా వస్తున్న దినచర్య గాడి తప్పుతుంది. అలవాట్లు అడ్డం తిరుగుతాయి. వాసవి జీవితంలోనూ అలాగే జరిగింది.

అనంత్ స్నేహంలో ఆమె ఆకలి, నిద్రా మరచి చదివే అలవాటుని తప్పించేసింది.

ప్రేమ అనే థ్రిల్‌లో పడి పుస్తకాలని నిరాదరించింది. జగదీష్ పెళ్ళి జరిగాక అసలు ఆమెకు ఏది యిష్టమో కూడా దాదాపు మరచిపోయింది.

అంతకు ముందు ఆమె జీవితానికి ప్రస్తుత వర్తమానానికి మధ్య పెద్ద గండిపడినట్లయింది.

తనకున్న సరదాలు అలవాట్లు తనకి తెలియకుండానే సమాధి అయిపోవడం ఆమె గమనించింది.

వాసవి తను అంతకుముందు ఎప్పుడో చదివిన పుస్తకాన్నే తెచ్చుకుని పోర్టికోకు ఎదురుగా వున్న చెట్టుకి వున్న కేన్ ఉయ్యాల్లో కూర్చుని పేజీలు తిరగేయసాగింది.

సాదా ప్రేమకథే అది.

ప్రేమ గురించి రచయిత్రి ఎంతో గొప్పగా వర్ణించింది. ప్రేమకథలు వ్రాయడంలో ఆమెకామే సాటి.

ఒకప్పుడు ఆ నవల ఆంధ్రదేశాన్ని ఊపేసింది.

వాసవి కూడా ఆ రోజుల్లో ఆ నవల సీరియలైజు అవుతున్నప్పుడు వచ్చేవారం కోసం ఎంతగానో ఎదురుచూసేది.

ఆ రోజుల్లో తనకంత థ్రిల్ కలిగించిన ఆ నవల యిప్పుడామెను ఏ విధంగానూ కదిలించలేకపోతోంది.

ప్రేమ గురించి, పెళ్ళిగురించి భర్త గురించి సంసారం గురించి ఆమె యిచ్చిన నిర్వచనాలు ఆ రోజుల్లో పాఠకుల పాలిట అమృత గుళికల్లా పనిచేయడం వాసవికి తెలుసు.

బహుశా ఆ నవలే రచయిత్రిని ఆకాశానికి ఎత్తేసింది. తర్వాత ఎన్నో ప్రణయ నవలలు సృష్టించడానికి అదే సోపానం అయ్యింది.

వాసవి నాలుగు పేజీలు అటూ యిటూ తిప్పి చిరాగ్గా పుస్తకాన్ని క్రింద లాన్‌లోకి విసిరేసింది.

బహుశా ఇలాంటి రచనలవల్లే కన్నెపిల్లలు గాలిలో మేడలు కట్టి తమ వైవాహిక జీవితాన్ని గురించి రంగులకలలు కంటారు.

తాము ఊహించిన దానికి జరుగుతున్న సంఘటనలకి పొంతన కుదరక ఉక్కిరి బిక్కిరయిపోతారు.

చివరకు కన్నీళ్ళు కలతలు.

సంఘర్షణలు - విడాకులు.

ఎదురుదెబ్బలు ఆత్మహత్యలు.

వెంటనే వాసవికి తన క్లాస్‌మేట్ మహతి గుర్తొచ్చింది. మహతి మిడిల్ క్లాస్ గర్ల్ చాలా ఇంటలిజెంటు. ఎంతో బాగా పాడేది గొప్ప అందగత్తెకాదుగానీ ఆ అమ్మాయిలో అంతకు మించిన డిగ్నిటీ వుండేది. బహుశా ఆమె బిహేవియర్ ఆమెకలాంటి అందాన్ని ఆపాదించిందేమో.

మహతికి సెకండ్ యియర్ బికాంలోనే పెళ్ళి జరిగింది. ఆమెకా పెళ్ళి యిష్టం లేకపోయినా అల్లుడు చౌకలో దొరుకుతున్నాడని ఆమె తండ్రి పట్టుబట్టి పెళ్ళి జరిపించేసాడు.

మహతి పెళ్ళయిన నెల రోజుల తర్వాత కాలేజీకొచ్చింది. నల్లపూసలు -మట్టెలు తమాషాగా అనిపించింది మహతిలోని క్రొత్తమార్పులు.

"ఎలావుంది మారీడ్ లైఫ్" ఫ్రెండ్సంతా చుట్టుముట్టి అడిగితే సన్నగా నవ్వేసింది మహతి.

తర్వాత మహతి రాను రాను చదువులో వెనకబడిపోసాగింది. క్లాసులో ఫస్టొచ్చే ఆమె డల్‌గా అయిపోవడం అందరికి ముఖ్యంగా లెక్చరర్స్‌కి బాధ కలిగించింది.

ఆమె వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూ చదువుని కేర్‌లెస్ చేస్తుందని అందరూ అనుకునేవారు.

వాసవి ఒకరోజు ఒంటరిగా ఏదో ఆలోచిస్తున్న మహతి ప్రక్కకెళ్ళి "ఎలావుంది మారీడ్ లైఫ్?" అంటూ అడిగింది.

పాత ప్రశ్నే

కానీ మహతి మునుపటిలా నవ్వలేకపోయింది.

కానీ బలవంతంగా నవ్వడానికి ప్రయత్నిస్తూ "నా దృష్టిలో పెళ్ళంటే వంటగది" అంది.

"అంటే?" అంది వాసవి అర్థంకాక.

"ఏముంది? మాది ఉమ్మడి కుటుంబం మా వారు పెద్దవారు. వెనుక అరడజనుమంది మరుదులు, బంధువుల రాకపోకలు ఎక్కువ. వార్పులు, వడ్డనలు ఒకరికి కాఫీ, మరొకరికి టీ, ఇంకొకరికి బూస్ట్. ఒకరికి ఉప్మా, ఇంకొకరికి చపాతీ ఇలా మా రొటీన్‌కి అంతు వుండదు. ఇంక చదివే తీరికెక్కడ? పైగా నేను చదువుకోవటం కూడా వాళ్ళకిష్టముండదు. నేనే ఎలాగయినా డిగ్రీ పూర్తిచేయాలని" అంది నీరసంగా మహతి.

వాసవి ఆశ్చర్యపోయింది.

"పోనీ సంగీతమైనా సాధన చేస్తున్నావా?"

"వాళ్ళకు కళలంటే చాలా హేళన. ఇంట్లో మగవాళ్ళుండగా పాడితే తప్పట. అయినా సాధన చేసే తీరికలేదు. ఒకవేళ పొరపాటున గొంతెత్తితే మరుదులు హేళనకి మనసు కుంచించుకుపోతుంది. ఈ మేల్ డామినేటెడ్ సొసైటీలో ఆడది తన అభిరుచుల్ని నిలబెట్టుకోవాలనుకోడం నేరమే" అంది మహతి.

వాసవికి ఆ సంఘటన గుర్తొచ్చి బాధగా నిట్టూర్చింది.

మహతికి వంటగది వైవాహిక జీవితమయితే తనకి ఒంటరితనమే వైవాహిక జీవితం.

వాసవి నిస్పృహగా నవ్వుకుంది. చుట్టూ చీకట్లు దట్టంగా పేరుకున్నాయి.

పోర్టికోలోవున్న దీపం శత్రు సేనలముందు బలహీనమైన సైనికుళ్ళా చీకటిని పారద్రోలటానికి వృధా ప్రయాస పడుతోంది.

వాసవి ఉయ్యాల్లోంచి లేచి లాన్‌లో పడేసిన పుస్తకాన్ని అందుకుని వెనక్కి తిరగబోయింది. ఆమె దృష్టి అవుట్ హౌస్ ప్రక్కగావున్న రేకు షెడ్డులవేపు వెళుతున్న శంకర్ మీద పడింది.

వాడిచేతిలో మూతపెట్టిన స్టీలు పళ్ళెం, దానిమీద గ్లాసు వున్నాయి.

వాసవికి అర్ధమయింది వాడవి ఎవరికోసం పట్టుకెళుతున్నాడో. అర్ధమయిన మరుక్షణం ఆమె కళ్ళు శంకర్ మీద కోపంతో ఎర్రబడ్డాయి.

ఆమె సర్రున త్రాచులా లోనికెళ్ళిపోయింది.

13

వాసవి భోంచేస్తుంటే శంకర్ పక్కనే నిలబడ్డాడు.

వాసవికి తన కోపం వాడిమీద ఎలా చూపించాలో దానికి ఏ వంక వెతుక్కోవాలో తెలియటంలేదు.

ఆమెకి చాలా ఉడుకుబోత్తనంగా వుంది.

ముత్తుపట్ల అందరూ జాలి ప్రదర్శించేవాళ్ళే.

తను ముత్తుపట్ల ఘోరంగా ప్రవర్తించినట్లు మాట్లాడాడు అనంత్. తను దాన్ని చంపేసేదట.

అది చచ్చినా ఫర్వాలేదట. కానీ తను హంతకి అవుతుందనే బాధట పాపం.

ఎంత డిప్లమసీ.

శంకర్ నోటితో తనని ఏమీ అనలేకపోయినా వాడి ప్రవర్తన అలాగే వుంది.

ముత్తుకి ప్రత్యేకమైన సపర్యలు చెయ్యటం, దానికోసం వండిన భోజనం యింట్లో యజమానులు తినకముందే పట్టుకెళ్ళి వడ్డించడం వాళ్ళకి ఎంత యూనిటీ.

అనంత్ కానీ, శంకర్ కానీ, ముత్తు కానీ వీళ్ళందరూ తమ సొమ్ము తింటున్నవాళ్ళే. టైమొస్తే వాళ్ళంతా ఒకటయి తమకి హాని తలపెట్టేవాళ్ళే. వాసవి కసిగా పళ్ళు కొరుక్కుంది.

శంకర్ అక్కడే నిలబడి ఆమె తీరుని గమనిస్తున్నాడు.

"రెండురోజులనుండి నీ వంట అమోఘంగా వెలిగిపోతోంది."

వాసవి వెటకారంగా అంది.

శంకర్ అపరాధిలా చూసాడు.

"పాపం చాలా దిగుల్లో వున్నావు కాబోలు"

ఈసారి కూడా శంకర్ జవాబు చెప్పలేనట్లు చూసాడు.

వాసవి విసురుగా కంచంలో చెయ్యి కడిగేసుకుంది.

శంకర్ వినయంగా ఆమెకు నాప్‌కిన్ అందించాడు.

వాసవి చెయ్యి తుడుచుకుని నాప్‌కిన్‌ని విసురుగా వాడిమీదకి విసిరేసి మేడమీదకి వెళ్ళిపోయింది.

శంకర్ అప్రతిభుడయినట్లు ఆమె వెళ్ళినవేపే చూసాడు. వాడు ఆమెనావిధంగా చూడ్డం ఇదే మొదటిసారి.

వాడికి చాలా బాధ కలిగింది.

ఆమె వచ్చిన దగ్గరనుండి తనని చాలా బాగా చూస్తోంది. యజమానురాలన్న అహంకారం ఆమెలో మచ్చుకయినా లేదు. తననో సోదరుడిలా చూస్తూ కబుర్లు చెప్పేది. తనమాటలకి నిష్కపటంగా నవ్వేది.

కొత్త సెక్రటరీ వచ్చిన యీ నాలుగుతోజుల్నుండీ తనకి ఆమెతో చనువుగా తిరిగే అవకాశం కొద్దిగా తగ్గిపోయింది. అతను ఖాళీగా కూర్చోవడం యిష్టంలేనట్లు ఏదో ఒకపని పురమాయిస్తాడు. అంతగా కాదంటే సిగరెట్లకయినా వెళ్ళాలి. దానితో తనకి అమ్మగారి దగ్గర చేరి కబుర్లు చెప్పగల సమయం మిగలటమేలేదు.

దురదృష్టంకొద్దీ ముత్తు అమ్మగారి చేతిలో చావుదెబ్బలు తిని మంచమెక్కడంతో తనమీద వంట చేయటం అనే బాధ్యత వచ్చి నెత్తినపడింది.

శంకర్ మెల్లిగా బల్లమీద వంటకాలన్నీ సర్ది మూతలు పెట్టి ఫ్రిజ్ తెరిచి చూసాడు. అందులో పళ్ళేమీ లేవు.

వాడికి అర్ధమయింది. ఆ సంగతి ఎవరూ పట్టించుకోలేదని.

అమ్మగారికి తిండిమీద శ్రద్ధలేదో క్రొత్తవల్ల సరిగ్గా తినలేకపోతున్నారో తెలియదుకానీ ఆవిడ ఇది కావాలి అని నోటితో యింతవరకూ చెప్పలేదు.

శంకర్ గబగబా పెరట్లోకి పరుగుతీసాడు.

అక్కడ నారింజ చెట్లని కంటికి చేతులడ్డం పెట్టుకుని పరిక్షగా చూసాడు

వాడి కంటికి అరముగ్గిన జామపళ్ళు ఎరుపు రంగొచ్చిన రెండు నారింజలు చిటారు కొమ్మల్లో చిక్కుకుని కనబడ్డాయి.

వాడు మితిమీరిన సంతోషంతో గబగబా చెట్టెక్కి వాటిని త్రెంచాడు. అంతకన్నా వేగంతో చెట్టుదిగి వాటిని కడిగి మేడమీదకి పరిగెత్తుకొచ్చాడు.

మేడ వెనకభాగంలో నిలబడ్డ వాసవి వాడు చెట్టెక్కి కాయలు త్రెంచడం గమనిస్తూనే వుందన్న సంగతి వాడికి తెలియదు.

శంకర్ వాసవి గది గుమ్మం ముందే ఒకరకమైన జంకుతో నిలబడిపోయాడు. అదివరకెప్పుడు కలగని భయమేదో వాణ్ణి ఒక్కసారిగా ఆవరించింది. ఎంతో చనువుగా లేడిపిల్లలా గెంతుతూ ఆమె గదిలోకి చొరబడేవాడు.

కానీ ఈరోజు అకస్మాత్తుగా వారిద్దరిమధ్య అంతరం గిరిగీసినట్లు కనిపిస్తుంటే వాడు తడబాటుగా నిలబడిపోయాడు. వాడికొక క్షణం వెనక్కు తిరిగి వెళ్ళిపోవాలనిపించింది కూడా. కానీ వాసవిని చూస్తే వాడికేవో జ్ఞాపకాలు.

ఆమె మీద ఇదమిద్దంగా తెలియని అభిమానం.

ఈ కొద్దికాలంలో అజ్ఞాతంగా పెంచుకున్న అనురాగపు లత ఇంత దట్టంగా ఎదిగిందనికూడా వాడి లేతమనసుకి తెలియదు.

ఒకే కడుపున పుట్టిన అక్కలేనేలేదు.

అక్కగా అభిమానించిన అమ్మగారిని దూరంగా చేసుకోలేడు తను.

శంకర్ కళ్ళలో సన్నటిపొర తళుక్కుమంది.

వాడు దాన్ని మోచేత్తో తుడుచుకుని ధైర్యం చేసి గదిలోకి అడుగుపెట్టాడు.

వాసవి రేర్ ఎండ్ బాల్కనీలో నిలబడి శూన్యంలోకి చూస్తోంది.

"అమ్మగారూ" శంకర్ మెల్లిగా పిలిచాడు.

నూతిలోంచి పిలిచినట్లుందా పిలుపు.

వాసవి "ఊఁ" అంది.

ఆ గొంతులో యింకా మాసిపోని కరుకుదనం.

శంకర్ కంగుతిన్నట్లు నిలబడిపోయాడు.

అయిదు నిమిషాల తర్వాత మెల్లిగా వెనక్కి తిరిగింది వాసవి. ఆమెవేపు చూసాడు శంకర్ చాలా అమాయకంగా.

వాసవి దృక్కులు చాలా నిశితంగా.

శంకర్ ఆమె కళ్ళలోకి చూడలేనట్లు తల దించుకున్నాడు.

వాడి చేతిలోని పళ్ళని చూసాక వాసవికి అర్ధమయ్యింది వాడవి తన కోసమే తెచ్చాడని.

నిజానికవి ముత్తుకోసం కోస్తున్నాడని అనుకుంది వాసవి. అలా అనుకోవడంతో ఆమెలోని కోపం మరో అంగుళం పైకి పెరిగింది.

ముత్తు పళ్ళు తింటే చూడలేనంత చిన్న బుద్దిలేదు వాసవికి. కానీ తను అసహ్యించుకుంటున్న ముత్తుని వీళ్ళందరూ నెత్తికెక్కించుకుంటున్నారనే ఒకలాంటి కసి, ఆమెలోని విజ్ఞతని మాపేస్తోంది.

శంకర్ కాస్సేపటికి నోరు విప్పగలిగాడు.

"అమ్మగారూ ఈ పళ్ళు తీసుకోండి" అన్నాడు బల్లమీద పెడుతూ గబగబా.

"ఏమ్మిట్రా ఆ ప్రత్యేకత?" ఆమె గొంతులో ప్రతిధ్వనిస్తోన్న వ్యంగానికి వాడు బిక్కచచ్చిపోతున్నాడు.

"మీరు...మీరు సరిగ్గా భోంచేయలేదు" అన్నాడు ఎలాగో గొంతుపెగల్చుకుని.

"పాపం ముత్తుకివ్వలేకపోయావా?"

శంకర్ తప్పుచేసినట్లు తలదించుకున్నాడు.

"అదికూడా భోంచేయలేదనుకుంటా" వాసవి మళ్ళీ రెట్టించింది. వాడి నుండి జవాబులేదు.

ముత్తంటే అమ్మగారికున్న కోపం వాడికి తెలుసు.

వాసవి వాడినే దీక్షగా చూస్తోంది.

సరిగ్గా అప్పుడే దించుకున్న వాడి కళ్ళనుండి జలజలా కన్నీటి బిందువులు జారి వాడి చెంపల్ని తడిపేసాయి.

వాసవి హృదయం కలుక్కుమంది.

తన కోపాన్ని మరచిపోయి వాడి కన్నీళ్ళు తుడవాలనిపించిందొక క్షణం.

కానీ వెంటనే ఆమెలోని అభిజాత్యం ఆమెను దిగజారిపోవద్దని హెచ్చరించింది.

అందుకే వాడి కన్నీళ్ళని చూసీ చూడనట్లుగా చూసింది.

"ముత్తుకి చాలా జ్వరమొచ్చిందండి. అందుకని.. దానికి కాఫీ యిచ్చాను. నిన్న నే దానికి జ్వరం తగ్గితే తొందరగా అన్నం పెడితే మంచిదని మీరు తినకుండానే దానికి పెట్టాను క్షమించండి" శంకర్ దాదాపు ఏడుస్తూ.

"అదంటే నీకెందుకురా అంత ప్రేమ" అంది వాసవి కొంచెం మెత్తబడ్డట్లు.

వాసవి ప్రశ్నకి ఏం జవాబు చెప్పాలో తోచనట్లు ఒక క్షణం నిలబడిపోయాడు.

ఒకర్ని చూస్తే పెట్టాలని ఒకర్ని చూస్తే అకారణంగా తిట్టాలని ఎందుకనిపిస్తుందో ఎవరికి మాత్రం తెలుసు.

అందుకే శంకర్ మౌనం వహించాడు.

"మీకు దాన్ని చూస్తే అంతకోపం ఎందుకు?" అని అడగాలనిపించింది వాడికి.

కానీ దాన్ని కప్పిపుచ్చుతూ "దాన్ని చూస్తే చచ్చిపోయిన మా అమ్మ గుర్తొస్తుందండి" అన్నాడు మెల్లిగా

వాసవి వాడివైపు చాలా ఆశ్చర్యంగా చూసింది.

"మీ అమ్మ.. మీ అమ్మ చచ్చిపోయిందా?" వాసవి ప్రశ్నకి శంకర్ 'అవునన్నట్లు'గా తలవూపాడు.

"యూ రాస్కెల్ నాకబద్ధం చెపుతావురా?" అంది వాసవి కోపంగా.

శంకర్ అర్థంకానట్లు చూసాడు.

"నేనొచ్చినరోజు ఏమని చెప్పావు? మా అమ్మా నాన్నా దెబ్బలాడుకుంటారని తాగి మీ నాన్న మీ అమ్మని చావబాదుతాడని అందుకే వాళ్ళనొదిలి వున్నందుకు బెంగగా లేదని"

శంకర్‌కి గుర్తొచ్చిందా విషయం. వాడు తప్పు చేసినవాడిలా తలదించుకున్నాడు.

"నువ్వు చాలా అమాయకుడివనుకున్నాను. ఛీనీలాంటివాళ్ళని చేరదీయటం నాదే తప్పు"

వాసవి దూషణకి వాడికళ్ళు బాధతో రెపరెపలాడాయి.

"అమ్మగారూ నేను అబద్దాలే చెప్పాను. ఆ రోజు అన్నం తినకుండా ఇంటిమీద బెంగతో వున్న మీకు నా సంగతులు చెప్పి యింకా బాధపెట్టకూడదని కాస్సేపు మిమ్మల్ని నవ్వించి హుషారు చెయ్యాలని మాత్రమే. కానీ నిజంగానే మా అమ్మ చచ్చిపోయింది. మా అమ్మ ముత్తులాగే వికారంగా వుంటుంది. కానీ మా అమ్మ మనసు చాలా మంచిదండీ" అన్నాడు శంకర్.

వాసవి వాడివేపు మాట్లాడలేనట్లు చూసింది.

ముత్తుకూడా చాలా మంచిదని చెప్పడమా వాడి ఉద్దేశ్యం.

"ముత్తుకి మీమీద కోపం లేదండీ. అది మీరనుకున్నట్లు చెడ్డది కాదు" శంకర్ వాసవి మౌనాన్ని ఆసరా చేసుకుని మరో అడుగు ముందుకి వేసాడు.

"నోర్ముయ్" వాసవి కంఠం తీవ్రంగా మ్రోగింది.

కళ్ళు మందారాల్లా ఎర్రబడ్డాయి

శంకర్ జంకినట్లు నిలబడిపోయాడు.

"మీ అందరికి అది మంచిదే దేవత. కానీ నా దగ్గర పొగడకండి. అది నాకు డెవిల్‌లా కనిపిస్తుంది. ఇంకోసారి నా ఎదుట పడితే షూట్ చేసేస్తానేమో" అంది వాసవి కోపంగా ఊగిపోతూ.

ఆమె అకారణ ద్వేషానికి కారణం తెలియని శంకర్ విస్తుపోయి బొమ్మలా నిలబడి చూసాడు.

"ఈ యింటికి వచ్చిన దగ్గర్నుండి అది నా పట్ల అదోలా ప్రవర్తిస్తూనే వుంది. చివరికి అది తెగించి మొన్న నన్ను అవమానించాక కూడా దాన్ని సమర్థిస్తున్నారంటే మీకెంత పెట్టినా యింతే మీ బుద్దులు మారవు" అంది వాసవి ఛీత్కారంగా.

వాసవి చీదరింపుకి శంకర్ దెబ్బతిన్నట్లయ్యాడు. వాడిలో నొక్కిపెట్టి వుంచిన ఆత్మాభిమానం బుసలుకొట్టి బయటికి రావడానికి ప్రయత్నిస్తుంటే వాడు వాసవి వైపు అసహనంగా చూసాడు రెప్పవేయకుండా. అసలే పెద్దవైన కళ్ళని యింకా పెద్దవి చేసి తననే చూస్తోన్న శంకర్‌ని గమనించింది వాసవి.

**ఆ కళ్ళలో బెదురులేదు.** భక్తిలేదు.

తమ అంచనాలని ఎదుటివ్యక్తి తారుమారు చేసినప్పుడు కలిగే ఆశ్చర్యం, అసహ్యం మిళితమైన వింత దృక్కులవి.

వాసవి వాడి చూపులకి అప్రతిభతంగా కదిలింది.

ఎదుటగా వున్నది లేడిపిల్లని భ్రమసి దానిమీద రాళ్ళు విసిరినప్పుడు అది అకస్మాత్తుగా పులిగా మారి మీదకి లంఘించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు చేతిలో ఆయుధంలేక తప్పించుకోవటానికి వీల్లేని స్థితిలో మనిషి అనబడే మృగంలో కలిగే సంచలనం అది.

వాసవికి వాడిని చూస్తే విపరీతమైన భయం కలిగింది. యింట్లో అనంత్ కూడా లేడు.

ఇప్పుడు వాడు. ముత్తుతో ఏకమయి తన నేమైనా చేస్తే? మాలి వున్నా వాడిలోకం వాడిది.

వాడుకూడా పనివాడేగా. వాళ్ళిద్దరూ ఏకం అయితే? వాసవికి అకస్మాత్తుగా గొంతెండిపోయినట్లయింది.

"ఏమిట్రా ఆ చూపు?" అంది నీరసంగా.

శంకర్ మాట్లాడలేదు.

వాడి కళ్ళనుండి విస్ఫులింగాలు రాలిపడుతున్నాయా అన్నట్లు క్షణక్షణానికి ఎర్రబడిపోతున్నాయి.

"మీరు నాతో క్రిందకు రండి" ఆ గొంతు ఆజ్ఞాపిస్తున్నట్లుగా వుంది. వాసవి నివ్వెరపోయి చూసింది.

అమాయకంగా, భయంగా తననోటినుండి జారీ అయ్యే ఆజ్ఞలకోసం అణకువుగా నిలబడే వాడిలో ఏదో దయ్యం ఆవహించినట్లు చాలా వింత మార్పు.

శంకర్ ముందుకి అడుగేసాడు. వాసవి నిలుచున్న చోటనే అవాక్కయినట్లు నిలబడిపోయింది. "రండి" వాడు, వెనక్కి తిరిగి అన్నాడు.

"ఎక్కడికి?" వాసవి ప్రశ్నకి శంకర్ జవాబు చెప్పలేదు. శంకర్ మెట్లు దిగుతున్నాడు.

వాసవి తననెవరో హిప్నటైజు చేసినట్లుగా బలహీనురాలయింది.

ఆమె వాడివెనుక భయంగా అడుగులేసింది.

వాడు అవుట్ హౌవుస్ వేపు వచ్చి కాస్త ముందుకి నడిచి స్టోర్ రూం దగ్గర నిలబడ్డాడు.

వాసవికి అర్ధమయింది. తనని వాడు ముత్తు దగ్గరికి తీసుకెళ్తున్నాడని.

వాసవి గుండె అమితమైన వేగంతో కొట్టుకుంది. వీళ్ళిద్దరూ కలిసి తనని ఏం చెయ్యబోతున్నారు?

శంకర్ తలుపు తోసాడు.

ఆ గదిలో కళ్ళకు ఏమీ కనిపించనంత చీకటి. శంకర్ లోనికి వెళ్ళి లైటు వేసాడు.

సన్నని వెలుగు గదిలో నీరసంగా ప్రసరించింది.

"రండమ్మా" శంకర్ వెనక్కు తిరిగి పిలిచాడు.

వాసవి గుమ్మంలో నిలబడింది. ఆమెకు గదిలోంచి వస్తోన్న ముక్కు వాసనకి ముక్కు బ్రద్దలవుతోంది.

పమిటిచెంగుని ముక్కుకి అడ్డంగా పెట్టుకుని లోనికి ప్రవేశించింది.

శంకర్ అక్కడ మంచంమ్మీద పడుకున్న ముత్తు శరీరం మీదనించి దుప్పటి తొలగించాడు.

ముత్తు ఉలిక్కిపాటుగా కళ్ళు తెరిచింది.

కొంతసేపు ఆమెకు ఏమీ కనబడలేదు.

కళ్ళు చిట్లించి చూసి "ఏర్ అదు?" అంది

అమ్మగారొచ్చారు, నిన్ను చూడ్డానికి అన్నాడు శంకర్.

ముత్తుకి వాడిమాటలు అర్ధమయ్యాయో లేదోగాని సరిగ్గా అప్పుడే దాని చూపు గుమ్మంలో నిలబడ్డ వాసవిమీద పడింది.

వెంటనే దాని శరీరం భయంతో నిలువెల్లా వణికింది

అది గడగడలాడుతూ రెండుచేతులు తలకి అడ్డంగా పెట్టుకుని 'దయసెయిదు ఎన్న అడికాదంగళ్' అంది

శంకర్ వాసవి వైపు చూసాడు.

"రండమ్మా! దగ్గరకొచ్చి చూడండి మీరు కొట్టిన దెబ్బలకి దాని ఒళ్ళెలా పుండయిందీ చూసి సంతోషించండి. ఇంతకీ దాన్ని మీరెందుకలా చావగొట్టారు? మిమ్మల్నది మేడమీదనుండి క్రిందకి దిగనివ్వలేదు. ఎందుకలా చేసిందో కనుక్కున్నారా? మీరు కనుక్కోరు. ఎందుకంటే మీకా అవసరంలేదు. మీకు డబ్బుంది. మీ క్రింద పనిచేసే ప్రాణులు మీకు నీతి నియమాలు లేని హీనుల్లా, అవసరమయితే మీ ప్రాణాలు తీసే హంతకుల్లా కనిపిస్తారు. ఆ ఊహతోనే నిజానిజాలు తెలుసుకోకుండా మీరు శిక్షలు వేసేస్తుంటారు.

ముత్తు ఏం చేసింది? క్రింద ఎవరో వెధవ యింట్లో జొరబడి అల్లరి చేస్తుంటే వాడుండగా మిమ్మల్ని క్రిందకి రానివ్వకూడదని ప్రయత్నించింది అది. ఆ విషయం తమిళంలో మీకు చెప్పింది కూడా. అదేం చెబుతుందో తెలుసుకోవడానికి ప్రయత్నించకుండా మీరు అది మీకు అపకారం చేస్తుందన్న భావనతో దాన్ని చితకబాదేసారు. అది మీకన్నా ముందునుంచే యీ యింట్లో వుంది. అందుకే ఆ రౌడీగురించి దానికేదో తెలుసుంటుంది. మీరు వాడికి కనిపించకూడదని మీ మేలుకోరి చేసింది. ఈ యింట్లోకి వచ్చిన మొదటిరోజే అది మిమ్మల్ని పాము బారినుండి కాపాడింది. ఆ విషయం మరిచిపోయారు మీరు. రూపాన్ని చూసి మొదటినుండీ దానిమీద కోపాన్ని పెంచుకున్నారు మీరు" శంకర్ ఆవేశంగా మాట్లాడుతుంటే వాసవి నిర్ఘాంతపోయినట్లుగా చూసింది.

ఆలోచిస్తే వాడి మాటల్లో ఏదీ తప్పుకాదు.

వాసవి మొదటిసారిగా ఒక విధమైన జాలితో ముత్తువేపు చూసింది.

దాని వంటినిండా దెబ్బలే. నల్లని శరీరం నిండా అంటించివున్న తెల్లని ప్లాస్టర్లు.

"మూడురోజులుగా దానివంటిమీద స్పృహలేదు. వళ్ళు జ్వరంతో కాలిపోయింది. రాత్రే కాస్త జ్వరం తగ్గితే అన్నం పెట్టాను. ఇందులో మా యిద్దరి తప్పూ వుంటే మమ్మల్ని పనిలోంచి తీసెయ్యండి. మేము ఎలాగోలా బ్రతుకుతాం. బ్రతుకు గురించి మాకు భయంలేదు. ఎందుకంటే ఈ ప్రపంచంలో మేం ఏకాకులం కాము. మేమిద్దరమే ఒకరికొకరు తోడు" అన్నాడు ఎంతో నిబ్బరంగా.

ముత్తు శంకర్ వేపు తిరిగి ఏదో చెప్పింది.

శంకర్ వెంటనే చెక్కసామాన్లలో విరిగిపోని కుర్చీ తీసి వాసవిని "కూర్చోండమ్మా" అన్నాడు వినయంగా గొంతులోని ఆవేశాన్ని తగ్గించుకుని.

వాసవి కూర్చుంటూ "నీకు తమిళం వచ్చా?" అంది ఆశ్చర్యంగా.

"ఈ మధ్యే కొద్దిగా ముత్తు దగ్గర నేర్చుకుంటున్నానండీ ఏదో కొద్దిగా అర్థమవుతున్నది" అన్నాడు.

ముత్తు వాసవికి చేతులెత్తి దణ్ణం పెట్టి ఏదో గొణిగింది.

వాసవి మనస్సు సిగ్గుతో కుంచించుకుపోయింది.

చదువు సంధ్యలుండి, మంచి–చెడుకి మధ్యవుండే సున్నితమైన తేడా తెలిసికూడా ఒక పెద్ద ఫూల్‌లా బిహేవ్ చేసింది.

అందుకు ముత్తుకి ఏ విధమైన క్షమాపణ చెప్పగలదు? వాసవి కళ్ళనుండి జారుతున్న పశ్చాత్తాప భాష్పాలు చూసి ముత్తు శంకర్ యిద్దరూ కంగారు పడ్డారు.

"నన్ను క్షమించండిరా" అంది ఎలాగో.

అంతసేపూ ముప్పిరిగొన్న ఆవేశంతో ఏకబిగిన మాట్లాడిన శంకర్‌కి స్పృహ వచ్చినట్లయింది.

వాడు అమాంతం వాసవి పాదాలు పట్టుకుని " మీరే క్షమించాలి. నేను నోటికొచ్చినట్లు మాట్లాడాను" అన్నాడు పసిపిల్లాడిలా దిగజారిపోయి.

"లేదురా నిజాన్ని నిర్భయంగా చాటి చెప్పావు" వాసవి అనునయంగా అంది.

"మీరు క్షమిస్తానంటే మరో సంగతి కూడా చెబుతాను" అన్నాడు శంకర్ సంశయంగా.

వాసవి ఏమిటన్నట్లు చూసింది.

"మీకు ... నేను వంట వేరుగా చెయ్యటంలేదు. నాకు వంటరాదు. ముత్తు వండినవే నేను వండినట్లు పెడుతున్నాను" అన్నాడు.

వాసవి విస్మయంగా చూసింది

ఆ వెంటనే "యూ నాటీ" అంటూ వాడి నెత్తిన మొట్టింది నవ్వుతూ.

14

కారు దిగుతోన్న జగదీష్‌ని, జగన్నాధరావుగారిని చూడగానే వాసవి మనసు ఉత్సాహంతో గంతులేసింది.

ఆమె హుషారుగా రెండేసి మెట్లకొక గెంతు గెంతుతూ మేడదిగి పోర్టికోలోకి పరిగెత్తుకొచ్చి "డాడీ" అంటూ జగన్నాధరావుగారిని చుట్టేసింది.

"బేబీ బాగున్నావామ్మా?" ఆయన కూతురి వీపు నిమురుతూ కుశలప్రశ్న వేసారు.

"నేను బాగానే వున్నాను డాడీ నీకెలా వుంది?" అంది తండ్రి ముఖంలోకి ఆప్యాయంగా చూస్తూ.

"నాకేం ఫర్వాలేదమ్మా ఏదో మామూలు అనారోగ్యమే" అన్నాడు నవ్వుతూ. వాసవి చెయ్యి ఆసరాతో ఆయన హాల్లోకి వస్తుంటే జగదీష్ చిరునవ్వుతో వాళ్ళని అనుసరించాడు.

శంకర్ డిక్కీలోని సూట్‌కేసులు తీసుకుని వాళ్ళ వెనుక వచ్చాడు.

జగన్నాధరావుగారు సోఫాలో కూర్చునే మేడని క్రీగంట పరిశీలిస్తూ ఆ యింటి ఖరీదును అలాంటి యిల్లున్న వ్యక్తుల ఆస్తి ఖరీదుని అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నారు.

వాసవి గబగబా లోనికెళ్ళి రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చింది.

జగదీష్ టైనాట్ లూజ్ చేసుకుంటూ నువ్వు తెస్తున్నావేం? ముత్తు ఏమయ్యింది అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ.

వాసవి తడబాటుగా "దానికి... దానికి వంట్లో బాగోలేదు" అంది.

"ఏమయింది?"

వాసవి జవాబు చెప్పలేనట్లు నిస్సహాయంగా అప్పుడే లోనికొస్తున్న శంకర్‌వేపు చూసింది.

"అది మేడమెట్లమీంచి పడిందయ్యా" అన్నాడు శంకర్ వాసవి అవస్థ గమనించి.

"అయ్యో పాపం డాక్టరుకి చూపించారా?" అన్నాడు జగదీష్ సానుభూతిగా.

"మన కొత్త సెక్రటరీబాబు చూపించారు" అన్నాడు శంకర్ గబగబా జగదీష్ పాదాల దగ్గర కూర్చుని బూట్ లేసు విప్పుతూ.

వాసవి ఒడ్డున పడ్డట్లు స్థిమితపడి కాఫీకప్పు తండ్రికందించింది.

జగన్నాధరావుగారు కప్పు అందుకోకుండా "ముందు అల్లుడిగారికియ్యమ్మా" అన్నారు నవ్వుతూ.

"ఫర్వాలేదు తీసుకోండి" అన్నాడు జగదీష్

వాసవి తండ్రికిచ్చిన తర్వాత మరో కప్పు భర్తకందించింది.

జగదీష్ కొంచెం సిప్ చేసి "అద్భుతం. వంట నీకింత బాగా వచ్చని ఎప్పుడూ చెప్పనేలేదు" అన్నాడు మెచ్చుకోలుగా వాసవికేసి చూస్తూ.

"నేను చెప్పుకోకూడదు కానీ మా అమ్మాయి ఆల్ ఇన్ ఆల్. ఎటొచ్చీ మూడ్ కుదరాలి అంతే" అన్నారు జగన్నాధరావు నవ్వుతూ.

"అంటే. మీ అమ్మాయికి మిమ్మల్ని చూడగానే మూడ్ వచ్చిందన్నమాట" అన్నాడు జగదీష్ వాసవి వేపు కొంటెగా చూస్తూ.

వాసవి యిబ్బందిగా తలతిప్పుకుంది.

జగన్నాథరావు కూతురివేపు ఆప్యాయంగా చూసి "అమ్మాయింకా మూడ్‌లోకి రాలేదంటే అది నీ తప్పు అనను కానీ అమ్మాయిది మాత్రంకాదు" అన్నారు సమర్థింపుగా.

"వ్వాట్?" అన్నాడు జగదీష్ భుజాలెగరేస్తూ.

వాసవి వాళ్ళు త్రాగేసిన కప్పుల్ని తీసుకుని గబగబా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

వాసవి కంగారుగా వెళ్ళిపోవడం గమనించి వాళ్ళిద్దరూ చిన్నగా నవ్వుకున్నారు.

"శంకర్, సెక్రటరీ ఎక్కడ?" అన్నాడు జగదీష్ విసుగ్గా.

"ఆయనకు జ్వరం వచ్చింది అయ్యా. అందుకే ఎయిర్‌పోర్టుకి రాలేక కారిచ్చి డ్రైవర్నే పంపించారు" అన్నాడు శంకర్.

"వీళ్ళందరికీ రోగాలు ఒక్కసారిగానే వచ్చాయేవిటి? కార్డియాలజిస్టుని కనుక్కోమన్నాను. ఆ ఏర్పాటులేమైనా చేశాడా?" అన్నాడు జగదీష్ విసుక్కుంటూ.

"నాకు తెలియదయ్యా అమ్మగారిని పిలుస్తానుండండి" అన్నాడు శంకర్ వంటగదివేపు పరుగుదీస్తూ.

"మీ అమ్మగారింకా క్రొత్త పెళ్ళికూతురే. ఆవిడకేం తెలుస్తుంది?" అన్నాడు జగదీష్.

ఆ మాటలో హాస్యానికన్నా ఎత్తిపొడుపు ఎక్కువగా గోచరించింది జగన్నాథరావుకి.

ఆయన ముఖం కాస్త నల్లబడింది.

జగదీష్ మామగారి ముఖం చూసి తన తప్పు తెలుసుకున్నట్లుగా "ఇంకా వాసవి ఇక్కడ క్రొత్తగానే ఫీలవుతోంది. నా బిజినెస్ గొడవల వల్ల నేను ఆమెకు తగినంత దగ్గర్లో వుండలేకపోతున్నాను" అన్నాడు. జగన్నాథరావుగరు మాట్లాడలేదు. నవ్వి ఊరుకున్నారు.

ఇంతలో వాసవి శంకర్‌తో గబగబా అక్కడికొచ్చింది. టెలిఫోన్ పక్కనే ఉన్న డైరీ తీసి గబగబా పేజీలు తిప్పి అతనికిచ్చింది.

జగదీష్ డైరీ అందుకుని చదివాడు. అక్కడ అనంత్ డాక్టర్‌తో కన్స చేసిన వివరాలు వున్నాయి.

వాసవి ఆ మాత్రం శ్రద్ధ తీసుకోవడం అతనికి చాలా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించినట్లుగా కళ్ళు పెద్దవి చేసి ఆమెవైపు చూసాడు.

ఆ కళ్ళలో కనిపిస్తోన్న ప్రశంసకి సిగ్గుపడ్డట్లుగా చూపులు తిప్పుకుంది వాసవి.

"అతనికి అంత ఎక్కువగా వుందా జ్వరం?" అడిగాడు జగదీష్.

వాసవి మాట్లాడలేదు.

జగన్నాథరావుగారి ఎదుట పడకుండా వుండటానికే అనంత్ జ్వరం నాటకం ఆడుతున్నాడు. ఆ విషయం వాసవికి మాత్రమే తెలుసు. అతను లేవలేని స్థితిలో వున్నట్లు చెప్పాలని వున్నా వాసవి అబద్ధం చెప్పలేక మౌనాన్ని ఆశ్రయించింది.

"అతని సంగతి ఎవరు పట్టించుకున్నట్లు? కనీస్మ డాక్టర్నయినా పిలిచారా?" అన్నాడు జగదీష్ తిరిగి.

వాసవికి ఏం జవాబు చెప్పాలో తోచలేదు.

ఆవహిస్తోన్న నీరసాన్ని అదిమిపట్టి "నేను..కాఫీ..పంపించాను. అతనేదో మందులు వేసుకున్నాడు. అంత...సీరియస్ కండిషన్ కాదు కానీ తలనొప్పట. అందుకే డిస్టబ్ చెయ్యొద్దని శంకర్‌ని లేపొద్దని చెప్పాను" అంది వాసవి.

"సరే నువ్వు మీ డాడీకి కావల్సిన ఏర్పాట్లు చూడు. సాయంత్రం నేను తీసుకెళ్తాను డాక్టర్ దగ్గరికి" అన్నాడు జగదీష్ తన గదిలోకెళ్తూ.

వాసవి తేలిగ్గా నిట్టూర్చి తండ్రివేపు చూసింది.

"అల్లుడిగారిని చూసి అలా పిల్లిలా అయిపోతావెందుకమ్మా?" అన్నారు జగన్నాధరావుగారు నవ్వుతూ.

వాసవి జవాబు చెప్పకుండా అదోలా చూసింది. ఆ వెంటనే "రండి నాన్నా మీకు గెస్ట్ రూమ్ చూపిస్తాను" అంది ముందుకు నడుస్తూ.

జగన్నాధరావుగారు లేచి కూతుర్ని వెంబడించారు. "నాకు తెలుసు ఈ ఆడపిల్లలు పెళ్ళికి ముందు, వ్యక్తిత్వం, స్వేచ్ఛ, సమానత్వం అంటూ ఉపన్యాసాలు, ఊదరగొట్టేసి ఎవరైనా భర్తమాట వినేవాళ్ళని చవటలుగా చిత్రించి, చివరికి పెళ్ళికాగానే పిల్లులయిపోతారని" ఆయన నవ్వుతుంటే వాసవి వినిపించుకోనట్లు కిటికీ తలుపులు తెరిచి, మంచమ్మీద బెడ్‌షీట్ మార్చసాగింది.

జగన్నాధరావుగారు కుర్చీలో కూర్చుంటూ "అదృష్టవంతుల్ని చెరపలేరని అంటారు. అది నిజమేననిపిస్తోంది నాకు" అన్నారు.

ఆ మాట ఎవర్ని ఉద్దేశించో తెలియకపోయినా పట్టనట్లుగా "ఏ.సి ఆన్ చేయమంటార డాడీ" అంది వాసవి.

"వద్దమ్మా! నేను నీకోసం పది సంబంధాలు వెదకలేదు. వచ్చింది ఒకటే. కనీసం నేను ఇతనిగురించి ఎవర్నీ వాకబు చెయ్యలేదు. కానీ నువ్వు గొప్ప యింట్లోనే పడ్డావు. అదే అదృష్టమంటే" అన్నారు జగన్నాధరావుగారు.

వాసవి బాత్రూమ్ తలుపు తీసి గీజర్ ఆన్ చేసింది. "క పదినిమిషాల్లో నీళ్ళు కాగుతాయి. స్నానం చెయ్యండి. ఈలోపున నేను వంటప్రయత్నం చూస్తాను" అంది వాసవి బయటికి వెళ్ళబోతూ.

"వాసవీ" జగన్నాధరావుగారు అనునయంగా పిలిచారు.

వాసవి ఠక్కున ఆగిపోయింది.

"పెళ్ళిళ్ళ పేరున ఆడపిల్లల నెత్తిన ఒక్కసారే ఎంతెంత బాధ్యతలు పడతాయో నాకూ కొంత తెలుసమ్మా. కానీ నీ పెళ్ళయ్యాక నీ యింటికి మొదటిసారిగా వచ్చిన తండ్రితో కాస్సేపు కూర్చుని మాట్లాడలేనంత బిజీగా వున్నావా తల్లీ" అన్నారు.

వాసవి తలదించుకుంది.

"అదేం బేబీ, నీ వంట్లో బాగోలేదా? ఎంతో హుషారుగా వుండేదానివి. ఈ కొద్దికాలంలోనే యింత నిస్తేజంగా మారిపోయావేం తల్లీ" అన్నారు బాధగా.

వాసవి తలయెత్తింది.

ఆ కళ్ళలో రెపరెపలాడుతోన్న బాధ .

"లేదు డాడీ, నేను..నేను బాగానే వున్నాను. వంటమనిషికి బాగోలేదుగా. పనివల్ల నీ దగ్గర కూర్చోలేకపోయాను" అంది గబగబా.

జగన్నాధరావుగారు చిరునవ్వు నవ్వారు.

"అబద్దం చెబుతున్నావు కదూ అదీ చాలా అద్భుతంగా. ఎందుకంటే నీకళ్ళు నాకు నిజం చెబుతున్నాయి. నీ ముఖంలో కేవలం నీకళ్ళకి మూడు నాలుగంగుళాలు దూరంలో వున్న నీ నోరు నిజాన్ని కప్పిపుచ్చడానికి వృధా ప్రయాసపడుతోంది. నువ్వేదో బాధపడుతున్నావు. ఆ విషయం నాకు యిందాకే అర్థమయ్యింది" అన్నారు కూతురి ముఖంలోకి సాలోచనగా చూస్తూ.

"లేదు డాడీ" అంది వాసవి అతికష్టంగా నవ్వుతూ.

"ఈ మధ్య హైదరాబాదుకి కూడా నీళ్ళ కరువొచ్చిందమ్మా. రోజూ వానకోసం ప్రజలు నోళ్ళు తెరుచుకుని ఆకాశంకేసి చూసినా వర్షం పడలేదు. కానీ దొంగ మబ్బులు రోజూ గాఢంగా పట్టేవి. వాటిని చూసి ఇంకేం వర్షం వస్తుందని అందరూ ఆశపడేవారు. చివరికి ఆ మబ్బులు గాలికి విడిపోవటమే కానీ వర్షం లేదు"

వాసవి సందర్భంలేకుండా మాట్లాడుతున్న తండ్రివేపు ఆశ్చర్యంగా చూసింది.

"ఆ మబ్బుల్లావుంది నీ నవ్వు" అన్నారాయన.

ఆయన మాటలకి వాసవి నవ్వింది పకపకా.

"హమ్మయ్య వచ్చిన ఇన్ని గంటలకి బేబీ నవ్వింది" అన్నారు జగన్నాధరావుగారు మంచమ్మీద ఒరుగుతూ.

వాసవి సిగ్గుపడ్డట్లుగా తలదించుకుంది.

"నాకు తెలుసమ్మా! నీకిక్కడ అంతా క్రొత్తగా వుంది కదూ. అయినా అల్లుడు దేవుడిలాంటివాడు అతని నీడలో నువ్వు సుఖపడతావు" అన్నారు జగన్నాధరావుగారు.

"నువ్వు స్నానం ముగించు డాడీ? ఈలోపున నేను వంటపూర్తిచేయాలి" అంది వాసవి.

"ఓ.కె! ఓ.కె" అన్నారు జగన్నాధరావుగారు.

వాసవి హాల్లోంచి జగదీష్ రూము ముందునుంచి వంటగదివేపు అడుగులు వేసింది.

"వసూ ఒన్ మినిట్"

వాసవి పాదాలు ఠక్కున ఆగిపోయాయి.

ఆమె మెల్లిగా తలతిప్పి గదివేపు చూసింది.

అక్కడ గుమ్మానికి కాస్తదూరంలో జగదీష్ నవ్వుతూ.

"పిలిచారా?" అంది వాసవి.

"అవును"

వాసవి మెల్లిగా లోనికి అడుగులేసింది.

ఇద్దరిమధ్యా కొన్ని నిమిషాల మౌనం.

"ఈ గది ఎవరు సర్దారు?"

**జగదీష్** ప్రశ్నకి తడబాటుగా చూసింది వాసవి.

"నేనే. బాగుండలేదా?" అడిగింది వాసవి.

జగదీష్ అప్పుడే చూస్తున్నట్లు గదంతా కలయచూసాడు.

"ఎలావుందో ఖచ్చితంగా చెప్పమంటావా?" కవ్విస్తున్నట్లు అడిగాడు జగదీష్.

వాసవి అతని కళ్ళలోకి చూసి "చెప్పండి" అంది మెల్లిగా. జగదీష్ వాసవి దగ్గరగా వచ్చాడు.

"నీ టేస్ట్ అమోఘం ఇంటీరియల్ డెకరేషన్ నేర్చుకున్నావా?" అడిగాడు నవ్వుతూ.

"లేదు" అంది వాసవి.

"అవును నేర్చుకుంటే వచ్చేవి కావులే యివి"

"ఇంతకూ.. మీకు... నచ్చిందా?" అడిగింది వాసవి.

"నిజమే ఎలా వుందో? నేను చెప్పలేనేలేదు కదూ"

జగదీష్ గబుక్కున వాసవి భుజాల చుట్టుగా చేతులేసి దగ్గిరికి లాక్కుని ఆమె పెదవుల్ని తన పెదవులతో సున్నితంగా స్పర్శించాడు.

ఈ ఆకస్మిక చర్యకి వాసవి ఉలిక్కిపడినట్లుగా అతన్ని వెనక్కి త్రోసింది.

జగదీష్ నవ్వుతూ వెనక్కి జరిగి "మాటల్లో చెప్పటం నాకు చేతకాదు మరి" అన్నాడు.

వాసవి పెదవులు సన్నగా కంపించాయి.

సిగ్గుతో ఎర్రబడ్డ ఆమె బుగ్గల్ని చూసి తమాషాగా నవ్వుకున్నాడు జగదీష్.

"మీ డాడీ నీ గురించి నన్నేమని అడిగారో తెలుసా?"

వాసవి కనురెప్పలు బరువుగా పైకి లేచాయి.

ఆ కళ్ళలో చెప్పమన్న అభ్యర్ధన గమనించి జగదీష్ కళ్ళు కొంటెగా మెరిసాయి.

"అమ్మాయి సంగతులేం తెలియడంలేదు బాబూ ఎలావుంది?" అంటూ అడిగారాయన నన్ను చూసీ చూడగానే. ఆయన ఆతృతకి నవ్వుకున్నాను.

"మీ అంతబాగా చూడలేకపోవచ్చు కానీ నాకు వీలయినంతవరకు నేను ఆమెనే విధంగానూ నొప్పించకుండా చూడడానికే ప్రయత్నిస్తున్నాను" అన్నాను.

ఆయన నొచ్చుకుంటున్నట్లుగా "నన్ను అపార్ధం చేసుకోకు బాబూ ఏదో తల్లిలేని పిల్ల దాని యిష్టానికి అనుగుణంగా స్వేచ్ఛగా పెంచాను. ఎప్పుడూ బేబీని వదిలి వుండలేదు కదా అందుకే  ఆగలేక అడుగుతున్నాను" అన్నారు.

ఇందులో అపార్ధం చేసుకోవాల్సిందీ, బాధ పడాల్సిందీ ఏమీ లేదు మామయ్యగారూ ఆడపిల్ల తండ్రిగా మీ హృదయం నాకు అర్ధమవుతోంది అన్నాను.

ఆయన తేలిగ్గా నిట్టూర్చి "నాకు తెలుసు బాబూ నువ్వు నన్నర్ధం చేసుకుంటావ్. అది సరే అమ్మాయికి ఏదయినా విశేషమా?" అని అడిగారు. మొదట నాకు అర్ధం కాలేదు. అర్ధం అయిన వెంటనే చిన్నగా నవ్వాను.

"తరచు మీకు ఫోన్ చేసి మాట్లాడుతుందిగా చెప్పలేదా?" అన్నాను.

ఆయనకూడా నవ్వి "ఎలా చెబుతుంది బాబూ ఆడపిల్ల ఇవన్నీ తల్లికి చెప్పుకోవాల్సిన సంగతులు తల్లి లేకపోవడం దాని దురదృష్టం" అన్నారు.

నేను మాట్లాడకుండా ఎటో చూస్తూ కూర్చున్నాను.

"ఏం బాబూ, నువ్వుకూడా మౌనాన్నే ఆశ్రయించావు? విషయం చెప్పడానికి సిగ్గుపడుతున్నావా?" అన్నారు రెట్టిస్తున్నట్లుగా.

నాకు నిజంగానే సిగ్గేసింది. ఏముందని చెప్పాలి? మా ఇద్దరి మధ్యా భార్యాభర్తలమధ్య వుండే శారీరకానుబంధం యింతవరకూ కలగలేదని చెబితే ఆయన నమ్ముతారా? ఆయనేకాదు ఈ ప్రపంచమే నమ్మదు. కాస్సేపు ఆడ – మగ ఒంటరిగా కూర్చుని మాట్లాడుకుంటేనే ఏదో వుందని చెప్పుకుని ఆనందించే కుత్సిత ప్రపంచం మన మధ్య వున్న దూరాన్ని నమ్మదు. నమ్మినదానికీ మరో క్రొత్త కారణాలు వెదికి ఆనంద పడుతుంది అదొక పైశాచికానందం. అందుకే నేను మీ డాడీకి ఏమీ చెప్పలేకపోయాను.

కానీ ఆయన నేనేం చెబుతానోనని నావైపే చూస్తున్నారు.

"ఇంకా ఏం లేదు" అనేసాను గబగబా.

ఆయన నవ్వేస్తూ "ఎన్నాళ్ళయిందిలే మీ పెళ్ళయి మాత్రం. అయినా నాదొట్టి అనుమానం మీరేవైనా జాగ్రత్తపడుతున్నారేమోనని" అన్నారు తిరిగి.

నేనెంత ఎవాయిడ్ చేద్దామనుకున్నా ఆయన ఆ విషయాన్నే సాగదీస్తున్నారు.

"అదేం లేదు." అన్నాను పొడిగా.

"అదే చెబుదామని ఆ తెలివితక్కువ పని చెయ్యకండి. మీరు నడివయసుకు వచ్చేసరికి పిల్లలు మీచేతికందివస్తారు. ఆలస్యం అయ్యేకొలది వృద్ధాప్యం మీద పడి మీ బాధ్యతలు మీరు తీర్చుకోడానికీ కుదరదు. ఎంత డబ్బున్నా పిల్లలకి తండ్రుల ఆసరా ఆదరణ కావాలి" అన్నారు.

నేను మౌనం వహించాను.

"వాసవి కూడా పిల్లల లాలనలోపడి ఒంటరితనాన్ని పోగొట్టుకుంటుంది. మా వాసవిని పరిపూర్ణ స్త్రీగా చూడాలంటే అది తల్లికావాలి" అన్నారు తిరిగి.

జగదీష్ చెప్పడం ఆపి వాసవి వైపు చూసాడు. వాసవి తలదించుకుని దుప్పటి మడతలు సరిచేస్తోంది.

తనవంక చూడలేక ఆమె తలదించుకున్న సంగతి అర్ధమయింది.

అతను వాసవి దగ్గరగా నడిచి ఆమె చుబుకం పట్టుకుని ఎత్తి ఆమె కళ్ళల్లోకి చూసాడు.

వాసవి అతని కళ్ళలోకి చూడలేనట్లు తల వాల్చుకుంది.

"సిగ్గా" అతని చిలిపి ప్రశ్న.

వాసవి అతనికి దూరంగా తొలిగి "పనివుంది. వంటకాలేదు" అంది మెల్లిగా.

"బ్లడీ కుకింగ్ కావాలంటే కారియర్ తెప్పిస్తాను" అతనామెను తన చేతుల్లో బంధించాడు.

వాసవికి గుండె వేగంగా కొట్టుకుంది.

"ప్లీజ్ డాడీ వున్నారు వదలండి" అంది బ్రతిమలాడుతున్నట్లు.

"అయితే ఒక కండిషన్" అన్నాడతను ఆమెను మరింత గుండెలకి హత్తుకుంటూ.

"చెప్పండి" గొణిగింది వాసవి.

"రాత్రికి.. యిక్కడికే వస్తావుకదూ" అన్నాడతను గుసగుసగా.

వాసవి మాట్లాడలేదు.

"ఏం, జవాబు చెప్పవు? నీ గది ఎందుకో మనకు కలిసి రాలేదు. ఈ గదిని నువ్వు తీర్చిదిద్దిన తీరు చూస్తుంటే అన్యోపదేశంగా నువ్వు నాకు ప్రేమ సందేశం పంపినట్లుగా ఫీలవుతున్నాను. ఈ కొన్నిరోజుల ఎడబాటు నిన్ను నాకు సన్నిహితం చేసిందనుకోవచ్చా?"

వాసవి చూపుల్లో ఏదో కంగారు.

ఆమెలోని తడబాటు ఎంత అదిమి పెట్టినా ఆగనట్లు శరీరమంతా ప్రాకి ప్రకంపనకి లోను చేస్తోంది.

"నన్ను చూసి ఇంకా ఎన్నాళ్ళిలా బెదురుతావు?" జగదీష్ నవ్వుతూ ఆమె ముంగురులు సవరించాడు.

"అక్కడ వంట"

"వంకాయకూర! నాన్సెన్స్ నేనడిగినదానికి జవాబు చెప్పు"

"....."

"రాత్రికి ఇక్కడే వస్తానంటేనే ఇప్పుడు వదిలేది" జగదీష్ ఆమెను అదిమిపట్టుకుంటూ అన్నాడు.

"అమ్మగారూ"

దూరంగా శంకర్ పిలుపు.

"శంకర్ వస్తున్నాడు వదలండి ప్లీజ్" జగదీష్ నిర్లక్ష్యంగా నవ్వాడు.

''వాడు మన ఇంటి నౌకరు. ఇప్పుడు వాడేకాదు. మీ డాడీ వచ్చినా వదలను. నేనేం తప్పుపని చెయ్యటంలేదు. నువ్వు నా భార్యవి మైండిట్'' అన్నాడు ధీమాగా.

వాసవి అతనివైపు కోపంగా చూసింది.

''మీరు చాలా మొండి'' అంది విసుగ్గా.

''థాంక్స్ ఫర్ యువర్ కాంప్లిమెంట్ కాని రాత్రి సంగతి'' అతను పట్టువదలని విక్రమార్కుడిలా పట్టుబట్టాడు.

వాసవి నవ్వింది.

''దానికంత గొడవదేనికి? రానని నేను అనలేదుగా'' అంది సిగ్గుగా.

జగదీష్ ఆశ్చర్యపోయినట్లు చూసి ఆమెను ముద్దు పెట్టుకుని వదిలేసాడు.

15

సరిగ్గా సాయంత్రం నాలుగుగంటలకి జగదీష్ జగన్నాధరావుగారిని ఎగ్మూర్‌లోని రామస్వామి అయ్యంగార్ హాస్పిటల్‌కి తీసుకెళ్ళాడు.

వెళ్ళేముందు అతను వాసవి దగ్గరకొచ్చి.

''బహుశా మీ డాడీని జాయిన్ చేయాల్సి రావొచ్చు. కండిషన్ ఎంత బాగున్నా రెస్ట్‌కోసం వాళ్ళు తప్పనిసరిగా ఎడ్మిట్ చేయమనే చెబుతారు. అదిగాక ఏవో టెస్ట్‌కూడా ఉంటాయిగా, నేను అనంత్‌ని చూసాను. పెద్దగా టెంపరేచర్ లేదు. చాలా స్లయిట్ ఫీవర్. అతనికి పళ్ళరసంకాని, హార్లిక్సుకానీ పంపించు. అడగడానికి సిగ్గుపడుతున్నట్టున్నాడు. ఇక్కడ అతనికి అన్నీ మనమేగా'' అన్నాడు.

వాసవి భర్తకేసి సాభిప్రాయంతో చూసి సరేనన్నట్లు తల పంకించింది.

''నీకు చాలా ట్రబులిస్తున్నట్లున్నాను కదూ. ఇంకో వంటమనిషిని చూడమని అనంత్‌కి చెప్పాలి'' అన్నాడు జగదీష్ నొచ్చుకుంటున్నట్లుగా.

''ఫర్వాలేదు నాకు మాత్రం వేరేపనేముంది?'' అంది వాసవి నవ్వుతూ.

''నువ్వలాగే అంటావ్ ఆ ముఖం చూడు ఎంతగా వాడిపోయిందో'' అన్నాడు జగదీష్.

''ఇంకెంత రెండురోజులు. ముత్తుకి దాదాపు తగ్గిపోయినట్టే'' అంది వాసవి.

''మొత్తానికి ముత్తు నీ అభిమానం సంపాదించిందన్నమాట. లక్కీ విమెన్'' అంటూ నవ్వి అర్ధవంతంగా భార్య ముఖంలోకి చూసాడు.

వాసవి కూడా సన్నగా నవ్వింది.

''ఈదేవి కటాక్షం మాకెప్పుడు లభిస్తుందో?'' జగదీష్ కళ్ళు కొంటెగా మెరిసాయి.

వాసవి సిగ్గుగా ముఖం తిప్పుకుంది. సరిగ్గా అప్పుడే జగన్నాధరావుగారు లోనికొచ్చి వాళ్ళకేసి చూసారు.

చిరునవ్వు లొలికిస్తోన్న అల్లుడి ముఖం సిగ్గుదొంతరల మధ్య యిరుక్కున్న కూతురిముఖం చూసి ఆయన ముఖం సంతృప్తిగా కళకళలాడింది.

ఆయన తనొచ్చినట్లుగా చిన్నగా దగ్గారు.

''రండి మీకోసమే చూస్తున్నాను'' అన్నాడు జగదీష్ మామగారి వైపు తిరిగి. ''చూడమ్మా, నాకేం జబ్బులేదు మొర్రో అంటున్నా వినకుండా నన్ను హాస్పిటల్‌పాలు చెయ్యాలని చూస్తున్నారు అల్లుడుగారు'' అన్నారు జగన్నాధరావుగారు కూతురివైపు తిరిగి ఫిర్యాదుగా.

వాసవి జగదీష్ వైపు నవ్వుతూ చూసింది.

"చూడు వసూ హైదరాబాద్ నుండీ యిక్కడికి కిమ్మనకుండా వచ్చారు మీ డాడీ, తీరా నిన్ను చూసి నీ సపోర్టుతో ట్రీట్‌మెంట్ ఎగ్గొట్టాలని చూస్తున్నారు" అన్నాడు జగదీష్ కోసం నటిస్తూ.

"నేనేం ట్రీట్‌మెంటుకని రాలేదు. బేబీ కోసం వచ్చాను. ఎంత అల్లుడి ఇల్లయినా పిలవకుండా రాకూడదని యిన్నాళ్ళు బిగబెట్టుక్కూర్చున్నాను. ఇక్కడ డాక్టరుకి చూపిస్తానని అల్లుడు పిలవగానే కాదనకుండా అందుకే పరుగెత్తుకొచ్చేసాను" అన్నారాయన.

వాసవి తండ్రివేపు ధైర్యం చెబుతున్నట్లుగా చిరునవ్వుతో చూసింది.

జగన్నాధరావుగారు కూతురి కేసి అదోలా చూసారు.

ఆ చూపులో వున్న అసహాయతకి వాసవికి జాలేసింది. "ఫర్వాలేదు డాడీ ఆయన చెప్పినట్లు విను నీకోసమేగా. నేను రెండుపూటలా హాస్పిటల్‌కి వస్తానుగా, ఇంట్లో అయితే నువ్వు రెస్ట్ తీసుకోవు" అంది వాసవి అనునయంగా.

జగన్నాధరావుగారు బుంగమూతి పెట్టారు.

జగదీష్ అదేం గమనించనట్లు ముందుకి నడిచాడు. జగన్నాధరావుగారు గత్యంతరంలేనట్లు అతన్ని అనుసరించారు.

ఆ వెనుకే వాసవి.

ముగ్గురూ పోర్టికోలోకి వచ్చారు.

జగదీష్ స్టీరింగ్ ముందు కూర్చుని జగన్నాధరావుగారిని ఎక్కమన్నట్లుగా చూసారు.

జగన్నాధరావుగారు కూతురివైపు నిస్సహాయంగా చూసి కారెక్కారు.

"నువ్వు డాడీ మరీ అంత సీరియస్సయితే ఎలా నీకోసమేగా. బెస్టాఫ్ లక్" అంది వాసవి తండ్రిని హుషారు చేస్తున్నట్లుగా.

జగన్నాధరావుగారు నీరసంగా నవ్వి "నాకు తెలుసు మీ యిద్దరూ నన్నెందుకింత బలవంతంగా హాస్పిటల్ పాలు చేస్తున్నారో" అన్నారు.

జగదీష్ ఆశ్చర్యంగా కనుబొమ్మలెత్తి మామగారివైపు చూసాడు.

వాసవికూడా తండ్రివైపు విస్మయంగా చూసింది.

"మీ యిద్దరిమధ్యా అడ్డుగా వుంటానని ఏమైనాట్ కరెక్ట్" అంటూ చిలిపిగా కళ్ళుద్దాల్లోంచి నవ్వేరాయన.

జగదీష్ ఆయన మాటలకు పెద్దగా నవ్వేసాడు.

అతని కళ్ళలోకి కొంటెదనం తన్నుకొచ్చింది. అతని చూపులు వాసవి చూపులతో కలిసి చిలిపి ప్రశ్నలేసేయి.

వాసవి యిబ్బందిగా చూపు దించుకుంది.

జగన్నాధరావుగారు ఓరకంట వాళ్ళిద్దర్నీ గమనించారు ఆయన గుబురు మీసాల చాటున గుంభనమైన చిరునవ్వు దాక్కుంది.

ఎంతకీ కారు స్టార్టు కాకపోవడంతో "అల్లుడూ! మరింక ఆలస్యం దేనికి? నన్ను ఆ జైల్లో పడేస్తే. తర్వాత మీరు హేపీగా వుండొచ్చు కదూ" అన్నారు నవ్వుతూ. జగదీష్ నవ్వుతూ కారు స్టార్టు చేసాడు.

కారు కదిలిపోతుంటే వాసవి చిరునవ్వుతో చూస్తూ నిలబడింది. అయిదు నిమిషాలనంతరం ఆమె మెల్లిగా లోనికి కదిలింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ప్రాణం లేనట్లుగా వుంది.

గాలికి గుమ్మాలకి కిటికీలకి కట్టిన తెరలు సన్నగా కదులుతూ మూగజీవాల్లా వున్నాయి.

వాసవికి జగదీష్ చెప్పిన విషయం గుర్తొచ్చి వంటగదివేపు వెళ్ళింది.

నీళ్ళు వేడిచేసి హార్లిక్సు కలిపి "శంకర్" అంటూ పిలిచింది.

జవాబులేదు.

"వీడు నిముషంలో మాయమవుతాడు" విసుక్కుంటూ గ్లాసు తీసుకుని పోర్టికో దగ్గరగా వచ్చి అవుట్ హౌవుస్ వైపుగా చూసింది వాసవి.

అనంత్ దగ్గుతున్న ధ్వని వినిపిస్తోంది.

వాసవి గ్లాసు పట్టుకుని చుట్టూ చూసింది.

ఎదురుగా శంకర్ కనిపించలేదు.

ఆమె మెల్లిగా అవుట్ హౌవుస్ వైపు అడుగులేసింది.

అనంత్‌ని ఒంటరిగా కలవాలంటే అదోలాంటి సంకోచం. అతనితో తనకున్న చనువు ఏమైపోయిందో?

గంటలు గంటలు అతనితో కబుర్లు చెప్పేది. అతన్ని అనేక విధాల ఏడిపించేది. ఇప్పుడు ఇంత ఆశ్చర్యంగా తనకి చాలా దూరంగా విసిరి వేయబడ్డాడతను.

అతని కళ్ళలోకి చూడాలంటే తడబాటు. పలకరించాలంటే కంగారు. వాసవి ఆలోచిస్తూ మెల్లిగా అతని గుమ్మం దగ్గరకొచ్చి ఆగిపోయింది. లోపల బాత్‌రూములో అనంత్ వాంతి చేసుకుంటున్నాడు వాసవి గ్లాసుతో అలాగే నిలబడింది. అనంత్ టవల్‌తో ముఖం తుడుచుకుంటూ బయటకొచ్చి గుమ్మం దగ్గర వాసవిని చూసాడు.

"నువ్వా.. రా రండి.. రండి" అన్నాడు గబగబా.

వాసవి అనంత్‌ని పరీక్షగా చూసింది.

అతని కళ్ళు నీరసంగా వున్నాయి. ఇతనికి నిజంగానే జ్వరం వచ్చిందా? తన తండ్రికోసం అతను నటిస్తున్నాడనుకుంది.

వాసవి ఆలోచనగా లోపలికడుగేసి గ్లాసు టేబుల్ మీద పెట్టి "హార్లిక్సు" అంది.

"తాగాలనిలేదు. కానీ మీరు శ్రమ తీసుకుని తెచ్చారు కాబట్టి తాగుతాను" అన్నాడు అనంత్ గ్లాసు అందుకుంటూ.

"మీకు వాంతి అయ్యేటట్లుంటే తాగకండి" అంది వాసవి మెల్లిగా.

అనంత్ బదులుగా నవ్వాడు.

అతను హార్లిక్సు తాగుతుంటే వాసవి కుర్చీలో కూర్చుని అక్కడున్న మాగ్‌జైన్ తిప్పుతూ కూర్చుంది.

అనంత్ తాగడం పూర్తిచేసి గబుక్కున బాత్రూంలోకి వెళ్ళాడు. అతనికి వాంతి అవుతున్నట్లు అర్థం చేసుకుంది వాసవి.

"సారీ" అంటూ అనంత్ తిరిగి వచ్చాడు.

వాసవి అతనికేసి బాధగా చూసి నిట్టూర్చింది. అతని వత్తయిన వంకీల క్రాపు సంస్కారం లేనట్లు చెదిరిపోయింది. కళ్ళు నీరసంగా లోతుకు పోయాయి. శరీరం కొద్దిగా నల్లబడింది.

ఒక్కరోజు జ్వరానికే అతనలా కావడం ఆశ్చర్యం కలిగించింది వాసవికి.

"మీకు నిజంగానే బాగోనట్లుంది" వాసవి.

అనంత్ వాసవికేసి చూసి నవ్వాడు.

"నిజంగానే. అబద్ధమనుకుంటున్నారా?" అన్నాడు తమాషాగా కళ్ళెగరేస్తూ.

"డాడీ.. వచ్చారని" అంటూ ఆగింది వాసవి.

అనంత్ మంచం మీద తలగడ గోడకిపెట్టి దానికి ఆనుకుంటూ మళ్ళీ నవ్వాడు.

"మీ డాడీ కోసమే నాటకం ప్రారంభించాను. కానీ సార్ బలవంతంగా నా చేత ఏవో టేబ్లెట్స్ మింగించారు. ఎమ్టీస్టమక్ మీద వేసుకోవటంవల్ల వాంతులు మొదలయ్యి నిజంగానే సిక్కయ్యాను" అన్నాడు.

వాసవి అతనివైపు జాలిగా చూసింది.

"సారీ" అంది మెల్లిగా.

"ఎందుకు? నాకు చాలా హాయిగా వుంది" అన్నాడతను నవ్వుతూ.

వాసవి విస్మయంగా చూసింది.

"నువ్వు నమ్మటంలేదు కదూ కోరుకున్న ప్రియురాల్ని క్షణంలో చేయిజార్చుకున్నాను నేను. కానీ విచిత్రాతి విచిత్రంగా ఆమెకు ఏమీకాలేకపోయినా ఆమెను అనుక్షణం చూసే అదృష్టాన్ని సంపాదించుకున్నాను. భార్యగా సపర్యలు చేయించుకునే అదృష్టాన్ని పోగొట్టుకున్నా యజమానురాలిగా ఆమె అండలో ఆనందం పొందుతున్నాను. అందుకే ఒక కవి ఏమన్నాడో తెలుసా? బాధే సౌఖ్యమనే భావన రానీయమన్నాడు. ఇప్పుడా కవిమాట నిజమైన అర్ధాన్ని అనుభవిస్తున్నాను" అన్నాడు అనంత్ కళ్ళు మూసుకుని.

వాసవి అనంత్ వైపు సాలోచనగా చూసి కళ్ళు దించుకుంది. అనంత్ కళ్ళు విప్పి తల దించుకున్న వాసవివైపు చూసాడు.

"నేను..నేను తప్పుగా మాట్లాడానా?" అతని కంఠం మెల్లిగా ధ్వనించింది.

"తప్పనికాదు. ఇంక గతం తలచుకోవడం అనవసరం కదూ" అంది వాసవి మెల్లిగా.

"నిన్ను బాధపెడితే క్షమించు. భవిష్యత్తు నాశనం చేసుకున్న నాలాంటి వాడికి మిగిలింది అందమైన గతమే. అదీ కేవలం నీతో స్నేహం కలిసిన నాలుగేళ్ళే"

వాసవి లేచి నిలబడి గ్లాసందుకుంది.

"సారీ కోపం తెప్పించానా?"

వాసవి లేదన్నట్లు తల ఊపింది.

"నేను నీకు ఎక్కువగా తటస్థపడటం నిన్ను గతాన్ని తలచుకుని క్రుంగిపొమ్మనడానికి కాదు. ఒకపని చేసాక దాని పర్యవసానానికి వొంగి బ్రతకటం ఉత్తమం. డాడీ హాస్పటల్లో జాయినయినట్లే. నువ్వు ఫ్రీగా తిరగొచ్చు. నీకేం కావాలన్నా శంకర్ చేత కబురుచెయ్యి. మొహమాటపడకు. నేను నీ స్నేహితురాలన్న విషయాన్ని మరచిపోకు" అంటూ వెనుతిరిగింది వాసవి.

"అమ్మగారూ మీరిక్కడున్నారా?" శంకర్ ఆయాసంగా పరిగెత్తుకొచ్చాడు.

"నువ్వెక్కడికెళ్ళావ్?" అంటూ ప్రశ్నించింది వాసవి.

"అయ్యగారు బజారుకి పంపించారు"

"దేనికి?" అంది వాసవి.

**శంకర్** ఒక క్షణం తటపటాయించినట్లు మౌనం వహించాడు.

"జవాబు చెప్పవేం? అసలు అయ్యగారే పంపించారా?" అంటూ రెట్టించింది వాసవి.

"అవునండి అయ్యగారే పంపారు" శంకర్ భయంగా చెప్పాడు.

"ఎందుకో?"

"పువ్వులు తెమ్మన్నారండి"

వాసవి వాడివైపు ఆశ్చర్యంగా చూసింది.

"పూలు తెమ్మన్నారా?" దేనికి?" అంది.

"తెలియదండి. ఈ కవరు మీకిమ్మన్నారు" అంటూ నీలం రంగు కవరు వాసవి చేతికి అందించాడు.

వాసవి ఆశ్చర్యంగా కవరు విప్పింది.

**"డియర్ వసూ,**

ఈరోజు నువ్వు నా గది సర్దటం నాకు విస్మయాన్ని ఆనందాన్ని కలిగించింది. ఒకే యింట్లో భార్యాభర్తలుగా వుంటున్నా మనం ఎంతెంత దూరంలో బ్రతుకుతున్నదీ నీకు తెలుసు. మానసికంగా దగ్గరవుతున్న మన మధ్య ఈ రాత్రి మధుర స్మృతులనే జీవితాంతం జ్ఞాపక ముంచుకునే విధంగా నువ్వు నాకు సహకరిస్తావని ఆశిస్తున్నాను. శంకర్ పూలు తెస్తాడు. నా గదిలోనే. నువ్వు అలంకరించుకునే విధానంలోనే నీ మనసు తెలియాలి. ఓ.కె బెస్టాఫ్‌లక్ చెప్పు.

**నీ జగన్"**

వాసవి కళ్ళలోని తడబాటుని గమనిస్తూనే వున్నాడు అనంత్.

వాసవి ఉత్తరం ముగించి అనంత్ కేసి చూసింది.

అనంత్ కళ్ళు నవ్వుతున్నాయి.

వాసవి కనురెప్పలు తడబాటుగా టపటపలాడాయి.

"వస్తాను" అంటూ ముందుకడుగేసింది.

"ఏవిటి విశేషం" అన్నాడు అనంత్ నవ్వుతూ.

వాసవి మాట్లాడలేదు.

"ఏమో తెలియదండి. రెండు బుట్టలతో తెమ్మన్నారండి పూలు, జాజులు, గులాబులు" అన్నాడు శంకర్ అనంత్ వైపు తిరిగి అమాయకంగా.

వాసవి అసహనంగా వాడివైపు చూసింది.

"నువ్వు నోరుమూసుకుని పద" అంది కోపంగా శంకర్ తలదించుకుని వెళ్ళిపోయాడు.

"వసూ ఎందుకంత కోపం. అందంగా మలచుకోవాల్సిన ఈ రోజున ఎందుకలా చిరాకు పడ్తావ్? పెళ్ళయిన యిన్నాళ్ళకా? వెరీ లేట్. వెళ్ళు సార్ చెప్పినట్లు ఏర్పాట్లు చెయ్యి" అన్నాడు అనంత్ నిదానంగా.

వాసవి శరీరం అదోలా కంపించింది.

కళ్ళలో నీళ్ళుబుకేయి.

భగవాన్ ఏమిటిది?

వాసవి గబగబా అడుగులేస్తుంటే అనంత్ మెల్లిగా అన్నాడు.

"బెస్టాఫ్‌లక్"

వాసవికి భూమి విచ్చిపోయి అందులోకి తను కృంగిపోతే బాగుండననిపించింది.

ఎవరి కౌగిట్లో ఈ రాత్రి యిమిడిపోవాలని కలలు కన్నదో ఆ వ్యక్తే తనకి శుభాకాంక్షలు చెబుతున్నాడు.

జీవితాలు కథలౌతాయా?

అందరి బ్రతుకుల్లో కథలుంటాయా?

వాసవి ఆందోళనగా ముందుకి నడిచింది ఏదో పడిపోయినట్లు పెద్ద శబ్దం.

వాసవి పాదాలు ఠక్కున ఆగిపోయాయి.

ఆమె చుట్టూ చూసింది.

ఆ శబ్దం వెనుక సన్నటి మూలుగు

అవుట్ హవుస్ వెనుక రేకు షెడ్డులోంచి ఆ శబ్దం వస్తున్నట్లు గ్రహించింది వాసవి.

ఆ షెడ్డులోనే ప్రస్తుతం ముత్తు మకాం.

"కొంపదీసి ఏమీ కాలేదుకదా" వాసవి పరుగున వెళ్ళి తలుపు తోసింది.

ఆమెకు ఒక క్షణం ఏమీ కనిపించలేదు.

మెల్లిగా తడుముకుంటూ స్విచ్ వేసింది.

సన్నటి వెలుగు గదిలో మెల్లిగా వ్యాపించింది.

వాసవి కళ్ళు పెద్దవి చేసి చుట్టూ చూసింది. గదిలో మూలగా సర్దిన చెక్క సామాను క్రిందకి దొర్లింది.

తిరగబడిపడ్డ బల్లకిందనుంచి సన్నగా వస్తోంది మూలుగు.

వాసవి గబగబా బల్లని బలంగా అవతలకి నెట్టింది. బల్లక్రింద బల్లిపిల్లలా ముడుచుకుని అంటుకున్నట్లు పడివున్న ముత్తుని చూడగానే ఆమెకు చెప్పలేని జాలివేసింది.

ఆమె ముత్తుని పట్టుకుని లేవదీసింది.

మెల్లిగా మంచమ్మీద పడుకోబెట్టి "మూల కెందుకెళ్ళావు? దెబ్బ తగిలిందా?" అంది అనునయంగా.

ముత్తుకి ఆ మాట అర్ధమయ్యిందో లేదోగాని తలమాత్రం అడ్డంగా వూపింది.

"సరే పడుకో. నేనెళ్ళి శంకర్‌చేత కాఫీ పంపుతాను" వాసవి బయటికి రాబోతూ ముత్తువైపు చూసింది.

ముత్తు తన చేతిలోని వస్తువుని గబగబా దిండు క్రిందకు తోసింది.

వాసవి ముత్తువేపు విస్మయంగా చూసింది.

దాని చూపుల్లో కంగారు.

"వాసవి ముత్తువేపు విస్మయంగా చూసింది.

దాని చూపుల్లో కంగారు.

"వాసవి ఆశ్చర్యంగా ఏమిటది?" అంది.

"ఒన్నిలేమ్మా! ఒన్నిల్లే" అంది ముత్తు భయంగా. వాసవి గబుక్కున దిండు ఎత్తి చూసింది.

ఫోటో!

కలర్ ఫోటో అది.

ఒక ప్రక్క బాగా కాలిపోయింది.

వాసవి ఆసక్తిగా చేతిలోకి తీసుకుని చూసింది. అది భార్యాభర్తల ఫోటో కావచ్చు.

భర్తవైపు పూర్తిగా ముఖం కాలిపోయింది. కొద్దిగా మీసం, నోరు, గడ్డం కనిపిస్తున్నాయి. అవతలి వైపు భార్య ముఖం పొగకి బాగా నల్లబడింది కాని అంతగా కాలిపోలేదు. అమాయకంగా వున్న కళ్ళని, అందమైన ముఖాన్ని తదేకంగా చూసింది వాసవి. ఆ చూపులు ఆ ముఖం ఎక్కడో చూసినట్లుంది. వాసవి ఫోటోని అటూ ఇటూ తిప్పి ముత్తుకిచ్చేస్తూ "నీ కూతురా?" అంది.

"ఇల్లేమ్మా" అంది ముత్తు.

"సరే. పడుకో" అంటూ వాసవి బయటికి వచ్చింది.

చీకటి పడబోతున్నట్లుగా వుంది వాతావరణం. వాసవి వాచీకేసి చూసింది.

ఆరుంపావు.

ఆమె కంగారుగా హాల్లో కొచ్చి శంకర్ అంటూ పిలిచింది.

శంకర్ పరిగెత్తుకొచ్చాడు.

"అయ్యగారొచ్చారా?" అడిగింది కంగారుగా.

"లేదమ్మా"

"మరి...మరి...పూలెక్కడ పెట్టావ్?"

శంకర్ ఆమెకేసి విచిత్రంగా చూసి "అయ్యగారి గదిలో" అన్నాడు.

"సరే సరే నువ్వెళ్ళి పనిచూసుకో" వాసవి గబగబా జగదీష్ గదివైపు అడుగులేస్తూ వెళ్తుంటే కళ్ళు పెద్దవిచేసి విచిత్రంగా చూసాడు శంకర్.

16

వాసవి గదిలోకి ప్రవేశించగానే గదిలో పూల వాసన గుప్పుమంది.

ఆమెకి అదోలా ఒళ్ళు జలదరించింది.

క్షణం సేపు ఏమీ తోచనిదానిలా నిలబడిపోయింది.

గదిలో రేడియోగ్రాం మీద వుంచిన ఎలక్ట్రానిక్ గడియారం ఏడుగంటలవుతున్నట్లు సూచిస్తోంది. జగదీష్ వచ్చేస్తాడేమో?

వచ్చి...తనింకా యిలాగే వుండటాన్ని గమనించి కోపగిస్తాడేమో.

వాసవిలో ఏదో కంగారు.

అర్థంకాని ఆందోళన.

ఆమె జాకిట్లో భద్రం చేసిన ఉత్తరం తీసి మళ్ళీ చదివింది.

ఆ ఉత్తరంలో ప్రతి అక్షరంలోనూ అతను ఒలికించిన ఆత్రుత కోరిక వాసవికి అర్థం అవుతున్నాయి.

అతన్ని నిరాశపరచడం తనకికి ధర్మంకాదు.

అతను తన తండ్రిపట్ల తన పట్ల చూపిస్తోన్న అభిమానం ఆత్మీయత దుర్వినియోగ పరచుకోకూడదు.

అతనికి ఏమీ కాకుండా దూరంవుంటూ అతన్ని వుసూరుమనేట్లు చేయడ్మలో ఎలాంటి ధర్మమూ లేదు.

కాని...కాని...ఎలా తన చేతులతోనే...తనీ గదిని అలంకరించడం?

అలా అతను తనని ఆదేశించడం వాసవికి కష్టంగా వుంది.

అలా అని ఖచ్చితంగా నావల్లకాదు అని మొండికెయ్యడానికి కూడా ఆమె మనసు ఒప్పుకోవడం లేదు.

ఎక్కడో, ఏమూలో ఆమె గుండెలో జగదీష్ పట్ల ఆమెకు ఒక సన్నటి ప్రేమరేఖ పొడసూపినట్లనిపించింది.

అతన్ని బాధపెట్టడం ధర్మంకాదని ఆమె అంతరాత్మ హెచ్చరిస్తోంది.

కాని ఏంచేయాలి?

వాసవి దిక్కుతోచనట్లు నిలబడిపోయింది.

ఆమెకేదో పాత తెలుగు సినిమా గుర్తొచ్చింది.

అందులో హీరో హీరోయిన్ను పెద్దలనెదిరించి ప్రేమ వివాహం చేసుకుంటారు.

వాళ్ళిద్దరే తొలిరేయి తమ గదిని అలంకరించుకుంటారు.

ఆ సంఘటన గుర్తొచ్చి వాసవి పెదవులపై చిరునవ్వు మొలకెత్తింది.

కనీసం అందులో హీరో ఆమెకు సాయపడతాడు.

కానీ..ఇప్పుడు జగదీష్ పూర్తి బాధ్యత తన మీదనే నెట్టి తప్పుకున్నాడు.

వాసవి ఆలోచించి తనకిక తప్పదన్నట్లుగా పూలబుట్టకి కట్టిన దారం విప్పి పైన మూసిపెట్టిన తామరాకులు తీసింది.

జాజిపూల వాసన ఆమె ముక్కుపుటాల్లోకి గుప్పున దూరి ఊపిరాడకుండా చేసింది.

ఈ పూలకి.. ఆ తంతుకి ఏమిటో సంబంధం?

ఎంతో ఆదర్శంగా శోభనం యిష్టపడని ఈ పెద్ద మనిషికి ఈ వింత కోరికేమిటో?

వాసవి చిన్నగా నవ్వుకుని పూలదండని పైకి తీసింది. శంకర్ చూస్తాడేమోనని తలుపు బిగించి వచ్చింది.

వాసవి సన్నగా చేతులు వణుకుతుంటే మెల్లిగా వాటిని మంచానికి అలంకరించింది.

వార్డ్‌రోబ్ తెరచి తెల్లటి దుప్పటి మీద దానిమ్మ గింజలు జల్లినట్లున్న బోంబేడయింగ్ దుప్పటి పరచి అదే గలీబులు తలగళ్ళకి తొడిగింది.

తన చేతులతో అలంకరించిన ఆ మంచాన్ని తనే చూడలేనట్లు సిగ్గుతో తల తిప్పుకుని స్నానం చెయ్యడానికి బాత్రూమ్‌లోకి వెళ్ళింది.

ఆలోచనలతో వేడెక్కిన ఆమె శిరస్సుని షవర్‌తో చల్లబరచుకుని బయటకి వచ్చింది.

లేత నీలంరంగు షిఫాన్ చీర కట్టుకుని కురులు ఆరబెట్టుకుంటూ వరండాలో నిలబడి గేటువేపుగా చూసింది వాసవి.

అక్కడ అనంత్.

ఆమె కదోలా అయ్యింది.

ఇతను ఇతను ఇక్కడికి రాకపోతే తనకి కొంత హాయిగా వుండదేమో.

మనసు చిక్కబట్టుకుని తన భర్తతో సఖ్యతగా వుందామనుకుని నిర్ణయించుకున్నప్పుడల్లా ఇతను ఎదురయి తన నిర్ణయాన్ని నిర్దాక్షిణ్యంగా ముక్కలు చేస్తున్నాడు.

ఆమె అనంత్ కేసి చూసింది.

అతను ఎవరితోనో గట్టిగా మాట్లాడుతున్నాడు. అవతలి మనిషి గడ్డం మాసిపోయి, బట్టలు నలిగి, ఎర్రటి కళ్ళతో రౌడీలా వున్నాడు.

అతను అనంత్ వేపు నిర్లక్ష్యంగా చూసి లోనికి రాబోయాడు.

అనంత్ కోపంగా చెయ్యి అడ్డంపెట్టి ఏదో అంటున్నాడు.

శంకర్ గబగబా వాసవి దగ్గరికి పరిగెత్తుకొచ్చి "వాడే! వాడేనమ్మా పె -ద్ద రౌడీ?" అన్నాడు ఆయాసంగా వగరుస్తూ.

"ఎవరు చెప్పారు?" అడిగింది వాసవి.

"ముత్తు ఆ రోజు మీ చేత దెబ్బలు తిన్నది వీడి గురించే. వాడికి మీరు కనిపించకండి. లోపలికి పోదాం పదండి" అన్నాడు గబగబా.

వాసవి వాణ్ణి చూసి తను భయపడాల్సిన అవసరం ఏమిటో అర్థంకాలేదు.

"పోరా, నాకేం భయం?" అంది వాసవి నిర్లక్ష్యంగా.

శంకర్ ఆమెకేసి అసంతృప్తిగా చూసాడు.

ఆమెకెలా నచ్చచెప్పాలో వాడికి తెలియటంలేదు. తను పనివాడు. వయసులోనూ చిన్నవాడు. తన మాటల్ని ఆమె లెక్కపెట్టదు.

కానీ ఆ రౌడీవల్ల వాసవికి ఆపద రావొచ్చనే భయం వాడి గుండెనిండా వుంది.

సరైన కారణం వాడికీ తెలియదు.

ముత్తు ఆ రోజు అంత ఆందోళన పడి చివరికి వాసవి చేతిలో చావుదెబ్బలు కూడా తిన్నదంటే ఏదో బలమైన కారణం వుండి వుంటుందని వాడి చిన్న హృదయానికి అర్ధం అవుతోంది.

అందుకే వాడు ఆమె వంక పిచ్చి చూపు చూసి "అమ్మగారూ" అన్నాడు భయంగా.

వాసవి వాడి భయాన్ని చూసి నవ్వింది.

"ఎందుకురా, అంత భయం. వాడు మనల్నేం చేస్తాడు?" అంది నిర్లక్ష్యంగా.

సరిగ్గా అప్పుడే అనంత్ అడ్డంగా వుంచిన చేతిని వాడు విసురుగా పక్కకు త్రోసి లోపలికి నడిచాడు.

వాంతులవటంవల్ల నీరసంగా వున్న అనంత్ పక్కకు పడబోయి పక్కనున్న గోడని ఆసరా చేసుకుని నిలదొక్కుకున్నాడు.

అతను గబగబా హాలుదాక వచ్చి వాసవిని చూసి ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు.

వాసవి కూడా భయంగా నిలబడి పోయింది.

అతను వాసవివంక చూసి వంకరగా నవ్వి "నువ్వేనా కొత్తపిట్టవి" అంటూ కేన్ వుయ్యాల్లో కూర్చుని కాలుమీద కాలేసుకుని సిగరెట్ వెలిగించాడు.

వాసవి అతనివంక అసహనంగా చూసి "ఎవర్నువ్వు?" అంది కోపంగా.

అతను బదులుగా పకపకా నవ్వి "నా ఎడ్రస్ కావలా? ఎలా చెబితే నీకర్ధమవ్వుద్ది? వరసకి బావనవుతాను. సరేనా?" అన్నాడు.

వాసవి ముఖం అవమానంతో ఎర్రబడింది.

"యూ స్కౌండ్రల్! గెటవుట్" అంది వణికిపోతూ.

ఏంటీ ఇంగ్లీషులో తిడతన్నావా? నువ్వు ఎక్కువగా తిట్టి అలసిపోకు. తిట్టు తిట్టుకి మీ ఆయన బాంక్ ఎకవుంటు తరిగిపోద్ది. ఆలోచించుకో" అన్నాడు నిదానంగా.

సరిగ్గా అనంత్ అప్పుడే అక్కడకొచ్చి అతని కాలర్ పట్టుకుని అతని చెంపమీద లాగి కొట్టాడు.

అతని నోట్లోంచి సిగరెట్ జారిపోయింది.

అసలే ఎర్రగా వున్న అతనికళ్ళు క్రౌర్యంతో నిండి నలుపుతో కూడిన ఎరుపుతో చింత పిక్కల్లా తయారయ్యాయి.

అతను ఒక్క వూపున పైకి లేచి "వురేయ్ నన్నే కొడతావురా ఈ బలరాంగాడి సంగతి నీకు తెలియదురా" అంటూ అనంత్ మీదకి కలబడ్డాడు.

వాసవి గాభరాగా చూస్తోంది.

శంకర్ ఆమె చేతిని గట్టిగా పట్టుకున్నాడు.

వాడికళ్ళు భయంతో పెద్దవయ్యాయి.

"అమ్మగారూ, మనం లోపలికి పోదాం. వాసవి వాణ్ణి విదిలించికొట్టింది.

వాడు అనంత్ని క్రిందకి పడగొట్టి చావబాదుతున్నాడు. వాసవి మనసు తల్లడిల్లిపోయింది.

ఆమె ముందుకి పరిగెత్తి వాడి జుట్టు పట్టుకుని వీపుమీద పిడిగుద్దులు గుద్దింది.

బలరాం వెనక్కి తిరిగి చూసాడు.

వాసవి వగరుస్తూ నిలబడింది.

వాడు గట్టిగా నవ్వాడు.

ఆ నవ్వు నాగుపాముల విషంలా వికృతంగా వుంది.

వాడు నిదానంగా అనంత్ మీద నుంచి లేచి వాసవి వేపు అడుగులేసాడు.

అప్పటివరకూ ఆవేశంలో విచక్షణా జ్ఞానం కోల్పోయి అతన్ని కొట్టిన వాసవి అప్పుడే స్పృహలో కొచ్చినట్లు అతనివేపు చూసి నిలువెల్లా వణికిపోయింది.

భయంకరంగా నాలుక చాచిన కొండచిలువలా అతను ఆమెను సమీపిస్తుంటే ఆమె సహాయం అర్థిస్తున్నట్లు అనంత్ వేపు చూసింది.

అతను బలరాం కొట్టిన దెబ్బలకి నిస్సత్తువుగా నేలకి అతుక్కుపోయాడు.

అతను తనని ఆదుకోలేడని తెలియగానే వాసవి భయంతో మంచు ముక్కలా బిగుసుకుపోయింది.

వాడు వాసవిని సమీపించి ఆమె జుట్టు మెలికవేసి పట్టుకుని "నిన్నిప్పుడేం చేస్తానో తెలుసా?" అన్నాడు వికృతంగా నవ్వుతూ.

వాసవి వాడి పట్టు విడిపించుకోవాలని గింజుకుంటోంది. వాడి బలం ముందు ఆమె ఆగలేకపోతోంది.

శంకర్ పెద్ద పెద్ద కళ్ళతో చూస్తున్నాడు. నిస్సహాయంగా.

వాడికేం తోచటంలేదు

అమ్మగారిని వాడేం చేస్తాడు?

చంపేస్తాడా?

"లేక.. సినిమాల్లోలాగా?"

ఆ వూహరాగానే వాడు వణికిపోయాడు.

ముఖం కందగడ్డలా ఎ్రరబారింది.

వాడు వంట్లో రక్తమంతా ముఖంలోకి తన్నినట్లు ఆవేశంగా చుట్టూ చూసాడు.

ఎదురుగా పెద్దరాయి.

అంతే.

పూనకం వచ్చినట్లు పరుగున వెళ్ళి ఆ రాయి ఎత్తాడు ఆవేశంగా.

వాడు కళ్ళు మూసుకుని వూరుగా విసిరినరాయి ఎవరో బలంగా పట్టుకున్నట్లయి కళ్ళు తెరచి చూసాడు.

ఎదురుగా జగదీష్

అతనికారు.. ఎప్పుడొచ్చిందో ఎప్పుడతను కారుదిగి శంకర్ దగ్గర కొచ్చాడో ఎవరూ గమనించలేదు.

శంకర్ చేతిలో రాయి క్రిందకి జారిపోయింది. మెల్లిగా.

జగదీష్ చేయి శంకర్ చెంపల్ని ఆవేశంగా తాకింది.

"రాస్కెల్, ఏవిటది?"

బలరాం వాసవి జడ వదిలేసి జగదీష్ వైపు చూసి వెకలిగా నవ్వాడు.

**"వచ్చేవా?** నువ్వు రాకపోతే చాలా గొడవయ్యుండేది" అన్నాడు తాపీగా. భర్తని చూసి కొండంత బలం తెచ్చుకున్న వాసవికి అతను కారణం తెలుసుకోకుండా శంకర్‌ని కొట్టడం దిగ్భ్రాంతిని కలిగించింది.

ఆమె గబుక్కున వాళ్ళిద్దరి దగ్గరకి పరిగెత్తుకొచ్చి శంకర్‌ని వెనక్కి లాగి జగదీష్ వైపు తీవ్రంగా చూసింది.

"కారణం తెలుసుకోకుండా వాణ్ణెందుకు కొడుతున్నారు మీరు?" కోపంగా.

వాసవి బిక్కచచ్చినట్లుగా చూసింది.

"ఒక పనికి మాలిన రౌడీ వెధవని వెనకేసుకొచ్చి మీరు వాడు చేసిన పనిని సమర్థిస్తున్నారంటే" వాసవి కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"చూసావా బాస్, ఇది యిందాకట్నుంచీ యిలాగే నోరు పారేసుకుంటున్నది. అప్పటికి చెప్పాను. నువ్వు తిట్టే ఒక్కొక్క తిట్టుకి నీ మొగుడి బాంక్ బాలన్సు తరిగిపోద్దని. వింటేనా? నీకు బావగారినవుతానని చెప్పినా వినందే దీనిమీద అదే నయం"

"బలరాం" జగదీష్ గట్టిగా అరిచాడు.

"పెళ్ళాన్ని అన్నానని కోపం వచ్చిందా?" బలరాం భుజాలు కుదిపి నవ్వాడు.

అనంత్ మెల్లిగా క్రిందనుంచి లేచి బట్టలకయిన మట్టిదులుపుకున్నాడు.

శంకర్ వాసవి వెనుక బల్లిలా అంటుకుని నిలబడ్డాడు. వాడికళ్ళు ఎర్రబారి, పెదవులు కంపిస్తున్నాయి.

వాసవి నిశ్చేష్టగా నిలబడి జగదీష్ వేపే చూస్తోంది. ఆమెకు ఎంతో ఆశ్చర్యంగా వుంది.

తన భర్త ఒక జులాయి వెధవని గౌరవించి తమందర్నీ కేకలేయటం ఆమెకు చెప్పలేని వింతగా వుంది. వాడు చేసిన అవమానానికి అతడు ప్రళయ రుద్రుడిలా బుసలు కొడ్తాడని అతన్ని నిలువునా చీరేస్తాడని వూహించిన ఆమెకు అతని వింత ప్రవర్తన ఆశనిపాతంలా తగిలింది.

ఆమె కళ్ళల్లోంచి జలపాతాలురికాయి.

ఆమె శరీరమంతా దుఃఖభారంతో వణికిపోయింది.

అనంత్ మెల్లిగా జగదీష్ దగ్గరకొచ్చాడు.

అతను వాసవివైపు చూసాడు.

తుఫానులో రక్షణలేక చలించిపోతున్న లతలా వుందామె.

అతనికి చాలా ఆశ్చర్యమేసింది.

వాసవి అలా డీలాపడి ఏడవటం అతనెన్నడూ చూసి ఎరుగడు. ఎప్పుడూ ఎంతో ధైర్యంతో, ఎన్నడూ వీడని చిరునవ్వుతో వుత్సాహం తొణికిసలాడే ఆమె ఈ రోజు అందరి ముందూ ఏడుస్తోంది.

వాసవి దేన్నయినా భరిస్తుంది కాని అవమానాన్ని భరించలేదు.

అనంత్ మెల్లిగా జగదీష్‌ని "సార్" అంటూ సంబోధించాడు. జగదీష్ నిర్లిప్తంగా అతనికేసి చూసాడు.

'సార్, ఇతను ఇదివరకు కూడా మీరు లేనప్పుడు ఒకసారి వచ్చి అల్లరిచేసాడు. నేను ఎలాగో పంపించేసాను. ఈసారి మేడమ్‌ని కూడా చెయ్యి చేసుకుని ఆమె జుట్టు పట్టుకుని నానామాటలు మాట్లాడాడు. నేను వుండికూడ అడ్డుపడలేకపోయాను. నా అసమర్ధతని నేను ఒప్పుకుంటున్నాను. మీరు లేని సమయంలో ఒక రౌడీ వెధవని ఎదుర్కోలేని నేను ఈ పోస్ట్‌లో వుండటం అవమానం, నేనిప్పుడే రిజైన్ చేసి వెళ్ళిపోతాను. కానీ మీరీ దగుల్బాజీని వట్టినే వదిలిపెట్టొద్దు. వెంటనే పోలీసులకి ఫోన్ చేసి వీడి చేతికి బేడీలేయించండి"

అనంత్ మాటలు పూర్తికాక ముందే బలరాం ముందు కురికి అనంత మీద చెయ్యిచేసుకోబోయాడు.

జగదీష్ బలరాం చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు.

"నువ్వడ్డం వచ్చావు కాబట్టి వాడు బ్రతికిపోయాడు బ్రదర్" అన్నాడు చేతులు దులుపుకుంటూ.

జగదీష్ అనంత్ వైపు తీవ్రంగా చూస్తూ "ఏమిటీ న్యూసెన్సు" అన్నాడు కోపంగా.

అనంత్ బిత్తరపోయినట్లు చూసాడు.

వాసవి దుఃఖం కోపంగా మారింది.

ఆమె హేళనగా నవ్వి "అనంత్, మధ్యలో నీకెందుకు? భార్యని అవమానించాడని భర్తకి ఆవేశం రానప్పుడు ఏమీకాని నువ్వెందుకు పౌరుషపడ్తావ్. పౌరుషమనేది పుట్టుకతో వస్తుంది. నేర్పితే కాదు" అంది కచ్చిగా జగదీష్ వేపు చూస్తూ.

జగదీష్ వాసవి వైపు మింగేసేలా చూసాడు.

బలరాం భళ్ళున నవ్వి "ఇంకా ఎందుకు బ్రదర్ బతకడం, మనలో సత్తాలేదని ఆవిడకి తెలిసిపోయింది" అన్నాడు.

జగదీష్ ముఖం కోపంతో ఎర్రబడిపోయింది.

అతను గబుక్కున చెయ్యేత్తాడు.

బలరాం ఆశ్చర్యపోయినట్లు చూసి "ఏంటీ, కొడదామనే?" అన్నాడు.

అతని చెయ్యి నిస్సహాయంగా క్రిందకి జారిపోయింది.

"బ్రదర్, నువ్వు చెయ్యెత్తినందుకు నీ పెళ్ళాం తిట్టినందుకు నీ గుమస్తాగాడు నన్ను కొట్టినందుకు పెనాల్టీ పెరిగిపోయింది. అసలు పదివేలకోసం వచ్చాను. పెనాల్టీతో పాతిక వేలయ్యింది. తొరగా యిచ్చెయ్యి మరి లేకపోతే తెలుసుగా ఎక్కడికెల్తానో" అన్నాడు బలరాం సిగరెట్టు ముట్టించుకుంటూ.

"ఈ రౌడీ వెధవతో ఏమిటీ మీ చుట్టరికం" అంది వాసవి అసహనంగా.

"చెప్పు బ్రదర్. రిలేషన్ అడుగుతోంది." అంటూ కన్ను కొట్టి నవ్వాడు బలరాం.

జగదీష్ వాసవికేసి అసహనంగా చూసి "యూ షటప్ ఎండ్ గెటిన్ సైడ్" అన్నాడు తీవ్రంగా.

వాసవి అవమానంతో గిర్రున తిరిగి లోనికెళ్ళిపోయింది. ఆమె తలుపు భళ్ళున ముయ్యటం అక్కడికి వినిపించింది.

అనంత్ వాతావరణం చూసి మెల్లిగా అవుట్ హౌవుస్ వైపు జారుకున్నాడు.

శంకర్ ఒక్కడే ప్రాణంలేనట్లు ఎటు వెళ్ళాలో తోచలేనట్లు నిలబడ్డాడు.

జగదీష్ శంకర్‌కేసి చూసాడు.

శంకర్‌కి ఏం చేయాలో తోచలేదు.

అతని కనురెప్పలు భయంతో టపటపలాడాయి.

ఆ వెంటనే చేతులు రెండూ వెనక్కి విరిచినట్లుగా పెట్టుకుని ఎడం చేతిలో కుడిచేతి గుప్పెటని వుంచి తిప్పసాగాడు.

జగదీష్ చూపు తిప్పలేదు.

శంకర్ నవ్వబోయి అయ్యగారు నవ్వటం లేదని మళ్ళీ పెదవులు గట్టిగా మూసుకున్నాడు.

కుడికాలు పాదంతో ఎడంకాలు పిక్కమీద రుద్దుకున్నాడు.

జగదీష్ అలాగే చూస్తున్నాడు.

శంకర్‌కి ప్రాణం పోతున్నట్లుగా వుంది. అక్కడ తనని కాపాడే వాళ్ళులేరు. అమ్మగారు లోపలికెళ్ళిపోయింది. పి.ఏ సాబ్ తప్పుకున్నారు.

తనేం చేయాలి?

వాళ్ళిద్దరూ కలిసి తనని చంపేస్తే?

వాడి గుండె దడదడలాడింది.

వాడు అకస్మాత్తుగా దౌడు లంకించుకుని ఇంటి వెనుకకి స్పీడుగా పరిగెత్తాడు.

జగదీష్ నివ్వెరపోయినట్లు చూసాడు.

బలరాం పకపకా నవ్వాడు.

"జడుసుకున్నాడు పిచ్చివెధవ. నీకు భయపడ్డవాడు వాడొక్కడేననుకుంటా" అతను పిచ్చెక్కినట్లు నవ్వుతుంటే చెట్ల గూటిలోని పక్షి పిల్లలు భయపడ్డట్లుగా కిచకిచలాడాయి.

"నిన్నిక్కడికి రావొద్దని చెప్పలేదూ" అన్నాడు జగదీష్ మందలిస్తున్నట్లుగా.

"డబ్బు నువ్వు ముందే పంపిస్తే నేనెందుకొస్తాను? పొరపాటు నీదే" అంటూ అతను నిర్లక్ష్యంగా భుజాలెగరేసాడు.

జగదీష్ "లోపలికి పద" అంటూ ముందుకి నడుస్తుంటే, బలరాం అతని వెంట గర్వంగా లోపలికి అడుగుపెట్టాడు

17

అర్ధరాత్రి మరో అరగంట.

మేడంతా నిశ్శబ్దంగా వుంది.

జగదీష్ మెల్లిగా అడుగులేస్తూ తన గదిలోకి వెళ్ళాడు.

అతని చూపు మంచంమ్మీద పడింది.

మంచానికి అల్లుకుని వున్న జాజిపూల దండలు ఎర్రబారి వాడిపోవటానికి సిద్ధంగా వున్నాయి. ఎవరి సుఖానికి ఉపయోగపడకుండాన్నే జీవితాన్ని భావిస్తున్నామనే అసంతృప్తితో ముకుళించుకుపోయినట్లుగా

అయినా ఆఖరి క్షణాల్లో కూడా వాటినుంచి వస్తోన్న సువాసన మత్తెక్కిస్తోంది.

మంచమ్మీద పరచిన తెల్లటి ఎర్రచుక్కల దుప్పటి, డ్రెస్సింగ్ టేబుల్ మీద పెట్టివున్న జాజిపూల దండ, కార్నర్‌తో టీపాయ్ మీద కాలి నుసయిన అగరొత్తుల గుర్తులు. జగదీష్‌కి అర్థమయింది.

అప్పుడే అతనికి శంకర్ ద్వారా తను ఆమెకు పంపిన ప్రేమ సందేశం కూడా గుర్తొచ్చింది.

చాలారోజులకి ఆమె తనతో సమాగానికి సంతోషంగా సిద్ధపడితే కథ అడ్డం తిరిగింది.

పానకంలో పుడకలా.. ఈ బలరాం

అతన్ని తలచుకోగానే జగదీష్ ముఖం కోపంతో ఎర్రబడింది. అతను విసుగ్గా కణతలు రుద్దుకున్నాడు.

బాత్రూంలో కెళ్ళి ముఖం కడుక్కుని బట్టలు మార్చుకున్నాడు. అప్పుడతనికి కాస్త శాంతంగా వుంది.

భోంచెయ్యని కారణంగా అతనికి చాలా నీరసంగా వుంది. మనసంతా చెప్పలేని గజిబిజిగా ఆందోళనగా వుంది.

వాసవితో పొందు తప్పిపోయినందుకు కాదు.

''బలరాం''

అతన్ని చూస్తే జగదీష్ అదోలా అయిపోతాడు.

తనమీద తనకున్న నమ్మకం, ప్రేమ, గౌరవం అన్నీ అతన్ని చూడగానే చల్లారిపోతాయి.

అంతసేపూ పాములా పడగవిప్పి ఆడిన అతని ఆత్మగౌరవం తెల్లవేరు సోకిన నాగులా నిద్రపోతుంది.

బలరాం మీద ఎంత కోపం వచ్చినా తను అతన్నేమీ చేయలేని అసమర్ధుడయి పోతున్నాడు.

తన బలహీనతని ఆసరా చేసుకుని కేష్ చేసుకుంటున్నాడు బలరాం.

ఈ రోజు అతని మూలాన తను వాసవి దృష్టిలో పనికిమాలిన వాడయిపోయాడు.

వాసవి సంగతి తనకు తెలుసు.

ఈ విషయాన్ని ఆమె తేలికగా తీసుకోదు.

ఈ సంగతులన్నీ జగన్నాధరావుగారి దాకా వెళ్తే..?

జగదీష్ అసహనంగా కణతలు రుద్దుకున్నాడు.

అతను ప్రక్క గదిలో కెళ్ళి ఫ్రిజ్ లాక్ తెరిచాడు.

దాన్నిండా అతను స్పెషల్‌గా తెప్పించుకుని భద్రం చేసుకున్న హాట్ డ్రింక్స్

అతనికి తాగాలనుంది.

వెర్రిగా సీసామీద సీసా లాగించెయ్యాలనుంది.

ప్రస్తుతపు తన బాధ, అవమానం ఎవరికీ చెప్పుకోలేడు. అలాంటి అసహనపు పరిస్థితులొచ్చినప్పుడే అతనాగదిలోకి వెళ్తాడు.

ఒట్టప్పుడు ఆ గది ఎప్పుడూ మూసేవుంటుంది.

అందులోకి ఎవరికీ ప్రవేశంలేదు.

అసలక్కడ ఒక గది వున్నట్టు చూసేవాళ్ళకి తెలియదు.

గదిని మొత్తం కవర్ చేస్తున్న వాల్ పేపర్ డోర్ మీద కూడా వుండటం వల్లా దానిమీద సీలింగ్ నుండి వ్రేలాడుతున్న కర్టెన్ వుండటంవల్లా అటు పక్కకి మరోగది వున్నట్లు అనిపించదు.

ఇంచుమించు జగదీష్‌కి రహస్య మందిరంలాంటిదది.

జగదీష్ చప్పున ఒక విస్కీ బాటిలందుకుని ఓపెన్ చేసాడు.

నోటిదాకా వెళ్ళిన సీసా ఠక్కున ఆగిపోయింది.

అతని కళ్ళలో వాసవి కనిపించింది.

ఆమె కండిషన్ బహుశా చాలా సీరియస్‌గా వుండి వుంటుంది. అవమానించిన వ్యక్తిని భర్త ఏమీ అనలేకపోవటం అనే విషయాన్ని ఆమె ఏ విధంగానూ సహించలేదు.

తనపట్ల ఆమె మెల్లిమెల్లిగా ఏర్పరుచుకుంటోన్న అభిప్రాయం. అభిమానం ఈ రోజుతో పూర్తిగా తుడిచి పెట్టుకు పోయివుంటాయి.

ఈ హఠాత్సంఘటనవల్ల ఆమె బాగా షాక్ తిని వుండొచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో తను ఒళ్ళు తెలియకుండా త్రాగి పడుంటే ఆమె ఇక తనని ఎప్పటికీ నమ్మదు.

ఒక ఆడదాని దృష్టిలో అందులోనూ కట్టుకున్న భార్య దృష్టిలో కొరగాని వాడిగా నిలబడ్డం తను భరించలేడు.

ఈ రోజు తమిద్దర మధ్య ఏర్పడిన గాడిని నేర్పుగా పూడ్చాలి.

జగదీష్ దీర్ఘంగా నిట్టూర్చి సీసా మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టేసి నీరసంగా ఆ గదిలోంచి బయటకి వచ్చాడు.

అతను మెల్లిగా తనగది తలుపులు మూసి హాల్లోకొచ్చి అయిదు నిముషాలు నిలబడి కర్తవ్యం తోచిన వాడిలా స్టెయిర్ కేస్ ఎక్కడం ప్రారంభించాడు.

సన్నని బెడ్‌లైట్ కాంతిలో చీకటిలో ఎర్రని కార్పెట్టు మెరూన్ రంగంలో మెరుస్తూ - అతను అడుగువేసినప్పుడు మెత్తగా లొంగుతూ అతని బూటు చప్పుణ్ణి మింగుతోంది.

అతను మేడమీద హాల్లోకొచ్చి ఒక క్షణం తోచని వాడిలా నిలబడ్డాడు.

గాలి విసిరినప్పుడల్లా ఆకులు రాసుకుంటున్న ఒరిపిడి విచిత్రంగా వినిపిస్తోంది.

బయట చప్పుడు అవుతున్నప్పుడల్లా కుక్క భౌభౌమంటోన్న శబ్దం.

ఆ శబ్దానికి భయపడి తల్లి రెక్కల చాటున ఒదిగిపోతూ పక్షి కూనలు చేస్తోన్న కిచకిచలు.ఆ వాతావరనం జగదీష్‌కి అదోలా వుంది.

తన విచిత్ర మానసిక ప్రవృత్తికి తనే ఆశ్చర్యపోతున్నాడు జగదీష్.

తన యిల్లే తనకి భయోత్పాతాన్ని కలిగిస్తుందా?

ఏమిటీ వింత వైఖరి.

తనకొచ్చిన అడ్డుల్ని చాలా సున్నితంగా తొలగించుకోగల తనే ఏవీ చాతకానివాడిలా ఆలోచించడం ఏవిటి?

వాసవి కోపాన్ని తను పోగొట్టలేననుకోవడం. వాసవికి ఎదురు పడటానికి భయపడటం - తనకే అవమానం.

ఆడవాళ్ళకి కోపం వచ్చినా తాపం వచ్చినా పట్టలేరని చెప్పుకోగా తను విన్నాడు.

అనుభవజ్ఞులైన పెద్దలు చెప్పిన మాటల్లో అసత్యముండదు.

అదే నిజమయితే వాసవి కోపం తాటాకు మంటలా చల్లారిపోతోంది.

జగదీష్ తనకు తానే ధైర్యం చెప్పుకుని తలుపు త్రోసాడు. లోపల బోల్టువేయకపోవటాన తలుపు వెంటనే తెరచుకుంది.

జగదీష్ మెల్లిగా లోనికి అడుగుపెట్టాడు.

గదంతా చీకటిగా వుంది.

వాసవి బెడ్‌లైట్ వేసుకోవాలని కూడా అనుకోలేదంటే ఆమె మనసుని ఆవరించిన చీకటి ముందు బయట అలముకున్న చీకటి ఆనలేదన్నమాట.

జగదీష్ మెల్లిగా స్విచ్ బోర్డు తడుముతున్నట్లు వెదికి దీపం వెలిగించాడు.

గదంతా పాదరసంలాంటి కాంతి ఆవరించింది.

మంచంమీద ప్రక్కకు తిరిగి ముడుచుకున్నట్లు పడుకున్న వాసవిలో చలనంలేదు.

''అంటే - వాసవి నిజంగా నిద్రపోవడం లేదన్నమాట'' అనకున్నాడు జగదీష్.

నిజంగా నిద్రపడితే అకస్మాత్తుగా దీపం వెలిగినప్పుడు ఆ వెలుగుని భరించలేక విసుగ్గా మనిషి కదులుతాడనే నమ్మకంతో జగదీష్.

''వసూ'' అంటూ చాలా మెత్తగా పిలిచాడు.

వాసవిలో ఎలాంటి కదిలికా లేదు. అతను మెల్లిగా మంచం దగ్గరకి వెళ్ళి వంగి ఆమె ముఖంలోకి చూసాడు.

వాసవి కళ్ళు తెరవలేదు. అతను మరికాస్త ముందుకి వంగి ఆమె బుగ్గమీద తన పెదవులతో సున్నితంగా స్పృశించాడు.

వెంటనే ఆమె వులిక్కిపడ్డట్లుగా లేవడం. లేచీ లేవగానే ఆమె చెయ్యి అతని చెంప బలంగా మెరపు మెరిసినట్లు తాకడం ఒకేసారి జరిగిపోయాయి.

జగదీష్ దిమ్మెర పోయినట్లు చెంపపట్టుకుని నిలబడిపోయాడు.

వాసవి చటుక్కున మంచం మీదనుండి దూకి అతనికి కాస్త దూరంలో బొమ్మలా నిలబడిపోయింది.

వాసవి కాస్త కోపిష్టిదేనని అతడు వూహించాడు. కానీ ఆ కోపంలో భర్త మీదకు చెయ్యి విసరగలంత ముక్కోపని అతను అనుకోలేదు. అతను చెంప రుద్దుకుంటూ వాసవివైపు చూసాడు.

అసలే పెద్దవైన తన కళ్ళని మరింత పెద్దవి చేసి అతని వంక విభ్రాంతిగా చూస్తోంది వాసవి.

ఆ కళ్ళనిండా తొణికిసలాడుతున్న భయం అర్ధమవుతోంది జగదీష్‌కి.

ఆమె తనని కావాలని కొట్టలేదని, అదిరిపాటున నిద్రలో మేల్కొనడం వలన తన నెవరో ఏదో చేస్తున్నారనే భయంతో తనని కాపాడుకోవటానికే అలా ప్రవర్తించి వుండొచ్చనిపించిందతనికి

ఎవరోనని భయపడ్డావా అతడు నవ్వడానికి ప్రయత్నించాడు. వాసవి నవ్వలేదు.

అతని వంక రెప్ప వేయడం మరచిపోయినట్లు చూస్తున్న ఆమె కళ్ళు అకస్మాత్తుగా వర్షించడం ప్రారంభించాయి.

ఆమె నిలువెల్లా వణికిపోతూ వెక్కెక్కి ఏడ్వటంతో జగదీష్ దిక్కుతోచనట్లు స్థంభించి పోయాడు.

ఆ వెంటనే నవ్వుతూ అరె ఎందుకలా అప్‌సెట్టవుతావు. నేనేం అనుకోవటంలేదు నన్ను కొట్టినందుకు. తెలిసి కొట్టలేదుగా నువ్వు. అంటూ సమర్థిబీ ఒకడుగు ముందుకు వేశాడు.

అతని ఓదార్పు మాటలు ఆమెకెలాంటి ఉపశమనమూ యివ్వకపోగా ఆమె దుఃఖాన్ని అధికమే చేశాయి.

ఆమె వెనక్కి తిరిగి గోడకు అంటుకుపోయి మోచేతిలో ముఖాన్ని దాచుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

దుఃఖాతిశయంతో కదులుతోన్న ఆమె భుజాలు పట్టుకుని తనవేపు తిప్పుకోబోయాడు జగదీష్.

వాసవి బుసలు కొడుతున్న నాగినిలా చివ్వున వెనక్కు తిరిగి అతన్నొక తోపు తోసింది.

ఊహించని ఆ చర్య జగదీష్ విసురుగా యివతలకి పడబోయి మంచాన్ని పట్టుకుని నిలదొక్కుకున్నాడు.

అతని ముఖం అవమానంతో ఎర్రగా కందిపోయింది. కనిపించని క్రౌర్యం అతని కళ్ళల్లో లీలగా మెరవడం వాసవి దృష్టికి తోచలేదు.

ఆమె ఆవేశంతో వూగిపోతూ అతనివంక తీవ్రంగా చూసింది. జగదీష్ పిడికిలి కోపంతో బిగుసుకుంది.

దాన్నతడు వాసవికి కనిపించకుండా మంచానికేసి నొక్కి పెదవులు రెండూ మునిపళ్ళతో అదిమిపట్టి లోపల ఉప్పొంగుతోన్న ఆవేశాన్ని చంపుకుంటున్నాడనే విషయాన్ని వాసవి గ్రహించలేకపోయింది.

మరో అయిదు నిముషాల్లో జగదీష్ తనని తాను కంట్రోల్ చేసుకుని మామూలు మనిషయ్యాడు. బిగుసుకున్న అతని ముఖ కండరాలు వదులవ్వటంతో పళ్ళక్రింద నొక్కిపెట్టిన పెదవులు గాలి పీల్చుకుని నవ్వడానికి ప్రయత్నించాయి.

ముడుచుకున్న కనుబొమ్మలు ఎడమయ్యాయి. ఎర్రబడిన కళ్ళు నవ్వడానికి ప్రయత్నించాయి.

"**నీకింత కోపం** అని నాకు తెలియదు సుమా!" అన్నాడతను మంచం అంచున కూర్చుంటూ.

వాసవి మాట్లాడడలేదు.

ఆమె అతనితో మాటలు అనవసరమన్నట్లు విసురుగా వెళ్ళి వార్డురోబ్ తెరచి తన బట్టలు సూట్‌కేస్‌లో సర్దసాగింది.

జగదీష్‌కి పరిస్థితి అర్థమయ్యింది.

ఆమె చాలా సీరియస్ అయ్యిందని వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తోందని తెలిసి అతను వాసవి దగ్గరగా వెళ్ళి ఆమె చెయ్యి పట్టుకుని "ఏమిటిదంతా?" అన్నాడు మందలిస్తున్నట్టుగా.

ఆమె అతన్ని విసిరి కొట్టబోయింది.

కానీ ఆ విషయం ముందే గ్రహించిన జగదీష్ ఆమె చేతిని గట్టిగా నొక్కిపెట్టాడు.

అతని పట్టు వదిలించుకోలేని వాసవి అతనివేపు కోపంగా చూసి "మీరంటే ఏమిటో నాకు తెలిసిపోయాక యింకా ఏదో చెప్పాలని ప్రయత్నించడం ఫూలిష్‌నెస్. మీరు బయటికి వెళ్ళడం చాలా మంచిది" అంది వాసవి ఈసడిస్తున్నట్లుగా.

జగదీష్ ముఖం తెల్లబడింది.

అయినా అతను నవ్వుతూ "మాటలు నేర్చిన కుక్కని వేటకు తీసుకెళ్ళితే ఉస్కోమంటే ఉస్కోమందట. చదువుకున్న తెలివైన భార్యతో కాపురం ఎలా వుంటుందో అర్ధమవుతోంది" అన్నాడు.

వాసవి నిరసనగా చూసింది.

"మరో ఆరుగంటలు నేనీ యింట్లో వుండటానికి పర్మిషనివ్వండి. తెల్లవారగానే నేను వెళ్ళిపోతాను. అంతవరకూ మీరు నన్ను ఒంటరిగా వదలటం మన యిద్దరికీ మంచిది" అంది వాసవి.

జగదీష్ మాట్లాడలేనట్లు చూసాడు.

"ఇంత చిన్న విషయానికే నీ అంత తెలివైన ఆడపిల్లలు రభస చేసుకుని యిల్లు వదిలి వేయడం మంచి పనికాదు. డబ్బుపోతే సంపాదించుకోవచ్చుగానీ మన యిద్దరి పరువూ ఏ ఒక్కరు రోడ్డుమీద పెట్టినా తిరిగి దక్కించుకోలేమన్న విషయం నువ్వు గ్రహిస్తేమంచిది" అన్నాడు బాధపడుతున్నట్లుగా.

అతని మాటలకి వాసవి హేళనగా నవ్వింది.

"ఆ విషయం మీరు నాకు చెప్పడం పెద్ద జోకులా వుంది. ఆ పనేదో మీరు యిందాక చేసి చూపించారు. ఆ పరువు తిరిగి పొందలేననే తెలిసి నేను వెళ్ళిపోతున్నాను." అంది నిర్లక్ష్యంగా సూట్‌కేస్ మూస్తూ.

జగదీష్ ఆమెవైపు ఒక క్షణం దిగ్భ్రాంతిగా చూసాడు.

ఆ తర్వాత మెల్లిగా "వెళ్తానంటే నేను కాదనను. కానీ వెళ్ళే ముందు నిజానిజాలు తెలుసుకుని మరీ వెళ్ళటం మంచిది. బలరాం నా స్వంత అన్న. దురదృష్టం కొద్దీ అతనికి చిన్నతనం నుండే దురలవాట్లు అబ్బాయి. అతన్ని బాగుచేయాలని నా తల్లిదండ్రులు శతవిధాల ప్రయత్నించి విఫలులయ్యారు వాళ్ళు చచ్చిపోతూ అతన్ని జాగ్రత్తగా చూసుకోమని చెప్పి ఆస్తి అంతా నా పేరున వ్రాసేసారు. అతను నా స్వంత అన్నకావడాన్నే అతనేం చేసినా భరించేశక్తి తెచ్చుకున్నాను. ఇది నా తప్పయితే నువ్వెళ్ళిపో" అంటూ జగదీష్ సర్రున ఆ గదిలోంచి వెళ్ళిపోయాడు.

వాసవి సూట్‌కేస్ వదిలేసి మ్రాన్పడినట్లు చూసిందతనివైపు.

18

శంకర్ గోడమూలగా మోకాళ్ళమీదుగా వణుకుతూ కూర్చున్నాడు.

ఎంత రాత్రయిందో వాడికి తెలియదు

ఎటుచూసినా సాంద్రించిన చీకటి.

బొగ్గుకు తారుపూసినట్లు ఆ చీకటి మరింత పెంచుతున్న వృక్షాల గుబురు.

అవి వూగుతున్నప్పుడల్లా వీస్తున్న చలిగాలికి వాడి శరీరం గజగజలాడుతోంది. కదులుతున్న చెట్లనుండి కారుతున్న మంచు బిందువులు ఎండుటాకుల మీదపడి ఠక్కున శబ్దం చేస్తుంటే శంకర్ భయంతో గుండెలదగ్గర చేతులు పెట్టుకుని అసలే పెద్దవైన కళ్ళని మరింత విశాలం చేసి చుట్టూ కలయచూస్తున్నాడు.

ఎక్కడో జరజరా ప్రాకుతున్న శబ్దం.

శంకర్ ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు.

వాడికి తెలుసు అది పాము కదలిక.

పగలంతా వాడు ఆడి పాడి గంతులేసిన పెరడే రాత్రిపూట ఆందోళన కలిగిస్తోంది.

శంకర్ భయంగా వరండా గోడని ఆనుకుని మెల్లిగా ప్రాకుతున్నట్లు ముందుకి వెళ్ళాడు.

వాడికింకా చాలా భయంగా వుంది. ఆ రౌడి ఏమూలనుంచయినా పొంచి తనమీదకు దాడి చేస్తాడేమోనని.

మెల్లిగా రేర్ వరండా దాటుకుని ఎడంవైపు గదులపక్క కారిడార్‌లోకి చేరుకున్నాడు.

ఇంకొంచెం ముందుకెళ్ళి దానికున్న మెట్లు చేరుకోవాలని వాడి ప్రయత్నం.

ఎక్కడో ఎవరో దగ్గిన చప్పుడు. శంకర్ గతుక్కుమన్నట్లు గోడకి ఆనుకున్నాడు.

వాడు చెవులు రిక్కించుకుని అలాగే గోడకి కరచుకొన్నట్లు నిలబడిపోయాడు. వాడి ప్రాణం మంచుకన్నా చల్లగా, గట్టిగా బిగుసుకుపోతోంది భయంతో.

మరో అయిదు నిముషాలు గడిచాయి.

గాలి వీచినప్పుడల్లా ఆకుల రాపిడికి పుట్టుకొస్తున్న శబ్దం తప్ప మరేమీ వినిపించడంలేదు.

శంకర్ గబగబా పిల్లిలా వంగి మెట్లమీదుగా పరిగెత్తాడు.

''ఎవరది?''

అది జగదీష్ కంఠం.

శంకర్ మెట్లమీద బొమ్మలా నిలబడిపోయాడు.

మరో పది నిముషాలు గడిచాయి.

శంకర్ ఆ చీకట్లో చించుకున్నట్లు చూసాడు. ఎక్కడా జగదీష్ వస్తోన్న జాడలేదు.

వాడికి ఆశ్చర్యంగా వుంది. తను విన్నది అబద్ధమా? ఈ రోజు తనలో మొలకెత్తిన భయం తననిలా వెర్రివాణ్ణి చేస్తోందా? అర్థంకాలేదు వాడికి.

సరిగ్గా అప్పుడే వాడి దృష్టి వెంటిలేటర్‌పై పడింది. వాడు నిలబడ్డ చోట గోడకి వున్న వెంటిలేటర్‌పై పడుతున్న వెలుగుని చూసి వాడికి కాస్త ధైర్యం వచ్చినట్లయింది.

శంకర్ మెల్లిగా ఏటవాలుగా వున్న  గ్లాసుని కొద్దిగా వంచబోయాడు. వాడి కళ్ళకి షాక్కొట్టినట్లయింది.

ఆ లోపలి దృశ్యం వాణ్ణి స్థాణువులా నిలబెట్టింది.

ఆ గదిలో బల్లమీద రెండు విస్కీ సీసాలు ఓపెన్ చేసి వున్నాయి. ఒక సీసా ఖాళీచేయబడి ఆ రౌడీ చేతిలో విలాసంగా వూగుతోంది.

మరొకటి జగదీష్ చేతిలో.

శంకర్ చాలా ఆశ్చర్యంగా తనలో యింతవరకూ పొంగుతున్న భయాన్ని పూర్తిగా మరిచిపోయి పిల్లిలా మెట్లమీద ఒదిగి వెంటిలేటర్లోంచి రెప్పవేయడం మరచి చూస్తున్నాడు.

జగదీష్ విస్కీని సీసాలోంచి గ్లాసులోకి ఒంపి దాన్ని ఆ రౌడీ ముందుకి జరిపాడు.

వాడు దాన్ని ఒక్క గుటకలో త్రాగి గ్లాసుని ధనాలుమంటూ బల్లమీద పెట్టి ''నా సంగతేం చేసావ్?'' అన్నాడు నిర్లక్ష్యంగా.

జగదీష్ అతనివేపు అసహనంగా చూసాడు.

ఆ వెంటనే కోపాన్ని దిగ్మ్రింగడానికి ప్రయత్నించినట్లు ఊపిరి బిగబెట్టి ''నేను కాదనడం లేదుగా'' అన్నాడు ఓర్పుగా.

''పాతిక. గుర్తుంది'' అన్నాడతను నిర్లక్ష్యంగా.

''పాతికా?'' జగదీష్ ఆశ్చర్యంగా చూసాడు.

''ఏం ఓపికలేదా? చెప్పు'' అన్నాడతను వెటకారంగా.

"...అదికాదు ఎన్నిసార్లిలా? నీకిది బాగుందా?" అన్నాడు జగదీష్ బ్రతిమిలాడుతున్నట్లు.

వాడు కోపంతో సీసాని ఎత్తి బల్లకేసి కొట్టాడు. ఆ వెంటనే ఎదురుగా వున్న కుర్చీని బలంగా తన్నాడు.

"ఎన్ని సార్లంటే బ్రతికినన్నాళ్ళూ అర్థమయిందా? ఈ బలరాంని వదిలించుకోవటం అంత తేలికైన విషయంకాదు. నీవల్ల కాకపోతే చెప్పేసెయ్యి. ఆ సంగతి ఎక్కడ ఎలా తేల్చుకోవాలో నాకు బాగా తెలుసు" బలరాం పైకి లేచి నిలబడడానికి ప్రయత్నించాడు.

అతని ఒంట్లో చేరిన మందు అతన్ని స్థిరంగా నిలబడనీయటం లేదు.

ఒంట్లో నరాలూ, ఎముకలూ లేనట్లు అతను వూగటం శంకర్‌కి గమ్మత్తుగా అనిపించింది.

"ఎందుకలా తొందరపడ్తావ్ బలరాం? డబ్బు గురించి కాదు నా బాధ ఎప్పుడంటే అప్పుడొచ్చి ఇలా అల్లరి పెట్టడం ఏం మర్యాదగా వుంటుంది చెప్పు? తనెంత అప్‌సెట్టయిందో తెలుసా?" అన్నాడు జగదీష్ బాధగా.

బదులుగా బలరాం వికృతంగా నవ్వాడు ఆ నవ్వుకి శంకర్ జడుసుకున్నట్లుగా గోడకి కరుచుకున్నాడు.

"ఎవరూ నీ ముద్దుల పెళ్ళామా భయపడిపోయింది? మంచిదాన్నే పట్టావ్? దీని సంగతేమిటి? నాతో పనిలేదా?" అన్నాడు బలరాం.

జగదీష్ చుట్టూ చూసి "ప్లీజ్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడకు. వాసవి అమాయకురాలు కాదు. డబ్బు తెస్తాను. గప్ చిప్‌గా కూర్చో" అని కోపంగా వెనక్కు తిరిగాడు.

శంకర్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు.

మరో అయిదునిమిషాల్లో జగదీష్ చేతిలో డబ్బు కట్టతో వచ్చి "ఇదిగో" అంటూ బల్లమీద విసిరినట్లు పెట్టాడు. "ఎంత?" బలరాం డబ్బుని ముట్టుకోకుండా అడిగాడు. "పదిహేను మిగతా పది రేపు యిస్తాను. బేంక్ నుండి డ్రా చెయ్యాలి" అన్నాడు జగదీష్.

"ఛూ! మళ్ళీ రేపుకూడా రావాలా?" అన్నాడు బలరాం కోపంగా.

"వద్దు నేనే తెస్తాను. కోడంబాకం బ్రిడ్జి కిందేగా" అన్నాడు జగదీష్.

"ఇంకా ఎక్కడ? ఆ మకాం ఎప్పుడో మార్చేసాను. పూనమల్లెయి హై రోడ్డులో వేపచెట్టు క్రింద కిళ్ళీ కొట్లో అడిగితే చెబుతారు."

"సరే నువ్వింక బయల్దేరు."

"ఇప్పుడా? నా వల్లకాదు. రేపెళ్తాలే" బలరాం నిర్లక్ష్యంగా బల్లమీద పడుకోబోయాడు.

"నేను కార్లో వదులుతానుగా" జగదీష్ అన్నాడు బ్రతిమిలాడుతున్నట్లు.

"తప్పదా?" బలరాం అయిష్టంగా నోట్లకట్టలు జేబులో కుక్కుకుంటూ జగదీష్ భుజాలమీద చేతులేసి నడిచాడు.

అతన్ని ఇంచుమించు మోస్తున్నట్లుగా తీసుకెళ్తోన్న జగదీష్‌ని అమితమైన ఆశ్చర్యంతో చూసాడు శంకర్.

"రేపు తప్పకుండా మిగతా లెక్కివ్వాలి" బలరాం మత్తుగా గొణుగుతూ అతనికి జేరబడి అడుగులేస్తున్నాడు.

మరో పది నిముషాల్లో కారుస్టార్టయిన చప్పుడు.

శంకర్ భయాన్ని మరచిపోయి తను చూసిన దృశ్యాన్నే తలచుకుంటూ అలాగే మెట్లమీద కూలాడు.

ఆకాశం నిర్మలంగా స్వచ్ఛమైన నీలవర్ణంతో మెరుస్తోంది. తూర్పు గర్భాన జన్మించిన సూర్యుడు సముద్ర స్నానం చేసి అప్పుడే ఆకాశంలో ప్రాకటం నేర్చుకుంటున్నాడు.

వేడీ, వాడి యింకా పట్టుబడని అతని పసిమి కిరణాలకి లోకానికి ప్రాణం వచ్చి చైతన్యాన్ని నింపుకుంటోంది.

వాసవి టిఫిన్ ముగించి బయటహాల్లో మెట్లమీదకొచ్చి నిలబడింది.

ప్రశాంతమైన ఆ వాతావరనంలో ప్రతిచెట్టూ, ప్రతి పువ్వు నవ్యకళని నింపుకున్నట్లు నిన్న జరిగిన సంఘటన ఏమాత్రం తమకి తెలియనట్లు తలలూగిస్తున్నాయి.

వాసవి అనంత్ వుంటున్న అవుట్ హౌస్ వైపు చూసింది అనంత లేచి తిరుగుతున్న సూచనలేవీ గోచరించడం లేదక్కడ. అనంత్‌కి ఎలా వుందో?

నిన్న...నిన్న... బలరాంతో పెనుగులాడి పడిపోయాక అతనికి జ్వరం యింకా పెరిగిందేమో?

లేకపోతే అనంత్  ఈ పాటికి ట్రిమ్‌గా తయారయి బయటికి రాడూ.

ఇక్కడ ఉద్యోగంలో చేరాక అనంత్ నీటుగా తయారవ్వడం గమనించింది వాసవి.

హైదరాబాదులో తనతో స్నేహంగా వున్న రోజుల్లో అతను డ్రస్‌కి ప్రాధాన్యత యిచ్చేవాడు కాదు.

ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు అతనిలోని అభిరుచుల్ని పెంచుతున్నాయేమో? వాసవి మెల్లిగా అతని అవుట్ హౌవుస్ వైపు నడిచింది.

ఆమెకి జంకుగా వుంది. అతని ముఖం చూడాలంటే.

నిన్న అతనికి జరిగిన అవమానం తలచుకుంటే సిగ్గుగాను వుంది. తను జగదీష్‌ని అనంత్‌ని పిలిచి క్షమాపణ కోరమంది.

ఈ అవమానం చేసింది జగదీష్ సోదరుడే అయినప్పుడు అనంత్‌ని జగదీష్ క్షమాపణ కోరనవసరంలేదు. అతని భార్యగా ఆ పని తనే చేయవచ్చును. అది తన బాధ్యత కూడా.

వాసవి మెల్లిగా లోనకి అడుగేసింది.

అనంత్ వాష్ బేసిన్ ఎదుట నిలబడి షేవ్ చేసుకుంటూ అద్దంలోంచి వాసవి రాకని గమనించాడు. అతని కళ్ళు ఆశ్చర్యంతో విశాలమయ్యాయి. తెల్లని ఆర్గండి కోటా చీరలో, పొడవైన వాలు జడతో, కనుబొమ్మలమధ్య కుంకుమ రేఖతో జాజిపువ్వులా వున్న వాసవిని రెప్పవేయడం మరచినట్లు అద్దంలోంచి చూస్తూ వుండిపోయాడు అనంత్.

అతని హృదయం బాధగా మూల్గింది.

ఈ అందాలరాశిని తన మూర్ఖత్వంతో దూరం చేసుకున్న విషయం అతనికి ఆమెను చూసినప్పుడల్లా గుర్తొచ్చి బాధ కలిగించే నిజం.

వాసవి అతను తనని అద్దంలోంచి గమనిస్తున్నాడనే విషయం గ్రహించలేదు.

"అనంత్" అంటూ పిలిచింది నెమ్మదిగా.

"మీరా?" అన్నాడు అనంత్ వెనుదిరిగి అప్పుడే ఆమెని చూసినట్లు.

"మీకు ఎలా వుంది?" అతన్ని మన్నించి మాట్లాడటానికి ప్రయత్నిస్తూ.

అనంత్ ఆమె అవస్థని గమనించి చిన్నగా నవ్వి ముఖం కడుక్కుని టవల్‌తో తుడుచుకుంటూ "అయామ్ క్వయిట్ ఓ.కె మేడమ్. కూర్చోండి" అన్నాడు.

వాసవి కూర్చుంది.

అనంత్ కిటికీలోంచి విజిల్ వేసాడు.

శంకర్ పరుగెత్తుకు రావడం ఆశ్చర్యంగా చూసింది వాసవి.

" విజిల్ వేస్తే రావలని వీడికెప్పుడు నేరారు?" అంది వాసవి అనంత్ వైపు చూసి నవ్వుతూ.

"ఈ మధ్యనే. ఈ అడవిలాంటి తోటలో శంకర్, శంకర్ అంటూ కేకలు పెట్టి వాడినుంచి రెస్పాన్సు లేక విసిగిపోయాను. ఇలా అయితే ఈ కోటలో ఎక్కడున్నా సరే వీడు నాగస్వరం విన్న పాములా వేణునాదం విన్న గోపికలా పరుగెత్తుకొచ్చేస్తాడు" అన్నాడు అనంత్ చమత్కారంగా.

వాసవి అతని మాటలకి నవ్వింది.

అనంత్ శంకర్ వేపు తిరిగి "రెండు కాఫీలు తే. బ్రహ్మాండంగా వుండాలి" అన్నాడు.

శంకర్ తలవూపి వెళ్ళిపోయాడు.

"మీకు క్షమాపణ చెప్పాలని వచ్చాను" అంది వాసవి తలదించుకుని. అనంత్ వాసవి వైపు ఆశ్చర్యంగా చూసాడు.

"క్షమాపణ సంగతి తర్వాత ఆలోచిస్తాను కానీ మీరు నన్ను మన్నించడం ఎప్పణ్ణుంచి మొదలుపెట్టారు?" అన్నాడు.

వాసవి కొద్దిసేపు మాట్లాడలేదు.

"ఆ రోజులు వేరు. ఆ చనువు వేరు. ఇప్పుడు మీరు మా సెక్రటరీ. గౌరవ మర్యాదలు యిచ్చిపుచ్చుకోవడం ఉభయత్రా మంచిది" అంది వాసవి మంద్రస్వరాన.

అనంత్ ఆమె వేపు బాధగా చూడటం గమనించి వాసవి చూపుతిప్పుకుంది.

"ఆ రోజులు వేరని – మనదారులు వేరని నాకూ తెలుసు. కానీ నన్ను మీరు అనవలసినంత దూరంలో వుంచాల్సినవసరంలేదని నేను అనుకుంటున్నాను. ఏ విధంగా చూసినా నా బ్రతుకులో వచ్చిన మార్పేమీ లేదు. అప్పుడూ యిప్పుడూ కూడా నేను మీ ఉప్పుతిని బ్రతుకుతున్న అభాగ్యుణ్ణి. నన్ను నువ్వనే పిలవండి. అలా పిలిచి ఈ విశాల ప్రపంచంలో నాకంటూ ఒక ఆత్మీయురాలుందనే విశ్వాసాన్ని కలిగించండి ప్లీజ్" అన్నాడు అనంత్ ఉద్వేగంగా.

అతని గొంతులో వణుకుని అలా అంటున్నప్పుడు అతని కళ్ళలో పాదరసంలా మెరిసిన నీటిపొరని చూసి చలించిపోయింది వాసవి.

కాసేపు ఆమెకు ఏం మాట్లాడాలో తోచలేదు.

అనంత్‌తో ఒంటరిగా మాట్లాడాలంటేనే ఆమెలో ఏదో చెప్పరాని జంకు చోటుచేసుకుంది.

అలా అని అతన్ని నిర్దాక్షిణ్యంగా దూరం చేయడానికి ఆమె మనసు అంగీకరించని స్థితి.

ఒక విచిత్రమైన డోలాయమాన స్థితిలో ఆమె హృదయం కొట్టుకుంటుంటే అతను అడిగాడు

"క్షమాపణ దేనికి?" అన్నాడు చిరునవ్వుతూ.

వాసవి అతనికేసి చూసింది.

అనంత్‌లో వున్న గొప్ప ఆకర్షణ అతని నవ్వు. ఆడవాళ్ళ హృదయాల్ని చిత్తుచేయగల సమ్మోహనాస్త్రం అది.

అతను నవ్వితే గంటలు గంటలు చూడాలని, అతను అతని నవ్వులూ కూడా తనవేనని మురిసిన వాసవికిప్పుడు అతని నవ్వు చూస్తే చెప్పలేని భయం. ఆందోళన.

ఆమె తల దించుకుంది.

"చెప్పండి మీరు నన్ను క్షమాపణలు అడగటం ఏమిటి?" అన్నాడు.

వాసవి మెల్లగా అంది.

"నిన్న..నిన్న... అతను మీ పట్ల చాలా అసభ్యంగా ప్రవర్తించాడు. జగదీష్ మౌనంగా వుండిపోయారు. ఆయన తరపున నేను మీకు క్షమాపణ చెప్పుకుంటున్నాను" అంది.

బదులుగా అనంత్ పెద్దగా నవ్వి "బాగుంది ఎవరో రౌడీ వెధవ చేసిన ఆగడానికి మీరు నాకు క్షమాపణ చెప్పడమా? ఆ మాటకొస్తే నేనే మీకు అమర్యాద జరుగుతుంటే కాపాడలేకపోయాను. ఆవిధంగా చూస్తే నేనే మీకు చెప్పాలి క్షమాపణ. నేను మీ సెక్రటరీనయివుండి అతని చేతుల్లో మీకు అమర్యాద జరుగుతుంటే కాపాడలేకపోయాను. ఆ విధంగా చూస్తే నేను అసమర్ధుణ్ణని ఒప్పుకుంటే నేనే రిజైన్ చేసి వెళ్ళిపోవాలి" అన్నాడు ఆవేశంగా.

శంకర్ ట్రేలో కాఫీ తెచ్చి యిద్దరికీ అందించి అక్కడే నిలబడ్డాడు.

వాసవి కాఫీ త్రాగుతూ వాడికేసి చూసింది.

రాత్రంతా నిద్రలేక పోవటాన్న వాడి ముఖం పీక్కుపోయినట్లుంది. కళ్ళు దానిమ్మ పువ్వుల్లా ఎర్రగా వున్నాయి.

"రాత్రి ఎక్కడున్నావురా నువ్వు?" అడిగింది వాసవి.

"వెనుక వరండాలో గోడపక్కన" అన్నాడు శంకర్.

అనంత్ నవ్వి "పాపం చాలా భయపడిపోయాడు వీడు. ఇంతకీ ఆ రోగ్‌ని సార్ బయటకి పంపించేసారా?" అన్నాడు.

వాసవి అనంత్ వేపు అదోలా చూసింది.

"లేదు ఇంట్లోనే వున్నట్లున్నాడు" అంది వాసవి.

"లేదమ్మా తెల్లవారుఝూమునే అయ్యగారు కార్లో బయటికి తీసికెళ్ళారు" అన్నాడు శంకర్.

వాసవి ఆశ్చర్యంగా చూసింది వాడివేపు.

"నువ్వు చూసావా?" అంది సాలోచనగా చూస్తూ.

"అవునమ్మా అయ్యగారు వాడికి విస్కీపోసి బోల్డు డబ్బిచ్చారు. ఇంకా ఇవ్వమని వాడు అయ్యగారిని బెదిరించాడు. అయ్యగారు వాణ్ణి బతిమాలి రేపు బాంక్‌నించి తెచ్చిస్తానని చెప్పి భుజాలమీద వేసుకుని నడిపించి కార్లో తీసుకెళ్ళారు" అన్నాడు తనకి తెలిసిన నిజం చెప్పి ఆయాసపడుతూ.

**అనంత్ శంకర్** మాటలకి ఆశ్చర్యంగా చూసాడు.

"నిజం చెప్పు నువ్వు చూసావా?" అన్నాడు బెదిరిస్తున్నట్లు.

"నిజం సార్. మేడమెట్లమీద నిలబడి కిటికీలోంచి చూసాను" అన్నాడు శంకర్ అరచేతిని తలమీద పెట్టుకుని ప్రమాణం చేస్తున్నట్లు.

అనంత్ వాసవివైపు చూసాడు.

వాసవి ముఖంలో ఏ భావమూ గోచరించలేదతనికి.

"మీకు తెలుసో లేదో ఒకప్పుడు ఈ రౌడీ వెధవగురించే. ముత్తు మీ చేతుల్లో చావుదెబ్బలు తిన్నది. దీన్ని బట్టి యితని గురించి ముత్తుకి బాగా తెలుసుంటుంది. ఇట్లాంటి దుర్మార్గుడి పట్ల సార్ ఎందుకు ఔదార్యం చూపుతున్నారో నాకు అర్థం కావట్లేదు. పైగా వాడు చెబుతున్న దాన్ని బట్టి అతనికి సార్ వేలకొద్దీ డబ్బు యిచ్చినట్లర్థమవుతోంది. వాడికి డబ్బివ్వాల్సిన అవసరం" అంటూ ఆగాడు అనంత్.

వాసవి కనురెప్పలెత్తి అతనివేపు చూసి "ఉంది అనంత్" అంది నెమ్మదిగా.

వాసవి జవాబుకి అనంత్‌తోపాటు, శంకర్ కూడా విస్తుపోయినట్లు చూసాడు.

"ఆ రౌడీ... ఆ దుర్మార్గుడు ఎవరోకాదు. అతను స్వయంగా జగదీష్ అన్న. అందుకే అతనేం అడిగితే అది చేసి అతని చేతిలో ఎంత అడిగితే అంత డబ్బు వుంచడం. తమ్ముడిగా అతనికి తప్పదు. అందుకే ఈ కొంత బంధుత్వం పురస్కరించుకుని నిన్న నాకు జరిగిన అవమానాన్ని మరచిపోయి నేను మీకు క్షమాపణ చెప్పుకోటానికి వచ్చాను" అంది వాసవి.

ఆమె మాటల్లో ప్రస్ఫుటమౌతోన్న బాధ అర్థమయింది అనంత్‌కి. ఆమె చెప్పిన విషయం అతనికి దిగ్భ్రమ కలిగించింది.

"అతను.. అతను.. సార్‌కి అన్నగారా? నేను నమ్మలేక పోతున్నాను" అన్నాడు ఎలాగో.

వాసవి నిస్పృహగా నవ్వి లేచి నిలబడింది.

"కొన్ని నిజాలు నమ్మశక్యంగా వుండవు మరి" అంది రెండడుగులు వేసి.

ఆమె వెళ్తోంటే అనంత్ "సారీ" అన్నాడు గొణుగుతున్నట్లు.

వాసవి మాట్లాడకుండా ముందుకు నడిచింది.

ఇంకా ఆశ్చర్యంనుంచి కోలుకోని చూపులతో ఆమెని వెంబడించాడు శంకర్.

19

ఆ సాయంత్రం వాసవి జగన్నాథరావుగార్ని చూసేందుకు హాస్పిటల్‌కి బయలుదేరింది. శంకర్ కూడా బయలుదేరాడు.

"సాయంత్రం బహుశ నేను రావడానికి కుదరదు. అనంత్‌ని తీసుకుని వెళ్ళి చూసిరా. ఆయన ఎప్పుడెప్పుడు ఇంటికి వచ్చేయాలా అని చూస్తున్నారు. డాక్టరు మరోవారం వుండమంటున్నారు" అన్నాడు జగదీష్.

వాసవి సరేనంటూ తలవూపింది.

జగదీష్ సాక్స్ తొడుక్కుంటూ అన్నాడు.

"ఈ పనుల్లో పడి మరచేపోయాను. అనంత్‌కి సారీ చెప్పనేలేదు. శంకర్‌ని పిలిచి అనంత్‌ని రమ్మన్నట్లుగా చెప్పమను" అన్నాడు జగదీష్ నొచ్చుకున్నట్లుగా.

వాసవి చిరునవ్వు నవ్వి "ఆ అవసరంలేదులెండి" అంది

"ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు జగదీష్

"ఆ పని నేనే చేసాను" అంది వాసవి.

జగదీష్ ఆమెవేపు విస్మయంగా చూసాడు.

అతని కళ్ళలో ద్యోతకమవుతోన్న సంతోషాన్ని గమనించి తలవంచుకుంది వాసవి.

"అరె నువ్వు చెప్పేవా క్షమాపణ. మధ్యలో నీ తప్పేముందని నా మూలంగా నువ్వూ ఇన్సల్టు చెయ్యబడ్డావు. ఇదంతా నావల్ల జరిగింది. నేనే ఆ పని చేసేవాణ్ణిగదూ" అన్నాడు నొచ్చుకున్నట్లు.

వాసవి పెదవులు విడకుండా నవ్వింది.

"మన ఇద్దరిలో ఎవరు చెబితే ఏముంది? ఇది మన ఇంటి విషయం. మనకి కావల్సిన వాళ్ళవల్ల మనకి బాధ కలిగినా దాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరంలేదు. బయట వారి దగ్గర పరువు పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత వుంది మనకు. అందుకే ఆ పని నేను చేసాను" అంది వాసవి మెల్లిగా.

జగదీష్ భార్యవైపు విస్మయంగా చూసి బూటులేసు ముడివేసి లేచి నిలబడి ఆమె దగ్గరిగా వచ్చాడు.

అతను ఆమె రెండు భుజాలమీదా చేతులు వేసి ఆత్మీయంగా నొక్కి పట్టి "వసూ" అన్నాడు ప్రేమగా.

వాసవి తల యెత్తలేదు.

"నీ ఆలోచనాశక్తికి ఆశ్చర్యపోతున్నాను. నీలాంటి తెలివైన భార్యని పొందినందుకు సంతోషిస్తున్నాను ఏది? ఇందాక ఏమన్నావ్? మన ఇద్దరిలో ఎవరు చెప్పినా ఒకటేనన్నావు కదూ అంటే మన యిద్దరం ఒకటేనని కదూ" అన్నాడు గుసగుసగా.

వాసవి శరీరం అతని స్పర్శకి, ఆమె మనసు అతని మాటలకి సిగ్గుతో, కంపనతో ముడుచుకుపోతోంది.

ఏదో తెలియని ఉద్వేగంతో ఆమె గుండె వేగంగా కదులుతోంది.

జగదీష్ ఆమె ప్రక్కన కూర్చున్నాడు చాలా దగ్గరగా, ఆమెని అంటిపెట్టుకున్నట్లు.

అతను ఆమె కుడిచేతిని తన చేతిలోకి తీసుకుని బుగ్గకి తాకించుకుంటూ "కాని నీకు తెలుసు మనమధ్య మానసిక దూరం తరుగుతున్నా మనం ఇంకా చాలా దూరంగానే మిగిలిపోయేమని. ఎందుకో మనకా వూహ ఒచ్చినప్పుడల్లా ఏదో దుష్టశక్తి మనల్ని దూరంగా నెట్టేస్తున్నది. నిజంగా అది దుష్టశక్తే నా అనుమానం నిజమని నాకనిపిస్తూనే వుంది" అన్నాడు జగదీష్.

అతని గొంతులో ప్రతిధ్వనిస్తోన్న బాధని చూసి ఆశ్చర్యపోయింది వాసవి.

ఆమె కళ్ళు విశాలమయ్యాయి.

అతనివేపు విస్మయంగా చూస్తూ "దుష్టశక్తా? మనల్ని విడదీస్తోందా? ఏమిటది?" అంది.

"చెబితే నువ్వు నవ్వుతావు. నమ్మవు కాని అది ముమ్మాటికి నిజం. అది నాకు మాత్రమే తెలిసిన నిజం" అన్నాడు జగదీష్ ఆవేశంగా.

ఆమె చెయ్యి అతని చేతిలో నలిగిపోతోంది.

వరండాలో పొడిదగ్గు విని వాసవి వులిక్కిపడ్డట్టు చూసింది.

"మే అయ్ కమిన్ సర్"

అనంత్ గొంతు అది.వాసవి కంగారుగా తన చేతిని అతని చేతిలోనుండి లాక్కోబోయింది.

జగదీష్ వదలలేదు.

అతనింకా ఈలోకంలోకి రానట్లు "కాని ఆ డెవిల్ మనల్నేం చెయ్యలేదు. మనం ఎన్నిటికీ దూరం కాము" అంటున్నాడు ఆవేశంగా.

వాసవి కంగారుగా "అనంత్! మీ సెక్రటరీ" అంది.

జగదీష్ స్పృహలోకి వచ్చినట్లు ఆమె చెయ్యి వదిలేసాడు. వాసవి దూరంగా జరిగి కూర్చుంది.

జగదీష్ గుమ్మంవైపు చూసాడు.

కర్టెన్ అవతల బూటుకాళ్ళు.

"కమిన్" అన్నాడతను మామూలుగా అవ్వడానికి ప్రయత్నిస్తూ. అనంత లోనికి వచ్చి విష్ చేసాడు.

జగదీష్ తల పంకిస్తూ అతనివేపు ప్రశ్నార్థకంగా చూసాడు. అనంత్ కొన్ని ఫైల్సు అతని ముందుంచాడు.

జగదీష్ ఆ ఫైల్సు తెరచి గబగబా సంతకాలు చేసి అతని ముందుకి త్రోస్తూ "సాయంత్రం మేడంని హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి. నాకు రావడానికి కుదరదు" అన్నాడు.

అనంత్ "ఓ.కె సార్" అన్నాడు ఫైల్సు తిరిగి తీసుకుంటూ.

వాసవి వాళ్ళిద్దరి మాటల మీద ఆసక్తి లేనట్లు ఎటో చూస్తూ కూర్చుంది.

అనంత్ వెళ్ళిపోగానే జగదీష్ లేచి నిలబడుతూ "ముత్తుకెలా వుంది? క్రొత్త వంటమనిషి చూడమని చెప్పాను. బహుశా ఒకటి రెండు రోజుల్లో రావచ్చు" అన్నాడు.

"ఎందుకు, ముత్తుకి తగ్గిపోయింది. ఈరోజు వంటకూడా చేస్తున్నది" అంది వాసవి.

జగదీష్ నవ్వి "నువ్వు చాలా మారిపోయావు ముత్తంటే సరిపడని నువ్వు ఆమె పట్ల చాలా జాలి చూపిస్తున్నావు. బహుశ ముత్తుకి జబ్బు చేయడం దాని అదృష్టం అనుకుంటాను" అన్నాడు.

వాసవి అతనికేసి అదోలా చూసింది.ఇంత మంచి వ్యక్తిని తను అనుక్షణం తీరని అనుమానాలతో దూరంగా వుంచడం ఎంత పొరబాటో ఆమెకి అర్ధమవ్వసాగింది.

"ఏమిటి, ఆలోచిస్తున్నావు?"

వాసవి తత్తరపాటుగా చూసి "ఏం, లేదు" అంది.

జగదీష్ నవ్వాడు.

ఆ వెంటనే వాచీ చూసుకుంటూ "వస్తాను. ఇప్పటికే లేటయింది బై" అన్నాడు.

వాసవి గబగబా అతనితోపాటు నాలుగడుగులేసి "ఏమండీ" అంది.

జగదీష్ వెను తిరిగి చూసాడు.

వాసవి మాటలు రానట్లు నిలబడిపోయింది.

"ఏమయినా కావాలా?" జగదీష్ అనునయంగా.

వాసవి ఎలా చెప్పాలో తెలియనట్లు నిలబడిపోయింది.

జగదీష్ దగ్గరగా వచ్చి "నా దగ్గర యింకా నీకు భయమా?" అన్నాడు ప్రేమగా.

వాసవి కాస్త ధైర్యం వచ్చినట్లు చూసి "నిన్న – నిన్న" అంది తడబడుతున్నట్లుగా.

"నిన్న ఏం జరిగింది?"

"అదే నిన్న నేను మీ పట్ల. చాలా అనుచితంగా ప్రవర్తించాను. అందుకు క్షమించండి"

ఆమె మాటలకి జగదీష్ నవ్వేసాడు.

ఆమె సిగ్గుగా తల దించుకుంది.

అతని చేతులు ఆమె భుజాల్ని పెనవేసుకున్నాయి.

"మన మధ్య క్షమాపణలు దేనికి? అదేం విచిత్రమోగాని మన దాంపత్య జీవితం కొరకడాలతోను, కొట్టడాలతోనే ప్రారంభమవుతోంది" అన్నాడు.

అతని మాటలకి వాసవి ముఖం సిగ్గుతో ఎర్రబడింది.తల యింకా భూమిలోకి కృంగిపోయింది. భూమికి అభిముఖంగా వున్న ఆమె చుబుకాన్ని పట్టుకుని తలయెత్తి ఆమె కన్నుల్లోకి చూసి చిలిపిగా నవ్వాడు జగదీష్

వాసవి కన్నుల్లో నీరు చిప్పిల్లింది.

"అరె! నువ్విది యింత సీరియస్‌గా తీసుకుంటున్నావా? నిన్నసలు ఏం విడ్డూరం జరిగిందని?" అన్నాడు జగదీష్ ఆమె కళ్ళను తన కర్చీఫుతో వత్తుతూ.

"మీరు నన్నూరడించడానికి విడ్డూరం కాదని చెప్పినా నాకు తెలుసు. నేను నిన్న డెవిల్‌లా ప్రవర్తించాను" అంది వాసవి గద్గదంగా.

జగదీష్ నవ్వుతూ "నన్ను కొట్టడం పెద్ద నేరంలా పరిగణిస్తున్నావా? ఇది చాలా కామన్ థింగ్. ఎప్పుడో ద్వాపర యుగంలోనే సత్యభామ కృష్ణుణ్ణి తన్నింది. ఆ సంగతి అలావుంచినా నీకో రహస్యం చెప్పనా? బయట కాలరెత్తుకుని, మీసాలు దువ్వుకుంటూ

ఫోజులుకొట్టే చాలామంది మగవాళ్ళు యింట్లో పెళ్ళాం చేత తన్నులు తినే మహానుభావులే కాబట్టి ఆ సంగతి మరచిపో" అన్నాడు బుగ్గమీద చిటికేసి.

వాసవి అతనికేసి విచిత్రంగా చూసింది.

జగదీష్ నవ్వుతూ చెయ్యివూపి పోర్టికోలో వున్న కారెక్కి స్టార్టు చేసి వెళ్తుంటే అలాగే చూస్తూ నిలబడిపోయింది వాసవి.

హాస్పిటల్ నుండి తిరిగి వస్తూనే హుషారుగా ఉంది వాసవి. తండ్రి మరో నాలుగయిదు రోజుల్లో యింటికి వచ్చేస్తాడనే విషయం ఆమెకు ఆనందాన్ని కలిగిస్తోంది.

ఆమె సన్నగా ఏవో హిందీపాట హమ్ చేస్తూ డ్రస్ మార్చుకుంది. చెవులకున్న హేంగింగ్స్ తీసి డ్రస్సింగ్ టేబుల్ పొరుగులో పడేస్తుంటే తళుక్కున మెరిసిందొక రాయి.

వాసవి అటువేపు చూసింది.

మధ్యలో నీలం చుట్టూ రవ్వలు పొదిగిన ముక్కుపుడక అది. వాసవికి గుర్తొచ్చింది. ఆ రోజు తోటలో తాము మామిడిచెట్టు నరికినప్పుడు దొరికింది.

వాసవి జ్ఞాపకాల గాలానికి తటాలున తగులుకుందొక జ్ఞాపకం.

అవును ముత్తు ఆ రోజు చూస్తున్న ఫోటోలో అమ్మాయి పెట్టుకున్నది అదే ముక్కుపుడక.

"ఆ అమ్మాయి నీ కూతురా?" అంటే ఏదో తమిళంలో గొణిగింది ముత్తు.

ముత్తు కూతురికి ఇంత ఖరీదైన ముక్కుపుడకా?

వాసవి ఆలోచిస్తూ బాల్కనీలో కొచ్చింది.

అప్పుడే సరిగ్గా శంకర్ పైకొచ్చి "అమ్మగారూ ముత్తు మిమ్మల్ని ఏం కూర చెయ్యమంటారో కనుక్కోమంటోంది" అన్నాడు.

"ఏదో ఒకటి చెయ్యమను. దానికి ఈ రోజేగా తగ్గింది. ఎక్కువ అలసిపోవద్దని చెప్పు" అంది.

"సరేనండి" అంటూ శంకర్ రెండు మెట్లు దిగాడు.

"శంకర్" వాసవి వెనక్కి పిలిచింది.

"ఏంటండీ" అంటూ ఆగాడు వాడు.

"ముత్తు గదిలో దాని తలగడ కింద ఒక కాలిపోయిన ఫోటో వుంది తీసుకురారా" అంది వాసవి.

"ముత్తుని అడగమంటారా?" సందేహంగా అడిగాడు శంకర్.

"అక్కర్లేదు అది పనిలో వుందిగా నువ్వు తీసుకురా నీకో తమాషా చూపిస్తాను" అంది వాసవి వుత్సాహంగా.

శంకర్ సరేనంటూ పరిగెత్తాడు.

వాసవి బాల్కనీ పక్క రాధామాధవీయం తీగలు సరిచేస్తూ నిలబడింది. తెల్లగా విరబూసి మరునాటికి ఎర్రబడే ఆ పూగుత్తులని తమాషాగా చూస్తుంది వాసవి.

సన్నని పరిమళం వాటినుండి వీస్తూ నాసికా పుటాల్ని సున్నితంగా స్పర్శిస్తోంది.

దూరంగా పడమటి వైపు అస్తమిస్తోన్న సూర్యకాంతికి తోటలేని పశ్చిమ భాగం రాగరంజితమయ్యింది.

చూస్తుండగానే ఆ ఎరుపు నలుపుగా మారి నాలుగువేపులా చీకటి తెరలు దిగుతున్నాయి.

ముత్తు మెల్లిగా పై కొచ్చింది.

వాసవి ముత్తువేపు ప్రశ్నార్థకంగా చూసింది.

"శంకర్ చెప్పలేదా?" అంది వాసవి.

వాసవి అనుమానంగా చూసింది.

"వాణ్ణి పంపించి అరగంట దాటింది. ఏంచేస్తున్నట్లు?" ఆమె విసుక్కుంటూ మెట్లు దిగింది.

ముత్తు అర్థంకాక వాసవి వేపు చూస్తూ ఆమెని అనుసరించింది.

వాసవి తను వున్న రేకు షెడ్డుల వైపు వెళ్ళడం ఆశ్చర్యం కలిగించింది ముత్తుకి.

ఆసక్తిగా ఆమె వెంట నడిచింది ముత్తు.

వాసవి లోపలి దృశ్యం చూసి నివ్వెరపోయింది.

శంకర్ మోకాళ్ళ మీద తలపెట్టుకుని వెక్కెక్కి ఏడుస్తుండటం ఆమెకు ఎనలేని ఆశ్చర్యాన్ని కలిగించింది.

గబుక్కున వాడి దగ్గరకెళ్ళి వాణ్ణి భుజాలు పట్టుకు కుదిపింది.

"శంకర్ ఏం జరిగింది? ఎందుకలా ఏడుస్తున్నావు?" అంది కంగారుగా. శంకర్ తలయెత్తలేదు.

వాసవి బ్రతిమిలాడే కొలది వాడి దుఃఖం వెల్లువై పొంగుతోంది. వాసవి నిస్పృహగా కొంతసేపు వాడి పక్కనే కూర్చుండిపోయింది.

ముత్తు ఆశ్చర్యంగా వాళ్ళిద్దరినీ మార్చి మార్చి చూస్తోంది.

మరికొన్ని నిముషాలకి శంకర్‌లో దుఃఖ ఉద్వేగం కాస్త తగ్గింది. వాడు తలయెత్తి వాసవి వైపు చూసాడు మెల్లిగా.

వాసవి వాడి ముఖంలోకి చూసింది ఆదుర్దాగా.

వాడి పెద్ద పెద్ద కళ్ళు ఎర్రమందారాల్లా వున్నాయి. బుగ్గలన్నీ కన్నీళ్ళతో తడిసి ఉబ్బిపోయాయి.

"శంకర్, ఏం జరిగిందిరా? అంది వాసవి తిరిగి.

శంకర్ జవాబు చెప్పకుండా వళ్ళో ఫోటోకేసి చూసాడు.

వాసవి కూడా అటు చూసింది.

వాసవికి కొద్దిగా అర్థమయింది. వాడి దుఃఖానికి కారణం ఆ ఫోటోయేనని.

వాసవి ఆఫోటోని చేతిలోకి తీసుకుంది.

ముత్తు ఫోటోని ఆ యిద్దర్నీ మార్చి మార్చి చూస్తోంది. ఆమె ముఖంలో ప్రస్ఫుటమవుతున్న ఆందోళన, కంగారు వాసవిగాని, శంకర్‌గానీ గమనించే స్థితిలో లేరు.

పొగచూరిన ఆ ఫోటో చిరిగిపోయిన ఆ ఫోటో శంకర్‌లో ఎలాంటి కలవరాన్ని లేపగలిగిందో అంతుబట్టలేదు వాసవికి.

"ఫోటో తీసుకురార అంటే అది చూసి ఏడ్వటమెందుకురా?" అంది వాసవి మళ్ళీ. ఈసారి ఆమె గొంతులో విసుగే ఎక్కువ చోటు చేసుకుంది.

"ఆ ఫోటోలో అమ్మాయిని చూస్తే మా అక్క జ్ఞాపకం వచ్చింది" అన్నాడు తలదించుకుని బొంగురుగా.

వాసవి ఆ అమ్మాయిని పరీక్షగా చూసింది.

విశాలంగా చూసిందల్లా నిజమని నమ్మే అమాయకపు కళ్ళు తనకి తెలిసిన నిజాన్ని కూడా బయటపెట్టడానికి ధైర్యం చాలని లక్కపిడతలాంటి నోరు ఆ ముక్కు వాసవి ఆలోచనగా అకస్మాత్తుగా ఆగిపోయింది.

"మీ అక్క యిలాగే వుండేదా?" అడిగింది వాసవి ఆశ్చర్యంగా.

వాడు అవునన్నట్లుగా తల ఊపాడు. వాసవి వాడిని ఊరడిస్తున్నట్లుగా వాడి భుజమ్మీద చెయ్యేసింది.

ఆ వెంటనే వాసవి చూపు ముత్తువేపు తిరిగింది.

ఆమె ఫోటో వున్న తన చేతిని ముత్తువేపు చాచింది.ఆ వెంటనే "ఈ ఫోటో ఎవరిది?" అంది. ముత్తు మాట్లాడలేనట్లు చూసింది.

దాని శరీరం సన్నగా వణకటం గమనించి వాసవికి అనుమానం వేసింది.

"నీకేం భయంలేదు చెప్పు" అంది వాసవి అనునయంగా.

శంకర్ నిర్లిప్తంగా వాళ్ళిద్దరి వేపే చూస్తున్నాడు.

ముత్తుకి వాసవి అడుగుతున్నది అర్థమవుతున్నదో లేదో తెలియని అయోమయపు స్థితిలా రాయిలా నిలబడింది. వాసవి చిరాగ్గా శంకర్ వేపు తిరిగి నువ్వడగరా.

"ఈ ఫోటోలో వున్నది ఎవరు?" అంటూ వచ్చీరాని తమిళాన్ని గుణించుకుని అడిగాడు శంకర్. వాడి కంఠస్వరం యింకా దుఃఖాతిశయంతో వణుకుతోంది.

ముత్తు శంకర్ వేపు చూసి మెల్లిగా "పెరియమ్మ" అంది.

"అంటే?" అంది వాసవి చిరాగ్గా.

ముత్తు అసహాయంగా చూసింది."

"అంటే పెద్దమ్మగారని" అన్నాడు శంకర్ తనకి అర్థమయింది చెబుతూ.

"ఏ పెద్దమ్మరా? పేదరాశి పెద్దమ్మా? దరిద్రగొట్టు పెద్దమ్మా?" అంది వాసవి కోపంగా.

శంకర్ వాసవివైపు అప్రసన్నంగా చూసాడు.

ముత్తుకి వాసవి మాటలు అర్థంకాలేదు.

"అంటే?" అంది వాసవి మళ్ళీ.

"నాకు సరిగ్గా తెలియదు" అన్నాడు శంకర్ నిస్పృహగా.

"సరే ఈ ఫోటో మంచి సమస్య సృష్టించింది. నేను ఈ ఫోటోని ఎందుకు తెమ్మన్నానో తెలుసా? మనకొకసారి మామిడిచెట్టు త్రవ్వుతోంటే చిన్న ముక్కుపుడక దొరికింది. ఆ ముక్కుపుడక ఈ ఫోటోలో అమ్మాయి పెట్టుకున్నది ఒకటే. ఈ రోజు డ్రెస్సింగ్ టేబుల్‌లో అది కనిపించింది. నీకు ఆ తమాషా చూపిద్దామని తెమ్మన్నాను. నా కారణంగా నీకు మనస్తాపం కలిగినందుకు బాధ పడుతున్నాను. పద వెళ్దాం" వాసవి శంకర్‌ని భుజం పట్టుకుని లేవదీసింది.

వాడు చొక్కాతో ముఖం తుడుచుకుంటూ ఆమెని అనుసరించాడు.

ముత్తు వాళ్ళిద్దరి వేపూ చూస్తూ వెనుకే బయటకి నడిచింది.

ఆమె చూపులు వెళ్తోన్న వాసవి ఎడం చేతిలో వున్న ఫోటో మీద నిలిచింది.

20

**వాసవి దీర్ఘంగా** ఏదో చదువుకొంటున్నది.

"అమ్మగారూ" శంకర్ మెల్లిగా పిలిచాడు.

"ఏమిట్రా?" అంది వాసవి పుస్తకంలోంచి తల తిప్పకుండానే.

"మరి..మరి.. మనైవి అంటే "భార్య" అని అర్థం అన్నాడు వాడు.

వాసవి నవ్వి వాడికేసి చూసింది. వాడిచేతిలో "ముప్పయిరోజుల్లో త్తమిళ భాష" అనే పుస్తకం వుంది.

"ఎక్కడ సంపాదించావురా అది?" అంది వాసవి చిరునవ్వుతో. కొత్త సెక్రటరీగారు తమిళం నేర్చుకోటానికి నాలుగయిదు పుస్తకాలు కొనుక్కున్నారమ్మా. ఇవ్వాళ ఆయన గది శుభ్రం చేస్తూ చూసాను. నేనూ నేర్చుకుంటానంటే తీసికెళ్ళమన్నారు" అన్నాడు గబగబా.

అనంత్ పట్టుదల ఆమెకి తెలుసు. ఏదైనా నేర్చుకోవాలని అనుకోవడం చాలు అమలు జరుపేస్తాడు. విద్య విషయంలో అతని పట్టుదల మెచ్చదగినది. ఒక విధంగా శారదా తనయుడతను.

"బాగానేవుంది. ఆ నేర్చుకునేదేదో భార్యతోనే మొదలు పెట్టావన్నమాట" అంది వాసవి నవ్వుతూ కవ్విస్తున్నట్లుగా.

శంకర్ బుగ్గలు సిగ్గుతో ఎర్రబడ్డాయి. పెద్దపెద్ద కళ్ళు బరువుగా వాలిపోయాయి.

"ఎందుకురా అంత సిగ్గు. పెళ్ళిచేసుకోవా?" అంది వాసవి ఇంకా రెట్టిస్తూ.

శంకర్ యిబ్బందిగా కదిలాడు. "పోండమ్మా" అన్నాడు సిగ్గుగా.

వాసవికి వాడి సిగ్గు చూడముచ్చటగా వుంది. తామర తూడులా సున్నితంగా వున్న వీడు మరో నాలుగేళ్ళలో హీరో అవుతాడు. ఏ హీరోయిన్నో వుద్ధరిస్తాడు అనుకుంది తమాషాగా.

"సరే అసలు సంగతి చెప్పు" అంది వాసవి వాణ్ణింక ఏడ్పించడానికి యిష్టంలేనట్లు.

"నిన్న...నిన్న...ముత్తు చెప్పలేదూ" అన్నాడు శంకర్ ఉత్సాహంగా.

"ఏ సంగతి?" వాసవి పరధ్యానంగా అడిగింది.

"అదే ఫోటోలో అమ్మాయి గురించి. అంటే ఆ అమ్మాయి 'భార్య'న్న మాట"

వాసవికి వాడిమాటలు నవ్వు తెప్పించాయి.

"చాలా గొప్ప సంగతి కనిపెట్టావ్. ఆ అమ్మాయి ఆ ఫోటోలో వున్న వ్యక్తికి భార్యన్న సంగతి మాకెవ్వరికీ తెలియదు" అంది నవ్వుతూ.

శంకర్ ముఖం చిన్నబోయింది.

వాడు పుస్తకం గబగబా రెండుసార్లు తిప్పి "మొదల్ అంటే మొదటి అని అర్థం అంటే ఆమె మొదటి భార్య" అన్నాడు వాసవికేసి కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.

వాసవి భ్రుకుటి ముడుచుకుంది.

"ఎవరికి?" అంది కటువుగా.

"అయ్యగారికి" అన్నాడు శంకర్ భయంగా వాసవికేసి చూస్తూ.

వాసవి వాడివేపు అగ్నిశిఖలా చూసింది.

ఆమె చూపులకి శంకర్‌లో వణుకు పుట్టుకొచ్చింది.

"అంటే.. అంటే ఏ అయ్యగారో సరిగ్గా తెలియదు" అన్నాడు హీనస్వరంతో.

వాసవి వాడి చేతిలోని ఫోటో లాక్కుంది.

ఆ ఫోటో ఒక వేపు బాగా కాలిపోయింది. ఆ అమ్మాయి ముఖం కూడా బాగా పొగచూరి వుంది.

శంకర్ ఈలోపున క్రిందకి పరిగెత్తాడు.

వాసవి ఆ సంగతి గమనించలేదు.

ఆమె అంతరంగంలో ఒకే ఒక జవాబు దొరకని ప్రశ్న.

ఆ అయ్యగారు ఎవరు?

ఆ ఫోటో ఎవరిది?

కొంపతీసి ...కొంపతీసి అతను జగదీష్ కాదు కదా? ఆమె శరీరమంతా ఒక రకమైన ఉద్వేగానికి లోనై చలిజ్వరం వచ్చినట్లు వణకసాగింది.

సరిగ్గా అప్పుడే శంకర్ మళ్ళీపైకొచ్చాడు. వాడివెనుక ముత్తు నిర్లిప్తంగా.

వాసవికి అర్థమయ్యింది వాడు ముత్తుని ఎందుకు పైకి తీసుకొచ్చాడో. ఏ ప్రశ్ననయితే గబగబా అడిగి తన అనుమానం తీర్చుకోవాలనుకుందో ఆ ప్రశ్న ఆమె గొంతులో లుంగచుట్టుకుపోయి బయటకి రానని మొరాయిస్తోంది.

ఆమె ఫోటో వైపు ముత్తువైపు శంకర్ వైపు మార్చి మార్చి పిచ్చిదానిలా చూసింది.

"ఎన్నామ్మా? కుపిటింగళా?" అంది ముత్తు నిదానంగా. వాసవి ఆ ఫోటోని కసిగా ముత్తువేపు విసిరేసింది.

శంకర్ గబుక్కున ఆ ఫోటో అందుకున్నాడు.

ముత్తు శంకర్ వేపు చూసింది.

శంకర్ కళ్ళు దించుకున్నాడు.

ముత్తు మరో రెండు నిముషాలు నిలబడి మెల్లిగా వెనుదిరిగింది.

ఆమె మెట్లవేపు వెళ్తోంటే శంకర్ కూడా ఆ ఫోటో చంకలో పెట్టుకుని ఆమెని అనుసరించాడు.

"ముత్తూ" వాసవి గర్జించినట్లు పిలిచింది.

ముత్తుతోపాటు శంకర్ కూడా ఆమె పెట్టిన కేకకి ఉలిక్కిపడ్డారు.

వాసవి గబగబా అడుగులేస్తూ వాళ్ళిద్దరి దగ్గరికి వచ్చింది.

ఆమె వస్తున్న తీరు చూపుల్లో ఆవేశం నడకలో ఉద్వేగం, శరీరంలో వణుకు. కొంపదీసి ఆమె మళ్ళీ చావగొడుతుందా? అని భయం వేసింది శంకర్‌కి.

మంత్రించినట్లుగా వాళ్ళిద్దరూ అలాగే నిలబడిపోయారు. వాసవి శంకర్ నుండి ఆ ఫోటోని స్వరున లాక్కుంది.

ఆ వెంటనే ముత్తువైపు తీవ్రంగా చూస్తూ "ఇది ఎవరిది? ఈ ఫోటోవున్న అయ్యగారెవరు?" అంది కాలిపోయిన భాగాన్ని చూపిస్తూ.

ముత్తు వాసవివైపు అదోలా చూసింది.

ఆమె వెంటనే జవాబు చెప్పకపోవడం వాసవికి భరించలేనిదిగా వుంది.

శంకర్ భయంగా ముత్తు భుజాలు పట్టుకుని "చొల్లుంగో ఉనక్కి ఒన్డుమ్ బయమిల్లే" అన్నాడు.

ముత్తు వాసవివైపు జాలిగా చూసి కిటికి వేపు వ్రేలు పెట్టి చూపించింది.

వాసవి శంకర్ ఆత్రుతగా చూసారటువైపు.

సరిగ్గా ఆ కిటికీలోంచి ఎదురుగోడకి తగిలించివున్న బస్ట్‌సైజు ఫోటోమీద పడింది వాళ్ళ దృష్టి.

ఆ ఫోటోలో నవ్వుతూ జగదీష్.

వాసవికి సర్వజగత్తూ తిరిగిపోతూ కనిపించింది. ఎదురుగా కనిపిస్తున్న జగదీష్ రూపం వికృతంగా భయంకరంగా నవ్వుతోంది.

ఆమె వెంటనే వేడిసోకిన వెన్నముద్దలా క్రిందకి జారిపోయింది.

ముత్తు పరిస్థితి గ్రహించి ఆమెని తటాలున పట్టుకుని వడిలో పడుకోబెట్టుకుని "శంకర్ సెక్రటరీ అయ్యకి కూపిడువా?" అంది.

శంకర్ గబగబా క్రిందకి పరిగెత్తుతుంటే ఎదురయ్యాడు అనంత్.

"ఏం జరిగింది?" అన్నాడు గాభరాగా.

"అమ్మగారు పడిపోయారు" అన్నాడు శంకర్ గబగబా.

అనంత్ చేతిలోని ఫైలు శంకర్‌కి అందించి ఒక్క వూపున మెట్లెక్కేసాడు.

అక్కడ వాసవి ప్రాణం లేని మనిషిలా ముత్తు ఒడిలో సోలిపోయి వుంది.

"ఏమయింది?" అన్నాడు అనంత్ వాసవి నాడి చూస్తూ.

ఎవరూ జవాబు చెప్పలేదు.

అనంత్ వాళ్ళిద్దరి వైపూ ఆశ్చర్యంగా చూస్తూ "ఏం జరిగిందంటే మాట్లాడరేం?" అన్నాడు రెట్టిస్తున్నట్లుగా.

"ఏం జరగలేదు సార్. అమ్మగారు యిక్కడ కొచ్చిన దగ్గర్నుండీ అలాగే వుంటున్నారు. ఈ ఫోటో చూసి ఈ ఫోటో చూసి" అంటూ ఆగిపోయాడు శంకర్.

"ఈ ఫోటో చూసి?" అనంత్ అనుమానంగా ఆ ఫోటోని చేతిలోకి తీసుకుని అడిగాడు.

సరిగ్గా అప్పుడే జగదీష్ కారు తాళాలు త్రిప్పుతూ పైకొచ్చి అందరి వేపూ ఆశ్చర్యంగా చూసాడు.

"వ్వాట్! వాసవికేం జరిగింది?" అన్నాడు కంగారుగా.

"అమంగారు పడిపోయారు సార్" అన్నాడు శంకర్.

జగదీష్ వాసవిని ఎత్తుకుని గదిలోకి తీసుకెళ్ళి బెడ్ మీద పడుకోపెట్టి ఫాన్ వేసాడు.

"డాక్టరుకి ఫోన్ చెయ్యమంటారా?" అడిగాడు అనంత్ వినయంగా.

"వద్దు. అంతా సర్దుకుంటుంది" అన్నాడు జగదీష్ అతని చూపులు అనంత్ చేతిలోని ఫోటోమీదనే వున్నాయి.

ఆ ఫోటో చూడగానే అతను బిగుసుకున్నట్లయిపోయాడు.

"సార్.. ఈ ఫోటో చూసి మేడమ్" అంటూ ఆగాడు అనంత్.

జగదీష్ అప్పుడే చూస్తున్నట్లుగా ఫొటోవేపు చూసి ఏముంది? అందులో. వాసవికిది మామూలే. ఆమెకి హిస్టీరియా వుందని నా అనుమానం" అంటూ నిర్లక్ష్యంగా దాన్ని రెండుముక్కలుగా చింపి బాల్కనీలోంచి విసిరేసాడు.

అనంత్ కళ్ళు పెద్దవయ్యాయి.

"వ్వాట్? వాసవికి హిస్టీరియా?" అన్నాడు గబుక్కున.

జగదీష్ విశాలమైన కళ్ళు అతనివేపు తిరిగాయి.

అప్పుడర్ధమైంది అనంత్‌కి తను చేసిన పొరపాటు.

అతని తల వంగింది.

"సారీ సర్! వెరీ సారీ" అన్నాడు మెల్లిగా.

జగదీష్ అనంత్ దగ్గరగా వెళ్ళాడు.

"డజన్ట్ మేటర్" అన్నాడు అతని భుజమ్మీద చెయ్యివేసి. "థాంక్ యూ సర్" అంటూ అనంత్ అక్కడినుండి కదిలి వెళ్ళిపోతుంటే జగదీష్ అతన్నే పరీక్షగా చూడటం అనంత్‌కి తెలియదు.

ఆ గదిలో అదోలాంటి నిశ్శబ్దం.

జగదీష్ మంచం కొసన కూర్చుని వాసవివైపు చూసాడు. వాసవి పక్కకి తిరిగి పడుకుంది.

ఏక బిగిని ఏడ్వటం వల్ల ఆమె కళ్ళు ఎర్రబడి ఉబ్బివున్నాయి. జగదీష్ మెల్లిగా తన చేతిని ఆమె నడుం మీదుగ వేసి "వాసూ" అన్నాడు లాలనగా.

వాసవి ఆ చేతిని అతివేగంగా విసిరికొట్టింది.

జగదీష్ పెదవులపై సన్నని హాసరేఖ మెరిసి మాయమయ్యింది.

"ఏమిటిది? చిన్నపిల్లలా? నువ్వు చదువుకున్నదానివి. అన్నీ తెలిసినదానివి. అతిమామూలు సామాన్య గృహిణిలా పనివాళ్ళముందు సీన్ క్రియేట్ చెయ్యడం నీకు బాగుందా?" అన్నాడు మెల్లిగా.

వాసవి చివ్వున వెనక్కు తిరిగింది.

ఆమె కళ్ళనుండి జారిపడుతోన్న నిప్పుకణాల వేడిమికి తట్టుకోలేనట్లు పక్క చూపులు చూసాడు జగదీష్.

"నేను పనివాళ్ళముందు సీన్ క్రియేట్ చేస్తున్నానా? బాగుంది చాలా బాగుంది. మీరు పనివాళ్ళముందు నడిపిన చరిత్ర మాత్రం చాలా ఉదాత్తమైంది కదూ" అంది వాసవి.

ఆమె గొంతులో ధ్వనిస్తోన్న హేళనకి తట్టుకోలేనట్లు కనురెప్పలు తాటించాడు జగదీష్.

అతని ముఖం గంభీరంగా మారిపోయింది.

మంచమ్మీదనుండి లేచి గదిలో పచార్లు చెయ్యసాగాడు.

వాసవి కళ్ళలోంచి మళ్ళీ నీళ్ళు చిప్పిల్లాయి. ఆమె ఏడుస్తున్నట్లుగా ఆమె భుజాలు కదులుతోంటే నిస్సహాయంగా ఆమెవేపు చూసాడు జగదీష్.

"నీకేం చెప్పాలో ఎలా చెప్పాలో నాకు తెలియడంలేదు. నువ్వు విన్నది చూసింది అబద్ధం అనను. నిజమే నాకు ముందొక వివాహం జరిగింది. ఆమె చనిపోయింది. ఆ తర్వాత నిన్ను వివాహం చేసుకోవడం జరిగింది. ఇందువల్ల నీకొచ్చిన నష్టం ఏమిటో? నేను నిన్ను చేసిన మోసం ఏమిటో నాకు అంతుపట్టడంలేదు" అన్నాడు ఆవేశంగా.

వాసవి దుఃఖం ఆగింది.

ఆమె విసురుగా మంచమ్మీదనుండి లేచి కూర్చుంది.

"ఇందులో మోసంలేదని మిమ్మల్ని మీరు సమర్ధించుకోగానే సరిపోలేదు. గల్లాపెట్టెముందు పెట్టుకుని లాభనష్టాలు బేరీజు వేసుకునే మీలాంటి డబ్బు మనుష్యులకి నాకొచ్చిన నష్టం ఏమిటో చెప్పినా అర్థంకాదు. మగవాడు ఎలాగ తనకు రాబోయే భార్య వుండాలని కలలు కంటాడో అలాగే ఆడది కూడా తనకొచ్చే భర్త వుండాలని ఆశపడుతుంది. ఈ పురుషాధిక్యత ప్రపంచానికి ఆడమనసు అర్థంకానిది. కాని ఆడదికూడ తన భర్త తన ఒక్కడికే పరిమితి కావాలని తననే ప్రేమించాలని పవిత్రమయిన దాంపత్య అనుభవాన్ని తననుండే పొందాలని కోరుకుంటుందని మీ మగవాళ్ళలో ఎంతమందికి తెలుసు. తెలిసినా ఆ నిజాన్ని నిర్లక్ష్యం చేస్తుంది మీలోని అహం. కట్టుకున్న పెళ్ళాన్ని వదిలి ఇతరులతో కామకలాపాలు తీర్చుకుని పెద్దమనుష్యులుగా యిల్లుచేరే మీరు పెళ్ళిమీద పెళ్ళి చేసుకుని రకరకాల రుచులకోసం పక్కదారులు పట్టే మీరు తమచేతికందని ఆడదానిమీద నీచ ప్రచారాలు చేసి కసి తీర్చుకునే మీరు మీకేం తెలుసండి నేను పొందిన నష్టం" వాసవి ఆవేశం చూసి బొమ్మలా నిలబడిపోయాడు జగదీష్.

"నాకర్థమవుతోంది నీ బాధ. కానీ మగవాడిననే అహంకారంతో నేను నిన్న మోసం చెయ్యలేదు. అసలిది మోసం అనికూడా నేను అనుకోలేదు. మగవాళ్ళమీద నువ్వు చేసిన అభియోగాన్ని ఖండించను. కానీ ఆ మగవాళ్ళలో నన్నుకూడా జమ చెయ్యడమే నాకు బాధ

కలిగిస్తోన్న విషయం నిజమే. ఆడదికూడా మగాడిలానే ఆశిస్తుందన్న విషయం నాకు లేదు. కానీ నువ్వు నమ్మినా నమ్మకపోయినా చెప్పేతీరాలి నాకు అంతకు ముందు పెళ్ళయిన మాట నిజమే. కానీ నాకు కూడా అయిమీన్ ఆ పవిత్ర దాంపత్య సుఖం నీలాగే అనుభవానికి రానిది" ఆ మాటలు పూర్తిచేసి అతను ముఖం పక్కకి తిప్పుకున్నాడు.

వాసవి అతనివేపు ఆశ్చర్యంగా చూసింది.

"అతను చెబుతున్నది నిజమేనా? నమ్మదగ్గ విషయమేనా?" అర్థం కావటంలేదు వాసవికి.

అంతలోనే తన పరిస్థితి గుర్తొచ్చిందామెకు.

తనని మాత్రం ఎవరు నమ్ముతారు. వివాహమయిన ఈ ఆరునెలల కాలంలో తమ మధ్య దూరం అలాగే వుండిపోయిందంటే?

ఆమె మనసునిండా ఏవేవో అనుమానాలు?

కానీ తనకు కావాల్సింది అతనికి తన మొదటి భార్యతో అనుభవం వుందా లేదన్నది కాదు.

అతనికి అంతకు ముందొక వివాహం జరిగిన సంగతి తనకి తెలియబర్చకపోవడం.

"ఏది ఏమయినా నన్ను నేను సమర్థించుకో లేకుండా వున్నాను. పెళ్ళికిముందే ఈ విషయం నాకు మీరు తెలియబర్చకపోవడం నేను సీరియస్‌గానే తీసుకుంటున్నాను" అంది వాసవి గద్గదంగా.

జగదీష్ ఆమె వేపు నిదానంగా చూసాడు. "అసలు నువ్వా అవకాశం యిచ్చావా? గుర్తు తెచ్చుకో. పెళ్ళిచూపులే వద్దన్న నీకు ఈ సంగతులన్నీ ఎలా చెప్పాలి?" అన్నాడు జగదీష్.

అతని గొంతులో పెరుగుతోన్న తీవ్రతని కనిపెట్టింది వాసవి. ఆమె కనుబొమ్మలు కూడా ఒకలాంటి కోపంతో ముడుచుకున్నాయి.

"కనీసం మా డాడీకయినా మీరు చెప్పివుండొచ్చుగా?" అంది విసురుగా.

జగదీష్ ఆమె వేపు కోపంగా చూసాడు.

"ఈ విషయాలన్నీ మీడాడీకి పెళ్ళికి ముందే తెలుసు. మీ తండ్రీ కూతుళ్ళిద్దరూ వాటిగురించి తెలుసుకోవడానికి ప్రయత్నించకపోవడం నాపొరపాటు కాదు" అన్నాడు అంతే విసురుగా.

వాసవి దిమ్మెరబోయినట్లు చూసింది.

"వ్వాట్ ఈ సంగతి మా డాడీకి తెలుసా?" అంది తెల్లబోతూ.

"కావాలంటే కనుక్కో. ఈ విషయమే కాదు. రేపు నా గురించి ఏ క్రొత్త నిజం నువ్వు కనుక్కున్నా అవన్నీ మీ డాడీకి ముందుగా తెలిసిన నిజాలే అని నువ్వు మరచిపోకు" అన్నాడు జగదీష్ నిర్లక్ష్యంగా.

వాసవి మనసు సిగ్గుతో కుచించుకుపోయింది.

"డాడీ ఇంత మోసం చేస్తారనుకోలేదు నేను" అంది వుద్వేగంగా. ఆ వెంటనే ఆమె మంచమ్మీద నుండి ఉరికి గబగబా డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకెళ్ళి జుట్టు సరిచేసుకుని, నలిగిన చీరని సవరించుకుని పర్స్‌ని అందుకుని ముందుకి అడుగేసింది.

జగదీష్ "ఎక్కడికి?" అన్నాడు అయోమయంగా ఆమె వేపు చూస్తూ.

వాసవి అతనివేపు నిర్లక్ష్యంగా చూసి "డాడిని అడగటానికి" అంది.

"హాస్పిటల్లోనా? నువ్వు చదువుకున్నావేగానీ కామన్ సెన్స్‌లేదు" అన్నాడు జగదీష్ సీరియస్‌గా.

వాసవి అతని మాటలకి బుసకొట్టిన పామయ్యింది.

"కామన్‌సెన్స్ కడుపు మండిన వాళ్ళకి కామన్‌సెన్స్, మేనర్స్, డిసిప్లిన్ తెలియవు. అవన్నీ ఒడ్డాన కూర్చున్న మీలాంటివాళ్ళకి" అంది.

"నువ్విప్పుడు వెళ్ళడానికి వీల్లేదంటున్నాను" అన్నాడు జగదీష్ కోపంగా.

"ఆమాట చెప్పడానికి మీరెవరు?" వాసవి తల యెగరేస్తున్నట్లు అడిగి గడపదాటబోయింది.

జగదీష్ మెరుపుదాడి చేస్తున్నట్లు ఆమె ముందుకొచ్చి అడ్డంగా నిలబడ్డాడు.

వాసవిలో ఉద్రేకం వరద మట్టంలా పెరిగిపోతోంది.

ఆమె అతనివేపు పగబట్టిన నాగినిలా చూసి "మర్యాద నిలబెట్టుకోవాలని ఏమాత్రం అనిపించినా అడ్డం లేవండి" అంది.

జగదీష్ నిర్లక్ష్యంగా నవ్వాడు.

"నేనెవరిని అడిగావ్ కదూ. ఆ సంగతి చెప్పాలిగా" అంటూ దగ్గరగా వచ్చాడు.

వాసవి అతనివేపు అయోమయంగా చూసింది.

అతను అమాంతం ఆమెనెత్తుకుని వాసవి గింజుకుంటున్నా వదలకుండా గదిలోని మంచమ్మీదకి విసిరినట్లు పడేసాడు.

వాసవి ఊహించని ఈ ఆకస్మిక చర్యకి నివ్వెర పోయినట్లయింది.

ఆ వెంటనే పైకి లేవబోయింది.

జగదీష్ ఆమెని లేవకుండా అదిమి పట్టాడు.

అతని పెదవులు ఆమె ముఖాన్ని గాఢంగా స్పర్శిస్తున్నాయి.

వాసవి ఒకలాంటి అయిష్టతతో అతన్ని నెట్టేయడానికి పయత్నిస్తోంది.

ఆమె తనకి తెలియకుండానే అతన్నొక శత్రువులాగా భావించి ఉక్కిరిబిక్కిరవుతోంది.

"నా చేతగాని తనమో మంచితనమో అలసత్వమో నేనెవ్వరో నీకు తెలియకుండా చేసింది కదూ" జగదీష్ ఆవేశపడుతూ.

"ఏవిటిది బ్రూట్‌లా వదలండి" వాసవి పెనుగులాడుతోంది. వాసవి గింజుకునే కొలది అతని పట్టు ఎక్కవవుతోంది.

"సార్" తలపు టకటకలాడింది.

జగదీష్ వినిపించుకోలేదు.

"సార్" తలుపు బాదిన శబ్దం హెచ్చయ్యింది.

"నేన్సార్ అనంత్‌ని"

అతని గొంతువిని ఆమె బిగుసుకున్నట్లయింది.

జగదీష్ మాత్రం ఆమెని వదల్లేదు.

"ప్లీజ్ గెట్ ఎవే" అన్నాడతను కటువుగా.

అవతల కాస్సేపు నిశ్శబ్దం.

"సారీ సార్, అతను.. బలరాం మళ్ళీ వచ్చాడు"

జగదీష్ షాక్కొట్టినట్లు వాసవిని వదిలేసి మంచమ్మీదనుండి క్రిందకి ఉరికినట్లు దిగాడు.

అతను తలుపువేపు వెళ్తూ వెనక్కి చూసాడొకసారి.

వాసవి వడలిపోయినట్లు జాలిగా కనిపించిందతని కళ్ళకి. "సారీ కాని నువ్వు హాస్పిటల్‌కి వెళ్ళి ఆయన్ని ఇరిటేట్ చేయకు. ఆయన రేపు యింటికి వస్తున్నారు. నీ అనుమానాలన్నీ తీర్చుకో ఈ నాలుగ్గోడల మధ్య నువ్వెలా బిహేవ్ చేసినా సహిస్తాను. కానీ రోడ్డు మీద మన యింటి పరువు చర్చనీయాంశం కావడం నేనిష్టపడను" అతను తలుపు తీసుకుని వెళ్ళిపోతుంటే చిత్తరువులా చూసింది వాసవి.

21

**జగన్నాధరావుగారు** మంచమ్మీద ఒత్తుగా పెట్టిన డన్‌లప్ దిళ్ళమీదకి జారబడి కూర్చున్నాడు.

వాసవి ఎదురుగా వున్న సోఫాలో కాళ్ళు ముడుచుకుని వాటిపై తల ఆనించి కూర్చుంది.

ఆ యిద్దరి మధ్యా రాజ్యమేలుతోన్న మౌనంలో ఏదో అశాంతి రాజుకుంటోంది.

ఆ ప్రొద్దుటే జగన్నాధరావుగారు డిశ్చార్జి చేయబడ్డారు.

హాస్పిటల్‌కి జగదీష్‌తో పాటు వాసవి వెళ్ళడానికి నిరాకరించింది. జగదీష్ ఒంటరిగా వెళ్ళి ఆయన్ని తీసుకువచ్చాడు.

"అమ్మాయి రాలేదూ?" అడిగారు జగన్నాధరావుగారు.

ఆయన ముఖంలో కదలాడుతున్న నిరుత్సాహాన్ని గమనించగలిగాడు జగదీష్.

"తనకి...కొంచెం..బాగోలేదు. అందుకని రాలేకపోయింది." అన్నాడు జగదీష్ నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"ఏం, బేబీకేమయ్యింది?" కంగారుగా అడిగారు జగన్నాధరావుగారు.

"అబ్బే! కంగారు పడాల్సినంత జబ్బేం కాదు. కాస్త తలనొప్పి" అంటూ సర్దేసాడు జగదీష్.

తీరా యింటికొస్తే వాసవి కనీసం హాల్లోకి కూడా రాలేదు. జగన్నాధరావు అనుమానంగా జగదీష్ వైపు చూసారు.

"ముందు ఇంట్లోకి రండి" అంటూ మాట మార్చి జగదీష్ ఆయన్ని గెస్టురూంలోకి నడిపించుకెళ్ళి పడుకోబెట్టారు.

"అమ్మాయి కనిపించదేం?"

"స్నానం చేస్తున్నదేమో మీరొచ్చిన సంగతి తెలుసుండదు" అంటూ జగదీష్ లోపలికెళ్ళాడు.

జగదీష్‌ని చూసి వాసవి తలతిప్పుకుంది.

"మీ డాడీ వచ్చారు. నువ్వు కనిపించకపోవడం వల్ల ఆయన కంగారు పడ్తున్నారు. వెళ్ళి పలకరించు. ప్రతి చిన్న విషయానికి ఆవేశపడటం దాన్ని భూతద్దంలో చూసుకుని అల్లరి చెయ్యడం వివేకవంతుల లక్షణం కాదు. ఆయన్నిప్పుడే గాభరా పెట్టేయకుండా మామూలుగా మాట్లాడ్డానికి ప్రయత్నించు" అన్నాడు జగదీష్ మెల్లిగా.

వాసవి అతనికేసి తీక్షణంగా చూసి కసిగా గోళ్ళు కొరుక్కుంది.

ఆ వెంటనే విసురుగా లేచి జగన్నాధరావుగారి గదిలోకొచ్చింది.

గుమ్మంలోనే నిలబడిపోయిన వాసవిని చూసి "రామ్మా బేబీ! రా! నీకు ఒంట్లో బాగోలేదని అల్లుడుగారు చెబితే చాలా కంగారు పడ్డాను. ఎలా వుందమ్మా యిప్పుడు? ఏంటసలు ట్రబుల్?" ఆయన ఎంతో ఆత్మీయంగా పలుకరిస్తోంటే ఇబ్బందిగా చూసింది వాసవి.

కన్న కూతురిపట్ల ఇంత ప్రేమాభిమానాలు చూపించే ఈయన్నా తప్పు పట్టడం? తన పట్ల, తన క్షేమం పట్ల ఎంతో ఆదుర్దా ప్రకటించే ఇతని మీదా నిందలు వేయడం.

కాని.. కాని జగదీష్ అంత ఖచ్చితంగా ఢంకామీద దెబ్బ కొట్టినట్లు చెప్పాడే దేన్ని కాదనడం? ఎవర్ని నమ్మడం?

వాసవి మెల్లిగా గదిలోకి అడుగుపెట్టింది.

అశ్రుభరితమైన ఆమె నేత్రాలు బరువుగా క్రిందకి వంగాయి.

"బేబీ! అలాగున్నావేం?" జగన్నాధరావుగారు మెల్లిగా లేచి కూర్చుని తలగళ్ళకి చేరబడి అనునయంగా ప్రశ్నించారు.

వాసవి కనురెప్పలెత్తి తండ్రివేపు చూసింది.

ఆ కళ్ళలో ఉబికి క్రిందకి దూకడానికి సిద్ధపడుతున్న కన్నీళ్ళని చూసి కంగారుపడింది ఆయన పితృ హృదయం

"బేబీ ఏడుస్తున్నావా? ఏం జరిగింది తల్లీ?" అన్నారాయన గాభరాగా.

ఆయన అనునయ వాక్యాలతో ఆమె దుఃఖం అధికమయ్యింది. వాసవి గబుక్కున ఎదురుగా వున్న సోఫాలో కూలబడి మోకాళ్ళలో తలదాచుకుని వెక్కెక్కి పడింది.

జగన్నాధరావుగారు కూతురివేపు కలవరంగా చూసారు.

వాసవి "డాడీ" అంటూ వచ్చి తన గుండెలమీద వాలి ఏడిస్తే ఆయనకంత బాధ కలిగివుండేది కాదు.

సహజంగా ఆడపిల్లలు చిన్నప్పుడు తండ్రితో ఎంత చనువుగా ప్రవర్తించినా యుక్తవయసు రాగానే తమంత తామే ఓ సరిహద్దు గీసుకుని తండ్రికి దూరంగా వుంటారు.

కానీ వాసవి సంగతి వేరు.

వాసవి తల్లిలేని పిల్ల.

కానీ తల్లిప్రేమ తెలియని పిల్లకాదు. ఆమె తల్లి చనిపోయేనాటికి కాలేజీ చదువుకొచ్చేసింది. ఇటు భార్యా వియోగం జగన్నాధరావుగారిని ఈ ప్రపంచంలో ఏకాకిని చేసేసింది.

ఆ యిద్దరికి అకస్మాత్తుగా ఏర్పడిన ఒంటరితనం భరించలేనిదిగా పరిణమించింది. ఆ యిద్దరూ తెలియకుండానే తమలో పేరుకుని బాధిస్తున్న ఆ ఏకాంతానికి దూరమవ్వడానికి ప్రయత్నిస్తూ దగ్గరయ్యారు.

అందుకే వాసవికి తండ్రి దగ్గర వున్న చనువు అపారమైనది. కానీ ఈ రోజు వాసవి చాలా విచిత్రంగా తన బాధని తనలోనే ఇముడ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నట్లుగా ఎంతో దగ్గరగా వున్న తనని దూరం చేసి ఒంటరిగా రోదిస్తోంది.

ఆడపిల్లలు ఎంత చిత్రంగా పెద్దరికాన్ని ఆపాదించుకుంటారు?

అంతవరకూ తమ ఎదుట ఏమీ తెలియనట్లు అల్పంగా అర్భకంగా కనిపిస్తూ ఒక్కసారే మానసికంగా పెరిగిపోవడం చాలా గమ్మత్తయిన విషయం.

"అమ్మా వాసవీ ఎదుట వున్న కన్న తండ్రిని పరాయివాడిలా భావిస్తున్నావా?" అన్నారు ఆవేదనగా.

వాసవి తల యెత్తి ఆయనవైపు చూసింది.

ఆ కళ్ళు లిప్తపాటు కలవరంగా కదిలాయి.

మరో క్షణంలో ఆమె చూపులు మధ్యాహ్న సూర్యకిరణాల్లా అతన్ని చురుక్కుమనిపించాయి.

ఆమె కళ్ళలో ప్రస్ఫుటమవుతోన్న కోపానికి కారణం ఆయన హృదయానికి అనూహ్యమయ్యింది.

"ఎందుకమ్మా అంత కోపం జగదీష్ నీ పట్ల ఏమైనా అనుచితంగా ప్రవర్తించాడా?" ఆయన గొంతులో లాలస రంగరించి పోసినట్లుంది.

వాసవి ఆయన ప్రశ్నకి అసహనంగా నిట్టూర్చింది.

"ఆయనలా ప్రవర్తించి వుంటే నాకింత బాధ కలిగేది కాదు డాడీ. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి భర్తగా అతి దగ్గరగా వచ్చిన మగవాడు మనకు నచ్చని పని చేసినా సమర్థించుకోగలం. కానీ కన్న తండ్రి చిన్ననాటినుండి కూతురి మనస్తత్వం తెలిసిన వ్యక్తే మోసం చేస్తే ఆ బాధ ఎలా వుంటుంది డాడీ" అంది ఆవేదనగా.

జగన్నాధరావుగారు దెబ్బతిన్నట్లు చూసారు కూతురివైపు. ఆయన కళ్ళలో గిరికీలు కొడ్తున్న కలవరపాటుని చూసి నిర్లక్ష్యంగా తలతిప్పుకుంది వాసవి.

"బేబీ ఏమంటున్నావు నువ్వు? కన్న తండ్రే మోసం చేసాడా? ఎవరి గురించమ్మా నువ్వు మాట్లాడేది? కొంపదీసి నన్ను గురించి కాదు కదా" అన్నారు ఆందోళనగా.

వాసవి మాట్లాడలేదు.

ఆమె మౌనాన్ని అంగీకారంగా అర్ధంచేసుకున్న జగన్నాధరావు గారిలో ఆందోళన యింకా అధికమయ్యింది.

"విషయం చెప్పకుండా ఈ ముసలి ప్రాణాన్ని ఇంకా హింసించడం నీకు ధర్మంకాదు బేబీ. ఏం చేసినా అది నీ బాగుకేనని ఏ బిజినెస్ చేసినా అది నిన్ను సుఖపెట్టడానికే అని అనుకున్న నన్నే మొసగాణ్ణంటున్నావా తల్లీ"

"ఎందుకు డాడీ చిన్న మాటకే అంత బాధపడిపోతారు. డబ్బు పిచ్చితో, ధనదాహంతో నన్నొక రెండోపెళ్ళివాడికి రహస్యంగా అంటగట్టడం మోసం కదా? వ్యక్తిత్వం వచ్చి అన్ని విషయాలని అభిమానంతో ఆలోచించే నాలాంటి ఆడపిల్లకి ఆ విషయం చెప్పకుండా దాచి పెళ్ళి జరిపించడం నేరంకాదా? ఈ చిన్న మాటే మీ గుండెలో అంత అలజడి లేపితే ఆ నిజం తెలిసిన రోజు మీ కూతురు ఎంతగా షాక్ తింటుందో ఆలోచించలేకపోయారా?" అంది వాసవి సూటిగా తండ్రికేసి చూస్తూ.

జగన్నాధరావుగరు తెల్లబోయినట్లు చూసారు కూతురివైపు. దాదాపు అతని వంట్లో వున్న రక్తకణాలన్నీ చచ్చుబడిపోయినట్లు ఆయన ముఖం పాలిపోయింది.

తండ్రి ముఖం వేపు హేళనగా చూసింది వాసవి.

"ఏం డాడీ? ఈ నిజం నాకు తెలిసిపోవడం మీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది కదూ. మీ యిద్దరూ కలిసి యింత చక్కగా ప్లాన్ చేయడం ఎవరికీ తెలియదనుకున్నారు కదూ" అంది కటువుగా.

జగన్నాధరావుగారు కాస్సేపు జవాబు చెప్పలేదు. దీర్ఘమైన నిట్టూర్పు ఒకటి ఆయన గుండెలోంచి బయటికి వెలువడింది.

"వాసవీ నీకెలా నచ్చచెప్పాలో నాకు అర్ధంకావడంలేదు. నువ్వు ఈ విషయంలో నన్నేవిధంగా నిందించినా నేను బాధపడను. నిజంగానే నేను ఆ విషయాన్ని నీకు చెప్పకుండా దాచాను. కానీ అలా ఎందుకు చేసానో అర్ధం చేసుకోకుండా ఆవేశపడటం అనుభవమెరుగని నీ వయసు చేసే తొందరపాటు మాత్రమే. చెప్పు బేబీ, ఏ కన్న తండ్రయినా కూతురి మేలే కోరుకుంటాడు గానీ నాశనం కాదు. ఆ సంగతి నువ్వు గ్రహిస్తే చాలు" అన్నారు చాలా నిదానంగా.

వాసవి తండ్రివేపు ఆవేశంగ్గా చూసింది.

"మేలు. నా మనస్తత్వం మీకు బాగా తెలుసు. నా వ్యక్తిత్వం గురించి కూడా మీరు ఎరుగుదురు. ఇలాంటి నిజాన్ని కప్పిపుచ్చడాన్ని నేను తేలిగ్గా తీసుకుంటానని మీరెలా అనుకున్నారు?"

జగన్నాధరావుగారు వాసవి వైపు చూసి చిన్నగా నవ్వారు.

ఆ నవ్వు చూసి వాసవి మరింత రెచ్చిపోయింది.

"ఈ పెళ్ళి చెల్లదు. నేను కోర్టుకి వెడతాను. మీరిద్దరూ కలిసి చేసిన ఈ మోసాన్ని బయట పెడతాను" అంది వాసవి ఆవేశంగా.

"మంచిదే దానివల్ల నష్టం ఎవరికో బాగా ఆలోచించి ఆ పనిచెయ్యి. కానీ నీ గొయ్యి నువ్వు త్రవ్వుకుంటూ ఆ గోతిలో నీకన్న తండ్రిని కూడా పూడ్చి పెడతానంటే కాదంటానా? కానీ ఎటొచ్చి ఇందులో జగదీష్ కొచ్చే నష్టం ఏమీ వుండదు" అన్నారు జగన్నాధరావుగారు గంభీరంగా.

"బెదిరిస్తున్నారా?" అంది వాసవి ఉక్రోషంగా.

"కన్న కూతుర్ని బెదిరించేంత నీచుణ్ణికాదు నువ్వలా అనుకోవడం నా దురదృష్టం" అన్నారు జగన్నాధరావుగారు బాధగా.

వాసవి తండ్రివేపు నిశితంగా చూసింది.

అతని ముఖంలో ప్రస్ఫుటమౌతోన్న బాధని నటనగా భావించలేకపోతుందామె. ఆయన్ని బాధపెట్టాల్సివచ్చినందుకు కూడా ఆమె హృదయం కుమిలిపోతోందొక పక్క. కానీ..కాని ఆయన తనకి ఈ నిజాన్ని దాచడాన్ని మాత్రం క్షమించలేకపోతోందామె మనసు.

"ఎందుకు ఈ నిజాన్ని నా నుండి దాచారు? నాకెందుకు ఈ విషయాన్ని చెప్పాల్సిన అవసరం వుందని భావించలేదు. నా మనస్తత్వం మీకు తెలిసీ.. ఇలా చేసారంటే" అంటూ ఆగింది వాసవి.

జగన్నాధరావుగారు నిస్పృహగా నవ్వారు.

"నిజమే బేబీ చెప్పి వుండాల్సిందే అతనికి అంతకు ముందొక వివాహం జరిగినా ఆమె చనిపోవడం, ఆమెవల్ల అతనికి పిల్లలులేకపోవడం అతనికి పెద్దగా వయసు మీరకపోవడం చిన్న వయసులోనే కోట్ల రూపాయల్లో బిజినెస్ చెయ్యగల నైపుణ్యం కలిగివుండటం ఇవన్నీ నాకు నచ్చిన ప్లస్ పాయింట్లు. ఇన్ని సలక్షణాల్ని అతనికి ముందొక పెళ్ళి జరిగిందనే సాకుతో త్రోసి పారెయ్యడం నా దృష్టిలో సమంజసమనిపించలేదు. అంతేకాదు, అతనికి నీ గురించి మాత్రం చెప్పానా?" అన్నాడు జగన్నాధరావుగారు.

"నా గురించా?" వాసవి ఆశ్చర్యంగా అడిగింది.

"అవును నీ గురించే. వివాహానికి ముందు నీకొక ప్రేమ కథ వుందన్న విషయం అతన్నుంచి దాచినప్పుడు మగవాడు అతనికి అంతకు ముందొక వివాహం జరిగి విధివైపరీత్యాన అతను భార్యని పోగొట్టుకోవడం నేరమా?" అన్నారాయన సూటిగా.

వాసవి ముఖం తెల్లగా పాలిపోయింది. నొక్కిపట్టిన అవమాన భారంతో ఆమె కళ్ళు ఎర్రబారాయి.

జగన్నాధరవుగారు వాసవివైపు చూసారు. తలదించుకుని కూర్చున్న కూతురి హృదయంలో చెలరేగుతోన్న భావసంచలనం ఆయనకి అర్ధమవుతోంది.

"బేబీ" అనునయంగా పిల్చారాయన.

వాసవి బదులు పలకలేదు.

"నిన్ను దెప్పడానికి, హేళన చేయడానికి గతాన్ని ఎత్తలేదు నేను. ప్రతి మనిషికి గతం వుంటుంది. చెట్టుకు వేరులా వెలుగుకి నీడలా దానికి దూరం కావడం ఎవరి వల్లా కాదు. ప్రస్తుత మన జీవన గమనానికి అడ్డురాని గతానికెందుకమ్మా అంత ప్రాధాన్యత యివ్వడం. నీ భర్త మంచివాడు. నిన్ను ప్రేమిస్తున్నాడు. నీకు గౌరవాన్ని యిస్తున్నాడు. అది చాలదా నీకు? ఆలోచించు. ఇంకా నీ మనసుకు మేం చేసింది తప్పుగానే గోచరిస్తే తర్వాత నువ్వేం శిక్షవేసినా నేను అందుకు సిద్ధమే" అన్నారాయన గంభీరంగా.

వాసవి నుండి కాస్సేపు మౌనమే శరణ్యమయ్యింది.

"ఏం బేబీ, మాట్లాడవూ?" జగన్నాధరావుగారు రెట్టించినట్లు అడిగారు.

వాసవి లేచి నిలబడింది.

ఆమె రెండడుగులు గుమ్మం వైపు వేసి నిలబడింది.

జగన్నాధరావుగారు అలానే చూస్తూ కూర్చున్నారు.

వాసవి వెనుతిరగకుండానే ''క్షమించండి డాడీ'' అంటూ రివ్వున వెళ్ళిపోయింది.

జగన్నాధరావుగారు కూతురివైపు ఆశ్చర్యంగా చూసారు.

ఆ తర్వాత సన్నని చిరునవ్వొకటి అతని గుబురు మీసాలచాటున తొంగి చూసింది.

''పిచ్చిపిల్ల'' అంటూ ఆయన పెదవులు గొణిగాయి.

జగన్నాధరావుగారు డిన్నర్ టేబుల్ దగ్గర కూర్చున్నారు.

వాసవి మౌనంగా వడ్డిస్తోంది.

ఆయన కూతురు ముఖంలోకి దీక్షగా చూసి ''జగదీష్ యింట్లో లేరా?'' అంటూ అడిగారు.

''ఉన్నారు డాడీ'' అంది వాసవి నెమ్మదిగా.

''మరి అతన్నికూడా పిలువమ్మా''

''మేం తర్వాత భోంచేస్తాంలే డాడీ'' అంది ప్లేట్లో పెరుగావడ వడ్డిస్తూ.

''నా టేస్టులు నువ్వు మరిచిపోలేదు బేబీ. పెరుగావడంటే నాకు ప్రాణం. కానీ అది చేయడం అందరివల్లా కాదు. అది సరే నాకిష్టమయిన పదార్థం ప్లేట్లో పెట్టి తినకుండా ఎంతసేపు కూర్చోమంటావు?'' అన్నారాయన చిన్నపిల్లాడిలా అమాయకంగా చూస్తూ.

వాసవి ఆయన మాటలకి నవ్వింది.

''ఇప్పుడు తినొద్దని ఎవరన్నారు?'' అంది.

''ఒక్కణ్ణీ కూర్చుని ఎప్పుడయినా భోంచేసానా? నలుగురితో కలిసి విషం త్రాగినా అమృతంలా వుంటుంది నాకు. ప్లీజ్ మీ యిద్దరూ కూడా కూర్చోండి'' అన్నారాయన బ్రతిమాలుతున్నట్లు.

వాసవి తండ్రివైపు ఒక్క క్షణం అదోలా చూసి ''సరే'' అంటూ లోనికెళ్ళింది.

వాసవి వెళ్తూంటే జగన్నాధరావుగారు నవ్వుకున్నారు.

''వాళ్ళిద్దరి మధ్యా సయోధ్య ఇంకా కుదిరినట్లు లేదు. తనిప్పుడు బలవంతం చేయకపోతే వాళ్ళిద్దరూ పస్తుపడుకోవడం ఖాయం'' అనుకున్నారాయన.

మరో పదినిముషాల్లో వాసవి ఆ వెనుక జగదీష్ రావడం గమనించి తేలిగ్గా నిట్టూర్చింది ఆయన హృదయం.

''త్వరగా రావాలి అల్లుడూ... ఈ రోజు డిషెస్ అన్నీ స్పెషల్సే'' అన్నారు మరో డిష్ మూత తీసి అందులోని గుత్తొంకాయ కూర వేపు చూస్తూ.

''మీరు హాస్పిటల్నుండి రావడం వల్ల అలా అనిపిస్తోంది. మన యింట్లో ఎప్పుడూ ఇవి మామూలే'' అన్నాడు జగదీష్ చెయ్యికడుక్కుని నాప్‌కిన్‌కి తుడుచుకుంటూ.

''అఫ్‌కోర్స్'' అన్నారు జగన్నాధరావుగారు నవ్వుతూ.

''బట్, మీరు మీ డైట్ కంట్రోల్ సంగతి మరచిపోకూడదు'' అంటూ టేబుల్ ముందు కూర్చున్నాడు జగదీష్

వాసవి అతనికి వడ్డిస్తోంటే ''నువ్వూ కూర్చో'' అన్నాడు.

వాసవి తనకి కూడా వడ్డించుకుంది.

జగన్నాధరావుగరు పెరుగావడ కొంచెం తిని "బ్రహ్మాండం. చాలా ఏళ్ళ క్రితం ఇంత బాగా చేసిన వంటకాలు తిన్నాను. తిరిగి యిప్పుడు"

"అది చేసింది ముత్తు కాదు" అంది వాసవి మెల్లిగా.

"మరి.. నువ్వా?" ఆశ్చర్యంగా అడిగాడూ జగదీష్.

వాసవి 'కాదన్నట్లు' తల అడ్డంగా తిప్పింది.

"మన కొత్త వంటమనిషి పరిమళ"

"కొత్త వంటమనిషి ఎప్పుడొచ్చింది?"

"పొద్దుటే" అంది వాసవి పొడిగా.

ముందు రాత్రి ఆ యిద్దరికీ ఘర్షణ జరిగాక తిరిగి మాట్లాడుకోవడం అప్పుడే జగదీష్ చేసిన అపరాధం ఏమీలేదని ఆమె అంతరంగం ఒప్పుకున్నా అతనితో ఫ్రీగా మాట్లాడాలంటే ఆమెలో ఏదో జంకు కలుగుతోంది. ఆ విషయాన్ని తేలిగ్గా కనిపెట్టారు జగన్నాధరావుగారు.

"ఏది ఏమైనా మంచి వంటమనిషే దొరికింది అల్లుడు. ఆ పెరుగావడ కొంచెం తిను. ఆ విషయం నీకు బాగా తెలుస్తుంది" అన్నారు జగన్నాధరావుగారు.

జగదీష్ కొద్దిగా తిని "అబ్బ! కారం" అన్నాడు గడగడా మంచి నీళ్ళు త్రాగుతూ.

"కాస్త మిరపకాయలు ఎక్కువయ్యాయి. అయితేనేం వాటి ఘాటు కూడా పసందుగానే వుంది" అన్నారాయన చమత్కారంగా.

వాసవి తండ్రి మాటలకి చిన్నగా నవ్వింది.

కూతురి ముఖంలో నవ్వు చూసి ఆయనలో హుషారు పెరిగింది.

"ఎవరో ఈ వంటమనిషి. మంచి టేస్టున్నది. ప్రత్యేకించి పండుమిరపకాయలు వెయ్యడం వల్ల ఆవడకి ఎంతో అందం వచ్చింది. వాటి సువాసన.. అందం ఆ పెరుగులో కలిసి.. నోరూరిస్తోంది" అన్నాడు తమాషాగా.

జగదీష్ మామగారి వైపు చిత్రంగా చూసాడు.

ఆ తర్వత చిన్నగా నవ్వుతూ "హాస్పిటల్ నుండి వచ్చాక మీలో రసాత్మక దృష్టి పెరిగినట్లుంది. నిజమే మిరపకాయ మహా అందమైందే కానీ గుణం.... చాలా ఘాటుకదూ" అన్నాడు వాసవివైపు క్రీగంట చూస్తూ.

వాసవి అతను తననుద్దేశించి అలా అంటున్నాడని గ్రహించి తలదించుకుంది.

జగన్నాధరావుగారు కూడా ఆ విషయాన్ని గ్రహించారు.

"సరిగా అబ్జర్వు చేస్తే ఒకలాంటి స్వీటు వుంటుంది అల్లుడూ. ఆ టేస్టు తెలిస్తే ఘాటు గురించి పట్టించుకోవడం మానేస్తావు" అన్నారు నవ్వుతూ.

అందులోని అంతరార్థం గ్రహించి జగదీష్ చిన్నగా నవ్వుతూ "నాకింకా అంత అనుభవంలేదులెండి" అన్నాడు.

"పచ్చిమిర్చికోసం యింత డిస్కషనా?" అంది వాసవి అమాయకంగా ఇద్దరివేపూ చూస్తూ.

"ఏదో కాలక్షేపం. అద్సరే. నాకు హైదరాబాదుకో ఫ్లైట్ టిక్కెట్ బుక్ చేయించు అల్లుడూ" అన్నారు జగన్నాధరావుగారు.

"**అప్పుడే ఏం తొందర.** కొన్నాళ్ళు రెస్టు తీసుకోండి" అన్నాడు జగదీష్ మామగారితో.

"ఇంకేం రెస్టు. ఇప్పటికే బోర్ కొట్టింది. అవతల బిజినెస్ వ్యవహారాలు ఎలా వున్నాయో తెలియదు" అన్నారాయన ఆందోళనగా.

"ఇంకా చికాకులు దేనికి డాడీ" అంది వాసవి.

"నీకు తెలీదమ్మా మనిషి మట్టిలో కలిసిపోయేవరకు ఏదో ఒకటి చేస్తూనే వుండాలి అన్నారాయన నవ్వుతూ.

వాసవి మాట్లాడలేదు.

"మీ యిష్టం కాని. మీకెప్పుడు రావాలనిపిస్తే అప్పుడు వస్తుండండి. ఇది మీ యిల్లు ఆ సంగతి మరచిపోవద్దు" అన్నాడు జగదీష్ చెయ్యి కడుక్కుంటూ.

"ఆ సంగతి మళ్ళీ నువ్వు చెప్పాలా? అల్లుడూ" అన్నారాయన నవ్వుతూ.

వాసవి కూడా లేచి డైనింగ్ రూమ్ పక్క కర్టెను వెనుక నిలబడ్డ కొత్త వంటమనిషి పరిమళవేపు చూస్తూ "నీ వంటని అందరూ మెచ్చుకున్నారు. కొంచెం కారం తగ్గించు" అంది.

"సరేనమ్మా" అంది పరిమళ పరాకుగా.

ఆమె చూపులు అప్పుడే బయటకి వెళ్తోన్న జగన్నాధరావుగార్ని తీక్షణంగా, దీక్షగా చూడటం ఎవరి దృష్టిలో పడలేదు.

# 23

పరిమళ వచ్చాక వాసవికి కాస్త బాగానే కాలక్షేపం అవుతోంది. పరిమళ తెలుగు, తమిళం అనర్గళంగా మాట్లాడగలదు. పైగా మాటకారి కూడా.

ఆ లంకంత యింట్లో జగదీష్ అటు వెళ్ళగానే వాసవికి కాస్త తోడుగా మిగిలేది శంకర్ మాత్రమే.

పరిమళ మంచి వంటగత్తే కాకుండా ఇంటిని శుభ్రంగా పెట్టడంలో కూడా అందెవేసిన చెయ్యి.

ఆమె వయస్సు నలభయికి యాభయికి మధ్యలో వుండొచ్చు.

మనిషి పరిస్థితుల వల్ల దెబ్బతిన్న గొప్పింటి మనిషిలా, హుందాగా వుంటుంది చిరిగిన చీరకట్టినా నడకలో మహారాణి ఠీవి కనిపిస్తుంది.

వాసవికి ఆమెను చూస్తే ఏదో యిష్టంగా అనిపించింది.

పరిమళకీ అంతే. పని చకచకా ముగించి వాసవి గదిలోకి వచ్చి కూర్చుంటుంది. "నిన్ను చూస్తుంటే నాకు ఏనాడో నా చేతుల్లోంచి జారిపోయిన కూతురు గుర్తొస్తుంది తల్లీ" అంటుంది బాధగా.

"పోనీ నన్నే నీ కూతురిగా భావించుకో" అంది వాసవి నవ్వుతూ. పరిమళ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"నిజంగానా తల్లీ" అంది సంతోషంగా.

"ఏం, అంత నమ్మలేని విషయం చెబుతున్నానా? నాకూ **తల్లి**లేదు నిన్ను చూస్తుంటే నాకు మాతృభావమే కలుగుతుంది" అంది వాసవి.

పరిమళ గబుక్కున వాసవి చేతులు పట్టుకుని ఆత్రుతగా అడిగింది.

"మీ అమ్మగారు చనిపోయారా? ఏం జరిగిందావిడకి?"

"ఇప్పుడు కాదు. అప్పుడే పదేళ్ళు గడిచిపోయాయి. హార్ట్ ట్రబుల్" అంది వాసవి.

పరిమళ కళ్ళలో నీటిపొర చూసి విచలితయ్యింది వాసవి.

"నువ్వు బాధ పడుతున్నావేంటీ?" అంది ఆశ్చర్యంగా.

పరిమళ తడబాటుగా కళ్ళు తుడుచుకుంది."ఏం లేదు. ఈ సృష్టిలో తల్లికి బిడ్డ, బిడ్డకి తల్లిలేకపోవడం ఎంత బాధాకరమైన విషయమో నాకు అనుభవం మీద తెలుసు. అందుకే మీకు "అమ్మ" లేకపోవడం నాకు బాధ కలిగించింది" అంది పరిమళ.

వాసవి నిట్టూర్చింది.

"ఆ బాధ నేను ప్రతిక్షణం అనుభవిస్తూనే వున్నాను."

పరిమళ బాధగా చూసింది వాసవి వైపు.

"అదిసరే నీ కూతురు ఎలా తప్పిపోయింది. ఆమె గురించి నీకేమీ తెలియదా? అసలు బ్రతికుందా?" అంది వాసవి.

పరిమళ కళ్ళు రెపరెపలాడాయి.

"అంత మాటనకు తల్లీ. ఇంతకాలం నేనూ నీలాగే ఏదేదో అనుకున్నాను. ఈ మధ్యనే తెలిసింది. నా బిడ్డ సలక్షణంగా బ్రతుకుతోందని" అంది.

"ఐతే నీ కూతురి దగ్గరకు వెళ్ళొచ్చుగా నువ్వు"

పరిమళ నిస్పృహగా నవ్వింది.

"వెళ్ళొచ్చు. వెళ్ళినా మా యిద్దరి మధ్యా శారీరక దూరం తగ్గుతుందేమోగానీ మానసికంగా తరగదు. ఆమె ఆకాశంలో వుంది. నేను పాతాళంలో వున్నాను. ఆమె నన్ను తల్లిగా గుర్తించలేదనే వేదనలో ఆమెకు దూరంగా బ్రతుకుతున్నాను."

"నీ కూతురు అంత అహంభావా? కన్నతల్లినే గుర్తించలేనంత గర్విష్ఠా?"

పరిమళ కాదన్నట్టు తల అడ్డంగా ఆడించింది.

"కాని.. నాకే సిగ్గుగా వుంది. ఆమె తల్లినని చెప్పి ఆమె యింట్లో ప్రవేశించడానికి. ఇన్నాళ్ళూ ఆమె ఏమయిందోనన్న ఆవేదనతో బ్రతికాను. ఈ రోజు ఆమె సుఖంగా, సర్వసౌభాగ్యాలతో అలరారుతోందని తెలిసికూడా ఆమె యింట్లో తల్లిగా ప్రవేశించలేకపోతున్నందుకు బాధపడుతున్నాను. ఇది మరో నికృష్టమైన స్థితికదూ" అంది బాధగా.

వాసవి జాలిగా చూసింది."మీ యిద్దరూ కలిసే మంచి క్షణం తప్పకుండా వస్తుంది. అంత వరకూ మా యింట్లో హాయిగా వుండు. మరీ బాధకలిగితే నన్నే నీ కూతురిగా భావించు" అంది వాసవి నవ్వుతూ.

పరిమళ వాసవివైపు సంభ్రమంగా చూసింది.

శంకర్ లోనికి రావడంతో వాళ్ళ సంభాషణ ఆగిపోయింది.

"పరిమళమ్మా నిన్ను ముత్తు పిలుస్తోంది" అంటూ వచ్చాడు వాడు.

పరిమళ లేచి వెళ్ళిపోయింది.

వాసవికి అప్పుడే మగతగా నిద్రపట్టింది. కాసేపటిలో ఆమెకి వళ్ళంతా బరువయి పోయినట్లనిపించింది. అది నిద్రో, కలో తెలియని స్థితిలో ఆమె చాలాసేపు పెనుగులాడింది. మరి కాసేపటికి ఆమెకి పూర్తిగా మెలుకువ వొచ్చేసింది.

ఆమె మెదడు పనిచేయటం ప్రారంభించింది.

ఎవరో తనని బలవంతంగా అదిమిపెడ్తోన్న విషయం ఆమెకి అర్థమయ్యింది.

చుట్టూ కాటుక చీకటి.

కరెంటు పోయిందా? తను బెడ్‌లైట్ వేసి పడుకుందే ఏం జరుగుతుందసలు?

వాసవి బలంకొద్దీ పెనుగులాడుతోంది.

ఆమె శక్తికొద్దీ అరచిన అరుపు గొంతులో లుంగచుట్టుకుపోయి బయటకి రావడంలేదు.

ఎవరో తన ముఖంలో ముఖం పెట్టి పెదవులపై...

వాసవిలో విపరీతమైన కంపరం పుట్టుకొచ్చింది. ఆమె తనలోవున్న ప్రతి అణువులోని శక్తిని సంఘటితం చేసి తనని నొక్కిపెడ్తోన్న ఆకారాన్ని బలంగా కొట్టింది.అంతే

ఎవరో మంచం దూకిన చప్పుడు. తలుపు తెరుచుకున్న శబ్దం. వాసవి భయకంపితురాలై లేచి నిలబడింది.

మెట్లమీద అలికిడికి నిద్రరాక దొర్లుతున్న పరిమళ కిటికీలోంచి అటు చూసింది.

ఆమె కళ్ళు ఆశ్చర్యంతో విశాలమయ్యాయి.

ఆ వెంటనే మేడమీదనుండి వినిపించిన కేకకి ఆమె గబగబా లైటు వేసి మేడమీదకి వచ్చేసింది.

ఆమె తలుపు తీసి స్విచ్ ఆన్ చేసి గోడకి చేరబడి నిలువునా వణికిపోతున్న వాసవిని చూసి నిరుత్తురాలయింది.

వాసవి నోట్లోంచి మాట రావడంలేదు.

మనిషి గజగజలాడి పోతున్నది.

ఆమె వంటిమీద చీర అస్తవ్యస్తంగా చెదిరిపోయింది.

"ఏం జరిగిందమ్మా?"

పరిమళ ప్రశ్నకి వాసవి గబుక్కున ఆమె కౌగిట్లో వాలిపోయి బిగ్గరగా ఏడ్చింది.

పరిమళ వాసవిని అక్కున జేర్చుకుని "ఏం జరిగింది తల్లీ ఎందుకిలా భయపడుతున్నావ్" అంది అనునయంగా. ఆమె చేతులు వాసవిని ఆర్తిగా తడుముతున్నాయి. వాసవికి మాటరావడంలేదు.

భయంతో ఆమె పరిమళని గట్టిగా చుట్టుకుపోతోంది.

పరిమళ ఆమెని మెల్లిగా మంచమ్మీద కూర్చోబెట్టి మంచినీళ్ళు తెచ్చి "ముందు కాసిని నీళ్ళు త్రాగమ్మా" అంది. వాసవి గడగడా త్రాగేసింది. మరి కాసేపటికి కాస్త మాటొచ్చిందామెకి.

"పరిమళా నన్నొదిలి వెళ్ళకు" అంది భయంగా.

పరిమళ వెళ్ళనన్నట్లు తలవూపి "ఏం జరిగింది తల్లీ" అంది లాలనగా. వాసవికి ఆ సంఘటన తలచుకోడానికే భయంగా వుంది.

"ఎవరో... ఎవరో నా గదిలోకొచ్చి నన్ను - నన్ను" అంది భయంగా.

"కల వచ్చిందేమో?" అంది పరిమళ.

వాసవి కాదన్నట్లు తల అడ్డంగా వూపింది.

"కాదు నేను వేసిన బెడ్‌లైటు తీసేసారు. తలుపు తీసుకుని వెళ్ళినట్లయింది" అంది వాసవి.

పరిమళ అర్థమయినట్లు తల పంకించింది.

"మరి అయ్యగారేరి? ఇంకా రాలేదా?" అంది పరిమళ.

"తెలియదు" అంది వాసవి.

పరిమళ ఆశ్చర్యంగా చూసింది.

"అయ్యగారిక్కడ పడుకోరా?" అంది అనుమానంగా ఆ ఆరడుగుల నలుచదరపు మంచాన్ని చూస్తూ.

వాసవి తల దించుకుంది.

ఒక క్షణం ఏం జవాబు చెప్పాలో తోచలేదామెకు.

"ఆయన పనులుండి అర్ధరాత్రులు వచ్చినప్పుడు నన్ను డిస్టర్బ్ చెయ్యడం యిష్టముండక క్రిందనే పడుకుంటారు" అంది.

పరిమళ "మీరేమనుకోనంటే ఒకమాట. ఒకవేళ అయ్యగారే" అంటూ నవ్వింది.

వాసవి పరిమళవైపు ఆశ్చర్యంగా చూసి "ఛ ఆయనకలా పారిపోవాల్సిన అవసరం ఏముంది?" అంది.

"అదీ నిజమే కానీ నేను చూసిందెవర్నీ?" అందామె తనలో తనే అనుకుంటున్నట్లు.

వాసవి ఆశ్చర్యంగా చూసింది పరిమళవైపు.

"నువ్వు చూసావా? ఎవర్ని?" అంది.

"ఎవరో చీకట్లో సరిగ్గా కనిపించలేదు. నాకు ఆస్థమావల్ల రాత్రుళ్ళు సరిగ్గా నిద్రపట్టదు. ఊపిరాడనట్లు కిటికీ దగ్గర నిలబడ్డాను. బయట మెట్లగుండా ఎవరో గబగబా దిగుతున్నట్లయింది. ఇంతలో మీ అరుపు వినిపించింది. గబగబా పైకి వచ్చేశాను" అంది పరిమళ.

వాసవి కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"అయ్యగారయితే అలా బయట మెట్లగుండా దిగరు. హాల్లోంచి మెట్లున్నాయిగా" అంది.

"అయితే ఎవరైవుంటారు?" అంది పరిమళ.

వాసవి మాట్లాడలేదు.

"అయ్యగారిని పిలవమంటారా?" అంది పరిమళ.

"వద్దు. నాకు భయం" అంది వాసవి పరిమళ చేతులు గట్టిగా పట్టుకుని.

"అయితే మీరూ నాతో క్రిందికి రండి. అక్కడికే వెళ్ళి సంగతి చెబుదాం" అంది

వాసవి పరిమళని గట్టిగా పట్టుకుని మెట్లు దిగింది.

జగదీష్ రూం తలుపు లోపలివైపు గడియ వేసుంది.

కిటికీలోంచి బెడ్‌లైట్ కాంతి సన్నగా కనిపిస్తోంది.

"ఆయన వున్నట్లున్నారు" అంది వాసవి గొణుగుతున్నట్లు.

పరిమళ ముందుకెళ్ళి మెల్లిగా తలుపు తట్టింది.

కాసేపటికి కళ్ళు నులుపుకుంటూ తలుపు తీసి వాసవి వైపు, పరిమళ వైపు ఆశ్చర్యంగా చూసాడు జగదీష్.

ఆ వెంటనే ఏంటిలా వచ్చారు? ఏం జరిగింది?" అన్నాడు ఆందోళనగా.

వాసవి మాట్లాడలేదు. ఆమె భయం పూర్తిగా తగ్గలేదు.

పరిమళే జరిగిన సంగతులు జగదీష్‌తో చెప్పింది.

జగదీష్ ఆశ్చర్యపోయినట్లు చూసి "నేనసలు పైకి రానేలేదు" అన్నాడు.

వాసవిలో భయం రెట్టింపయింది. "అయితే ఆ వచ్చింది..." అంది.

"ముమ్మాటికీ యిది సావిత్రి పనే" అన్నాడు జగదీష్ తల పంకిస్తూ.

"సావిత్రా?" అంది వాసవి ఆశ్చర్యంగా.

జగదీష్ వాసవి వైపు చూసి "అవును నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇదంతా సావిత్రే చేస్తోంది. నిన్ను పెళ్ళి చేసుకోవడం తనకిష్టంలేదు. అందుకే ఇలా సాధిస్తోంది" అన్నాడు.

"సావిత్రెవరు?" అంది వాసవి.

"ఓహ్! నీకు ఆ సంగతి కూడా తెలియదుగా? సావిత్రి నా మొదటి భార్య" అన్నాడు జగదీష్.

వాసవికి షాక్కొట్టినట్లయింది.

"ఆమె.. ఆమె.. చనిపోయిందిగా" అంది ఆశ్చర్యంగా.

"అవును చచ్చే సాధిస్తున్నది. తన స్థానాన్ని నువ్వాక్రమించావనే కసితో దయ్యమై.."

"నో! నో! అయ్‌కాంట్ బిలీవిట్" అంటూ అరిచింది వాసవి.

"ఆ సంగతి నాకు తెలుసు. కానీ నేనెంత చదువుకున్నా జరుగుతున్న వాటిని కాదనలేను. ఆ రోజు వర్షం వచ్చిన రోజుకూడా ఆ డెవిలే నిన్ను భయపెట్టింది. ఎప్పుడూ మనిద్దరం ఒంటరిగా వుంటే సహించలేక మన సమాగానికి ఏదో ఒక రకంగా అడ్డుపడటం నేను గమనిస్తూనే వున్నాను. అందుకే నేను కనీసం నీ గదిలోకి కూడా రాకుండా ఇక్కడ పడుకుంటున్నాను" అన్నాడు జగదీష్.

వాసవి తెల్లబోయి చూసింది.

పరిమళ ఆ సంగతులన్నీ విచిత్రంగా వినడం జగదీష్ గమనించాడు.

"నువ్వెళ్ళి పడుకో. వాసవి ఈ రాత్రి యిక్కడే పడుకుంటుంది" అన్నాడు పరిమళని వెళ్ళమన్నట్లు.

పరిమళ వెళ్ళిపోయింది.

వాసవి అతన్ననుసరించి గదిలోకి వెళ్ళింది మౌనంగా."పడుకో. ఇప్పుడేమీ ఆలోచించకు" అంటూ ఆమెకి బ్లాంకెట్ కప్పి మరో మంచమ్మీద కెళ్ళి పడుకున్నాడు. అతని కళ్ళు సీలింగ్ వైపు చూస్తూ ఆలోచిస్తున్నాయి.

పరిమళ మెల్లిగా వాసవి పక్కకొచ్చి నిలబడింది. ఆ సంఘటన జరిగిన రోజునుండి పరిమళ వాసవి కోరిక మీద వాసవి గదిలోనే పడుకుంటుంది.

రాత్రి వాసవికి నిద్రవచ్చేవరకూ పరిమళ దేశంలో తను గడించిన అనుభవ జ్ఞానాన్ని, ఎన్నడూ వూహించని సంఘటనలు చెప్పి నవ్విస్తుంటుంది.

కష్టాల్ని సహితం చాలా తమాషాగా నవ్వొచ్చేటట్లు చెప్పే పరిమళంటే వాసవికి తెలియని అభిమానం ఏర్పడింది.

వాసవి ఏదో పుస్తకం చదువుతుంటే పరిమళ మౌనంగా తన పక్కపరచుకుని కూర్చుంది.

రాగానే గలగల మాట్లాడే పరిమళ అలా మౌనవ్రతాన్ని పాటించడం ఆశ్చర్యాన్ని కలిగించింది వాసవికి.

తను చదువుతోన్న పుస్తకాన్ని రాక్‌లోకి విసిరి "అదేంటలా వున్నావ్?" అంది.

పరిమళ మాట్లాడలేదు.

"నిన్నే పరిమళా" అంది వాసవి.

"ఏం లేదమ్మా" అంది మామూలుగా లేవడానికి ప్రయత్నిస్తూ.

"అదేంకాదు. నువ్వేదో దాస్తున్నావు. మీ అమ్మాయి గుర్తొచ్చిందా?" అంది నవ్వుతూ."

"లేదమ్మా మీ గురించే ఆలోచిస్తున్నాను." అంది.

"నా గురించా?" నవ్వింది వాసవి.

"ఏం, మీ గురించి ఆలోచించకూడదా? ఎంత పనిమనిషినయినా మీ ఉప్పు తింటున్నదాన్ని. ఆ అభిమానంతో విశ్వాసంతో మీ కష్టాలు నావే అనుకుని ఆలోచించటం తప్పా?" అంటూ ఎదురు ప్రశ్న వేసింది పరిమళ.

"తప్పేం లేదు. ఇంతకీ నాకు తెలియకుండా నా కష్టాలు నీకెలా తెలిశాయి" అంది వాసవి.

"ఏది కష్టమో ఏది నష్టమో తెలియని పిల్లలు మీరు. సుఖపడటం లేదన్న సంగతి నాకు బాగా తెలుసు" అంది పరిమళ ఖచ్చితంగా.

"ఇప్పుడింత అర్జెంటుగా నాకొచ్చిన ఆపదేమిటి?"

"మిమ్మల్ని చూస్తుంటే కనీసం ఆ వయసుకు తగ్గ గడుసుతనంకూడా లేదనిపిస్తోందమ్మా. లేకపోతే పెళ్ళయి ఇన్నాళ్ళయినా ఈ గదిలో వనవాసం - ఆ సీతమ్మవారు వనవాసం చేసినా భర్తతో కలిసి చేసింది. ఆ ఊర్మిళ తల్లి భర్తనెడబాసివున్నా కనీసం ఆ బాధ తెలియకుండా నిద్రలోనన్నా గడిపింది. కానీ, ఇదేం విచిత్రం ఒక్క యింట్లో వుంటూ పై గదిలో మీరు, క్రింద గదిలో ఆయన నేనెక్కడా ఇంత తమాషా చూడలేదు. పైగా నాకేం కష్టం వచ్చిందని అడుగుతున్నారు" అంది పరిమళ నిష్ఠూరంగా.

వాసవి ముఖం చిన్నబోయింది.

"ఇంతంత పెద్ద విషయాల్లో జోక్యం చేసుకుంటున్నానని అనుకోపోతే కనీసం ఎప్పుడయినా గట్టిగా ఈ కథకి అర్థం ఏమిటని అయ్యగారిని ఎప్పుడయినా నిలవేసారా?"

పరిమళ ప్రశ్నకి వాసవి జవాబు చెప్పలేదు.

పెళ్ళయిన ఈ ఆర్నెల్లూ తామరాకు మీద నీటి బిందువులా అంటీ ముట్టకుండా కాలక్షేపం చేస్తున్నారు. ఆయన రోజుకో కథ చెబుతుంటే వింటున్నారు అంతేగా?"

"పరిమళా"

"కోపం వస్తుందనే చెప్పకూడదనుకున్నాను. కానీ ఆ ముత్తు జరిగిన ఘోరం చెబుతుంటే విని సహించలేక తెలిసి మీకు చెప్పకుండా వుండలేకపోతున్నాను. ఇన్ని తెలిసి యిక ఈ యింట్లో పనిచెయ్యలేను" అంది పరిమళ బాధగా.

వాసవి ఆశ్చర్యంగా చూసింది.

"ముత్తు ఏం చెప్పింది?" వాసవి సూటిగా అడిగింది.

"ఒద్దులెండి అయ్యగారిమీద ఈగవాలనివ్వరు. మీరు విషయం విన్నాక ముత్తుని, నన్నూ బతకనివ్వరు" అంది పరిమళ పక్కమీద పడుకుని ఆవులిస్తూ.

వాసవి ముఖం గంభీరంగా మారిపోయింది.

"పరిమళా నేను చెప్పమంటున్నాను" అంది కఠినంగా.

పరిమళ లేచి బెదిరి కూర్చుంది.

"మీరు అపార్థం చేసుకోనంటే చెబుతాను" అంది సణిగినట్లు.

వాసవి మాట్లాడలేదు.

చెప్పకపోతే చంపేస్తానన్నట్లుందామె ముఖం.

"అయ్యగారి మొదటిభార్య సావిత్రి చాలా మంచిదటమ్మా. చాలా బీదకుటుంబం నుండి వచ్చిందట అయ్యగారే తన దగ్గర పనిచేసే నౌఖరు కూతుర్ని చూసి పెళ్ళి చేసుకున్నారట. కానీ ఎందుకో అయ్యగారు ఆమెని చాలా బాధించేవారట. ఎవడో రౌడీని తెచ్చి కావాలనే ఆమె మీద ఉసికొల్పేవారట పాపం ఆ తల్లి వాణ్ణి తప్పించుకు తిరగలేక నానా అవస్థపడేదట. చివరికి.. చివరికి" అంటూ ఆగింది పరిమళ భయంగా చూస్తూ.

వాసవి కనుపాపలు పెద్దవయ్యాయి.

"చివరికి... ఒకరోజు ఆ రౌడీ ఆమెని బలాత్కరించబోతే ఆమె తప్పించుకు పారిపోవడానికి ప్రయత్నించిందట. వాడు ఆమెను పీకపిసికి చంపేసాడట. అయ్యగారూ, వాడూ కలిసి ఆ శవాన్ని ఈ దొడ్లోనే మామిడి చెట్టు క్రింద పాతిపెట్టారట. ముత్తు తన గదిలోంచి ఇదంతా చూసిందట. అందుకనే దానికి భయం మిమ్మల్ని కూడా ఏమైనా చేస్తారని" అంటూ పరిమళ వాసవివైపు చూసింది.

వాసవికి భూమండలమంతా అమితమైన వేగంతో గిరగిరా తిరిగిపోతున్నట్లనిపించింది.

తూలి పడబోతున్న వాసవిని గట్టిగా పొదవి పట్టుకుంది పరిమళ.

24

**వాసవి** బాల్కనీలో నిలబడింది.

అయ్యగారొకసారి మిమ్మల్ని క్రిందకి రమ్మంటున్నారు.

"నాకు బాగోలేదని చెప్పు."

శంకర్ ఒక క్షణం ఆమె వేపు చూసి క్రిందకు వెళ్ళిపోయాడు. ఆమె అనుకున్నట్లుగానే వెంటనే జగదీష్ పైకొచ్చి "ఒంట్లో బాగోలేదా?" అన్నాడు ఆప్యాయంగా.

వాసవి జవాబు చెప్పలేదు.

"ఏంటలా వున్నావ్?" అతను దగ్గరకొచ్చి చెయ్యి వెయ్యబోతే విసురుగా పక్కకు తప్పుకుంది వాసవి.

జగదీష్ భుజాలెగరేసి "మళ్ళీ ఏమొచ్చింది?" అన్నాడు.

"ఇక్కడ వున్నన్ని రోజులు నాకు ఏదో ఒకటి వస్తూనే వుంటుంది. అర్జెంటుగా నేను డాడీ దగ్గరకెళ్ళాలనుకుంటున్నాను. నాకు వెంటనే హైద్రాబాద్‌కి ఒక ఫ్లయిట్ టిక్కెట్టు తెప్పించండి" అంది.

"ఇప్పుడేం పని ఆయన మొన్ననేగా వచ్చి వెళ్ళింది."

"మీ గురించి ఏ క్రొత్త నిజం తెలిసినా అది మా డాడీకి తెలిసిన విషయమే అని చెప్పారుగా"

"మళ్ళీ ఏం కనుక్కున్నావు నా గురించి."

"నన్ను రెండో పెళ్ళివాడికి కట్టబెట్టడమొకటే కాదు ఒక హంతకుడికి నన్ను అంటగట్టే బదులు నా మెడకి ఒక రాయి గట్టి హుస్సేన్ సాగర్‌లోకి త్రొయ్యలేకపోయావా? అని అడగడానికి."

"వ్వాట్" జగదీష్ అదిరిపడ్డాడు.

వాసవి నిరసనగా నవ్వింది.

"నటించకండి ఈ ఆర్నెల్లుగా చూసి చూసి విసిగిపోయ్యాను" అంది కటువుగా.

"నీకు మతిపోయినట్లుంది" అన్నాడు జగదీష్ కోపంగా.

వాసవి తోక త్రొక్కిన త్రాచులా లేచింది.

"నిజమే మిమ్మల్ని కట్టుకున్న రోజే నాకు మతిపోయింది. ఇక్కడ పనివాళ్ళముందు సీన్ క్రియేట్ చెయ్యడానికి ప్రయత్నించకండి. నేను మీ నేరాల్ని ఎంచడంలేదు. మీతో నేను కలిసి జీవించడం కుదరదని మాత్రమే చెబుతున్నాను. మీకు ముందొక వివాహమైందన్న నిజాన్ని తెలిసికూడా ఇంకా యీ యింట్లో నిలబడి వున్నాను. నన్ను వెళ్ళనివ్వండి" అంది వాసవి బుసలు కొడుతున్నట్లు.

"మైడియర్ వాసవీ ఇలాంటి విషాన్ని నీకెవరు నూరి పోస్తున్నారు" అన్నాడు జగదీష్ పళ్ళబిగువున కోపాన్ని కంట్రోల్ చేస్తూ కూల్‌గా.

"ఎవరైతేనేం, నిప్పులేందే పొగరాదు."

"అది పాత సామెత అసలిప్పుడు నిప్పుకి పొగకి సంబంధమే లేదు" అన్నాడు జగదీష్.

"అంటే మీ మొదటి భార్యని మీరు ఆ బలరాంతో కలిసి హింసించి చంపడం అబద్ధమంటారు."

జగదీష్ దిగ్భ్రమగా చూసాడు.

"బలరాం మీ బ్రదరని నాకు చెప్పిన అబద్ధం నిజమంటారు."

అతని కళ్ళు ఎర్రబడ్డాయి.

"ఆ శవాన్ని మీరు మామిడిచెట్టు క్రింద పాతిపెట్టడం అబద్ధమంటారు."

"స్టాపిట్ నాన్సెన్స్" జగదీష్ బిగ్గరగా అరిచాడు.

క్రింద నిలబడ్డ అనంత్ మేడమీదకి చూసాడు.

"ప్లీజ్ నన్ను రెచ్చగొట్టకు" అన్నాడు జగదీష్ ఆవేశంగా.

"ఏం చేస్తారు? నన్నుకూడా ఆ సావిత్రిలా..." వాసవి తొణకలేదు.

జగదీష్ ఆమె మాటని పూర్తికానివ్వకుండా గభాల్న వెళ్ళి ఆమె భుజాలు నొక్కిపెట్టి "అతిగా వాగకుండా నీ నోరు కుట్టేస్తాను" అన్నాడు తీవ్రంగా.

వాసవి అతని చేతుల్ని విదిలించబోయింది.

కానీ అవి ఉక్కు హస్తాల్లా గట్టిగా నొక్కి పట్టేసాయి.

ఆమె అతని చేతుల్లోంచి తప్పించుకునేందుకు పెనుగులాడింది. జగదీష్ ఆ పట్టు వదలకుండా ఆమెని బెడ్‌రూంలోకి లాక్కెళ్ళి మంచమ్మీదకి విసిరేసాడు.

అతని బలానికి ఆగలేనట్లు వాసవి ఆ ఫోమ్ పరుపులమీదపడి వాటి జెర్క్‌కి నీట్లో పడి తేలిన రబ్బరు బంతిలా వూగింది.

నువ్వు పెంకిదానివని మీ డాడీ చెప్పారు గానీ మరీ యింత ఇడియట్‌వనుకోలేదు అంటూ అతను పకపకా నవ్వుతుంటే వాసవి అతని చర్యకి బిత్తరపోయింది.

"నేను హంతకుణ్ణా? పైగా శవాన్ని ఇక్కడే మామిడి చెట్టు క్రింద పాతిపెట్టాను కదూ"

వాసవి బిత్తరపోయి చూసిందతనివైపు.

"నిజమే నేను మరచిపోయి వాదిస్తున్నాను కానీ నేను మర్డర్ చేసాను. ఆ శవాన్ని నీక్కూడా చూపిస్తాను. ప్రస్తుతానికి నాకొక అర్జంటు పనివుంది. ఈలోపున పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని రెస్టు తీసుకో నేను అరగంటలో తిరిగొచ్చి నీకన్ని నిజాలు తెలియబరుస్తాను" అంటూ బజ్జర్ నొక్కాడు.

శంకర్ పరుగెత్తుకొచ్చాడు.

"అమ్మగారికి స్ట్రాంగ్ కాఫీ తీసుకురా."

జగదీష్ బజ్జర్‌ని మూడుసార్లు నొక్కాడు.

అనంత్ పైకి వచ్చి "మే అయ్ కమిన్ సర్" అన్నాడు.

"ఎస్"

అనంత్ లోపలికొచ్చాడు.

"ఈ రోజు నా బర్త్‌డే చాలా స్పెషల్‌గా ఎంజాయ్ చెయ్యాలనుకున్నాను. కుదర్లేదు. రాత్రికి స్పెషల్ డిన్నరొకటి ఏదయినా హోటల్‌కి ఆర్డరిచ్చి ఎరేంజ్ చెయ్యాలనుకున్నాను. వాసవికి బాగోకపోవటంవల్ల కేన్సిల్ చేస్తున్నాను. కనీసం మనయింట్లో వాళ్ళవరకు ఏదైనా హోటల్నుండి డిషెష్ తెప్పించి వాళ్ళకి భోజనం ఏర్పాటు చెయ్యండి. అంతా స్పెషల్" అన్నాడు జగదీష్.

"ఓకె సర్" అన్నాడు అనంత్ నవ్వుతూ.

వాసవి వాళ్ళిద్దరివంకా విచిత్రంగా చూస్తోంది.

"అమ్మగారికి స్పెషల్ కాఫీ తెమ్మని చెప్పాను శంకర్‌కి. వాడింకా రాలేదు. స్పెషల్ అనగానే కిచెన్లో గంటన్నర వుండాలనుకున్నాడేమో ఫూల్."

"నేను చూస్తానుండండి" అంటూ అనంత్ బయటికి వెళ్ళాడు.

వాసవి జగదీష్ కేసి తీవ్రంగా చుసి "ఏవిటీ అంతర్నాటకం" అంది.

"ఉష్ అవతల సెక్రటరీ వున్నాడు. ఈరోజు అతనిముందు దెబ్బలాడుకోవడం బాగానే వుంటుంది. కానీ రేపు కలిసి తిరిగినప్పుడు అతని ఎదుటపడితే ఎంత నెర్వస్‌గా ఫీల్ కావాలో ఆలోచించు."

అతని మాటలు పూర్తికాగానే అనంత్ ట్రేలో రెండు కాఫీలు పట్టుకొచ్చాడు.

"మీరు తెచ్చారేమిటి?" జగదీష్ నొచ్చుకున్నట్లు అన్నాడు.

"ఈ రోజు మీ బర్త్‌డే నాకు స్పెషల్‌గా యివ్వాలనిపించి" అన్నాడు అర్థవంతంగా నవ్వి.

"నాకూ తెచ్చారా? మరి మేడమ్‌గారికి"

"ఇదిగో మేడమ్‌కి స్పెషల్" అనంత్ ఒక కప్పు చూపించాడు. జగదీష్ ఆ కప్పు వాసవికి అందిస్తూ "ప్లీజ్" అన్నాడు.

"నాకొద్దు" అంది వాసవి.

"ఈ రోజు నా పుట్టినరోజు."

వాసవి మాట్లాడలేదు.

అనంత్ వాళ్ళిద్దరికేసి చిత్రంగా చూశాడు.

"అనంత్ నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు?" అడిగాడు జగదీష్.

ఆ అసందర్భమైన ప్రశ్నకి అనంత్‌తో పాటు వాసవి కంగారు పడింది.

అనంత్ జవాబు చెప్పకుండా నవ్వేసాడు.

"ఏది ఏమైనా నువ్వదృష్టవంతుడివోయ్. ఇంటికి రాగానే ఈ అలకపాన్పు సేవలేదు. కొన్నాళ్ళు మీ మేడమ్‌ని గమనించేవంటే అసలు పెళ్ళంటేనే ఆమడదూరం పరుగెత్తుతావ్."

వాసవి జగదీష్ వైపు సీరియస్‌గా చూసింది.

"ప్రేమగా చూస్తే పారిజాతాలు రాలతాయని, నవ్వితే నవరత్నాలు కురుస్తాయని కొందరాడవాళ్ళకి గర్వం అందుకే అందమైనవాళ్ళ ముఖాల్ని కోపంతో వికృతంగా తయారు చేసుకుంటారు."

"నాకు చాలా తలనొప్పిగా వుంది. ఇద్దరూ బయటికి వెళతారా?" వాసవి కోపముగా చూసింది ఇద్దరివైపూ.

జగదీష్ భయపడుతున్నట్లు లేచి నిలబడ్డాడు.

అనంత్ జేబులోంచి ఒక టాబ్లెట్ తీసి అందించి "ఇవి వేసుకుని కాఫీ త్రాగండి. వెంటనే ఎంత భయంకరమైన తలనొప్పయిన్నా తగ్గిపోతుంది" అన్నాడు అనంత్ వినయంగా.

వాసవి అనంత్ కేసి చూసింది.

అతను వినయంగా నిలబడ్డాడు.

ఆ క్షణం తనలో రగులుతోన్న బాధనంతా అతనిముందు కక్కేయాలనిపించింది వాసవికి.

కానీ ఎదురుగానే భర్త.

వాసవి అయిష్టంగానయినా అనంత్ చెప్పిన ప్రకారం టాబ్లెట్ మింగి కాఫీ త్రాగింది.

"థాంక్యూ" అన్నాడు జగదీష్.

వాసవి తన కోపాన్ని అదిమిపట్టి పక్కకి తిరిగి కళ్ళు మూసుకుంది.

జగదీష్ అనంత్‌ని బయటికి రమ్మని సైగచేసి తలుపు దగ్గరకేసాడు.

ఆలోచనలతో బరువెక్కిన ఆమె హృదయం తేలికయి, కళ్ళు బరువై వాసవి గాఢ నిద్రలోకి జారిపోయింది.

ఆ సాయంత్రం డిన్నర్ సంగతి మరోసారి అనంత్‌కి గుర్తుచేసి జగదీష్ కార్లో బయటకి వెళ్ళిపోయాడు.

వాసవి బద్ధకంగా కళ్ళు తెరిచి చూసింది.

తూర్పువేపున్న కిటికీ గ్లాసుమీదపడుతున్న సూర్యకిరణాలు విశ్లేషించి అక్కడ మండుతున్నట్లు కనిపిస్తోంది.

వాసవి కంగారుగా లేచి చుట్టూ చూసింది నిశ్శబ్దం తప్ప మరేమీ లేదక్కడ.

ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ గడియారం చాలా వినయంగా టిక్కు టిక్కుమంటోంది.

వాసవి గడియారంకేసి చూసింది. ఏడుగంటల పదినిముషాలు.

వాసవికి మతిపోయినట్లయింది. తను ప్రొద్దుట అనంత్ యిచ్చిన కాఫీ త్రాగి టాబ్లెట్ వేసుకుని పడుకుంది.

అప్పుడు సరిగ్గా పదిగంటలు తనెంతసేపు పడుకున్నట్లు?

రాత్రి ఏడుగంటలయిందేమోననుకుంటే తూర్పువేపు ఎండ. వాసవి మంచమ్మీదనుండి దూకి తలుపు తీసుకొస్తుంటే ఎదురుగా వచ్చాడు జగదీష్.

"గుడ్ మార్నింగ్" జగదీష్ నవ్వాడు.

"ఇప్పుడు.. ఇప్పుడు టైమెంతయింది?" అంది కంగారుగా.

"ఏడూ ఇరవై అద్సరే ఎన్నో ఏళ్ళుగా నిద్రలేనట్లు అలా నిద్ర పోయావేం?" అన్నాడు.

"అంటే...అంటే..నేను..." వాసవి ఆశ్చర్యంగా అడిగింది.

"దాదాపు ఇరవై గంటలు నిద్రపోయావు" అన్నాడు జగదీష్.

"నో! నెవ్వర్ నా జీవితంలో ఎన్నడూ ఇంతసేపు నిద్రపోలేదు. నిన్న అనంత్ నాకిచ్చిన టాబ్లెట్ ఏమిటి?" అంది వాసవి ఆందోళనగా.

"అక్కడే చింపి పడేశావ్‌గా చూడు. అయినా ఒక్క టాబ్లెట్ వేసుకుంటే ఇన్ని గంటలు పనిచేస్తుందా?" అని జగదీష్ ముందుకు నడిచి సోఫా దగ్గరవున్న టాబ్లెట్ తాలుకు కాగితం ముక్కలు ఏరి ఒక చోటకి చేర్చి చూపించాడు జగదీష్.

"ఎనాల్జిన్" చదివింది వాసవి.

"నిన్న నేను నీకోసం వెంటనే అరగంటలో వచ్చాను. నీ అనుమానాలు తీర్చడానికి. కానీ నువ్వు లేస్తేనా? బాప్‌రే ఏం నిద్రనీది" అన్నాడు.

వాసవికింకా నమ్మకం కలగటంలేదు తనంతసేపు నిద్రపోయిందంటే. వాసవి అతనికేం జవాబు చెప్పకుండా క్రింద కెళ్ళింది.

ముఖం కడుక్కుంటున్న పరిమళ వాసవిని చూసి తప్పుచేసిన దాన్లా "ఎందుకో ఈ రోజు బాగా నిద్రపట్టేసిందమ్మా. లేవడం ఆలస్యమైపోయింది" అంది సంజాయిషి యిస్తున్నట్లు.

"తన పరిస్థితి తెలిస్తే పరిమళ ఏమంటుందో" అనుకుంటూ వాసవి "ఫర్వాలేదులే ముత్తుని కాఫీ తెమ్మని చెప్పు" అంది.

"ముత్తూ ఇంకా లేవలేదమ్మా నేను అయిదునిముషాల్లో చేసుకొస్తాను" అంది పరిమళ.

వాసవి ఆశ్చర్యంగా చూసి " ముత్తూ ఇంకా లేవలేదా?" అంది.

"రాత్రి అయ్యగారు మాకందరికీ డిన్నరిచ్చారు. బాగా ఆలస్యమైపోయింది. కాస్త ఎక్కువ తినేసరికి ప్రొద్దుట మెలుకువ రాలేదు." అంది పరిమళ.

"సరి! సరి! అదా సంగతి" అంటూ వాసవి బాత్రూం కేసి నడిచింది.

పరిమళ హడావుడిగా కాఫీ కలపటానికి వంటగది వేపు నడిచింది.

మరికాసేపటికి పరిమళ అందరికీ కాఫీలందించింది.

జగదీష్ కాఫీ త్రాగుతూ "అనంత్" అంటూ పిలిచాడు.

అనంత్ వచ్చాడు లోనికి.

"కూలీలు వచ్చేసారా?"

"ఆc మీ కోసమే" అన్నాడు అనంత్.

"నేను కాదు ముఖ్యం. వాసవిని తీసుకెళ్ళండి"

వాసవి వాళ్ళిద్దరివైపూ ఆశ్చర్యంగా చూసింది.

"పద నీకో అద్భుతం చూపిస్తాను" అన్నాడు జగదీష్.

"ఏమిటది?" అంది వాసవి.

"మామిడిచెట్టు దగ్గర త్రవ్వడానికి కూలీలొచ్చారు. నేను చేసిన హత్యేమిటో నువ్వూ చూద్దువుగాని" అంటూ ముందుకి నడిచాడు జగదీష్.

వాసవి బిగుసుకుపోయినట్లు చూసింది. అక్కడ త్రవ్వకం ప్రారంభమైంది.

గునపం శబ్దం వినబడుతోంటే గుండె దడదడలాడుతోంది వాసవికి.

"ఏంటమ్మా?" అంది పరిమళ ఆశ్చర్యంగా కిటికీలోంచి పెరట్లో జరుగుతోన్న త్రవ్వకాన్ని చూస్తూ.

వాసవి చెప్పింది "మొన్న నువ్వు చెప్పిన విషయం గురించే"

పరిమళ కళ్ళు విశాలమయ్యాయి.

"అడిగేసారా?" అంది ఆశ్చర్యంగా.

"నువ్వూరా చూద్దాం" అంది వాసవి.

"నేనా? అయ్యగారు కోప్పడతారేమో?"

"ఫర్వాలేదు" వాసవి పరిమళ చెయ్యి పట్టుకుని మామిడి చెట్టుకేసి నడిచింది.

జగదీష్ వాసవిని చూసి చిరునవ్వు నవ్వాడు.

మొలలోతు గుంటపడ్డాక "మెల్లిగా మట్టి తొలగించండి. లేకపోతే అస్థిపంజరం చెదిరిపోతుంది" అన్నాడు జగదీష్.

ఆ మాటకి వాసవి శరీరం గగుర్పొడిచింది.

భయంగా జగదీష్ వైపు, గోతివైపు చూసింది.

పరిమళ తన చేతిలోని వాసవి చెయ్యి వణకడం గమనించింది. వెంటనే ఆ చేతిని బలంగా నొక్కిపెట్టింది.

కూలీలు మెల్లిగా మట్టిని తొలగిస్తుంటే వాసవి ఊపిరి బిగబెట్టి చూసింది.

మెల్లిగా ఎముకలు బయటపడుతుంటే వాసవిలో వణుకు ప్రారంభమైంది.

"ఇప్పుడు చూడు" అన్నాడు జగదీష్ వాసవి దగ్గరకొచ్చి చెయ్యి పట్టుకుని గోతివేపు నడిపిస్తూ.

వాసవి కాళ్ళూ చేతులూ స్వాధీనం తప్పుతోంటే అతని వెంట భయంగా అడుగులేసింది.

పక్కనే నిలబడ్డ పరిమళ కూడా ముందుకు వంగి తొంగి చూసింది.

వాసవి ధైర్యం తెచ్చుకుని గోతిలోకి తొంగి చూసింది.

పూర్తిగా పై చర్మం ఎండిపోయి స్పష్టంగా కనిపిస్తున్న అస్థిపంజరాన్ని చూసి కెవ్వుమని అరిచింది వాసవి.

"ఉష్! సరిగ్గా చూడు"

వాసవి మళ్ళీ వంగి చూసింది. నాలుగు కాళ్ళతో ఒక పక్కకి ఒరిగి మూతి పొడవుగా వున్న అస్థిపంజరం ఒక జంతువు తాలుకాదని అర్థమయిపోయింది వాసవికి.

ఆమె తెల్లబోయి చూసింది జగదీష్ వైపు

"ఏవిటిది?" అంది గొణిగినట్లు.

"సరిగ్గా చూస్తే నీకే తెలుస్తుంది" అన్నాడు జగదీష్ చేతులు కట్టుకుని ఠీవిగా నిలబడి నవ్వుతూ.

"కుక్క..కుక్కది" అంది పరిమళ.

"సరిగ్గా చెప్పావ్. దాని పేరు టెర్రర్. చాలా మంచి జాతికుక్క. అకస్మాత్తుగా దానికి పిచ్చిపట్టి అందర్నీ పట్టుకుని కరవడం ప్రారంభించింది. చివరికి ఒక రాత్రి నన్నే తరుముతుంటే తప్పని పరిస్థితిలో షూట్ చెయ్యాల్సి వచ్చింది. అప్పుడే

మా బ్రదర్ బలరాంకూడా వచ్చాడు. ఇద్దరం కలిసి ఆ రాత్రే దాన్ని యిక్కడ పూడ్చిపెట్టాం. దాన్ని చాలా చిన్నపిల్లగా వుండగా తీసుకొచ్చి పెంచాను. ఆ అభిమానంతో ఇంట్లోనే పాతిపెట్టి దానిమీద మామిడి చెట్టు నాటించాను. ఎవరో నీకు చాలా తమాషాగా కథ మార్చి చెప్పారు" అన్నాడు జగదీష్.

వాసవి మతిపోయినట్లు చూసింది.

"ఇంకా అపనమ్మకంగా వుందా నా పైన" అడిగాడూ జగదీష్.

అవతల అనంత్ - ఇటు పరిమళ - ఒకపక్క కూలీలు. ఎంతో అవమానంగా అనిపించింది వాసవికి.

"ఇక ఇంట్లోకి వెళ్ళు. పనివాళ్ళతో ఎంతలో వుండాలో తెలుసుకుంటే ఇన్ని అనర్థాలు జరగవు" అన్నాడు జగదీష్.

వాసవికి తల కొట్టేసినట్లయింది.

పరిమళ ఖిన్నవదనంతో చూసింది జగదీష్ వైపు.

"ఇంక పూడ్చేయమంటారా?" అడిగాడు అనంత్.

"ఊ" అన్నాడు జగదీష్ సీరియస్‌గా.

వాసవి గబగబా మెట్లెక్కింది.

ఆమెలో రగిలిన అవమానం కోపంగా మారి బుసలు కొట్టింది.

"ముత్తూ!" అంటూ ఆమె పెట్టిన కేకకి మేడ కంపించిందేమోననిపించింది.

25

**సాయంత్రం ఆరు**గంటలవుతుండగా జగదీష్ హడావుడిగా లోనికొచ్చాడు.

అతనొచ్చిన సంగతికూడా గమనించనట్లు నిరాసక్తంగా స్థంభానికి చేరబడి కూర్చుంది వాసవి.

ఆమె చూపులెక్కడో అనంతంలో తారట్లాడుతున్నాయి.

చాలా రోజులుగా జబ్బుపడి నీరసించినట్లుందామె ముఖం.

"వసూ" అతను చాలా నెమ్మదిగా పిలిచాడు.

"ఊఁ" అందామె పరధ్యానంగా. అతను చుట్టూ చూసాడు.

పరిమళ వంటగదిలో వుంది. "శంకరసలు రెండు రోజులుగా తన కంటికి కనిపించడమే లేదు. ఏమయినట్లు?" అనుకున్నాడతను మనసులోనే.

"ముత్తుని...ముత్తుని నువ్వెక్కడికన్నా పనిమీద పంపించావా?"

వాసవి అతనికేసి చూపులు తిప్పింది.

"దానికి ఈ ఊరంతా తెలియదు. ఎప్పుడో తంజావూరెళ్ళినప్పుడు అక్కడ నేను బస చేసిన హోటల్ కెదురుగా అడుక్కుంటుంటే తీసుకొచ్చాను. దానికి వంట బాగా వచ్చన్న విషయం తెలిసి, అప్పటినుండీ మన యింట్లో వంట మనిషిగానే అట్టిపెట్టాను కానీ ఎన్నడూ బజారు పనులు చెప్పలేదు" అన్నాడు జగదీష్.

వాసవి జవాబు చెప్పలేదు.

"నీకేం కావాలన్నా అనంత్ వున్నాడు. అసలు శంకర్ కనిపించడేం? వాడెక్కడికి వెళ్ళినట్లు? పాపం ముత్తు" అంటూ ఆగాడు జగదీష్.

వాసవి అతనికేసి తీవ్రంగా చూసింది.

"పాపం ముత్తు.. పాపం ముత్తు అందరూ దాన్ని చూసి జాలిపడేవాళ్ళే. అదే మీరు మీ మొదటి భార్యని చంపి మామిడి చెట్టుక్రింద పాతిపెట్టారన్న సంగతి చెప్పింది. ఈరోజు దానిమూలాన్నే నేను అందరిలో ఫూల్‌నయ్యాను. అందుకే దాన్ని ఈ రోజు మెడబట్టి బయటకి గెంటేసాను" అంది వాసవి కసిగా పళ్ళు నూరుతూ.

"కాని నీ కోపానికి ఫలితంగా ఏం జరిగిందో తెలిస్తే ఎంతగానో బాధపడ్తావ్"

"ఏం జరిగినా నేను బాధపడను. దాన్నేం చేసినా పాపం లేదు"

"నీ కంత కోపం వస్తే నాలుగు బాదినా బాగుండేది కాని పిటీ అది లారీ క్రింద పడి చచ్చిపోయింది" అన్నాడు జగదీష్ బాధగా.

వాసవి షాక్ తిన్నట్లు చూసింది.

"నా మీద అంత ఘోరమైన అబద్ధం చెప్పినా నేను క్షమించగలిగాను. కానీ నువ్వు క్షమించలేకపోయావ్" అన్నాడు జగదీష్ బాధగా.

"ఎలా జరిగింది?" అన్నాడు అనంత్ అప్పుడే లోనికొస్తూ.

"మధ్యాహ్నం నేను లంచ్‌కి వస్తుండగా రోడ్డుమీద జనం మూగి వున్నారు. ఏం జరిగిందోనని కారు ఆపి చూస్తే మన ముత్తు. షాక్ తిన్నట్లయిదిది. దాని శవాన్ని అనాధ శవంగా అప్పగించడానికి మనసంగీరించక హాస్పిటల్‌కి వెళ్ళి పోస్టుమార్టం అయ్యాక హేండోవర్ చేసుకుని నేనే దహన సంస్కారం చేసి తిరిగొస్తున్నాను. అందుకే యింతాలస్యం అయ్యింది" అన్నాడు జగదీష్.

"ఇంత జరిగినా నాకు ఫోన్ చెయ్యలేదేం సార్. నేను సహాయంగా వచ్చేవాణ్ణిగా" అన్నాడు అనంత్.

ముత్తు చావు నాకు చాలా షాక్ కల్గించింది. ఏం చెయ్యడానికి ఏమీ తోచలేదు" అన్నాడు జగదీష్.

"మేడమ్! మేడమ్" అన్నాడు అనంత్ ఆందోళనగా.

జగదీష్ కంగారుగా వాసవి వైపు చూసాడు.

వాసవి అప్పటికే జావలా క్రిందకి జారిపోయింది.

జగదీష్ కంగారుగా వాసవిని పట్టుకుని "అనంత్ డాక్టర్ని పిలువు" అన్నాడు గబగబా.

అనంత్ ఫోన్ దగ్గరికి పరిగెత్తాడు.

డాక్టరు సలహా మేరకి వాసవిని నగరంలో ప్రముఖ సైక్రియాటిస్టు శివానందానికి చూపించాడు జగదీష్.

వాసవి భోరున ఏడుస్తోంది. మరికాస్సేపటిలో నవ్వుతోంది. ముత్తుని నేనే చంపేసానని అరుస్తోంది. ఇంకాస్సేపటికి భయంతో గజగజలాడి స్పృహ తప్పుతోంది.

"ఆమె మెంటల్‌గా బాగా అప్‌సెట్టయింది. కొన్నాళ్ళపాటు హాస్పిటల్లో ఎడ్మిట్ చెయ్యాలి" అన్నారు డా. శివానందం.

"ఈ విషయం జగన్నాధరావుగారికి తెలియచేడం మంచిదేమో" అన్నాడు జగదీష్ అనంత్‌తో.

"ఆయన హార్టు పేషంటని చెప్పారు. ఈ సంగతి తెలిస్తే ఆయన కూడా మంచమెక్కితే మనకి మరీ ట్రబులవుతుంది. ఆమె కొచ్చిన ప్రమాదమేముంది? కాస్త నెర్వస్‌నెస్ నాలుగురోజుల్లో ఆమె మామూలు మనిషవుతారు. ఏదైనా సహాయం చెయ్యడానికి నేనున్నాను. పరిమళ వుంది." అన్నాడు అనంత్.

జగదీష్‌కి అనంత్ చెప్పిన సలహా నచ్చినట్లుగా తల పంకించాడు.

"ఈ నెలలోనే నాకు ఫారిన్ ట్రిప్ వుంది. బహుశా వాసవి ఆరోగ్యరీతిగా అది కేన్సిల్ చేసుకోవల్సివస్తుందేమో" అన్నాడు జగదీష్ ఆలోచిస్తూ.

"మీ ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి. వ్యాపార రీత్యా మీకు దొరికిన గొప్ప అవకాశం యిది. మీ అంతట మీరు విదేశాలు వెళ్ళలేరని కాదు. మీరు టాప్ ఎక్స్‌పోర్టర్స్‌గా "కేపెక్సిల్" ఎవార్డు పొందిన సందర్భంలో గౌరవంగా దొరికిన విదేశయాత్ర మీది. దీన్ని మీరు మానుకోవడం మంచిది కాదని"

"కాని, ఇక్కడ -"

"అంతా సవ్యంగానే జరుగుతుంది. మీరు దూరం కావడంతో మేడమ్ కాస్త మీ గురించి తీరిగ్గా ఆలోచించగల అవకాశం, మీమీద ప్రేమ సదభిప్రాయాలూ కల్గగల అదృష్టం కల్గుతాయని నా నమ్మకం. ఇదంతా మీకు నా మీద నమ్మక ముంటేనే" అన్నాడు అనంత్ వినయంగా.

"అనంత్ నేను చాలా స్టడీ చేయందే ఎవర్నీ దగ్గరకి రానివ్వను.

నీ మీద నమ్మకం లేకపోవడమే ప్రశ్న లేనే లేదు. కానీ మన పనులు ఏవీ సవ్యంగా అనుకున్న విధంగా జరగడంలేదనే నా బాధ. ఇలా ఎదురు దెబ్బలు తగలడం నాకిదే ప్రథమం" అన్నాడు జగదీష్ అనంత్ భుజమ్మీద చరుస్తూ.

"ఇక అంతా సవ్యంగానే జరుగుతుంది. నా మీద అన్ని బాధ్యతలూ వుంచి మీరు వెళ్ళిరండి. ప్రస్తుతం మీరు దూరంగా వుండటం వలనే మేడం అన్ని విధాల మారగలరని నా నమ్మకం" అన్నాడు అనంత్.

జగదీష్ సరే నన్నట్లు తల పంకించాడు.

ఇద్దరు. కార్లో యింటికి తిరిగొస్తుండగా అడిగాడు జగదీష్.

"ఈ శంకర్ గాడేమయినట్లు."

అనంత్ బదులుగా నవ్వాడు "వాడికి వయసొస్తుందిగా ఏదో అలవాటు పడి బయట తిరుగుతున్నాడేమో ఈసారి మందలిస్తానుండండి."

"అంతేనా?"

"మమ్మాటికి అంతే పొట్టమాడితే తిండికోసం వాడే వస్తాడు" జగదీష్ కొంచెంసేపు ఆలోచించి "అలాగయితే వాన్ని మీరు ఏమీ అభ్యంతరపెట్టకండి" అన్నాడు.

కారు డ్రైవ్ చేస్తున్న అనంత్ విచిత్రంగా చూసాడు జగదీష్ వైపు.

"వాడికి వాసవి దగ్గర మాలిమి ఎక్కువ వాడెప్పుడూ ఆమెని అంటు పెట్టుకునుంటే"

"అర్థమయ్యింది. అర్థమయ్యింది." అన్నాడు అనంత్ నవ్వుతూ.

"దట్స్ గుడ్" అన్నాడు జగదీష.

"పరిమళ సంగతేమిటి?" తిరిగి జగదీషే అడిగాడు.

"ఆమెతో మనకెలాంటి ప్రోబ్లమ్ లేదు. ఆమె వ్యభిచార గృహం నుండి వచ్చింది వయసయి పోయింది. అక్కడ ఈవిడగారి ముఖం చూసే వాళ్ళులేరు. పని కావాలంటే ఇలాంటి వాళ్ళకెవరూ యివ్వరు. పైగా వవయ్యారాలు పోయి డబ్బు సంపాదించే వాళ్ళు వళ్ళొంచి కష్టపడలేరు. సూక్ష్మంలో మోక్షం కావాలి వాళ్ళకి నేనే పని వేయించేనన్న కృతజ్ఞత వుంది. ఆమె వల్ల భయంలేదు" అన్నాడు అనంత్.

"ఐసీ కాని పూర్తిగా నమ్మకండి ఒక్కోసారి తాడే పామైకరచినా కరవచ్చు."

పూర్తిగా ఎవర్నీ విశ్వసించడం అనంత్ జీవితంలోనే లేదు సార్ అన్నాడు అనంత్ గర్వంగా.

"వెరీగుడ్" అంటూ అనంత్‌ని కాస్త గట్టిగా తేరిపార చూడ్డం అనంత్ గమనించలేదు.

కారు బంగళా చేరుకుంది.

డాక్టర్ని చూసి వాసవి మెల్లిగా లేచి కూర్చుంది.

"ఇప్పుడెలా వుందమ్మా?"

వాసవి చిరునవ్వు నవ్వి "అయామ్ ఓ.కే. డాక్టర్" అంది.

దట్స్ గుడ్ మీ హజ్బండ్ చాలా బాధపడ్డారు మీ గురించి పాపం ఆయన ఫారిన్ ట్రిప్ కాన్సిల్ చేసుకోవాలనుకున్నాడు కూడా నేనే మీకేం ఫర్వాలేదని వెళ్ళమని సలహా యిచ్చాను" అన్నాడు.

వాసవి ఆశ్చర్యంగా చూసింది.

"ఈ సంగతి మీకు తెలియదా? మీ పి.ఎస్ చెప్పేరేమో అనుకున్నాను" సరిగ్గా అప్పుడే లోనికొచ్చి డాక్టర్‌ని చూసి విష్ చేసాడు అనంత్.

"రండి మీ గురించే మాట్లాడుతున్నాను ఆమెకు మిస్టర్ జగదీష్ ఫారిన్ వెళ్ళిన సంగతి చెప్పలేదా మీరు."

"లేదు" అన్నాడు అనంత్.

వాసవి అనంత్ వైపు విస్మయంగా చూసింది.

"ఆమె అసలే వీక్‌గా వున్నారు. ఈ విషయం తెలిసి లోన్లీగా ఫీలవుతారేమోనని"

"నో నో దట్ ఈజ్ బాడ్ ఊళ్ళోనే ఉండి తనని చూడ్డానికి రాలేదంటేనే ఆమె హర్టవుతారు. విషయాన్ని అర్థం చేసుకోలేని పరిస్థితుల్ని అవగాహన చేసుకొలేని స్థితి కాదామెది. కొద్దిగా షాక్ కావడాన్న బాగా నెర్వస్‌నెస్ వచ్చేసింది" అని వాసవికేసి తిరిగి "మిమ్మల్నింక డిస్చార్జి చెయ్యొచ్చు. మీరీరోజే యింటికి వెళ్ళొచ్చు" అన్నారు.

"థాంక్యూ డాక్టర్" అంది వాసవి.

"కానీ నాలుగురోజుల కొకసారి టెస్టుకి రావాల్సుంటుంది.

వాసవి అంగీకారంగా తలవూపింది.

డాక్టరుగారు వెళ్ళిపోయారు.

వాసవి అనంత్ కేసి తిరిగి "ఇన్ని రోజులూ ఆయన ఊళ్ళో లేని సంగతి చెప్పలేదేం?" అంది.

"చెప్పానుగా మీరు ఫీలవుతారని" అన్నాడు అనంత్ నవ్వుతూ వాసవి నిట్టూర్చింది.

"మీరు రెడీగా వుండండి. నేను మనం వెళ్ళిపోవడానికి మిగతా ఏర్పాట్లు చుస్తాను" అనంత్.

అనంత్ ఆమె వైపు ఆశ్చర్యంగా చూసాడు.

"ఆ యింటికి రావాలంటే భయంగా వుంది"

"ఎందుకు?"

"నీకు తెలియదూ. ఆ సావిత్రి చావు ఆయనంటారు. ఆవిడ దయ్యమై నా వెంట పడుతున్నదట రేపు ముత్తుకూడా. అనంత్ నేనక్కడికి రాలేను. నన్ను డాడీ దగ్గరికి పంపించెయ్" అంది వాసవి భయంగా.

అనంత్ ఊరడిస్తున్నట్లు నవ్వాడు.

"మీరింత వీక్ అయిపోతారని ఏనాడూ అనుకోలేదు. ఆనాటి ధైర్యం తెగువ, పట్టుదల ఏమయిపోయాయి. బలహీనమైన మెదడే దయ్యాల పుట్ట. మీకు నామీద నమ్మకముంటే వెంటనే ధైర్యంగా బయల్దేరండి" అన్నాడు అనంత్.

"కాని.. కాని ఆ లంకంత యింట్లో నేనింక ఉండలేను అనంత్" అంది వాసవి ఆందోళనగా.

"పరిమళ వుంది. నేనున్నాను. శంకర్ వున్నాడు మీకేం భయం"

"అసలు దయ్యాలున్నాయా అనంత్" వాసవి అమాయకంగా అడిగింది.

"ఏమిటి మీకీ పిచ్చి ఆలోచనలు?" అనంత్ కోపంగా చూసాడు.

"అదికాదు అనంత్ ఒకవేళ వుంటే ముత్తు నన్ను ఊరికే వదిలేయదు. ఆ రోజు నేను ముత్తుని నిర్దాక్షిణ్యంగా బయటికి గెంటేయకపోతే ముత్తుకి ఆ నికృష్టమైన చావు వచ్చేది కాదు నేనెంత నా మనసుకి ధైర్యం చెప్పుకున్నా ముత్తు నన్ను వదిలేయదనిపిస్తోంది" అంది వాసవి బాధగా.

"అదే నిజమైతే నేనున్నాను మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకునేందుకు" అన్నాడు అనంత్ ధృఢంగా.

వాసవి అతనివేపు చూసి నిట్టూర్చింది.

"అనంత్, నీకెందుకు నామీదింత అభిమానం:

"అది అర్ధంలేని ప్రశ్న. దానికీ రోజు క్రొత్తగా మళ్ళీ జవాబు చెప్పాల్సిరావడం నా దురదృష్టం" అన్నాడు అనంత్ బాధగా.

"తన కోపమే తన శత్రువన్నారు. కోపంలో వివేకం నశిస్తుందని కూడా అన్నారు. అదే జరిగింది" అంది వాసవి.

"దేని గురించి?"

"అదే ఆ రోజు నువ్వన్నదాంట్లో వున్న తప్పేమిటి? డాడీ అంగీకారంతో నన్ను పెళ్ళిచేసుకుంటానన్నావ్. నేను అహంకారంతో నా మాట కాదన్నావనే పట్టుదలతో నిన్ను దూరం చేసుకున్నాను" అంది వాసవి బాధగా.

అనంత్ ఆమెకేసి విచిత్రంగా చూసాడు.

"అదంతా యిప్పుడెందుకులే వాసవీ"

"లేదు నన్ను చెప్పనివ్వు నీకు తెలియని రహస్యాలేమున్నాయి నాకు. నా సంసార జీవితమెంత అందంగా వెలిగిపోతున్నదో నీకు తెలియని సంగతి కాదు. ఈ సుడిగుండంలో నీ సాహచర్యమే చుక్కాని కాకపోతే"

"ప్లీజ్ వాసవీ" అన్నాడు అనంత్.

వాసవి మౌనం వహించింది.

26

శంకర్ గబగబా నడుస్తున్నాడు.

పూనమల్లె హైరోడ్డులో రెండో ఫర్లాంగు రాయి దగ్గర వాడి అడుగులు ఆగిపోయాయి.

వాడు క్షణం సేపు ఆలోచించి, గుండె దిటువు చేసుకుని మెల్లిగా ఎడం చేతివేపున్న సందులోకి వెళ్ళి రావిచెట్టు క్రింద వున్న గుడిసె దగ్గర నిలబడ్డాడు.

లోపల్నుంచి బలరాం గొంతు తీవ్రంగా వినిపిస్తోంది.

"రేయ్ నా సంగతి ఆ పోలీసోళ్ళకేం తెలుసురా యెదవల్లారా నేను తాగబోతు నాయాల్నా? వొట్టి తాగుబోతు నాయాల్నేనా? హిహిహి టయమొస్తే తలలు తీసిత్తానురో లంబాడీ కొడుకల్లారా కాసుకోండ్రా" బలరాం చేతిలో సీసా బలంగా నేలకి తాటించేడు.

సీసా వెయ్యి ముక్కలయి చెల్లాచెదురయి పోయింది. శంకర్ ధైర్యం చేసి లోపలికెళ్ళాడు.

బలరాం కళ్ళకి చేతులడ్డం పెట్టుకుని ఎవడ్రా అది? అన్నాడు కోపంగా.

శంకర్ మాట్లాడలేదు.

"ఎవడ్రా ఆడు? పోలీసోడా?" అడిగాడు బలరాం కోపంగా.

"లేద్సార్ ఆళ్ళని తరిమేసాను. పారిపోయారు ఎదవలు" అన్నాడు శంకర్ మెల్లిగా.

"పొయ్యేరా నా పేరంటే ఏంటనుకున్నావ్?" మీసాలు మెలేసాడు బలరాం.

"తెలుస్సార్"

"తెలుసా? అసలెవడివిరా నువ్వు? బలరాం గదమాయించాడు.

"నేను.. నేను.. నాకెవరూ లేరండి. తమరికాడ సేవచేసుకుందామని" అంటూ వణిగాడు శంకర్.

బలరాం పెద్దపెట్టున నవ్వేసాడు.

"నా కాడ సేవా? ఏటొొరుగుద్దిరా నీకు. నేనసలే శవాల్ని పీక్కుతినే పిశాచాన్ని నా దగ్గరేం తింటావ్రా నువ్వు" అన్నాడు బలరాం హేళనగా.

అదేంటిసార్ అలాగంటారు నాకేం తెలియదనా అంత కోటీశ్వరుడయిన తమ్ముణ్ణి పెట్టుకుని" అన్నాడు శంకర్.

బలరాం ఆశ్చర్యపోయినట్లు చూసాడు.

"నాకు తమ్ముడొకడా? మళ్ళీ ఆడు కోటీశ్వరుడా ఏట్రా నువ్వు మాట్లాడేది? నువ్వు పిచ్చాసుపత్రి కేసా?" అన్నాడు చిరాగ్గా.

"ఆ జగదీష్ మీ తమ్ముడేగా?"

"ఆడు నా తమ్ముడా?" సాలా బాగుందిరోయ్ అలా సెప్పుకుంటున్నాడా?"

"అయితే రేపే ఆస్తిలో వాటా ఎట్టేయమంటాను" అని పకపకా నవ్వాడు.

ఆ నవ్వుకి రావిచెట్టుమీద గూళ్ళలో కాపురముంటున్న పక్షుల గుంపులు భయంతో కువకువలాడాయి.

వెంటనే ఆ నవ్వు ఠక్కున ఆగిపోయింది. అతడి నవ్వు ఆగిపోగానే ఆ ప్రదేశానికి భయంకరమైన కళ వచ్చింది.

బలరాం తూలుతూ లేచి నిలబడ్డాడు.

శంకర్ భయంగా చూస్తున్నాడు వాడికేసి.

"రేయ్ అసలు నువ్వెవడివి రా? నువ్వు ఆ పోలీసోళ్ళ చీకెట్టేజింటువా? చెప్పరా?" అంటూ శంకర్ పీక గట్టిగా పట్టుకున్నాడు.

వాడి బలమైన చేతిలో శంకర్ గిజగిజలాడాడు.

"నేను...నేను నాకు పోలీసులకి ఏం సంబంధంలేదు. నేను ఆ జగదీష్ యింట్లో నౌకర్ని" అన్నాడు శంకర్ గబగబా.

"ఆర్నీ చావుకోరుకునే యిక్కడి కొచ్చేవన్నమాట అంటూ యింకాస్తా గట్టిగా పీకని అదిమిపెట్టాడు బలరాం.

హాస్పిటల్ మెట్లు ఎక్కుతోంటే "వాసవీ" అని పిలిచినట్లయి ఆగిపోయింది వాసవి.

"ఆవిడ మిమ్మల్ని పిలుస్తున్నారు" చెప్పాడు అనంత్.

వాసవి ఆమెవైపు చూసింది.

చాలా బలహీనంగా, కొద్దిగా నెరసిన జుట్టు, చప్పి దవడలూ ఎప్పుడూ చూసినట్లనిపించలేదు వాసవికి.

"నిన్నే వాసవీ నన్ను గుర్తుపట్టలేదూ" అందామె నవ్వుతూ. అప్పటికి వాసవి అంతు చిక్కలేదు. ఆమె గబగబా తన జ్ఞాపకశక్తిని పరీక్షించుకుంటున్నది.

"నేను మహతిని"

వాసవి ప్రాణం ఆ పేరు వినగానే గిలగిలలాడిపోయింది.

అస్థిపంజరానికి ప్రాణం పోసినట్లు కర్రకి చర్మం పొర కప్పినట్లున్న ఈమె మహతా?

మహతి రెండు మెట్లు పైకొచ్చింది.

వాసవి అసంకల్పితంగా రెండు మెట్లు దిగింది.

ఇద్దరి చేతులూ అప్రయత్నంగా కలుసుకున్నాయి.

"వసూ" అంది మహతి ఆర్ద్రంగా.

"మహీ" అంది వాసవి బాధగా.

"నిన్నిక్కడ ఇలా చూస్తానని ఎన్నడూ అనుకోలేదు" అంది మహతి ప్రేమగా.

"నేనూ అంతే"

"వసూ, నువ్వెవరికోసం వచ్చావు? హాస్పిటల్లో ఎవరయినా మీవాళ్ళున్నారా?" అడిగింది మహతి.

వాసవి బాధగా నిట్టూర్చింది. "ఎవరి కోసమూకాదు. నాకోసమే?" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

మహతి ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసింది.

"నీకా జోక్ చెయ్యకు" అంది అపనమ్మకంగా.

"లేదు మహీ జోక్ కాదు. నేనుకూడా మనిషినే. నాకూ అందరిలాగే మానసికమైన జబ్బులుండకూడదని రూలుందా?" అంది తేలిగ్గా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

మహతి ఇంకా నమ్మలేనట్లు అలాగే చూస్తోంది.

**"అద్సరే నీవెందుకొచ్చేవిక్కడికి"** అంది వాసవి.

మహతి నీరసంగా నవ్వింది.

"అదంతా చెప్పాలంటే పెద్ద కథవుతుంది"

"మీరిద్దరూ యీ మెట్లమీద నిలబడి ఎంతసేపు మాట్లాడుకుంటారు మీరు త్వరగా వెళ్ళి చెక్ చేయించుకునివస్తే అందరం ఎటైనా వెళ్దాం అన్నాడు అనంత్ వాసవికేసి చూస్తూ.

"ఈ అయిడియా బాగుంది. నీతో ఎవరయినా వచ్చేరా?" అడిగింది వాసవి మహతిని.

"ఊహూ! రోజూ చచ్చేవాళ్ళకోసం ఎవరూ ఏడ్వరు. నేను కాస్త ఏకాంతాన్ని వదులుకోవడం యిష్టంలేక ఒక్కర్తినే వస్తుంటాను అంది మహతి నీరసంగా నవ్వుతూ.

"సరే, కొంచెంసేపు వెయిట్ చెయ్యి ఇప్పుడే వస్తాను" అంది.

వాసవి నీరసంగా లోనికి వెళ్ళింది.

మహతి పైకొచ్చి విజిటర్సు రూమ్‌లో కూర్చుంది.

అనంత్ కూడా ఆమెకెదురుగా కూర్చుని ఏదో మాగజైన్ తిరగెయ్యసాగాడు.

మహతి అనంత్ కేసి దీక్షగా చూసి "వాసవికేవిటి ట్రబుల్" అంది.

అనంత్ చెప్పడానికి కొంచెం తడబడి "కొంచెం నెర్వస్‌నెస్ అంతకుమించి పెద్ద జబ్బేంకాదు" అన్నాడు.

"వాసవికి నరాల బలహీనత? విచిత్రం కోరుకున్న జీవితం లభించి కూడా వాసవి నెర్వసయిందంటే నమ్మలేకుండా వున్నాను" అంది నిట్టూరుస్తూ.

అనంత్ మాట్లాడలేదు.

అతనికర్థమయింది "తనని పక్కన చూసి ఆమె వేరుగా భావిస్తోంది"

అతను, ఆమె మరో ప్రశ్న వేసే అవకాశం యివ్వకుండా బయటకెళ్ళి నిలబడ్డాడు.

ఇంతలో వాసవి బయటకొచ్చి "పదండి" అంది.

మహతి లేచి వచ్చింది.

కారు బీచ్ రోడ్డులో వెళుతోంటే చల్లటిగాలి దూసుకొచ్చి వాళ్ళని ఆప్యాయంగా తడిమింది.

వాసవి ఎడమవైపు కిటికీలోంచి దూరంగా కనిపిస్తోన్న సముద్రంవైపు చూసింది. నీరెండలో ఆకాశంలో వినీలమై బ్లూ ఎమల్షన్‌తో పెయింట్ చేసినట్లున్న సముద్రాన్ని చూస్తే ఆమె మనసు గతంలోకి దూసుకుపోతోంది.

"ఎక్కడికి వెళ్దామంటారు? ఏదైనా హోటల్‌కి వెళ్దామా?" స్టీరింగ్ పక్కన కూర్చున్న అనంత్ అడిగాడు.

"వద్దు జనసాంద్రత వున్నచోట నాకు పరమ చిరాకు. కాసేపు ఈ రోడ్డు పక్కన ఆపండి అలా బీచ్‌లోకి వెళ్ళి కూర్చుందాం" అంది మహతి.

వాసవి మనసు గతుక్కుమంది.

అనంత్‌తో సముద్రపు టొడ్డుకి వెళ్ళడం ఆమెకీ సుతారం యిష్టంలేదు. ఆ తియ్యటి జ్ఞాపకాల్ని గుర్తు తెచ్చుకోవడం వాటిని భరించడం ఆమెకి సాధ్యంకాదు.

"బీచ్ కెందుకు? మరీ చల్లగా వుంటుంది" అంది వాసవి.

"నేను సముద్రాన్ని చూసి ఎన్నేళ్ళయిందో" అంది మహతి నిరాశగా.

వాసవి ఆశ్చర్యంగా "మద్రాసులో వుంటూ అదేంమాట" అంది.

"నేను మద్రాసులో వున్నానో మండపేటలో వున్నానో నాకే తెలియదు. ఈ వూరికి వచ్చినప్పుడు కాబోలు సెంట్రల్ స్టేషన్ నుండి యింటికి వస్తూ టాక్సీలో మౌంట్ రోడ్డు చూసాను. తిరిగి ఈ జబ్బు పుణ్యమా అని ఇంటినుండి ఒక ఫర్లాంగు దూరం హాస్పిటల్‌కి వెళ్ళగలిగే స్వాతంత్ర్యం లభించింది" అంది నవ్వుతూ.

వాసవి బాధగా చూసి "అనంత్ కారిక్కడ ఆపు అంది. కారుని పార్కింగ్ ప్లేస్‌లో పార్కుచేసి తాళం వేసాడు అనంత్.

అప్పటికే వాసవి మహతి ఇసుకలో కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

''ఈ రోజు నాకెంత సరదాగా వుందో తెలుసా? అనుకోకుండా నిన్ను చూడగలిగాను. పంజరంలాంటి మా కొంపలోంచి బయటపడి కాస్త స్వేచ్ఛావాయువులు పీల్చగల అదృష్టం లభించింది'' అంది మహతి ఆనందంగా.

''నీ మాటలు నాకు చాలా తమాషాగా అనిపిస్తున్నాయి. నిన్ను మీ వారు కనీసం సినిమాకి కూడా తీసుకెళ్ళరా'' అంది వాసవి ఆశ్చర్యంగా.

మహతి శుష్కహాసం చేసింది.

''భర్త గురించి ఇలా చెప్పడం తప్పేమో కానీ నువ్వు నాకెంతో ఆత్మీయురాలివి. అందుకని మనసు విప్పి చెప్పేస్తున్నాను. ఆయన మా అత్తగారు తయారుచేసిన మరబొమ్మ. ఆమె కీయిస్తే కదులుతారు. ఆయనకంటూ స్వతంత్రమైన ఆలోచనగాని నిర్ణయం తీసుకునే శక్తిగాని లేవు. ఆడవాళ్ళని స్వేచ్ఛ పాడుచేస్తుందని వాళ్ళకి చదువు, సంధ్యలనవసరమని మగవాడెదుట నోరు విప్పి మాట్లాడడం చాలా తప్పని చెబుతుందామె. ఆమె మాట వేదవాక్కియనకు. గొప్ప తమాషా ఏమిటంటే ఆవిడ మాత్రం తన భర్త ఎదుట పిల్లల ఎదుట లెక్చరు దంచుతుంది. అప్పుడామె తను స్త్రీనన్న విషయం మరచిపోతుందనుకుంటాను''

''ఇంకా యిలాంటి కుటుంబాలున్నాయన్నమాట'' వాసవి విస్తుపోయింది.

''నేను ఒకప్పుడలాగే అనుకునేదాన్ని. చదువుకున్న కుటుంబాలన్నీ చాలా ఎడ్వాన్సుగా వుంటాయని ఇప్పుడు తెలుస్తోంది''

వాసవి దీర్ఘంగా ఆలోచిస్తూ అంది ''నువ్వు మీ ఆయన్ని మార్చడానికి ప్రయత్నించలేదా?''

''అసలు నాకా అవకాశం ఎక్కడ దొరికింది నీకు తెలుసుగా మాది ఉమ్మడి సంసారం. నాకు వంటగదే లోకం. ఆయనకి ఆఫీసు, బజారు పనుల్లో స్వర్గం ఎప్పుడయినా కాస్సేపు ఒంటరితనం దొరుకుతుందని చూస్తే చాలు మా అత్తగారి పహరా వుంటుంది మా యింట్లో జనాభాకు వండివార్చి వడ్డనకు ముగించేసరికి ఆయన గురక తీస్తుంటారు'' అంది మహతి.

''ఇక్కడ కూర్చుందాం'' అంటూ నిర్మానుష్యంగా వున్నచోట ఇసుకలో కూలబడింది వాసవి.

మహతి పక్కనే కూర్చుంది.

తెల్లని నురుగుని మోసుకుని అలలు ఒడ్డుకి వచ్చి వెనక్కుమళ్ళుతున్నాయి.

''అద్సరే నీకసలేవిటి జబ్బు అసలెందుకిలా అయిపోయావ్? మీ వాళ్ళెవరూ నిన్ను పట్టించుకోవడంలేదా?'' అంటూ అడిగింది. వాసవి.

మహతి కళ్ళలో నీళ్ళూరాయి.

''ఒక వయసువచ్చాక ఒకరు పట్టించుకోవాలన్నది అర్థంలేని మాట పెళ్ళిచేసి ఒకదారి చూపించి వాళ్ళు బాధ్యత తీర్చుకున్నామనుకున్నారు.

''ఇన్నాళ్ళూ పెరిగిన యింటిని వదలి పరాయింట్లోకి వచ్చిందని ఆమెని అన్నివిధాల ఆదరించాల్సిన బాధ్యత తమమీద వుందన్న ఆలోచన వీళ్ళకి లేదు. నాకు ప్రాణంలో ప్రాణమైన వీణ అమ్మేసారు. అప్పుడే సగం చచ్చిపోయాను. కాస్సేపు మనసాగక ఏ మాగజైనన్నా ముట్టుకుంటే చాలు తప్పుచేసినట్టు చూస్తారు. నా గుండెలో బాధ చెప్పుకోవడానికి మనిషిలేక అలాగే అనుకోవడాన్న అది ఫిట్సుగా మారి చివరికి హిస్టీరియాగా దారితీసింది. దాని పుణ్యమే ఈ కాస్త స్వేచ్ఛన్నా'' అంటూ నవ్వింది మహతి.

వాసవికి ఆమె గాథ కన్నీరు తెప్పించింది.

"మహీ ఎంత పాడయిపోయావో తెలుసా? నిన్ను చూస్తే గుండె తరుక్కుపోతున్నది పెళ్ళి ఆడదానిపట్ల శాపమా ఎంతో డబ్బు ఎదురిచ్చి వివాహం చేసుకునేది మనసుండి ఆలోచించడం మానుకుని ఆత్మాభిమానంవుండి అవమానాల పాలవ్వడానికే తనకి అన్ని విధాల సుఖాన్ని సహకారాన్ని అందించే ఆడదాన్ని అర్ధాంగిగా చూడలేని మగవాడితో ఎందుకే కాపురం అంది" ఆవేశంగా.

మహతి నిస్పృహగా నవ్వింది.

"నీకన్నా ఆవేశంగా ఆలోచించిన క్షణాలున్నాయి. చాలామంది ఆడవాళ్ళు నగలు చీరలువుంటే సుఖంగా వున్నట్లు భావిస్తారు. అదెంత పొరపాటో ఎవరికైనా అనుభవం మీద తెలుస్తుంది మనిషికి అన్నిటికన్నా ముఖ్యమైనది స్వేచ్ఛ ఆత్మాభిమానం దెబ్బతగలకుండా చూసుకోవడం.

అవి గాలి నీరులాగే ప్రతి మనిషికి చాలా అవసరం అవి పోయిన రోజు ఈ సంసారం, ఈ మొగుడు గో టు హెల్ సాంప్రదాయం అనే చట్రంలో ఆడదాన్ని బిగించి కట్టుబాట్లు అనే కటకటాల్లో బంధించి ఈ సమాజం ఎంతగా ఆడదాన్ని హింసిస్తుందో ఒక్కొక్క యింటికెళ్ళి ఒక్కొక్క ఆడదాన్ని అడిగితే తెలుస్తుంది. అప్పుడప్పుడు నాకేమనిపించేదో తెలుసా ఈ కొంపలోంచి పారిపోయి స్వేచ్ఛగా బ్రతకాలని అసమర్దుడయిన మొగుడితో కాపురం చేసేకన్నా సమర్ధుడయిన వాడితో లేచిపోవడం సుఖమని మనవాళ్ళు ఎప్పుడో అన్నారు కానీ నా ఆలోచనలకి వున్నంత తెగింపు నా చేతలకి లేదు. అలా చేసినా నా దురదృష్టానికి మళ్ళీ దుష్టుడే దొరికితే? అందుకే ఈ జబ్బుని పోషిస్తూ బ్రతుకుతున్నాను. నాకు తెలుసు నాకు స్వేచ్ఛ దొరకనంతకాలం నాకీ జబ్బు పెరుగుతుందేకానీ తరగదు" అంది మహతి ఒకరకమైన ఉద్వేగంతో.

వాసవి ఆమెవైపు భయంగా చూసింది.

"నిన్ను చూస్తే నాకు భయమేస్తుందే" అంది వాసవి.

"ఎందుకు? ఈ దేశంలో ఏ ఆడదాని చరిత్ర కదిపినా ఏమున్నది. కన్నీటి కథ తప్ప. డోంట్ వర్రీ. మనసు కట్టేసుకుని మరబొమ్మల్లా బ్రతుకుతున్న కోటానుకోట్ల భారత స్త్రీ జనంలో నేనొక్కర్తిని" అంది మహతి నవ్వుతూ.

వాసవి నవ్వలేదు.

ఆమెకేదో భయంగా, ఆందోళనగా వుంది.

"అద్సరే. నా సంగతులు చెప్పి నీకు బోరెక్కించేశాను. అసలు నీకేవిటే జబ్బు. నీ అంత అదృష్టవంతురాలు నూటికో కోటికోవుంటారు. కావాల్సిన దాన్ని శాసించి పొందగల వాసవికి నెర్వస్‌నెస్సా?" అంది మహతి ఆశ్చర్యంగా.

వాసవి పెదవులపై పేలవమైన చిరునవ్వు మెరిసి మాయమయ్యింది.

"నీవనుకున్నట్లే అనంత్‌ని పెళ్ళిచేసుకున్నావ్. ఇద్దరూ ఎంత ముచ్చటగా వున్నారో తెలుసా? అనంత్ యిప్పుడింకా అందంగా వున్నాడు. అతనికిక్కడ బిజినెస్సా?" అడిగింది మహతి ఆత్రుతగా.

వాసవి గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది.

"ఇంతసేపట్నుంచి ఆమె అనంత్‌ని తన భర్తగా భావిస్తున్నదన్నమాట. మై గుడ్‌నెస్" అనుకుంది. వాసవి.

"నువ్వెలాగైనా చాలా అదృష్టవంతురాలివి. అనంత్ లాంటి భర్త దొరకడం అదృష్టం. కాకపోతే మరేమిటి? ఇంతకీ నాన్నగారెలావున్నారు?" అంది మహతి.

వాసవి నిజం చెప్పడానికి నోరు రాలేదు. అనంత్‌ని పెళ్ళిచేసుకోలేదన్న నిజాన్ని చెప్పలేకపోయింది వాసవి.

"డాడీ బాగానే వున్నారు" అంది వెర్రినవ్వు నవ్వుతూ.

సరిగ్గా అప్పుడే వచ్చాడు అనంత్ రెండుమూరల కనకాంబరాలు, పల్లీలు తీసుకుని.

"పల్లీలెందుకు చిన్నపిల్లల్లా" అంది మహతి నవ్వుతూ.

"మా వాసవికి అవంటే చాలా ఇష్టం" అన్నాడు అనంత్ యాధృచ్ఛికంగా.

వాసవి అతనికేసి విచిత్రంగా చూసింది.

మహతి నవ్వింది సరదాగా.

"ఇంత మంచి భర్త వుండగా మా వాసవికి జబ్బేమిటి? మనసు బాగాపోతే ఇద్దరూ ఏ ఊటీనో, కాశ్మీరో చెక్కేయండి నాలుగుప్రదేశాలు తిరిగితే ఎలాంటి రోగమైన పరుగెత్తుతుంది" అంది మహతి నవ్వుతూ.

అనంత్ ఖంగుతిన్నట్లు చూసాడు మహతివేపు.

ఆ వెంటనే అతని దృష్టి వాసవి వేపు మళ్ళింది.

వాసవి తల దించుకుని ఇసుకలో గీతలు గీస్తోంది.

"మీకు చెబుతుంటే అటు చూస్తారేం? మా వాసవికి మళ్ళీ వంట్లో బాగాలేదంటే ఆ తప్పుమీదే అవుతుంది" అంది మహతి రెట్టిస్తున్నట్లు.

"చీకటి పడుతున్నది. మీ యింట్లో ఏమైనా అంటారేమో? ఇక బయల్దేరదామా?" అంది వాసవి లేచి నిలబడుతూ.

మహతి కూడా పైకి లేచింది.

"కొంచెం మా యింటిదాకా రాకూడదు. లేకపోతే మా అత్తగారు ఇంతసేపూ ఎటో వెళ్ళాననుకుంటుంది" అంది మహతి.

వాసవి సరేనంది.

ఆమె అనంత్ వేపు చూడకుండా "మనం మహతిని ఇంటిదగ్గర డ్రాప్ చేసి వెళ్దాం" అంది.

అనంత్ సరేనన్నట్లు తలవూపాడు.

కారు మహతి చెప్పిన గుర్తుల ప్రకారం వాళ్ళింటి ముందాగింది.

ఇల్లు ముఖం చూడగానే మహతి ముఖ కవళికలు మారిపోయాయి. ఆమె శరీరం సన్నగా వణకడం గమనించింది వాసవి.

మహతితోపాటు వాసవి కూడా కారు దిగింది.

"మీరూ రండి" అంది మహతి అనంత్‌ని.

"నేనిప్పుడెందుకులెండి" అన్నాడు అనంత్ మొహమాటంగా.

"లేదు లేదు. మీ యిద్దర్నీ చూస్తేనన్న మా అత్తగారికి జ్ఞానోదయం కలుగుతుందేమోనని. డబ్బున్న వాళ్ళని చూస్తే ఆవిడకి చాలా మమకారం" అంది మహతి.

వాసవి ఎటో చూస్తూ నిలబడింది.

అనంత్ కారు దిగాడు.

ముగ్గురూ లోనికి వెళ్ళారు.

అత్తగారు రమామణి గబగబా ఎదురొచ్చి వీళ్ళని చూసి నవ్వుతూ "ఇంత ఆలస్యమైతే ఏమయ్యేవోనని హడలి చస్తున్నా. ఇంతకీ వీళ్ళెవరు?" అడిగింది ఆరాగా వాళ్ళిద్దర్నీ చూస్తూ.

వాసవి. అనంత్ ఆమెకు నమస్కరించారు.

ఆమె కళ్ళు బయట నిలబడి వున్న టొమేటా రంగు టొయాటా కారు మీద నిలిచాయి.

"కూర్చోండి.. కూర్చోండి" అంది రమామణి ఆదరంగా.

మహతి వాసవి గురించి చెప్పింది.

"మీరింత మంచి ఫ్రెండ్సా? ఆ సంగతి నాకు చెప్పనే లేదు. వెళ్ళి కాఫీ తీసుకురా" అని కోడల్ని పురమాయించింది.

మహతిలోనికెళ్ళబోతే వాసవి వారించింది.

"ఇప్పుడేం వద్దు. మరొకసారి వస్తాం" అంది వాసవి.

వాళ్ళిద్దరూ లేచి వస్తుంటే ముచ్చటగా వుంది జంట. అని రమామణి అనడం వాళ్ళిద్దరికీ వినిపించింది.

కారు ఇంటివేపు వెళుతూంటే వాసవి వెనుక సీటులో మౌనంగా కళ్ళు మూసుకుని కూర్చుంది.

అనంత్ ఆమె వంక క్రీగంట చూసాడు.

వాసవి కళ్ళు తెరవలేదు.

అనంత్ కారు మెల్లిగా డ్రయివ్ చేస్తున్నాడు. అనంత్ గొంతు సవరించుకున్నాడు.

వాసవి మెల్లిగా కళ్ళు తెరచి అతనివేపు చూసింది.

వ్యూ మిర్రర్‌లోంచి ఆమెని గమనిస్తున్నాడు అనంత్.

"నువ్వు..నువ్వు.. మహతి కేం చెప్పావ్?" అన్నాడు మెల్లిగా. వాసవి కళ్ళుదించుకుంది.

"నేనేం చెప్పలేదు. అదే అలా అనుకుంది" అంది వాసవి.

"కాని నువ్వు నిజం ఎందుకు చెప్పలేదు" ఆశ్చర్యంగా అడిగాడు అనంత్.

వాసవి కాస్సేపు తప్పుచేసినట్లు తలదించుకుంది.

"ఎందుకో నాకే తెలియదు, చెప్పలేకపోయాను."

అనంత్ ఆమె వేపు చిత్రంగా చూసాడు.

"రేపెప్పుడయినా నిజం తెలిస్తే ఏం బాగుంటుంది? నువ్వెందుకో ఈ మధ్య చాలా విచిత్రంగా ప్రవర్తిస్తున్నావు" అన్నాడు అనంత్.

అతనామెను మీరు అని మన్నించకుండా మాట్లాడుతున్న సంగతి కూడా మరచిపోయాడు.

వాసవికూడా గమనించలేదు.

"మహతి మనల్ని చూసి ఎందుకో చాలా ఉత్సాహపడింది. ఆమె హిస్టీరియాతో బాధపడుతున్నది. తన సంసారం సరిగ్గాలేదని ఫీలవుతోంది. అలాంటప్పుడు ఈ నిజం కూడా చెప్పి ఆమెను హర్ట్ చెయ్యలేకపోయాను" అంది వాసవి సంజాయిషీ యిస్తున్నట్లుగా.

అనంత్ మరేం మాట్లాడలేదు.

"ఈ విషయం నీకు బాధ కలిగిస్తే నన్ను క్షమించు" అంది వాసవి బాధగా.

"క్షమాపణలెమిటి మనమధ్య. సిల్లీ నీకు ఆనందాన్ని, సంతృప్తిని కలిగించే ప్రతి విషయమూ నాకు ఆనందమే" అన్నాడు అనంత్. అలా అంటున్నప్పుడు అతని కళ్ళలో మెరిసిన మెరుపు వాసవి గమనించలేదు.

27

గడియారం టిక్కుటిక్కుమంటూ శబ్దంచేస్తూ ఆ అర్ధరాత్రి ప్రశాంతమైన వాతావరణంలో తన వునికిని గర్వంగా చాటుకుంటుంది.

వాసవి గాఢ నిద్రలో పక్కకి కదిలింది.

పక్కనే చాపమీద నిద్రపట్టక దొర్లుతున్న పరిమళ వాసవివైపే దీక్షగా చూస్తోంది.

ఆ చూపులో ఎన్నెన్నో భావాలు దొర్లిపోతున్నాయి.

వాసవిని చూస్తే ఆమె మనసు అదోలా అయిపోయింది.

చెప్పలేని అయిశ్వర్యమొకటే మనిషికి ఎలాంటి సుఖాన్ని యివ్వలేదనే నిజాన్ని వాసవి జీవితం చెబుతోంది.

భర్తదగ్గర వున్నా ఒంటరిగా బ్రతుకుతున్న ఆమెపట్ల పరిమళకి చాలా జాలి.

తలుపు దగ్గర ఏదో శబ్దమయితే వులిక్కిపడినట్లు చూసింది పరిమళ.

ఆమె కళ్ళు మెల్లిగా తలుపువేపు, కిటికీవేపు పరీక్షగా చూసాయి.

సన్నటి వెన్నెల ఆవరించిన గోడలమీద చెట్ల కీ నీడలు చిన్నగా కదులుతున్నాయి.

ఉండి వుండి ఏదో పక్షి కూసిన శబ్దం.

పరిమళ ధైర్యంగా తలతిప్పి కళ్ళుమూసుకుంది.

అయిదు నిముషాలు గడిచాయి.

మళ్ళా ఏదో శబ్దం.

పరిమళ కళ్ళు తెరిచీ తెరవనట్లుగా ఎదురు తలుపువేపు చూసింది.

ఆ తలుపు సహజంగా ఎవరూ వాడరు. అందరూ తిరగడం తన తలవేపున్న తలుపుగుండానే, దాని గడియ తనే గట్టిగా బిగించింది.

మరీ శబ్దం? ఆమె ఆలోచిస్తూ ఎదురుగావున్న కిటికీవేపు చూసింది.

కిటికీ ఎదురుగావున్న గోడమీద పడ్డ నీడని చూసి ఆమె కనుబొమలు ముడిపడ్డాయి.

ఆమె వూపిరి బిగించి నిశ్శబ్దంగా లేచి గోడపక్కగా జరిగి నిలబడింది.

ఆమె చేతులు మెల్లిగా గోడని తడిమి స్విచ్‌ని అందుకున్నాయి.

కాని ఆమె స్విచ్‌ని ఆన్ చేయలేదు.

మరో చేత్తో తలుపు గడియని తడిమి చూసింది.

అది తీసే ఉంది.

ఆమెలో టెన్షన్ ప్రారంభమయ్యింది.

ఆ వచ్చిన వ్యక్తెవరో తెలియడంలేదు.

ఆమె మెల్లిగా గడియ వేద్దామని చేతిని తలుపుమీద పెట్టింది.

సరిగ్గా అప్పుడే తలుపు అటువేపునుంచి తెరిచిన శబ్దం.

పరిమళ నిలువునా బిగుసుకుపోయింది.

నిలువెత్తు మనిషిలోనికి రావడం చూసి ఆమె గబుక్కున స్విచ్ ఆన్ చేసింది.

గదంతా వెలుగు వ్యాపించింది.

ఎదుటవున్న వ్యక్తిని చూసి ఆమె స్థంభించిపోయింది.

ఆ వ్యక్తి ఆమెను చూసి చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నించాడు. పరిమళ నవ్వలేదు.

"మీరా?" అంది ఆశ్చర్యంగా.

"అవును" అన్నాడతను.

"ఈ టైమ్‌లో.. అమ్మగారి గదిలోకి..." అంటూ అనుమానంగా చూసింది పరిమళ.

"రావలసి వచ్చింది. ఆ సంగతి తరువాత మాట్లాడుకుందాం. నువ్వు పడుకో. లేకపోతే అమ్మగారు నిద్రలేస్తారు" అంటూ వెళ్ళిపోతున్న వ్యక్తివేపు విచిత్రంగా చూసింది పరిమళ.

ఆ తర్వాత ఆమెకెంతకూ నిద్రపట్టలేదు.

ఈ విషయం వాసవికి చెప్పడమా అని ఆలోచిస్తున్నదామె అంతరంగం.

**"మీకో విషయం చెప్పాలి"** అంది పరిమళ వాసవి పక్కనే క్రింద కూర్చుంటూ.

"ఏమిటి?" వాసవి చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి అడిగింది.

"మీరేమీ అనుకోరు కదా."

వాసవి పరిమళ వేపు చూసి చిన్నగా నవ్వింది.

"చెప్పు. అనుకునేదీ లేందీ తర్వాత చెబుతాను" అంది.

"అనుకున్నా ఫర్వాలేదు. మీ మంచి కోసమే నేనేది చెప్పినా. అయ్యగారు లేనప్పుడు మీరిక్కడ ఒంటరిగా ఎందుకు? మీ నాన్నగారి దగ్గరకెళ్ళి వుండొచ్చుగా" అంది.

"ఇప్పుడకస్మాత్తుగా ఏమొచ్చింది?" అంది వాసవి.

"ఈ లంకంత మేడలో మీరు ఒంటరిగా వుండటం బాగోలేదు."

"నువ్వూ, సెక్రటరీ వుండగా నేను ఒంటరినెలా అవుతాను" అంది వాసవి.

"మీకంతా నవ్వులాగే వుంటుంది. నేను సరే అనుకోండి. ఆ సెక్రటరీ బాబుని నమ్మకండి. అతను మగవాడు" అంది పరిమళ.

వాసవి ఆశ్చర్యంగా చూసింది పరిమళవేపు.

"ఏం జరిగిందసలు"

"చెబితే నమ్ముతారో లేదో రాత్రి..రాత్రి"

"మే ఐ కమీన్?"

వాసవి వెనక్కు తిరిగి చూసింది.

అనంత్ నిలబడి వున్నాడు.

"రా!" అంది వాసవి నవ్వుతూ అతను పరిమళవేపు అదోలా చూసి "కాఫీ తీసుకురా?" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

పరిమళ ముఖం చిట్లించి వంటగదివైపు వెళ్ళిపోయింది.

"రాత్రి బాగా నిద్రపట్టిందా?"

వాసవి నవ్వుతూ తలవూపింది.

"ఈ రోజు మనం డాక్టరు దగ్గరకెళ్ళాలి. గుర్తుందా?"

"ఎందుకుండదు. ఈ రోజు మహతిని కూడా చూడ్డానికెళ్ళాలి" అంది.

"ఫ్రెండ్‌ని బాగా గుర్తుపెట్టుకున్నారు. అద్సరే పరిమళ వంట మనిషి ఆ సంగతి మరచిపోవద్దు మీరు" అన్నాడు అనంత్.

వాసవి విచిత్రంగా చూసింది.

"పనివాళ్ళకి ఎక్కువ చనువియ్యడం మంచి విషయంకాదని నేను క్రొత్తగా చెప్పనక్కరలేదు. ఆమె మీరనుకున్నంత అమాయకురాలు కాదు."

వాసవి ఆశ్చర్యంగా చూసింది.

"ఆమె చరిత్ర హీనురాలు మనకి కావాల్సింది వంటపని కాబట్టి ఆమెకీ వయసులో దిక్కుంటుందని తీసుకొచ్చాను."

పరిమళ రావడం గమనించి అనంత్ చెప్పడం ఆపు చేసాడు.

పరిమళ యిద్దరికీ కాఫీ అందించి అక్కడే నిలబడింది. అనంత్ కాఫీ త్రాగి లేచి నిలబడ్డాడు.

"వస్తాను కొన్ని కంపెనీ పనులున్నాయి సాయంత్రం రెడీగా వుండండి" అంటూ అతను వెళ్ళిపోతుంటే వాసవి అతనికేసి రెప్పవేయడం మరచినట్లు చూసింది.

అనంత్ ఫుల్‌వైట్ డ్రెస్ టక్ చేసి పీకాక్ బ్లూ కలర్‌పై తెల్లటి చుక్కలున్న టై కట్టుకున్నాడు.

ఆ డ్రెస్‌లో అతని విగ్రహం చాలా అందంగా వుంది.

అతను క్రమమైన పద్ధతిలో అడుగులేస్తూ వెళ్తుంటే వాసవి కనిపిస్తున్నంత వరకూ అలాగే చూడటం పరిమళ గమనించింది.

"అమ్మగారూ"

వాసవి ఉలిక్కిపడ్డట్లుగా చూసి 'ఊ' అంది.

"కాఫీ చల్లారి పోతోంది."

వాసవి చూపు తిప్పి కాఫీ గడగడా త్రాగేసింది.

ఆ వెంటనే కప్పు పరిమళ చేతికిచ్చి "ఇందాక ఏదో చెప్పబోయావుగా" అంది నవ్వటానికి ప్రయత్నిస్తూ.

పరిమళ అదోలా చూసి "చెబితే మీరు నమ్ముతారా?" అంది. వాసవికి కాస్త కోపమొచ్చింది.

అనంత్ చెప్పినట్లు పనివాళ్ళని దూరంగానే వుంచాలి. ఏదో దిక్కు లేనిదని పెద్ద వయసుదని కనికరంగా చూస్తుంటే పరిమళ ఒక్కోసారి తన హద్దులు దాటడానికి ప్రయత్నిస్తున్నట్లనిపిస్తుంది వాసవికి.

"నమ్మడం నమ్మకపోవడం అది నా యిష్టం మీద ఆధారపడి వుంటుంది. జరిగిందేమిటో చెప్పడం నీ బాధ్యత" అంది చిరాగ్గా.

వాసవి ముఖంలోని విసుగు చూసి కాస్త జంకింది పరిమళ.

"రాత్రి..రాత్రి.. మీ గదిలోకి"

"నా గదిలోకి ఏం జరిగిందో సరిగ్గా చెప్పు" అంది వాసవి అసహనంగా.

"అదే చెబుతున్నాను. రాత్రి సెక్రటరీ అయ్యగారు మీ గదిలోకి రావడానికి ప్రయత్నించారు. నేను నా కళ్ళతో చూసాను" అంది పరిమళ గబగబా.

వాసవి తెల్లబోయినట్లు చూసి "నువ్వు నిజమే చెబుతున్నావా?" అంది.

నా ఒక్కగానొక్క కూతురి మీద ఒట్టేసి చెబుతున్నాను. అతను నన్ను చూసి వెళ్ళిపోయాడు. మిమ్మల్ని నిద్రలేపవద్దని కూడా చెప్పాడు. "తలుపు తట్టి పిలిచాడా?" అడిగింది వాసవి.

"అలాగయితే ఇంత నేరంగా చెప్పాల్సిన పనిలేదు. అతను చీకట్లో తలుపు పక్క తారట్లాడటం గమనించాను. అతను మెల్లిగా తలుపు తీసుకు రావడంతో నేను లైటేసాను. దాంతో నాకు దొరికిపోయాడు" అంది పరిమళ.

వాసవి ముఖం చూస్తుండగానే అదోలా ఎర్రబడిపోయింది.

అతను..అతను ఎందుకు తన గదిలోకి ప్రవేశించి వుంటాడు? అంత అర్ధరాత్రిపూట తన గదిలో అతనికేం పని.

జగదీష్ లేకపోవడంతో ఏదైనా దురుద్దేశ్యంతో అతను తన గదిలోకి అడుగుపెట్టివుంటాడా?

ఇదివరలో తను జగదీష్ లేకుండా అనేకసార్లు వుంది. అప్పుడు చేయని ధైర్యం అతనికిప్పుడెందుకు కలిగింది.

ఈ మధ్య తన అనారోగ్యరీత్యా, ఒంటరితనం వల్ల అనంత్‌తో ఆత్మీయంగా వుంటోంది. దాన్ని ఆసరా చేసుకుని అతను మరో అడుగు ముందుకేసాడేమో? వాసవికి తలచుకున్న కొద్దీ మతి పోయినట్లనిపిస్తోంది. తనసలు ఎవరిని నమ్మాలి?

కట్టుకున్న భర్త పెళ్ళినాటి నుండి సమాంతరంగానే మిగిలిపోయాడు. అతను తనూ కలిసేది బహుశా నింగీ నేల ఏకమయిన చోటేమో. అతనికి మానసికంగా కూడా తను దగ్గర కాలేకపోతోంది. అవ్వాలని ప్రయత్నించినప్పుడు ఏదో ఒక విషయం బయటపడి తనని అతనికి దూరంగా తరిమేస్తున్నది. ఇన్నాళ్ళూ దూరంగా వున్నా అతన్ని చూడాలని తన మనసు ఉరకలు వేయడంలేదు.

ముత్తు మరణంతో తనని భయంకరమైన భయం పీడిస్తోంది. దాన్ని పోగొట్టుకోవాలని తను తన అంతరాలు మరచి ఇటు పరిమళతో అటు అనంత్‌తో ఆత్మీయంగా వుంటోంది.

వీళ్ళిద్దరూ ఒకర్ని నమ్మొద్దని మరొకరు హితబోధ చేస్తున్నారు. అసలిందులో ఎవరు నిజంగా తనకి సన్నిహితులు.

అర్థం కావడంలేదు వాసవికి. అనంత్ నిజంగా తన మీద అలాంటి కోరిక వుంటే అతన్ని ప్రాణంగా ప్రేమించిన రోజుల్లో అతనికి ఎన్నో అవకాశాలిచ్చింది. ఎన్నో విధాలుగా రెచ్చగొట్టింది.

అతనెప్పుడూ తొందరపడలేదే. తను అగ్నిశిఖలా వెంటబడితే అతను మంచుపర్వతంలా చల్లబరచేసేవాడు.

వాసవి బుర్ర ఆలోచనలతో గజిబిజిగా తయారయ్యింది.

తనతో ఎంతో చనువుగా వుండే ఈ శంకర్‌గాడిప్పుడు సరిగ్గా యింట్లోనే వుండటంలేదు ఏమయినట్లు?

"శంకర్ ఎక్కడికి వెళ్ళాడు?" అంది వాసవి పరిమళవైపు విసుగ్గా చుస్తూ.

"వాళ్ళ అత్తకూతురికి సీరియస్‌గా వుందని ఎగ్మూరు మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రిలో జాయిన్ చేసారంటమ్మా అక్కడికి వెళుతున్నాడు" అంది పరిమళ.

"నాకు చెప్పనక్కరలేదా?" అంది వాసవి కోపంగా.

"చెప్పాలనే వచ్చాడు. మీరు ఒంట్లో బాగోక పడుకుంటే నాకు చెప్పి వెళ్ళాడు. ఒక పదిహేనురోజులు అక్కడే వుంటాడట."

వాసవి మాట్లాడలేదు.

మరో అరగంట నిశ్శబ్దంగా గడిచిపోయింది.

పరిమళ వాసవి ముఖంలోని గాంభీర్యానికి జంకి మెల్లిగా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఎన్నో గంటలు గడిచాయి. ఆమె అక్కణ్ణుండి కదలలేదు.

ఆమెని భోంచేయమని అడగటానిక్కూడా ధైర్యం చాలనట్లు వూరుకుండి పోయింది పరిమళ.

"మేడమ్"

వాసవి కళ్ళు తిప్పి చూసింది.

అనంత్ నిలబడి వున్నాడు.

"మీరింకా తయారవ్వలేదేంటి? అవతల టైమవుతోంది" అన్నాడు మెల్లిగా.

వాసవి అతని ముఖంలో ఎక్కడా పరిమళ చెప్పిన విధంగా మోసగాడి లక్షణాలు కనిపించడంలేదు.

చాలా నిర్మలంగా నవ్వుతూ "అలాగున్నారేంటి?" అన్నాడు. వాసవి మాట్లాడకుండా లేచి లోనికి వెళ్ళి తయారయి వచ్చి "పద" అంది.

కారు బీచ్ రోడ్డులో వెళ్తోంటే "కాసేపిక్కడ ఆపు" అంది.

అన్మత్ ఆశ్చర్యంగా చూసి డాక్టర్‌గారు వెళ్ళిపోతారేమో అన్నాడు.

"ఫర్వాలేదు. ఒక అరగంట" అంది.

కారు పార్కింగ్ ప్లేసులో ఆపాడు అనంత్.

వాసవి కారు దిగి పదడుగలు ముందుకి నడిచి వెనక్కు తిరిగి చూసింది.

అనంత్ కారునానుకుని నిలబడి చూస్తున్నాడు.

"అనంత్ నువ్వూ రా" అంది.

అతను ఆమెను చేరుకున్‌న్నాడు.

ఇద్దరూ ఇసుకలో మెల్లిగా అడుగులేస్తున్నారు.

"ఇక్కడ కూర్చుందామా?" అంటూ ఇసుకలో కూలబడింది.

అనంత్ నాలుగడుగుల దూరంలో కూర్చున్నాడు.

ఆమె అనంత్ కేసి దీక్షగా చూసింది.

అనంత్ నవ్వి "ఏంటలా చూస్తున్నారు?" అన్నాడు.

వాసవి కూడా చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ "నీలో చాలా మార్పులొచ్చాయి" అంది.

"ఏ విధంగా?" అన్నాడతను ఆసక్తిగా.

"అన్ని విధాల"

"మొత్తానికి మీరు నన్ను చాలా క్లీన్‌గా అబ్జర్వ్ చేస్తున్నారన్నమాట" అన్నాడు నవ్వుతూ.

వాసవి మాట్లాడలేదు.

"నేనొక విషయం అడిగితే నువ్వు నిజమే చెబుతావా?"

"నేను అబద్ధం చెబుతానని ఎందుకనుకుంటున్నారు మీరు?"

"నేను బాధపడతానని కావొచ్చు. లేదా నాకు కోపం రావొచ్చునని కావొచ్చు."

అనంత్ నవ్వి "అడగండి" అన్నాడు.

"రాత్రి నా గదిలోకి ఎందుకొచ్చావు" అంటూ సూటిగా అతని కళ్ళల్లోకి చూసింది వాసవి.

అనంత్ నవ్వి "పరిమళ చెప్పిందా చెప్పొద్దన్నానే" అన్నాడు.

తాననుకున్నట్లు అనంత్ కంగారుపడక పోవడం వాసవికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఆ సంగతి వదిలేయ్. ఎందుకు రావాల్సి వచ్చిందో చెప్పు" అంది.

"నేను ఏ ఉద్దేశ్యంతో వచ్చానో నువ్వు ఊహించలేవా?" అన్నాడతను ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

వాసవి కనులు వాలిపోయాయి.

తనతన్ని గట్టిగా నిలవేయాలనుకుంటే అతడు తననే సూటి ప్రశ్నలు వేస్తున్నాడు.

ఒక మగవాడు, అందులో పూర్వాశ్రమంలో ప్రియుడు. అర్ధరాత్రి నిశ్శబ్దంగా ఆమె గదిలోకి ఎందుకు ప్రవేశిస్తాడు.

ఆ విషయాన్నే చాలా ధైర్యంగా చెబుతున్నాడు అనంత్.

వాసవి తెల్లబోయి చూసిందతని వేపు.

ఆమె మాట్లాడకపోవడం చూసి అతనే అన్నాడు.

"నువ్వు నన్నపార్థం చేసుకుంటున్నావా?" అన్నాడు బాధగా.

అర్థం చేసుకోటానికి నువ్వు అవకాశం యివ్వడంలేదు. అంది వాసవి.

అనంత్ బాధగా నవ్వాడు.

"నేనొక విషయం నీనుండి దాచి పెట్టాలనుకున్నాను. కానీ అది మరో అనర్థానికి దారి తీస్తున్నప్పుడు నిజాన్ని చెప్పక తప్పదు. రాత్రి ఎవరో మేడమీదకి రావడం గమనించి వెంట వచ్చాను. ఆ మనిషి నీ గదిలోకి రావడం చూసి తలుపు తీసుకుని రాక తప్పలేదు.

వాసవి నివ్వెరపోయినట్లు చూసింది.

"నా గదిలోకి ఎవరొచ్చారు?"

వాసవి నివ్వెరపోయినట్లు చుసింది.

"నువ్వసలే నెర్వస్‌గా వున్నావని నీకీ విషయం చెప్పకూడదని ప్రయత్నించాను. కానీ నువ్వు నన్నపార్థం చేసుకుంటే చెప్పక తప్పలేదు" అన్నాడతను బాధగా.

వాసవి కళ్ళు పెద్దవి చేసి చూసింది.

ఆమె శరీరం సన్నగా వణకడం అతను గమనించాడు.

ఆమె చెయ్యిని అతను గట్టిగా పట్టుకుని "భయపడుతున్నారా?" అన్నాడు అనునయంగా.

వాసవి మాట్లాడలేదు.

ఆమె కళ్ళలో నీళ్ళతడి కనిపిస్తోంది.

"ప్లీజ్ డోంట్ బి అప్‌సెట్. నేను లేనూ" అతని ఓదార్పులు ఆమె కందుతున్నాయో లేదో తెలియనట్లు అలాగే స్థంభించినట్లుగా కూర్చుండిపోయింది వాసవి.

28

మంచమ్మీద పడుకుందన్నమాటే గాని వాసవి కసలు నిద్రరావడంలేదు.

ఆమె ఆ చీకట్లో కదులుతున్న ప్రతి ఆకు కదిలికనూ భయంగా చూస్తోంది.

ప్రతి చిన్న శబ్దానికి ఆమె గుండె చాలా వేగంగా కొట్టుకుంటున్నది.

వాసవి మెల్లిగా లేచి కూర్చుని చుట్టూ చూసింది.

పరిమళ గాఢ నిద్రలో వుంది.

"పరిమళా" మెల్లిగా పిలిచింది.

పరిమళ పలకలేదు.

వాసవి మెల్లిగా హాల్లో లైటేసింది.

ఆమె చూపులు అనంత్ వుండే అవుట్ హౌస్‌మీద పడ్డాయి. అతని గదిలో లైటు వెలుగుతోంది.

ఆమెకి తెలుసు తనకింక నిద్రపట్టదని

రాత్రి అయితే సావిత్రి ఎటునుండి వచ్చి తనమీద దాడి చేస్తుందోనని ఆమె భయపడిపోతున్నది.

ఆమెకు ఎన్నో రకాల ఆలోచనలు. ఎటూ తేల్చుకోలేని అనుమానాలు. అసలు దయ్యాలున్నాయా?

మామూలు పరిస్థితిలోనయితే ఆమె నమ్మదు.

కాని  యింటి వాతావరణం, పరిస్థితులు వాసవికి అనుమానాన్ని కలిగించి దాన్ని బలపరుస్తున్నాయి.

కొన్నాళ్ళు ఈ ఇంట్లో వుంటే తను పిచ్చిదయిపోతుందేమో? వాసవికి మతిపోతున్నది.

నిద్ర చెదరిన తీతువు పిట్ట వికృతంగా అరచి రెక్కలు టపటపలాడించింది.

వాసవి భయంతో బిగుసుకుపోయి చూసింది.

ఆ వెంటనే ఆమె తనకు తెలియకుండానే గబగబా మెట్లు దిగింది.

తన ఎదురుగా నిలబడి వున్న వాసవిని ఆశ్చర్యంగా చూసాడు అనంత్. అతను తను రాసుకుంటున్న పుస్తకాన్ని మూసి "అక్కడే నిలబడ్డావ్ దేనికి? లోపలికి రా" అన్నాడు ఆత్మీయంగా.

వాసవి కళ్ళలో నీళ్ళూరాయి.

ఎంత కాదనుకుని నిగ్రహించుకుందామన్నా తన బలహీనత అతని ముందు బయట పడక తప్పడంలేదు.

"అనంత్ నాకక్కడ భయంగా వుంటోంది" దిగులుగా.

"తెలుసు" అంటూ అతను పక్క సరిచేసి "నీకభ్యంతరం లేకపోతే నిర్మొహమాటంగా యిక్కడే పడుకో ఇదంతా నీ యిల్లే నీకు పూర్తి స్వస్థత చేకూరేట్లు చేయడానికే మేమంతా" అన్నాడు.

వాసవి మెల్లిగా వచ్చి మంచమ్మీద కూర్చుంది.

"పడుకో ఎలాంటి సంకోచం పెట్టుకోకు. నేను పక్కగదిలో రాసుకుంటాను" అన్నాడు అనంత్.

"ఏంటది?"

"ఎకౌంట్సు"

"నిద్రరావడంలేదూ నీకు?"

అనంత్ నవ్వి "పనివుంటే నిద్రరాదు నాకు. లైటు తీసేస్తాను పడుకో" అంటూ అతను లేచి స్విచ్ ఆఫ్ చేయబోయాడు.

"ప్లీజ్ లైటాఫ్ చెయ్యకు. నీకు అభ్యంతరం లేకపోతే యిక్కడే కూర్చుని లెక్కలు చూసుకో" అంది వాసవి అభ్యర్ధనగా.

"నాకు అభ్యంతరమా ఇక్కడే కూర్చుంటాను. నువ్వు నిశ్చింతగా నిద్రపో" అన్నాడు.

వాసవి మెల్లిగా కళ్ళు మూసుకుంది.

అనంత్ ఆమెవంక తదేకంగా చూసాడు.

"వసూ. ఎంత ధైర్యంగా, ఎంత సరదాగా నవ్వుతూ నవ్విస్తూ చలాకీగా వుండేదానివి. ఇప్పుడు ఇంత దీనంగా ఆకులా చలించిపోతున్న నిన్ను చూస్తే నాకెంత బాధగా వుందో తెలుసా. నిన్ను కాదని నీకు నేనెంత అపకారం చేసానో కళ్ళతో చూస్తుంటే నా హృదయం బ్రద్దలైపోతోంది వసూ.  ఆ జగదీష్‌కి బ్దిఇలేదు. అతనికి డబ్బే ప్రపంచం. అతనికి భార్యని సుఖపెట్టడం చేతకాదు. ఈ చెరసాలలో ఎంతకాలం వుంటావు నువ్వు. ఇంత దగ్గరగా వున్న నీకు దూరంగా బ్రతకడం అసాధ్యమైపోతోంది వసూ?"

వాసవి అసహనంగా కదిలింది.

ఆమె భయంతో రెండు చేతులూ గుండెల దగ్గరగా పెట్టుకుని ముడుచుకుని పడుకుంది.

అనంత్ కుర్చీలోంచి లేచి వాసవి దగ్గరగా వెళ్ళాడు.

మెల్లిగా తన చేతితో ఆమె చేతులు నిమిరాడు.

వాసవి నిద్రలోనే అతని చేతిని గట్టిగా పట్టుకుంది.

అనంత్ అలాగే నిలబడ్డాడు.

"అనంత్.. అనంత్ నన్నొదిలి పెట్టి వెళ్ళకు. ఆ సావిత్రి నన్ను చంపేస్తుంది" అంటూ అస్పష్టంగా గొణుగుతోంది వాసవి.

"ఆ జగదీష్ వస్తే?" అనంత్ తలవంచి వాసవి చెవి దగ్గరగా మెల్లిగా అడిగాడు.

"రాడు అతడు దుర్మార్గుడు అతను నన్ను చంపేస్తాడు. నువ్వెళ్ళిపోకు" అంది వాసవి అతని చేతిని గట్టిగా పట్టుకుని.

అనంత్ పెదవులపై చిరునవ్వు మెరిసింది.

అతను ఆమె పక్కనే కూర్చున్నాడు.

వాసవి అతని చేతిని వదల్లేదు.

ఆమె గాఢనిద్రలో కూడా చాలా భయపడుతున్నదనే నిజాన్ని గ్రహించగలిగాడు అనంత్.

**వాసవి నిద్రలేచేసరికి** తెల్లగా తెల్లవారిపోయింది. ఆమె కంగారుగా లేవబోయింది.

"అంత కంగారు దేనికి?" అనంత్ అద్దంలో తలదువ్వుకుంటూ అన్నాడు.

వాసవికి అప్పటికి గానీ బాహ్య స్మృతి రాలేదు.

తను రాత్రంతా అతని గదిలో పడుకున్న సంగతి గుర్తు రాగానే అదోలాంటి సిగ్గు ఆవరించిందామెను.

మెల్లిగా తలదించుకుంది.

"బాగా నిద్రపట్టిందా?" అతను చనువుగా ఎదురుగా వున్న స్టూల్ లాక్కుంటూ అడిగాడు.

వాసవి చిరునవ్వు నవ్వి తల వూపింది.

పరిమళ అక్కడికే కాఫీ పట్టుకొచ్చింది.

వాసవి తెల్లవారేసరికి మంచంమీద కనపడక పోవడంతో చాలా కంగారు పడిందామె.

అమ్మగారు కనిపించడంలేదు. అంటూ చాలా గాభరాగా అనంత్ దగ్గరకొచ్చి చెప్పింది.

అనంత్ పరిమళ వైపు అదోలా చూసి "అమ్మగారంటే నీకు చాలా అభిమానం అనుకుటాను" అన్నాడు తమాషాగా.

పరిమళ మాట్లాడలేనట్లు చూసింది.

"ఆమె ఉప్పు తిని బ్రతుకుతున్నాం కదా" అంది మెల్లిగా.

"ఉప్పు తిన్నందుకే యింత విశ్వాసమా? నాకలా అనిపించడంలేదు. అమ్మగారిమీద ఈగ వాలడం కూడా సహించేట్టులేవు నీవు"

అనంత్ మాటలకి బదులు చెప్పలేనట్లు చూసింది పరిమళ.

"రాత్రి అమ్మగారి గదిలోకొచ్చినట్లు చెప్పొద్దన్నా చెప్పేసావుగా. ఇప్పుడు చూడు అమ్మగారెక్కడున్నారో" అంటూ గదిలోకి పిలిచాడు.

పరిమళ మెల్లిగా త్రొంగి చూసింది.

"అంతేకాదు ఆమెకు నేనంటే ప్రాణం. ఆ విషయం గుర్తుంచుకో" అన్నాడు అనంత్ తీవ్రంగా.

అనంత్ పక్కమీద నిద్రపోతున్న వాసవిని చూడగానే పరిమళకి మతిపోయినట్లయింది.

"ఈ సంగతులన్నీ ఇక్కడే మరచిపో. పెద్దయింటి విషయాల్లో జోక్యం చేసుకోవాలని ప్రయత్నిస్తే.. ముత్తు సంగతి గుర్తుందికదూ" అన్నాడు అనంత్.

పరిమళ మాట్లాడకుండా నిలబడింది.

"వెళ్ళి పదినిముషాలనంతరం కాఫీ తీసుకురా" అన్నాడు అనంత్.

పరిమళకు అంతా గుర్తొచ్చి ముఖం నల్లబడింది.

మౌనంగా వాసవికి కాఫీ అందించింది.

పరిమళని చూడగానే వాసవి ముఖం అదోలా అయ్యింది.

"ఇక్కడ తనని చూసి మరోలా అర్థం చేసుకోదుకదా?" అనుకుంది మనసులోనే.

"రెండురోజులు నాకు శెలవు కావాలి" అంది పరిమళ వాసవివైపు చూస్తూ.

"ఎందుకు?" అడిగింది వాసవి.

"నా కూతురు పరిస్థితి బాగోలేదని తెలిసింది. అది అధోగతిపాలవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత నా మీద వుంది."

"నీకు కూతురుకూడా వుందా?" అడిగాడు అనంత్ వెటకారంగా.

"నేను ప్రస్తుతం వున్న పరిస్థితులవల్ల మీకు నన్ను చూస్తే హేళనగా వుండొచ్చు. నాకు కూడా చక్కటి సంసారం వుండేది" అంది పరిమళ అసహనంగా.

వాసవి అనంత్‌ని ఊరుకోమన్నట్లు సైగ చేసింది.

"సరే. నీ పరిస్థితులు నీవి. వెళ్ళొద్దని నేననను, కానీ నీ కూతురికి నీకు సంబంధం లేదుగా. ఆ విషయాలన్నీ నీకెలా తెలిసాయి?" అంటూ అడిగింది వాసవి.

పరిమళ నిస్పృహగా నవ్వింది.

"వసంతం వచ్చిందని కోయిలని ఎవరూ కూయమని చెప్పరు. వర్షాకాలం వచ్చిందని వాగుని పరుగెత్తమని ఎవరూ అడగరు. ఇవన్నీ ప్రకృతి ధర్మాలు. అలాంటిదే తల్లిప్రేమ. దగ్గరకి రానిచ్చినా దూరంగా త్రోసినా అది బిడ్డకు చెల్లుతుంది గానీ తల్లి మమకారానికి కాదు. నేను ఎంత దూరంగా వున్నా ఆమె స్థితిగతుల్ని గమనిస్తూనే వున్నాను" అంది పరిమళ.

వాసవి మాట్లాడలేనట్లు చూసింది.

"నాకు...నాకు...కొంత డబ్బు కావాలి" అంది పరిమళ.

"ఎంత?" అడిగాడు అనంత్ జేబులో చెయ్యి పెట్టి.

"రెండొందలు. ఈ అప్పు మీరు తర్వాత నెలకింతని తెగ్గోసుకోండి" అంది.

అనంత్ పర్స్ తీసి రెండువందల కాగితాలు తీసి పరిమళకి అందించాడు.

పరిమళ "వస్తానమ్మా" అంటూ వెళ్ళిపోయింది.

"అంతా నాటకం" అన్నాడు అనంత్ ఆమె వెళ్తోంటే చిరాగ్గా.

"అలా అనిపించదు అనంత్ ఆమెను చూస్తే బాగా బ్రతికిన మనిషనిపిస్తుంది నాకు" అంది.

అనంత్ గట్టిగా నవ్వేసి "ఇలాంటి రకాలు అలాగే నటిస్తారు. దీని సంగతి నీకు తెలియదులే" అన్నాడు.

"మరీ అంత చులకనగా మాట్లాడకు అనంత్."

"ఆమె ఎక్కడి మనిషో తెలిస్తే నువ్వు కూడా చులకనగానే మాట్లాడతావు. వయసులో ఎవడితో వచ్చిందో వ్యభిచారంలోకి దిగింది. ఇప్పుడు వయసయిపోయేటప్పటికి వాళ్ళు బయటికి నెట్టారు. ఎప్పుడో నేర్చిన వంటలిప్పుడు పొట్టకూటికి బ్రతుకు తెరువు చూపించింది. గతిలేక రోడ్డుమీద ఏడుస్తుంటే తీసుకొచ్చాను" అన్నాడు అనంత్ నిరసనగా.

వాసవి ఆశ్చర్యంగా వింది.

"తన కూతురు బాగా బ్రతకడం ఇలాంటి కట్టుకథలు చెప్పడం అలాంటి రకాలకి అలవాటు" అన్నాడు అనంత్ తేలిగ్గా నవ్వేస్తూ.

వాసవిలేచి నిలబడింది.

"అనంత్ వంటకెవర్నయినా చూస్తావా మరి"

"ఆ బాధ నీకక్కరలేదు. హోటల్నుండి కారియర్ తెప్పిస్తానులే" అన్నాడు.

"జగదీష్ ఎప్పుడొస్తారట" అడిగింది వాసవి.

అనంత్ ఆశ్చర్యంగా కళ్ళెగరేసి "ఏమిటి సంగతి?" అన్నాడు.

"ఏం లేదు. మరీ ఎక్కువరోజులు పట్టేటట్లయితే నేను హైదరాబాదు వెళ్తాను" అంది.

"ఏం, యిక్కడ బోర్‌గా వుందా?" అంటూ అర్థవంతంగా నవ్వాడు అనంత్.

వాసవి జవాబు చెప్పలేనట్లు తలదించుకుంది.

"నీ కొచ్చిన భయం ఏమీలేదు. ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తే లేనిపోని భయాలు కలుగుతాయి. నాకు కూడా పెద్ద పనిలేదు. ఇద్దరం ఎటైనా వెళ్దాం. కాస్త రిలీఫ్‌గా వుంటుంది" అన్నాడు అనంత్.

వాసవి తలవూపి బయటకొచ్చింది.

కారు మహతి ఇంటి ముందాగింది.

ఇంటిముందు జనం గుంపులు గుంపులుగా నిలబడి వుండటం గమనించి భయపడింది వాసవి.

అనంత్ కూడా అనుమానంగా చూసాడు.

"అనంత్ నాకేంటో భయంగా వుంది. ఎందుకలా ఇంటిముందు జనమున్నారు" అంది వాసవి ఆందోళనగా.

"అదే నాకూ తెలియడంలేదు?" అంటూ కారు దిగాడు అనంత్. ఆ వెనుకే వాసవి దిగింది.

ఇద్దరూ లోనికెళ్తుంటే జనం అదోలా చూస్తున్నారు.

వాసవిని చూడగానే మహతి అత్తగారు పెద్దగా రాగం తీసింది.

"అమ్మో, నీ స్నేహితురాలు కొంప ముంచిందే తల్లీ? మేమేదో దాన్ని ఆరడి పెడ్తున్నట్లు మా పరువు రోడ్డు కెక్కిందమ్మా" అంటూ శోకాలు పెట్టింది.

వాసవి నిశ్చేష్టురాలయి నిలబడిపోయింది.

"ఏం జరిగింది?" అడిగాడు అనంత్.

"నువ్వుకూడా చూస్తూనే వున్నావుగా నాయినా దాన్ని ఎంత బాగా చూసేది. ఏదో కొంప మునిగినట్లు ప్రొద్దుటే కిరసనాయిలు పోసుకుని కాల్చుకుంది."

వాసవి నిర్విణ్ణురాలయింది.

"ఆమెకెలా వుంది?" అనంత్ అడిగాడు.

"ఏమో నాయనా? నాకు కాలూ చెయ్యి ఆడక వెళ్ళలేదు. దాని మొగుడే హాస్పిటల్లో చేర్చాడు.

"ఏ హాస్పిటల్" వాసవి గబగబా అడిగింది.

"అండాళ్ నర్సింగ్ హోం"

వాసవి గబుక్కున అనంత్ చెయ్యి పట్టుకుని "పద" అంది ముందుకి నడుస్తూ.

అనంత్ ఆమె చర్యకు ఆశ్చర్యపడుతూ "ఎక్కడికి?" అన్నాడు.

"హాస్పిటల్‌కి మహతిని చూడాలి?" అంది ఆవేశంగా.

అనంత్ కారుని రివర్సుగేర్ వేసి తిప్పుతూ "అక్కడికి వద్దు వసూ. నువ్వు చూడలేవు" అన్నాడు.

వాసవి వినిపించుకోలేదు.

"మహతిని చూడకుండా వుందామని చెబుతున్నావా అనంత్" అంది తీవ్రంగా.

"నీకు తెలీదు వసూ నీ కసలే బాగుండలేదు" అన్నాడు అనంత్ అనునయంగా.

"ప్లీజ్"

చేసేదిలేక అనంత్ కారుని హాస్పిటల్ వైపు పోనిచ్చాడు.

కారు హాస్పిటల్ చేరగానే పరుగులాంటి నడకతో లోనికెళ్ళింది వాసవి.

మహతిని చూడగానే వళ్ళు ఝల్లుమంది వాసవికి.

నల్లగా బొమ్మలతో వికృతంగా వున్న మహతి రూపం చూసి ఆమెకు దుఃఖం వెల్లువలా పొంగింది.

మహతి మెల్లిగా కళ్ళు తెరిచి చూసింది.

"మహీ ఎందుకిలా చేశావ్? ఏం జరిగిందసలు?" అంది వాసవి ఏడుస్తూ అనంత్ కూడా ఒకలాంటి దిగ్భ్రమతో చూస్తున్నాడు మహతివేపు.

మహతి భర్తని బయటకెళ్ళమని సైగ చేసింది.

వాసవి దగ్గరగా వెళ్ళి కూర్చుంది.

మహతి అనంత్‌ని కూడా దగ్గరికి రమ్మని పిలిచింది.

"వసూ నేను బతకను. నాకు బతకాలనికూడా లేదు. చచ్చిపోతూ నేను చెప్పేది ఒక్కటే, ఏ మనిషి తన ఆశల్ని ఆశయాల్ని ఇతరులకోసం చంపుకుని బ్రతకకూడదు. అలా బ్రతికితే ఆ నిరాశే ఒకరోజు మనల్ని చంపేస్తుంది. ఈ బ్రతికిన కొన్ని రోజులు మన సుఖాల్ని ఇతరులకు భయపడి బలి పెట్టుకోకూడదు. ఆ పనే నేను చేసి ఈ రోజు యిలా అంతం అయిపోతున్నాను. నాకు ప్రాణమైన వీణను వదులుకుని నేను కలగన్న అందమయిన జీవితం నాకిక దొరకదని తెలిసే ఈ పని చేసాను. దయచేసి నువ్వు నీ కోసం ధైర్యంగా బ్రతుకు. అదృష్టవశాత్తూ నీకు కోరుకున్న భర్తే దొరికాడు. అనంత్ వాసవిని ప్రాణంగా చూసుకో, ఆమెను కష్టపెట్టకు. వసూ. నీకు ఇష్టమయితే ప్రపంచానికి భయపడకుండా ఆ యిష్టాన్ని తీర్చుకో. పక్కవాడికి నష్టం రాని మన ఇష్టాన్ని నలుగురికీ భయపడి సమాధి చేయకు" అంటూ ఆయాసపడింది మహతి.

వాసవి వెక్కెక్కి ఏడ్చింది.

"ఇన్ని విషయాలు నాకు చెబుతున్నావే. ఆ తెగింపే నీకెందుకు లేకపోయింది. అందరికి ఎదురు తిరిగి ఎందుకు బ్రతకలేకపోయావు?" అంది ఏడుస్తూ.

మహతి కాలిన పెదవులు చిన్నగా నవ్వడానికి ప్రయత్నించాయి. ఆమె ఏదో చెప్పాలని ప్రయత్నించింది.

అంతలోనే ఆమెకు స్పృహ పోయింది.

అనంత్ గబగబా డాక్టర్ని పిలుచుకొచ్చాడు. డాక్టర్ ఆమె నాడి చూసి నిట్టూర్పు వదిలాడు.

"సారీ షి యీజ్ డెడ్" అన్నాడతను ఆమె చేతిని వదిలేస్తూ.

వాసవి అది హాస్పటలని మరచి అనంత్ గుండెల్లో దూరి వెక్కెక్కి ఏడుస్తుంటే అనంత్ ఆమెను పొదవి పట్టుకుని బయటికి నడిపించాడు.

29

పశ్చిమాన కృంగి సూర్యుణ్ణి చూసి పరిహసిస్తున్నట్లుగా సముద్రం అలలు నిలువెత్తుగా లేచి విరిగి పడుతున్నాయి. ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని ఛేదిస్తూ ఘోషిస్తోంది సముద్రం.

అక్కడి అందమైన వాతావరణాన్ని చూసి శిల్పాలు చెక్కారో ఆ శిలల సౌందర్యానికి మురిసి సముద్రమే చిందులు వేస్తుందో తెలియదుగాని మహాబలిపురంలో సముద్రతీర సౌందర్యం అనన్యమైనది. నగరంలోని కృత్రిమ వాతావరణానికి విసిగి ఈ మారుమూల స్వేచ్ఛగా ఆడుకుంటున్న పసిపిల్లాడిలా గంతులు వేస్తోంది సముద్రం.

ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించడం కూడా ధనవంతులకే పరిమితమైనట్లు అక్కడ నగరంలో ప్రముఖులైన బిజినెస్ మాగ్నెట్స్‌కి, సినిమా నటులకి తీరిక సమయాల్ని సుందరంగా తీర్చిదిద్దుకోవడానికి అందమైన కాటేజీలున్నాయి.

అందులో జగదీష్ దొకటి.

వాసవి మౌనంగా ఇసుకలో గీతలు గీస్తూ కూర్చుంది.

దూరంగా సముద్రంలో ఈదుతూ అలలపై తేలుతూ ఉత్సాహంతో ఉరకలు పెడుతున్న అనంత్ ఆమెని అప్పుడప్పుడూ క్రీగంట గమనిస్తున్నాడు.

ఆమెలో అదివరకటి సంచలనం లేదు.

చదువుకునే రోజుల్లో ఆమె సముద్రాన్ని చూస్తే ఎలా కేరింతలు కొట్టేది. తను ఈత కొడుతుంటే ఆమె చూపుల్లో ఎంత ఆరాధన.

పూర్తిగా జడంగా తయారయిన ఆమెలో చైతన్యాన్ని తీసుకురావడానికే అతను ఆమెను మహాబలిపురం తీసుకొచ్చాడు.

మహతి చనిపోయాక ఆమె మరీ మానసికంగా దిగజారి పోయింది. ఎవరో తనని వెంటాడుతున్నట్లు భయపడి పోతున్నది.

పదిహేనురోజులుగా ఆమెని నీడలా వెంటాడి కాపాడుతున్నాడు అనంత్.

"వసూ, ప్లీజ్ కమ్ హియర్" అంటూ పిలిచాడు అనంత్.

వాసవి మాట్లాడలేదు.

అనంత్ సముద్రంలోంచి బయటకి వచ్చి వళ్ళు తుడుచుకుని బట్టలు మార్చుకున్నాడు.

అతను వాసవి దగ్గరగా వస్తూ "నువ్విలా డల్‌గా కూర్చోడానికే అయితే మనం యింత దూరం రావడం దేనికి?" అన్నాడు నిష్ఠూరంగా.

"నన్నేం చేయమంటావ్ అనంత్. ఒకదాని వెంట మరొకటిగా జరిగే సంఘటనలు నన్ను సుఖంగా బ్రతకనియ్యడం లేదు. అటు ముత్తు మరణం షాక్ నుండి తేరుకోక మునుపే మహతి పోవడం భరించలేకుండా వున్నాను. ఇంతకన్నా పిచ్చి పట్టినా బాగుండుననిపిస్తోంది" అంది వాసవి ఆవేదనగా.

అనంత్ ఆమె వైపు జాలిగా చూసి దగ్గరగా కూర్చున్నాడు.

గత రెండు నెలలుగా జరుగుతున్న ఒక్కొక్క సంఘటన ఆమెని అతనికి చాలా చేరువ చేస్తున్నాయి. అతను మేడమ్ నుండి వసూ అని ఆత్మీయంగా పిలుస్తుంటేనే హాయిగా వుంది వాసవికి.

అనంత్ ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు.

అందుకు అభ్యంతరం పెట్టలేదు వాసవి.

పైగా అతను దగ్గరగా రావడం ఆమెకు ధైర్యాన్ని కలిగిస్తోంది.

ఈ ప్రపంచంలో తను ఒంటరినని తనకి అతని ఆసరా కావాలని బలంగా అనిపిస్తోంది.

"మహతి చనిపోయిన సంగతేగాని, చనిపోతూ చెప్పిన నిజాల సంగతి అక్కర్లేదా నీకు?" అన్నాడు అనంత్ మెత్తగా.

వాసవి అర్థంకానట్లు చూసింది.

"నీకోసం నిన్ను బ్రతకమని చెప్పలేదూ. మరొకరికి నష్టం కలిగించని ఏ పని చేయడానికైనా వెనుకాడాల్సిన పని లేదని చెప్పలేదూ" అనంత్ ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగాడు.

వాసవి నిస్పృహగా నవ్వింది.

"ఏమున్నాయి అలాంటివి. జీవితం మలుపు తిరిగిపోయాక వెనక్కి తిరిగి చూసుకోవడం అవివేకం" అంది వాసవి బాధగా.

"ఆ నిరాశా వాదమే మానమంటాను. ఈ మలుపులు, ఈ అదుపులు మనం సృష్టించుకున్నవే. నిజానికి ఏ చట్టంలోనూ ఇమడనిది జీవితం. మనిషికి ఒకే ఒకసారి వరంగా లభించే ఈ బ్రతుకుని పనికిమాలిన సిద్ధాంతాలతోనూ, నీరసమైన ఆలోచనలతోనూ, వృధా చేసుకునే వాళ్ళు నా దృష్టిలో ఫూల్స్" అన్నాడు అనంత్ తేలిగ్గా తీసిపారేస్తూ.

వాసవి అతని వైపు విచిత్రంగా చూసింది.

"అనంత్ నేనొకటి అడుగుతాను నిజం చెబుతావా?" అంది సూటిగా చూస్తూ.

అనంత్ నవ్వి "అబద్ధం చెబుతానని అనుమానమా?" అన్నాడు.

"నువ్వు...నువ్వు.. నన్ను నిజంగానే ప్రేమించావా?" వాసవి సముద్రం కేసి చూస్తూ అడిగింది.

"ఎందుకొచ్చింది ఆ సందేహం?" అతను చిరునవ్వుతో తిరిగి ప్రశ్నించాడు.

"నన్ను పోగొట్టుకున్నందుకు నీకు బాధగా లేదూ"

"నిన్నసలు నేను పోగొట్టుకుంటేగా?"

వాసవి అతని జవాబుకి ఆశ్చర్యంగా చూసింది.

"నువ్వు ప్రతి క్షణం నా ఎదుటే వుంటున్నావు. నీతో చనువుగా, ఆత్మీయంగా వుండే అవకాశం కూడా నాఖు దొరికింది. అంతేకాక నిన్ను నా మనసులో చాలా పదిలంగా దాచుకున్నాను. నేను నిన్ను పోగొట్టుకున్నానని నువ్వు నాకు దూరమయ్యావని ఏ క్షణమూ అనుకోలేదు" అన్నాడు స్థిరంగా.

వాసవి విచిత్రంగా చూసిందతనివైపు.

"నీకు నా మాటలు చాలా విచిత్రంగా వుండొచ్చు. నిన్ను ఎత్తుకుపోతే తప్పుకాని నిన్ను మానసికంగా ఆరాధించి ప్రేమించడానికి ఎవరి పర్మిషనూ అక్కర్లేదు. ప్రస్తుతం నేను చేస్తున్నదదే, నీకొక విషయం తెలుసునోలేదో.

"పెళ్ళికి ప్రేమకి అసలు సంబంధమే లేదు. పెళ్ళి ప్రేమించే హృదయానికి ఆనకట్టలాంటిది. అంటే నీకింక ఎవర్నీ ప్రేమించే హక్కులేదని, మమతలవైపు ప్రవహించే మనసుని నిర్బంధిస్తుంది. అందుకే పెళ్ళి ప్రేమకి ఫుల్‌స్టాప్ అని అనుభవజ్ఞులు చెప్పారు. నిన్ను పెళ్ళి చేసుకోకపోవడం వల్లనేమో. నాకు నీమీద ప్రేమ పదింతలు పెరిగింది" అన్నాడు అనంత్.

అతను అలా చెబుతున్నంతసేపూ ఆమె చెయ్యి అతని చేతిలో మెత్తగా నలుగుతూనే వుంది.

వాసవి ఇబ్బందిగా చూసింది.

ఆమె యిపుడు నడిసముద్రంలో వుంది. తన ప్రాణాన్ని రక్షించుకోడానికి దొరికిన పూచిక పుల్ల అనంత్.

చుట్టూ చీకటి తెరలు దిగుతున్నాయి.

"చలిగా వుంది కాటేజీలోకి వెళ్దామా?" అడిగాడు అనంత్ మాట మారుస్తూ.

వాసవి పైకి లేచింది.

సముద్రం నిర్విరామంగా శ్రామికజీవి ధనసామ్యంతో చేస్తున్న పోరాటంలా ఒడ్డున ఢీకొంటోంది. తరతరాలకి చెక్కుచెదరని పెట్టుబడిదారులా ఒడ్డు నిశ్చింతగా నిలబడివుంది.

సముద్రం మాత్రం పేదవాడి ఆర్తనాదంలా ఫలితంలేని అల్లరిచేసి ఘోష పెడుతోంది.

ఇద్దరూ కాటేజి వైపు నడుస్తున్నారు.

చాలా దగ్గరగా అనంత్ చెయ్యి వాసవి భుజాన్ని చుట్టింది.

ఆమె చేతులు కట్టుకుని ఇసుకలో కూరుకుపోతున్న అడుగుల్ని బలంగా లాగి నడుస్తోంది.

అనంత్ చేరిక ఆమెకొకలాంటి ధైర్యాన్ని కలిగిస్తోంది.

తప్పు చేస్తున్నానేమోనన్న ధ్యాస కానీ అనంత్ చొరవ తీసుకుంటున్నాడేమోనన్న అనుమానం కానీ ఆమెకసలు కలగనేలేదు.

**పరిమళ** హైదరాబాదుకి టిక్కెట్టు తీసుకుని రైలెక్కింది.

రిజర్వేషన్‌లేని ఆ కంపార్ట్‌మెంటులోని మనుష్యులు పుట్టలోని చీమల్లా కిక్కిరిసి పోయివున్నారు.

పరిమళ ఎలాగో చోటు చేసుకుని చేతి సంచిని గట్టిగా పట్టుకుని తలుపు వారగా నిలబడింది. ఆమె ఆలోచనంతా కూతురి బ్రతుకు మీదే ఉంది. ఎలాగోలా దాని జీవితం నాశనం కాకుండా చూడాలి. తన జీవితంలాగే తన కడుపున పుట్టిన బిడ్డ బ్రతుకు కూడా చిరిగిన విస్తరి కాకూడదు.

రైలు పరుగెత్తుతున్నంతసేపూ ఆమె ఆలోచనలు కూడా అస్థిమితంగా పరుగెత్తుతున్నాయి.

పరిమళ తలుపు ప్రక్కన కూర్చుంది మెల్లిగా.

ట్రెయిన్ వేగంగా వెళ్తోంది.

రాత్రి పదకొండు దాటింది.

కంపార్టుమెంటులోని చాలామంది జనం నిద్రలోకి జారుకున్నారు స్పృహలోవుంటే మనుషుల్ని పట్టలేమోనని కాబోలు రోజులో సగం రాత్రిగా సృష్టించి మనుషుల మీద నిద్రమత్తు చల్లాడు భగవంతుడు.

ఎక్కడో పెద్ద శబ్దం.

నిద్రలోని జనం ఉలిక్కిపడి లేచారు.

ఏం జరిగిందో ఎవరికీ తెలియని స్థితి.

చుట్టూ గాఢాంధకారం.

పరిమళ గట్టిగా మూలిగింది. చేత్తో తలమీద తడువుకుంది. ఏదో తడి. ఏం జరిగింది? తను చచ్చిపోతున్నదా?

ఆమెకి స్పృహ తప్పిపోయింది. కళ్ళు తెరచి చుట్టూ చూసింది పరిమళ.

చాలాసేపు ఆమెకు తనెక్కడ వున్నది అర్ధంకాలేదు.

చుట్టూ తెల్లటి గౌనులతో రెక్కలు మొలిచిన దేవతల్లా తిరుగుతోన్న నర్స్‌లని చూసి అది హాస్పిటలని గ్రహించింది పరిమళ. వెంటనే వళ్ళు తడిమి చూసుకుంది.

ఎడం చేతికి, కుడికాలికి బాండేజి వుంది. అప్పుడే ఆమెకు నొప్పికూడా తెలిసి సన్నగా మూలిగింది.

''హౌ ఆర్యూ?'' అంటూ దగ్గర కొచ్చిందొక సిస్టర్ చిన్నగా నవ్వుతూ.

పరిమళ ఆమె ప్రశ్నకి జవాబు చెప్పకుండా ''నేనిక్కడికెలా వచ్చాను?'' అంది ఆశ్చర్యంగా.

''మీరు వస్తున్న మద్రాసు హైదరాబాదు ఎక్స్‌ప్రెస్‌కి ఖాజీపేట దగ్గర ఏక్సిడెంటయింది''

''ఈ ఊరు?''

''వరంగల్''

పరిమళకి అకస్మాత్తుగా తను బయల్దేరడానికి గల కారణం గుర్తొచ్చింది.

"ఏక్సిడెంటయి ఎన్నాళ్ళయింది?" అంటూ అడిగిందామె కంగారుగా.

"పదిహేను రోజులు. ఇన్నాళ్ళూ మీరు కోమాలో వున్నారు. ఈ రోజే మీకు స్పృహ వచ్చింది" అంది సిస్టర్.

ఇంతలో ఆమె బెడ్ దగ్గరకి డాక్టరు వచ్చింది. "ఈ పేషెంటుకి స్పృహొచ్చింది డాక్టర్" అంది సిస్టర్ సంతోషంగా.

డాక్టర్ చిరునవ్వుతో పరిమళవైపు చూసింది.

"ఎలా వుంది?" అంటూ పరిమళ చేయి పట్టుకుని నాడి చూసింది డాక్టర్.

"నేను - నేను అర్జెంటుగా హైదరాబాదు వెళ్ళాలి" అంది పరిమళ గొణుగుతున్నట్లు.

డాక్టర్ పరిమళ వంక చిన్న పిల్లను చూసినట్లు చూసి నవ్వింది.

"ఎలా వెళతారు. నలభయిరోజులు మీరీ బెడ్ మీదనుండి కదలడానికి వీలులేదు" అంది.

పరిమళ అసహనంగా చూసి "లేదు డాక్టరమ్మా నేను చాలా అవసరమైన పని పడి హైదరాబాదు వెళ్తున్నాను. తీరా ఇలా జరిగింది" అంది బాధగా.

"నిజమే కాదనను. చాలా అవసరంగా బయల్దేరిన చాలామంది అసలీ లోకంలో లేకుండానే వెళ్ళిపోయారు. మీరింకా చాలా అదృష్టవంతులు కాలు, చెయ్యి విరిగి బయటపడ్డారు. అసలే పెద్ద వయసు. మొండికేసి కదిలితే అసలు కాలే తీసెయ్యాల్సి వస్తుంది" అంది డాక్టర్ మందలింపుగా.

పరిమళ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఇప్పుడెలా?" అంటూ సన్నగా గొణిగింది.

డాక్టర్ కాస్త మెత్తబడినట్లు చూసి "పోనీ మీరు మీ బంధువుల పేరు చెప్పండి పిలిపిస్తాను" అంది.

పరిమళకి కాస్త ధైర్యం వచ్చింది.

వెంటనేజగన్నాథరావుగారి పేరు చెప్పింది పరిమళ.

"మేము వీలయితే ఫోనులో కాంటాక్టుచేసి మీ సంగతి చెబుతాం. అంతవరకు మీరు నిశ్చింతగా వుండండి" అంది డాక్టరు నవ్వుతూ.

పరిమళ నీరసంగా నవ్వి తలూపింది.

డాక్టరు మెత్తగా అడుగులు వేస్తూ మరో బెడ్ వైపు సాగిపోయింది. డాక్టరుకి నిజంగా వుండవలసిన లక్షణాలన్నీ ఆమెలో అరుదుగా చూసి ఆశ్చర్యపడింది పరిమళ.

కళ్ళు మూసుకుని బెడ్‌కి జేరబడింది నిస్సత్తువుగా.

"నువ్వు చెబుతోంది నిజమేనంట్రా?" బలరాం సీరియస్‌గా అడిగాడు.

శంకర్ వణుకుతూ తలమీద చెయ్యిపెట్టుకుని "ఒట్టు" అన్నాడు భయంగా.

"ఆడేం కూసాడు? మళ్ళీ చెప్పు" బలరాం తాగిన మత్తు వదిలించుకోవడానికి కళ్ళు గట్టిగా మూసి తలదించాడు.

"నీ మూలంగానే ఆయన మొదటి పెళ్ళాం సచ్చిపోయిందట. ఆ వంకెట్టుకుని నువ్వు డబ్బంతా గుంజేస్తున్నావట నీ పీడా వదిలించుకుంటానని నిన్ను పోలీసోళ్ళకప్ప చెప్పేస్తానని చాలా కూసాడులే" అన్నాడు శంకర్ అమాయకంగా.

బలరాం కళ్ళు రక్తాన్ని నింపుకున్నాయి.

దవడలు ఆవేశంగా బిగుసుకున్నాయి.

చూస్తుండగానే అతని రూపం పరమ కర్కోటంగా తయారయ్యింది.

అతను బలంగా ఎదుటవున్న చెక్కపెట్టెని విసురుగా తన్నాడు.

''రేయ్ నా యెనక ఎదవ కూతలు కూస్తున్నావరా. చేతకాని కొజ్జా యెదవ. నన్ను పోలీసోళ్ళకి అప్పచెప్పేలోపునే నిన్ను యమభటులకి అప్పచెపుతాను'' అంటూ గయ్యిన పైకి లేచాడు బలరాం.

శంకర్ వాడి విసురు చూసి భయపడ్డట్లుగా వెనక్కు తగ్గాడు.

బలరాం తూలుకుంటూ లేచి రెండడుగులు ముందుకి నడిచాడు.

తనూరుకుంటే బలరాం అన్నంత పని చేస్తాడని శంకర్ భయపడి పోయాడు.

వెంటనే బలరాం చేతిని గట్టిగా పట్టుకుని ''తొందరపడకు'' అన్నాడు.

బలరాం వాడి చేతిని విసురుగా విదిలించి కొట్టి ''నాకు నీతులు చెబుతావురా సన్యాసి'' అన్నాడు కోపంగా.

శంకర్‌కి వాడి అవతారం చూస్తుంటే భయంగా వుంది. అయినాలేని ధైర్యం తెచ్చుకున్నాడు.

''నిజమే నీకు తెలిసినంత నాకు తెలియదు కాని ఆ జగదీష్ నువ్వనుకున్నట్లు అంత తొందరగా నిన్నేమీ చేయలేడు. పెళ్ళాం దగ్గర గొప్పకోసం అలా చెప్పివుంటాడు. పైగా ఊళ్ళో లేడూగా. నువ్వెళ్ళి ఏం చేస్తావ్?'' అన్నాడు శంకర్.

బలరాం శంకర్ వేపు నిదానంగా చూసి ''ఎక్కడికి వచ్చాడు?'' అన్నాడు.

''ఏదో దేశమెళ్ళాడుగా నీకు తెలియదా?'' అన్నాడు శంకర్ అమాయకంగా.

''ఆర్నీ నాకు డబ్బివ్వకుండానే ఎళ్ళాడా? ఆడికి మదమెక్కింది'' అన్నాడు బలరాం కోపంగా.

''నీ దగ్గర అప్పు చేసాడా?''

బలరాం శంకర్‌వేపు చూసి నవ్వి ''అప్పేటి? అంతకంటా గొప్పే. ఆడి అడ్డాల్ని నేను ఎత్తేస్తుంటాను. దానికి ఆడు జీతమిస్తుంటాడు'' అని శంకర్ వేపు అనుమానంగా చూసి ''అసలు నువ్విక్కడికి దేనికొచ్చావురా'' అన్నాడు.

''నా కాడి దగ్గర పని సెయ్యబుద్దికావటంలేదు. ఏంటో ఆ యింట్లో దయ్యాలున్నాయంట. నాకు దయ్యాలంటే భయం. ఆ ముత్తు మాతో కలిసి పని చేసిందిగా. అదేమో మొన్నీ మధ్య లారీ క్రిందపడి సచ్చింది. మా అమ్మగారు జబ్బున పడింది. అందుకే మానేసాను.''

''సరే మానేసావనుకో నా దగ్గరకెందుకొచ్చినట్లు?''

''చెబితే ఏమనుకోవుగా?'' శంకర్ అనుమానంగా అడిగాడు.

''అనుకుంటే మాడు పగులుద్ది'' చాలా సున్నితంగా చెప్పాడు బలరాం.

''ఏంలేదు జగదీష్ బాబు. నీకు చాలా కట్టల డబ్బు యివ్వటం సూసాను. నేను కూడా నీలాగా సంపాదించాలని ఆ కిటుకు నీ దగ్గర నేర్చుకుందామని'' అన్నాడు శంకర్ మెల్లిగా.

బలరాం వాడివేపు చూసి పకపకా నవ్వేసాడు.

వాడు నవ్వుతుంటే రావిచెట్టు మీద పిట్టలు రివ్వున ఎగిరిపోయాయి.

''కట్టల కట్టల డబ్బు ఏం చేసుకుంటావురా నువ్వు'' అన్నాడు తమాషాగా.

శంకర్ చిన్నబుచ్చుకున్నట్లు చూసి ''నేను కూడా మంచి బట్టలు వేసుకుని అయ్యగారిలాగే కార్లో తిరుగుతాను'' అన్నాడు.

''మరి అన్నీ నేర్పిస్తే నాకు గురుదక్షిణేటిచ్చుకుంటావురా నువ్వు'' బలరాం ప్రశ్నకి శంకర్ మాట్లాడలేకపోయాడు.

తర్వాత మెల్లిగా అన్నాడు "మీ మీద ఈగ వాలకుండా చూసుకుంటాను, మీకు వంట వండిపెడతాను. జగదీష్ యింటికి ఎల్లినట్లు ఎల్లి అక్కడ విషయాలన్నీ రాబడతాను" అన్నాడు నమ్మకంగా.

బలరాం కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.

వాడిమీద ఒకలాంటి నమ్మకం ఏర్పడింది.

"నువ్వేదో అనుకున్నాను గాని మంచి తెలివయినోడివేరా?" అన్నాడు మెచ్చుకోలుగా.

శంకర్ కళ్ళు తళతళలాడాయి.

"సర్లే నువ్వా సీసా తీసుకెళ్ళి రోడ్డు మలుపులో వున్న సారా కొట్లో సారా తీసుకురా" అన్నాడు.

శంకర్ సీసా అందుకుని "డబ్బులు?" అంటూ నసిగాడు.

బలరాం ఆశ్చర్యంగా చూసి "ఈ యాదిలో ఎవఁడా నన్ను డబ్బులడిగేంత కలేజా వున్నోడు. పోయి బలరాం సాబ్‌కని చెప్పు. లేదన్నాడంటే ఆడికి మూడిందన్నమాటే" అన్నాడు నిర్లక్ష్యంగా.

శంకర్ సీసా తీసుకుని వడివడిగా వీధిలోకి వచ్చాడు. వాడి మస్తిష్కంలో రకరకాల ఆలోచనలు.

తాను ఎలాగైతేనేం బలరాం దగ్గర స్థానం సంపాదించగలిగాడు కానీ తర్వాత ఏం చేయాలి?

ఏం చేయాలని ఇంతకు తెగించాడు.

వాడి చిన్న బుఁరలో కోరికైతే పెద్దదే వుంది కానీ ఆచరణకి దారి అంతు చిక్కడంలేదు.

30

అర్ధరాత్రి అయ్యేకొద్దీ సముద్రపు ఘోష హెచ్చుస్థాయికి పెరిగింది.

నిర్మానుష్యమైన ఆ సముద్రప్రాంతంలో విసురుగా వీస్తున్న గాలికి విపరీతంగా ఊగుతోన్న సరుగుడు చెట్లనుండి ఒకలాంటి ఈల శబ్దం వస్తోంది.

వాసవికి నిద్రపట్టడంలేదు.

కళ్ళముందు మహతి దీనవదనం కనిపిస్తోంది.

చెవుల్లో ఆమె చనిపోతూ చెప్పిన మాటలు గింగురుమంటున్నాయి.

మహతి.

ఒక గొప్ప సంగీత విద్వాంసురాలవుతుందని ఒక గొప్ప విద్యావేత్త అవుతుందని భావించింది తను.

కాలేజీలో ఆమెలో కనిపించే స్పార్క్‌ని చూసి ఎంతో ఆశ్చర్యపడేది తను.

కాని..కాని.. చివరకి మహితి శుష్కించి, నిరాశా నిస్పృహలని భరించలేక తనని తాను ఆహుతి చేసుకుంది.

పరిస్థితులు మనిషి వెంటబడి వేటకుక్కల్లా తరిమితే ఆమె బ్రతుకులాగే ఛిన్నాభిన్నమై పోతుందా?

మహతి వీణానాదం తన చెవుల్లో ఇంకా మారుమ్రోగుతోంది. కానీ మహతి లేదు.

ఇక తను ఎన్నటికి మహతిని చూడలేదు.

వాసవికి ఏడుపు పొంగుకొచ్చింది.

ఎదురుగా వున్న మంచమ్మీద అనంత్ నిద్రపోతున్నాడు.

ఊపిరి తియ్యడంవల్ల అతని ఆచ్ఛాదన లేని వక్షం కదులుతోంది. వాసవి అతనికి వినిపించకూడదని దుఃఖాన్ని బిగపెట్టింది.

అయినా మహతిని తలచుకుంటే ఆమె తనని తాను కంట్రోల్ చేసుకోలేకపోతోంది.

ఆమె లేచి మెల్లిగా బాత్రూంలోకి వెళ్ళింది.

తలుపు బోల్టు వేసి వెను తిరిగింది.

అంతే కరెంటు పోయింది.

గాఢాంధకారం

దగ్గరగా అలలు విరగబడి ఒడ్డును కొట్టుకోవడం బాగా వినిపిస్తోంది.

వాసవి అకస్మాత్తుగా వెంటిలేటర్ వైపు చూసింది.

ఆ చీకట్లో అందులోంచి ఒక చెయ్యిలాంటి ఆకారం ముందుకు సాగి తనని అందుకోటానికి ప్రయత్నిస్తున్నట్లనిపించింది.

మనిషి నిలువెల్లా వణికిపోఇంది.

ఆమె బోల్టు తీసి పారిపోదామనుకుని ప్రయత్నించింది. కానీ ఎంత లాగినా తలుపు అటువేపునుండి ఊడి రాలేదు.

ఆ చెయ్యి ఇంకా ముందుకి సాగుతోంది.

అంత చలిగాలిలోనూ ఆమె వంటిమీద చెమట ధారలు జలపాతాల్లా వురుకుతున్నాయి.

తలుపుకి బల్లిలా అంటుకు పోయింది.

ఆ చెయ్యి చాలా ముందుకు సాగి.. సాగి ఆమె ముఖం మీద కొచ్చేసరికి వాసవి భయాన్ని ఆపుకోలేకపోయింది.

ఆమె అరచిన అరుపుకి అనంత్ గబుక్కున తలుపు తోసుకుని వచ్చాడు "ఏమయ్యింది?" అంటూ.

వాసవి అతని చేతుల్లో జావలా ఒరిగిపోయింది.

అనంత్ ఆమెను ఎత్తుకుని తీసుకొచ్చి మంచమ్మీద పడుకోబెట్టాడు. అతన్ని గట్టిగా కరుచుకుపోయింది వాసవి.

"వసూ ఏం జరిగింది?" అడిగాడతను లాలనగా.

ఆమె చెప్పలేకపోతోంది. ఆమెలోని వణుకుకి మంచం కదులుతోంది.

ఆమె మరింత గట్టిగా అనంత్‌ని పెనవేసుకుంది.

"వసూ ఎందుకంత భయం? ఏం చూసావ్?" అతను ఆమె చెంపలు నిమురుతూ లాలనగా అడిగాడు.

వాసవినుండి జవాబులేదు.

ఎక్కడ అతను తనకి దూరం అవుతాడోనన్న భయంతో అతన్ని చుట్టబెట్టుకుపోతోంది.

అనంత్ ఆమెని తనచేతుల్లో బిగించాడు.

"మైడియర్ వసూ నీకేం భయంలేదు. నేనున్నానుగా" అతను ఆమె చెవిలో గుసగుసలాడాడు.

వాసవికేమీ తెలియటంలేదు.

ఒకవైపు అంతులేని భయం

మరో ప్రక్క అనుభవమెరుగని పురుష స్పర్శ.

అతని కౌగిట్లో ఆమెకు ఎంతో రక్షణ కనిపించింది.

అతను ఆమెను హత్తుకుపోతుంటే ఆమెకది తప్పులా కనిపించలేదు.

అసలేం జరుగుతుందో ఆమెకు అనూహ్యం

అనంత్ పెదవులు ఆమె బుగ్గల్ని, పెదవుల్ని ఆమె శరీరంలోని ప్రతి అణువుని చుంబిస్తున్నాయి.

ఆమె చేతులు అతన్ని ఇంకా గట్టిగా అల్లుకున్నాయి. ఒక అచేతనావస్థలో, ఆ చీకటి రాత్రి ఆమెకు తెలియకుండానే ఆమె అనంత్ సొత్తయిపోయింది.

ఏం జరిగింది తెలిసేసరికి తెల్లారిపోయింది.

"హల్లో!"

"ఎస్"

"మీరు జగన్నాధరావుగారేనా?"

"ఎస్"

"నా పేరు ప్రతిభ. నేను వరంగల్ రైల్వే హాస్పిటల్లో డాక్టర్ని ఇక్కడ మొన్న జరిగిన ట్రెయిన్ ఏక్సిడెంట్ ఇంజూర్ అయిన ఒక లేడీ మీ బంధువట. మీ పేరు చెప్పారు" అంది.

జగన్నాధరావుగారికి ఆందోళన పెరిగింది.

"ఏది, మద్రాసు హైద్రాబాదు ఎక్స్‌ప్రెస్ సంగతా?"

"ఎస్"

ఆయనికి బి.పి పెరిగిపోయింది.

ఆ ఏక్సిడెంట్ జరిగింది కొంపదీసి వాసవికి కాదుకదా. వాసవి ట్రెయిన్‌లో ఎందుకొస్తుంది? ఒకవేళ ప్లేస్ టిక్కెట్ దొరక్క బయల్దేరిందేమో

"హలో" అటువేపు డాక్టర్ హెచ్చరికతో ఆయన ఆలోచన నుంచి బయటపడ్డారు.

"మీరు రాగలరా?"

"ఆమెకెలా వుంది?" జగన్నాధరావుగారు ఆదుర్దాగా అడిగాడు.

"ఇప్పుడు ఫర్వాలేదు. ఎడం చెయ్యి. కుడికాలు ఫ్రాక్చరయ్యాయి. తలకి బలమైన దెబ్బ తగిలింది. పదిహేను రోజులు కోమాలో వున్నారు. ఆమెకి ఈరోజే స్పృహ వచ్చింది మీపేరే చెబుతున్నారు" అంది డాక్టర్.

జగన్నాధరావుగారిని నీరసం ఆవహించేసింది.

పేరడిగితే అవతల్నుండి ఏం వినాల్సివస్తుందోనని జంకిపోతున్నారాయన.

అయినా అడగక తప్పదు.

"మీరు బయల్దేరుతున్నట్లు చెప్పమంటారా?"

"ఇంతకీ ఆమె పేరు?" మెల్లిగా శక్తి కూడదీసుకుని ఎలాగో అడగగలిగారు జగన్నాధరావుగారు.

"పరిమళ" ఆయనకి ఎంతో రిలీఫ్‌గా అనిపించింది. ఆ వెంటనే చెప్పలేనంత ఆశ్చర్యం కూడా కలిగింది.

"పరిమళా" అన్నారు చిత్రంగా.

"ఎస్"

"అలాంటి పేరుగలవాళ్ళు నాకెవ్వరూ తెలీదు."

"ఆమె మీ పేరే చెబుతున్నారు. కాస్త గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించండి."

జగన్నాధరావుగారు విసుక్కున్నారు.

"సారీ, ఆలోచించాల్సిన పనిలేదు. మా బంధువుల్లో ఎవరికి అలాంటి పేరులేదు. అసలు ఏ జగన్నాధరావుగారో కనుక్కోండి."

"సారీ ఫర్ ద ట్రబుల్" అంటూ ఫోన్ పెట్టేసింది డాక్టర్.

**జగన్నాధరావుగారు** హాల్లోకొచ్చి టీపాయ్ మీద పెట్టిన పోస్టు చూసుకుంటూ కూర్చున్నారు.

ఏవో కంపెనీకి సంబంధించిన లెటర్స్ తప్ప అందులో ఆయన ఆశించినట్లుగా కూతురినుండి ఉత్తరం కనిపించలేదు.

అసలు వాసవి కేమైనట్లు?

కనీసం ఫోనుకూడా చెయ్యడం మానేసిందే

తను ఎన్నిసార్లు రింగ్ చేసినా అవతల్నుండి రెస్పాన్స్ దొరకడం లేదు.

బహుశ వాళ్ళిద్దరూ కలిసి ఎటైనా వెళ్ళేరేమో.

పెళ్ళయ్యాక వాళ్ళిద్దరూ కలిసి మెలిసి తిరిగినట్లనిపించదు. వాళ్ళిద్దరికి ఏకాంతాన్ని కల్పించడానికే తను త్వరగా బయటపడ్డాడు. అసలే అతనికి బిజినెస్ వత్తిడులు. అందులో వాసవికి అతనిమీద పూర్తిగా ప్రేమ ఏర్పడినట్లులేదు. అనంత్ మీద బాగా ఆశలు పెంచుకుంది. అనంత్ అందగాడు కావొచ్చు, తెలివైనవాడు కావొచ్చు, చురుకైనవాడు కావొచ్చు.

కాని..కాని వీటన్నిటినీ మెరుగుపరచగల డబ్బు అతనికి లేదు.

చీకటిలో ఏ రంగైనా ఒకటే అయినట్లు బీదవాడికి ఎన్ని సలక్షణాలున్నా అవి వెలుగులోకి రావు. రాలేవు.

అదే డబ్బు అనే ఒకే ఒక అదృష్టాన్ని పొందివుంటే కురూపినే అందగాడంటారు దాన్నే లక్ష్మీకళ అంటారు.

డబ్బుంటే పదవులు వెదుక్కుంటూ వస్తాయి. మాట్లాడిన ప్రతిమాట ఆణిముత్యం అని చప్పట్లు చరుస్తారు.

చదువులేకపోయినా గౌరవ పట్టాలు లభిస్తాయి.

అందుకే తను వాసవి అభీష్టాన్ని తీర్చడానికి అంగీకరించలేకపోయాడు. కాబట్టే ఈ రోజు వాసవి ఒక చిన్న ఊరంత మేడలో పట్టు తివాసీలపై మహారాజ్ఞిలా నడుస్తోంది.

అదే తనకు కావాలి.

తనకన్నా తన కూతురు మరో అంతస్తు పైన వుండాలన్నదే తన తపన. తన ఆశ తీరింది.

ఇలా కోరిన కోరికల్ని తీర్చుకోగలగటం తన ప్రత్యేకత.

జగన్నాధరావుగారి చెయ్యి అప్రయత్నంగా ధవళవర్ణం తిరిగిన మీసాల మీదకి వెళ్ళింది.

మళ్ళీ సరిగ్గా అప్పుడే ఫోను మ్రోగింది.

ఆయన లేచేలోపునే పనికుర్రాడు పరుగున వెళ్ళి ఫోను తెచ్చి ఆయన ముందు పెట్టాడు.

"వాసవి ఫోను చేసిందేమో?" అనుకుంటూ రిసీవర్ అందుకున్నారాయన.

"హల్లో"

"ఎస్ జగన్నాధరావు స్పీకింగ్."

"నేను డాక్టర్ ప్రతిభని ఇందాక పరిమళ గురించి చెప్పాను కదా.

"మళ్ళీ ఏమొచ్చింది?" ప్రొద్దుటే ఈ మెంటల్ కేస్ దొరికిందేమిటని మనసులోనే విసుక్కున్నారాయన.

"ఆమె మీ బంధువేనటండి."

"మీరామె తలకి దెబ్బ తగిలిందంటున్నారు కదా. కాస్త డీ రైల్‌మెంటేమో చూడండి."

జగన్నాధరావుగారి మాటని జోక్‌గా తీసుకుంది డాక్టర్.

చిన్నగా నవ్వి "పాపం, అదేం కాదులెండి. ప్రగతి ఫెర్టిలైజర్ ప్రొప్రయిటర్ మీరు కాదా?"

"నేనే, దాని ఒక్కదానికేం ఖర్మ. అరుణా ఎలక్ట్రికల్ వర్క్సుకి, జనతా సిమెంట్ ప్రొడక్టులకి, బ్లూసీ ప్రాన్స్ ఎక్స్‌పోర్ట్సుకి.."

"అవన్నీ ఆమె చెప్పలేదులెండి. కాస్త పెద్ద వయస్సు. ఇంతకీ ఆమె పేరు పరిమళ కాదట"

జగన్నాధరావుగారు విస్మయంగా విన్నారు.

"మరి?" అన్నారు ఆశ్చర్యంగా.

"అనసూయ"

జగన్నాధరావుగారు తెల్లబోయారు.

"మధ్యకాలంలో పేరు మార్చుకోవాల్సిన అగత్యం ఏర్పడిందట"

".........."

"చాలా అవసరమైన విషయం మాట్లాడాలని ఆమె మద్రాసు నుండి బయలుదేరారట. కానీ ఇంతలో ఏక్సిడెంటు జరగడం. ఆమె బెడ్ మీదనుండి కదలలేని స్థితి. కాబట్టి మీరే రావాల్సి వుంటుంది."

జగన్నాధరావుగారు అలాగే ఆశ్చర్యంగా వింటున్నారు.

ఆయన ఆలోచనలు ఎక్కడెక్కడికో దాదాపు పాతికేళ్ళ వెనక్కి పరిగెత్తుతున్నాయి.

అనసూయ.

తనకి తెలిసిన ఒకే ఒక అనసూయ ఈమేనా?

అనసూయ చచ్చిపోలేదా?

బ్రతికుంటే ఇన్నాళ్ళూ ఎక్కడుంది?

ఇన్ని రోజులుగా తనని కలుసుకోవాలని ప్రయత్నించని మనిషి ఇప్పుడు తన కోసం ఎందుకు బయల్దేరింది. "హల్లో మీరు వస్తున్నట్లు ఆమెకు చెప్పనా?" డాక్టరు ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చేరాయన.

నీరసంగా "ఊ" అన్నారు.

అవతలవేపు ఫోను పెట్టేసినట్లుగా క్లిక్ మన్న చప్పుడు. ఆయన చెయ్యికూడా అసంకల్పితంగా క్రెడిల్ వైపు సాగి రిసీవర్‌ని హుక్ మీద పెట్టింది.

కానీ ఆయన మనసు మాత్రం నిశ్చలంగా పారుతోన్న నీటిలో రాయి విసిరినట్లు ఎంతో అలజడిగా తయారయ్యింది.

అనసూయ పేరు వినగానే ఆయనలో ఆమెను చూడాలనే ఒకలాంటి ఆరాటం.

మళ్ళీ ఆమెను కలవడం వల్ల ఎలాంటి పరిస్థితులు ఏర్పడుతాయోననే భయం.

అసలు ఆ అనసూయేనా ఈ అనసూయనే అనుమానం.

ఆమె తనని యిన్నాళ్ళకి ఎందుకు కలుసుకోవాలని ఆశిస్తుందోననే సంచలనం.

ఆయన స్థిమితం లేనట్లు అటూ యిటూ పచార్లు  చేసి నౌకర్ని రమ్మని కేకపెట్టారు.

వాడొచ్చి నిలబడ్డాడు.

"డ్రైవరుంటే అర్జెంటుగా వరంగల్ బయల్దేరాలని చెప్పి కారు రెడీ చేయమను"

వాడు అలాగేనంటూ వెను తిఖోడు.

జగన్నాధరావుగారి ఆలోచనలు డోలాయమానంగా వున్నాయి.

అనసూయకి ఎదురుపడగల మనస్థయిర్యం కాని, ఆత్మ విశ్వాసంకాని అతనికి కలగటంలేదు.

అసలిప్పుడు అనసూయని తన జీవితంలోకి ఆహ్వానించవలసినవసరం ఏమిటి?

తిరిగి ఎందుకీ బంధుత్వం.

"కారు రెడీసార్" "డ్రైవర్ వచ్చి నిలబడ్డాడు.

జగన్నాధరావుగారు వెనక్కి తిరిగి చూసి "అవసరం లేదులే" అంటూ బెడ్‌రూములో కెళ్ళి పడుకున్నారు.

ఆ మూసిన కళ్ళ వెనుక ఏవో మాసిపోయిన దృశ్యాలు.

కారు ఊరివేపు సాగిపోతున్నది.

వాసవి చలనంలేనట్లు సీటుకి జేరబడి శూన్యంలోకి చూస్తోంది. అనంత్ తల తిప్పకుండా స్టీరింగుని కంట్రోలు చేస్తూ క్రీగంట చూస్తున్నాడు.

ఆమెని చూస్తే అతనికి భయమేస్తోంది.

తుఫాను వచ్చేముందు సముద్రంలా అలలు లేనట్లు గంభీరంగా వున్న ఆమె ఏ క్షణం బ్రద్దలవ్వడానికి సిద్దపడుతుందో అతనికి అర్ధంకావడంలేదు.

కాని.. అందుకు విరుద్దంగా ఆమె కళ్ళనుండి నిశ్శబ్దంగా అశ్రు వాహిని జారిపోవడం గమనించాడు అనంత్.

అతను చాలా బాధగా "వసూ ఏడుస్తున్నావా?" అన్నాడు.

వాసవి మాట్లాడలేదు. ఆమెలో దుఃఖం అధికమైంది.

"సారీ వసూ అయామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ" అన్నాడు.

"వాసవి నిర్లిప్తంగా చూసి ఎందుకు నువ్వు సారీ చెప్పడం? ఈ తప్పులో నాకూ భాగముంది" అంది.

"లేదు వసూ నిన్ను మళ్ళీ తిరిగి మామూలు మనిషిని చెయ్యాలన్నదే నా తపన. నాకు నీమీద ఎలాంటి దురుద్దేశ్యములేదు. ఆ మాటే నేను జగదీష్ సాబ్‌కి చెప్పాను. ఆయన వచ్చేలోపున నిన్ను మానసికంగా ఆరోగ్యవంతురాలిని చేసి అప్పచెప్పాలనుకున్నాను. ఒక స్నేహితుడిగా, ఆత్మీయుడిగా నిన్ను కాపాడాలన్నదే నా ఆరాటం. కాని కాని అనుకోకుండా ఇలా జరిగిపోయింది. ఆ ఒంటరి తనం. ఆ వాతావరణం పరిస్థితులు అందులో నువ్వు.. నువ్వు నా పాత ప్రియురాలివి కావడం వల్ల నిగ్రహాన్ని కోల్పోయాను. నాకు ఇందుకుగాను నువ్వే శిక్ష విధించినా భరిస్తాను" అన్నాడు అనంత్ బాధగా.

వాసవి శుష్కహాసం చేసింది.

"నేను నిన్ను తప్పు పట్టడంలేదు అనంత్. రాత్రి జరిగింది తప్పయితే అందులో కేవలం మనిద్దరి బాధ్యతే కాకుండా మరో వ్యక్తిది కూడా వుంది" అంది.

"మరో వ్యక్తిదా?" ఆశ్చర్యంగా అడిగాడు అనంత్.

"అవును. అతను జగదీష్"

వాసవి జవాబు అతనిలో మరింత ఆశ్చర్యాన్ని పెంచింది.

"అతని ప్రమేయం ఏముంది ఇందులో?" అన్నాడు కంగారుగా.

"కట్టుకున్న పెళ్ళానికన్నా బిజినెస్సే ఎక్కువగా భావించడం వయసులో వున్న భార్యని ఒంటరిగా మరొక మగవాడి రక్షణలో యిరికించి తన పనులకోసం విదేశాలు వెళ్ళిపోవడం పెళ్ళి అనే పదానికి అంతరార్థం గ్రహించడానికి ప్రయత్నించకపోగా మేడలు, చీరలు, నగలే స్త్రీకి తృప్తినిస్తాయనుకోవడం"

అనంత్ ఆమె వేపు విచిత్రంగా చూస్తున్నాడు.

"నేనీరోజుతో చెడిపోయినట్లే లెక్కకదూ" అంది వాసవి నవ్వుతూ.

ఆ నవ్వులో జీవంలేదు.

మతి స్థిమితం లేనట్లు ఆమె నవ్వుతుంటే అనంత్‌కి బాధవేసింది.

"వసూ ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్"

వాసవి అతనికేసి అదోలా చూసి "నాకు పిచ్చెక్కలేదు. కంగారు పడకు" అంది.

కారు పోర్టికోలో ఆగింది.

అనంత్ దిగి డోర్ తెరచి వాసవిని దిగమన్నట్లుగా చూసాడు. వాసవి కారు దిగి మేడవైపు చూసింది.

"ఈ భూతగృహంలోకి నేను ప్రవేశించలా?" అంది అదోలా. అనంత్‌కి ఆమె మాటలు చేష్టలు వింతగా వున్నాయి.

"కొంపతీసి పిచ్చెక్కలేదుకదా?" అనుకున్నాడు మనసులో. "పోనీ నీకభ్యంతరం లేకపోతే నా అవుట్ హవుస్‌లోకి వచ్చి వుండు"

వాసవి మాట్లాడకుండా తన మేడలోకి వెళ్ళిపోవడం చూసి నిట్టూర్చాడు అనంత్.

31

శంకర్ ఆ బంగళాముందు చాలాసేపు తచ్చాడడం గూర్ఖా గమనించాడు.

"క్యా హోనా? చల్ బే చల్" అంటూ కసిరాడు వాడు శంకర్ని.

శంకర్ కాస్త అవతలకెళ్ళి నిలబడ్డాడు.

గూర్ఖాకి, వాడు తనమాట లక్ష్యపెట్టకుండా అక్కడే తిష్టవేయడం చాలా కోపాన్ని తెప్పించింది.

అయినా అది రోడ్డు. అక్కడ నిలబడొద్దని అంటానికి వాడికున్న హక్కేమిటో గుర్తొచ్చి మౌనం వహించాడు.

అప్పటికీ వాడూ ఆ యింటికెదురుగా మకాం వేయడం గమనించి క్రీగంట వాణ్ణి పరిశీలిస్తూ స్టూలుమీద కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

శంకర్ యింటివేపే దీక్షగా చూస్తున్నాడు.

చాలా అధునాతనంగా కట్టిన బంగళా అది.

షోకేస్‌లో పెట్టిన కేకు ముక్కలా మెరిసిపోతున్నది.

కాంపౌండ్ వాల్ మీద నుంచి దోబూచులాడుతున్న పూలగుత్తుల్ని చూస్తుంటే ఆ పూలేమిటో కూడా తెలియడంలేదు శంకర్‌కి.

గేటుకి ఎడం వైపు ఫిక్స్ చేసిన మార్బుల్ స్టోన్ మీద కె.దవళాచలం, ప్రయివేట్ డిటెక్టివ్ అన్న అక్షరాలు వాడిని ఊరిస్తున్నాయి.

మరోపక్క ఆ బంగళా ఖరీదు చూస్తుంటే తనలాంటి వాడికి అలాంటి వ్యక్తి సహకారం లభించదనే నిరాశ కలుగుతోంది.

అయినా వాడిలో ఒకలాంటి పట్టుదల మాత్రం సడలకుండా వాణ్ణి అక్కడే నిలబెడుతోంది.

కొండకి వెంట్రుక ముడివేస్తాడు. వస్తే కొండ కదులుతుంది. లేకపోతే నష్టపోయేది వెంట్రుక ముక్క మాత్రమే.

అందుకే అవకాశం కోసం పొంచి అలాగే నిలబడ్డాడు.

ఆ గూర్ఖాగాడు మాత్రం కాస్తన్నా కళ్ళు మూయకుండా రెప్పలు నిలబెట్టి మరీ తనవేపే చూస్తున్నాడు పోనీ వెనుక నుండి గోడ దూకడానికి ప్రయత్నిస్తే చుట్టూ పెద్ద పెద్ద మేడలున్నాయి. ఆ మేడల్లో పులుల్లాంటి కుక్కలుండడం సహజం అదింకా ప్రమాదం.

శంకర్ ఆ ఊహకి ఫుల్‌స్టాప్ పెట్టేసి అలాగే నిలబడ్డాడు. అంతలో పడవంతకారు గేటు ముందుకొచ్చి ఆలస్యం భరించలేనట్లు వెనక్కూ ముందుకు ఊగిసలాడింది.

అంతసేపూ గేటుముందు సింహంలా కూర్చున్న గూర్ఖా గబుక్కున లేచి నిలబడి సాల్యూట్ చేసి గేటు తీసే ప్రయత్నం చేసాడు.

శంకర్‌కి మెరపులాంటి ఆలోచన వచ్చేసింది.

ఒకలాంటి తెగింపుతో వాడు లోనికెళుతున్న కారుని వెంబడించి చటుక్కున లోపలికి దూరాడు.

కారుకి అటువేపుగా లోనికి దూరుతోన్న శంకర్ని గూర్ఖా గమనించలేదుకాని కారులో వెనుక సీట్లో కూర్చున్న వ్యక్తి దృష్టికి మాత్రం తప్పిపోలేదు.

వాడిచర్య అతనికి కాస్త ఆశ్చర్యం కలిగించినా కోపాన్ని తెప్పించలేదు.

అతను కారులోంచి దిగడమే ఆలస్యం. శంకర్ అతని కాళ్ళకి అల్లుకుపోయాడు.

ఆ చర్యకు కారులోంచి దిగినవ్యక్తి ఆశ్చర్యపోయి "ఎన్నా వేండూమ్?" అన్నాడు.

గూర్ఖా శంకర్ని చూసి మండిపడ్డాడు.

బేవకూఫ్ ఉల్లూకి పట్టా అంటూ తిట్లు లంకించుకుని "వాణ్ణి మెడబెట్టి గెంటే ప్రయత్నం చేయబోతుంటే ఆయన వాణ్ణి ఆగమన్నట్లు చేత్తో సంజ్ఞ చేసి "సోల్ ఉనక్కియార్ వేండూమ్" అన్నాడు తిరిగి.

శంకర్‌కి వెంటనే ఏం జవాబు చెప్పాలో తోచలేదు.

కంగారుగా లేచి నిలబడి "యెనక్కు ధవళాచలం సార్ వేండూమ్. ఆయనతో వేలై వుంది" అన్నాడు తెలుగు తమిళం కలగలిపి.

ఆయన పెదవులపై చిరునవ్వు మెరిసింది.

"నువ్వు తెలుగులో మాట్లాడు నాకు తెలుగు తెలుసు నువ్వు కావాలనుకున్న ధవళాచలాన్ని నేనే" అన్నాడాయన.

శంకర్ విస్మయంగా చూసి నమస్కరించి "మీరు తెలుగు వారాసార్?" అన్నాడు ఆనందంగా.

"తెలుగువాడికి తెలుగువాడినే ,అరవం వాడికి అరవాడినే" అన్నాడు ధవళాచలం గమ్మత్తుగా.

అర్థంకానట్లు చూసాడు శంకర్.

"నేను పుట్టేనాటికి తెలుగు రాష్ట్రం విడిగాలేదు. తర్వాత మద్రాసు స్టేట్, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయాయి. నా ఊరు తమిళనాడులోకి వచ్చేసింది. అలా రెండు భాషలు క్షుణ్ణంగా వచ్చునాకు. అద్సరే నాతో నీకేం పని?"

"చాలా పనివుండి వచ్చాను సార్ మీరు తప్ప నాకు సహాయపడే వాళ్ళెవరూ లేరు సార్" అన్నాడు దీనంగా.

"మంచిది లోపలికి రా" అంటూ లోనికి నడిచాడు ధవళాచలం.

అడ్డపంచి, అడ్డబొట్టు కాయబారు శరీరం "ఇతనేనా పెద్ద డిటెక్టివ్" అనుకుంటూ ఆయన్ని వెంబడించాడు శంకర్.

"కూర్చో"

అతను ఎదురు కుర్చీలో కూర్చుంటూ శంకర్ని ఆదేశించాడు.

ఇంతలో లోనికి రెండు కాఫీలొచ్చాయి.

ఒక కప్పు శంకర్‌కి అందిస్తుంటే శంకర్ మొగమాటంగా "వద్దు సార్" అన్నాడు.

ధవళాచలం "కూర్చోముందు. నీ వయసెంత చిన్నదయినా, నీ పరిస్థితులెటువంటి వయినా నువ్వు ప్రస్తుతం నా క్లయింటువి. అందువల్ల కూర్చుని కాఫీ త్రాగి తర్వాత సంగతులు చెప్పు" అన్నాడు.

శంకర్ తప్పదన్నట్లు సోఫాలో అతనితో సమానంగా కూర్చుని కాఫీ త్రాగాడు.

"ఇప్పుడు చెప్పు" ధవళాచలం వక్కపొడి వేసుకుంటూ అడిగాడు. శంకర్‌కి అసలెలా మొదలుపెట్టాలో తెలియలేదు.

కాస్సేపు తటపటాయించి "మీరొక దొంగని పట్టుకోవాలి."

ధవళాచలం నవ్వులాటగా "నేను పోలీసుని కాను" అన్నాడు.

అతని మాటకి సిగ్గుపడ్డాడు శంకర్.

"నాకెలా చెప్పాలో తెలియడంలేదు. కానీ బలరాం అని పూనమల్లెయి హై రోడ్డులో వుంటాడు. పెద్ద రౌడీ. చాలా హత్యలు చేసానని అతనే చెబుతుంటాడు. వాడికి ఆ జగదీష్‌కి ఏదో పెద్ద సంబంధముందు సార్. పాపం ఆ వాసవి తల్లి ఏమయిపోతుందోనని భయంగా వుంది సార్."

ధవళాచలం శంకర్ వేపు సాలోచనగా చూసాడు.

"జగదీష్ ఎవరు?"

"చాలా డబ్బుంది సార్ అతనికి. అతని మొదటి భార్య సావిత్రి చనిపోయింది సార్. చాలా బీదపిల్ల. కానీ చాలామంచిది. కానీ ఆవిడెలా చచ్చిపోయిందో ఎవరికి తెలియదు సార్. ఆవిడ శవం ఇంట్లోనే వుందని ముత్తు చెప్పింది. ముత్తు.. ఆ యింట్లో వంటమనిషి సార్. పాపం అదికూడా ఆ మర్నాడే చచ్చిపోయింది సార్. ఆ బలరాంకి మా జగదీష్ సార్ చాలా డబ్బిస్తాడు సార్. ఎందుకంటే మా అన్న అంటాడు. కానీ బలరాం కాదని నవ్వుతాడు. సార్ ఆ వాసమ్మని మీరే కాపాడాలి. లేకపోతే ఆమె గతికూడా సావిత్రక్క గతిలాగే అవుతుందని నాకు భయంగా వుంది సార్" శంకర్ ఆఖరు మాట చెబుతున్నప్పుడు అతని కళ్ళలో నీరు పాదరసంలా మెరవడం ధవళాచలం గమనించాడు.

వాడు అడ్డదిడ్డంగా చెబుతున్న కథనంతా ఓపిగ్గా విన్నాడు ఆయన.

"ఇంతకీ ఇప్పుడు నన్నేం చేయమంటావ్?"

"బలరాంని పట్టుకోవాలి. సావిత్రక్క చావుకి కారణం కనుక్కోవాలి. వాసమ్మని కాపాడాలి."

జగదీష్ ఎక్కడుంటాడు.

"అడయార్‌లో. హౌస్ నెంబర్ సెవెన్."

"నీకు ఆ యింటికి సంబంధమేమిటి?"

శంకర్‌లో తడబాటు అతని కళ్ళు నోట్ చేసుకున్నాయి.

"నేను - నేను వాళ్ళింట్లో పని కుర్రాణ్ణి"

"అంత మాత్రానికే నీ కెందుకింత తపన. వాళ్ళేమయితే నీకెందుకు?"

శంకర్ ముందుగా జవాబు చెప్పలేకపోయాడు "వాళ్ళు నా సాటి మనుష్యులు అక్కడేదో అన్యాయం జరుగుతుందని అనిపించినప్పుడు ప్రభుత్వానికి పట్టివ్వడం తప్పాసార్?" అన్నాడు మెల్లిగా.

"అందుకు పోలీస్ స్టేషనులున్నాయి."

శంకర్ నిరసనగా నవ్వి "ఎందుకు సార్ శవపంచాయితీకా? వాళ్ళకి సాక్ష్యాలు కావాలి. చెప్పడానికి వెళ్ళిన నన్నే చిదకబొడిచి నామీదే కేసు బనాయిస్తారు" అన్నాడు.

ధవళాచలానికి వాడి మాటలకి కొద్దిగా నవ్వు రాబోయింది. "సరే ఆ సంగతి వదిలేయ్. ఈ కేసు డిటెక్టు చేస్తే నువ్వు నాకిచ్చే ఫీజేమిటి?" అన్నాడు వాడి వంక తేరిపార చూస్తూ.

శంకర్ ఆ ప్రశ్నకు తెల్లబోయాడు.

"నేను.. నేను బీదవాణ్ణి సార్. నా దగ్గరేముంది?" అన్నాడు దీనంగా.

"సారీ ఫీజులేందే నేను ఏ కేసూ టేకప్ చేయను" ధవళాచలం మాటలోని ఖచ్చితానికి ఖంగుతిన్నాడు శంకర్.

**అయినా వాడిలో ఆశ చావలేదు.**

"మీరు చాలా గొప్పవారు. కావలసినంత పేరు డబ్బు గడించారు. ఈ ఒక్క కేసు ఔదార్యంతో బీదవాళ్ళ పట్ల జాలితో.." అంటూ ఆగాడు శంకర్.

"నీకూ మాటలు బాగా వచ్చునే. ఈ జాలి, సానుభూతి ఇవన్నీ పుస్తకాల్లో అందంగా ఇతరులని మెప్పించడానికి రాసుకునే మాటలు. అలాంటి మాటలు రాసి అందంగా ఇతరుల్ని వంచన చేయడానికి నేను రచయితను కాను. నేను మాట్లాడేదే చేస్తాను. చేసేదే చెబుతాను. ఇప్పుడు నువ్వు కూర్చున్న ఏ.సి గదికి, కాఫీకి గూర్ఖాకి నా కారు పెట్రోలుకి ఎవరిస్తారు? నా క్లయింట్స్ కాకపోతే? కాబట్టి ఫీజు సంగతి ఆలోచించి నా దగ్గరకి రావడం మంచిది? ఇప్పటికే నా టైము చాలా వేస్టయింది" అన్నాడాయన లేచి నిలబడుతూ.

శంకర్ ఖిన్న వదనంతో లేచి నిలబడి మీరు చాలా గొప్పవారనుకున్నాను అన్నాడు.

"కాదా?" ధవళాచలం ముఖంలో చిరునవ్వు.

శంకర్ అదోలా చూసి గది బయటకి వచ్చాడు.

శంకర్ బయటకి వెళ్ళగానే ధవళాచలం టేబుల్ కున్న బజ్జర్‌ని నొక్కాడు. వెంటనే ఒకతను లోపలికొచ్చి నిలబడ్డాడు.

"ఫాలో హిమ్. కీప్ ఏన్ ఐ ఆన్ హిమ్" అన్నాడు.

అతను "ఓ.కె" అంటూ బయటకి వచ్చాడు. ఒక సైకిలు తనని వెంబడించడం గమనించని శంకర్ ఉసూరుమంటూ రోడ్డు పట్టాడు.

అర్ధరాత్రి దాటింది.

వాసవిలో దడ హెచ్చుతోంది.

ఎటునుంచో ఎవరో పొంచి తన మీదకి ఉరుకుతోన్న భావన.

అటు ముత్తు ఇటు సావిత్రి.

ఇక్కడ.. ఇక్కడ తనకి రక్షణ లేదు. సుఖం లేదు. అనురాగం లేదు, తోడు లేదు.

ఎక్కడినుండో మహతి తనని తమ్మని ఆహ్వానిస్తోంది.

వెళ్ళిపోవాలి. తనకిలాంటి బ్రతుకు అవసరంలేదు. వాసవి ఒక రకమైన ఉద్రేకంతో రాక్ దగ్గరకు వెళ్ళి అందులోంచి ఒక సీసా అందుకుంది.

ఈ మధ్య డాక్టరు తనకు నిద్రపట్టేందుకు యిచ్చిన స్లీపింగ్ పిల్స్ అవి.

వాటిని నీళ్ళ గ్లాసులో వేసింది. అవి గబగబా గ్లాసు మట్టానికి చేరుకున్నాయి.

ఒక్కొక్కటి కరుగుతుంటే తెల్లటి రంగు తేలుగూ గ్లాసుపై భాగానికొస్తున్నది. వాసవి అభావంగా వాటివేపు చూస్తోంది. మరి కాస్సేపటిలో తను మహతిని కలుసుకోబోతోంది. ఈ బాధలకి అతీతంగా – ఈ అనుబంధాలకి దూరంగా తమిద్దరూ హాయిగా కబుర్లు చెప్పుకుంటారు. గలగలా నవ్వుకుంటారు. స్వేచ్ఛా విహంగాల్లా విహరిస్తారు. మహతి తను వెళ్ళేసరికి బహుశా మైమరుపుగా వీణ వాయిస్తుంటుందేమో? ఆ దివ్యగానాన్ని వింటూ తను మైమరచిపోతుంది.

ఎంతో సున్నితంగా సుఖంగా పెరగాల్సిన ఆడపిల్ల బ్రతుకుని చిత్రవధ చేస్తోంది ఈ సమాజం.

మానవత్వాన్ని మరిచిపోయిన మనిషి ఆడదాని బ్రతుకుమీద అర్థంలేని ఆంక్షలు విధించి డబ్బుతో తూకం వేసి తన దాసిలా నీచంగా చూస్తున్నాడు.

ఈ సంకుచిత ప్రపంచాన్ని వదిలేస్తాననగానే వాసవి హృదయం అత్యంత తేలికగా తేలిపోయి గాలిలో విహరించసాగింది.

ఆమె చటుక్కున గ్లాసు అందుకుని త్రాగబోయింది. కానీ ఆ పని జరగకుండా మరో బలమయిన చెయ్యి ఆమె చేతిని నొక్కిపెట్టింది.

వాసవి గిర్రున తలతిప్పి చూసింది.

అనంత్

''ఏం పనియిది?'' అనంత్ ఆందోళనగా అడిగాడు.

''నన్నాపకు అనంత్ నాకీ బతుకు దుర్భరంగా వుంది. దయచేసి నా దారికి అడ్డంరాకు'' అంది వాసవి ఆవేదనగా.

అనంత్ మెల్లిగా వాసవి చేతిలోని గ్లాసుని లాక్కుని ఆ నీళ్ళని వాష్ బేసిన్‌లో వంపి ఎదురుగా వచ్చి కూర్చున్నాడు. వాసవి మోకాళ్ళలో తల దాచుకుంది. ఆమె శరీర ప్రకంపనల వల్ల ఆమె ఏడుస్తున్నదని గ్రహించాడు అనంత్.

అతని చేయి అనునయంగా ఆమె వెన్ను నిమిరింది.

''వసూ, నువ్వెందుకింత కృంగిపోతున్నావో నాకు తెలుసు. రాత్రి జరిగిన సంఘటనని చాలా సీరియస్‌గా తీసుకుంటున్నావు కదూ'' అన్నాడు ప్రేమగా.

వాసవి మాట్లాడలేదు.

''ఈ తప్పులో నీకెంత బాధ్యతుందో నాకూ అంతే వుంది. మరి నేను చచ్చిపోవాలనుకోవడంలేదు. పొరపాటు జరిగిందని బాధపడుతున్నానంతే'' అన్నాడు తిరిగి.

వాసవి తలయెత్తకుండానే జవాబు చెప్పింది.

''నువ్వు మగాడివి''

"అంటే ఎన్ని అడ్డమైన తిరుగుళ్ళు తిరగటానికయినా మగాడికి లైసెన్సు వుందన్నమాట. ఎందుకలా మీ ఆడవాళ్ళే మిమ్మల్ని తక్కువగా అంచనా వేసుకుని మగవాడికి లేని అధికారాలిచ్చి మృగాన్ని చేస్తారు. రాత్రి జరిగింది నిజంగా తప్పే అయితే నేను కూడా నీతోపాటు చచ్చిపోవాలి. కమాన్ ఇద్దరం కలిసి విషాన్ని పంచుకుందాం" అన్నాడు అనంత్ ఉద్వేగంగా.

వాసవి తలయెత్తి అతనివైపు విచిత్రంగా చూసింది.

"ఆ అవసరం నీకేంటి? నువ్వెవరికీ జవాబు చెప్పుకోవాల్సిన అవసరంలేదు. నిన్నెవరూ చెడిపోయిన వాడని పేరు పెట్టి పిలవరు."

అనంత్ వాసవివైపు చిన్నపిల్లను చూసినట్లు చూసి నవ్వేసాడు. నాన్సెన్స్. సెక్స్ ఒక బయోలాజికల్ అర్జ్. పెళ్ళి అనే కట్టడి లేకపోతే సమాజంలో విచ్చలవిడితనం పెరుగుతుందని. ఆ ఆకల్ని సక్రమమైన పద్ధతిలో తీర్చుకోమని ఈ నియమాలు పెట్టారు. మనిద్దరం ఒకప్పుడు గాఢంగా ప్రేమించుకున్న వ్యక్తులం. అంతేగాక పెళ్ళయి నువ్వు, పెళ్ళికాక నేను బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్నవాళ్ళం. చుట్టూ ఏర్పడిన పరిస్థితులు. ఏకాంతం మనల్ని ఉద్రేకపరిచాయి. అందుకే వివేకాన్ని కోల్పోయాం" అంటూ సమర్థించాడు అనంత్.

"కాని.. అనంత్ ఈ సంజాయిషీ జగదీష్‌కి నచ్చుతుందా? తరతరాలుగా తనెలా తగలడినా ఫర్వాలేదు కానీ తన పెళ్ళాం పవిత్రంగా వుండాలని ఆశించే స్వార్థపరుడైన మగవాడు దీనికి అంగీకరిస్తాడా?" అడిగింది వాసవి.

"అసలెందుకు చెప్పాలి?"

"నో! నేనిలాంటి హిపాక్రసీ మెయింటెయిన్ చెయ్యలేను. ఈ విషయాన్ని అతన్నుండి దాచడం అసాధ్యం."

"అయితే ఏం చేద్దామంటావ్?"

"నేను చచ్చిపోవడమొక్కటే నా సమస్యకి పరిష్కారం. నేను ప్రేమించిన వాణ్ణి పొందలేకపోయాను. అయినా బ్రతికాను. పెళ్ళిచేసుకున్న వాడికి దగ్గర కాలేకపోయాను. కానీ చచ్చిపోదామనిపించలేదు. అడుగడుగునా ఏదేదో సమస్యలు ఎదురవుతున్నా నిగ్రహించుకున్నాను. రోజూ ఈ యింట్లో రాత్రయ్యేసరికి నరకం చూస్తున్నా. మానసికంగా బలహీనురాలినయిపోయినా చావాలని అనుకోలేదు. చివరికి నా దుస్థితి నన్ను పతితని కూడా చేసేసింది. నేనింకా దేనికోసం బ్రతకాలి అనంత్?" అంటూ వెక్కెక్కి ఏడ్చేసింది వాసవి.

అనంత్ కాస్సేపు మాట్లాడలేనట్లు చూసాడు.

ఆ తర్వాత మెల్లిగా అన్నాడు "ఎందుకలా మాటిమాటికి పతితురాలినయిపోయానంటూ నిన్ను నువ్వు కించపరచుకుంటావ్? ఒకే పురుషుడితో సంబంధమున్న స్త్రీ ఎలా పతితురాలవుతుంది?"

వాసవి విభ్రాంతిగా చూసింది.

"అనంత్.. నీకీ సంగతి ఎలా తెలుసు? జగదీష్ చెప్పారా?" చాలా హీనస్వరంతో అడిగింది వాసవి.

అనంత్ నవ్వి "ఇలాంటి సంగతులు ఎంత క్లోజ్‌గా వున్నా ఏ మగవాడూ బయటకి చెప్పడు నాకెలా తెలుసో – నీకు తెలిస్తే బాధపడవుగా" అన్నాడు.

వాసవి లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపింది.

"రాత్రి...రాత్రి నువ్వు.. నన్నంత గాఢంగా పెనవేయడంలోనే అర్థం చేసుకున్నాను."

వాసవి తల భూమిలోకి కృంగిపోయింది.

"వసూ నేనొక మాట చెబుతాను. బాగా ఆలోచించు. విధివశాత్తు మనం విడిపోయాం. దైవికంగా తిరిగి కలిసాం. నాకెందుకో నిన్ను వదులుకోవాలని లేదు. అది నా స్వార్థం కావొచ్చు. మానసికంగా శారీరకంగా నీ ప్రేమని గెలిచే అధికారం నాకే లభించింది. అందుకే జగదీష్‌కి చెప్పి నిన్ను నేను పెళ్ళి చేసుకు ఒంటాను. మన కథంతా చెప్పి అతన్నుండి నువ్వు డైవోర్సు తీసుకుందువుగాని. అప్పుడు చెడిపోయేనన్న శంక నీకు గాని, తప్పు చేసానన్న బాధ నాకుగాని మిగలదు. వసూ ఈ విషయం బాగా ఆలోచించు తొందరపడాల్సిందేమీ లేదు. ఆలోచించి ఒక గంటలో నువ్వు నా దగ్గరికి రా. అలా వస్తే నువ్వు అంగీకరించినట్లు భావిస్తాను" అంటూ వడివడిగా క్రిందకెళ్ళిపోయాడు అనంత్.

అతను వెళ్ళిన వేపే విస్మయంగా చూసింది వాసవి.

అతను చెప్పిన విషయం ఆమెకు విభ్రాంతిని కలిగిస్తోంది. తనకు మళ్ళీ పెళ్ళా? ఇదెలా సంభవం?

వాసవికి అగమ్య గోచరంగా వుంది.

తండ్రి ఒప్పుకుంటాడా?

జగదీష్ అంగీకరిస్తాడా?

వాసవికి ఎవరో నవ్వినట్లయింది.

నువ్వు కూడా లోకం సింగినాథం అంటూ జీవితాన్ని నాశనం చేసుకుంటావా? మహతి బ్రతుకేమయిందో మరచిపోయావా? అణచి పెట్టిన కోరికలు శాపాలై జీవితాన్ని కాటేస్తాయి. అందుకే నీ సుఖం నువ్వు చూసుకో ఒడ్డున కూర్చుని వల్లించే వాళ్ళ శ్రీరంగ నీతులు వినకు. ఈ దయ్యాలకొంపలోంచి తప్పుకో. లేకపోతే నీకూ సావిత్రి గతే.

వాసవి ఉలిక్కిపడ్డట్లు నిలబడింది.

వెనుక ఎవరో తరుముతున్నట్లుగా భయపడి వడివడిగా మెట్లు దిగి అనంత్ గదికి పరిగెత్తుకొచ్చి గుమ్మంలో నిలబడిపోయింది.

గుమ్మానికవతల చిరునవ్వుతో రెండు చేతులూ చాచి ఆహ్వానిస్తున్న అనంత్

వాసవి పరుగున వెళ్ళి అతని చేతుల్లో వాలిపోయింది.

అంతే!

ఆ చేతులు రెండు పెనవేసుకుని ఆమెని దగ్గరకి తీసుకుని ఆర్తిగా హత్తుకున్నాయి.

## 32

"మీ కోసం ఎవరో వచ్చారయ్యా?" నౌఖరు మాటకి తలయెత్తి "ఎవరు?"

అని అడిగారు జగన్నాధరావుగారు.

"తెలీదయ్యా మిమ్మల్ని అర్జెంటుగా చూడాలట"

"పంపించు" జగన్నాధరవుగారు పేపరు మడిచి పక్కకు పెడుతూ చెప్పారు.

మరో పదినిమిషాల్లో లోపలికొచ్చిన స్త్రీమూర్తి వంక ఆశ్చర్యంగా చూస్తూ "మీరు?" అన్నారు జగన్నాధరావుగారు గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆలోచిస్తూ.

"అంత మర్యాద దేనికి లెండి. నేను అనసూయని" పరిమళ గొంతులో నిష్టూరం ధ్వనించింది.

జగన్నాధరావుగారి ముఖం తెల్లగా పాలిపోయింది.

దాదాపు తెల్లబడిన జుట్టు, చప్పిదవడలు - అసలు ఏ మాత్రం పోలికలు లేని ఈమె అనసూయా?

ఆయన ఆమె వంక నమ్మలేనట్లు చూసారు.

"మీకు నమ్మకం కలగడం లేదులా వుంది" అంది పరిమళ.

"నిజమే అసలు నువ్వేనా అనిపిస్తోంది. ఎందుకిలా అయిపోయావ్? ఇన్నాళ్ళూ ఎక్కడున్నావ్?" అన్నారు ఆదుర్దాగా.

పరిమళ నిస్పృహగా నవ్వింది. "నిజమే నాకే ఒక్కొక్కసారి నేను నేనేనా? అనే అనుమానం కలుగుతుంది. ఇక మీరు అలా అనుకోవడంలో ఆశ్చర్యపడాల్సింది ఏమీలేదు."

జగన్నాధరావుగారు తల పంకించి "కూర్చో! కాఫీ త్రాగుతావా?" అన్నారు అభిమానంగా.

పరిమళ కూర్చుంది.

"నీ పేరు పరిమళగా మార్చుకున్నావా? డాక్టరు చెబితే నాకలాంటి వాళ్ళు తెలియదని చెప్పాను."

"ఆ తర్వాత అనసూయనని చెప్పించానుగా. అయినా మీరు రాలేదు. మళ్ళీ ఈ జంఝాటం ఎందుకని తప్పించుకున్నారు. అవునా?" అని నిష్ఠూరం చేసింది పరిమళ.

జగన్నాధరావుగారు పరిమళ తన గుట్టు గ్రహించేసినందుకు కాస్త కంగారుపడి "అబ్బే నువ్వలా అనుకోవడంలో తప్పులేదు. వెంటనే కారు రెడీ చేయించి బయలుదేరుతుంటే అమ్మాయి నుండి ఫోనొచ్చింది వెంటనే మద్రాసు రమ్మని. అందుకు అటు వెళ్ళాల్సొచ్చింది" అని అబద్దమాడారు.

"ఎందుకు?"

"అమ్మాయికి బాగోలేదు."

"అమ్మాయ్‌కేం జరిగింది? నేనొచ్చేటప్పుడు బాగానే వుందే?" పరిమళ కంగారుగా అడిగింది.

జగన్నాధరావుగారు పరిమళవేపు వింతగా చూసారు.

"నువ్వు హాస్పిటల్ నుండి పారిపోయి వచ్చావా? నిన్ను వాళ్ళసలు డిశ్చార్జి చేసారా?" అన్నారు అనుమానంగా.

"ఎందుకంత అనుమానం. ఇదిగో వాళ్ళు డిస్చార్జి చేస్తూ యిచ్చిన కాగితం" సంచిలోంచి ఒక కాగితాన్ని తీసి చూపించింది పరిమళ.

ఆయన దాన్ని చూసి సంతృప్తిగా తలాడించి "తలకి దెబ్బ తగిలిందన్నారుగా తగ్గిందా?" అన్నారు.

"తగ్గబట్టే యిక్కడికి నలభయి రోజుల తర్వాత వచ్చాను. ఈ లోపున అక్కడేం జరిగిపోయిందోనని భయంగా వుంది"

"ఎక్కడ?"

"ఎక్కడేమిటి? నేను మాట్లాడుతున్నది అమ్మాయి సంగతి"

జగన్నాధరావుగారు అర్థంకానట్లు చూసారు.

"ఏ అమ్మాయి సంగతి?"

"ఇంకే అమ్మాయి సంగతి నేను మాట్లాడతాను. మన అమ్మాయి వాసవి సంగతే" అంది పరిమళ నిరసనగా.

జగన్నాధరావుగారు ఉలిక్కిపడ్డట్లు చూసారు.

"వాసూ ... నీకు తెలుసా?"

"ఎందుకంత భయపడుతున్నారు? నేను ఆమెకు తల్లిగా తెలియదు కానీ, ఆమె నాకు కూతురిగా తెలుసు. విధివశాత్తూ నేను ఆమె యింటనే వంట మనిషిగా చేరాల్సిన దౌర్భాగ్యం పట్టింది. అప్పుడే మిమ్మల్ని చూసి గుర్తుపట్టాను.

నేను చేసిన పెరుగావడ తిని మెచ్చుకోవడం విని త్రొంగి చూసాను. ఆ విధంగా వాసవిని నాకన్న కూతురిగా గ్రహించాను. ఆ విధంగా కూతురి దగ్గర వుండే అదృష్టం కలిగినందుకు సంతోషపడ్డాను" అంది పరిమళ.

"మన విషయం అంతా వాసవికి చెప్పేసావా?" జగన్నాధరావుగారు కంగారుగా అడిగారు.

"అంత నీచురాలిని కాదు నేను" అంది పరిమళ కోపంగా.

"నీకు తెలియదు అనసూయా నీకోసం ఎంత గాలించానో. నువ్వు చాలా తొందరపడ్డావు" అన్నారు జగన్నాధరావుగారు బాధగా.

"కట్టు కథలు చెప్పకండి. నన్ను పెళ్ళిచేసుకుని ఆ తర్వాత మీకు ముందే పెళ్ళయిందని తెలిసి కూడా సహించాను. మీ అనురాగం వున్నప్పుడు అధికారం ఎందుకని సంతృప్తి పడ్డాను. మీ మొదటి భార్య గొడ్రాలని కుమిలిపోతున్నదని నాకు మళ్ళీ సంతానం కలిగే అవకాశం వుందని నచ్చచెప్పి నా బిడ్డని ఆమె చేతుల్లో పెడితే నోరు మూసుకున్నాను. కానీ మీ బిజినెస్‌లో యింకా పైకి వెళ్ళేందుకు మీ పార్టనర్‌ని నా మీదకి ఉసికొలిపితే సహించలేక పారిపోయి కృష్ణలో దూకాను. ఆ తర్వాత ఏ శీలం చెడకూడదని తాపత్రయపడి తప్పుకున్నానో తప్పని స్థితిలో దాన్నే అమ్ముకుని యిప్పటిదాకా జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను" అంది పరిమళ ఏడుస్తూ.

"అనూ" అన్నాడు జగన్నాధరావు ఆవేదనగా.

"మీ అనూ ఇంకా ఎక్కడదండీ? ఏనాడయితే ప్రాణాలతో ఒక వ్యభిచార గృహ బ్రోకర్‌కి దొరికిందో ఆ రోజే చచ్చిపోయింది. వాళ్ళు నన్ను కుళ్ళబొడిచి నా చేత బలవంతంగా వ్యాపారం చేసారు. నా శక్తి ఉడిగిపోయాక పనికి రావంటూ బయటకి నెట్టారు. అలా ఒక డాక్టరింట్లో వంట మనిషిగా చేరి మద్రాసు చేరాను. చివరకి నాకు తెలియకుండానే నా కూతురింట్లో ప్రవేశించాను" అంది పరిమళ.

"నా పొరపాటు క్షమించు అనూ. ఈ సంగతులేవీ దయచేసి మన వాసూకి చెప్పకు" అన్నారు జగన్నాధరావుగారు పరిమళ చేతులు పట్టుకుని.

"ఆ రకం చిల్లర వ్యాపారాలు నాకు తెలియవు. నేను వాసవి విపత్కర పరిస్థితుల్లో వుందనే .. ఆ విషయాలు తెలియబరచాలనే కంగారుతోనే మీ దగ్గరకు బయల్దేరాను. తీరా ట్రెయిన్ ఏక్సిడెంటు స్పృహ రాగానే మిమ్మల్ని పిలిపించి అంతా చెప్పాలనుకున్నాను. కాని నలభయి రోజులనంతరం మీ దగ్గరకి రాగల్గేను. ఈ లోపున నా చిట్టితల్లి ఏమయిందో?" అంటూ పరిమళ విలపించసాగింది.

జగన్నాధరావుగారిలో ఆందోళన హెచ్చయింది.

"వాసూకి ఏమయింది? నా చిట్టితల్లికేమయింది? అందుకేనా నాకు ఫోన్ కూడా చెయ్యడం మానుకుంది" అంటూ కంగారు పడసాగారాయన.

"మీకు ఫోన్ చెయ్యడం కూడా మానేసిందా?" పరిమళ ఆశ్చర్యంగా అడిగిమి.

"అవును. అసలేం జరిగిందో నువ్వు తొందరగా చెప్పకపోతే నేను చచ్చుపోవడం ఖాయం" అన్నారు జగన్నాధరావుగారు.

"అది ఒక్క మాటలో చెప్పే విషయం కాదు. అసలా పెళ్ళి ఎలా చేసారు మీరు?" అంటూ అడిగింది పరిమళ.

"ఏం జరిగింది?"

"ఏం జరగాలి. డబ్బు ఒక్కటే మనిషిని సుఖపెడుతుందనే నీచమైన సిద్ధాంతాన్ని నమ్మిన మీరు కన్నకూతురి జీవితాన్ని కూడా బలిచేసారు. అతగాడితో మన అమ్మాయికింతవరకూ .. మీకెలా చెప్పాలి?" అంటూ ఆగింది పరిమళ.

"అర్థమయ్యింది. అర్థమయ్యింది" అన్నారు జగన్నాధరావుగారు గబగబా.

"ఆయన వ్యాపారమంటూ విదేశాలు ఊరేగాడు. ఇక్కడ వయసులో వున్న సెక్రటరీతో మన అమ్మాయి" అంటూ ఆగింది పరిమళ.

"ఛ వాసవి అలాంటిది కాదు. దాని వ్యక్తిత్వం నాకు తెలుసు." అన్నారు గర్వంగా.

పరిమళ దెబ్బతిన్నట్లు చూసింది.

"ఎవరూ పుట్టుకతోనే పక్కదారి పట్టరు. సాగితే అందరికీ వుంటుంది వ్యక్తిత్వం. ఆత్మగౌరవం. ఆ యింట్లో అన్ని అవలక్షణాలూ వున్నాయి. దయ్యాలు దారుణాలు, హత్యల గందరగోళాలూ, రౌడీమూకల గోలలు. వీటన్నిటి మధ్యా మీ ముద్దుల కూతురు పిచ్చిదవ్వడానికి రెడీగా వుంది. ఆ సెక్రటరీ వ్యవహారం నచ్చడంలేదు నాకు. అతడి కన్ను అమ్మాయిమీద పడినట్లు అనిపిస్తోంది. అతగాడు వయసులో వున్న వీళ్ళిద్దర్నీ గాలికి వదిలి ఫారిన్ వెళ్ళి కూర్చున్నాడు."

"జగదీష్ ఫారిన్ వెళ్ళాడా? ఈ సంగతి నాకు తెలియదే?" అన్నారు జగన్నాధరావుగారు ఆశ్చర్యంగా.

"ఎలా తెలుస్తాయి? అమ్మాయి మానసిక స్థితి బాగోలేదు. నమ్మిన సెక్రటరీ చాలా దొంగ వెధవలాగున్నాడు అందుకే తెలియబరచి వుండడు. అమ్మాయిని మీ దగ్గర కెళ్ళమని హెచ్చరించినప్పటికీ, వింటేగా ట్రీట్‌మెంటు అంటూ దాటేశాడు."

"వాసవిని గట్టిగా మందలించలేకపోయేవా?"

"ఏ అధికారంతో మందలించను. అప్పటికీ తల్లి మనసు కాబట్టి ఆగలేక హితబోధ చేయబోయాను. ఒక వంట మనిషి మాటలు యింటి యజమానురాలికి నచ్చుతాయా?" అంది పరిమళ బాధగా.

జగన్నాధరావుగారు కాస్సేపు మాట్లాడలేదు.

"ఇంతకీ ఎవడా సెక్రటరీ? తెలుగువాడేనా?"

"ఆఁ తెలుగువాడిలాగే వున్నాడు. పేరు అనంత్ అట."

పక్కలో బాంబు పేలినట్లు ఉలిక్కిపడ్డాడు జగన్నాధరావుగారు.

"మీకు ముందే తెలుసా?" పరిమళ ఆశ్చర్యంగా అడిగింది. జగన్నాధరావుగారు జవాబు చెప్పలేకపోయారు.

ఆయన ముఖం రక్తం పీల్చివేసిన పిప్పిలా తయారయ్యింది.

"మనం - మనం వెంటనే మద్రాసు బయల్దేరాలి" అంటూ గుండెలు రుద్దుకోసాగారాయన.

పరిమళ కంగారుగా చూసి "ఏంటలా అయిపోయారు? డాక్టర్ని పిలిపించమంటారా?" అంది కంగారుగా.

ఆయన వద్దని సంజ్ఞ చేసి డెస్కులో వున్న మాత్ర ఒకటి తీసుకుని మ్రింగుతుంటే గబగబా మంచినీళ్ళు తెచ్చి అందించింది పరిమళ.

**"ఎవడా మనిషి?"** తోటమాలి గట్టిగా గదమాయించాడు.

గేటుముందు అంతకు ముందు అరగంట నుండి తచ్చాడుతోన్న మనిషి కాస్త ముందుకొచ్చి "చాలా ఆకలిగా వుంది. కాస్త ఏదైనా వుంటే పెట్టు" అన్నాడు జాలిగా.

"నాక్కూడా గతిలేదు. నీకేంటి యిస్తా? పో..పో" అన్నాడు మాలి నిరసనగా.

"పోనీ ఏదైనా వేలై చెప్పు చేస్తా" బ్రతిమాలాడు అవతల మనిషి.

"ఈ యింటిదా యజమాని లేడు. నేను నౌఖర్ని. నేనుదా ఏం వేలై చూపెడుదును పో" అన్నాడు.

"పోని అమ్మ వుందా?"

"ఆమె ఎటో పోయివుండాది. ప్రస్తుతం నేనుదా యింటి యజమానిని" అన్నాడు మాలి పరిహాసంగా.

"మరి నన్ను పనిలోకి తీసుకో. ఈ లంకంత మేడలో ఒంటరిగా ఏమి చేస్తావ్? నాకు బాగా కథలు వచ్చు. నీకు కాలక్షేపం."

"సరిసరి. నా పని చెడగొడతావన్నమాట"

"నిన్ను అయ్యప్పస్వామి క్షేమంగా చూస్తాడు"

మాలి మెత్తబడి అతన్ని లోపలికి రానిచ్చాడు.

అతను కోటలో పాగా వేసినట్లు లోపలికొస్తుంటే "ఉత్త కబుర్లు కాదు కాస్త పని చెయ్యాల. మొక్కలన్నిటికి మడులు కట్టు."

అతను సరేనన్నట్లు తల వూపాడు.

"నీ పేరు?"

"వేలాయుధం"

"నళ్ళా పెయిర్"

వేలాయుధం నవ్వి మొక్కలకి మడులు చేయడం ప్రారంభించాడు. మాలి మరో పక్క పని చేస్తున్నాడు.

"ఈ యిల్లు రొంబ బాగుంది. ఇందులో ఎంతమంది జనందా వుంటారు?" అడిగాడు వేలాయుధం.

"ఎంతోమంది కూడానా లింగు లిటుకు మంటూ మొగుడూ పెళ్ళాలే"

"పిల్లల్లేరా? పాపం తీర్థయాత్రలకి వెళ్ళినట్లున్నారు."

వేలాయుధం సానుభూతికి మాలి కిసుక్కున నవ్వి "కాదు. ప్రేమ యాత్రలకి" అన్నాడు.

వేలాయుధం ఆ మాటని అంతగా పట్టించుకోనట్లు మడులు తీస్తూ "వాళ్ళు చిన్నవాళ్ళా ప్రేమయాత్రకి పోటానికి" అన్నాడు.

"చిన్నవాళ్ళే. అదికాదుగా పాయింటు. మొగుడు పనిమీద ఎటో పొయ్యాడు. పెళ్ళొందా కుర్ర సెక్రెటరీతో కులుకుతోంది" అన్నాడు మాలి కసిగా.

"రొంబ పావం వరుం! మనం చూడకుండా నింద వేయడం..."

"నీ మొహం నేనన్నీ కళ్ళతోనే చూస్తుండా. వాళ్ళకసలు నేనంటే లెక్కేమిటి? ఒక పురుగుని చూసినట్లు తీసేసి తిరుగుతారు."

"అంతా పెద్దవాళ్ళు" అంటూ ఆకాశంలోకి చేతులు చాచి ఆ పైన లెంపలేసుకున్నాడు వేలాయుధం.

మాలి కాస్సేపు యజమానైపోయాడు. దర్జాగా కేన్ ఉయ్యాల్లో కూర్చుని కబుర్లు చెబుతోంటే వేలాయుధం చకచకా తోటపని చేస్తున్నాడు.

మాలికిది బాగానే వుంది వాడు జీతం అడగలేదు కాస్త తిండి. తను తినే సంగతి కాస్త పెడితే సరి.

మొక్కలన్నీ కళకళలాడుతూ వుండాలని మరీ హెచ్చరించి వెళ్ళాడు కుర్ర సెక్రెటరీ.

అయ్యగారికన్నా ఇతగాడి పెత్తనం ఎక్కువైపోయింది అని అనంత్ మీద కోపం తెచ్చుకున్నాడు మాలి.

వేలాయుధం అక్కడ త్రవ్వి చదును చేసిన ఒక ప్రాంతాన్ని చూపిస్తూ ఇక్కడదా ఏమైనా క్రొత్త మొక్కలు దా వేయాలా?'' అన్నాడు.

''అదెల్లా ఏం లేదు. మొన్న అయ్యగారు ఎందుకో త్రవ్వించారులే''

''వేలాయుధం ఆశ్చర్యంగా చూసి అక్కడ త్రవ్వించాల్సిన పనేమొచ్చింది?'' అంటూ అడిగాడు.

''అదెల్లా నాకు తెలియదు. అక్కడ అయ్యగారి నాయ్ (కుక్క) చస్తే పూడ్చిపెట్టిండ్రు.''

''ఆమ'' అంటూ మరోవేపు వెళ్ళాడు వేలాయుధం.

శంకర్ బలవంతంగా బలరాంకి తలస్నానం చేయిస్తున్నాడు.

''ఏంర్రా ఈ న్యూసెన్సు నాకియన్నీ గిట్టవన్నానా'' అంటూ విసుక్కున్నాడు బలరాం.

''మీకు తెలియదయ్యా తలస్నానం చెయ్యకపోతే మెదడు మొద్దుబారుద్ది మంచి అయిడాలు రావడం మానేస్తాయి. తవరింకా ఎన్ని ఘనకార్యాలు సెయ్యాల ఆ జగదీష్‌గాడు రేపో మాపో వస్తాడు. ఆణ్ని సిత్రిక పట్టాలంటే స్పెషల్ బుర్ర కావద్దూ.''

వాడి మాటలకి బలరాం నవ్వాడు.

ఆ నవ్వడంలో కుంకుడుకాయ రసం ముక్కులోకి, నోట్లోకి వెళ్ళి మంట పెట్టింది వాడికి.

''ఓర్నీ యవ్వ. ఈ యెదవ సరుకు ఎక్కడ తెచ్చావ్ మంటలేస్తూంది, షాంపూ తేకూడదూ'' అంటూ కసురుకున్నాడు బలరాం.

''అది మంచిది కాదంట్లే గురూగారూ కాస్సేపు ఓపిక పట్టండి అయిపోవచ్చిందిగా'' అన్నాడు శంకర్ బ్రతిమాలాడుతోన్న ధోరణిలో.

బలరాం బుద్ధిగా కూర్చున్నాడు.

స్నానం అయిపోగానే టవలందించాడు శంకర్.

వాడు వళ్ళు తుడుచుకుంటుంటే శంకర్ వాడివైపు మైమరుపుగా చూసి ''ఏం ఫిగర్ సార్. మన ఎన్.టి.వోడిగ్గాని, ఎంజీఆర్ గాడికి లేదుస్సార్. నువ్వులనూనె రాసేసరికి అదిరిపోతంది సార్'' అన్నాడు తన్మయత్వంగా.

''ఏంటి?'' అన్నాడు బలరాం యధాలాపంగా.

''తమరి ఫిగర్ సార్. రంభ సూసినా డంగైపోయి యమస్పీడుగా ఎనకాతలొచ్చేయాల్సిందే'' అన్నాడు.

''చాల్చాలురా గాస్'' అన్నాడు బలరాం నవ్వేస్తూ.

''మీరలా నా మాటల్ని గాస్ తుస్ బుస్ అని తీసేస్తే నాకు చాలా కోపమొచ్చేస్తది. కావాలంటే ఏ దారినపోయే అమ్మాయినయినా అడిగి సూడండి'' అన్నాడు బుంగమూతి పెట్టి.

''అది సరేకాని ఎదవ నాయాలా? ఈ రోజు వంటేంటి సేసేవ్''

''చెబితే ఇప్పుడే భోజనానికి రెడీ అయిపోతారు'' అంటూ శంకర్ కవ్వించాడు.

''చాల్లేరా సన్నాసీ చెప్పేడువు'' అన్నాడు బలరాం.

''కైమా బాల్స్ రొయ్యి పొట్టు చారు''

"బ్రహ్మాండం. నాకు నిజంగానే ఆకలేస్తుందిరా" అన్నాడు బలరాం గారంగా.

"అయితే రండి మరి వడ్డించేస్తాను" అన్నాడు శంకర్ హుషారుగా.

"ఎక్కడ నేర్చావురా ఇంత బాగా వంట" అంటూ లొట్టలేస్తూ తింటున్నాడు బలరాం.

"ఆ ముత్తు దగ్గరేనండి పాపం సచ్చి ఏ లోకంలో వుందోగాని తొందరగా ఎత్తుకెళ్ళిపోయాడో దేవుడు" అన్నాడు శంకర్ విచారంగా.

బలరాం గట్టిగా నవ్వాడు. అలా నవ్వడంలో వాడికి బాగా పొలమారి దగ్గుతుంటే మంచినీళ్ళ గ్లాసందించాడు శంకర్.

బలరాం నీళ్ళు త్రాగుతుంటే "నేనేమయినా తప్పు మాట్లాడేనా?" అన్నాడు అమాయకంగా.

"పొరబాటు కాక ఏంట్రా? దాన్ని ఎత్తుకెళ్ళిపోయిన దేవుడెవరో తెలుసా?"

"ఎవరు సార్?"

"నేనే" మళ్ళీ బిగ్గరగా నవ్వాడు బలరాం.

శంకర్ బిత్తరపోయి చూసాడు బలరాం వైపు.

"ఎందుకు? అది మిమ్మల్నేం చేసింది?" అన్నాడు సీరియస్‌గా. బలరాం వింతగా చూసాడు శంకర్ వైపు.

"ఏంట్రోయ్? సిఐడి గదమాయించి అడుగుతున్నావ్?" అన్నాడు.

శంకర్ వెంటనే సర్దుకుని "ఊరికే తమాషాకి చెబుతున్నారులే. దాంతో మీకేం పని?" అన్నాడు నవ్వుతూ.

"నీ యిష్టమొచ్చినట్లనుకో నిజానికి దాంతో నాకేంటి పని డబ్బులిస్తే నిన్నయినా సంపేస్తానురా సన్నాసి" అన్నాడు హేళనగా.

శంకర్ మాట్లాడలేదు.

భోజనం కాగానే త్రాగడం ప్రారంభించాడు బలరాం.

"ఈ యిస్కీ బాటిలెక్కడిదిరా"

"ఆ జగదీష్‌గాడిదండి. ఇంట్లో ఎవ్వరూ లేరుగా నేనట్టు కొచ్చేసాను."

"ఆడి పెళ్ళాం లేదూ"

"లేదండి"

"ఎక్కడికూరేగింది?"

"ఏమో తెలవదండి ఆయమ్మా సెక్రటరీబాబు ఊరెళ్ళేరంట"

బలరాం పకపకా నవ్వి "ఆడివల్లో పడిందన్నమాట" అన్నాడు.

"ఛ ఆయమ్మ అలాంటిది కాదండి"

"నీకేం తెలుసురా బచ్చాగాడివి ఆడారోజు ఆమె వెనకేసుకుని నామీద కొచ్చినప్పుడే అనుకున్నాను. ఏర్పాట్లు కొత్తరకంగా జరిగాయని"

అర్థం కానట్లు చూసాడు శంకర్.

బలరాం త్రాగుతున్నాడు. పెగ్ పెగ్‌కి అతని గొంతు తారాస్థాయికి పోతున్నది.

"ఆడు.. నన్ను మోసం చేసి ఎక్కడికెల్తాడు? సావిత్రిని స్వర్గానికి పంపినట్లు ముత్తుని యమలోకానికి పంపినట్లు ఈణ్ణి పంపేసెయ్యనూ."

శంకర్ కళ్ళు పెద్దవిచేసి చూస్తూ.

సావిత్రి పేరు వినగానే వాడి కళ్ళు విశాలమయ్యాయి.

బలరాం క్లయిమాక్సు కొచ్చేసాడు.

అకారణంగా ఏడుపు లంకించుకున్నాడు.

"ఏరా ఇందాక ఏటన్నావు. రంబ చూసి డంగై పోద్దా? ఏదిరా ఆ సాయిత్రి నన్ను సీకొట్టేసిందిరా. దానికెంత బడాయిరా అందుకే...అందుకే దాన్ని పీక..పిసికి బాగా రోగం కుదిరింది ముండకి."

శంకర్ కళ్ళు ఎర్రబడిపోతున్నాయి.

అలాగే వాడివైపు చూస్తున్నాడు.

శంకర్‌తో పాటు బలరాంని కనిపెడుతోన్న మరో వ్యక్తి గుమ్మం పక్కనే పొంచి వుండటం ఆ యిద్దరూ గమనించలేదు.

33

జగన్నాధరావుగారి టాక్సీని చూడగానే గబగబా గేటు తలుపులు బార్లా తెరిచాడు మాలి.

టాక్సీలోంచి ఆయనతో పాటూ పరిమళ కూడా కారు దిగడం ఆశ్చర్యం కలిగించింది మాలికి.

"అమ్మగారు లేరండి" అన్నాడు మాలి చావు కబురు చల్లగా చెబుతున్నట్లు.

జగన్నాధరావుగారు ప్రమాన్పడినట్లు చూసి పరిమళవైపు తిరిగారు.

ఆమె కళ్ళు కూడా ఆందోళనగా రెపరెపలాడాయి.

"అవునవును. ఆ సంగతి అమ్మాయి ఫోన్‌లో మాకు చెప్పింది. నేనే డాక్టరుతో పనివుండి అర్జెంటుగా రావాల్సి వచ్చింది. తాళాలు నీకిస్తానంది ఇచ్చిందా?"

"ఇచ్చినారండి. ఏమో కొన్ని గదులవి తప్ప అన్నీ నా దగ్గరే ఉన్నాయి" అంటూ తాళాల గుత్తి అందించాడు మాలి.

వాటిని తీసుకుని యిద్దరూ లోనికొచ్చారు.

"నేననుకున్నంతా జరిగిపోయే వుంటుంది" అంది పరిమళ గాభరాగా.

"ఉష్. అది కాదు నా బాధ. ఏదో కుర్రతనం. కాస్త సరదాగా. తిరిగి వుంటారు. కానీ జగదీష్ వచ్చేలోపున వచ్చేస్తే ఫర్వాలేదు" అన్నారు జగన్నాధరావుగారు.

ఆయన ఆలోచనా విధానానికి ఆశ్చర్యపడింది పరిమళ.

"అద్సరే. అమ్మాయి వెళ్ళడం తెలిసినట్లు మాట్లాడారేమిటి? తాళాలు అతని దగ్గర వుంటాయని ఎలా గ్రహించారు?" అంది పరిమళ విస్మయంగా.

జగన్నాధరావుగారు నవ్వి "నువ్వు మరీ అమాయకం. అమ్మాయి సెక్రటరీతో రహస్యంగా వెళ్ళినట్లు తెలిసిపోదూ మనం తెల్లబోతే. అందుకే అలా నాటకం ఆడాను. తాళాలు యిస్తానంది అని చెబితే నాకు ముందే అన్ని విషయాలూ తెలుసనుకుంటాడు. నౌకర్ల ముందు మన గుట్టు బయట పెట్టుకుంటామా?" అన్నాడు తెలివిగా.

ఇంతలో మాలివచ్చి "పాలు ఏవన్నా కావాలా పరిమళమ్మా? వంట మొదలెడ్తావా?" అన్నాడు.

జగన్నాధరావుగారు గతుక్కుమన్నట్లు చూసారు.

పరిమళ చిన్నగా నవ్వి "ఈ పూటకి వంట చేయలేనుగాని హోటల్నుంచి తెప్పించే ఏర్పాటు చూడు" అంటూ డబ్బు యిచ్చింది.

వాడు వెళ్ళిపోయాక "వాడి దృష్టికి నేను వంటమనిషినే" అంది మెల్లిగా.

"సరే నువ్వు మిగతా విషయాలు చూసుకో. నేను ఈ సెక్రటరీ ఎవరో ముందు కనుక్కోవాలిగా" అంటూ అవుట్ హౌస్‌వైపు నడిచారు.

వేలాయుధం గబగబా ఆయన వెంబడివచ్చి "అమ్మగారి తండ్రిగారా సార్ మీరు నమస్కారమండి" అన్నాడు వినయంగా.

జగన్నాధరావుగారు తల పంకించి "నువ్వేం చేస్తుంటావ్?" అన్నారు నడుస్తూనే.

"తోట పనేనండి"

"అమ్మాయిగారు వెళ్ళి ఎన్నాళ్ళవుతుంది?" నడుస్తూనే అడిగారాయన.

"తమకు తెలుసన్నారు కదండీ."

వాడి ప్రశ్నకి కొంచెం తడబడి "తెలుసనుకో ఒక వారంలో వెళ్తామని చెప్పిందప్పుడు. సరిగ్గా ఏ తారీఖునని?"

"నాకూ సరిగ్గా తెలియదండి. నేను దా పనిలోకొచ్చి పదిహేను దినాలయ్యింది. అప్పటికే ఆరులేరు."

ఆ జవాబుకి జగన్నాధరావుగారి భ్రుకుటి ముడి పడటం వేలాయుధం గమనించాడు.

జగన్నాధరావుగారు మెల్లిగా అవుట్ హవుస్ తలుపులు, తెరిచారు. గదంతా ధూళితో నిండిపోయి వుంది. వస్తువులన్నీ చిందరవందరగా పడి వున్నాయి.

జగన్నాధరావుగారి దృష్టి మంచమ్మీద శాలువా క్రిందపడివున్న చీర మీద పడింది.

ఆయన మనసు చేదు తిన్నట్లయింది.

అయినా నిగ్రహించుకున్నారు.

"ఇంతకీ ఈ అనంత్ ఆ అనంతేనా?" అన్న ప్రశ్న ఆయన్ని వేధిస్తోంది.

స్టాండుకున్న ఖరీదయిన బట్టలు. వాడి పారేసిన సిగరెట్ పేకట్ గదిలో ఇంకా అంటిపెట్టుకుని వున్న సన్నటి ఫారిన్ లవండర్ వాసన ఇవేవీ అనంత్‌ని పట్టిచ్చేట్లు లేవు.

"రైటింగ్‌ని బట్టి అనంత్‌ని గుర్తుపట్టొచ్చు. అతని రైటింగ్ తనకి బాగా గుర్తు" అనుకుంటూ ఆయన ఒకలాంటి ధైర్యంతో బల్లమీదున్న ఫైలుని తెరచి చూసారు.

అదేదో ఫారిన్ కొలాబరేషన్‌తో స్థాపించబోయే ఒక ఫర్మ్ తాలూకు ఇన్ఫర్మేషన్. అంతా టైపు చేయబడి వుంది. అక్కడక్కడ జగదీష్ సంతకాలున్నాయి.

జగన్నాధరావుగారు నిరాశతో ఫైలు మూసేసి వెనుతిరిగారు.

వస్తూ వస్తూ ఆయన దృష్టి మంచం పక్కన వున్న రేక్‌మీద పడింది.

అక్కడవున్న ఇంగ్లీషు నవల్సు తెరచి చూసారు. ఎక్కడయినా అతను సంతకం చేసి వుండొచ్చు.

ఆయన గబగబా పేజీలు తిప్పి తను కావాలన్నది దొరక్క పుస్తకాన్ని రేక్ మీదకి విసురుగా విసిరారు.

ఆ విసురులో అవి వెళ్ళి క్రింద పడ్డాయి.

"అవి తీసి సరిగ్గా పెట్టు" అంటూ చిరాగ్గా బయటకొచ్చి నిలబడ్డారు తనతోపాటు వచ్చిన వేలాయుధంతో.

వేలాయుధం గబగబా మంచం వెనక్కి వంగి పుస్తకాలని తీసి యధాస్థానంలో వుంచుతూ "ఇదేదో క్రింద పడిందయ్యా" అంటూ. అనాసక్తంగా సూసేరాయన అంతే.

ఆయన కళ్ళు పెద్దవయ్యాయి.

గుండె దడ హెచ్చింది.

గబగబా వేలాయుధం చేతిలోంచి ఆ వస్తువు లాక్కుని మరీ మరీ చూసారు.

ఆ వెంటనే కుప్పలా కూలిపోతున్న జగన్నాధరావుగారిని గట్టిగా పట్టుకుని కేకలు పెట్టాడు వేలాయుధం.

ఆ కేకలకి మాలితోపాటు, పరిమళ కూడా పరిగెత్తుకొచ్చింది.

"ఏం జరిగింది?" అంది పరిమళ.

"ఏమో తెలియదు తల్లీ. ఇది చూసి ఇరుసుకు పడ్డారంతే" అన్నాడు వేలాయుధం.

పరిమళ ఆశ్చర్యంగా చూసింది దానివైపు.

చిరునవ్వులొలికిస్తూ కొంటె చూపులు చూస్తున్న అనంత్ ఫోటో.

"అది మన సెక్రటీ సార్ ఫోటో. అదేమన్నా దయ్యమా? భూతమా? జడుకుని పడిపోటానికి" అన్నాడు మాలి.

"ఆ సంగతి సరే. ముందు టాక్సీ ఒకటి చూడండి. అయ్యగార్ని హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాలి" అంది.

వేలాయుధం టాక్సీ కోసం పరిగెత్తాడు.

"ఎగ్మూరులో రామస్వామి అయ్యంగారి ఆస్పత్రికి తీసుకెళ్ళండి. ఇదివరకు కూడా ఈ బాబు ఆడనే ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. జగదీష్ బాబు పేరు చెబితే జాగ్రత్తగా చూస్తారు" అన్నాడు మాలి.

పరిమళ సరేనన్నట్లు తల వూపింది.

టాక్సీ వచ్చింది.

మాలీ, వేలాయుధం సాయపడి జగన్నాధరావుగారిని టాక్సీ ఎక్కించారు.

"నువ్వు కూడా వెళ్ళు. అక్కడ సాయపడుదువుగాని" అన్నాడు మాలి వేలాయుధంతో.

వేలాయుధం తలవూపి టాక్సీ ఎక్కాడు.

పరిమళ జగన్నాధరావుగారి తల ఒళ్ళో పెట్టుక్కూర్చుంది. టాక్సీ పరుగెత్తింది. స్పృహలో వున్న వాళ్ళిద్దరికి అర్ధంకాని ప్రశ్న ఒక్కటే.

"అనంత్ ఫోటో చూసి అంత అప్‌సెట్ కావల్సిందేమిటి?" అర్ధం కాలేదు.

**జగదీష్ కారు** దిగుతోంటే గబగబా ముందుకి పరిగెత్తుకొచ్చాడు మాలి.

జగదీష్ మేడపైకి ఒకసారి చూసి "అమ్మగారు?" అన్నాడు.

మాలికేం చెప్పాలో తోచలేదు. ఏం చెబితే తప్పవుతుందో అని తటపటాయించి "అమ్మగారు ఊళ్ళో లేరండి" అన్నాడు.

జగదీష్ నవ్వి "ఇంకా రాలేదా?" అన్నాడు.

"అవునయ్యా" అంటూ లగేజ్ మోసుకుంటూ అతని వెనుకే మెట్లెక్కాడు.

జగదీష్ సడన్‌గా ఆఖరి మెట్టుమీద నిలబడి "ఆయనెవరు?" అన్నాడు

"ఆడు ..ఆడు కూడా నాలాగే మాలిగాడండి. గడవడం లేదంటే నేనే అణ్ణి పనిలో యెట్టాను" అన్నాడు భయంగా.

జగదీష్ నవ్వి "మళ్ళీ నీకొక అసిస్టెంటా? జాగ్రత్త దొంగ వెధవలుంటారు" అన్నాడు హెచ్చరికగా.

వేలాయుధం దెబ్బతిన్నట్లు పైకెళ్ళిపోయాడు.

మాలి సామాను రాక్‌లో పెట్టి "అయ్యగారూ" అంటూ మెల్లిగా పిలిచాడు. బాత్రూంలోకి వెళ్ళబోతున్న జగదీష్ ఆగి "ఏంట్రా?" అన్నాడు.

"మీరు లేనప్పుడు పెద్దయ్యగారొచ్చారండి"

"పెద్దయ్యగారా?"

"అదేనండి అమ్మగారి అయ్యగారు"

"అరె ఎప్పుడు? ముందు ఫోన్ చెయ్యలేదా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అదంతా నాకు తెలవదండి. వచ్చిన రోజునే ఆరికి మళ్ళీ గుండె నొప్పొచ్చి పడిపోయారు" అన్నాడు గబగబా.

జగదీష్ కళ్ళు విశాలమయ్యాయి

"ఆయనిప్పుడెక్కడున్నారు?" అన్నాడు ఆత్రుతగా.

"మీరిదివరకు చేర్పించిన ఆస్పిటల్‌కే అట్టుకెళ్ళింది పరిమళమ్మ."

"ఐసీ" అంటూ గబగబా బట్టలేసుకుని మళ్ళీ అదే కారులో హాస్పిటల్‌కి పరిగెత్తాడు జగదీష్.

జగదీష్‌ని చూడగానే జగన్నాధరావుగారు కాళ్ళు పడుతున్న పరిమళ గబగబా లేచి నిలబడింది వినయంగా.

ఆమెను, జగన్నాధరావుగారికి అంత క్లోజ్‌గా చూడగానే అదోలా అనిపించింది జగదీష్‌కి.

ఆమె వ్యభిచార గృహం నుండి వచ్చిందని అనంత్ చెప్పిన విషయం అతను ఏ మాత్రం మరచిపోలేదు.

ఆమె వంక చురుకుగా చూసాడు.

పరిమళ అతని చూపుల్లో భావాన్ని గ్రహించిన దానిలా బయట కారిడార్‌లోకి వెళ్ళి నిలబడింది.

డబ్బున్న వాళ్ళకుండే అతిశయం గురించి ఆమెకు తెలుసు.

తను అతనికి అత్తగారవుతుందనే విషయం తెలిస్తే అతని పరిస్థితి ఎలా వుంటుంది?

తనకి స్థానంలేదు. అలా అనుకోగానే ఆమె వాళ్ళ మాటలు వినిపించనంతదూరం అడుగులేసింది.

"మామగారూ మళ్ళీ ఏమయ్యింది మీకు?" జగదీష్ చాలా ఆదుర్దాగా ఎదురుగా వున్న స్టూలు మీద కూర్చుంటూ అడిగాడు.

జగన్నాధరావుగారు చిన్నగా నవ్వి "మామూలే ఇంతకీ నీ జర్నీ ఎలా జరిగింది. ఒక గొప్ప వ్యాపారవేత్తగా నీకు జరిగిన సత్కారానికి ఎంతగానో సంతోషపడుతున్నాను" అన్నారు గర్వంగా.

"ఏదో చిన్నవాణ్ణి ఇలాంటివన్నీ మీకు తెలియనివి కావు. ముందు మీకే తెలియబరచి మీ ఆశీర్వాదం తీసుకుని వెళ్ళాలనుకున్నాను కానీ చాలా హడావుడిగా వెళ్ళాల్సొచ్చింది" అన్నాడు జగదీష్ నొచ్చుకున్నట్లుగా.

"ఫర్వాలేదు అమ్మాయి ఎప్పటికప్పుడు అన్ని విషయాలూ నాకు తెలియబరుస్తున్నదిగా"

జగదీష్ ఆశ్చర్యంగా చూసి "వాసవి చెప్పిందా?" అన్నాడు.

"అవును బాబూ వాసవి ప్రతిరోజూ ఫోన్లో కనీసం గంటయినా మాట్లాడేది. నువ్వు లేక చాలా బోర్ ఫీలయ్యిందటకూడానూ."

జగదీష్‌కి అంతా వింతగా వుంది.

"వాసవికిప్పుడు ఒంట్లో ఎలావుంది" అడిగాడు గబగబా.

"కొంచెం ఫర్వాలేదు" అంటూ దాటేసారు జగన్నాధరావుగారు. ఎన్ని అబద్ధాలాడుతున్నా అతని గుండెదడ నిముషనిముషానికి హెచ్చుతోంది.

జగదీష్ ఇంటికి వెళ్ళుంటాడు. వాసవి అనంత్‌తోపాటు విహారానికెళ్ళిందనే నిజాన్ని గ్రహిస్తాడు. ఎంత మంచి వాడయినా జగదీష్ మగవాడు. తను లేనప్పుడు భార్య పరాయి మగవాడితో షికారు చేస్తోందన్న నిజాన్ని సహించలేడు. పర్యవసానం వాసవి కాపురం విచ్చిన్నం.

ఇంకా నయం ఆ సెక్రటరీ వాసవి ప్రేమించిన ప్రియుడేనని తెలిస్తే ఇంకేమైనా వుందా? ఇంతకీ ఆ రోగ్ ఈ కోటలో ఎలా పాగా వేసాడో? ఇందులో వాసవికి కూడా వంతున్నదా? వాసవి ఎందుకిలా ఈ విషయాన్ని తన దగ్గర దాచింది? ఇప్పుడేం చెప్పాలి జగదీష్‌కి.

"ఏంటి ఆలోచిస్తున్నారు?"

జగదీష్ ప్రశ్నకి తడబడ్డారు జగన్నాధరావుగారు.

"ఏం లేదు బాబూ వాసవి గురించే"

"వాసవి గురించా? ఏవిటది?"

"అమ్మాయికి హెల్త్ బాగుండటం లేదుగా కాస్త వెల్లూరులో చూపించమన్నాను. వాళ్ళిద్దరూ బహుశా ఈవేళ రావొచ్చు" జగన్నాధరావుగారు అలా సర్ది చెబుతుంటే జగదీష్ చిన్నగా నవ్వాడు.

జగన్నాధరావుగారికి ఆ నవ్వు చూసి తలకొట్టేసినట్లయింది. తను అల్లుడుముందు దొరికిపోయానేమోనని సిగ్గుపడ్డారు.

"వాసవి హెల్తు గురించి నేనూ చాలా ఆందోళన పడ్డాను మామగారూ. అసలందుకే ఈ ప్రోగ్రాం కేన్సిల్ చేసుకోవాలనుకున్నాను. కానీ తప్పని సరయింది. అందుకే సెక్రటీకి అప్పచెప్పి వెళ్ళక తప్పలేదు. నేను ఎప్పటికప్పుడు అతన్ని ఫోన్లో కాంటాక్టు చేస్తూనే వున్నాను. ఆమెను ఎటైనా సరదాగా తిప్పమని అవసరమయితే ఎంతయినా ఖర్చు పెట్టమని చెప్పాను.

"వాసవి కాశ్మీర్ వెళ్ళింది బహుశా రెండురోజుల్లో వచ్చేస్తుంది. ఆమె గురించి ఎక్కువగా ఆలోచించి మనసు పాడుచేసుకోవద్దు. ఆమెకు నేనున్నాను" అన్నాడు జగదీష్.

జగన్నాధరావుగారు తెల్లబోయినట్లు చూసారు.

తను అబద్ధమాడి అల్లుడికి దొరికిపోయినందుకుగాను ఎంతో సిగ్గుగా వుంది అతనికి.

అల్లుడిప్పుడేమనుకుంటాడు. కూతురికోసం చాలా క్రిందకి దిగజారాడని అసహ్యించుకోడూ.

"నేను వాసూని రాయవెల్లూరు వెళ్ళమని చెప్పాను. బహుశా అక్కడికే వెళ్ళుంటుందని అనుకున్నాను" అన్నారు హీన స్వరాన.

జగదీష్ నవ్వి "బహుశా వాళ్ళ ప్రోగ్రాంలో అదికూడా ఒక భాగమయి వుండొచ్చు. మీరు బాగా రెస్టు తీసుకోండి నేను వాసు రాగానే మీ దగ్గరికి తీసుకొస్తాను" అన్నాడు.

జగన్నాధరావుగారి హృదయం తేలికయ్యింది.

జగదీష్ గుమ్మందాకా అడుగులేసి "ఆ వంట మనిషి అదే పరిమళ ఆమె చరిత్ర అంత మంచిది కాదు. ఒక అడుగు దూరం వుంచండి" అంటూ వెళ్ళిపోయాడు.

జగన్నాధరావుగారి ముఖం పాలిపోయింది.

జగదీష్ వెళ్ళిపోయేవరకు అక్కడే దూరంగా నిలబడ్డ పరిమళ మెల్లిగా లోనికొచ్చింది.

తెల్లబోయిన భర్త ముఖంలోకి ఆందోళనగా చూసి "ఏం జరిగింది?" అంది.

జగన్నాధరావుగారు వెంటనే జవాబు చెప్పలేనట్లుగా చూసారు.

"చెప్పకూడనిదా?" అంటూ రెట్టించింది పరిమళ.

ఆయన పరిమళవైపు అదోలా చూసి "నేను చాలా పాపాత్ముణ్ణి అనసూయ" అన్నారు ఆవేదనగా.

"ఏం జరిగింది? అతనేమైనా కోపంగా మాట్లాడాడా?" పరిమళ ఆదుర్దాగా అడిగింది.

"లేదు వాసవిని బయట ప్రదేశాలు తిప్పమని అతని సెక్రటరికి అతనే చెప్పాడట."

"మరింకేం అమ్మాయి అతను లేనప్పుడు అలా పరాయి మగవాడితో వెళ్ళినందుకు అతనేమనుకుంటాడో అన్న సమస్య తీరిపోయిందిగా. ఇక ధైర్యంగా వుండండి." అంది పరిమళ సంతోషంగా.

"సమస్య తీరిపోలేదు. ఇప్పుడే మొదలయ్యింది" అన్నారు బాధగా.

"ఆ...అదేమిటి?"

"చెబుతాను. నా గుండె కాస్త లోతు. అందుకే అసలు విషయం నీకు కూడా తెలియకుండా దాచాను. ఇంక ఎవరితోనూ పంచుకోకుండా ఈ బాధని నాలో నేను ఇముడ్చుకోలేను."

"చెప్పండి" పరిమళ ఆప్యాయంగా అతని మీద చెయ్యివేసింది.

"అమ్మాయితో వెళ్ళిన సెక్రటరీ ఎవరోకాదు. అమ్మాయి పెళ్ళికి ముందే అతన్ని ప్రేమించింది. అతన్నే పెళ్ళి చేసుకుంటానని పట్టుబట్టింది. నేను కాదన్నాను. ఎంత అందమున్నా తెలివి వున్నా అతని పేదరికాన్ని నేను హర్షించలేకపోయాను. అమ్మాయి నన్ను కాదని అతన్ని పెళ్ళి చేసుకోడానికి కూడా సిద్ధపడింది. కాని అతను నా అంగీకారం లేకుండా వాసవిని చేసుకోనన్నాడు. అమ్మాయి అహం దెబ్బతిన్నది. వెంటనే ఆ కోపంలో వాసు నేను చూసిన సంబంధం ఒప్పుకుంది. గబగబా పెళ్ళిచేసేసాను. పీడా విరగడయ్యిందని సంతోషించాను. కాని.. వాడు ఇక్కడికి ఎలా చేరాడో అర్ధంకాదు. చెప్పు అనసూయా వాడు అమ్మాయినేమైనా చేస్తే దాని బ్రతుకేం కావాలి. నాకేంటో భయంగా వుంది" అన్నారు గాభరాగా.

పరిమళ స్థంభించి పోయింది ఆ కథ విని.

"మాట్లాడవేం అనసూయా?"

"ఏం మాట్లాడమంటారు? ఒకరకమైన కక్ష పెట్టుకునే అతను ఈ ఇంట్లో మకాం వేసాడని అనుకుంటున్నాను. లేక అతను వాసవిని నిష్కల్మషంగానే ప్రేమించి మీ మాట తీసెయ్యలేక దూరమయ్యాడో. ఏది ఏమైనా అమ్మాయికి వివాహం

జరిగిపోయింది. ఆమె బ్రతుకు మలుపు తిరిగింది. ప్రేమ పేరుతో అతను ఆమె జీవితంలో తొంగి చూడటం మంచిపనికాదు'' అంది పరిమళ.

''ప్రేమ..... బాస్టర్డ్ వాడు మన డబ్బుని ప్రేమించాడు. వాసవిని కాదు'' అన్నాడు జగన్నాధరావుగారు పళ్ళు నూరుతూ.

పరిమళ అతనివైపు చురుగ్గా చూసి ''పేదవాళ్ళు డబ్బునే ప్రేమిస్తారనుకోవడం ధనవంతులకున్న జబ్బు'' అంది కోపంగా.

జగన్నాధరావుగారు మెత్తబడినట్లు చూసి ''నీ గురించి కాదు అనూ. వాడి సంగతి నాకు బాగా తెలుసు. వాసవిని పెళ్ళి చేసుకోనని చెబితే యాభయివేలిస్తానని చెప్పాను. దానికి వాడు ఆశపడి అంతపని చేసాడు. వాడుత్త డబ్బు మనిషని నాకు ఆనాడే తెలిసిపోయింది. అందుకే నా భయమంతా. వాసవి మళ్ళీ వాడి చేతిలోనే చిక్కుకుంది. జగదీష్‌కి ఈ సంగతులేవీ తెలియవు. అతను అనంత్ వాసవికి ముందే తెలుసని, అతన్ని ఆమె పెళ్ళికి ముందు ప్రేమించిందని తెలిస్తే ఎంత రసాభాస అవుతుంది'' అన్నాడు ఆందోళనగా.

పరిమళ మాట్లాడలేదు.

ఆమెకూడా వాసవి బ్రతుకులో ఎలాంటి అవకతవకలు రాకూడదనే కోరుకుంటోంది.

''ఆ జగదీష్‌కి అసలే కేరక్టరు గురించి చాలా పట్టుదలనుకుంటాను. నీ గురించి కూడా చాలా హేళనగా మాట్లాడాడు. రేపు వాసవి గురించి ఏం తెలిసినా... అతను క్షమించలేడు. దయచేసి నువ్వు వాసవి తల్లినని ఏమాత్రం తెలియనివ్వకు'' అన్నారు జగన్నాధరావుగారు బ్రతిమాలుతున్నట్లుగా.

పరిమళ నిరసనగా నవ్వింది.

''మీ బుద్ధి ఆలోచనా విధానం యింకా పూర్తిగా మారలేదు. నేను వాసవి తల్లినని చెప్పుకోవాలని, జగన్నాధరావుగారి భార్యగా మెప్పుపొందాలని ఆశించడంలేదు, కన్నతల్లిగా ఆమె పురోగతి విచ్ఛిన్నం కాకూడదనే కంగారుతోనే నేను మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను. రక్తం పంచుకుని పుట్టిన బిడ్డయినా ఆమెకూ నాకు మధ్య ఎంతో అగాధముంది. నేను అందుకే నా మనసుని చంపుకోటానికే సిద్ధపడుతున్నాను కాని వాసవి చేత అమ్మా అనిపించుకోవాలని ఆరాటపడటంలేదు. కాదంటే ఈ రోజే బయటికి వెళ్ళిపోతాను'' అంది ఆవేశంగా.

జగన్నాధరావుగారు చటుక్కున పరిమళ చెయ్యి పట్టుకున్నారు.

''తొందరపడకు అనూ. వాసవి జీవితం ఏమవుతుందోననే కంగారులో నేను విచక్షణా జ్ఞానం కోల్పోయి మాట్లాడుతున్నాను. నన్ను క్షమించు మనం యిన్నాళ్ళకు కలుసుకున్నాం. ఈ విపత్కర స్థితిలో తోడయి నిలబడ్డ నువ్వు వెళ్ళిపోతాననడం సమంజసం కాదు అన్నారు దిగులుగా.

పరిమళ కరిగిపోయింది.

తరతరాలుగా ఆడదాన్ని నీచంగా, క్రూరంగా, హీనంగా చూసే మగవాణ్ణి క్షమించి ఆదరించగల భారత స్త్రీ జాతి రక్తం ఆమెలోనూ ప్రవహిస్తోంది.

## 34

టాక్సీ యింటిదారి పడుతుంటే వాసవిలో భయం అధికమయ్యింది.

ఆమె శరీరం సన్నగా వణకడం గమనించిన అనంత్ ఆమె భుజంమీద అనునయంగా చెయ్యివేసాడు.

''ప్లీజ్, ఎందుకంత భయం?'' ప్రేమగా.

"అనంత్, నేను జరగబోయే సీన్‌ని ఎదుర్కొనే స్థితిలో లేను. నన్నేదైనా హోటల్లో దించి అన్నీ నువ్వే జగదీష్‌కి చెప్పేసెయ్యి. నేనతన్ని చూడలేను" అంది భయంగా.

అనంత్ నవ్వి "ఇన్నాళ్ళూ నేను చెప్పిన ధైర్యమంతా ఏమయ్యింది? మళ్ళీ మొదటికే వస్తున్నావు. నేను నీ అండగా ఉండగా నిన్ను ఎవరూ ఏమీ చేయలేరు" అన్నాడు ధైర్యం చెబుతున్నట్లుగా.

"నాకు ఆ యింటికి తిరిగి వెళ్ళాల్సిన అవసరం ఏముంది?" అంది వాసవి చిరాగ్గా.

"చాలావుంది. శారీరకంగా నువ్వు నా భార్యవయిపోయినా నా బిడ్డకి తల్లివి కాబోతున్నా, ఇంకా సాంఘికంగా నువ్వు జగదీష్ భార్యవే. కోర్టుద్వారా డైవర్స్ తీసేసుకుంటే ఏ ప్రోబ్లమూ వుండదు అన్నాడు అనంత్.

వాసవి తలదించుకుంది.

ఇంతలో టాక్సీ గేట్లోంచి మెల్లిగా లోనికొచ్చి పోర్టికోలో ఆగింది.

అనంత్ ముందు కారు దిగాడు.

వాసవి జంకుతూ మెల్లిగా కార్లోంచి అడుగు బయటపెట్టింది.

"ఆవిడే అమ్మగారు. అతనే సెక్రటీ" అంటూ చూపించాడు మాలి వేలాయుధానికి.

"ఇద్దరూ బాగున్నారు" అంటూ మెచ్చుకున్నాడు వేలాయుధం.

"హాయ్ వసూ! హౌ యీజ్ యువర్ ట్రిప్?" జగదీష్ గబగబా బయటకొచ్చి వాసవి భుజాలమీద ఆప్యాయంగా చేతులు వేసాడు.

వాసవి ఇబ్బందిగా జగదీష్ భుజమ్మీదుగా అనంత్ వేపు చూసింది.

అనంత్ ఊరుకోమన్నట్లుగా కనుసైగ చేసాడు.

"చూడా భాగోతం ఈ గొప్పొళ్ళ ప్రేమలన్నీ రోడ్డుమీదే" అన్నాడు మాలి కుదుళ్ళు సరిచేస్తూ.

"ష్! వినబడుతుంది" అన్నాడు వేలాయుధం.

"మేడమ్ ఓ.కె. సార్ మీరనుకున్న విధంగా ఆమె పూర్తిగా కోలుకున్నారు" అన్నాడు అనంత్ నవ్వుతూ.

జగదీష్ కళ్ళు మెరిసాయి ఆనందంతో.

"వెరీ హేపీ న్యూస్ అనంత్. అయ్ రియల్లీ గ్రేట్ ఫుల్ టు యూ" అన్నాడు నవ్వుతూ.

వాసవి పరిస్థితి ఇరకాటంగా వుంది.

ఆమె ఆ వాతావరణాన్ని తప్పించుకునేందుకు లోనికి నడిచింది.

"నువ్వు రెస్టు తీసుకో. మిగతా సంగతులు తర్వాత మాట్లాడుకుందాం" అంటూ జగదీష్ వాసవి వెంట లోనికి నడిచాడు.

వాసవి స్నానం చేసే వంకతో బాత్రూంలోకి వెళ్ళి తలుపేసుకుంది.

జగదీష్ ఈ లోపున తను వాసవి కోసం ఫారిన్నుండి తెచ్చిన రకరకాల వస్తువులు బీరువాలోంచి తీసి మంచమ్మీద పెడుతున్నాడు.

పదిహేను నిమిషాలు గడిచాయి.

అతను చిలిపిగా బాత్రూమ్ తలుపు మీద టకటక శబ్దం చేసాడు.

వాసవి బిగుసుకున్నట్లు చూసింది.

"వసూ టవల్ మరచిపోయినట్లున్నావ్" అన్నాడు మెల్లిగా.

వాసవికి ప్రాణం పోతున్నట్లనిపించింది.

భర్త చిలిపితనం ఆమెకు ఆనందం కలిగించడంలేదు. ఒక పరాయి మగవాడు శ్రుతిమించి ప్రవర్తిస్తున్నట్లుగా కోపాన్ని తెప్పిస్తోంది.

ఆమె తనని ఇరకాట పరిస్థితిలో పెట్టినందుకు అనంత్‌ని తిట్టుకుంది.

తలుపు మీద శబ్దం ఆగిపోయింది.

వాసవి బట్టలు కట్టుకుని మెల్లిగా బయటకొచ్చింది.

అక్కడ జగదీష్ లేడు.

ఆమె హాయిగా గాలి పీల్చుకుని అద్దం ముందుకెళ్ళి జడవిప్పుకుంది.

తన విషయం అనంత్ విషయం ఎంత త్వరగా చెప్పేసి బయటపడాలా అని ఆలోచిస్తున్నదామె అంతరంగం.

తనిప్పుడు తల్లికాబోతున్నది.

ఇక జాప్యం చేయకుండా జగదీష్ నుండి దూరం కావాలి.

తప్పో ఒప్పో జరిగిపోయింది. తను తిరిగి అనాలోచితంగానే తను కావాలనుకుని ప్రేమించిన వ్యక్తికే స్వంతం అయింది.

ప్రపంచమంతా కలిసి వెలేసినా తూలనాడినా తను పట్టించుకోదు.

తనికిప్పుడు ఎవర్ని చూసినా భయంలేదు. తన సుఖం తనది.

మహతి చెప్పినట్లు ఈ చిన్ని జీవితంలో తను తనకి కావల్సినవి తనే చూసుకుంటుంది.

అర్థంలేని భయాలతో, అనవసరమైన త్యాగాలతో తన జీవితాన్ని దుఃఖమయం చేసుకోదు.

అలా అనుకోగానే వాసవిలో నూతనోత్సాహం చోటు చేసుకుంది.

మెల్లిగా తనకిష్టమయిన పాట హమ్ చేస్తూ జడ వేసుకోసాగింది.

"దేవిగారు చాలా ఉత్సాహంగా వున్నట్లున్నారు."

ఆ మాటలకి ఉలిక్కిపడి గుమ్మంవేపు చూసింది వాసవి.

జగదీష్ వేలాయుధం చేత టిఫిన్ పట్టించుకుని లోనికొచ్చాడు. గతుక్కుమన్నట్లు చూసింది వాసవి.

"ఇతనెవరు?" అంది.

"ఒక కొత్త నౌకరు. పేరు వేలాయుధం. ఆ శంకర్ గాడి అడ్రస్ తెలియదు" అన్నాడు జగదీష్ మంచంమీద కూర్చుంటూ.

వేలాయుధం "నమస్కారమమ్మా" అన్నాడు వినయంగా.

**వాసవి మాట్లాడలేదు.** మెల్లిగా టిఫిన్ చేస్తూ కూర్చుంది.

"ఏంటలా అయిష్టంగా తింటున్నావ్? బాగాలేదా?" అంటూ అడిగాడు జగదీష్.

ఆమె మాట్లాడలేదు గబుక్కున వాష్ బేసిన్ దగ్గరికి పరుగెత్తింది. ఆమె వాంతి చేసుకుంటే విభ్రాంతిగా చూసాడు జగదీష్.

"ఆడడ. అమ్మకు ఏమాయెను?" అంటూ వేలాయుధం ఆమెకి టవలందించాడు.

"ఫర్వాలేదు. కొద్దిగా కడుపులో తిప్పింది" అంది వాసవి.

వేలాయుధం ట్రే తీసుకుని వెళ్ళిపోయాడు.

"వసూ. నీకు పూర్తిగా తగ్గలేదా?" అన్నాడు జగదీష్ అనునయంగా.

అతనెంత ప్రేమగా పలుకరిస్తే అంత వళ్ళుమండి పోతున్నది వాసవికి.

అనంత్ మెల్లిగా జారుకున్నాడు. ఎంత త్వరగా నిజాలు బయటపెట్టి బయటికి తప్పుకుందామా అని వుంది వాసవికి.

ఇలా నాటకం ఆడడం చాలా నీచంగా హేయంగా అనిపిస్తోందామెకు.

"నన్ను కాస్సేపు పడుకోనివ్వండి" అంది వాసవి.

"ఇట్సాల్ రైట్" అంటూ భుజాలెగరేసి బయటికి నడిచాడు జగదీష్.

అతను వెళ్ళగానే వాసవి మంచంమ్మీద వున్న వస్తువులన్నీ ఒక ప్రక్కకి త్రోసి పక్కమీద ఒరిగింది.

ఆ ఒంటరితనం ఆమెకు ఎంతో హాయి కలిగించింది.

జగదీష్ గబగబా మెట్లు దిగుతుంటుంటే చివరి మెట్టు మీద కాలేసి విలాసంగా నిలబడ్డాడు బలరాం.

జగదీష్ మంత్రం వేసినట్లు నిలబడిపోయి "నువ్వా?" అన్నాడు అప్రయత్నంగా.

"నేనే. ఫారిన్నుంచి ఎప్పుడొచ్చేసేవ్ బ్రదరూ" అన్నాడు నవ్వుతూ సిగరెట్ ముట్టించి.

"నాలుగురోజులయ్యింది" అన్నాడు పొడిగా.

"నాకు సెప్పకుండా ఎల్లిపోయేవేంటి? నేను డబ్బుకెంత యిబ్బంది పడిపోతున్నానో తెలుసా?"

"అయితే" జగదీష్ నొసలు చిట్లించి అడిగాడు.

"అయితే ఏంటి? సొంత బ్రదరు ఆస్తిలో చిల్లిగవ్వ అడక్కుండా కనీసం మేడలో వాటా అడక్కుండా ఊరవతల చెట్టుక్రింద మెయింటెయినయిపోతుంటే కనీసం తాగడానికి కర్సుకి డబ్బివ్వకుండా ఎల్లిపోవడం ఏం బాగుంది బ్రదరూ" అన్నాడు బలరాం నవ్వుతూ.

జగదీష్‌కి మతిపోయింది.

"అతన్ని తన బ్రదరుగా యింట్లో వాళ్ళకి చెప్పినమాట వాస్తవమే. కాని ఈ విషయం వీడికెలా తెలిసింది?"

"ఏంటీ బ్రదర్ ఆలోచన"

"నేను లేనప్పుడొచ్చేవా నువ్వు?"

"వచ్చాను బ్రదర్ మరదలు సెక్రటరీతో షికారెల్లిందని తెలిసి ఎల్లిపోయాను. ఏంటి కథ. ఈసారి కేసు నాకు అప్పచెప్పలేదేం? భయపడిపొయ్యావా?" అంటూ ఎగతాళిగా నవ్వాడు బలరాం.

"బలరాం" కోపంగా అరిచాడు జగదీష్.

"ష్! గట్టిగా అరవకు జనం వున్నారు. యింటే బాగోదు. ఒక యాభయి యిస్తే ఎల్లిపోతాం?"

"యాభయ్యా?"

"అవును. యాభయ్యే. ఫిఫ్టీ పక్కనే పక్కనే మూడు సున్నాలు"

"నీకు మతిపోయింది."

"నాక్కాదు పొయ్యింది. ఈ మధ్య కొత్తకేసు అప్పచెప్పావ్ మరచిపోయావా?"

జగదీష్ అసహనంగా లోపలి కెళ్ళాడు. బలరాం గర్వంగా మరో సిగరెట్టు ముట్టించి విలాసంగా చుట్టూ చూస్తూ నిలబడ్డాడు.

వేలాయుధం సోఫాలు తుడుస్తూ బలరాం వంక తేరిపార చూసి "తమరు?" అన్నాడు వినయంగా.

"మీ అయ్యగారి మొగుణ్ణి" అన్నాడు బలరాం తనమాటకి తనే నవ్వుతు.

"ఆమ! కూర్చోండి" అన్నాడు.

"నీ అయ్యగారికంటే నువ్వే మర్యాదస్తుడివి" అంటూ బలరాం ఠీవీగా వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు.

"కాఫీ.."

"ఎదవ కాఫీ నాకెందుకు? విస్కీ దొరుకుద్దా?"

వేలాయుధం బలరాం వైపు అమాయకంగా చూసాడు.

"సర్లే. నీకు యిస్కీ అంటే తెలిసినట్టులేదు. ఈ రోజేంటి టిఫిను"

"పెసరట్టు – ఉప్మా"

"అయితే పట్టుకురా" అన్నాడు బలరాం దర్జాగా.

వేలాయుధం లోపలికెళ్ళాడు.

అనంత్ ఏదో ఫైలు తీసుకుని లోపలికొచ్చి సోఫాలో కూర్చున్న బలరాం వైపు ఆశ్చర్యంగా చూసాడు.

"ఏంటి బ్రదరూ నన్ను గుర్తుపట్టినట్లు లేదే? బాగా నున్నబడ్డావు కథ మంచి రంజులో వున్నట్టుంది" అన్నాడు నవ్వుతూ.

అనంత్ కోపంగా చూసాడు బలరాం వైపు.

"కోపంగా సూడకు. నాకంతా తెలుసులే. ప్రేమయాత్రలు ముగించుకుని ఎప్పుడొచ్చావేంటి?" అన్నాడు తిరిగి.

"యూ షటప్?"

"ఆ వాగుడే తగ్గించుకో. లేకపోతే ఏం జరుగుద్దో మీ అయ్యగార్నడుగు"

"ఏవిటది?" జగదీష్ విసుగ్గా బయటకొచ్చాడు.

"నీ సెక్రటీకి నోటి దురుసెక్కువ తగ్గించుకోమంటున్నాను. నీ సొంత బ్రదర్ని కదా నేను. నన్నే షటప్ అంటాడా సన్నాసి."

జగదీష్ అనంత్ వైపు కోపంగా చూసి "ప్లీజ్ అనంత్ కంట్రోల్ యువర్ టంగ్. నేను ఫైల్స్ యిప్పుడు చూడను. కాస్సేపాగిరా" అన్నాడు.

అనంత్ ముఖం చిన్నబోయింది.

"ఓ.కె సర్" అంటూ వెళ్ళిపోయాడు.

వేలాయుధం వేడివేడి పెసరట్లు తొందరగా తెచ్చి టేబుల్మీద పెట్టి "సాపాడండి" అన్నాడు.

జగదీష్ వేలాయుధంవేపు అసహనంగా చూసి "ఏమిటది?" అన్నాడు.

"టిఫిన్ సార్ ఉప్మా అయిపూడ్సింది. అందుకే, పెసరట్టు ఒకటే తెచ్చినాను, తప్పయితే క్షమించండి సార్" అన్నాడు.

జగదీష్ కోపాన్ని దిగమింగుకుని "సరే కాఫీ కూడా తీసుకురా" అన్నాడు.

వేలాయుధం సరేనంటూ లోపలికెళ్ళాడు.

"మర్యాదలు బాగా చేయించుకుంటున్నావ్. ప్రస్తుతానికి యిది తీసుకెళ్ళు" అంటూ నోట్ల కట్ట బలరాం ఒళ్ళోకి విసిరాడు.

"బలరాం ఆ కట్టని అటూ యిటూ తిప్పి నేనడిగిందాంట్లో సగం కూడా వున్నట్టు లేదు. నీకు నేను ఎలా కనిపిస్తున్నాను?" అన్నాడు.

"నా దగ్గర ప్రస్తుతం అంతే వుంది. నాకు బిజినెస్‌లో బాగా నష్టమొచ్చింది. నన్నూరికే బాధపెట్టకు" అన్నాడు జగదీష్ విసుగ్గా.

"ఈ మధ్య నన్ను సూస్తే కొంచెం యిసుగ్గానే వుంది నీకు ఆ సెక్రటీని సూసుకుని నన్ను యిదిలించేయ్‌కూ. నేజేసే పనులు ఆడు సెయ్యలేడు. అది గుర్తుంచుకో. నీకు బిజినెస్‌లో నష్టమొచ్చే ఎల్లేవా ఫారిన్" అన్నాడు బలరాం ఎగతాళిగా.

జగదీష్ మాట్లాడలేదు.

"మరో పదిరోజుల్లో మిగతాది ఎడ్జస్టు సేసెయ్యి" అంటూ పైకి లేచాడు బలరాం.

వేలాయుధం "కాఫీ సార్" అంటూ వచ్చాడు.

"నాకు కాఫీ తాగే ఎదవలవాటు లేదు. మీ అయ్యగారికివ్వు. నీరసించి పోయాడు" అంటూ వెళ్ళిపోయాడు బలరాం.

జగదీష్ వేలాయుధం వేపు సీరియస్‌గా చూసి కప్పుని నేలకేసి కొట్టాడు.

అనుకోని ఆ చర్యకి వేలాయుధం అదిరిపడ్డాడు.

"ఆ వెంటనే ఆడడ! ఎన్నా పన్ రే సార్?" అంటూ ముక్కలు ఎత్తసాగాడు.

జగదీష్ అదే కోపంతో విసురుగా లోనికెళ్ళిపోతుంటే వేలాయుధం మెల్లిగా తలతిప్పి జగదీష్ వెళ్తున్నవేపు చూసాడు.

బలరాం బాగా తాగి రోడ్డుమీద నడుస్తున్నాడు. వాడి శరీరం స్వాధీనం తప్పి భూమికి జానెడు ఎత్తులో తేలుతున్నది.

శంకర్ దూరంగా నిలబడి వస్తోన్న బలరాం వైపే చూస్తున్నాడు. వాడికి అర్థమయింది బలరాం జగదీష్ నుండి డబ్బు గుంజాడని.

బలరాం హేళనగా "ఆడు ఎవరికోసం యిస్తాడ్రా డబ్బు. ఇవ్వనంటానికి దమ్ములా" అంటున్నాడు.

సరిగ్గా అప్పుడే ఒక ఫియట్ కారు దూరం నుండి అమితమైన వేగంతో వస్తోంది.

బలరాం రోడ్డుకి అడ్డదిడ్డంగా నడుస్తున్నాడు.

"ఎందుకు పక్కకి తప్పుకోవాలిరా? ఈ రోడ్డు ఎవరి బాబుదీ? నా యిట్టమొచ్చినట్లు రోడ్డుమీద, నడి సెంటర్‌లోనే నడుస్తా" అంటూ బలరాం యింకా యిష్టం వచ్చినట్లు రోడ్డుమీద నడవసాగాడు.

శంకర్ మతిపోయినట్లు చూసాడు.

కారు కనురెప్ప పాటులో బలరాంని ఢీకొని ముందుకి పరిగెత్తింది.

శంకర్ త్రుళ్ళిపడి చూసాడు.

కారు నడుపుతోన్న వ్యక్తిని చూడగానే వాడి కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.

బలరాం శరీరం ఎగిరిపడింది.

అతని తలనుండి రక్తం ఎర్రగా చిక్కగా స్రవిస్తోంది. శంకర్‌కి క్షణం ఏం చేయాలో తోచలేదు.

ఈ బలరాం చచ్చిపోతే అనేక నిజాలు నిక్షిప్తమైపోతాయి.

"అలా అనుకోగానే వాడు శక్తికొద్దీ గట్టిగా ఏక్సిడెంటు... ఏక్సిడెంటు" అంటూ అరిచాడు.

మరో పదినిముషాల్లో జనం మెల్లిమెల్లిగా బయటకొచ్చారు.

బలరాం శరీరం హాస్పిటల్‌కి తరలించబడింది.

శంకర్‌తోపాటు అతనికి సహాయంగా నిలబడ్డ మరో వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు శంకర్.

"ఫర్వాలేదు. ఇందులో ఏముంది? ఇంతకీ నువ్వు.. ఇతనికి ఏమవుతావు" అడిగాడతను.

"ఏమీ కాను సార్. ఊరికే స్నేహం" అన్నాడు శంకర్.

"ఇంత పెద్దవాడితోనా?"

శంకర్ సేపు మాట్లాడలేదు.

"సార్. ఇతనికి ప్రమాదం లేదు కదా. ఇతను చచ్చిపోకూడదు సార్."

"పర్వాలేదట. బ్రతుకుతాడు" అంటూ భరోసా యిచ్చాడతను. "నువ్వు చాలా మంచి పిల్లాడిలా వున్నావు. ఇతనిలాంటి తాగుబోతుకోసం బాధపడుతున్నావ్? అయినా అంత తప్ప తాగి రోడ్డు మీద నడిస్తే యాక్సిడెంట్ కాదా?"

"అతను తాగిన మాట నిజమే. కాని ఏక్సిడెంటు కాదు సార్, కావాలనే.." అంటూ ఆగిపోయాడు, శంకర్.

ఆ వ్యక్తి శంకర్ వేపు ఆశ్చర్యంగా చూసాడు.

"కావాలనా? అయితే పోలీసులకి చెబుదాం రా" అన్నాడతను.

"వద్దు సార్. వాళ్ళేమీ సాయం చెయ్యరు సార్. వాళ్ళంతా డబ్బున్న వాళ్ళ కోసమే సార్" అన్నాడు శంకర్ నిస్పృహగా.

"నువ్వలా బాధపడొద్దు. తెలిసిన నిజం దాచడం అన్నిటికన్నా పెద్ద నేరం. నువ్వురా, నేను నీకు సహాయంగా వుంటాను" అన్నాడతను. శంకర్‌కి ధైర్యం చెబుతున్నట్లుగా.

"మీకు తెలియదు సార్, నేనొకసారి ప్రముఖ డిటెక్టివ్‌గారింటికెళ్ళి సహాయం చేయమని కోరాను. ఆయన డబ్బు యివ్వందే చేయనని నిరాకరించారు. అయినా ఆశచావక ఈ దుర్మార్గుడి వెంట వుంటూ అన్ని విషయాలూ తెలుసుకోవాలని ప్రయత్నించాను. కానీ నేను ఏం చేయగలను?" అన్నాడు శంకర్ నిస్పృహగా.

"నువ్వు ధవళాచలంగారిని కలిసావా?"

"ఆఁ ఆయన గురించే నేను చెప్పేది" అన్నాడు శంకర్ నిరసనగా.

ఆ వ్యక్తి నవ్వి "నువ్వు నా వెంటరా" అన్నాడు.

"ఎందుకు?" శంకర్ అయోమయంగా చూసాడు.

"ఒక తమాషా చూపిస్తాను"

శంకర్ అతని వెంట నడిచాడు.

35

"అమ్మా"

వాసవి కళ్ళు తెరచి చూసింది.

ఎదురుగా పరిమళ.

"ఎప్పుడొచ్చావు నువ్వు? మీ అమ్మాయి బాగుందా? అసలేమైంది ఆమెకు?" గబగబా అడిగింది వాసవి.

వాసవికి కాస్త వళ్ళు చేసినట్లు ఆరోగ్యంగా కనిపించింది పరిమళకి. ఆమె మనసు పరిపరివిధాల పోయింది.

పరిమళ నిస్పృహగా నవ్వి "దాని గురించి ఏం చెప్పాలో కూడా నాకే తెలియడం లేదు. అసలు తను కష్టాల పాలవుతున్నాననే ఇంగితమే దానికి లేకుండాపోయింది. కన్నతల్లినే గుర్తించలేని స్థితిలో వుంది" అంది.

వాసవి నవ్వింది.

"అలా అర్థం చేసుకోలేనప్పుడు రెండు లాగికొట్టడమే కన్నతల్లిగా నీకా హక్కువుంది" అంది.

పరిమళ వాసవి వైపు తేరిపార చూసింది.

"చెప్పినంత తేలికకాదు తల్లీ? నాకు దానికి ఎన్నో అంతరాలు తేడావుంది. నేను తల్లినని తెలిస్తే ఎలాగుండేదో కానీ ఇప్పుడలా చెప్పినా అది పరిహాసంగానే తీసుకుంటుంది. ఇక కొడితే వూరుకుంటుందా?" అంది.

"ఏ తల్లీ బిడ్డకి అనర్థం జరగాలని కోరుకోదు జన్మనిచ్చిన నీకు దండించే అధికారం కూడా వుంది. ఆ అధికారంతోనే మందలించాల్సింది. ఇంతకు అసలు ఏం జరిగింది?" అంది వాసవి.

"నా గోడు ఎప్పుడూ వుండేది. అవన్నీ తీరుబడిగా చెబుతాను. నాన్నగారొచ్చారు. ఆ సంగతి తెలుసా?" అంటూ అడిగింది పరిమళ.

వాసవి ఆశ్చర్యంగా చూసింది.

"ఏ నాన్నగారు?" అంది ఆశ్చర్యంగా.

"ఏ నాన్నగారేమిటమ్మా మీ నాన్నగారే. పెద్దయ్యగారు"

వాసవి ఆశ్చర్యంగా లేచి నిలబడి "ఎప్పుడు?" అంది.

"పదిహేను రోజులయింది. మళ్ళీ గుండెనొప్పివస్తే హాస్పిటల్లో జాయినయ్యారు"

వాసవి కనురెప్పలు బాధతో రెపరెపలాడాయి.

"ఈ విషయం నాకు జగదీష్ చెప్పనేలేదు" అంది నిష్ఠూరంగా.

"అందులో అతని తప్పులేదు. మీరు వచ్చీరాగనే చెబితే బాధపడతారని చెప్పివుండదు. ఆయన రోజూవచ్చి చూస్తూనే వున్నారు."

"అయితే మనం వెంటనే డాడీదగ్గరకి వెళ్దాం. నీకు తెలుసా ఏ హాస్పిటలో" అడిగింది వాసవి.

"ఇదివరకు జాయినయ్యిందేనట. రామస్వామి అయ్యంగార్ ఆస్పత్రి"

వాసవి గబగబా అద్దంలో జుట్టు సరిచేసుకుని పర్స్ అందుకుంది.

"అయ్యంగారికి చెప్పండమ్మా" అంది పరిమళ.

"ఫర్వాలేదు పద" వాసవి గబగబా మెట్లు దిగి గారేజ్ వేపు వెళ్ళబోతోంటే అనంత్ ఎదురొచ్చి "ఎక్కడికి?" అన్నాడు పరిమళని క్రీగంట గమనిస్తూ.

"డాడీకి మళ్ళీ హార్ట్ ఎటాక్ వచ్చిందట. మనం లేనప్పుడు వచ్చారట" అంది కంగారుగా.

వాసవి అతనికి చాలా చేరువగా నిలబడి క్లోజుగా మాట్లాడటం పరిమళ గమనిస్తోంది.

"ఎప్పుడు?" అనంత్ కావాలనే వాసవి చేతులు పట్టుకుని అడిగాడు ఆత్రుతగా.

పరిమళ కళ్ళు పెద్దవయ్యాయి.

వాసవి ఇదంతా గమనించడం లేదు.

"డాడీకి నువ్వు కనబడితే ప్రమాదం నాకంతా గందరగోళంగా వుంది. నేనందుకే ఇక్కడికి రానంటే వినలేదు నువ్వు. జగదీష్ తనంతట తాను అన్ని గ్రహించకముందే మనం చెప్పేయడం గౌరవంగా వుంటుంది" అంది గబగబా.

"నువ్వారికే తొందరపడకు. ఎప్పుడేది చెయ్యాలో నాకు బాగా తెలుసు, నీకెలాంటి ప్రమాదమూ లేదు. అన్నిటికీ నేనున్నానన్న సంగతి గుర్తుంచుకో" అన్నాడు ధైర్యం చెబుతున్నట్టు అనునయంగా అన్నాడు.

"కాని.. నీకెలా చెప్పను? ఆ జగదీష్ దగ్గరకొస్తుంటే ఆడదానివయిపుడితే తెలిసేది నీకు" అంది వాసవి ఉక్రోషంగా.

అనంత్ చిన్నగా నవ్వాడు. "అర్థమయ్యింది. రెండురోజుల్లో అంతా తేల్చేస్తాను కొంచెం ఓపికపట్టు"

"సరే నేను వెళ్ళి డాడీని చూసొస్తాను"

"జాగ్రత్తగా వెళ్ళగలవా?"

వాసవి వెనక్కు తిరిగేసరికి పరిమళ అదేమీ గమనించని దానిలా తలతిప్పి నిలబడింది.

వాసవి కారు బాక్ చేసుకుని వచ్చి పరిమళ ముందాపింది. పరిమళ కారెక్కి కూర్చుంది.

ఆమె చూపులు మాత్రం వాసవిని కన్నార్పకుండా నిశితంగా పరిశీలిస్తున్నాయి.

కారు అతిలాఘవంగా అతి నేర్పుగా డ్రైవ్ చేస్తున్న వాసవి తన జీవితాన్ని ఎందుకు సరిగ్గా గమ్యంవేపు నడిపించలేక పోతోందో అర్థం కావడంలేదు పరిమళకు.

కారు హాస్పిటల్ ముందాగింది.

వాసవి గబగబా కారుదిగి "రూం నెంబర్?" అంటూ అడిగింది.

"స్పెషల్ వార్డు రూమ్ నెంబర్ ఇరవై ఆరు" అంది పరిమళ.

వాసవి రూంలోకి ప్రవేశించేసరికి జగన్నాధరావుగారు తలగడకి జేరబడి కూర్చున్నారు.

"డాడీ" అంది వాసవి.

జగన్నాధరావుగారు కూతురివేపు చకితులయినట్లు చూసి "ఎప్పుడొచ్చేవమ్మా" అన్నారు ప్రేమగా.

ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా "ఎలా వుంది డాడీ మీకు?" అంది ఆందోళనగా.

"నాకేం బాగానే వున్నాను. మాటిమాటికీ ఈ వంకన కావాల్సినంత రెస్టు దొరుకుతోంది" అన్నారు.

వాసవి తండ్రి ప్రక్కనే కూర్చుంది. ఆయన చెయ్యి ఆమె తలని ఆప్యాయంగా నిమురుతోంది.

పరిమళ దూరంగా నిలబడి వారిద్దరి మధ్య జాలువారుతున్న ఆప్యాయతానురాగాల్ని గమనిస్తోంది.

ఆమె హృదయం క్షణం మెలితిప్పినట్లయింది.

కన్నబిడ్డను కళ్ళెదుట చూస్తూకూడా ఆప్యాయంగా "అమ్మా" అంటూ దగ్గరికి తీసుకోలేని నికృష్టమైన జన్మ తనది.

ఇంత దురదృష్టానికి తనేం పాపం చేసిందో.

జగన్నాథరావుగారు పరిమళవైపు చూసి ఆమె మనోభావాలు గ్రహించిన వాడిలా తన చేతిని వాసవి తలమీదనుంచి చటుక్కున లాక్కున్నారు.

"నీకిప్పుడెలా వుందమ్మా?"

"బాగానే వుంది డాడీ."

"జగదీష్ నిన్ను ప్రేమగానే చూసుకుంటున్నాడు కదూ."

వాసవి వెంటనే జవాబు చెప్పలేకపోయింది. చాలా నీరసంగా "ఊఁ" అంది.

జగన్నాథరావుగారు అదోలా పరిమళవైపు చూసారు.

**"పరిమళా!** నువ్వు డాడీ దగ్గర వుంటావుగా నేను రేపొస్తాను డాడీ" అంది.

పరిమళ తల వూపింది.

ఆమె వెళ్ళిపోగానే "వాసవిలో ఏదో మార్పు కనిపిస్తోంది. ఇదివరకయితే ఇంత త్వరగా నన్ను వదిలేసేది కాదు" అన్నారు జగన్నాథరావుగారు బాధగా.

"మీరు అనంత్ గురించి అడుగుతారనుకున్నాను" అంది పరిమళ.

"ఆ విషయం ఎత్తడానికి ధైర్యం చాల్లేదు. కాని అమ్మాయి..."

"చెయ్యి జారిపోయినట్లే అనిపిస్తోంది" అంది పరిమళ బాధగా.

జగన్నాథరావుగారు రెక్కలు తెగిన పక్షిలా పరిమళవైపు చూసారు.

చల్లని జల్లు భూమిని తడుపుతోంది.

కాలిన నేల తడిసి అదోలాంటి సుగంధాన్ని పంచుతోంది. ఎండలకి వాడిన తరువులు పులకించి ఊగుతున్నాయి.

వాసవి శరీరం గగుర్పొడిచింది.

ఆమెకు వెంటనే అనంత్ గుర్తొచ్చాడు.

వెంటనే వెళ్ళి ఆమెకు అతని కౌగిట్లో యిమిడిపోవాలనిపిస్తోంది. కాని ఆ సంగతి తేల్చకుండా అతను జాప్యం చేస్తున్నాడు. అతనికేం అనిపించడంలేదా తనలా?

ఈ జగదీష్‌ని తప్పించుకుని ఎన్నాళ్ళు తిరగాలి తను.

అతను తన దగ్గర అతి చనువు తీసుకోవడం తనకి గిట్టడంలేదు.

అతనిప్పుడు తన భర్త అని ఎవరయినా గుర్తుచేస్తే వాళ్ళని పీక పిసికి చంపేయాలనిపిస్తోంది తనకి.

అనంత్‌కి దూరంగా ఒక్క క్షణం కూడా బ్రతకలేననిపిస్తోంది.

ఈ పరిమళ ఒకర్తి. ప్రతిక్షణం తనని నఖశిఖపర్యంతం పరీక్షిస్తూ కూర్చుంటుంది. ఆ చూపులు అదోలా వుంటాయి.

తనని మందలిస్తున్నట్లు శాశిస్తున్నట్లు. అసలామెకేమి అధికారం తనని గిరిగీసి నిలబెట్టడానికి.

ఆమెనెందుకు లక్ష్యపెట్టాలి తను. ఒక వంటమనిషి గురించి ఇంత ఆలోచనా!

వాసవి చిలిపిగా నవ్వుకుంది.

అనంత్ కనిపిస్తే బాగుండును.

ఆమె అనుకున్నట్లే అనంత్ అవుట్ హౌవుస్‌లోంచి బయటకొచ్చి తమ మేడవేపు వస్తున్నాడు.

అతన్ని చూడగానే వాసవి గుండె ఝల్లుమంది.

పల్చని గ్లాస్కో లాల్చీలోంచి కట్స్ కనిపిస్తున్నాయి. అతను పరధ్యానంగా అడుగులు వేస్తుంటే ఒక చిలిపి ఊహ వచ్చేసింది వాసవికి.

ఆమె చటుక్కున తన పక్కన వున్న కుండీలోంచి ఒక గులకరాయి తీసి గురిపెట్టి విసిరింది అతనివైపు.

తన భుజానికి తగిలిన రాయిని చూసి ఉలిక్కిపడి పైకి చూసాడు అనంత్.

ఆమె కళ్ళు కొంటెగా మెరిసాయి.

పైకి రమ్మన్నట్లు సంజ్ఞ చేసింది.

అతనికి వాసవిని చూస్తే పాత వాసవి గుర్తొచ్చింది.

తిరిగి ఇన్నాళ్ళకు.. ఉత్సాహంగా చిలిపిగా అతను చిన్నగా నవ్వి క్రింద జగదీష్ ఉన్నాడు అన్నట్లు సైగ చేసాడు.

వాసవి నిర్లక్ష్యంగా తల ఆడించింది.

అనంత్ "తప్పు" అన్నట్లు సైగ చేసి చాలా సీరియస్‌గా ముఖం పెట్టి వెళ్ళిపోయాడు.

"వసూ"

వాసవి ఉలిక్కిపడి వెనుతిరిగి చూసింది.

ఎదురుగా జగదీష్.

ఆమె అతన్ని చూసి సన్నగా వణికి "మీరా?" అంది.

"నేనే ఒంటరిగా ఏం చేస్తున్నావు?" అతడు నిదానంగా అడిగాడు అయి వాసవి తడబడింది.

"ఊరికే వర్షం చల్లగా గాలికి."

"ఏంటా జవాబు చెప్పడం చిన్న పిల్లలా"

వాసవి మాట్లాడలేదు.

"రా లోపలికెళ్దాం" వాసవి అయిష్టంగా అతన్ననుసరించింది.

"నీ కోసం ఫారిన్నుండి ఎన్నో ఆర్టికల్సు తెస్తే అవన్నీ మూలకి త్రోసేసావేమిటి?" అడిగాడతను ప్రేమగా.

వాసవి దానికీ జవాబు చెప్పలేదు.

"ఇన్నాళ్ళూ నాకు దూరంగా వున్నా నీలో మార్పు రాలేదు" అన్నాడతను కాస్త నిష్ఠూరంగా.

"నాకు...నాకు బాగోలేదు" అంది వాసవి ఎలాగో.

"ఏం?" అడిగాడు జగదీష్ ఆత్మీయంగా.

వాసవి తలదించుకుంది.

"ఏంటది? కొత్త పెళ్ళికూతురిలా ఇలారా" అంటూ పిలిచాడు జగదీష్.

వాసవి తను నిలబడ్డ చోటనుండి కదల్లేదు.

అతను చనువుగా ఆమె చెయ్యిపట్టిలాగాడు.

వాసవి నిలువునా వణికింది. ఒక పరాయి పురుషుడు తనని తాకినట్లు విలవిలలాడింది.

''ఇంకా భయమే సిల్లీ'' అతను నవ్వుతూ ఆమెను ఇంకా దగ్గరకి లాక్కున్నాడు.

వాసవి అయిష్టంగా అతన్ని త్రోసెయ్యసాగింది.

''నీకు తెలుసుగా నాకిలాంటి వాతావరణం చాలా యిష్టమని బయట వర్షం చలి ప్లీజ్ కాదనకు'' అతడామెను చాలా గట్టిగా కౌగిట్లో బంధించాడు.

అతని పెదవులు. ఆమె ముఖాన్ని స్పర్శిస్తుంటే వాసవి ఉక్కిరి బిక్కిరయిపోయింది.

''నన్ను వదిలేయండి ప్లీజ్ నాకిష్టంలేదు'' వాసవి ఏడుస్తున్నట్లు అరిచింది.

అయినా జగదీష్ ఆమెని వదలలేదు.

''నీకెప్పుడింక యిష్టం కలిగేది నీవు అసలు ఆడదానివి కాదేమో'' జగదీష్ ఆమెని వదలకుండానే ఆమెతో అన్నాడు.

వాసవికి ఆయాసం వచ్చేసింది.

ఆ కంగారులో ఆమె అతన్ని కసికొద్దీ కొరికేసింది.

'అబ్బా' అంటూ జగదీష్ ఆమెని వదిలేసి ఆశ్చర్యంగా చూసాడు. వాసవి తప్పుచేసినట్లు తలదించుకుంది.

జగదీష్ కొరికినచోట చూసుకుని 'పర్వాలేదు ఈ కాస్తకి నిన్ను వదిలేస్తాననుకున్నావేమో ఈ రోజు దేవుడడ్డం వచ్చినా' అంటూ నవ్వాడు.

వాసవి చిగురాకులా కంపించింది.

అతను ముందు కడుగేస్తుంటే ''ఆగండి'' అంటూ ఘర్జించింది.

''ఏం'' జగదీష్ ముందుకొస్తూనే అడిగాడు.

''నేను.. నేను నాకెలా చెప్పాలో తెలియడంలేదు. నేను గర్భవతిని'' అనేసింది వాసవి కంగారుగా.

జగదీష్ అప్రతిభుడయి చూసాడామె వైపు.

వాసవి తల నేలకి వంగింది.

''ఇది తప్పని మిమ్మల్ని క్షమించమని కాని అడగను. ఇందువల్ల మీకు బాధ కలిగితే మాత్రం క్షమించండి. అనంత్ అతను నాకు ముందే తెలుసు అతన్ని ఏమనకండి మేమిద్దరం వెళ్ళిపోతాం దయచేసి నన్ను వదిలేయండి'' అంది వాసవి ఏడుస్తూ.

జగదీష్ ఆమెవైపు అదోలా చూసి 'సారీ' అంటూ బయటకి నడిచాడు.

వాసవి అలాగే నిలబడిపోయింది.

మరో క్షణంలో ఆమె చెంప చెళ్ళుమంది.

వాసవి ఉలిక్కిపడి చూసింది. అటువైపు.

ఎదురుగా పరిమళ

ఉగ్రకాళిలా నిలబడింది ఊగిపోతూ.

వాసవి కళ్ళు విశాలమయ్యేయి కోపంతో ఆశ్చర్యంతో.

''ఎంత పని చేసావ్? సిగ్గులేకుండా బాహాటంగా భర్తకి చెప్పుకున్నావా నీ ఘనకార్యం? నీదీ ఆడ జన్మేనా? ఇంతకన్నా ఎందులోనన్నా దూకి చావలేక పోయావా?'' పరిమళ మాటలకి చిన్నబోయింది వాసవి అంతరంగం.

మరో క్షణంలో ఆమెకు పరిమళ స్థితి గుర్తొచ్చింది.

కోపంతో కళ్ళు ఎర్రబడ్డాయి.

ఉద్రేకంతో ఊగిపోయింది.

"యూ, డర్టీ బిచ్ నా మీద చెయ్యి చేసుకునే స్థితికి ఎదిగిపోయేవా? ఒక వంట పుట్టివి కడుపుకోసం వళ్ళు అమ్ముకునే హీనురాలివి నీ అంతరం మరచిపోయి నీకనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకుంటావా? చూడు ఈ రోజు నిన్నేం చేస్తానో" వాసవి ఉప్పెన వచ్చిన సముద్రంలా ఉద్రేకంగా పరిమళ మీదకి ఉరికి ఆమె జుట్టు పట్టుకుని రెండు చెంపలూ వాయించేసింది.

"ఏమిటిది?" జగదీష్ గబగబా వచ్చి వాళ్ళిద్దర్నీ విడదీసాడు.

"చూడండి. ఇది నాకు నీతులు చెబుతోంది. ఇది నన్ను కొడుతుందా? పుట్టాక నా తల్లిదండ్రులే నన్ను ఏనాడూ కొట్టలేదు" అంది వాసవి రోషంగా.

జగదీష్ పరిమళవేపు తిరిగి "నీకెంత జీతం రావాల్సివుందో చెప్పు" అన్నాడు.

"బాబుగారూ" అంది పరిమళ ఆవేదనగా.

"నువ్వు చేసిన తప్పులు ఒకటి కాదు - రెండు" అన్నాడు జగదీష్.

"నేను తప్పులు చేసానా బాబు" అంది బాధగా.

"అవును మా వ్యక్తి గత విషయాలు చాటుగా వుండి వినడం ఒకటి. విని అందులో నీ అంతర్యం మరచి జోక్యం చేసుకోవటం మరొకటి. ఇదే మగవాడివయివుంటే నిన్ను అరెస్టు చేయించి వుండేవాణ్ణి ఏదో ముసల్దానివి కాబట్టి వదిలేస్తున్నాను వెళ్ళు" అంటూ అతను జేబులోంచి రెండు వందనోట్లు తీసి విసిరాడు.

పరిమళ అతనికి చేతులు జోడించింది.

"నీ మంచితనం మరోసారి అర్థమయ్యింది బాబూ. భార్య ఘోరమైన తప్పుచేసినా క్షమించగల నీ ఔదార్యానికి నేనెంతగానో సంతోషపడుతున్నాను. వాసవి అమాయకురాలు. ఈ తప్పంతా ఆ నీచుడిది. వాడు నువ్వులేని సమయం చూసి మానసిక స్థితిబాగోలేని వాసవిని వశం చేసుకున్నాడు. నీలాంటి గొప్పవాడికి వాసవిని క్షమించగల విశాలత్వం కూడా వుంటుంది. ఆమెకు నీవే దిక్కు. ఆమె బ్రతుకుని నాశనం కాకుండా చూడు. అదే చాలు నాకు." పరిమళ ఏడుస్తూ వెళ్ళిపోతుంటే జగదీష్‌తోపాటు వాసవికూడా ఆశ్చర్యపోయి చూసారు.

"ఆమె ఎవరో నీకు తెలుసా?" అడిగాడు జగదీష్ వాసవిని.

"మన వంటమనిషి" అంది వాసవి అమాయకంగా.

"ఆ సంగతికాదు. ఆమె నీకు కావల్సిన మనిషనిపిస్తోంది."

"ఛీ! అది నాకు కావాల్సిందేమిటి? నేను కాస్త చనువిచ్చిన మూలంగా పేట్రేగి వాగుతోంది" అంది వాసవి కోపంగా.

"సరే ఈ సంగతి మరచిపోయి లోపలికెళ్ళి రెస్టు తీసుకో" అంటూ వెళ్ళిపోయాడు జగదీష్.

వాసవికి చాలా నీరసం వచ్చేసింది.

వెళ్ళి అలసటగా మంచమ్మీద వాలిపోయింది.

36

జగదీష్ బయటకి వెళ్ళడం గమనించి గబగబా మేడ దిగింది వాసవి. ఆమె అడుగులు చకచకా అనంత్ వున్న అవుట్ హౌస్ వైపు పడ్డాయి.

ఏదో రాసుకుంటున్న అనంత్ ఆమెను చూసి "ఏంటిలా వచ్చావు?" అన్నాడు నవ్వుతూ.

అతని నవ్వంటే వాసవికి చాలా యిష్టం.

కానీ ఈ సమయంలో కూడా సందర్భం లేకుండా అతను నవ్వే నవ్వుని చూసి అరికాలు మంటనెత్తికెక్కింది.

"నీకు నవ్వెలా వస్తుంది?" అంది వాసవి కోపంగా.

"ఏం?" అన్నాడు అనంత్ తిరిగి అదే నవ్వుతూ.

"ఒక పక్క కొంపలు తగలడుతుంటే కూల్‌గా నవ్వేవాళ్ళని ఏమంటారు? జగదీష్‌కి అంతా తెలిసిపోయింది. నేనే తప్పని పరిస్థితుల్లో చెప్పేసాను. ఇంక నువ్విలా కూర్చుంటే ఎలా? నేనింక ఎంతోకాలం అతని భార్యగా ఈ యింట్లో కొనసాగలేను. అది నీకే అవమానం" అంది వాసవి.

"నాకా?"

"కాదా? తాళికట్టకపోయినా నేను మనసా వాచా నీ దాన్నయినప్పుడు నీ భార్య మరొకరి సొత్తుగా చలామణి కావడం..."

"అదా?" అంటూ మళ్ళీ నవ్వాడు అనంత్.

వాసవి అతని వేపు చురుగ్గా చూసింది.

"కోపగించకు. అనంత్ తెలివితేటలమీద నీకు నమ్మకం సన్నగిల్లినట్లుంది. నేను ఆలోచించడంలేదని ఎలా అనుకుంటున్నావు? సందర్భం కోసం చూస్తూనే వున్నాను. అతనికి తెలిసిపోయినా నాతో యింకా అనలేదంటే అతనేదో ఆలోచిస్తున్నాడన్నమాట. అందుకే మనం తొందరపడకూడదు. మనం అంటించాం. ప్రేలి బద్దలవడం అతనివంతు. అలా జరగలేదంటే లోపం ఎక్కడో వుంది. నువ్వు మామూలుగా వుండటానికి ప్రయత్నించు. నేనీ రాత్రికే అన్ని విషయాలు తేల్చేస్తాను. ఓ.కే" అన్నాడతను చెయ్యి ముందుకు చాచి బొటన వ్రేలు చూపిస్తూ.

"నేను బట్టలు సర్దుకుని రెడీగా వుంటాను. ఈ రోజే మనం వెళ్ళిపోయే ఏర్పాటు చూడు" అంది వాసవి.

"సరేనన్నానుగా"

వాసవి బయటకొచ్చింది.

ఆమెనొకలాంటి నీరసం ఆవహించింది.

తనకు తెలియకుండానే తను పెద్ద చిక్కులో ఇరుక్కుంది. ఇందులోంచి బయటపడితేగానీ తనకి ఊపిరాడదు.

వాసవి మెల్లిగా మెయిన్ బిల్డింగ్ వైపు నడుస్తుంటే జగదీష్ కారు స్రరున ఆమె ముందునుంచి వెళ్ళి పోర్టికోలో ఆగింది.

వాసవి ఉలిక్కిపడింది.

అతనంత త్వరగా వెనుతిరిగి వస్తాడని ఆమె ఊహించలేదు. అనంత్ గదినుండి రావడం అతను గ్రహించేసి వుంటాడు.

డెలికేట్‌గా ఫీలయ్యింది వాసవి.

జగదీష్ కారు దిగి వాసవివైపు చిరునవ్వుతో చూసి "ఎలావుంది నీకు వంట్లో?" అన్నాడు ఆత్మీయంగా.

"ఫర్వాలేదు" అంది వాసవి గబగబా పోర్టికో మెట్లెక్కుతూ.

జగదీష్ ఆమెని అనుసరించాడు.

"మెల్లిగా ... అసలే బాగుండలేదుగా నీకు" అన్నాడు అదోలా చూస్తూ. వాసవి అతనివేపు ఆశ్చర్యంగా చూసింది.

ఏమిటితను? తనంత తప్పుచేసానని చెప్పినా తనపై కోపం తెచ్చుకోడేం? అనంత్‌ని ఏమీ అనడేం? అంత ఘోరమైన నిజం తెలిసికూడా తనతో ప్రేమగా ఎలా మాట్లాడగలుగుతున్నాడు? ఏమిటితని మనస్తత్వం. వాసవి లోలోన ఆశ్చర్యపోతూ తన గదిలోకి వచ్చింది.

మరో అయిదునిమిషాల్లో జగదీష్ కూడా తన వెంటే పైకి రావడం ఆమెకు కొంత ఆశ్చర్యాన్ని మరికాస్త చిరాకుని కలిగించింది.

అయినా ఏమీ అనలేక మౌనం వహించింది.

జగదీష్ లోనికొస్తూ మంచానికి ఎదురుగా వున్న సోఫా మీద కూర్చుని "వసూ నీతో మాట్లాడాలి" అన్నాడు మెల్లగా.

వాసవి అయిష్టతని అణచుకుంటూ అతని కెదురుగా మంచమ్మీద కూర్చుంది.

జగదీష్ ఆమెవేపు నిదానంగా, పరిశీలనగా చూసాడు.

వాసవి తిండి అంత సరిగ్గా తినకపోయినా అదోలాంటి అందం ఆవరించిందామెను. బుగ్గలు, పెదవులు రోజారంగు తిరిగి నిగనిగా మెరుస్తున్నాయి. కళ్ళు తళతళలాడుతున్నాయి.

"నన్ను పరాయివాడిలా చూస్తున్నావేం వసూ" అన్నాడు జగదీష్ బాధగా.

వాసవి కనురెప్పలెత్తి అతనివేపు చూసి తలదించుకుంది.

"నువ్వలా నన్ను దూరం చేయడం నేను భరించలేకున్నాను. బహుశా నీకు తెలియదు. నేను నిన్ను ఎంతగా ప్రేమించేదీను. నిన్న నువ్వు చెప్పిన సంగతి నాలో ఎంత అలజడి లేపిందో నీకు తెలియదు" అన్నాడు జగదీష్.

వాసవి మాట్లాడలేదు.

ఆ సంగతి విన్నాక నా హృదయంలో సుడిగాలులు వీచాయి. గుండె సుడిగుండంలో చిక్కినట్లు విలవిలలాడింది. రాత్రంతా ఆ సంగతి గురించే ఆలోచించాను. చివరకు తెలిసిన నిజమొక్కటే దీనికంతకీ కారణం నేను."

వాసవి అతనివేపు విచిత్రంగా చూసింది.

"అవును వసూ. వయసులో వున్న భార్యకి కావాల్సిన అవసరాలు చూడకుండా బిజినెస్ అంటూ ఆ గొడవల్లో తిరిగాను. పైగా ఈ యింటి పరిస్థితులు కూడా మన ఎడబాటుకి దోహదం చేసాయి. మానసికంగా జబ్బుపడి భయగ్రస్తురాలయిన నువ్వు పూచికపుల్లనే ఆధారంగా భావించడంలో తప్పులేదు. ఈ దయ్యాల బంగళాలో ఒంటరితనంతో బయంతో నువ్వు పొరపాటు చేస్తే బాధ్యతంతా నాదే"

వాసవి తెల్లబోయిందతని మాటలకి.

జగదీష్ మెత్తగా నవ్వాడు.

"నేను సహజంగా కోపిష్టి మనిషిని కాను. బహుశా చిన్నతనంలోనే నాకు తల్లిదండ్రులు దూరం కావడంతో నాకింతటి ఓర్పు వచ్చేసి వుంటుంది. గారం చేయడానికిగానీ అహం పెంచుకోవటానికి గానీ అవకాశమే లేకుండా పోయింది. ఇంత ఆస్తిని ఎవరు ఎగరేసుకుపోతారోననే జాగ్రత్త చిన్ననాడే అలవడింది. అందుకే బిజినెస్‌మీద నాకు కాస్త వ్యామోహం ఎక్కువే. అందుకే నువ్వు నన్ను క్షమించాల్సివుంటుంది" అంటూ చెప్పడం ఆపి వాసవి ముఖంలోకి చూసాడు జగదీష్.

వాసవి చూపు మరల్చుకుంది.

"రాత్రంతా ఎంతో ఆలోచించాను. ఈ విషయంలో ఆవేశపడి అనర్థాలు తెచ్చుకోవడం ఎంత అవివేకమో అర్థమయ్యింది నాకు. మీ యిద్దర్నీ తప్పు పట్టడం దండించడం నాకిష్టంలేదు. ఏం చేసినా జరిగిన సంఘటనకి తలవంచక తప్పదు. ఒక్క క్షణం కోసం ఒక జీవితాన్ని బలిచేసే హక్కు నాకు లేదు. అందులోనూ నేను నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్న వ్యక్తిని. ఎలా నిన్ను దూరం చేసుకుంటాను."

అతడు ఏం చెప్పబోతున్నాడో అర్థం కావడంలేదు వాసవికి. అతను లేచి మెల్లిగా వాసవి దగ్గరకొచ్చాడు.

ఆమె చేతిని అందుకుని కళ్ళకు హత్తుకున్నాడు.

"వసూ డియర్ నువ్వు దూరమైతే నేను బ్రతకలేను. నువ్వు నా జీవితం నుండి మైనస్ అయితే నా జీవితం జీరోగా మిగుల్తుంది. నేను నిన్ను క్షమిస్తాననిగాని, అది నా గొప్పతనం అనిగాని అనను. నేను నిన్ను వదులుకోలేను. అది చాలా అసాధ్యం" అన్నాడు జగదీష్.

తన చేయి తడికావడం గమనించి విచలితయ్యింది వాసవి.

ఆమె ఒకలాంటి అదిరిపాటుతో అతనివేపు చూసింది.

అతని కళ్ళు సజలమయ్యాయి.

"వసూ! నన్ను వదిలేసి వెళ్ళిపోవాలని నిర్ణయించుకోకు. అంతకంటే నన్ను చంపేసి" అతను బరస్టయినట్లు ఆమెను చుట్టబెట్టుకుని మాట్లాడలేకపోయాడు.

వాసవి స్థంభించిపోయినట్లుగా నిలబడిపోయింది.

మరో క్షణంలో అతను సర్దుకుని దూరంగా జరిగి నిలబడ్డాడు.

"సారీ నన్ను నేను కంట్రోలు చేసుకోలేకపోతున్నాను. కానీ వసూ నా జీవితం నీ నిర్ణయం మీద ఆధారపడివుంది. సావిత్రి చచ్చిపోతూ నన్ను చావుదెబ్బ కొట్టింది. నీవుకూడా నన్ను విదిలించి వెళ్ళిపోతే నాకు ఆత్మహత్యే శరణ్యం అవుతుంది. ఎంత సంపాదించినా సాటివారిలో నా బ్రతుకు హీనాతిహీనమై పోతుంది. కావాలంటే పుట్టబోయే బిడ్డకి నేనే తండ్రినవుతాను. ఈ విషయం మనిద్దరి మధ్యే వుండిపోతుంది. అనంత్‌ని పంపించేయమంటే పంపించేస్తాను. నిన్ను ఎబార్షన్ చేయించుకోమని వత్తిడి చేయను. ఆడదాన్ని కాకపోయినా నాకు తెలుసు స్త్రీకి మాతృత్వంపట్ల వుండే మమకారం."

"వసూ, నేను బొత్తిగా పౌరుషం లేని వాణ్ణనుకుంటున్నావు కదూ ఏం చేయను వసూ. నేను నిన్ను వదులుకొనే స్థితిలోలేను. నన్నెలా అర్థం చేసుకున్నా అది నీ యిష్టం. కాని నీ నిర్ణయం నాకనుకూలంగా వుండాలి. నీకు ఈ రాత్రంతా టైమిస్తున్నాను బాగా ఆలోచించుకో. బయటికి వెళితే నీకు మాత్రం ఏం గౌరవముంటుంది? అసలే మంచం మీద గుండె జబ్బుతో తీసుకుంటున్న నీ తండ్రి విషయం కూడా ఆలోచించు. ఇందర్ని బాధపెట్టి నువ్వేం సుఖపడతావ్? రేపు నా దగ్గర్నుంచి వెళ్ళిపోతే అనంత్ నిన్నే విధంగా పోషిస్తాడు. ప్రాక్టికల్‌గా ఆలోచించు. ఆ పైన నీ యిష్టమే నా యిష్టం" అంటూ గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

వెళ్తూ వెళ్తూ అతను కన్నీళ్ళు కర్చీఫ్‌తో తుడుచుకోవడం గమనించింది వాసవి.

ఆమెకు మతిపోయినట్లయింది.

"ఏమిటిది? తనిలా రాను రాను ఊబిలో ఇరుక్కుపోతున్నట్లయిపోతున్నదేమిటి?

ఇటు అనంత్ అటు జగదీష్.

తను ఎటు వెళ్ళాలి.

వాసవి కళ్ళు గట్టిగా మూసుకుని తల పట్టుక్కూర్చుంది.

**నిజానికి నాటకం** ఆడాల్సిన అవసరం అతనికేముంది?

అతనికి డబ్బుంది, వయసుంది. కావాలంటే ఈ వరకట్నపు విషమ రోజుల్లో "కో" అంటే కోటిమంది కన్నెపిల్లలు క్యూలో నిలబడతారు.

తననే బ్రతిమాలుకుని అనంత బిడ్డని తన బిడ్డగా భావించాల్సిన దుర్గతి ఏముందతనికి?

వాసవికి ఎన్ని విధాల ఆలోచించినా ఆ సమస్య తెగడం లేదు.

ఆమెకు మహతి చెప్పిన చివరి మాటలు గుర్తొచ్చాయి,

"నీ సుఖం నువ్వు చూసుకో పది మంది కోసం వెరచి అర్థంలేని త్యాగాలతో బ్రతుకుని నిరర్థకం చేసుకోకు"

అవును. తను మనసు వికసించి వలపు సోపానాలపై నిలబడి అనంత్‌నే ప్రేమించింది. చివరికి అనుకోకుండానే అతనికే తనని సమర్పించుకుంది. కాబట్టి ఎవ్వరేమనుకున్నా తను అతనికే చెందాలి. అదే ధర్మం. మనసొక చోట పెట్టుకుని మనుగడ యితనితో నడపాల్సి  కర్మ తనకేం లేదు. ఈ ధర్మాలు, ఈ నీతి శాస్త్రాలు మనల్ని గుప్పిట్లో పెట్టుకుని ఆడించడానికి రాసిన దమన నీతులు. తనింక ఆలోచించాల్సిందేమీ లేదు.

ఎంత త్వరగా, యీ యింట్లోంచి బయటపడితే తనకంత క్షేమం లేకపోతే జగదీష్ మంచితనం తనని కట్టేస్తుంది.

వాసవి గబగబా సూట్ కేసులో కొన్నె చీరలు సర్దింది. మెల్లిగా ఒక చేత్తో సూట్ కేసు పట్టుకుని మెట్లు దిగింది. ఆమె గుండె దడదడలాడుతోంది.

చుట్టూ చీకటి.

ఆమె చప్పుడు కాకుండా మెల్లిగా అడుగులో అడుగేస్తూ అవుట్ హౌస్ వైపు నడిచి "అనంత్" అంటూ గుసగుసగా పిలిచింది.

అటునుండి జవాబు లేదు.

వాసవి సూట్ కేసు గుమ్మానికి పక్కనపెట్టి లోనికి తొంగి చూసింది అనంత్ జాడలేదు.

ఆమె ఆలోచిస్తూ నిలబడింది.

ఈ టైమప్పుడు అనంత్ ఎటు వెళ్ళాడు?

ఆమె దృష్టి జగదీష్ బెడ్ రూమ్ పై పడింది.

అక్కడ దీపం వెలుగుతూంది.

జగదీష్ ఇంకా పడుకోలేదా?

కొంపదీసి అతను అనంత్‌ని పంపించే ఏర్పాట్లు చేస్తున్నాడేమో వాసవికి గాభరా పుట్టుకొచ్చేసింది.

ఆమె గబగబా అతని గదివైపు అడుగులు వేసింది. గుమ్మం దగ్గర్నుంచే మెల్లిగా లోనికి తొంగి చూసింది వాసవి.

అక్కడ ఎవరూ లేరు. ఈ జగదీష్ ఏమయినట్లు? ఆమె ఆలోచిస్తూ నిలబడింది.

ఎక్కడో ఎవ్వరో గుసగుసగా మాట్లాడుతున్న శబ్దం. వాసవి చుట్టూ చూసింది. ఎవరూ కనిపించలేదు. ఆమెకదోలాంటి  భయం కలిగింది.

ఈ యింట్లో ఎప్పుడూ భయానక వాతావరణమే.

ఆమె మెల్లిగా అక్కణ్ణుంచి ఏమీ తోచనట్లుగా ముందుకి కదిలించింది.

అలా వెళ్ళబోతున్నప్పుడు జగదీష్ గదిలో అవతల గోడకి సీలింగ్ నుండీ కట్టిన కర్టెన్ వెనుక సన్నని వెలుగు చారిక మీద పడిందామె దృష్టి.

ఆమె అనుమానంగా చూసిందటువైపు.

అది మెయిన్ బిల్డింగ్ అవుట్ వాల్.

అటువేపు తలుపు కూడా లేదు. మరి ఆ వెలుగు ఎటునుండి వస్తోంది? వాసవి అనుమానంగా మెల్లిగా పిల్లిలా గదిలోకి నడిచింది.

తనకి యిందాకట్నుంచి వినిపిస్తున్న గుసగుసలు అటునుండేనని గ్రహించేసరికి ఆమె బిగుసుకున్నట్లు నిలబడిపోయింది.

ఆమె మెల్లిగా కర్టెన్ ఎత్తింది.

తీసిన వెంటనే ఆమె నివ్వరపోయింది. అక్కడో తలుపు వుండటం ఆమె ఏనాడూ గమనించలేదు. అసలా కర్టెను వెనుక గది వున్నట్లు తెలియనే తెలియదు.

"నీకెంత కావాలో చెప్పు" అది జగదీష్ గొంతు.

"మీ యిష్టం సార్ నేను యింతని నిర్బందించను" అది అనంత్ కంఠం.

వాసవి గబుక్కున కర్టెను వెనుక దాక్కుని వాళ్ళ మాటలు వినసాగింది.

"అనుకున్నది అనుకున్నట్లుగా సాధించావు. డబ్బుకి వెనుకాడే మనిషిని కాను. అయిదు లక్షలకి చెక్కు రాస్తున్నాను. సరిపోతుందా? ఆర్ యూ హాపీ" అడిగాడూ జగదీష్.

"ఇటీజ్ మోర్ దేన్ వాటయామ్ ఎక్స్‌పెక్టెడ్ థాంక్యూ సర్" అన్నాడు అనంత్.

"నువ్వు ఇప్పుడే బయల్దేరి వెళ్ళిపోవాలి. నువ్వున్నంత సేపు వాసవి మనసు మారదు. నువ్వు వెళ్ళిపోతే ఇంత తప్పు చేసినా తనని నేను చేరదీసినందుకు జీవితమంతా కృతజ్ఞతతో పడివుంటుంది."

"ఆ ముసలాడికెలా వుంది?"

"బాగానే వున్నాడు. ఈ రోజే డిస్చార్జి చేస్తామంటే ఇంట్లో రెస్టు తీసుకోరని మరో పదిహేను రోజులు హాస్పిటల్లోనే వుంచమని డాక్టర్ని కన్విన్స్ చేసాను. అందువల్ల ఇప్పుడిప్పుడే వాడి పీడ మనకి వుండదు."

"మంచి పని చేసారు. మరి ఆ పరిమళ..."

జగదీష్ నవ్వేసి "అది నాకు అత్తగారవుతుందట. మరి మర్యాద చెయ్యాలి కదా. అందుకని సీ షోర్ కెదురుగా వున్న కాటేజ్‌లో విడిదికి ఏర్పాటు చేసాను" అన్నాడు.

"వ్వాట్?" అన్నాడు అనంత్ ఆశ్చర్యంగా.

"అవును. నాకెందుకో అది మొన్న వాసవిని కొట్టినప్పుడే అనుమానం వచ్చింది. ఆ ముసలాడితో క్లోజుగా వుండటం గమనించాను. నిజం బయట పడింది. అది వాసవికి తల్లి. దానికి ఈ నిజం తెలుసు. అందుకే దాన్ని ప్రస్తుతానికి బంధించాను. ఆ నిజాన్ని పర్మినెంటుగా పూడ్చిపెట్టే విషయం తర్వాత చూసుకుంటాను" అన్నాడు జగదీష్.

వాసవి ఆశ్చర్యంతో బిగుసుకుపోయింది.

పరిమళ తన తల్లా? ఇది నిజమేనా?

"అందుకే సార్ అది ప్రతిక్షణం నా పనికి అడ్డుపడుతూనే వుంది."

లక్కీగా వసు స్నేహితురాలు మహతి చచ్చిపోవడం అన్ని విధాలా మనకి కలిసొచ్చింది. ఆ దెబ్బతో వాసవి బాగా షాకయి పోయింది. అంతకు ముందే ముత్తు చావుతో దెబ్బతిన్న వాసవి ఒంటరితనంతో భయంతో నాకు లొంగిపోయింది. దానికితోడు నేను ఆమెకిచ్చిన మందులు. ఆమెని మరింత భయపెట్టి నీరస పరిచేవే"

జగదీష్ చిన్నగా నవ్వి "నాకు తెలుసు నీ తెలివితేటలు. అందుకే వాసవి కేసు నీకు అప్పచెప్పాను. ఆమె అందరిలాంటి ఆడదికాదు. అందుకే యింత కష్టపడాల్సి వచ్చింది. పోతే అనంత్ ఈ విషయం మనిద్దరి మధ్యనే ఉండిపోవాలన్న విషయం నువ్వెట్టి పరిస్థితుల్లోనూ మరచి పోకూడదు. ఈ డబ్బుతో ఏదైనా మంచి బిజినెస్ చేసుకో అవసరమైతే నన్ను కలవడానికి జంకకు."

ఏదో చెప్పబోతున్న అనంత్ బయట "దబ్"మన్న శబ్దానికి ఉలిక్కిపడినట్లుగా చూసాడు.

జగదీష్ కూడా కొద్దిగా తలుపు బయటకి త్రోసి తొంగిచూసాడు.

అతని కళ్ళు విశాలమయ్యాయి.

వాసవి కుప్పకూలిపోయి వుందక్కడ.

"మైగుడ్ నెస్ మనం మాట్లాడుకున్న విషయాలన్నీ వినేసినట్లుంది" అన్నాడతను కంగారుగా.

"ఇప్పుడేం చేద్దాం సార్"

జగదీష్ ఒక క్షణం ఆలోచిస్తూ నిలబడ్డాడు.

ఆ వెంటనే "అనంత్ కొంచెం సాయంపట్టు" అంటూ వాసవి చేతులు పట్టుకున్నాడు. మరోవైపు అనంత్ పట్టుకుంటే ఆమెని కార్లో పడుకోబెట్టాడు.

"ఎక్కడికి?" అనంత్ మెల్లిగా అడిగాడు.

జగదీష్ "ఉష్" అంటూ అతన్ని ఎక్కమని సైగచేసాడు ప్రస్తుతానికి వాళ్ళమ్మ విడిదికి తరలించేద్దాం. తర్వాత ఆలోచించొచ్చు" అన్నాడు జగదీష్ కారు స్టారు?ట్ చేస్తూ.

"అక్కడ వాళ్ళిద్దరూ ఏకం అయితే?"

"ఏకం అయి ఏం చేస్తారు?" జగదీష్ నిరసనగా అడిగాడు.

"ఏం చేయలేరనుకోండి. కాని వాసవికి అన్నీ తెలిసిపోతే కష్టంకదూ"

"ఎన్ని తెలిసినా అసలు విషయమొకటి వాళ్ళిద్దరికీ తెలియదు. అది మన ముగ్గురి మధ్యనే వుంది."

"ముగ్గురు ఎవరు?" అనంత్ ఆశ్చర్యంగా అడిగాడు.

"నువ్వు - నేను - బలరాం."

"బలరాంకి తెలుసా?"

"అద్సరే బలరాం సంగతేమయినా తెలిసిందా?" ఎదురు ప్రశ్నవేసాడు జగదీష్.

"వాడు యమపురికి వెళ్ళి చాలారోజులయింది."

"కన్ఫర్మ్ చేసుకున్నావా?" రెట్టించాడు జగదీష్

"చాలా మేజర్ ఏక్సిడెంట్ సార్. బ్రతుకుతాడని అనుకోను."

"నువ్వనుకోవడం కాదు కావాల్సింది. ఖచ్చితంగా వాడు చచ్చితీరాలి." జగదీష్ కఠినంగా అంటూ కారు స్పీడు పెంచాడు.

"సరే సార్ రేపే కన్ఫర్మ్ చేసుకుంటాను."

జగదీష్ మాట్లాడలేదు.

కారు మరి కాస్సేపటిలో కాటేజ్ చేరుకుంది.

వాళ్ళిద్దరూ గబగబా కారు దిగి చుట్టూ చూసారు.

దట్టంగా చీకటి ముసుగు కప్పుకుని వుందా వాతావరణం. చుట్టూ ఆక్రమించుకున్న చెట్ల సందుల్లోంచి ఒకటి అర నక్షత్రాలు తళుకు లీనుతున్నాయి.

సముద్రం అట్టహాసం చేస్తోంది.

వాళ్ళిద్దరూ తాళం తీసి వాసవి శరీరాన్ని గబగబ ఒక గదిలో వుంచి బయటకి నడిచారు.

వాళ్ళు తిరిగి తాళం వేస్తుంటే నిద్రరాని కళ్ళతో, తల్లడిల్లిన హృదయంతో చూస్తుందొక మాతృహృదయం.

38

"అవును. సావిత్రిని నేనే సంపేసేను. ముత్తుని కూడా నేనే దానిమీన లారీ ఎక్కించేసి మింగినను. నాకు ఉరిశిచ్చేసేయండి" ఒకలాంటి అపస్మారక స్థితి ఆవహించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడు బలరాం.

వాడి స్టేట్ మెంటూ పూర్తయ్యేసరికి ధవళాచలం ముఖం ఒకలాంటి సీరియస్‌నెస్‌తో బిగుసుకుంది.

శంకర్ మోకాళ్ళమీద తలపెట్టుకుని వెక్కెక్కి ఏడుస్తుంటే ఆశ్చర్యంగా చూసారు ధవళాచలంతోపాటు మిగతా ఆఫీసర్సు.

"పాపం వాడికీమధ్య బలరాంతో సన్నిహితత్వం ఏర్పడింది. చిన్న వయసు కదూ బాగా అప్‌సెట్టవుతున్నాడు" అన్నాడు ధవళాచలం.

మిగతావాళ్ళు తల పంకించారు.

ధవళాచలం మెల్లిగా లేచి శంకర్ దగ్గరకి వెళ్ళి వాడి భుజం మీద అనునయంగా చెయ్యి వుంచి చెయ్యి వుంచి "డోంట్ క్రై మై బోయ్" అన్నాడు.

శంకర్ మెల్లిగా తలయెత్తిచూసాడు.

"వాడు ఒక హంతకుడు వాడికోసం నువ్విలా అప్‌సెట్ కావడం సిల్లీ" ఆయన నవ్వుతూ అన్నాడు.

శంకర్ ఆయన వైపు అదోలా చూసి "అందుకు కాదు సార్ వాడు.. వాడు చంపేసింది మా అక్కని" అన్నాడు ఎర్రబడ్డ కళ్ళతో.

"వ్వాట్! మీ అక్క ఎవరు?" ఆయన అదిరిపడినట్లు అడిగారు.

"సావిత్రి నా అక్క సార్" మరో క్రొత్త నిజం తెలియడంతో ధవళాచలంతోపాటు, ప్రక్కనే వున్న సి.ఐ.డి ఆఫీసర్ కూడా ఆశ్చర్యపొయ్యారు.

"అవున్సార్ సావిత్రి నా స్వంత అక్కే. మా నాన్న జగదీష్ కంపెనీలో చాలా చిన్న ఉద్యోగస్తుడు. మా అక్క చాలా అందమైంది. ఒకసారి ఏదో పనిమీద మా అక్క నాన్నదగ్గరికి కంపెనీకి వెళ్ళింది. మా అక్కని చూసి ఆయన యిష్టపడి పెళ్ళి చేసుకుంటానంటే మా నాన్న దాని అదృష్టానికి ఎంతో సంతోషపడిపోయి యిచ్చి చేసారు. తర్వాత మా నాన్నకి నెల్లూరులో

వున్న ఆయన బ్రాంచి ఆఫీసుకి ట్రాన్స్‌ఫరయ్యింది. మేం వెళ్ళిపోయాం. అప్పటికి నేను మా తాతగారి ఊరిలో టెన్త్ చదువుతున్నాను. పెళ్ళికి కూడా నేను వెళ్ళలేదు. ఆ తర్వాత మా అక్కని చూసే వీలేలేకపోయింది నాకు. ఒకసారి మాత్రం ఆమెను చూడాలనే కోరిక చంపుకోలేక వాళ్ళింటికి వెళ్ళాను. నా అదృష్టం కొద్దీ జగదీష్ ఇంట్లో లేడు. మా అక్క ఏదో గాభరాగా కనిపించింది. నన్ను తొందరగా వెళ్ళిపొమ్మంది. నేను ఇంటర్ చదువుతుండగా మా అక్క చనిపోయింది. ఆమె శవాన్ని కూడా మేమెవ్వరం చూడలేదు. ఆ సంగతి మాట్లాడటానికి కూడా వీల్లేదన్నారు మా నాన్న. కానీ ఆ తర్వాత ఆయన మంచం ఎక్కేసారు. చివరకి ఆయన చచ్చిపోతూ మా అక్కని చంపేసారని ఆ మాట ఎవరితోనయినా అంటే మన గతి అంతేనని చెప్పారు. నాలో పగరేగింది. మా అక్క మరణం గురించి తెలుసుకోవాలని ఈ యింట్లో పని కుర్రాడిగా ఉద్యోగం సంపాదించాను" అంటూ ఊపిరి పీల్చుకున్నాడు శంకర్.

"నువ్వు అతనికి బావమరిది అవుతావని అతనికి తెలియదా?"

"ఊహూ. ఆయనన్నెప్పుడూ చూడలేదు మా అక్కనిచ్చాక. ఆ వంకతో తనతో బంధుత్వం కలుపుకోవడాన్ని యిష్టపడనని జగదీష్ చెప్పాడట. దాంతో మా యింటిలో ఎవరూ పెళ్ళికి కూడా వెళ్ళలేదు."

"ఈ పెళ్ళికి మీ నాన్నగారు ఎందుకు ఒప్పుకున్నట్లు?"

"పేదరికం. ఆయన మా కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తానన్నారట."

"మరి చేసారా?"

"లేదు. కారణాలు నాకు తెలియవు. కూతురు గొప్పింటి కోడలవుతుందని ఆశపడ్డాను. చివరికిలా జరిగిందని బాధపడేవారు నా తండ్రి."

ధవళాచలం సి.ఐ.డి ఆఫీసర్ వేపు తిరిగి "ఇక అతన్నుంచి రాబట్టాల్సిందేమీలేదు. బలరాం స్టేట్‌మెంట్ వల్ల మనకి తెలుస్తోందిగా సావిత్రి మరణానికి కారణం ఇక మనం వెంటనే ఏక్షన్‌లోకి దిగాలి."

"మనం వెంటనే జగదీష్ యింటికెళ్ళి మిగతా సంగతులన్నీ కన్‌ఫర్మ్ చేసుకోవాలి వెంటనే వాళ్ళిద్దర్నీ అరెస్టు చెయ్యాలి" అన్నాడు.

వాళ్ళు లేచి నిలబడ్డారు.

బలరాం గట్టిగా మూల్గాడు.

డాక్టర్లు అతన్ని బ్రతికించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నారు అయినా ప్రయోజనంలేకపోయింది.

బలరాం బలరాం తల ఒక పక్కకి ఒరిగిపోయింది.

శంకర్ చూడలేనట్లు తలతిప్పుకున్నాడు.

ధవళాచలం, మిగతా ఆఫీసర్సు ఒక్క క్షణం మౌనంగా నిలబడిపోయారు.

ఆ వెంటనే తమ విద్యుద్దర్మం నిర్వహించేందుకు గబగబా అడుగులు ముందుకేసారు.

వాసవి మెల్లిగా కళ్ళు తెరిచింది. చాలాసేపు ఆమెకి తనెక్కడున్నదీకూడా అర్థంకాలేదు.

క్రింద నేల గట్టిగా తగలడంతో ఆమెకి కొంత బాహ్యస్మృతి కలిగింది.

చుట్టూ సన్నగా ఆవరించబోతున్న వెలుగు దట్టంగా పేరుకున్న తారులాంటి చీకటితో కుస్తీపడుతున్నది.

ఆమెకి మెల్లిగా అంతా జ్ఞాపకం వచ్చింది.

రాత్రి వాళ్ళిద్దరూ కలిసి పన్నుతున్న కుట్ర దుర్మార్గం గుర్తొచ్చేసరికి ఆమె హృదయం లావాలా కుతకుతా వుడికిపోయింది.

"అన్యాయం" అంటూ ఆమె శక్తికొద్దీ కేకపెట్టింది.

ఆ కేకకి అన్ని తలుపులూ మూసిపెట్టిన ఆ బంగళా ప్రతిధ్వనించింది. ఆమె అరుపు ఆమెకే వికృతంగా వినిపించింది.

వాసవి చుట్టూ చూసింది.

అది తమ మేడ కాదు. ఇప్పుడు తనెక్కడుంది?

వాసవి కంగారుగా లేచి నిలబడింది.

గబగబా మూసివున్న తలుపుల్ని గట్టిగా లాగబోయింది. అవి తెరుచుకోలేదు.

వాసవికి దుఃఖం తన్నుకొచ్చింది.

ఏదో మోసం జరుగుతోంది. తనని ఎక్కడో బంధించారు అనే విషయం అర్థమయ్యేసరికి ఆమె నిలువెల్లా వణికిపోయింది.

ఒకలాంటి పిరికితనం తనకిప్పుడూ ఎవరూ లేరనే బేలతనం ఆమెను ఆవరించేసరికి ఖిన్నురాలయి 'అమ్మా' అంటూ బిగ్గరగా ఏడ్చేసింది వాసవి.

"తల్లీ" వాసవి చటుక్కున ఏడవటం ఆపి చుట్టూ చూసింది.

"నేనమ్మా పరిమళని"

వాసవి కుడివేపుగా వున్న కిటికీ వూచల్ని పట్టుకుని అవతల గదిలోంచి పలుకరిస్తున్న పరిమళని చూసి నిర్ఘాంతపోయింది.

ఆ వెంటనే రాత్రి జగదీష్ అన్నమాటలు గుర్తొచ్చాయి వాసవికి.

పరిమళ తన తల్లి అనే విషయం గుర్తొచ్చేసరికి ఆమె హృదయం అదోలాంటి భావనికి గురయ్యింది.

ఆ ఒంటరితనం బేలతనం ఆమె హృదయాన్ని బలంగా ఆవరించి పరిమళపట్ల అభిమానాన్ని కలగచేసాయి.

"అమ్మా!" అంది వాసవి ఆర్తిగా.

పరిమళ మొదట నివ్వెరపోయింది. ఆ వెంటనే జీవితంలో ఎన్నడూ చవిచూడని మధురమైన భావన ఒకటి శీతల తుషారంలా ఆమె హృదయంలోంచి తన్నుకొచ్చి ఆమెను ఆనంద జలకాలాడించింది.

వెంటనే ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

"అమ్మా వాసవీ" అంది గద్గదికంగా.

వాసవి పరుగునవచ్చి ఆ వూచల్ని మరోవేపు పట్టుకుంది.

ఆ యిద్దరి కళ్ళు అనిర్వచనీయమైన అనురాగాన్ని అటూయిటూ సరఫరా చేసుకున్నాయి.

కొన్ని క్షణాలు మౌనం.

ఏ భాషం ఏ భావానికి అందని అనుభూతులు వారి కళ్ళలోంచి ప్రసరించాయి.

ఆ తర్వాత.

"అమ్మా నిన్నిక్కడ నువ్విక్కడికెలా వచ్చావు" అంటూ అడిగింది వాసవి ఆదుర్దాగా.

పరిమళ నిస్పృహలాగా నవ్వి "అతను జగదీష్ నన్నిక్కడ బంధించాడు" అంది.

"ఎందుకు?"

"తెలియదు. నేను అతని అత్తగారిననే విషయం అతను చిన్నతనంగా భావించినట్లున్నాడు."

"కాదు వాడొట్టి రోగ్. వాళ్ళిద్దరూ కలిసి ఆడిన నాటకంలో నేను పావులా చిక్కుకుపోయాను" అంది వాసవి దుఃఖంతో.

పరిమళ చేతులు ఆప్యాయంగా వాసవి కళ్ళు తుడిచాయి.

"ఆ సంగతి రాత్రే తెలిసింది. స్పృహలో లేని నిన్ను వాళ్ళిద్దరూ కలిసి ఈ గదిలో పడవేయడం నేనూ చూసాను కానీ ఆ యిద్దరూ కలిసి ఏం నాటకం ఆడుతున్నారో చివరికి ఏం చేయాలనుకుంటున్నారో అర్థం కావడంలేదు" అంది పరిమళ బాధగా.

వాసవి కాస్సేపు మాట్లాడలేదు.

"అమ్మా నువ్వెలాగనా పారిపో లేకపోతే వాడు నిన్ను చంపేస్తాడు" అంది కంగారుగా.

పరిమళ వాసవివైపు చూసి నవ్వింది.

"పిచ్చిపిల్లా నా బ్రతుకు కోసం ఆలోచిస్తున్నావా? పడమటికి వాలిపోయిన పొద్దుని నేను. తూర్పున పారాడుతున్న వెలుగువి నీవు. కన్న తల్లిగా నా శరీరంలో ప్రతి రక్తపు బొట్టుని నీ బ్రతుకు కోసం ధారపోయాల్సిన బాధ్యత నాది. నేను చచ్చిపోతానని కాదు నా బాధ. నిన్నెలా దక్కించుకోవాలన్నది నా ఆవేదన" అంది.

"నీకు తెలియదమ్మా వాళ్ళిద్దరూ పచ్చి రక్తాన్ని త్రాగే పరమ కర్కోటకులు. ఆ నిజం తెలియక నా మనసుని నా శరీరాన్ని..." వాసవి మాట్లాడలేనట్లు వెక్కెక్కి ఏడ్చింది.

పరిమళ చెయ్యి వాసవి తలని ఆప్యాయంగా తడుముతూ వుండిపోయింది.

**"నీ బాధ నాకు తెలుసు** తల్లీ నిన్ను ఎలాగైనా కాపాడుకోవాలనే నేను మీ నాన్నగారి దగ్గర కెళ్ళాను. కానీ విధి వక్రించి రైలు ఏక్సిడెంటవ్వడంతో నీ బ్రతుకు నాశనమయ్యింది" అంది పరిమళ ఆవేదనగా.

వాసవి వంచిన తల ఊచలకి చేర్చి మౌనంగా వుండిపోయింది.

"వసూ"

"అమ్మా!"

"నాకొక్క మాట యిస్తావా?"

వాసవి ఏమిటన్నట్లు చూసింది.

"అనుకోకుండా నీ బ్రతుకు నీ నిమిత్తం లేకుండా రకరకాలుగా జారిపోయింది. అందులో నీ బాధ్యతగాని నీ తప్పుకాని లేదు. అందుకోసం ఎట్టి పరిస్థితుల్లోనూ దీన్ని నువ్వు అవమానంగా భావించి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించవుగా. నాయీ ఒక్క కోరిక తీరుస్తావుగా" పరిమళ తన కుడిచేతిని చాచి అడిగింది.

వాసవి కళ్ళలోంచి అశ్రువులు ధారగా జారిపోయాయి. "జరిగిపోయిన ఈ ఘోరాన్ని తలచుకుని ప్రతిక్షణం నీ కూతురు కుమిలి కుమిలి ఏడుస్తుంటే అలా బ్రతుకుతుంటే నీకు బావుంటుందామ్మా" వాసవి సూటిగా తల్లివేపు చూస్తూ అడిగింది.

పరిమళ కళ్ళు బాధతో రెపరెపలాడాయి.

కాస్సేపు మాట్లాడలేనట్లు తలదించేసింది.

వాసవి నిస్పృహగా నవ్వింది. "తల్లిగా నువ్వు నా బ్రతుకునే కాంక్షిస్తావు. కాని సాటి ఆడదానిగా చెప్పు. నేను ఎందుకు బ్రతకాలి? ఏం చూసి బ్రతకాలి?"

"వసూ."

"బాధపడకు. నాన్న నా జీవితాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దాలి అనుకున్నారు. అందుకు డబ్బు అవసరమని చెప్పింది. ఆయన అనుభవం నేను హాయిగా బ్రతకడానికి అర్థం చేసుకునే మనసు చాలనుకున్నాను. తెలివి అందమున్న అనంత్ మీద ఆశలల్లుకున్నాను. చివరికి కథలు అడ్డం తిరిగాయి. ఇద్దరం ఓటమిని అంగీకరించాల్సి వచ్చింది. ఇప్పుడు నాకు నా జీవితం పతనమయ్యిందనే బాధలేదు. ఆవేదనలేదు. కానీ బ్రతకాలనే కోరికకూడా లేదు" అంది వాసవి విరక్తిగా.

పరిమళ తన చేత్తో కూతురి నోటిని మూసింది.

"అలా అనకు వసూ. నా బ్రతుకు చూడు. ఎన్నో అగచాట్లు పడి  ఇంకా ఎందుకు బ్రతికున్నాను. ఏనాటికైనా నా బిడ్డని కలుసుకుంటాననే ఆశ చివరకు ఆ కోరిక తీరేవేళ నువ్వు నీ తల్లిని క్షోభ పెడతావా తల్లీ" అంది పరిమళ కన్నీళ్ళతో.

వాసవి నిస్పృహగా నవ్వింది.

"నేను నీ కళ్ళముందు తిరగడమే ముఖ్యం అనుకుంటే నీ కోరిక తీరుస్తానులే అమ్మా" అంది బాధగా.

పరిమళ ఆమె బుగ్గల్ని ఆప్యాయంగా నిమిరింది.

"అది సరే. వాళ్ళు నిన్ను చంపేయాలని నిర్ణయించుకున్నారు. వాళ్ళు తిరిగొచ్చేలోపున మనం ఇక్కడినుంచి తప్పించుకోవాలి. ఆ సంగతి ఆలోచించు" అంది వాసవి కంగారుగా.

"ఇక్కడినుంచా? ఎలా?" అంది పరిమళ నిస్పృహగా.

వాసవి చుట్టూ కలయచూసింది.

పన్నెండడుగుల ఎత్తు గోడల పద్దెనిమిదంగుళాల రాతికట్టడం, యింట్లోంచి ఎలా పారిపోవడం?

ఒక క్షణం నిస్పృహ ఆవరించింది.

కాని ఏదో ప్రయత్నం చేయాలి తమకి చావెలాగూ ఖాయంకాని ఈ లోపున ఏ చిన్న అవకాశమైనా దొరికితే చావు వెంట్రుక వాసిలో తప్పినా తప్పొచ్చు.

ఆమెలోని పిరికితనం భయం ఎటో రెక్కలు వచ్చి ఎగిరిపోయింది.

నిండా మునిగిన వాడికి చలిలేదన్నట్లు ఏదో తెగువ ఆమెని ఆవరించింది.

గబగబా గదంతా వెదికింది వాసవి.

గదిలో ఒక మూల చెక్క సామాను కింద కనబడ్డ ఇనుప ఊచని బయటికి లాగింది. వాసవి చేస్తున్న పనిని అర్థంకాక అటే చూసింది పరిమళ.

వాసవి గబగబా వచ్చి తల్లిని బంధించిన గది తాళం బ్రద్దలు కొట్టసాగింది.

ఆమె ముఖమంతా చెమటలు క్రమ్ముకున్నాయి.

అలుపొచ్చినా ఆగకుండా తాళాన్ని బ్రద్దలు కొట్టడానికి ప్రయత్నిస్తూనే ఉంది వాసవి.

సరిగ్గా అప్పుడే ఆమె ముఖం మీద సన్నటి వెలుగు పడింది. వాసవి ఉలిక్కిపడి వెనుతిరిగి చూసింది.

అక్కడ జగదీష్.

వెనుకే అనంత్.

"భేష్, తల్లి మీద ప్రేమని చూస్తుంటే ముచ్చటేస్తుంది" అన్నాడు జగదీష్ నవ్వుతూ.

వాసవి దిగ్గున లేచి నిలబడింది.

పరిమళ కంగారుగా చూసింది.

జగదీష్ వాసవి దగ్గరగా వచ్చి "ఆ చెమట చూడు. ఎలా పట్టిందో మేము వచ్చి చేసేపని నువ్వెందుకు చెయ్యడం. ఆవిడ్ని మేము విడుదల చేస్తాంగా" అన్నాడు నవ్వుతు.

వాసవి అసహ్యంగా ముఖం తిప్పుకుంది.

"అనంత్ పాపం ఆ గది తాళం తెరు"

అనంత్ వెంటనే తాళం తెరిచాడు పరిమళ గబుక్కున బయటకొచ్చింది.

"అత్తగారూ, మీరు మీ అమ్మాయికి కాస్త హితబోధ చెయ్యండి. కట్టుకున్న భర్తతో గుట్టుగా కాపురం చెయ్యడం ఈ సమాజంలో ఎంతో గౌరవమని చెప్పండి. బయట ప్రపంచంలోకి ఉన్న పట్టు వదులుకుని వెళితే ఏమవుతుందో వివరంగా చెప్పండి. తను చేసిన తప్పుని భరించి కూడా తనకి భార్య స్థానాన్ని యిస్తున్న నాలాంటి భర్త ఈ భూమండలంలో దొరుకుతాడా, ఆడది ఒంటరిగా బయటికెళితే ఏం జరుగుతుందో చెప్పండి."

"యూ షటప్" అంది వాసవి కోపంగా.

జగదీష్ నవ్వి "నీకు నీ అమ్మ చాలా రోజులకి కనిపించింది. ఆవిడ నీకు కొన్నాళ్ళు కావాలనుకుంటే మర్యాదగా నాతో కాపురానికి ఒప్పుకో" అన్నాడు.

"అదీ జన్మలో జరగదు" అంది వాసవి ఉద్రేకంగా.

"జరగనివి జరిపించడంలోనే నాకు థ్రిల్ వుంది"

"నువ్వు మరో జన్మ ఎత్తాలి"

"చూస్తాను" అంటూ జగదీష్ అనంత్ వైపు తిరిగాడు. అనంత్ తన చేతిలోని పిస్తోలుని విలాసంగా వూపి పరిమళవైపు గురిపెట్టాడు.

వాసవి బిత్తరపోయి చూసింది.

పరిమళ ముందు కాస్త ఖంగు తిన్నా తర్వాత నిర్భయంగా నిలబడింది.

"నన్ను ఈ రోజు మీరు చంపాలనుకుంటుంటే నాకు నిజంగా నవ్వొస్తోంది. నేను చచ్చి పాతికేళ్ళయింది" అంది నిరసనగా.

"బాగుంది జోక్" అంటూ నవ్వాడు జగదీష్.

"నువ్వెలా అనుకున్నా ఫర్వాలేదు. అమ్మా వసూ నాకోసం నువ్వేం లొంగిపోనక్కరలేదు. నిన్నటివరకు లేని ఈ క్రొత్త అమ్మకోసం నువ్వెలాంటి త్యాగాలూ చెయ్యకు. నువ్వు నీకిష్టంలేనివి ఒప్పుకోనవసరంలేదు" అంటూ హెచ్చరించింది పరిమళ.

అనంత్ పరిమళవైపు కోపంగా చూసి "ముసిల్దానికి ఇంకా పవరు చావలేదు" అన్నాడు.

వాసవి తల్లివైపు బెదిరిపోతూ చూస్తోంది.

జగదీష్ రెండడుగులు వెనక్కు నడిచి "నేను మూడు అంకెలు లెక్కపెట్టేసరికి నువ్వు నా పక్కకొచ్చి నిలబడి సరెండరయితే సరేసరి. లేకపోతే నీ తల్లి యమభటులకి సరెండరవుతుంది, ఓ.కె" అంటూ హెచ్చరించాడు.

అనంత్ వ్రేలు ట్రిగ్గర్ మీద తచ్చాడుతోంది.

జగదీష్ "వన్" అన్నాడు.

పరిమళ వాసవిని ధైర్యంగా వుండమన్నట్లు సైగ చేసింది. అయినా వాసవి నిలువెల్లా వణికిపోతున్నది.

"టూ" జగదీష్ గొంతు తారాస్థాయికి వెళ్ళింది.

అనంత్ సరదాగా మూడో నెంబర్ కోసం చూస్తున్నాడు.

వాసవి భయంగా కళ్ళు మూసుకుంది.

తలుపు దభ్‌మని తెరచుకున్న చప్పుడు.

"హాండ్సప్"

జగదీష్‌తో పాటు అనంత్ కూడా ఉలిక్కిపడి వెనుతిరిగి చూసారు.

దాదాపు పోలీసు బలగమంతా నిలబడి వుందక్కడ.

అనంత్ చేతిలో పిస్టల్ జారిపోయింది.

ధవళాచలం ముందుకొచ్చి నిలబడ్డారు.

వాసవి, పరిమళ అతని వెనుకగా వచ్చి నిలబడ్డాడు.

"యూ ఆర్ అండర్ అరెస్ట్" వారెంటు చూపించాడు పోలీసాఫీసర్. జగదీష్ ముఖం పాలిపోయింది.

వాళ్ళిద్దరూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెనుక అడుగులు వేసారు.

## 39

ఆ గదిలో -

జగన్నాధరావుగారి ఎదుట కూర్చుని వున్నాడు ధవళాచలం. మరో సోఫాలో పరిమళ, వాసవి కూర్చున్నారు.

పక్కనే శంకర్.

అటుపక్క మరో సోఫాలో సి.ఐ.డి ఆఫీసర్.

జగన్నాధరావుగారి ముఖం తెల్లగా పాలిపోయింది.

రెండుసార్లు హార్ట్ ఎటాక్ వచ్చినా తట్టుకుని నిలబడ్డ ఆయన ఇప్పుడూ మాత్రం పాతికేళ్ళు ఒక్కసారే మీదపడ్డట్లు క్రుంగిపోయారు.

"మీతో అన్నీ సావకాశంగా మాట్లాడాలని వచ్చాం. మీరు కాస్త ధైర్యంగా వుండాలి" అన్నారు ధవళాఛలం జగన్నాధరావుగారి వేపు చూస్తూ.

జగన్నాధరావుగారు నిస్పృహగా నవ్వి చెప్పండి అన్నారు.

"మీరెంత ఆలోచించి కృంగిపోయినా ఇందులో మీరిక చేయగల్గిందేమీ లేదు. ఇంకా అదృష్టమేమిటంటే మీ అమ్మాయి మీకు ప్రాణాలతో దక్కింది."

పరిమళ కళ్ళలో కలవరం కనిపించింది.

అప్రయత్నంగా ఆమె చెయ్యి వాసవి వీపుని నిమిరింది. "ఇది చాలా విచిత్రమయిన కేసు. ఇలాంటిది రెండేళ్ళ క్రితం కలకత్తాలో ఒకటి జరిగింది. అందులో లవర్ అమాయకుడు. భార్యాభర్తలు నాటకం ఆడారు. చివరికి లవర్ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కానీ ఈ కేసులో ఇటు ప్రేమికుడు అటు భర్త మీ అమ్మాయిని వంచించారు" అంటూ ఆగాడు ధవళాచలం.

జగన్నాధరావుగారి ముఖంలో ఒకలాంటి ఆవేశం, బాధా కనిపించాయి.

వాసవి నిర్లిప్తంగా చూసిందాయనవేపు.

"మీ అల్లుడు జగదీష్ ఒక విచిత్రమయిన వ్యక్తి. అతను నపుంసకుడు. దాంపత్య జీవితానికి అనర్హుడు" ధవళాచలం మాటలకి అక్కడ హాల్లో ఒక్క సి.ఐ.డి ఆఫీసరు తప్ప మిగతా వాళ్ళంతా తెల్లముఖాలు పెట్టారు.

"అతనికి మరి పెళ్ళి దేనికి?" ఆశ్చర్యంగా అడిగారు జగన్నాధరావుగారు.

"అక్కడే వుంది అసలు కథ. అతనికి కావల్సినంత డబ్బుంది. స్టేటస్ వుంది. ఈ ప్రపంచంలో డబ్బుతో కొనాల్సిన సుఖాలన్నీ అతడు కొనుక్కోగలడు. 'ఒక్క స్త్రీ సుఖం తప్ప. కాని తనలో వున్న ఆ గొప్ప లోపాన్ని ఒప్పుకోడానికి అతనిలోని అహం ఒప్పుకోలేదు. అందుకే స్టేటస్ సింబల్‌గానే అతను పెళ్ళి చేసుకున్నాడు. బీదరికం నుండి వచ్చిన పిల్లయితే అతనికి అన్ని విధాల లొంగి వుంటూందని మొదట సావిత్రిని కట్టుకున్నాడు. డబ్బుకోసం ఏం చెప్పినా వింటుందని అతని ఉద్దేశ్యం. కానీ సావిత్రి అతని అంచనాల్ని తారుమారు చేసింది. హత్య చేసి పారిపోతున్న బలరాంని ట్రాప్ చేసి తన పనుల కోసం తెచ్చిపెట్టుకున్నాడు. అతన్ని తాగించి సావిత్రి మీదికి ఉసికొల్పాడు. బలరాం అడ్డూ ఆపూ లేకుండా ఒంటరిగా వున్న సావిత్రి మీదకి ఎగబటడం ఇంట్లో ఉంటున్న వంటమనిషి ముత్తు గమనిస్తుండేది. కానీ ఆమె ఏమీ చేయలేని అసహాయురాలు. సావిత్రి తరచు భర్తకి బలరాం చేస్తున్న అరాచకాన్ని చెప్పి ఏడుస్తుండేది. కానీ జగదీష్ వాసవికి చెప్పినట్లే బలరాం తన అన్న అని చూసీ చూడనట్లు చూడమని చెబుతుండేవాడు.

చివరకి ఒక రాత్రి బలరాం ఆమె మీద విజృంభించాడు. సావిత్రి పెనుగులాడటంతో ఆ త్రాగిన మైకంలో పీక పిసికి చంపేసాడు. ఆ యిద్దరూ కలిసి ఆమె శవాన్ని పెరట్లోనే మామిడిచెట్టు క్రింద పాతిపెట్టారు. ఆ సంగతంతా ముత్తు రహస్యంగా చూసింది."

"కాని అక్కడ ఒక కుక్క శవం" అంటూ సందేహంగా చూసింది వాసవి.

"చెబుతాను" ధవళాచలం వక్కపొడి వేసుకుని మళ్ళీ మొదలు పెట్టాడు. "ముత్తు మిమ్మల్ని వచ్చిన దగ్గర్నుండి అనేక రకాలుగా హెచ్చరించడానికి ప్రయత్నించింది. ఆమెకు తెలుగు రాకపోవడంతో మీకు తమిళం తెలియకపోవడంతో అనేక సమస్యలు ప్రారంభమయ్యాయి. ఆమెను మీరు అపార్ధం చేసుకుని దూరం పెట్టారు. చివరికి ఒకరోజు మీ అమ్మగారి ద్వారా మీకు అసలు విషయం తెలియనే తెలిసింది. సూటిగా అడిగేసారు. అతను తేలిగ్గా నవ్వి, మీకు అక్కడేముందో చూపిస్తానన్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో జ్ఞాపకం తెచ్చుకోండి" అంటూ వాసవి వేపు చూసాడు ధవళాచలం.

వాసవి ఆలోచించింది కాస్సేపు.

"మర్నాడు త్రవ్వి చూపించారు. అక్కడ కుక్క అస్థిపంజరం వుంది" అంది.

"అంతకుముందు సంగతి. మీరు ఆయనమీద కోపం తెచ్చుకున్నారు. తలనొప్పిగా వుంటే మీ సెక్రెటరీ కాఫీ తెచ్చి ఇచ్చాడు. మీ ఆయన స్పెషల్ అంటూ నొక్కి చెప్పాడు సెక్రటరీకి. ఆ కాఫీ త్రాగి మీరు ఎప్పుడు లేచారు?

"మర్నాడు ఉదయం."

"ఇప్పటికైనా అర్థమయిందా? ఆయన మీకు స్లీపింగ్ డోసిచ్చారు కాఫీతో. మీకు ఒక్కరికే కాదు. తన బర్త్‌డే పార్టీ. అంటూ ఇంట్లో పనివాళ్ళకంతా నిద్రమాత్రలు కలిపిన డిన్నర్ ఎరేంజ్ చేసాడు."

పరిమళ జ్ఞాపకం తెచ్చుకుంటూ "అవును ఆ రోజు నిద్ర ఆలస్యంగా లేచినందుకు చాలా సిగ్గుపడ్డాను. నాతోపాటు ముత్తుకూడా" అంది ఆశ్చర్యంగా.

"అంతేకాదు మీతోపాటు అనంత్‌కి కూడా అదే డిన్నర్ ఇవ్వబడింది. మీ అందరితోపాటు అనంత్ కూడా గాఢ నిద్రలో పడ్డాడు."

"అనంత్ కెందుకు? అతను అతని శిష్యుడేగా?" జగన్నాధరావుగారు ఆశ్చర్యంగా అడిగారు.

"మీ అల్లుడు చాలా తెలివైన వాడు. అనంత్‌ని ఒక పనిమీద తీసుకొచ్చాడు. అంతకుమించి అతనికి తన సంగతులు తెలిస్తే ఒకరోజు బలరాంలాగే అతను కూడా తనని బ్లాక్‌మెయిల్ చెయ్యొచ్చని ముందే జాగ్రత్తపడ్డాడు. అందుకే అన్నీ తెలిసిన బలరాంనే తీసుకొచ్చి అక్కడవున్న సావిత్రి స్కెలిటన్‌ని తొలగించి ఒక కుక్క అస్థిపంజరాన్ని పెట్టారు. సావిత్రి అస్థిపంజరాన్ని వంటగదిలోకి మార్చి అక్కడ యధాప్రకారం మళ్ళీ ఫ్లోరింగ్ చేసేసారు."

"ఈ విషయాలన్నీ మీరెలా కనిపెట్టగలిగారు?" అడిగింది వాసవి.

"ఆ సంగతి చివర్లో చెబుతాను" అంటూ నవ్వాడు ధవళాచలం.

"చెప్పండి" అన్నాడు జగన్నాధరావు.

"అతను -అతను ఇంపొటెంట్ అని ప్రూవయ్యిందా?" మెల్లిగా అడిగింది వాసవి.

"మీ కనుమానమా?" ధవళాచలం రెట్టించాడు.

వాసవి ముఖం నల్లబడింది. మాట్లాడలేనట్లు తలవంచుకుంది. ఆయన తను అడిగిన ధోరణి తప్పని గ్రహించి "అయామ్ సారీ మేడమ్, మీరు మీకు తెలిసిన విషయాలు చెబితే ఈ కేసు సాల్వ్ చేయడం ఇంకా సులభమవుతుంది మీకేమైనా డౌట్ వుంటే నిర్భయంగా బయటపెట్టండి మీరు ఒక స్త్రీనన్న సంగతి కాస్సేపు మరచిపొండి" అన్నాడు ధవళాచలం కన్విన్సింగా.

వాసవి కాస్సేపు మౌనం వహించింది.

"ఇంతవరకు వచ్చాక దాయాల్సిందేమీ లేదు. అతను అప్పుడప్పుడు చీకట్లో తన కోరిక తీర్చుకోవడం కోసం నిద్రపోతున్న నా మీద దాడి చేసేవారు. నేను భయంతో ప్రతిఘటించేదాన్ని? మరి అతను ఇంపొటెంటయితే?" అంటూ సందేహంగా అడిగింది వాసవి.

"చెబుతాను. ఈ నాటకమంతా మీకతను సరయిన పురుషుణ్ణనే నమ్మకం కలిగించడానికి. మరొకటి అసలా వ్యక్తి జగదీష్ అయి వుండడు."

"కాని ఒకసారి నేను కంగారులో అతన్ని కొరికేసాను. మర్నాడు అతని చేతిమీద గాయం" అనుమానం బయట పెట్టింది వాసవి.

"గాయాన్ని చూసారా? గాయానికున్న ప్లాస్టర్‌ని చూసారా?"

"ప్లాస్టర్నే"

"తెల్లవారి మీరు అనుమానిస్తారని అతనలా నాటకం ఆడి వుంటాడు. అసలు గాయం అనంత్‌కి వుండుంటుంది."

"**నిజమేసార్ వచ్చిన** రోజే కుక్క కరిచిందని సెక్రటరీ సాబ్ ఆయింట్‌మెంట్ తెమ్మని చెబితే అమ్మగార్నడిగాను గుర్తుందామ్మా?" అన్నాడు శంకర్.

వాసవి తలవూపింది.

"ఇక అసలు విషయానికొస్తాను. వాసవి ఇక యిలా చీకట్లో లొంగదని తెలిసి ఆమెకు దయ్యమనే భ్రమ కలిగించాడు. తన మొదటి భార్య వాసవి మీద పగబట్టిందని ఆమెను వెంటాడుతోందనే కట్టుకథ కలిగించాడు. సావిత్రి శవ రహస్యం చెప్పేసిందన్న ఉక్రోషంతో ముత్తుని బలరాం చేత మట్టు పెట్టించి  ఆ అనాధ ప్రేతానికి దహన సంస్కారం చేయించి తన గొప్పతనాన్ని చాటుకున్నాడు. మానసికంగా బలహీనురాలయిన వాసవిని అనంత్‌కి అప్పగించి తను ఫారిన్ వెళ్తున్నట్లుగా నాటకమాడి ఇక్కడే ఒక హోటల్లో మకాం పెట్టాడు. దానికి తోడు వాసవి స్నేహితురాలు  చనిపోవడం ఆమెని మరింత బలహీనురాలిని చేసాయి. ఆ విధంగా పాత ప్రేమికుడిగా ఆమె మంచిని కోరే సన్నిహితుడిగా అనంత్ ఆమెని ఒంటరిగా స్వంతంగా చేసుకోవడం జరిగింది. తర్వాత జరిగిన సంగతులన్నీ మీకు తెలిసినవే. ఆమెని పెళ్ళాడతాననే భ్రమలో పెట్టి ఆమె ప్రెగ్నెంటు అయ్యేవరకు ప్రేమయాత్రలు తిప్పాడు. అసలతని కాంట్రాక్టు అదే"

"మధ్యలో అడ్డువచ్చానని అనుకోవద్దు. ఈ అనంత్ జగదీష్‌కి  పరిచయమయినట్టు?" అడిగారు జగన్నాధరావుగారు.

"చాలా చిన్న విషయమది. మీరతనితో వాసవి పెళ్ళి నిశ్చయించాక అతను వాసవిని బ్లాక్ మెయిల్ చెయ్యాలని జగదీష్ వున్న విడిదికెళ్ళి తమ ప్రేమ వ్యవహారం బయటపెట్టాడు. అలా ఆ పెళ్ళి చెడగొట్టాలన్నది అతని ఉద్దేశ్యం. కాని అది జగదీష్‌కి మరో విధంగా లాభించింది. ఈసారి వాసవి మీద బలరాంని ఉపయోగించకూడదనుకున్నాడు జగదీష్. పూర్వాశ్రమంలో ప్రేమికుడయితే ఏదో ఒక బలహీనమైన క్షణం ఎంత మనో నిబ్బరం కల ఆడదయినా లొంగి తీరుతుంది. సెక్రటరీగా తన దగ్గరకి ఒక నెల రోజుల తర్వాత రమ్మని చెప్పాడు. తర్వాత కథ ప్రారంభమయ్యింది" అన్నాడు ధవళాచలం.

"ఇంతకీ ఇదంతా" అమాయకంగా అడిగింది పరిమళ.

"చెప్పాను కదా! అతనోరకం సైకో. తనకొక లోపం వుందన్న విషయాన్ని అంగీకరించలేక తనకొక భార్య పిల్లలు అదోరకం ఆత్మవంచన. దానికోసం అతను ప్రాణాల్ని సహితం చిత్తుగా తీసాడు. ఇప్పుడతని మీద సావిత్రి, ముత్తు హత్యకేసులతోపాటు భార్యమీద పరాయి పురుషుణ్ణి ఉసిగొల్పి ఆమె శీలాన్ని చెరిచిన కేసులు ఉన్నాయి. మీరంతా గట్టిగా నిలబడి సరయిన సాక్ష్యాలు అందిస్తే ఈ దుర్గార్గులకి మళ్ళీ బయటకొచ్చి గాలి పీల్చే అవకాశం ఉండదు" అన్నాడు ధవళాచలం గట్టిగా గాలిపీల్చి.

జగన్నాధరావుగారు రెండు చేతులూ జోడించి ధవళాచలానికి నమస్కరించి "మీ మేలు ఎన్నటికీ మరచిపోలేను. మమ్మల్ని ఆ ఊబిలోంచి బయటకి లాగారు" అన్నారు కృతజ్ఞతగా.

"మీరు కృతజ్ఞతలు చెప్పాల్సింది నాకు కాదు. ఆ కుర్రవాడికి తన అక్కగారు హత్యగావించబడ్డదన్న ఆవేదనతో ఏ ఆధారమూ లేకుండా రంగంలోకి దూకి అక్కగారిలాంటి మీ అమ్మాయిని కాపాడాలని ఎంతో ప్రయత్నం చేసాడు. అతనివల్లనే బలరాం ఆచూకీ దొరికింది. అతని సాక్ష్యం వల్లనే బలరాంని అనంత్ హత్య చేసాడన్న విషయం ప్రూవయింది. మిగతా విషయాలన్నీ బలరాం చచ్చిపోతూ ఇచ్చిన స్టేట్‌మెంటూ వల్ల బయటపడ్డాయి. ఇక నేను వేలాయుధంగా.."

"మీరేనా వేలాయుధం" వాసవి ఆశ్చర్యపోయింది.

"అవును. నేనే అలా నటించి మిగతా విషయాలు రాబట్టాను. నాకది వృత్తిరీత్యా మామూలే" అన్నారాయన నవ్వుతూ.

శంకర్ గబుక్కున ముందుకొచ్చి ధవళాచలానికి పాదాభివందనం చేసాడు.

"మీ మేలు ఎన్నటికి మరచిపోలేను సార్. ఆ రోజు డబ్బు అడిగితే మీరేం సహాయం చెయ్యరని నిరాశపడ్డాను. మీలాంటి వారు నూటి కొక్కరున్నా ఈ దేశం బాగుపడుతుంది" అన్నాడూ ఆవేశంగా.

ధవళాచలం నవ్వి నున్నటి బట్టతల సరిచేసుకుంటూ "నేను మరీ దేశ సేవకుణ్ణి కాదోయ్. డబ్బున్న వాళ్ళ దగ్గర బాగానే గుంజుతాను. కాని నీలాంటి అమాయకులకి మాత్రం వట్టినే సేవచేస్తాను. మరి ఇక ఉంటాం" అంటూ పైకి లేచాడు.

ఆయన వెళ్తుంటే అందరూ లేచి నిలబడ్డారు.

సూర్యుడు అస్తమిస్తుంటే ఆ ఎర్రటి సాయంత్రాన్ని తన గది కిటికీలోంచి నిర్లిప్తంగా చూస్తోంది వాసవి.

ఆ కళ్ళలో మునుపటి ఉత్సాహం కాని తళుకు కాని లేవు.

ఎదురుగా దూరంగా వున్న పాలరాతి బిర్లామందిరం వాసవికి జరిగిన అన్యాయాన్ని సహించలేనట్లు పడమటి సంధ్యలో ఎర్రబడింది.

ఒకప్పుడు ఆ కిటికీ దగ్గరే కూర్చుని ఎంతో అందమైన తన భవిష్యత్తుని ఊహించి మురిసిపోయింది. తిరిగి అక్కడే తల్లక్రిందులైన తన జీవిత నావని మేటవేసిన తన జీవవాహిని ముందు నిలబెట్టింది.

తనకి మళ్ళీ పయనం వుంటుందా?

"అమ్మా, వసూ!"

వాసవి తల తిప్పి చూసింది.

పరిమళ.

తల్లి చేతిలోని ట్రంకు పెట్టెని చూసి ఆశ్చర్యంగా "ఎక్కడికమ్మా?" అంది కంగారుగా.

"ఎక్కడి నుండి వచ్చానో అక్కడికే" అంది పరిమళ నిర్లిప్తంగా.

"అదేంటమ్మా అనుకోకుండా కలిసావు. ఈ పరిస్థితిలో నన్ను వదిలేసి వెళ్ళాలని ఎందుకనిపిస్తోంది.?"

"ఎందుకో నాకే తెలియడంలేదు. మీ అందరిలో కలిసి తిరిగి ఎలా మామూలు మనిషిగా తిరగ్గలను. నిన్ను కాపాడుకోవాలనే ఆరాటంతో ఇన్నాళ్ళు మీతో కలిసి తిరగ్గలిగాను. కాని ఇప్పుడెందుకో మనస్కరించడం లేదు తల్లీ. అన్ని విధాల చెడిన నేను."

"అమ్మా!" వాసవి కసిరినట్లు పిలిచింది.

"పదే పదే ఆ మాట నా దగ్గర వాడకు. నేను భరించలేను. చెడటం అనేమాట శరీరానికి వర్తిస్తే నేనూ అంతేగా. పద నీతో నేనూ వస్తాను" అంది ఆవేశంగా.

"వసూ!"

"అవునమ్మా జీవితంలో నీకు తీరని అన్యాయం జరిగింది. ఈ పురుషాధిక్యత సమాజంలో నువ్వొకరకంగా వంచింపబడ్డావు. ప్రేమనే అందమైన కత్తి పెట్టి నాన్న నీ జీవితాన్ని నాశనం చేసారు. దాన్ని నమ్ముకునే నువ్వు నాన్నకి రెండో భార్యగా సర్దుకుపోవాలని చూసావు. కానీ ఆయన అంతటితో ఆగక నీ జీవితాన్ని తన వ్యాపారానికి, స్వార్ధానికి

బలిపెట్టడానికి ప్రయత్నించారు. ఆడదాని శరీరంతో వ్యాపారం చేసుకుని మేడలు కట్టి వాటిల్లో కులికే స్వార్థపరులకి మనసెక్కడిది. అది కుళ్ళిపోయింది. నిజానికి వాళ్ళు చెడిపోయిన వాళ్ళు. వాళ్ళనే మనం వెలివేయాల్సింది."

వాసవి ఆవేశం చూసి పరిమళ ఆశ్చర్యపోయింది.

జగన్నాధరావుగారు సరిగ్గా అప్పుడే లోనికొచ్చి "చూడమ్మా వసూ, ఈ స్థితిలో మనల్ని వదిలేసి మీ అమ్మ వెళ్ళిపోతానంటుంది." అన్నారు బాధగా.

వాసవి తండ్రివంక సూటిగా చూసింది.

"అవును డాడీ అమ్మ మనల్ని ఎలా క్షమించగలదు? మన మూలంగా ఆమె పడిన నరకయాతన ఎలా మరచిపోగలదు. అందుకే వెళ్ళి పోతానంటుందేమో?" అంది.

జగన్నాధరావుగారు తల క్రిందికి వంగింది.

"మీరు నాకు జన్మనిచ్చిన తండ్రి అందుకే యింతకంటే మిమ్మల్ని ఏమీ అనలేను. కాని నేను అమ్మస్థితిలో వుంటే మీ ముఖం తిరిగి చూసేదాన్ని కాదు" అంది వాసవి కఠినంగా.

"వసూ" అంది పరిమళ కోపంగా.

"అదిగో తరతరాల భారతీయ పతివ్రతా మణుల రక్తం ఆవిడలోనూ చాలా స్పీడ్‌గా ప్రవహిస్తోంది. అందుకే భర్తని అనేసరికి భరించలేకపోతోంది" వాసవి హేళనగా అంది.

పరిమళ తల దించుకుంది.

జగన్నాధరావుగారు మెల్లిగా పరిమళ దగ్గరకొచ్చి ఆమె చేతులు పట్టుకున్నారు.

"నన్ను క్షమించు అనూ. ఈ వయసులో ఒంటరివాళ్ళని చేసి వెళ్ళిపోకు. నాకోసం కాకపోయినా అమ్మాయి కోసం" అన్నారు బాధగా.

పరిమళ మాట్లాడలేదు.

ఆమె ట్రంకు పెట్టెని మూలకి పెట్టి తిరిగి యింట్లోకి వెళ్ళిపోయింది.

ఆమె ఉండటానికి అంగీకరించిన విషయం గ్రహించి వాసవి ముఖం వికసించింది.

"ఈ విషయం నిజమేనా?" పరిమళ వాసవివేపు అదోలా చూస్తూ అడిగింది.

"ఏ విషయం?"

"నువ్వు అబార్షన్‌కి ఒప్పుకోలేదట. ఏంటి నీ ఉద్దేశం?"

వాసవి తల్లి వేపు అదోలా చూసి "ఆయన మగవాడు. మళ్ళీ నన్ను కన్నెపిల్లని చేసి తన డబ్బుతో గాలం వేసి అల్లుణ్ణి పట్టాలని చూస్తున్నాడు. నువ్వు ఆడదానివి. నువ్వయినా నన్ను అర్థం చేసుకోలేవా?" అంది.

పరిమళ కాస్సేపు మాట్లాడలేనట్లు చూసింది.

"కాని – సమాజం..."

"ఆ మాటలు నాకు చెప్పకమ్మా. ఏం చేస్తుందీ సమాజం. ఈ సమాజంలోనే దగాకోరులు, హంతకులు, వ్యభిచారులు, దొంగలు అందరూ బ్రతుకుతున్నారు. వీళ్ళనిలా తయారుచేసి పోషిస్తున్నందుకు మనం సిగ్గుపడాలి. వాళ్ళ

బ్రతుకులలా అయినందుకు బాధపడాలి. అంతే కాని ఎవరికో జడిసి తప్పుమీద మరో తప్పు చేసే ఓపిక నాకు లేదమ్మా'' అంది వాసవి ఆవేదనగా.

''మరి.. మరి.. ఏం చేద్దామనుకుంటున్నావు?''

వాసవి నవ్వి ''నాకు అనుకోకుండానే తల్లినయ్యే అదృష్టం లభించింది. దాన్ని దూరం చేసుకునే తెలివి తక్కువపని ఏనాడూ చెయ్యను. ఆ బిడ్డని కంటాను. వాడికి అర్థం చేసుకునే వయసొచ్చాక నా కథ చెబుతాను.

వాడే నిర్ణయిస్తాడు నేను పతితనో. భ్రష్టురాలినో. తండ్రి అనే అవసరం లేకుండా వాణ్ణి పెంచుతాను ఈ సమాజంలో స్వార్థంతో ఏ ఆడదాని కన్నీళ్ళకి కారకుడు కావొద్దని చెబుతాను'' అంది వాసవి ఆవేశంగా.

''అది... అది సాధ్యమా బేబీ'' వెనుకే వచ్చి నిలబడి వాసవి నిర్ణయం వింటోన్న జగన్నాధరావుగారు అడిగారు బాధగా.

''వేర్. దేరీజ్ విల్, దేరీజ్ వే అన్నారు డాడీ. నా నిర్ణయం అదే నా నిర్ణయం ఇప్పటి ఈ సమాజానికి నచ్చకపోవచ్చు. కాని నాకు కావాల్సింది అదికాదు ఒక్క క్షణం సుఖం కోసం ఆడదాన్ని తల్లిని చేసే స్వార్థపరుడయిన మగవాడి అండ లేకుండానే పిల్లల్ని పెంచగలదు స్త్రీ అని నిరూపిస్తాను. అలాంటి వంచితలకి అండగా నిలబడతాను'' అంది వాసవి.

''నీ ఇష్టం తల్లీ! ఆస్తి అంతా నీ పేరున వ్రాసాను'' అంటూ విల్లు అందించారాయన.

వాసవి మాట్లాడకుండా దాన్ని అందుకుంది.

డబ్బు మీద వ్యామోహం లేకపోయినా కొన్ని ఆశలు ఆశయాలూ నెరవేరాలంటే అది చాలా అవసరం అని వాసవికి తెలుసు.

''అమ్మగారూ'' శంకర్ పిలుపుకి వెనుతిరిగింది వాసవి.

''మరి నేను వెళ్ళిరానా?''

''ఎక్కడికిరా? నేను మీ సావిత్రక్కనయితే వదిలేసి వెళ్తావా?'' వాడు మాట్లాడలేదు.

''త్వరలో కాలేజీలో చేరుదువుగాని? రాబోయే నీ మేనల్లుణ్ణి ఆడించవా?'' వాసవి వాడి భుజం చరచి ముందుకి నడిచింది.

## ''ఉపసంహారం''

వాసవి కళ్ళద్దాల్లోంచి ఎదురుగా ఉదయిస్తున్న సూర్యబింబాన్ని చూస్తోంది.

ఎదురుగా మూడంతస్తుల్లో వున్న ''స్త్రీ అభ్యుదయ''లోని స్త్రీలంతా తమ పనులు చకచకా చేసుకుంటున్నారు.

వాసవి పెదవులపై విరక్తి కూడిన చిరునవ్వు తేలిపోయింది. పాతికేళ్ళయినా యింతే.

సమాజంలో ఆడదానికి జరుగుతున్న అన్యాయాల్లో మార్పులేదు. అనాదినుండి ఈనాటి వరకు స్త్రీ ప్రేమ పేరుతో మోసపోతూనే వుంది.

తిరిగి ఆ ఊబిలో దిగుతూనే వుంది.

సృష్టిలో ఆడ – మగ ఉన్నంతవరకూ ఇంతేనేమో. కాని ఒక్కటే మార్పు.

ఇదివరకులా సమాజానికి వెరచి ఆత్మహత్యలు చేసుకోవడం తగ్గించారు. అలాంటి స్త్రీలకి ఆశ్రయం కలిపిస్తోంది తన ''స్త్రీ అభ్యుదయం.''

వసంతం వచ్చిందని భ్రమసి వర్షఋతువులో చిక్కుపడి దిక్కులేక తల్లడిల్లుతున్న కోయిలలకి నెలవు ఏర్పరచి కొందరికయినా దారి చూపించగల్గినందుకు ఎంతో తృప్తిగా వుంది వాసవికి.

వాసవి ఆలోచిస్తూ పేపరు చదువుకుంటుంటే "మమ్మీ" అంటూ పైకి వచ్చాడు స్వయంప్రకాష్.

వాసవి అతనివైపు చిరునవ్వుతో చూసింది. ఆరడుగుల ఎత్తుతో, ఇంకా పసితనం వదలని లేతముఖంతో, వత్తుగా పెంచిన మీసాలతో పెద్దతనాన్ని ఆపాదించుకుంటున్న కొడుకుని చూస్తే ఆమె కళ్ళలో కోటి కోహినూర్‌లకి కూడా అందని మెరపు.

"మమ్మీ. ఈ రోజే మా క్రికెట్ టీమ్ టూర్. దీవించు మమ్మీ" అతను వంగి వాసవి పాదాలకి నమస్కరించాడు.

"నాకు కాదు. అదిగో ఆ ఎదురుగా వున్న మీ తాతయ్య, అమ్మమ్మలకి నమస్కరించు" అంది వాసవి నవ్వుతూ.

స్వయమ్ ఎదురుగా గోడకి వున్న జగన్నాధరావుగారు, అనసూయల ఫోటోకి భక్తిభావంతో నమస్కరించి తన చేతిలోని రోజా పువ్వుని ఫోటోకి పెట్టాడు.

"శంకర్ మామయ్యకి కూడా చెప్పి వెళ్ళు."

"అలాగే మమ్మీ"

అతను మెట్లు దిగి వెళుతూంటే చిన్నగా నిట్టూర్చింది వాసవి.

ఆరోజు ఆవేశపడి తను ఆత్మహత్య చేసుకుని వుంటే తనకి ఇంత ఆనందం దూరమయ్యేది.

మాతృత్వంలోని మధురత్వం చవిచూసే అదృష్టానికి తను నోచుకునేది కాదు. క్రికెట్‌లో గొప్ప క్రీడాకారుడిగా వెలుగుతోన్న "స్వయమ్" ఉండేవాడు కాదు.

తనలోని ఒక చిన్న అణువు తననుండి ఆహారం పంచుకొని ఇప్పుడు ఎదురుగా ఆరడుగుల వ్యక్తిగా నిలబడి "అమ్మా" అని పిలుస్తుంటే ఓహ్... అది మాటలకందని మధుర భావన.

వాసవి ఆనందంతో కళ్ళు మూసుకుంది.

ఆమె ముఖంలో ఒకలాంటి నిశ్చింత ఆవరించింది. పైకి వస్తున్న సూర్యుడి కిరణం పడి చెంపల దగ్గర ఆమె జుట్టు బంగారంలా మెరిసింది.

ఆమె పెదవులపై వెలుగుతోన్న సూర్యుడికి పోటీ పడి మెరిసిందొక హాసరేఖ.